TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY

OU_204007

UNIVERSAL LIBRARY

శ్రీరస్తు.

ప్రాచీనదేశచరిత్రలు

ప. శ్రీనివాసరావు, బి. ఏ., గారిచే

విరచితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1917.

All Rights Reserved.

PRINTED BY
V RAMASWAMY SASTRULU & SONS,
AT THE AUDI SARASWATY NILAYA PRESS,
69, Malayaperumall Street, Madras —1917

ప్రార్థన.

మ. "పరుఁడై యీశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవస్థానసం
హరణక్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గతజ్యోతియై
పరమేష్ఠిప్రముఖామరాధిపులకుం బ్రాపింపరా నుండుదు
స్తరమార్గంబునఁ దేజరిల్లువారికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్.

వ. మఱియు సజ్జనదురితసంహారకుండును దుర్జననివారకుండును సర్వరూపకుండును బరమహంసాశ్రమప్రశస్తమానమునిజనహృదయకమలకర్ణికామధ్యప్రదీపకుండును సాత్వికశ్రేష్ఠుండును నిఖిలకల్యాణగుణగరిష్ఠుండును బరమభక్తియుక్తసులభుండును భక్తిహీనజనదుర్లభుండును నిరతిశయనిరుపమనిరవధికప్రకారుండును నిజస్వరూపబ్రహ్మవిష్ణురుండును నైనయప్పరమేశ్వరునకు నమస్కరించెద.

ఉ. ఏవిభువందనార్చనము లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభులీల లద్భుతము లెవ్వనిసంశ్రవణంబు సేయుదో
పావలిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగునండ్రు నే
నావిభు నాశ్రయించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.

ఉ. ఏపరమేశుపాదయుగ మెప్పుడుఁ గోరి భజించి నేర్పరుల్
లోపలిబుద్ధితో నుభయలోకములందుల జడ్డుఁ బాసి యే
తాపము లేక బ్రహ్మతఁ దారు గతిశ్రము లై చరింతు రే
నాపరమేశు మ్రొక్కెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.

చ. తపములఁ జేసిరైన మఱి దానము లెన్నియుఁ జేసి యైన నే
జపములఁ జేసి రైన ఫలసంచయ మెవ్వనిఁ జేర్పకున్న హే

ప్రార్థన.

యపదములై దురంతవిషయవంచితరీతిగ నొప్పుచుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.

మ. యవనవ్యాధపుళిందహూణశకకంకాభీరచండాలసం
భవులుం దక్కినపాపవర్తనులు నేభక్తాత్ము సేవించి భా
గవతశ్రేష్ఠుల డాసి శుద్ధతనులై కల్యాణులై యుందు రా
యవికారుం బ్రభవిష్ణు నాదుమదిలో నశ్రాంతమున్ మ్రొక్కెదన్.

మ. తపముల్ సేసిననో మనోనియతినో దానవ్రతావృత్తినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో సద్భక్తినో యెట్టు ల
బ్ధపదుం డౌనని బ్రహ్మరుద్రముఖరుల్ భావింతు రెవ్వాని న
య్యపవర్గాధిపుఁ డాత్మమూర్తి సులభుండౌఁ గాక నా కెప్పుడున్.

క. శ్రీపతియు యజ్ఞపతియుఁ బ్ర
జాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవశ్రే
ణీపతియున్ గతియు నైననిపుణు భజింతున్.

మ. అణువో కాక కడున్ మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణియో నిర్గుణుఁడో యటంచు విబుధుల్ గుంఠీభవత్తత్త్వమా
ర్గణులై యేవిభుపాదపద్మభజనోత్కర్షంబులం దత్త్వవీ
క్షణముం జేసెద రట్టివిష్ణుఁ బరమున్ సర్వాత్ము సేవించెదన్.”

భాగ. ద్వి. స్కం. 58-66.

ఉపోద్ఘాతము.

సోదరసోదరీమణులారా!

ఒకరోజున శౌనకాదిమహాత్ములు సుఖాసీనులై, నితాంత కరుణోపేతుం డగుసూతుం జూచి యిట్లు పలికిరి.—

చ. "అలసులు మందబుద్ధిబలు లల్పతరాయువు లుగ్రరోగసం
    కలితులు మందభాగ్యులు సుకర్మము లెవ్వియుఁ జేయఁజాలరీ
    కలియుగమందు మానవులు గావున నెయ్యది సర్వసౌఖ్యమై
    యలవడు నేమిటం బొడము నాత్మకు శాంతి మునీంద్ర! చెప్పవే."

అనియడిగిన శౌనకాదిమునిశ్రేష్ఠులకు సూతుం డిట్లనియెఁ ద్రుతీయం బైనద్వాపరయుగంబు దీఱుసమయంబున నుపరిచర వసువు వీర్యంబున జన్మించి వాసవి నాఁ దగుసత్యవతియందుఁ బరాశరునికి హరికళం జేసి విజ్ఞాని యైనవేదవ్యాసుండు జన్మించి యొక్కనాఁడు బదరికాశ్రమంబున సరస్వతీజలంబుల స్నానాది కర్మంబులందీర్చి శుచియై పరులు లేనిచోట నొంటిఁగూర్చుండి సూర్యోదయవేళ నతీతానాగతవర్తమానజ్ఞుం డయినయాఋషి వ్యక్తంబు గానివేగంబుగల కాలంబునం జేసి యుగధర్మంబులకు భువి సాంకర్యంబు వొందు యుగయుగంబుల భౌతికశరీరంబులకు శక్తి సన్నం బగుఁ బురుషులు నిస్సత్త్వులు ధైర్యశూన్యులు మందప్రజ్ఞు లల్పాయువులు దుర్బలులు నయ్యెద

రని తనదివ్యదృష్టిం జూచి సర్వవర్ణాశ్రమంబులకు హితంబు సేయం దలంచి........................"

సోదర సోదరీమణులారా! అతీతానాగతవర్తమానజ్ఞుం డగు వేదవ్యాసుండు, తన దివ్యదృష్టిని జూచినసంగతులు నేడు వ్యక్తమయ్యెనుకదా! యుగధర్మంబులకు భువి సాంకర్యంబు వొందెకాదె? భౌతికశరీరంబులకు శక్తి సన్నంబయ్యె, పురుషులు నిస్సత్త్వులు, ధైర్యశూన్యులు, మందప్రజ్ఞులు, అల్పాయువులు, దుర్బలులుంయిరి, ఇట్టి దుర్దశలో నుండిన మనలనుజూచి యెవరు విచారింపరు?

మన దేహబలము సన్న మయ్యెను, బుద్ధిబలము మందగించెను, ధనబలము నీరసించెను. మన దుర్దశకు మనమె కారకులము. ఒకరిని నిందఁజేయవలసినపని లేదు ఇంతకు మనపూర్వపుణ్యమువలనను మనపూర్వులపుణ్యమువలనను మన కాంగ్లేయప్రభుత్వము వచ్చినందున, మన మింతవఱకు నిలిచియుంటిమి. లేనిచో,మన కేమెమిదుర్దశలు వచ్చి యుండునో చెప్పఁజాలము. ఆంగ్లేయులరాక మనకు మేలురాక యయ్యెను, వారిరాకవలన, నీరసించి కృశించి యుండినమనకుఁ గొంచెము కొంచెము మూఁడుబలములు కలుగుచున్నవి.

ఏనాఁడు దేహబలము, బుద్ధిబలము నశించునో, ఆనాఁడు మహాదేశీయులు నశించెదరు. ప్రపంచమునకు వలె, దేశీయులకును సృష్టిస్థితిసంహారములు కలవు. ఐజిప్టీయులు, బాబిలోనియనులు, అసీరియనులు, పారసికులు, ఫొనీషియనులు, రోమకులు, గ్రీకులు మొదలగు మహాదేశీయులు వారివారికాల

ములో విజృంభించి, కాలక్రమమున నశించిరి. కదా! వారు కూడ నాగరికులై, కళాప్రవీణులై, శాశ్వతమగు కీర్తిని సంపాదించి, యంతరించిరి. ఏవిధమున వారి రాజ్యములు పుట్టి పెరిఁగి యంతరించెనో, గ్రాచరిత్రమును బఠించుటవలన విశదమగును. కాల మొకరీతి గడువఁబోదు కదా!

హిందువులుకూడ వారికాలములో నాగరికులై, కళాప్రవీణులై. శాశ్వతమగు కీర్తిని సంపాదించిరి భారతీయు లనేకదశల ననుభవించిరి ఐజిప్టీయుల చరిత్రము క్రీ, పూ,సం॥ 6000 రము మొదలు ప్రారంభ మయ్యెను, ఋగ్వేదకాలము క్రీ,పూ, సం॥ 2000 రములని చెప్పినపుడు, ఋగ్వేదమంత్రములను జెప్పుటకుఁ దగినంతశక్తినచ్చుటకుఁ బూర్వ మెంతకాలము గతించియుండునో మీరే యూహింపుఁడు. భారతీయుల నాగరికతయు ప్రాచీనము, అట్టిభారతీయుల రాజ్యములు పుట్టి పెరిఁగి యంతరించెను. ఆ భారతీయులదుర్దశలు క్రీ, వె, సం॥ 1100 రము మొదలు ప్రారంభమయ్యెను, క్రీ, వె, సం॥ 857 రముతో నంతమయ్యెను ఇంచుమించు ఆఱునూర్లకళతాబ్దమునఱకు గాఢాంధకారములోనుండి, దరిగానక విలపించుచుండిన భారతీయులకు దొరతనమువారు వచ్చినతరువాత నరుణోదయ మయ్యెను.

ఇప్పుడుకదా భారతీయులు మేల్కొనుచుండిరి ; గాఢాంధకారములో నింతకాలము గతించినందున, దేహబలము బుద్ధిబలమును ధనబలమును నశించెనని వారు తెలిసికొనిరి. భారతీయులనిన సామాన్యులా! వారు మహనీయులు ; సకల కళాపూర్ణులు; వారిసాంఘిక ధర్మములును, వారియాచార

వ్యవహారములును, వారి రాజ్యతంత్రములును, వారిశాస్త్రములును, ప్రసిద్ధి కెక్కినుకదా ! సకలకళాపూర్ణులని చెప్పుటయే వారు నాగరికులని చెప్పుట. దేశీయులు నాగరికులై విజృంభించినవిధమును జెప్పునదియే చరిత్రము. మీఁదఁ జెప్పఁబడినమూఁడుబలములును గలిగియుండినవారినే నాగరికులని చెప్పవలయును. ఆమూఁడుబలములు సరిసమానముగ నుండినంతవఱకు దేశీయులు నిలిచియుందురు ; వానిలో నేదానికి వ్యత్యాసమువచ్చినను దేశీయులకు నష్టము కలుగును.

ఈమూఁడుబలములును నాగరికత యనుమహావృక్షమునకుమూలము. ఈమహావృక్షమునిలుచుటకు సుక్షేత్ర మొకటి యుండవలెనుకాదా ! క్షేత్రమునారవంత మైనకొలఁది, బీజము నాటుకొని వేరుదన్ని పెరిగి పెద్దదియగును. సారవంతమగు క్షేత్రముమీఁదఁ బెరిఁగినయెడల నెన్నితుపానులు వచ్చినను, వృక్షమునకు నష్టముకలుగదు. ఊసరక్షేత్రముమీఁదఁగాని వృక్షము పెరిఁగినయెడల దానికి హానివచ్చును. ఈమహావృక్షము శాశ్వతముగ నిలిచియుండుటకుఁగాని శీఘ్రము నశించుటకుఁగాని క్షేత్రమే ప్రధానము. క్షేత్రములో సారముండినయెడల మూఁడుబలములును సరిసమానముగనుండును. మహావృక్షము దినదిన ప్రవర్ధమానముగనుండి భౌతికధర్మముల కొడంబడక శాశ్వతముగ నుండును.

ఈచరిత్రములో వ్రాయఁబడినమహాదేశీయులనాగరికత యేక్షేత్రముపైఁ బెరిఁగెను? హిందువులనాగరికత యేక్షేత్రముపైఁ బెరిఁగెను? ఈక్షేత్రము రెండువిధములని చెప్పియుంటిమి;

'లౌకికము' లేక 'ఐహికము'; 'వైదికము' లేక 'దైవికము;' ఐహికక్షేత్రము నశ్వరము. దైవికక్షేత్రము శాశ్వతము. దేశీయుల నాగరికతామహావృక్షము ఐహికక్షేత్రముపైఁ బుట్టి పెరిఁగి నశించెను. భారతీయుల నాగరికతామహావృక్షము వైదిక క్షేత్రముపైఁ బుట్టెను. ఈమహావృక్షము దినదినప్రవర్ధమానముగఁ బెరిఁగి పెద్దది యయ్యెను.

ఓ సోదర సోదరీమణులారా! ఈ మహావృక్షమునకుఁ గాలాంతరమున పురుగుపట్టెను. క్షేత్రమునకు సారము తగ్గెను. క్షేత్రము నీరసించినందున మూఁడుబలములుతగ్గెను వృక్షము పచ్చగ నుండుటకు బదులు, ఎండుటకారంభించెను క్షేత్రమును నిత్యము సారముఁ జేయకుండినయెడల, నీరసించును. ఆఱునూటక శతాబ్దమునఱకు భారతీయులు గాఢాంధకారములో నుండుట వలనఁ గదా వారివైదికక్షేత్రమునకు సారము తగ్గెను. వారి మూఁడుబలములు నీరసించెను. వారి నాగరికతావృక్షమునకుఁ బురుగుపట్టెను. అంతలో నాంగ్లేయులరాకనలనఁ జీఁకట్లు వీడి, అరుణోదయ మయ్యెను వారు మేల్కాంచి, తమనీరసస్థితిని దెలిసికొనిరి.

ఈనీరసము పోవుటకు మార్గమేమి? ఏమార్గమున నీక్షేత్రమునకు సారము కలుగును? ఈభారతీయులక్షేత్రము కేవలము దైవికము, లేక వైదికము. దీనికిఁ దగినవిధమున సారముఁ జేయవలెను గాని మఱియొకవిధమునఁ జేయఁదలఁచినఁ బ్రయోజనము లేదు. దీనికిమార్గ మొకటికలదు. రెండవమార్గములేదు. వైదిక క్షేత్రముపైఁ బెరిఁగి కాలక్రమమునఁ బెద్దదియైన వృక్షము నూడఁదీసి లౌకికక్షేత్రముపై నిలువఁబెట్టఁ దలంచుటకంటెఁ బిచ్చిపని మఱియొకటి లేదు.

శౌనకాదిమహర్షు లడిగినప్రశ్నకు సూతుం డిట్లు చెప్పెను:—

మ. "నరగోవిందకథాసుధారసమహావర్షోక్తిధారాపరం
పరలంగాక బుధేంద్రచంద్ర! యితరోపాయానురక్తిం బ్రవి
స్తరదుర్దాంతదురంతదుస్సహజనుస్సంభావితానేకదు
స్తరగంభీరకఠోరకల్మషకనద్దావానలం బాఱునే?" (భా. ప్ర. 49.)

నరగోవిందకథాసుధారసమహావర్షోక్తిధారాపరంపరలంగాక" మఱియొకవిధమున నీవైదికక్షేత్రమునకు సారముకలుగునా? కలుగుట దుస్తరము లౌకికక్షేత్రమునువలె వైదికక్షేత్రమును సారముఁజేయఁదలఁచినయెడల నది సారవంతమగునా? దానిమీఁద నిలిచి యుండిననాగరికతావృక్షము పెరుఁగునా? ఓ భారతసోదరసోదరీమణులారా! మీనాగరికతావృక్షము ఋగ్వేదకాలమునకు మూఁడువేలసంవత్సరములు పూర్వమునుండి పెరిఁగివచ్చుచుండెను. దానిబీజము వైదికక్షేత్రముపై మొలిచి, పెద్దదియై, శీతోష్ణములను సహించి, నిలిచియుండెను. ఈమహావృక్షమును బహుద్రోహులెవరి యనేకు లనేకవిధములఁ బ్రయత్నించిరి, కాని, వారిప్రయత్నములు వ్యర్థము లయ్యెను ఈ మహావృక్షమును నిలువఁబెట్టుభారము మీఁది.

ఎట్లు దీనిని నిలువఁబెట్టఁగలరు? మనపూర్వులు చేసిన శుభాశుభకర్మఫలములను మన మనుభవించుచుంటిమి. అటులనే, మనము చేయుచుండినశుభాశుభకర్మఫలములను మన సంతతివా రనుభవింపఁగలరు. మనపూర్వులు చేసినసత్కర్మల వలన మననాగరికతావృక్షము దినదినప్రవర్ధమానముగ వచ్చెను. కాని, మధ్యకాలమున, కొన్నియుపాంతరములవలన, సత్కర్మలకు నిరోధము వచ్చెను; ఆయుపాంతరములన్నియు నేఁడు దొర

తనముువారియాగమనమువలన నశించెను. మనయాచరణవిధానములకు నిరోధకములు లేవు.

మా. "వినుఁ జింతింపుముఁ బాడుమం బొగడుమా నీదివ్యచారిత్రముల్
వినుచుం జూతురు గాక లోకు లితరాన్వేషంబులం జూతురే?
ఘనదుర్జన్మపరంపరాగళనదక్షుంబై మహాయోగివా
గ్వినుతుం బైనభవత్పదాబ్జయుగమున్ విశ్వేశ! విశ్వంభరా!" (భా. ప్ర. 197).

లౌకికవ్యాపారములలో మెలంగుచుండినను, దైవబలమును సంపాదింపవలెను. బలముకూడ దానితో సమానము కాదు; అన్నిబలములకు దైవబలము మూలము; ఆదైవబలమే మననాగరికతావృక్షమునకు మూలము. మనకు దైవబలము విశేషముగ నుండుటవలన, మనకు దొరతనమువారి ప్రభుత్వము లభించెను. ఈదైవబలము మనపిత్రార్జితము; ఆబలమును మనము వ్యయముఁ జేయుచుంటిమి, మనస్వంత ఆదాయము శూన్యము; అందుచేత, నీవృక్ష మెండుచున్నది. దానికి బలము తగులుట లేదు.

"ధిక్ బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్" (రా. రా. బాల)

ఏబలముకూడ బ్రహ్మబలముతో సమానముకాదు. ఈ బలమును సంపాదించినఁగాని యావృక్షము నిలువదు. 'దైవే ఽబలే దుర్బలే' హనుమన్నాటకము. దైవబలము బలము; అది లేకపోవుటయే దుర్బలము. ఈసంగతులను మనపూర్వులు తెలిసికొని దైవబలము నాధారముగఁ జేసికొని, మననాగరికతావృక్షమును బెంచిరి; దానిని నిలువఁబెట్టుభారము మీఁది.

ఆంధ్రగ్రంథములను ముద్రింపించి ప్రచురింపించుటలో నాంధ్రదేశమునకు మహోపకారముఁ జేయుచుండిన నాప్రియమిత్రులగు బ్రహ్మశ్రీ, శ్రీయుత, వావిళ్ల. వేంకటేశ్వరులు గారికి అనేక నమస్కారములం జేయుచున్నాను. ఈనాగ్రంథ మొకటియే

కాదు; తదితరగ్రంథము లనేకములను వారుముద్రింపించి లోకోపకారార్థము ప్రచురించుచున్నారు. ఇట్టి లోకోపకారులు శ్లాఘనీయులు; కాలమింతవ్యత్యాసముగ నుండినను వెనుదీయక ధనమును వ్యయముఁ జేసి గ్రంథములను ముద్రింపించుటయే వారియౌదార్యమునకు నిదర్శనము ఈగ్రంథముద్రణమునందు నాకు సహాయపడి శ్రద్ధతో సంస్కరించిన శ్రీమాన్, ఉత్పల. వేంకటనరసింహాచార్యులుగారికి కృతజ్ఞుఁడను. భగవంతునికటాక్షమువలన నా ప్రియ మిత్రులు సహస్రమాసజీవులై పుత్రమిత్ర కళత్రబంధువర్గంబుతోఁ గూడి సిరిసంపదల ననుభవించుదురు గాక ?

ఓమ్ తత్సత్

ఇట్లు, మీవిధేయుఁడు:
ప. శ్రీనివాసరావు.

పటముల సూచి.

విషయము.			పుట.
1 పూర్వులెఱింగిన ప్రపంచము	...	...	1
2 ఈజిప్టు	...	...	68
3 బాబిలోనియా, అసీరియా ...	...	...	110
4 పర్షియారాజ్యము	...	...	140
5 ఫొనీషియా	...	...	172
6 పాలస్టీను	...	...	190
7 కార్థేజి	...	...	302
8 చీనా, ఇండియా	...	...	221
9 గ్రీసు	...	...	245
10 అలగ్జాండర్	...	...	262
11 పార్థియా	...	...	270
12 రోమురాజ్యము	...	...	282

విషయసూచిక.

ప్రథమప్రకరణము.

విషయము.	పుట.
మానవదశ	1
మనుజుని ప్రథమవాంఛలు	10
మనుజుని పనిముట్లు	23
అగ్ని	14
పాకము - పాత్రలు	15
నివేశములు	16
లోహములు - వానియుపయోగములు	18
మానవకోటికాలవిమర్శనము	21
గోపాలకులు, వాణిజకులు, వర్తకులు	22
భాష	26
వ్రాత	83
గణితము	43
మానవుని ప్రాచీననివాసము	35
మనుజుని అభివృద్ధి	38
ప్రజాక్షయము	40
మతము	43
ఆత్మయాజ్ఞము	63
ప్రార్థన	65

ద్వితీయప్రకరణము.

ఈజిప్టుదేశచరిత్రము	93
ఉచ్ఛదశ	60
క్షీణదశ	91
19-20 తరములరాజులు:—ఉచ్ఛదశ	93

తృతీయప్రకరణము.

విషయము.	పుట
'బాబిలోనియా' దేశచరిత్రము	111
అసీరియా — వీరులదేశచరిత్రము	118
బాబిలోను ద్వితీయరాజ్యము (చాల్డియా)	134
చతుర్థప్రకరణము.	
మీడులు, పారశీకులు వీరిదేశచరిత్రము	141
పారసీకులపురాణ కథ	147
పారసీకరాజ్యముయొక్క పోటుపాటులు	161
పంచమప్రకరణము.	
ఫొనీషియా దేశచరిత్ర	173
షష్ఠప్రకరణము.	
హీబ్రూలదేశచరిత్ర	191
సప్తమప్రకరణము.	
కార్తేజిచరిత్ర	303
అష్టమప్రకరణము.	
చీనాదేశచరిత్ర	221
హిందూదేశచరిత్ర	231
నవమప్రకరణము.	
గ్రీకులచరిత్ర	247
దశమప్రకరణము.	
అలగ్జాండరుచరిత్ర	263
ఏకాదశప్రకరణము.	
పార్థియాదేశచరిత్ర	271
ద్వాదశప్రకరణము.	
రోముదేశచరిత్ర	283

ప్రాచీనదేశచరిత్రలు

1-వ ప్రకరణము.

ప్రపంచము.
సి థి యా
ఆ ఫ్రి కా
అరేబియా
పెర్షియా
ఇండియా
హిందూ మహాసముద్రము

శ్రీరస్తు.

మానవుల శైశవదశ

ప్రథమప్రకరణము.

మొదటి అధ్యాయము.

సృష్టి యనంతము, అందులోఁ బదార్థములు మెండు, ప్రతిపదార్థమున కొకచరిత్ర కలగు, అది దానిసృష్టిస్థితిలయములగుఱించి చెప్పును. ఎట్టిహేయ మైనపదార్థ మైనను మనము దానినుండి నేర్చుకొనవలసిన సంగతులు కలవు, దానిపూర్వస్థితి యేది? కాలానుగుణముగ నేమార్పులఁ జెంది ఈ వర్తమాన స్థితికి రాఁగలిగెను? రాఁబోవుకాలములో నెటు లుండఁబోవును? విశేషము ప్రయాసపడి యెటుజూచిన నలువైపుల కుప్పలుకుప్పలుగఁ గనఁబడురాళ్లను గుఱించిసయితము బుద్ధిమంతులు కొంతవఱకుఁ జరిత్రను వ్రాసిరి, మీరు వినిన యేపురాణకథలకంటె నీచరిత్రము వినోదముగనుండదు? జీవము లేనిరాళ్లు, వాక్శక్తిలేని మఱికొన్ని పదార్థములవిషయమై కూడ ఈ మాట నిజమైనయెడల "సత్యం సత్యంపునస్సత్యం ఉద్ధృత్య భుజముచ్యతే" జీవమును వాక్శక్తియును గల పదార్థములగుఱించి ఇంతకంటె వినోద మగుచరిత్రను వ్రాయుటకు వీలు పడునని నమ్మవలెను.

అన్నిటికంటె మిక్కిలి అద్భుత మగుచరిత్రను మీకుఁ జెప్పఁబోవుచున్నాము. పదార్థములు స్థూలముగనుండిన, నద్భుతము లగు నని చిన్నపిల్లలును,

ఒకానొకప్పుడు కాలముఁ గడపిన పెద్దవారును భ్రమపడి, అనేకవేలసంవత్సరములక్రిందట భూలోకములో గుఁడ్రని వెండ్రుకలును పెద్దదంతములు గలిగి భయంకరమగుజంతువునుగుఱించి చెప్ప గల మని తలఁచెదరు, కాని అది కాదు; మా యభిప్రాయమును విశదపఱచెదము; సావధానముగ వినుఁడు. ఆఫ్రికాఖండములో "చింపాంజి" అనువానరము కట్టుకొని నివసించుమోటైన కుటీరము కంటె మధుపము నివసించుపట్టులోని షట్కోణపు గదులు అద్భుతములు కావా! స్థూలముగను మొద్దుగ బెరిగిన "రైనాసరసు" అనుజంతువు కంటె, మన మెటుల పాలనిమిత్తము పశువులను సంరక్షించుచుమో, ఇటులనే చిన్న చీమలు కొన్ని క్రిములఁ బెంచి వాని పాలుఁదీయుటయు, పనిపాటులఁ జేయుటకు మన మెటులసేవకుల నుపయోగించెదమో అటులనే ఇతరములగు చీమలు మఱి కొన్ని క్రిములఁగట్టి పట్టి తెచ్చి, వానిచేతఁ బని జేయించు నని చెప్పుట వినోదము కాదా ?

మంచిది; నిన్నుగుఱించి చెప్పఁబోవుచున్నాము. మన మెంతవఱకు దెలిసికొనఁగలిగితిమో అంతవఱకు నీవు నేర్చుకొనవలసిన దని మా యభిప్రాయము. ఏమి నీవు నేర్చుకొనవలెను? ఎటుల నీవు వర్తమానస్థితికి వచ్చితివో అదియే నీవు నేర్చుకొనవలెను. నీవు నీలాగున నెందుకుంటివి? ఆసంగతి భగవంతునకు దెలియును, అది మాకుఁ దెలియదు. మేము చెప్పలేము, ఈలోకములో మనలో నెవరికి బరమేశ్వరుఁ డారహస్యముఁ జెప్పలేదు, ఆయన ముందుకెప్పుడైన మఱియొకచోటఁ జెప్పిన జెప్పవచ్చును, కాని ప్రస్తుతముమాత్రము చెప్పలేదు. బహుశః నీ వీలాగున నుండుటలోను నీ కనుభవయోగ్యము లైన పదార్థములను సంపాదించుటలో నద్భుత మేమని తలంచెదవు? లేదా ఆపదార్థములు మనుజానకు సర్వదా కలిగి యుండె ననియు, లేక లేనప్పుడు వానిని అంగడినుండి క్రయమునకుఁ దెచ్చుకొని రనియు, లేక భూమిమీఁదఁ బుట్టినది మొదలు భోజనపదార్థములఁ బచనముఁ జేసి తరువాత వానిని భుజించి తదుపరి ఫలహారముఁ జేసిరనియు, లేక, వర్తమానములోవలె చక్కనిదుస్తుల ధరించె ననియు,

మంచిభాషాపరిజ్ఞానముఁ గలిగి వ్రాతకూఁతలలో నాతితేతి యుండెననియు, దివ్యభవనములలో నివసించుచుండెననియు, మహోన్నతమగు దేవాలయములఁ గట్టి యుండెననియు,—నీవు తలంచెద వేమో? అటుల కాదు, అటులఁ దలంచిన తప్పు. నిన్ను దుర్మార్గమునుండి తప్పించి, సన్మార్గమునకుఁ దెచ్చుట మాయభిప్రాయము. ప్రథమమునఁ జూచుటకు భయంకరుఁడై, దిగంబరియై, పశువువలె విచ్చలవిడిగ మనుజుఁడు సంచరించెను తననీడఁ జూచి వాఁడు భయపడెను, మేఘమధ్యంబువెలువడు క్రొక్కారు మెఱుంగునకును, గంభీర నినాదమునకును ఉలికిపడెను సూర్యమండలము వెలువడివచ్చుచుండిన మహాభూతముయొక్క సుపర్ణములధ్వనియే ఆనినాదమనియు, ఆభూతముయొక్క దుర్నిరీక్ష్యమైనలోచనకాంతియే ఆమెఱుపనియు వాఁడు తలంచెను. వర్తమానములో మనముచూచుచుండిన మనుజునకీ తెలివితేటలు కలుగునప్పటికి వేనవేలు సంవత్సరములుపట్టెను.

పుస్తకముఁ బట్టి చదువుకొనుశక్తి కలుగుటకు బూర్వము ఎటుల నీవు అక్షరాభ్యాససమయమున "ఓనమాల"ను నేర్చుకొనియెదవో, ఈలోకములో బనిపాటులు లేక కాలయాపనఁ జేయుటయే మహాపాపము కనుక, పెద్దవాఁడవై నీపనిఁ జేయుటకుఁ దగినసామర్థ్యము నెటులనీవు చిన్నతనమునఁ దెలిసికొని కాలక్రమమున దానిని నెఱవేర్చెదవో, అటులనే మనుజుఁడుకూడ చాలావ్యయప్రయాసములపైని జయాపజయములఁ బొందుచు, కాలాంతరమునఁ దనపనిని నేర్చెను. ఏది మంచిపనియో, దానిఁ జేయుటకు మంచిమార్గమేదియో, మనవలె నొకరివలన నేర్చుకొనక, తనమట్టునఁ దాను భగవంతుఁడిచ్చినబుద్ధిని వృద్ధి చేసి, ఒకపనినే పలుమాఱులు చేయుచు, ఒకశబ్దముయొక్క వర్ణక్రమమును నేర్చుకొనుటకు నీ వెటుల శ్రమఁబడెదవో, ఆవిధమున సత్కార్యను సన్మార్గమున వినియోగించుటకుఁ బూర్వము మనుజుఁడు కష్టపడెను. ఒకానొకప్పుడు మనుజుఁడు దిగంబరియై కుడుచుటకుఁ గూడును, నిలుచుటకు నీడయు లేక సంచరించి సంచరించి, క్రమక్రమమున సంభారియై నాగరికుఁ

పయ్యెనని చెప్పుటకు నిదర్శనములు కానఁబడును. ఒకసంగతిఁ జెప్పుచున్నాము వినుఁడు; యుగాంతరముల క్రిందటఁ జేయఁబడి, ఆనాటిమనుజులు వాడుకఁ జేయుచుండినపనిముట్లును, ఆయుధములును అన్నిఖండములలోను, ముఖ్యముగ "ఐరోపా" ఖండములోఁ గానఁబడుచున్నవి. ప్రస్తుతము భూలోకములో నచ్చటచ్చటఁ బర్వతప్రాంతకాంతారములలో నుండు ద్విపాదపశువులు వాడుకఁ జేయుచుండిన వస్తువులు సయితము పూర్వమువానివలె నుండుటచేత, నాకాలపు ద్విపాదపశువులచరిత్రము నాగరికతాశూన్యంబని చెప్పవచ్చును.

ప్రకంపనకల్పితకల్లోలాపారపారావారమధ్యగతం బైన సింహళ బోర్నియో ఆస్ట్రేలియాద్వీపంబులలో నేటివఱకు నట్టిమనుజులు కానఁబడుదురు. వారిఁ జూచి భయపడి మనుజులా పశువులా యని తలంచెదవు. సత్యము; వారుమనుజులు కాని పశువులు గారు. వారు అనాగరికులు కనుక, దిగంబరులై శరీరమునకుం బురిదఁబూసికొని, కందమూలాదులను బచనముచేయక భుజించుచు, నికృష్టకుటీరములలోను లేక తరుచ్ఛాయలలోను దివారాత్రంబులం గడుపుచున్నారు., వీరినే "వనవాసుల"ని పిలుచుచున్నాము.

ఏనాఁడు దేశము లనుపేరు లేదో, ఏనాఁడు దేశీయులనువారు లేరో, అట్టిసమయములో దేశచరిత్ర లెటు లుండును. అట్టియుగాంతరముల ప్రప్రథమమునాఁటనుండి మానవచరిత్రఁ జెప్పఁబోవుచున్నాము. మనవలె సాంఘికులై దేశచరిత్రలను వ్రాయుటకుఁ దగినశక్తిసామర్థ్యములు కలుగుటకుఁ బూర్వము విశేషము వ్యాసంగముఁ జేయవలెను. ఒకశతాబ్దమున నూఱుసంవత్సరములు. అనేకశతాబ్దములు కలిసిన నొకయుగము; అట్టియుగము లెన్నియో గతించినందున, ఆప్రాచీనమనుజుని యాచారవ్యవహారము లిట్టివని ధారాళముగ నిరూపించుటకుఁ దగినయాధారములు లేవు, అచ్చటచ్చటఁబడియుండినరాతి పనిముట్లును శిథిలమైనమృత్పాత్రలను, గీతలు గీయఁబడియుంచిన యెముకలను— వీనిని ఆధారముఁ జేసికొని, కొంతవఱ కానాఁటిచరిత్రను వ్రాసినారు.

మేము చెప్పఁబోవు కథ కారంభము మహా అలగ్జాండరుయొక్క దండయాత్రకాలముకంటెఁ బూర్వము, వేదముల కాలముకంటెఁ బూర్వము; జాంబవంతుఁడు భూమికంటెఁ బెద్దయని వాడుకకలదు, ఇంచుమించా కాలము నాఁటనుండి కథఁ జెప్పుచున్నాము. ఆనాఁడు సింహళము ద్వీపము కాక, భరతఖండముతోఁ గలిసి యుండెను. ఆనాఁటినదులు కొన్నికాలాంతరమున నంతరించెను. అప్పటిమనుజులకు వానరములవలె వాలములుండెను. వారు ఆకుఅలముఁదిని బ్రతుకుచుండిరి. వారు ద్విపాదపశువులు. మున్ముందు జ్ఞానము కలిగి నీయంతట నీవు తెలిసికొన బోవుసంగతులను మొదటఁ జెప్పుచున్నాము కనుక నీవు నమ్మవలసినది వ్రాతపుస్తకములఁజూచి చదివినేర్చుకొనుటకంటె తరుశైలపాషాణములఁ గన్నులారఁజూచిన మేలు. అంతరిక్షమున నుండునక్షత్రమండలములవలె మనభూలోకము వ్రేలాడుచు నిత్యము వ్యత్యాసముఁ జెందుచు నెంతో కాలము గడిపెను. కనుక దానివయస్సుఁ జెప్పుటకు వీలులేదు. జంతువులకు వార్ధకములో దేహము సడలి ముడతలుపడి రక్తము క్షీణించును. భూదేవికి అటులఁగాదు. "ఓం మేదినీ దేవీ వసుంధరా స్యాద్వసుధా దేవీవాసవీ బ్రహ్మవర్చసః...హిరణ్యగర్భిణీదేవీ ప్రసోదరి సదనే సత్యాయనే సీద సముద్రవతీ సావిత్రీ...వాయుమతీ జలశయనీ స్వయంధారా జాసత్యంతోపరి మేదినీ సోపరిధత్తంగాయ ..ఇక్షుశాల్యవసస్యఫలాఢ్యే పారిజాతతరుశోభితమూలె, స్వర్ణరత్నమణిమంటపమధ్యే చింతయే త్సకలలోక ధరిత్రీం శ్యామాం విచిత్రాం నవరత్నభూషితాం చతుర్భుజాం తుంగపయోధరాన్వితాం,ఇందీవరాక్షీం నవశాలిమంజరీం శుకంధధానాం వసుధాం భజామహే," "ధనుర్ధరాయ విద్మహే సర్వసిద్ధిం చ ధీమహి, తన్నో ధరా ప్రచోదయాత్."

అనేక సంగతులను గుఱించి మనము శంకింపవచ్చును, మనబుద్ధికొలఁది వానిని సమర్థింతుము. దానివలనఁ బ్రయోజన మేమి? అందుచేత సృష్టి అనాదియని చెప్పుచున్నాము. ప్రస్తుత మొకసంగతి నిజము. దాని విషయమై శంకింప నవసరములేదు. భగవంతుఁడు కృపాళుఁడును భక్తవత్సలుఁడును కనుక

లోకములోఁ బిపీలికాదిబ్రహ్మపర్యంతముఁ గలచేతనాచేతనములలో దేనిని నిరర్థకముగ సృజింపక, యుక్తపరికరముల నిచ్చి యుక్తకాలములో మనుజుని భూలోకములోఁ బ్రవేశపెట్టెను. స్వయం కృషి వలన గ్రహించుట కనేక విషయములను మనకు భగవంతుఁడు విడిచిపెట్టినప్పటికిని, అట్టిస్వయంకృషిని ధారాళముగ జరిపించుటకు దగినపరికరముల నాయన మనకిచ్చెను, కర్మేంద్రియములను జ్ఞానేంద్రియముల నిచ్చెను, మే మిచటఁ గొన్నిపదములకు వ్యుత్పత్త్యర్థములఁ జెప్పుచున్నాము.

మనః:—మన్యతే అనే నేతి మనః - మన ఏవ మానసం మన=జ్ఞానే-దీనిచేత నెఱుఁగ బడును కనుక మనస్సు, మనస్సు గలవారు మానవులు.

మొదట పదార్థములనుఁ జేరిడినపుడు వానివాని యుత్కృష్టగుణముల ననుసరించి వానికి నామకరణముఁ జేసిరి. అటులనే:—

అరవిందం:—అరాన్ కేసరాన్ విందతీతి అరవిందం=కేసరములను పొందియుండును.

ఉదకం:—ఉనత్తీతి ఉదకం=ద్రవమై యుండునది.

ఆపః:—ఆప్నువంతీ త్యాపః=వ్యాపించునవి.

భూమిః:—భూసత్తాయాం=సర్వము దీనియందు కలుగును.

గృహః:—గృహ్ణాతి పురుషేణార్జితం విత్తం ధన మితి గృహం-పురుషునిచేత సంపాదింపఁబడినధనమును గ్రహించునది.

పశవః:—పశ్యంతే పాశైః పశవః-పశబంధనే-కట్టఁబడునది.

పాదః:—పద్యతే అనే నేతి పాదః-పదగతౌ-దీనిచేతఁ బోదురు.

పక్షీ:—పక్షౌ అస్య స్త ఇతి-రెక్కలు కలది.

అగ్నిః:—అగతి కుటిలం ఊర్ధ్వం వా గచ్ఛతీతి. ఊర్ధ్వముగా నైనను కుటిలముగా నైనను జ్వలించునది.

ఆకాశః:—అ సమంతా త్కాశంతే సూర్యాదయోఽత్రే త్యాకాశః-
దీనియం దంతట సూర్యాదులు ప్రకాశింతురు.

అభ్రం:—అపః బిభ ర్తీ-ఉదకమును భరించునది.

మేఘః:—మేహతీతి-తడుపునది.

పదముల ధాతురూపములఁ జూచిన పదార్థముఁ దెలియును. పదార్థమే పదార్థముల కాధారము. పదార్థజ్ఞానము కలదని తలంచు మనకు నిజముగఁ బదార్థ జ్ఞానము లేదు. అజ్ఞానము మనపూర్వులకుఁ గలదు, అట్టిజ్ఞానోదయము కలుగుటకు మనము భగవంతుని బ్రార్థించెదము; అతఁడే మనకు గురువు.

శ్లో. "అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా,
చక్షు రున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః.
గురు ర్బ్రహ్మా గురు ర్విష్ణు గురు ర్దేవో మహేశ్వరః,
గురు స్సాక్షా త్పరం బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః.

అట్టిజ్ఞానోదయము కలిగినఁ గాని మనపూర్వుల వేషభాషలను, యాచార వ్యవహారములను మొదలగుసంగతులనుఁ దెలిసికొనఁజాలము. యుగాంతరముల క్రిందట జీవించి దేహయాత్ర గడిపిన వారిసంగతులను సక్రృచ్ఛముగఁ దెలిసి కొనుటకుఁ దగిన యాధారములు కానరానందున, 'బ్రచలితభాషాపదముల ధాతురూపములఁబట్టి వారిట్టిపదార్థజ్ఞానముఁ గలిగి యుండిరని తెలిసికొని, వారు నాగరికులో, లేక యనాగరికులోఁ జెప్పుటకు మన కీపదములధాతువులు నిదర్శనములు.

వ్యవహారార్థము శాస్త్రజ్ఞులు మానవజాతినిఁ గొన్నికుటుంబములుగ విభ జించిరి. ఈసంగతి ముందు విశదపఱచుచున్నాము. మనము మానవకుటుంబ ములలోఁ బెద్దదియగు "ఆర్య" కుటుంబములోనివారము. ఈకుటుంబము వారు కొంతకాల మవిభక్తముగ నుండి, తదుపరి విభక్తులై స్వేచ్ఛానుసారము

"ఆసియా, ఐరోపా" ఖండములకుఁ బోయి యాయాదేశముల నాక్రమించి కాలక్రమమున వృద్ధిఁ బొందిరి. వారిభాషలు వేఱుపడినప్పటికిని, వారివారి భాషలలో నేఁడు వాఁడుకొనుచుండినపదములధాతురూపముల జూచిన వారం దఱు కొంతకాల మవిభక్తకుటుంబములోనివారని చెప్పవగును. వారిసర్వస్వమును నశించెను. కాని వారు పదార్థములకుఁ బెట్టిననామములు నశింపలేదు. ఆపద ములనే మనము వివిధముగఁ బ్రయోగించుచున్నాము ఇచటఁ గొన్నిపదముల వ్యుత్పత్తులఁ బేర్కొనుచున్నాము.

సం=సంస్కృతము, లా=లాటినుభాష, గ్రీ=గ్రీకుభాష, ఇం=ఇంగ్లీషుభాష.

సం=పితరః లా=పేటర్ గ్రీ=పేతర్ ఇం=ఫాదర్	ధాతు రూపమొకటి పాతీతిపితా "పా" రక్షణే రక్షించు వాఁడు.
సం=మాతా లా=మేటర్ గ్రీ=మేతర్ ఇం=మదర్	ధాతురూప మొకటి. మాతివర్తతేగర్భః-గర్భము దీనియందు వర్తించును.

రెండవఅధ్యాయము.

మనుజుని ప్రథమవాంఛలు.

మొదట మానుజుఁడు దిగంబరియై పడుమటకుఁగూడును, నిలుచుటకు నీడయును లేక పశువువలె సంచరించుచుండెను భూమి హిరణ్యగర్భ యని

వానికిఁ దెలియదు; కష్టపడిన ప్రసవోదరి యగు ననియు తెలియదు. అట్టి స్థితిలో భూమి నవశాలిమంజరి యగుట యెట్లు ?

"శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" అని చెప్పిన విధమున, శరీరము నిలువడియుండిన ధర్మాచరణమునకు సమర్థతకలుగును. శరీరమును నిలువఁ బెట్టుటకు గావలసినవి మూఁడు; క్షుద్బాధను శాంతింపఁజేయుటకు ఆహారమును, చలిబాధ నుపశమింపఁజేయుట కగ్నిహోత్రమును లేక దుస్తులును, రాత్రి వేళల సంచరించు మృగాదుల వాతఁబడక సుఖముగ నిద్రించుటకుఁ దగిన కుటీరములును వారికిఁ గావలయును.

ఇచట నే పశ్వాదిమృగములకును మనుజునకుఁ గలభేదము విశద మగును. సృష్టిలో శీతోష్ణస్థితులకుఁ దగినవిధమున మృగములనువిర్మించి వానికిఁగావలసిన యాహారమును భగవంతుఁడు వానిసమీపముననుంచెను. మనుజునకుమాత్ర మటులఁ గాదు. ఉదరపోషణార్థము మనుజుఁడు చెమట నోర్చినఁగాని ఆహారపదార్థములు వానికి లభింపవు, అటులనే దేశకాలానుగుణ్యముగ ధరించుటకు వస్త్రములును, కుడుమటకుఁ గూడును వాఁడు ప్రయాసముఁబడి సంపాదించుకొనవలెను. మృగములకుఁ బోలె రోమములతో నిండినదశపరిచర్మము మనుజుని స్వేచ్ఛావిహారమునకు నిరోధకము కనుక వాఁడు గంబరిగ సృజింపఁబడెను. ఇందులో విశేష మేమన, వానికి భగవంతుఁడు బుద్ధి నిచ్చెను. అందువలనఁ బదార్థజ్ఞానము కలిగి జడుఁదనము వదలి, వాఁడు పశుపతి యగును. ఎప్పటికిని పశువుపశువే, కాని వాఁ డట్లు స్థిరుఁడు కాక, తనపూర్వులవిధానముల గుర్తెఱిఁగి, వానిని వృద్ధిఁజేసి, ముందువచ్చువారికి దనయాచారవ్యవహారముల వలన దర్శనీయుఁ డగును.

గృధ్రమునకుఁగల దూరదృష్టి వానికి లేకపోయినను, "దూరదర్శిని" అనుయంత్రముఁ జేయుసామర్థ్యము వానికిఁ గలదు. ఆయంత్రముగుండ దృగ్గోచరములు కాని నక్షత్రమండలములఁ జూచుటకు శక్తికలిగెను. ఏమండల

ములకాంతి మనభూలోకమునకు వచ్చుసరికి వేలసంవత్సరములు పట్టునో, అట్టి మండలములను వాఁడుచూచును; దానిసహాయమువలన సూర్యాదిగోళములలో లోహములు కల వనుసంగతి విశదమగుచున్నది. లేఁడివలె శీఘ్రముగ గమనించుటకు వానికి శక్తి లేదు, కాని ధూమశకటములను నిర్మించి వానిద్వారా రెండుఘడియలన్నరకాలములో నలువదిమైళ్లు ప్రయాణము చేయును. గుఱ్ఱమునకుఁ గలదేహబలము వానికి లేదు, అయినను, నూఱుగుఱ్ఱములపనిఁ జేయుటకుఁ దగిన "ఆవిరియంత్రముల" ను వాఁడు నిర్మించెను.

బుద్ధిబలముఁగాని లేక దేహబలముఁగాని మనుజుఁడు వృద్ధిఁ జేయఁగలఁడు. ఈదయామైనదిమొద లుదరపోషణకొఱకు దేహబలమును వినియోగించుటలో నవరవాఁ డభ్యాసపడినందున, శీఘ్రగమనములోనేమి దూరదృష్టిలోనేమి వాఁడునాగరికుని నతిశయించును. దేహబలములో నాగరికుఁ డెంత తగ్గునో బుద్ధిబలములో వాఁ డంత హెచ్చును, వాఁ డాబుద్ధిని సన్మార్గములోను దుర్మార్గములోఁగూడ ప్రసరింపఁజేయుచున్నాఁడు. ఎన్నియుగాంతరముల క్రిందటనో మనుజుఁడు భూమిమీఁదఁ బుట్టెను అంతకుఁ బూర్వ మెంత కాలమునుండియో నదులు ప్రవహించుచుండెను. కొంతకాలమునకు నదీప్రవాహవేగమునకు గొండలు బ్రద్దలయి లోయలయ్యెను. జీవనదులెల్లప్పుడుఁ బ్రవహించుచుండుటవలన, వాఁడు సదా వానితీరములనే నివసించుచు, వానిజీవనముల మూలమునఁ దనజీవనమును నిలువఁబెట్టుకొనెను. ఆహారముమాత్ర మంతనిరాయాసముగ వానికి దొరకలేదు. బహుశః మొదటవాఁడు ఆకు అలము దుంపలు మొద లగువానినిఁ దినుచుండె నని తోఁచును; అటులనే మొదట వాఁడు తరుచ్ఛాయలలోఁగాని, లేక భూధరదరీద్వారములలోఁగాని విరమించుచుండె నని తోఁచును. నదీప్రవాహవేగమున బోవుచు సూర్యకాంతిచేఁ దళుకుతళుకుమను మీనములను గాని, లేక తనప్రక్కనుండి చెంగుచెంగు మని దాఁటిపోవుచుండినహరిణములఁగాని తినుటకు వాఁడుకోరియుండెను; వానినిఁబట్టుటకుఁ దగిన వలలుగాని, వీనిని హరించుటకుఁదగిన యాయుధములుగాని వానికి లేవు; భగవంతుఁ

డిచ్చిన హస్తములు నెరవేర్పలేనిపను లేమియును లేవు, అయినను వానికి అనుకూలమగు సాధనములుండవలెను, గొడ్డలి లేకపోయినఁ గఱ్ఱలఁగొట్ట గలడా ? కలము లేకపోయిన వ్రాయఁగలడా? కత్తి లేకపోయిన సాముఁజేయఁగలఁడా?

మూఁడవ అధ్యాయము.

మనుజుని పనిముట్లు.

ప్రథమమున మనుజున కొక వాఁడియగుసాధనము కావలసియుండెను. కోఁతఁబడుదానికంటె నీసాధనము దిట్టముగ నుండవలెను. భూమిలో లోహాఁములు కలవనుజ్ఞానము లేనిసమయమున, వానినుపయోగించువిధ మెటుల వానికి దెలియును? కొన్నిలోహములు ఖనులలోఁ గాక, భూమిమీఁదఁ గనఁబడు చుండినను, వాఁడు వానిని గుర్తెఱుఁగలేదు. అందుచేత వాఁడు మొదట రాతితోఁ జేసినపనిముట్ల నుపయోగించుటవలన, శాస్త్రజ్ఞులు దీనికి "ప్రాచీనపాషాణ యుగము"ని నామ మిడిరి. ఈ యుగములోని మనుజుఁడు ఱాయి, ఎముక, కొమ్ము మొదలగువానితో ననేకములగు పనిముట్లఁ జేయుచుండెను. రెండు చెకుముకిరాళ్ల రాపుడుచే నగ్నికణములు బయలువెడలును, కనుక వానిని వాఁడుపయోగించి నటులఁ గానవచ్చును, కొన్నిరాళ్లను వాఁడు త్రికోణాకారముగఁ జేసి యుపయోగించెను, మఱికొన్నిటిని శుత్తివలెఁ జేసెను, మఱికొన్ని బాదము కాయవలెఁ జేయఁబడి, నలువైపులనుండిన యంచువాఁడిగ నుండెను. ఈపనిముట్లు వానివాని పరిమాణములో వ్యత్యాసముబొందుచున్నవి; కొన్ని ఆఱుఅంగుళములు పొడుగును మూఁడు అంగుళములు వెడల్పును కలవి. వీనికంటెఁ బెద్దవి కలవు. ఈ ప్రాచీనరాతిపనిముట్లు వాఁడి లేక మెఱుగు లేక నదులు మేట వేసినస్థలములలో దొరకెను. నదీతీరమున ప్రాచీనమనుజుఁడు నివసించి యుండుటచేత,

వాఁడుపయోగించినపనిముట్లు కొన్ని నదీప్రవాహవేగమునఁ గొట్టుకొని పోఁబడి అనదులు మేటవేసినస్థలములలోఁ గానఁబడుచున్నవి.

ముందుకు బహుళముగ వ్రాయఁబోవుప్రసంగతి నిచట సంక్షిప్తముగ వ్రాయుచున్నాము. శాస్త్రజ్ఞులు కాలమును కొన్నియుగములక్రింద విభజించిరి:—

(1) "ప్రాచీనపాషాణయుగము", ఈయుగము కేవలము ప్రాచీనమైనది, రాబోవుయుగములతో దీనికి సంబధము లేదు.

(2) "నవీనపాషాణయుగము."

(3) "కంచుయుగము."

(4) "లోహయుగము."

1, 2 యుగములకు మధ్య ననేకయుగములు గడచి యుండవలెను. అవి యెన్నియో తెలియవు. మిగిలిన 2, 3, 4 యుగములు నొకటి ననుసరించి యొకటి వచ్చెను. ఈయుగములలో మనుజుల నిత్యకృత్యము లెవ్వియో సాంఘిక వ్యాపారములేవియో, మొదలగుసంగతులను ముందుకు వివరించుచున్నాము.

నాల్గవ అధ్యాయము.

అగ్ని.

మనుజుఁడు మొదట నగ్నిహోత్రము నెటులఁ గనిపెట్టెనో, దానివిషయమై పలువురు పలువిధములఁ జెప్పిరి. వారివారి బుద్ధికొలది వారుచెప్పిరి కాని దానిలో నెంతవఱకుసత్యమో యెంతవఱకసత్యమో మనముచెప్పలేము. అనేకుల నేక సంగతులగుఱించి యీవిధమునఁ దమబుద్ధిచాతుర్యముఁ గనపఱచిరి. ప్రస్తుతము "అగ్గిపెట్టెలు" దొఱుకుచుండినను, యజ్ఞాదిక్రతువుల, జేయునపుడు

అరణిఁదఱచి నిప్పుఁబుట్టించెదరు. ఈవిధముననే మనుజుఁడు మొదటనగ్నిఁ గని పెట్టెను. ఏవిధమైన రెండుదిట్టమగు పదార్థములరాపుడువలన నగ్ని పుట్టునని వానికి దెలియును. చెకుముకిరాళ్లతో నాయుధములఁ జేయునపుఁ డగ్నికణములు వెడలునుకదా! అటుపైని చలిబాధవిశేషముగ నుండినపుడు అఱచేతులనునులుపుకొనినఁ గొంతివేఁడిమి శరీరములోఁ బుట్టునుకదా! ఒకకఱ్ఱలో గాడి ద్రవ్వి, దానికి సరియగుకఱ్ఱతో దానిఁ ద్రచ్చుటవలన, మొదటనువేడిమిపుట్టి ధూమము వెడలి, తరుపరి స్ఫులింగములువచ్చినపైని వహ్ని జ్వలించును.

యాత్రికులు చెప్పినకథలను వినిన, నవరలుమొదలగువారీవిధముననే నేటివఱకు నగ్నింజేయుచుండిరని తెలియనగును. ఐరోపాఖండమున కుత్తర సముద్రములోని ద్వీపవాసు లొకమదించిన పక్షిశరీరములో వర్తిందోపి దానినివెలిగింతురు. అది క్రొవ్వువత్తివలె వెలుతురు నిచ్చును. రాత్రివేళల వనమృగముల బారినుండి తప్పించుకొనుట కీనాడెంతమనుజునకావశ్యకమో, ఆనాడును మనుజునకావశ్యకము గనుక, వాఁడునిప్పుఁజేసి దానికిసమిధలఁదగిలించి అవిచ్ఛిన్నముగ దానిని కాపాడుచుండెను.

అయిదవ అధ్యాయము.

పాకము - పాత్రలు.

పచనముఁజేయని పచ్చిమాంసమును మనుజుఁడు తినుచుండెను; ప్రస్తుతము కొందఱునవరలు పచ్చిమాంసముఁ దినుచున్నారు. వాఁడు క్రమముగ పచనముఁజేయుటఁ దెలిసికొనెను, పదార్థములను నిప్పులోవేసి, వానిఁ గాల్చి భుజించెను. పచనముఁ జేయుటకు మఱియొకవిధముకలదు. భూమిలోఁ జిన్నగొయ్యిఁ ద్రవ్వి, వాఁడు చంపినజంతువుయొక్క తోలు నాగోతిలోఁబఱచి, నీరుఁబోసి,

దానిలోఁ బచ్చిమాంసమును వేసి, అటుపైని యెఱ్ఱఁగఁ గాల్పఁబడినరాళ్లను దానిలో వేసిన పిమ్మట నీరుడికి మాంసము పచనమగుచుండెను రెండవవిధ మేమన పాత్రలకుమన్నును వ్రాసి, వానిలో మాంసము నుంచి నిప్పుమీఁద నుడికించెను. అగ్నిసంస్కారమువలన మట్టికి గట్టిదనము వచ్చుటఁజూచి మృత్పాత్రలఁజేసి, వానిని నిప్పులోఁగాని సూర్యకాంతిలోఁగాని కాల్చి, అవి గట్టిపడిన తరువాత వానిని వాఁడుపయోగించెను.

ఆఱవ అధ్యాయము.

నివేశములు.

ప్రథమమున మనుజుఁడు గుహలలోను, తరువాత, నేలమాన్యములఁ ద్రవ్వికొని, వానిచుట్టు మట్టిగోడలఁబెట్టి, వానిమీఁదఁ గొమ్మలతోఁ బంజరము వేసికొని, వానిలోను, మఱికొంత కాలమునకు రాళ్లనొకదానిమీఁద నొకటిఁ జేర్చి, వానిమీఁదఁ గప్పు వేసికొని దానిక్రిందను నివసించెను ఒకానొకప్పుడు నీళ్లలోఁగఱ్ఱలను స్థిరపఱచి, వానిమీఁద నఱపగట్టి దానిలో వాఁడు జీవించి యుండినట్లు తెలియుచున్నది. ఇట్టి అఱపలు "స్విసు(Switzerland) సరస్సులలో గాన నగును. నీళ్లలోనికిం దిగఁగొట్టఁబడిన కఱ్ఱలాకారముఁ జూడ నవి రాతి పనిముట్లతోఁ జెక్కఁబడినట్లు తోచును; ప్రథమమున నిట్టి "సరోనివాసముల"లో నివసించి, వాఁడువనమృగములవాతఁ బడక, శత్రుదాడినుండి తప్పించుకొనెను.

ఇట్టి "సరోనివాసముల"లో మనుజుఁడు జీవించుట "నవీనపాషాణయుగము"లోనే గాక, తూర్పుహిందు దీవులలోను, ఆఫ్రికాఖండమధ్యభాగములోను నేటివఱ, కట్టినివాసములలో మనుజాలసృష్టిస్థితిలయములు జరుగుచున్నవి. వీరు రాతిపనిముట్ల నుపయోగించుచు, వానితోఁ జెట్లఁగొట్టి పడఁ

దోప్రియూటయు, ఎలుగు, తోడేలు, వరాహము మొదలగు జంతువులఁ జంపుచుండిరి చేపనాగవలలం బన్ని వానితోఁ జేపలం బట్టుటకలదు. ఈవలలను నీళ్లలోఁ దేల్చుటకుఁ జెట్లబెరడును, మునిఁగించుటకు రాళ్లను వాడుపయోగించిరి. మనుజుని ప్రాచీననివాసము లిట్టివని తెలియుటయే కాక, స్కాటులాండు డెన్మార్కు దేశముల సముద్రతీర ప్రాంతములయందు కుప్పలుకుప్పలుగఁ బడియుండిన నివేశములను "పాకశాల" లని పిలుచుచున్నారు. ఆటచిప్పలు, సంకులు మొదలగునవి కుప్పలై పడియుండినందున, వానిలోని పురుగులఁ దినుచు మనుజుఁడీ ప్రాంతమున నివసించెను. ఇంతియ కాదు లేళ్లు, దుప్పులు మొదలగు జంతువుల యెముకలును పక్షులయెముకలును చిన్న చెకుముకి రాయికత్తులును మఱికొన్ని వస్తువులు నీప్రాంతమునఁ గానవచ్చుచున్నవి.

మనుజునకు ముఖ్యముగ మూఁడువస్తువులు కావలయునని చెప్పియుంటిమి, కుడుచుటకుఁ గూడును, నిలుచుటకు నీడయును, కాఁగుటకునిప్పును వానికిఁ గావలయును ఈమూఁడు నెటుల లభించెనో చూచితిమి. ఇక ముందు ప్రశ్నయే మన ప్రాచీనపాషాణయుగమున మనుజులేపదములనుపయోగించి సంభాషించిరి? ఈ ప్రశ్నకు జవాబుఁ జెప్పుట కష్టము కాని మఱియొకవిధమునఁ జెప్పవచ్చును. ఒకరిమనస్సులోనియూహలను మఱియొకరు గ్రహించుటకుఁ దగినసంజ్ఞలఁగలిగి యుండి, వానిమూలమున నితరసంగతుల నెటుల నేర్చికొనిరో, అటులనే వ్రాతకూతలను గణనను క్రమముగఁ దెలిసికొనిరి ఎముకలమీఁదను స్లేటుబల్లల మీఁదను మోటుగవ్రాయఁబడిన లేళ్లు, దుప్పులు, వరాహములు మొదలగునవమృగముల బొమ్మలఁ జూడ, ఆయుగములో మనుజులకుం బొమ్మలను వ్రాయుటలోఁ గొంత యభిరుచియుండినట్లు తోఁచును. ఇదివఱకెన్నఁడును మృగములు బొమ్మలను అక్షరములను వ్రాసియుండెనని కాని, లేక అగ్నిహోత్రముఁ జేసియుండెనని కాని, వినలేదు, చూడలేదు; కనుక నీవిషయములలోనే కాక తదితరవిషయములలోఁ గూడ మనుజుఁడు మృగములకంటె శ్రేష్ఠుఁ డని చెప్పుచున్నాము.

ఆకాలపుమనుజులవ్రాఁతకూఁతలవిషయమై విరళముగ మున్ముందు వ్రాయుచున్నాము.

ఏడవఅధ్యాయము.

లోహములు - వానియుపయోగములు.

కాలక్రమమున నందఱికంటె బుద్ధిమంతుఁడును పదార్థములను సూక్ష్మముగఁ గుర్తెఱుఁగునట్టివాఁడొకఁడు భూమి హిరణ్యగర్భయని తెలిసికొని, లోహముల నందఱికి వెల్లడిఁజేసెను. ఆమహాపురుషుఁడు లోకమునకుఁ జేసిన మహోపకారమును మఱచి పోఁగలమా? లోహములను, వానియుపయోగములనుగుర్తెఱుఁగనిదినములలో మనుజుఁడుపొందిన దురవస్థలఁదలఁచిన లోహములిట్టిమహోత్కృష్టమగు పదార్థములని తెలియనగును. లోహములిట్టివని నేటివఱకుఁ దెలియకయుండిన, నపారపారావారముయొక్క పారమునకుఁ బోఁదగిన పొగయోడలును, సముద్రవతియగుభూమిని సునాయాసముతోఁ బ్రదక్షిణముఁ జేసివచ్చుటకుఁదగినధూమశకటములు నసంజాతములై యుండును. లోహజ్ఞానము లేని యవస్థ దురవస్థ, అదియపోహంబు.

దినదినప్రవర్ధమానంబగు మానవచరిత్రం జూడ, మనుజుఁడు పెన్నిధానంబగు భూదేవిం జేసినయాచనసార్థకమయ్యెను. ఎప్పుడు వాఁడు చేయఁబూనినపనికి రాళ్లు అనుపయోగములయ్యెనో, అప్పుడు వాఁడు తనకుఁ గావలసిన లోహములను భూమిలోనుండి తీసికొనివచ్చెను. అరణ్యములు పలుచఁబడినతరువాతను, అవిచ్ఛిన్నాగ్నిహోత్రమును స్థాపించుటకుఁ దగిన రాతిబొగ్గు భూమిలో దొరకెను.

అన్నిలోహములఁ దెలిసికొనుటకుఁ బూర్వము మనుజుఁడు బంగారమును గుఱుతుఁబట్టెను. అన్నిలోహములకంటెఁ గాంతికలది కనుకఁ గాంచనమనియు, మంచివర్ణముగలది కనుక సువర్ణమనియు బంగారమునకుఁ బేర్లు కలవు. దాని కాంతికి వాఁడు భ్రమించెను. ఇతరలోహములవలెఁగాక స్వచ్ఛముగ నదులలోను రాళ్లలో నది దొరకును. అది మెత్తనిది. కనుక నుపయోగించుటకు వీలుపడదని గ్రహించి దానిని రాగితో మేళనముఁ జేసి గట్టితనము వచ్చినతరువాత నుపయోగించెను. స్వచ్ఛముగుబంగారముతో నాభరణములఁ జేసి, వానితో దేహమును వాఁడు శృంగారించుకొనెను. అలంకారాపేక్షలో వనవాసియు పురవాసియు సరిసమానులు. పాషాణయుగములో మనుజుఁడు ధరించిన నత్తగుల్లలహారములు నేఁడు చూడనగును; ఈనాఁడుకూడ వనవాసులకు వస్త్రధారణయందుకంటె నాభరణధారణయం దాసక్తిమెండు. అన్నిదేశములలోను అన్నికాలములలోను, ఎంతకష్టమైన నోర్చి, పచ్చబొట్లను మనుజుఁడు పొడిపించుకొనుటచేత, నిర్గుణమగుశృంగారమును గుర్తెఱిఁగి, తాను సింగారించుకొనవలెనని కోరుటయే వానికిని పశువునకుఁ గలతారతమ్యమును సూచించును. సూర్యాస్తమయముయొక్క చక్కదనముఁ జూచుటకుఁ బశువులు మేఁతమాని వానిశిరస్సులను మీఁదికి నెత్తునా! అంతరిక్షమున నింద్రధనుస్సు కనఁబడినపుడు గుఱ్ఱములుకాని వానరములుకాని ఆనందముఁబొందునా?

ఇతరపదార్థములతోఁ గలియక స్వచ్ఛముగ భూమిలో దొరకుటవలన, బంగారమునువలె తామ్రమును మనుజుఁడు వాడుకొనెను. మెత్తనిలోహమగుటచేత ననేకరూపములుగ మార్చి దానిని వాఁడుపయోగించెను; ఎచ్చటనైన తామ్రము విశేషముగ దొరకక, వంగము దొరికినయెడల, నీరెండులోహములఁ గరిగించి, ఆమిశ్రములోహ మగుకంచును వాడుకొనెను; కరిగినకంచును మూసలోఁబోసి, తనకిష్టమువచ్చిన యాయుధములఁ జేయుచుండెను; ఏయుగములో నీలోహములను వాఁడుపయోగించెనో, దానిని "కంచుయుగ"మని పిలుచుచున్నాము. ఇనుము వాడుకలోనికి వచ్చుసరికి చాలకాలము పట్టెను. లోహము

ఖనులలోఁగాని స్వచ్ఛముగ దొరకదు. ఏస్థలములలో నది దొరకునో గుర్తెఱుఁగవలయును; అటుపైని ఖనిఁ ద్రవ్వి, ఆఱాతిని తీసి కరిగించి మూసలో నుండి తీసినపైనకదా దానిని వాడుకచేయవచ్చును, ఇదియంతయు కష్టమైన పని. ఏనాఁడు వాఁడీపనిని సాధించెనో ఆనాఁడు దానితోఁ గత్తులను కుఠారములను బాణములను మొదలగులోహపుసామగ్రులఁ జేయనారంభించెను; ఆభరణములకును పిడులకును కంచు నుపయోగించెను, చెవిపోగులు, కంకణములు మొదలగు కంచు ఆభరణములు "స్విసు" సరస్సులలోఁ గానఁబడుచున్నవి. కాలక్రమమున వెండి బంగారు ఆభరణములు వాడుకలోనికి వచ్చెను.

నదులలోను, సరస్సులలోను, కొండగుహలలోను, భూగర్భములోను దొరకినపనిముట్లు, ఆభరణములు, ఆయుధములు మొదలగువానిని పరిశీలించి, వేనవేల సంవత్సరముల క్రిందటనుండి మనుజుఁడు భూమిమీఁద జీవించుచుండె నని చెప్పుచున్నాము. పత్త్రములమీఁదఁగాని కాగితములమీఁదఁగాని వ్రాయఁబడిన చరిత్రములానాఁడు లేవు. దినదిన ప్రవర్ధమానమగుమనుజుని చరిత్రలో వాని ప్రాచీనచరిత్రను నాలుగుభాగములుగ విభజించిరి; అవియేవనిన:—

(1) ప్రాచీనపాషాణయుగము.

(2) నవీనపాషాణయుగము
(3) కంచుయుగము
(4) లోహయుగము

ఈ మూఁడుయుగములవిచ్ఛిన్నముగ నొకటితరువాత నొకటి వచ్చెను. ఈయుగముల కాలపరిమితిఁ జెప్పలేము.

అయిన నొకటి నిశ్చయము; పాషాణయుగముల తరువాతఁ గంచు - లోహయుగములు వచ్చెననియు, ఆయాయుగములలో మనుజుఁడాయావస్తువుల నుపయోగించుచుండెననియుఁ జెప్పఁగలము. ఇంతియకాదు. ఒకకాలమే కొందఱికిఁ బాషాణయుగము కావచ్చును ; మఱికొందఱికిఁ గంచు లోహయుగములు కానవచ్చును.

ఇదివఱకు "సరోనివాసముల" గుఱించి ప్రశంసించియుంటిమి ఈ నివాసములను "నవీనపాషాణయుగము వారు కట్టినప్పటికిని, వారిలోఁ గొందఱ "కంచుయుగము" లోనివారని తోఁచును. ఈ "సరోనివాసుల" కు గోధుమలఁ బండించుటయు, పండినపంటలను నిలువఁజేయుటయు, గోగునారతో వస్త్రములనేయుటయు, "ఆవులు, ఎడ్లు, గొఱ్ఱెలు, మేఁకలు, గుఱ్ఱములు, కుక్కలు" మొదలగు జంతువులఁ బెంచుటయు వారికిఁ దెలియును. "లోహయుగము" వచ్చునప్పటికి మానుజుఁ డెంతయభివృద్ధి నొందెను? మృత్పాత్రలను, కంచునాణెములను, గాజుమొదలగువస్తువులఁ గనిపెట్టెనుకదా! "కాలమొకరీతిఁ గడవఁబోదు" తినుటకుఁ గాసును, నిలుచుటకు నీడయును, కట్టుటకు గుడ్డయును లేక పశువువలె సంచరించినమానుజుఁడు 'లోహయుగము' నాఁటి కెంతబుద్ధిమంతుఁ డయ్యెను. ఆనాఁటికానాఁ డుప్పొంగుచు, అధోలోకముల నధిగమించి, ఊర్ధ్వలోకముల కూర్ధ్వమై, ఏకకాలమున నేడేడుపదునాలుగులోకముల నవలోకించుచు వానిబుద్ధి విజృంభించెను.

"ఇంతింతై వటుఁడింతయై మఱియుఁ దానింతై నభోవీథిపై" అని వామనావతారమును గుఱించి చెప్పినసంగతి యీ విషయమును సూచించును.

ఎనిమిదవఅధ్యాయము.

మానవకోటికాలవిమర్శనము.

భూగర్భములోను, నదులలోను, సరస్సులలోను, పర్వతగుహలలోను దొరకినయెముకలను, ఆయుధములను, ఆభరణములను, పనిముట్లను చూచికదా మనుజుఁడు పెక్కువేలసంవత్సరముల క్రిందటనుండి భూలోకములో నుండెనని చెప్పుచున్నాము. ఈనిదర్శనము లంత ప్రాచీనములని చెప్ప నేల?

ఆసియా, ఐరోపా, ఆఫ్రికాఖండములలో నచ్చటచ్చట భూమిలో నలుబది,యేఁబది,అఱువది అడుగుల లోతున త్రవ్విచూచినపు డీవస్తువులు దొరకెను. ఏమనుజులైన వీనినన్నియు సమకూర్చి భూమిఁ ద్రవ్వి, దానిలో నంత లోతున పరిహాసార్థము వీని నుంచిరని తలంచుట పిచ్చియాలోచనకాని మఱియొకటికాదు. భూమి పెక్కుమార్పులఁ జెందియుండెను; పల్లము మెరకయయ్యె, మెరక పల్లమగుచున్నది, నదులమార్గములు, నదీముఖద్వారములును మాఱుచున్నవి; కొన్నిభూములను సముద్రము మట్టుచున్నది, మఱికొన్నిభూములు సముద్రములోనుండి పైకి వచ్చుచున్నవి. జీవులు శరీరమును విడిచినపైన అగ్నిసంస్కారముకాని లేక భూసమాధిక్రియకాని వానికిఁ జరుగనపుడవియచ్చటనే పడియుండును, కాలాంతరమున వానిమీఁద భూమిమేట వేసినందున, నంత లోతున నవిదొరకెను. మనుజునియొక్కయు ఇతరజంతువులయొక్క యెముకలును పునుకలునుకలిసి కనఁబడుచున్నవి. శాస్త్రజ్ఞులు వానిని పరిశీలించి, ఆకాలపుమనుజునిశరీరదార్ఢ్యమును ఔన్నత్యమును బుద్ధినిగుఱించి వ్రాసియున్నారు. అనంతకోటికాలము భగవంతునకు త్రుటిమాత్రము. వానిమహిమ యేమని చెప్పవచ్చును? శాస్త్రజ్ఞానము బహుళమైనకొలఁది, పరమేశ్వరుని మహిమ విపులమగుచున్నది.

తొమ్మిదవఅధ్యాయము.

గోపాలకులు, హాలికులు, వర్తకులు.

దిగంబరియై, వనవాసియై ఆహారమునకై దొరకినదుంపను లేక పచ్చిమాంసము తిని పశువువలె సంచరించుచుండినమనుజుఁడు క్రమముగ గోపాలుఁడై

హాలికుఁడై, వర్తకుఁడై, అజ్ఞానతిమిరాంధకారమును దాఁటి తూర్పురేఖలు వెల వెలఁబాఱు కాలముసరికి వచ్చెను.

కొంతకాలమునకు పశువులు, అశ్వములు, శునకములు, గొఱ్ఱెలు, మేకలు మొదలగుజంతువులయుపయోగమును గుర్తెఱిఁగి వానిం బెంచుట కారంభించి, పచ్చికభూములెచ్చటెచ్చటనుండిన నచ్చటచ్చటకు వానితోఁ గొందఱు మనుజులు పోవుచువచ్చిరి. వారాపశువులపాలం ద్రాగిరి, వానిచర్మములను దుస్తులుగ నుపయోగించిరి, గుఱ్ఱముల నెక్కి కాని, లేక పాదసంచారులై కాని దేశముల వెంబడిఁ దిరుగుచుండిరి. శాశ్వతమగునివాసములు వారికిలేవు; ఎప్పటికప్పుడు పర్ణశాలలఁగట్టుకొని వానిలో సృష్టిస్థితులను వారునడిపించిరి. ఈగోపాలావస్థను "దేశసంచారావస్థ" యని పిలుచుచున్నాము. ఈయవస్థలో నే "అబ్రహాము" వేలసంవత్సరముల క్రిందట నుండెను, నేఁడు "అరబ్బులు" మొదలగువారు సంచారావస్థలో నడుచుచున్నారు.

కొందఱు గోపాలకులై యుండ, మఱికొందఱు హాలికులై జీవించుచుండిరి; ఈవృత్తి మొదటిదానికంటె శ్రేష్ఠము. ఇప్పుడు సంచారమును మాని మనుజులు స్థిరులై జీవించిరి. ఈవృత్తిని నిరాటంకముగ నడిపించుటకు వారిపూర్వు లుపయోగించినపనిముట్లు అనుపయోగములయినందున, వారు నూతనముగఁ గొన్నిటినిఁ గనిపెట్టవలసివచ్చెను. నక్కులు, పారలు, గునియలు, ఏళ్లు, నాగళ్లు, సగునుబల్లలు, కొడవళ్లు — మొదలగువ్యవసాయమునకుఁదగినవానిని వారుచేసిరి. "పాషాణయుగము" లోనిమనుజులవలెఁ బర్ణకుటీరములలోఁ గాని, లేక "దేశసంచారావస్థ"లోనుండినగోపాలకులవలె గుడారములలోఁ గాని వారుజీవింపక, వారిజీవనమువలె నస్థిరముగాక తమజీవనములు స్థిరమైనందున, వారుగృహములను నిర్మించుకొనిరి, సస్యభాండాగారములను గోస్థానములను వారుకట్టిరి. మబ్బులేనిరోజులలో వారుపొలములమీఁదికిఁ బోయి పనిచేయుచుండ, కమ్మరివారును వడ్రంగులును వచ్చి వారిగృహములఁ గట్టుచుండిరి. ఇటులన్యోన్యసహా

కాఁపులై వారుజీవించిరి. ఈవిధముననే తదితరవృత్తివ్యాపారములు బయలు వెడలెను. పదుగురుకలిసి పడకొంపలఁగట్టిన, నదియొకపల్లె యయ్యెను. పల్లెలు గ్రామములును, గ్రామములు పట్టణములును, పట్టణములు నగరములయ్యెను.

ప్రజలందఱు కలిసి శత్రువులతోఁ బోరాడుచుండిరి, లేకపిక్కబలమును దండబలమునుగల తమలోఁ గొందఱి నెంచి వారిని శత్రువులమీఁదికిఁ బంపుచు వచ్చిరి, వీరేసైనికులు, వీరేక్షత్రియులు, వీరివృత్తి "వీరవృత్తి". పదుగురుకలిసి జీవించినపుడు, అనఁగా సాంఘికులైనపుడు, స్వకార్యములలోఁ గాని లేక అన్యోన్యసహాయకృతకార్యములలోఁ గాని వారొకరితో నొకరు కలియుట తప్పనందున, వారు స్వధర్మములను నియమించుకొనిరి, వీనినే సాంఘికధర్మములని పిలుచుచున్నాము. మనుజులను వారివారిధర్మములలో నడిపించుటయును, శత్రువులమీఁదికి సైనికులను నడిపించుటయును వారికొకనాయకుఁడు కావలసి వచ్చెను. దేహబలముఁగలిగియుండినఁగాని యుద్ధముఁ జేయ నేరఁడనియు, బుద్ధిబలముగలిగియుండినఁగాని ధర్మసంస్థాపనఁ జేయ నేరఁడనియు వారు తలంచి, ఈ రెండుబలములు కలవానిని తమలోఁ దామెంచుకొని, వానిని నాయకునిగ నిర్ణయించుకొనిరి ఈనాయకుఁడు క్రమముగ "రాజు" అయ్యెను.

నేఁడువలె నాఁడుకూడ మనుజులు అరిషడ్వర్గమునకు లోఁబడియుండిరి. కనుక వారిలో వారు గాని వారుపరులతోఁగాని పోరాడుచుండిరి. సాధారణముగ పాలికులును నగరవాసులును స్థిరులుకనుక వారిస్వభావము శాంతమై యుండును, అస్థిరులై దేశసంచారముఁ జేయువారును లేక పశువులమందలను వెంటఁ బెట్టుకొని సంచరించుగోపాలకులును శాంతచిత్తులుగాక ధూర్తులైనారికంటి కింపుగఁ గనఁబడినదేశముమీఁదికిఁ బోయిదేశవాసులను దండించి బలాత్కారముగ దాని నాక్రమించుకొనుచుండిరి. ఇందువలనఁ దెలియునది యేమనిన, స్థిరులైయుండినవారికంటె నస్థిరులగువారు కలహమునకుఁ గాలుదువ్వుదురు. శాఖామందులము మేము మేమని వారిలోవారు పెనఁగులాడుచుండిరి. ఇతరు

వృత్తులకంటె సేద్యపువృత్తి శ్రేష్ఠమని తలంచి, హాలికులు కష్టపడి పండించిన పంటలలో భాగమును దేశద్రిమ్మరులు కోరినపుడుగాని లేకలోహక్రియఁజేసి కొని జీవించుచుండినవాఁడుచేసిన పనిముట్లను వారుకోరినపుడును, దెబ్బలాటలు వచ్చి ఒకరినొకరు కొట్టుకొని చచ్చుచుండిరి. మాత్స్యన్యాయము ననుసరించి బలవంతులు బలహీనులఁ గొట్టి వారిభూమి నాక్రమించుటయు లేక వారి పంటలఁ బాడుచేయుటయు లేక వారిలోఁ గొందఱిని బానిసలుగఁ దీసికొని పోవుటయు—ఈమొదలగు దుష్కార్యములు సంభవించెను. అనంతరయుగములలోవలె నాయుగములోఁ గూడ మనుజులు దయాదాక్షిణ్యములులేక రక్తపానాపేక్షులై యుండిరి. "బలవంతుఁడు రాజు, వానిదె రాజ్యము" అను సంగతి తప్ప మఱియొకటి వారికిఁ దెలియదు.

వైరముఁ బాటించి మనుజు లెంతకాలము జీవింపఁగలరు? కొంతకాలమునకు వైరమును మాని వారు శాంతిచిత్తులై మిత్రులై జీవించిరి. మఱికొంతకాలమునకు వర్తకము సాగెను, భూమిని హాలికులు సాగుఁజేసి రెండింతలు పంటలఁ బండించిరి; సంవత్సరము పొడవున వారిభోజనమునకుఁ గావలసిన దానికంటె నధికముగఁ బండుచుండెను. ఈపంటలోఁ గొంతభాగమును గోపాలకులకిచ్చి, వారి పశువులఁబుచ్చుకొనుచుండిరి, మఱికొంతభాగమును కమ్మరులకును వడ్రంగులకు నిచ్చివారుచేసినపనిముట్లం బుచ్చుకొనిరి. ఇటుల నిచ్చిపుచ్చుకొను వ్యాపారము జరుగుచుండెను, ఎంతకాలము తమవస్తువుల నొకరికిచ్చి వారివద్దనుండిన వానినిఁ బుచ్చుకొనుచుందురు? ఇదికష్టమగుపని; కనుక గవ్వలను రాగిముక్కలను లోహపుముక్కలను క్రమముగ వాడి తదుపరి కంచు, వెండి, బంగారు నాణెములను వారుపయోగించిరి. ఇదియే వర్తకము. పూర్వకాలదేశచరిత్రలఁజూడ నానాఁడుకూడ ప్రజలు వెండి బంగారములను విలువగల వస్తువులని తలంచి దానినాణెముల నుపయోగించిరి. "బైబిలు" గ్రంథములో "ప్రపంచోత్పత్తికాండ"లోఁ జెప్పిన విధమున, వెండిబంగారములను పశువులఁ గలిగి "అబ్రహాము" భాగ్యవంతుఁడై జీవించెను.

పదియవఅధ్యాయము.

భాష.

మనుజుఁడు తనకోరికలను ఊహాపోహాలను పరులకుఁ దెలియఁ జేయుట కభిలషించుటవలన భాష పుట్టెను. ఇతరసంగతులఁ గనిపెట్టి యెటుల వానిని వాఁడు, వృద్ధిఁ జేసెనో, అటులనే భాషఁ గనిపెట్టి దానిని వాఁడభివృద్ధిఁ జేసెను. భాష ధ్వనిరూపకము, ఆధ్వనులు స్వల్పములు, వానిని వివిధముగ సమకూర్చుటవలనఁ బదములు పుట్టెను, ఆపదములసముదాయమునకు భాష యని పిలుచుచున్నాము. అనేకవిషయములను గుఱించి పదములు కలవు. ఆహా! మనుజుని బుద్ధిబల మెంతవఱకు విజృంభించెను? ప్రాచీనభాషలను ఆధునికభాషలను విమర్శించి చూడ వానిబుద్ధి విశద మగును. ప్రతిపదమును విభజించి దానివ్యుత్పత్తిఁ జూచిన నీసంగతి తేటపడును. సంస్కృతభాషలోఁ బదములనేకములు కలవు; కాని, వానిధాతువు లన్నియు మూఁడునాలుగువందలకంటె నధికముగ లేవు కొన్ని ప్రచలితభాషలు దినదినాభివృద్ధి నొందుచున్నవి, విదేశీయసంసర్గము భాషాభివృద్ధికి శ్రేయోదాయకము; స్వభాషలో లేనిపదములను వారన్యోన్యము నేర్చుకొనియెదరు ; నూతనవిషయములకు నూతనపదములను వారు కల్పింతురు.

మనుజునకు మొదట భాషాపదములు స్వల్పముగ నుండెను, అవి యైనను చిన్నవి, పెద్దవి కావు, తనకోరికలను ఊహాపోహాలనితరులకుఁ దెలియఁ జేయుటకు వాఁడు సంజ్ఞఁ జేయుచుండెను. శిరస్సునునానావిధములుగఁ ద్రిప్పుటవలన వానిభావము లనేకములు తెలియ నగును.

శ్లో. "ఆకారై రింగితై ర్జ్ఞాత్వా చేష్టయా భాషణేన చ,
నేత్రవక్త్రవికారేణ లక్ష్యతేఽంతరతం మనః"

ఆకారముచేతను, చేష్టలచేతను, నేత్రవక్త్రవికారముచేతను మనుజుని అంతర్భావముఁ దెలిసికొనవచ్చును. విదేశములలో యాత్రఁ జేయునపుడు, వారిభాష మనకుఁ దెలియనందున సంజ్ఞలవలనఁ గదా మనభావములను వారికిఁ దెలియఁజేయుదుము.

మానవజాతు లన్నియు నొకకుటుంబములోనివా రని చెప్పినవిధమున, భాషలన్నియు నొకమాతృభాషనుండి పుట్టె నని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు; కాని క్రమముగ జ్ఞాన మభివృద్ధి నొందినకొలఁది, ప్రాచీనసిద్ధాంతమును విడిచి పెట్టి, మఱియొకమార్గమును వారు త్రొక్కిరి. ప్రపంచములోనిభాషలకు మూఁడు ఆధారములు కలవు, వానిని "మాతృక" లని పిలిచెదరు. "జ్యూసు" అనువారిమతగ్రంథము "బైబిలు" యొక్క ప్రథమభాగము "హీబ్రూ" భాషలో వ్రాయఁబడెను, అందుచేత నాభాష మాతృకయని కొందఱు శాస్త్రజ్ఞులు తలంచిరి, కాని, ఇటీవల చేసిన శాస్త్రపరిశోధనవలన నీమతమును విడిచి పెట్టిరి. పదములయొక్క ధాతురూపములంబట్టిచూడ, సంస్కృతము, జెండు, గ్రీకు, లాటిను మొదలగుభాషలకు "మాతృక" యొకటి యని తెలియుచున్నది. ఈమాతృకకు "ఇండో జర్మానికు" భాషయని పేరు కలదు; ఇది నేఁడు అప్రచలితము. ఈ అప్రచలితభాషను "ఇండో-ఆర్యను" లేక "ఇండో-జర్మానికు" కుటుంబమువారు అవిభక్తముగ నుండినపుడు మాట్లాడుచుండి రని యూహించెదము. ఈమాతృకకు అష్టకన్యలు కలరు; వారి నీదిగువ నుదహరించెదము:—

I. ఆర్యులు—వీరిలో రెండుశాఖలు కలవు:—

(1) హిందూశాఖ—వీరిభాష సంస్కృతము. అనంతరము ప్రాకృత భాషలు. సంస్కృతము వేదభాష; కొంతకాలమువఱకు నది ప్రచలితమై, క్రమముగ వాడుకలోనుండి తప్పెను.

(2) ఐరేనియనుశాఖ—వీరు ద్వివిధులు.

(a) పశ్చిమశాఖ— వీరిభాష ప్రాచీనపారసీకము—క్రీ. పూ. సం. 520-350 రములు.

(b) తూర్పుశాఖ—వీరిభాష "అవెస్త"—ఈభాషను "జెండు అవెస్త లేక జెండు లేక ప్రాచీనబాక్ట్రియను" అని మూఁడు నామములుఁ కలవు. అవెస్త అనునది "జోరాస్ట్రియను" ల ప్రాచీన మతగ్రంథము.

II. అర్మీనియను—క్రీ. వె. 5 శతాబ్దము:—ఈభాషలోని ప్రాచీన గ్రంథము లాశతాబ్దము నాఁటివి అని తెలియుచున్నది.

III. గ్రీకు—ఈభాషయు, దానియుపశాఖలును.

IV. ఆల్బేనియను:—ప్రాచీన "ఇలీరియా" దేశములో నీభాష ప్రచలిత మయ్యెను; దాని ప్రాచీనగ్రంథములు క్రీ వె. 17 వ శతాబ్దము నాఁటివి అని తెలియుచున్నది.

V. ఇటాలిక:—ఇది ద్వివిధము—లాటిను అనియు అంబ్రియను-సామ్నిటిను అనియు—పోర్చుగీసు, స్పానిషు, కతలేనియను, ప్రావన్షాలు, ప్రెంచి, ఇటాలియను, రోమానియను, మొదలగు భాషలకు "లాటిను" మాతృక అయ్యెను.

VI. కెల్టిక:—

(1) గాలిషుభాష:—లాటిను, గ్రీకు, గ్రంథకర్త లుపయోగించిన పదములనామములఁబట్టియు, నాణెములవలనను, ఈభాషయొక్క పదములు తెలియుచున్నవి.

(2) బ్రిటానిక భాష:—కిమ్రిక లేక వెలుషు, కార్నిషు, బాసు బ్రెతను లేక ఆర్మోరికను, అను మూఁడుభాషలకు నది మాతృక అయ్యెను.

కమ్రికు, బాసుబ్రెతను—అను నీరెండుభాషలలో వ్రాయఁబడిన ప్రాచీనగ్రంథములు క్రీ. వె. ౮-9 వశతాబ్దములనాఁటివి అని తెలియుచున్నది.

(3) గేలికుభాష:—ఐరిషుగేలిసు, స్కాచిగేలిక్కు, మాంక్సు—అను నీమూఁడుభాషల కామె మాతృకఅయ్యెను. ప్రాచీనగేలికుభాషలో వ్రాయఁబడిన "ఓగం" శాసనములు క్రీ. వె సం॥ 500 రమునాఁటివి అని తెలియుచున్నది.

VII. బాల్టికు—స్లావోనికుభాష:—

(1) బాల్టికుశాఖ—

(*a*) ప్రాచీన-ప్రష్యను—ఈభాష 17-వ శతాబ్దమునాఁటికి అప్రచలితమయ్యెను.

(*b*) లిథ్యూనియను,

(*c*) లెట్టిక్కు—ఈరెండు భాషలలో వ్రాసిన ప్రాచీనగ్రంథములు 16-వశతాబ్దమునాఁటివి.

(2) స్లావోనికుశాఖ:—ఈశాఖకు రెండు ఉపశాఖలు కలవు—

(*a*) ఆగ్నేయ ఉపశాఖలో "రష్యను, బల్గేరియను, ఇలీరియను" భాషలుకలవు.

(*b*) పశ్చిమ ఉపశాఖలో "జెక్కు, సారాబియను, పోలిషు, పొలాబియను" భాషలు కలవు.

VIII. జెర్మానికు భాష:—తూర్పుజెర్మానికు అనియు పశ్చిమజెర్మానికు అనియు ఈభాష ద్వివిధము.

(*a*) తూర్పుజెర్మానికుభాష:—

(1) గాతిక — పశ్చిమగాతుల మతగురువు "ఉల్ఫిలాసు" క్రీ. వె. 4-వ శతాబ్దములో నీభాషలో "బైబిలు" గ్రంథమును వ్రాసెను. ఈ భాషలో నీగ్రంథముతప్ప మఱియొకటి కానరాదు.

(2) ప్రాచీన నార్సుభాష: — ఇది ద్వివిధము.

(*a*) తూర్పునార్సుశాఖలో "స్వీడిషు, గత్నిషు, డేనిషు" భాషలు కలవు.

(*b*) పశ్చిమనార్సుశాఖలో "నార్వీజియను, ఐసులాండికు" భాషలు కలవు. ఈతూర్పు జెర్మానికుభాషలలో వ్రాయఁబడిన "రూనికు" శాసనములు క్రీ. వె. 3-4 శతాబ్దముల నాఁటివి అని తెలియుచున్నది.

(*b*) శ్చిపముజెర్మానికుభాష: —

(1) హైజెర్మను: — దీని ప్రాచీనగ్రంథములు. క్రీ. వె. 8-వ శతాబ్ద మధ్యభాగమునాఁటివి.

(2) లోఫ్రాంకోనియను: — క్రీ. వె. సం. 1200రమువఱకును ప్రచలితము.

(3) లో జెర్మను: — దీని గ్రంథములు క్రీ. వె. 9-వ శతాబ్దమునాఁటివి. క్రీ. వె. సం. 1200 రము వఱకు నీభాషకు "ప్రాచీనసాగ్సను" అని పేరు కలదు.

(4) ప్రిసియను: — దీని ప్రాచీనగ్రంథములు 14-వ శతాబ్దమునాఁటివి.

(5) ఇంగ్లీషు: — దీని ప్రాచీనగ్రంథములు 7-వ శతాబ్దాంతమునాఁటివి.

ఇంగ్లీషుభాష త్రివిధము: —

ప్రాచీనభాష: — క్రీ. వె. సం. 700 — 1100 రములు.

మధ్యభాష: — క్రీ. వె. సం 1100 — 1500 రములు.

ఆధునికభాష: — క్రీ. వె. సం. 1500 మొదలు నేటివఱకు.

ప్రాచీన ఆంగ్లేయభాష నాలుగు విధములు:—

(1) నార్థంబ్రియను--"హంబరు"నదికి ఉత్తరమున నీభాష ప్రచలితము.

(2) మెర్షియను:—"హంబరు"నదికిని "తెమ్సు"నదికిని మధ్యభాగములోఁ బ్రచలితము.

(3) పశ్చిమసాగ్సను:—కెంటు—సస్సెపరగణాలుమినహాయించి 'తెమ్సు' నదికి దక్షిణభాగములోఁ బ్రచలితము.

(4) కెంటిషు:—కెంటు—సస్సె పరగణాలలోఁ బ్రచలితము.

మొదటి రెండింటికిని "ఆంగ్లియను" అని పేరు కలదు. "మధ్య భాష"లోఁ గూడ నీభేదములు కలవు. "ఆధునికభాష" పశ్చిమసాగ్సను భాషలో నుండి వచ్చెను.

ఈభాషల నుచ్చరించెడివా రందఱు నేకకుటుంబములోనివా రని చెప్పుటకు నిదర్శనములు పెక్కులు కలవు, ఆయాభాషలలోనిపదముల నిచటఁ జేర్చుచున్నాము; ఈపదములు కూడ నిదర్శనములు.

సం=అశ్వ—ఇం=హార్స్; జెందు=అస్ప; గ్రీ=హిప్పొస్—లా=ఎక్వస్; గా=-ఐహ్వ; లి=అశ్వ.

సం=నూ (కర). ఇం=సౌ, జెందు=హూ; గ్రీ=హూస్; లా=నూక్స్;

సం=అవి; గ్రీ=ఓవిస్; లా=అవిస్; ఇం=ఇయు; లి=అవిసు.

సం=పశు; లా=పెకు; గా=ఫెహు.

సం=నక్తం; ఇం=నైటు! లా=నాక్ట్; గ్రీ=నక్ట్; గా=నాక్ట్స్, లి=నాక్తిస్..

సం=మధు, జెండ్=మధు; గ్రీ=మేథు, ఇం=మీడ్, లి=మిదుస్;

సం=యుగం, ఇం=యోక్, గ్రీ=జుగన్, లా=ఇయుగం, గా=యుక్;
లి=యుంగాస్:

సం=రుధిర, గ్రీ=ఎ-రుత్రాస్; లా=[illegible], గా=[illegible],

సం=పితృ, ఇం=పాదర్, గ్రీ=పెతెర్, లా=పాటర్, గా=పాథర్:

సం=మాతృ; ఇం=మదర్, గ్రీ=[illegible], లా=మేతర్, హై జె=మూఓతర్.

సం=భ్రాతృ, ఇం=బ్రూదర్, జెండు=బ్రాటర్, గ్రీ=ఫ్రెటర్; లా=ఫ్రేటర్,
లి=బ్రాతిస్.

సం=స్వసృ, ఆర్మీ=స్కేసుర్, గ్రీ=హెకుర, లా=సోక్రుస్, గా=సై్వరో,

సం=త్వం, ఆర్మీ=దు, గ్రీ=టూ, లా=టూ, గా=దూ, లిత్యూ=తు,

సం=దశ, గ్రీ=డెక, లా=డెసెమ్, గా తేహున్.

ఆర్యకుటుంబమువా రెంతకాలము అవిభక్తముగనుండిరో చెప్పఁజాలము. వారు నాగరికులు, వారు సాంఘికులు, బంధుపుత్రమిత్రకళత్రసంబంధములను గుర్తెఱిఁగి యుండిరి. "ద్యౌపిత" అని భగవంతునకు వారు పేరుఁ బెట్టిరి. ఆ "ద్యౌపిత" అను భగవంతునకు గ్రీకులు "జూటస్ పితర్" అనియు, రోమకులు "జ్యూపిటర్" అనియు మాఱుపేరుఁ బెట్టిరి. (ద్యౌ=ఆకాశము; పిత=తండ్రి.)

శ్లో. "నత ద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః."

అని చెప్పినవిధమున వారు నమ్మియుండిరి.

ప్రపంచములోనిభాషలకు మూఁడు మాతృకలు కల వని చెప్పితిమి; "ఇండో-జెర్మానిక" భాషయొకమాతృక; దానిని గుఱించి ప్రసంగించితిమి. ఇఁకను ద్వితీయ మాతృకను చెప్పఁబోవుచున్నారము: —

(1) హీబ్రూభాష.

(2) అరబిక్కు—ఈభాషలో "ఖొరాను" అను మహమ్మదీయుల మత గ్రంథము వ్రాయఁబడెను.

(3) ఫోనీషియా, బాబిలను, అసీరియా, కార్తేజి—ఈభాషలును వాని ప్రాచీనగ్రంథములును—ఇవియన్నియు ద్వితీయమాతృకనుండి వచ్చెను. ఇఁకను తృతీయమాతృకనుండి "చీనా, టిబెటు" మొదలగుదేశభాషలు పుట్టెను.

ప్రపంచములో ననేకభాషలు కలవు. అన్నిభాషలొకేరీతిగ నభివృద్ధి పొందలేదు. ఆయాభాషలలో పదముల గమనికయు పొందికయు పదముల సృష్టిస్థితిలయములును, శబ్దకావ్యనాటకాలంకారములును, సగుణనిర్గుణస్థితుల వర్ణనలును, చూచి చదివి ఆనందింపనలెను. ఒకభాషయొక్క కట్టుదిట్టములు మఱియొకభాషకు రానేరవు, ఆయాదేశీయుల నైసరికస్థితిఁ బట్టియు, దేహబలముఁబట్టియు, విదేశీయుల సంసర్గమువలనను, ఒకభాషయొక్క స్థితిగతులు నిర్ణయింపఁబడును. ఈసంగతులను, తదితరవిషయములను మున్ముందుకు నీవు గ్రహింపగలవు.

పదునొకొండవఅధ్యాయము.

వ్రాఁత.

వ్రాఁతగుఱించి సులభముగఁ జెప్పవచ్చును. ఏదియైన నొకదానిని నేత్రములు చూచినందున మనస్సు దానిని గ్రహించును. ఇందుకుగాను వ్రాఁత పుట్టెను. మొదట బొమ్మలను వ్రాసి, తద్ద్వారా సంగతులను మనుజులు గ్రహించిరి. అనేకశతాబ్దములవఱకు బొమ్మలవ్రాఁత వాడుకలో నుండెను; నేఁడు

కొందఱు సవరలు మొదలగు అనాగరికులు బొమ్మల వ్రాతను వ్రాయుచున్నారు. రాళ్లు, రాతిపలకలు, చెట్లు, గోరీలు—ఈ మొదలగువానిమీఁద బొమ్మలను వ్రాసి వానిమూలమున నొకసంగతిని గాని లేక వర్తమానమును కాని ఇతరులకుఁ దెలియఁజేయుచుండిరి. కాలక్రమమున నీమార్గమును మనుజుఁడు విడిచిపెట్టి, ఉచ్చరించుటవలనఁ గలిగిన శబ్దములను సంజ్ఞల నుపయోగించెను; ఆసంజ్ఞలే అక్షరములయ్యెను, అక్షరములసంయోగమువలనఁ బదములు పుట్టెను. ఆధునిక అక్షరసమామ్నాయము ప్రాచీనపుబొమ్మల వ్రాతనుండి పుట్టెనని కొందఱు శాస్త్రజ్ఞు లూహించిరి. అక్షరసమామ్నాయమును గురించి "ఆంధ్రవిజ్ఞానసర్వస్వము" లో వ్రాయఁబడినవ్యాసముఁ జదువఁదగి యున్నది.

పండ్రెండవఅధ్యాయము.

గణితము.

మనుజుఁడు చాలకష్టపడి గణితములను నేర్చుకొనెను. నేఁడు కొందఱు మనుజులకు నాలుగుసంఖ్యలకంటె నధికము తెలియదు, నాలుగుకంటె నధికము తెలిసినను, అయిదు, ఆఱు మొదలగుసంఖ్యలకు పేర్లు తెలియవు. ప్రపంచమంతట చేతులవ్రేళ్లను బట్టి లెక్కించుట కలదు; కొన్నిభాషలలో "హస్తము" అను శబ్దమును "పంచ" అను సంఖ్యను తెలియఁజేయుట కొక్కపదము కలదు. నేటివఱకు మనము చేతులఁబట్టి లెక్కపెట్టుచున్నాము.

1 చేయి—అనగా 5 అయిదు

2 చేతులు— ,, 10 పది.

20 చేతులు— ,, 100 నూరు.

గణితశాస్త్రములో "0" అనుసంఖ్యను కనిపెట్టుటవలనఁ గలిగినలాభములఁ జెప్పలేము. ఈశాస్త్రజ్ఞానములేనిసమయమున మనుజుఁ డెటులవ్యవహరించెనో యూహింపలేము.

ఐరోపాఖండమునకు వాయవ్యమూలను నేటివఱకుఁ గనఁబడు నిదర్శనములఁబట్టి, భూదేవియొక్క బాల్యదశనింతవఱకు వర్ణించితిమి. మనుజుఁడు మొదల నెచ్చటనో జీవించియుండి, అచ్చటనుండి బయలువెడలి, వాయవ్య భాగమునకు వచ్చెను. "ప్రాచీనపాషాణయుగము" లో "బ్రిటను" ద్వీపములు ఐరోపాఖండముతోఁ గలిసియుండెను, కాని, అవి ద్వీపములు కాలేదు. నేడు "ఇంగ్లాండు, ఫ్రాన్సు" అనఁబడు దేశములలో నాఁడు "రైనాసరసు" రోమములతో నిండిన ఏనుఁగులును సంచరించెను ; ఆభాగమంతయు హిమవంతునకుఁ బుట్టినిల్లయ్యెను; దేశమంతయు కాకులుదూఱని కాఱడవులతోను చీమలుదూఱని చిట్టడవులతోను నిండియుండెను, చిత్తడినేలతప్ప మఱియొకటి కానరాదు. అట్టిసమయములో మనుజుఁ డాస్థలములో జీవించుటెట్లు? కొంత కాలము గతించినతరువాత మనుజుఁ డాస్థలమునకు వచ్చెను. పిపీలికాదిబ్రహ్మపర్యంతముగల చరాచరజంతుజాలములో పెక్కుమార్పులు వచ్చెను. ప్రకృతి అనేక వికృతులఁ బొందెను; అందుచేత నామెకు "చంచలలక్ష్మి" యని పేరు వచ్చెను. ఏయేశాస్త్రములఁ జూచినను ఆయాశాస్త్రములఁబట్టి ఆమె "చపల" యని తెలియుచున్నది

పదుమూఁడవఅధ్యాయము.

మానవుని ప్రాచీన నివాసము.

మానవులరూపరేఖావిలాసములను వేషభాషలఁబట్టి, వారిని అయిదు జాతులక్రింద శాస్త్రజ్ఞులు విభజించిరి.

(1) "కాకేషియను" జాతివారు "ఐరోపాఖండములోను ఆశియా ఖండములోను నివసించియున్నారు. "ఇండో-జెర్మానికు" కుటుంబమువారీ జాతిలోనివారు.

(2) "మంగోలినియను" జాతివారు చీనా, జపాను, టార్తరిమొదలగు దేశములలో జీవించియున్నారు. వారికి "పసుపుజాతి" వారని పేరు కలదు; పసుపుపచ్చని శరీరకాంతి గలవారు.

(3) "ఈథియోపియను" లేక "నీగ్రో" జాతివారు ఆఫ్రికాఖండములో నుత్తరభాగము తప్ప, మిగిలినభాగములో నివసించియున్నారు. వారు నల్లని శరీరములుకలవారు కనుక వారికి "చీకటి జాతి వారు" అని పేరుకలదు.

(4) "అమెరికెను" లేక "రుధిర" జాతివారు దక్షిణోత్తర అమెరికా ఖండములలో నివసించియున్నారు. వారు యఱ్ఱని శరీరములు కలవారు కనుక "రుధిర" జాతివారని వారికిఁ బేరు వచ్చెను.

(5) "మలేయను" జాతివారు హిందూమహాసముద్రద్వీపములలో నివసించి యున్నారు. వారి శరీరముల కాంతి గోధుమరంగును పోలి యుండును. ఆయాజాతుల వారు నేఁడునివసించియుండు ప్రదేశములలోఁ బాషాణయుగమువాటినుండి నివసించియుండిరో లేక మఱియొకస్థలమునుండి యిచటకు వచ్చిరో చెప్పుటకు వీలుపడదు; అందుకు నిదర్శనములు కానరావు. "కాకేషియను" జాతివారి ప్రాచీననివాసము గుఱించి చెప్పుటకు నిదర్శనములు కలవు.

రూపరేఖావిలాసములంబట్టి "కాకేషియను" జాతివారనియు, వేషభాషలంబట్టి "ఇండో—జెర్మానికు" కుటుంబము వారనియు, ఒకరినే రెండు నామములతోఁ బిలుచుచున్నాము. "ఐరోపా" ఖండములో "ఆస్ట్రియా" దేశములో వారు ప్రాచీనకాలములో నివసించి యుండి రని కొన్ని నిదర్శన

మూలం బట్టి శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఈకుటుంబమువారీప్రదేశమున కెచ్చటనుండి వచ్చిరో, ఇచ్చట నెంతకాలము జీవించియుండిరో, ఇచ్చట నుండి విభక్తులై తదితరదేశములకు వారేకాలమున బయలువెడలిరో—ఈ మొదలగు సంగతులఁ జెప్పుటకు సాధ్యము కాదు. "ఐరోపా" ఖండమధ్యభాగము నివాసయోగ్యమై యుండెను. కనుక నీకుటుంబమువారీభాగములో నివసించిరి. అచ్చటనుండి కొందఱు గ్రీసుదేశమునకును, కొందఱు ఇటాలియాదేశమునకును కొందఱు జెర్మని—ఫ్రాన్సుదేశములకును, కొందఱు పారశీక—భరతఖండములకును గమనించిరి. వారు కొంతవఱకు నాగరికు లని చెప్పవచ్చును, వారు ప్రకృతి ఆరాధకులు. పంచభూతములను సేవించిరి, వారికి భాషాజ్ఞానము కలదు; వారు సాంఘికులు, వారికి గృహనిర్మాణము తెలియును.

ప్రథమమున మనుజుఁడు సంచారావస్థలో నుండి, సాంఘికధర్మములు లేకపోవుటచేత, వానికి స్వదేశ మనియు స్వనివాసమని యొకటి లేదు. ఏప్రదేశము జలసమృద్ధి గలిగియుండిన నాప్రదేశములో జీవించెను. పశువులు మేయుటకుఁ గసవుతో నిండిన ప్రదేశములు వానికి నివాసయోగ్యమయ్యెను; ఈ రెండును సమృద్ధిగ లేకపోయినయెడల, వాఁడాభాగమును విడిచిపెట్టి మఱియొకస్థలమునకుఁ బోవుచుండెను. లేక బలవంతుఁడు వచ్చి వాని నెదిరించిన యెడల, వానితోఁ బోరాడలేక వాఁడా దేశమును విడిచి పెట్టును; లేక శీతోష్ణస్థితులు మాఱినయెడల, నవి వానికిఁ బ్రతికూల మగుట చేత వాఁడా ప్రదేశమును విడిచిపెట్టును ఏవిధమునఁ జూచినను దేశమునం దభిమానమును కలిగించుసాధనములు వానికి లేనందున, వానికి స్థిరత్వము లేకపోయెను. మఱియొకవిశేషము కలదు. ప్రజాభివృద్ధిగాలఁది దేశవైశాల్యము సరిపడనందున, వాఁడాస్థలమును విడిచిపెట్టును ఇట్టిసంగతిలో మనుజుని ప్రాచీననివాస మేదియో మనము చెప్పలేము. పదుగుపేకలసంయోగమువలె, మానవజాతుల సంయోగము వాటిల్లెను.

పదునాల్గవ అధ్యాయము.

మనుజుని అభివృద్ధి.

అనేకకోటిసంవత్సరములు గతించెను, కాల మొకరీతిఁ గడవలేదు. అగ్నిని గుర్తెఱుంగనివాఁడు దానిని జ్వలింపఁ జేయఁ గలిగెను.

"శ్లో. సప్తహస్తశ్చతుశ్శృంగః సప్తజిహ్వోద్విశీర్షకః,
త్రిపాత్ప్రసన్నవదన స్సుఖాసీన శ్శుచిస్మితః.
స్వాహాం తు దక్షిణేపార్శ్వే దేవిం వామేస్వధాం తథా,
బిభ్రద్దక్షిణ హస్తైస్తు శక్తి మన్నం స్రుచం స్రువం.
తోమరం వ్యజనం వామై ర్ఘృతపాత్రం తు ధారయన్,
మేషారూఢం జటాబద్ధం గౌరవర్ణం మహౌజసం.
ధూమధ్వజం లోహితాక్షం సప్తార్చి స్సర్వకామదం,
ఆత్మాభిముఖ మాసీన మేనం ధ్యాయే ద్ధుతాశనం.

అని అగ్నిని ధ్యానించును.

"ఆత్మావై పుత్రనామాసి సజీవశరదశ్శతం,
అశ్మాభవపరశుర్భవ హిరణ్య మస్తృతం భవ."

అని కుమారునికి నామకరణముఁ జేయుచుండును.

"అపాం త్వౌషధీనాగ్ం రసం ప్రాశయామి శివాస్తాఅప ఓషధయ స్సంతు"

అని కుమారునకు అన్నప్రాశనముఁ జేయును.

"స్యోనా పృథివీ భవా నృక్షరా నివేశనీ యచ్ఛానశ్శర్మ సప్రథాః"

అని గృహనిర్మాణముఁ జేయును.

శ్లో. "ఉపాయనాగ్నౌ కృతకా చ బాలం కౌపీనవస్త్రేణ సుబద్ధకక్షం,
ఆచార్య ఆచాంత ఉపస్థితాంతం వామేతరస్థం కృపయా చ శిష్యం.
కృష్ణాజినం దర్భమయీ చ మౌంజీ పాలాశదండః పరిధానశాటీ,
యజ్ఞోపవీతానిదిశంతు తాని వటోశ్చిరాయుశ్శుభకీర్తివిద్యాః"
అని చెప్పి కుమారునకు ఉపనయనముఁ జేయును.

శ్లో. "కన్యాం కనకసంపన్నాం కనకాభరణభూషితాం,
దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోకజిగీషయా.
కన్యాం సాలంకృతాం సాధ్వీం సుశీలాయ సుధీమతే,
ప్రయతోఽహం ప్రయచ్ఛామి ధర్మకామార్థసిద్ధయే"
అని చెప్పి కుమారునకు వివాహముఁ జేయును.

"అథాతో బ్రహ్మజిజ్ఞాసా" "అథాతో ధర్మజిజ్ఞాసా" "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" "స్వాధ్యాయాన్న ప్రమదితవ్యం"
అని పూర్వోత్తరమీమాంసలఁ జదివి వేదాధ్యయనముఁ జేయును. సరససంగీత సాహిత్యకావ్యనాటకాలంకారశాస్త్రములలోఁ బ్రవేశముఁ గనెను. త్రివిధోపాయములను, చతుర్వేదములను, పంచతంత్రములను, షట్శాస్త్రములను "ఇది నేర్తు నది నేర్తు"నని చెప్పనేల? సమస్తమును నేర్చెను, ఇంకను నేర్చుకొనును

"ఇంతింతై వటుఁడింతయై మఱియుఁదానింతై నభోవీథిపై"
అని చెప్పినవిధమున నానాటి కానాఁడుపొంగుచు, అధోలోకముల నధిగమించి, ఊర్ధ్వలోకముల కూర్ధ్వమై, ఏకకాలమున పదునాలుగులోకముల నవలోకించుచు, వానిబుద్ధి విజృంభించెను. వాఁడునాగరికుఁడా? అనాగరికుఁడా? అదివింతయైనది, నాణెమైనది, చోద్యమైనది. కనుకనే, దానికి నాగరిక మని పేరువచ్చెను.

"ఏమి సెప్పుదుం గురునాథా?"

పదునైదవ అధ్యాయము.

ప్రజాక్షయము.

ఇంతవఱకును మనుజుని శైశవదశను గుఱించి చెప్పితిమి. సృష్టిస్థితులు ప్రతిపదార్థమునకు స్వాభావికములు. ప్రాచీనపాషాణయుగము మొదలు నేటి వఱకును గలకాలములో మనుజుఁడు పుట్టిపెరిగి శైశవబాల్యదశలఁ గడిపి ప్రస్తుతము యౌవనదశలో నుండెను. ఏవిధమునఁజూచినను వాఁడభివృద్ధి నొందుచుండెను గాని క్షీణించుట లేదు పూర్వులవిధానముల ననుసరించి, వాని నభివృద్ధిఁజేసి తనసంతతివారికి నిదర్శనీయుఁ డగుచుండెను.

మనుజునిచరిత్రము నేటివఱకును నిరంతరముగఁ బ్రవహించుకొని వచ్చినను, దానిలోఁ గొన్నియంశములు భేదముఁ బుట్టించును, వానిని మనము లక్ష్యములో నుంచుకొనవలెను. ప్రాచీనయుగములలో ననేకదేశీయులు పుట్టిపెరిగి బలవంతులై, ఆచంద్రార్కము భూమిమీఁద నిలువఁబడియుండఁగగినమహా రాజ్యములను స్థాపించి కాలక్రమమున నశించిరి. అని లిఖితపూర్వకమగు చరిత్రములవలనను ప్రాచీనశిథిలములవలనను మనకుఁ దెలియుచున్నది.

> “కారే రాజులు రాజ్యము ల్గలుగవే గర్వోన్నతిం బొందరే
> వారేరీ సిరిమూటఁ గట్టుకొనిపోవం జాలిరే?” భూమిపై
> పేరైనంగలరే...”

అని చెప్పినవిధమున రాజ్యములనేకములు లేచి నీల్గి విజృంభించి అస్తమించెను. అనంతమగు కాలావళిగుండ జ్ఞానమను దూరదర్శినిని బెట్టిచూచిన నామహారాజ్యములయొక్క సంపద్వైభవముల గుర్తెఱుఁగ నగును.

మనుజుఁడు పాపుఁడు, పాపకర్ముఁడు, పాపాత్ముఁడు, పాపసంభవుఁడు. ఎందుచేత? భగవంతుని ఆజ్ఞోల్లంఘన చేయుటయె పాపమునకుఁ గారణము. శైవులయినను, వైష్ణవులయినను, అద్వైతులయినను, క్రైస్తువులయినను, మహమ్మదీయులయినను, బౌద్ధులయినను—ఎవరైనను, అందఱికిని జ్ఞానకర్మేంద్రియములు సరిసమానములు—అందఱికిని బుద్ధి యొక్కరీతిగఁ బ్రసరింపదు, నిర్గుణబ్రహ్మోపాసకు లగుటకుఁ దగినపరికరము లందఱికిని లేవు.

ఈ పటముఁ జూడుము ఇది యొకవలయము, దాని మధ్యనుండి దాని హద్దువఱకును రేఖలు కలవు, ఆరేఖలన్నియు సరిసమానములు—ఈహద్దునుండి, యేరేఖలఁబట్టి గమనించినను, మనమామధ్యభాగమునకుఁ బోఁగలము. ఒకరేఖ ననుసరించి నీవు పోవుచున్నావు నేను మఱియొకరేఖ వెంబడిని పోవుచున్నాను, మూఁడవవాఁడు మూఁడవరేఖ మార్గమున నడుచును, అయినప్పటికి, మనమందఱము ఆమధ్యభాగమువద్దఁ గలియుచున్నాము కోరికయుండినను లేకపోయినను, మనమచ్చటఁ గలియుట నిజము—అట్టిస్థితిలో నీమార్గమున నేనును, నామార్గమున నీవును గమనించుట లేదని మనమిరువురము కలహించుట మేలా? మన మేకోదరులము—ఏమార్గమైన నేమి? శంకరుఁడు, ఆనందుఁడు, రామానుజుఁడు, క్రైస్తువు, మహమ్మదు, బౌద్ధుఁడు—వీరిలో నెవరిమార్గమున నవలంబించిన నేమి?



శ్లో. "నమో స్త్వనంతాయ సహస్రమూర్తయే సహస్రపాదాక్షిశిరో
రుబాహవే, సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే సహస్రకోటియుగ
ధారిణే నమః. ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరం,
సర్వదేవనమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి"—

మతసహనము లేక మనుజు లొకరినొకరు పీడించుకొనిరి; ఈకారణమున నేకదేశీయు[illegible]ాపను మానిపోయెను.

ఎన్నిశాస్త్రములను మనుజుఁడు చదివిన నేమి? అష్టదిక్కులను జయించిన నేమి? కుబేరునివలె ధనధాన్యములతోఁ దులఁదూగిన నేమి? నూఱుగజముల బలము గలిగియుండిన నేమి? భూతదయలేని యెడల, మనుజుఁడు ద్విపాద పశువు. ప్రజానాశనమున కనేక కారణములు కలవు. అందులో నిదియొకటి.

శ్లో. "ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తేషూపజాయతే,
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే.
క్రోధాద్భవతి సంమోహస్సంమోహాత్ స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి."

అని చెప్పినవిధమున, మనుజుఁడు విషయములను లోఁబడినయెడల, భ్రష్టుఁ డగుటయే కాక, వానిమూలమున నితరులు సహితము నశింతురు. తెలిసియో తెలియకయో మనుజుఁడు పాపకృత్యముఁ జేసిన, రాజు వానిని శిక్షించును. లేక క్షమించును, కాని భగవంతుఁ డటుల కాదు, ఏవిధమైన తప్పుఁ జేసినను వాఁడు శిక్షకర్తృఁడు. ఒకచిన్న బాలుఁడు తెలియక దీపములో వ్రేలుఁ బెట్టినయెడల, "ఓబిడ్డా, నీవు తెలియక వ్రేలుఁ బెట్టితివి, కనుక నిన్ను నేమిరకను." అని దీపము బాలునితోఁ జెప్పునా? ప్రకృతి ధర్మముల నుల్లంఘించినవానికి శిక్ష తప్పునా? మనుజుఁడు సాంఘికుఁడు కనుక, వాఁడు చేసిన పాపమునకు వాఁడే కాదు, ఆసంఘమువారును, ఆదేశీయులును, ఆపాపఫలము ననుభవింతురు. అందుచేతి ననేకదేశీయులును వారి మహారాజ్యములు నంతరించెను; వారినాగరికత వారితో నశించెను.

అటులఁ జెప్పుటవలనఁ బ్రపంచమున కేమి నష్టము సంభవించెనా? "గతించినరోజులకంటె రాఁబోవురోజులు మంచివి కావు" అని పెద్దలు చెప్పుదురు; కాని, ఆమాటను విశ్వసింపకుము. అంతకంతకు లోకమభివృద్ధి నొందుచున్నది; కాని క్షీణదశలో లేదు. కృతయుగమువంటి రోజులు గతించె నని దుఃఖించెదరు. ఆకృతయుగములో తంతివార్తలు కలవా? ఇనుపదారులును,

పొగయోడలును, ఆకాశవిమానములును, విద్యుద్దీపములును రాంగెనుకిరణములును—వీని నెవరు గుర్తెఱింగి యుండిరి? భూతకాలమున కంటె వర్తమానము శ్రేష్ఠము. ఏకాలమునకు ఆకాలమేకాని మఱియొక కాలము సమానము కాదు. ఆకాలములో మనుజులశక్తికొలఁది వ్యవహారములు జరిగెను; ఈకాలములో మనశక్తికొలఁది పనులను నెఱవేర్చుచున్నాము.

ఆద్యంతములు మనుజుని అవగాహనకుఁ జిక్కవు. ప్రస్తుతము వాఁడొకపనిఁ జేయును, దానివలన నష్టము కలుగును; వాఁడందుకు విచారింపనలదు. ఉత్తరోత్తరము దానివలన వానికి లాభము వచ్చును. పనులయొక్క లాభాలాభములను భగవంతుఁడు విచారణఁ జేయును; ఆపనిని మనుజుఁడు చేయలేడు ఒకటిమాత్రము నిజము. దేహబలమును బుద్ధిబలమును, ధనబలమును వాఁడు కలిగియుండవలెను వీనిలో నేది లేకపోయినను, వాఁడు నశించును. ఈ మూఁడుబలములు కలిగియుండినంతవఱకు దేశీయులును వారిరాజ్యములును విజృంభించెను, ఈత్రిశక్తుల నాశనము వారివినాశమునకుఁ గారణ మయ్యెను.

భగవంతునిచర్య లత్యద్భుతములు, తలఁచినకొలఁది వినోదకరములు

శ్లో॥ "తస్మై నమః పరేశాయ బ్రహ్మణే ఽనంతశక్తయే,
అరూపా యోరురూపాయ నమ ఆశ్చర్యకర్మణే."

పదునాఱవ అధ్యాయము.

మతము.

"ఓం తద్బ్రహ్మ, ఓం తద్వాయుః, ఓం తదాత్మా, ఓం తత్సత్యం, ఓం ఓం తత్సర్వం, తత్పురోన్నమః" అని వేదవాక్యము కలదు; ఆ "తత్" పదార్థమే

బ్రహ్మయు, వాయువును, ఆత్మయు, సర్వము నగుచున్నది. ఆపదార్థ మొకటి గాని రెండుకాదు. పిపీలికాది బ్రహ్మపర్యంతము గలజీవరాసులకును పదునాలుగు లోకములకును సృష్టికర్త యొకఁడను జ్ఞానము కలుగునప్పటికి యెంతకాలము పట్టెనోకదా! భగవంతుఁ డొకఁడనుజ్ఞానము మనుజునకు మొదటలేదని మనము యాథిగఁ జెప్పగలము. ఈజ్ఞానము కలుగునంతలో వాఁడేయేమార్గములలో సంచరించెనో వివరించెదము. ఒక్కొక్కసోపానము నెక్కుచు మనుజుఁడు మీఁదియంతస్తులలోనికిఁ బోవును; అటులనె అనేకములును భిన్నములు నగుమార్గములఁ ద్రొక్కి, తుదకు వానికి భగవంతుఁ డొకఁడనుజ్ఞానము వచ్చెను. భగవంతునివిషయమై మనుజునిబుద్ధి యెంతస్వచ్ఛమై యుండునో, వాని జీవనము కూడ నంతనిష్కళంకమై యుండును.

ఒకతండ్రికిఁ బలువురు కుమారులు కలరు, వారిలో నొకని దండ్రి ప్రేమించును, తదితరులఁ బోషింపక నిరాకరించి వనములకుఁ బంపును. అచ్చట వారు నిద్రాహారములు లేక దుఃఖించి లోకాంతరగతులగుదురు అప్పుడు తండ్రి దుర్మార్గుఁడని ముద్దుకుమారునకుఁ దోఁచకయుండునా? ఆవిధముననే భగవంతుడు కూడ ప్రవర్తించునని కొందఱిమతము. సమస్తజంతువులకు వారి ప్రసక్తిలేకయే జగత్కర్త ప్రాణముఁ బోసెను; అట్టిప్రభువు కొందఱిఁ బ్రేమించి యాదరించు ననియు, మఱికొందఱిని నిరాదరణతోఁ జూచుననియు, పామరులు శంకించెదరు. జగత్తులకుఁ దండ్రియైనవానితో నిహలోకములో నేతండ్రులు సమానులగుదురు? జగద్రక్షకుఁడైన మనతండ్రి శాంతుఁడును, దయాళుఁడును, కరుణాసముద్రుఁడు—ఆయనకు సమానులు లేరు. అందఱికిని సమీపమున నున్నవాఁడు. చరాచరజంతుజాలములకుఁ బ్రాణముఁ బోసినప్రభువు నేఁడుకాదు, పూర్వయుగములలోఁ గూడ నందఱి సమీపముననే యుండెను. ఈసంగతి మనకుఁ దెలియును. పూర్వయుగములవారికిఁ దెలియదు. మనుజులను తప్పుమార్గమునఁ బెట్టుమని భగవంతుఁ డేభూతమునకుఁ జెప్పలేదు. అంధకార మందఱికిని శోఁతఁ బుట్టించును—అజ్ఞానాంధకారమునుండి వెడలి, జ్ఞానారుణోదయకాల

మునకు నచ్చి, జ్ఞానోదయ మగునంతలో మనుజుఁడు బహుమార్గములను గుర్తెఱుఁగక వెఱ్ఱివేషములను వేసెను. అవి యన్నియు వానికిఁ దోఁచినవియే గాని భూతములు చెప్పినవి కావు.

ఎటువైపుఁ జూచిన చరాచరజంతుజాలముతోఁ గూడినప్రకృతి సంపదలు కనఁబడుచున్నవి, కాలమరణమును అకాలమరణము నొందినవారిని గుఱించి దుఃఖించు తలిదండ్రులును, సోదరులును, భార్యలును, స్నేహితులును గలరు. పరులను మోసపుచ్చవలెననియెంచి వెఱ్ఱిమొఱ్ఱియాలోచనఁ జేసి మనుజుఁడెవఁడైన వీనికిఁ జెప్పియుండునని మాత్రము మీరుతలంపకూడదు — మనుజుఁడు మొదట వానికిఁదోఁచినవిధమునను, వానియనుభవము ననుసరించియు వ్రాసెను గాని, తదితరులఁ దప్పుమార్గమునఁ బెట్టవలెనని వ్రాయలేదు. కనుక మనము వానిని దూషింపను భూషింపను రాదు. ఇంతయేల? పటాశ్చాత్యశాస్త్రవేత్తలమని విఱ్ఱవీగుచుండి మనము "ఇదమిత్థ" మని నిశ్చయముగఁ జెప్పగలమా? ఈనాటికి మనకుఁ దోఁచినవిధమున మనము చెప్పుచున్నాము. ఒకటిమాత్రము సత్యము. అవాఙ్మనసగోచరుఁడైన బ్రహ్మమును గుఱించి చెప్పఁబూనుట తెలివితక్కువగాని మఱియొకటి కాదు. అపరిమితమైన బ్రహ్మమును పరిమితమైనబుద్ధిచేత గ్రహింపఁగలుగుదుమని ప్రగల్భములు పలుకుట పాపము శాస్త్రములన్నియు మనుజునిసూక్ష్మబుద్ధిని ప్రకటించును. అంతియ కాని, దేహమును విడిచిన "అహం" అనువాని కేమి సంభవించునో చెప్పలేము.

కొంతకాలమునకు మనుజుఁడు సోపానముల నెక్కి వచ్చినతరువాత నతని బుద్ధి వికసింప నారంభించెను. మొదటను వాఁడు నిద్రాహారములతోఁ దృప్తి నొందెను; ఈనాటికి వానితో వాఁడు తృప్తి నొందక విచారించెను. ఈలోకములో నిద్రాహారసంగములకు మనుజుఁడు జీవించుటకాదని వానికిఁ దోఁచెను. ఈవిచారణచేత వానిబుద్ధి వికసింపఁ జొచ్చెను.

ఎటువైపుఁ జూచిన నిలువఁబడియుండిన పర్వతములును లోయలును, ఆకుపచ్చనిరంగులతోఁ గూడిన పర్వతశ్రేణులును వాని "ఉపత్యక-అధిత్యక" భూములును, చెట్లు చేమలు లేని యెడారి ప్రదేశములును, ఫలవంతము లగువృక్షములును, పుష్పజాతులును, ఒయ్యారపునడకలతో వచ్చు మనుజులును, నక్షత్రమండలమున కెగురుపక్షులును, గంతులు వేయు లేడిని; ఠీవిగ నడచుమృగరాజును; అరుణోదయసూర్యోదయములును, సూర్యాస్తమయములును, షడృతువులును; అంతరిక్షమునఁ బవనప్రేరితములైన నీలజీమూత సంఘములును; శుక్లకృష్ణపక్షముల చంద్రమండలమును, తారావళియును, ఇంద్రధనుస్సును—ఈ మొదలుగాఁగలవానిని మనుజుఁడు పూర్వము చూచెను. నేఁడుచూచుచుండెను. ముందుకుఁ జూడఁగలండు.

ప్రకృతిలో ననేకశబ్దములను వాఁడు వినుచుండును; నదులు ప్రవహించునపుడును, వాయువు ప్రసరించునపుడును, మేఘములుగర్జించినపుడును, వర్షముకురియునపుడును—తదితరసమయములలోఁ గూడ ననేకశబ్దములు—కొన్ని మధురమయినవియు, మఱికొన్ని కఠినమయినవియు—వానికి వినఁబడును. "ఈప్రకృతిలోఁ గనబడనివాని యర్థమేమి? నేనెవరు? నేనిచ్చట నుంటిని? ఎచ్చటనుండి వచ్చితిని! ఎచ్చటకు వెళ్లఁగలను? ఏమిచేయవలెను! ఈచూడఁబడుచున్నవన్నియు నెచ్చటనుండి వచ్చెను?" అని వానిలో వాఁడు వితర్కించును. పదార్థములఁ జూచి ప్రథమమున మనుజున కాశ్చర్యము కలిగెను, క్రమముగ వానిబుద్ధివికసింప, పదార్థముల జ్ఞానము కలిగినతరువాత వానికిఁ గారణమేమో తెలిసికొన ప్రయత్నించెను. ఎటువైపుఁ జూచినను ప్రకృతి సంపదలతో నిండియుండెను. అంతకంటె గొప్పది మఱియొకటిలేదు: కానరాదు.

నేఁడు మనము కనిపెట్టినవిధమున వాఁడుకూడ మనుజుఁడు వీనికిఁ గారణముఁ గనిపెట్టియుండు నని మనము తలఁపరాదు. తనయాలోచనలను మనవలె సరసవచనములఁ జెప్పలేకపోయినను, వానికి బుద్ధియుండెను. తనయిష్టానుసారము

పనిఁజేయుటయు లేక యూరకుండుటయు, నిలుచుటయు లేక నడచుటయు, అనిష్టముకూడఁ గొన్ని కారణముల కనుగుణముగ నుండుటయు వానికిఁ దెలియును. ఏదియో మనుజుని లోపలినుండి వీనిని నాశించుచున్నది. ప్రకృతియు స్థిరముగ నుండక చలించుచున్నది నదులు ప్రవహించుచున్నవి. మేఘములు పరుగిడుచుండెను. పత్రములు చలించుచున్నవి. భూమి కంపించును ? సూర్యచంద్రాది గ్రహములును నక్షత్రమండలములును గమనించుచున్నవి. ఏదియో వానిలోనుండి వానినిఁ జలింపఁ జేయుచున్నది.

ఈవిధమున సమస్తపదార్థములలో నేదియో నివసించియుండు ననియు, అది భూతమనియు, ఆభూతమె వానినిఁ జలింపఁ జేయుననియు, మనుజునిబుద్ధికిఁ దోఁచెను. మేఘగర్జనమిని, ఇంద్రుని రథచక్రముల ధ్వనియని చెప్పుచున్నాము; పిడుగు పడిన యెడల మనుజుఁడు చనిపోవును; దానిని అర్జునుఁడు పట్టుకొని తనపేరు చదివినవారిమీఁదఁ బడకూడదని దానిని శాసించెనని చెప్పి "అర్జునః ఫల్గునఃపార్థః కిరీటీ శ్వేతవాహనః । భీభత్సు ర్విజయః కృష్ణస్సవ్యసాచీ ధనంజయః॥" అని శ్లోకముఁ జదువుదుము. మెఱపుఁజూచి ఇంద్రుఁడు తనవజ్రాయుధమును జళిపించుచున్నాఁడని వదరుచున్నాము. అగ్నిహోత్రునకు "ధూమధ్వజుఁడు, ద్విశీర్షవదనుఁడు" అని పేరుకలదు. ఇటువంటి పిచ్చినామములఁ బెట్టినవా రెటువంటివారై యుందురు? పదార్థములయొక్క గుణములంబట్టి వానికి నామములం బెట్టిరి. వస్తువుయొక్క గుణమును గ్రహించినతరువాత మనుజుఁడు దానికిఁ బేరుఁ బెట్టును. ఆగుణమే దానికిఁ బేరై యుండును? ప్రస్తుత మాగుణమును మరచితిమి, ప్రతిశబ్దముయొక్క వ్యుత్పత్తులంబట్టి, దానిగూఢార్థముఁ దెలిసికొనవచ్చును.

ఒక్కొక్క దానినిగురించి పురాణకథలఁ జెప్పుచున్నారు. నీటిలోనుండి భూమిపైకివచ్చెను. ఆదివరాహము భూమిని పైకియెత్తెనని కథకలదు. అటులనే సూర్యచంద్రాదులకుఁ గథలు కలవు. "పద్మినీ చ్ఛాయాసమేత శ్రీసూర్యనారాయణపరబ్రహ్మణే నమః" అని చెప్పుచున్నాము. సూర్యునకు "పద్మిని-ఛాయ"

అను నిరువురు భార్యలు కలరు సూర్యోదయమున భర్తరాకకు "పద్మిని" వికసించును; అస్తమయమున వియోగము చేత నామె దుఃఖించి ముఖమును ముకుళించుకొనును. "ఛాయ" సదా భర్త ననుసరించి యుండును; ఆమెకు వియోగ దుఃఖములేదు మఱియొక కథ కలదు. దక్ష ప్రజాపతికి ఇరువదియేడ్గురు కుమార్తెలు కలరు. అతఁడు వారిని చంద్రునకిచ్చి వివాహముఁజేసెను. ఆభార్యలలో "రోహిణి" యం దతనికి మక్కువ విశేషము, అందుచేతనితరలైన చెల్లెండ్రు దుఃఖించి తండ్రితో మొఱపెట్టుకొని నందున, నతఁడుచంద్రుని శపించెను, కనుక, చంద్రునకు వృద్ధిక్షయములు కలుగుచున్నవి. ఒక్కొక్క నక్షత్రమునం దొక్కొక్కరోజు చందురుఁడుండును; రోహిణీనక్షత్రమునందు చంద్రుఁడు విశేషకాంతి గలిగియుండును, ప్రథమమున మనుజునకు శాస్త్రజ్ఞానము లేకపోవుటచేతఁ బ్రకృతిధర్మములకు వాఁడీపిచ్చికథలఁ గల్పించెను. ఈవిధముననే గ్రహణములగుఱించి కథలు కలవు. పూర్వము రాక్షసులును దేవతలును క్షీరసాగరమును మథించినపుడు అమృతము పుట్టెను; రాక్షసులును దేవతలును రెండుపంక్తులు తీరి కూర్చుండ విష్ణువు మోహినీవేషముఁ దాల్చివచ్చి, తనచేతితో నమృతకలశముఁబట్టుకొని దానిని పంచిపెట్టుచుండెను. అప్పుడు రాక్షసుఁడొకఁడు దేవతలపంక్తిలోఁ గూర్చుండి అమృతముఁ బుచ్చుకొనెను. ఆసంగతి సూర్యచంద్రులుకనిపెట్టి, వానిని విష్ణువుకుఁ జూపించిరి. అతఁడు కోపగించి చక్రముఁ బ్రయోగించి వానిఁ జంపెను; కాని వానికి మరణములేదు. కార్పణ్యముచేతఁ బర్వదినములలో వాఁడు సూర్యచంద్రులను మ్రింగుచుండును. ఆసమయముల మనవారు పునశ్చర్యలఁ జేయుదురు. గ్రహణముల గుఱించి మనకు నేఁడుస్పష్టముగఁ దెలియును. మహాభూతములు సూర్యచంద్రులను మ్రింగునని తలంచి చీనాదేశవాసులు గ్రహణకాలమున వాద్యములను వాయించెదరు. వేఁటకుక్కలు గ్రహణకాలమునఁ జంద్రునిఁ గఱచుటచేత నాబింబమునుండి రక్తము ప్రవహించునని అమెరికాఖండములోనుండు ఇండియనులు తలంచెదరు.

అజ్ఞానముచేత భయము కలుగును; జ్ఞానోదయముచేత నది నశించును. అజ్ఞానోదయము కలుగుట యెట్లు? ఎంతకాలము పరిశ్రమఁ జేసి, గురువుల నాశ్రయించి, శ్రమఁబడినగాని జ్ఞానోదయ మగునా? ఒకానొకప్పుడు శాస్త్రజ్ఞానముకలిగినమనము సహితము పిచ్చిపనులఁ జేయుదుము; అజ్ఞానులంచేసి రనిన వింతయేల? అనేకవిషయములను గురించి నిర్మలమగుజ్ఞానము కలుగు నప్పటికి విశేషకాలము గతించెను.

నక్షత్రముల గురించి చిత్రమగుకథ కలదు. సూర్యచంద్రు లిరువు రును స్త్రీలు. నక్షత్రములన్నియు చంద్రునిపిల్లలు. చంద్రునితో సమానముగ సూర్యునకుఁ గూడ పిల్లలు కలరు. ఇన్నినక్షత్రములకాంతిని మానవులు భరించ లేరని తలఁచి, సూర్యచంద్రు లిరువురు తమతమపిల్లలను తినివేయుటకు నిశ్చ యించుకొనిరి, చంద్రుఁడు తనపిల్లలను దాచిపెట్టెను. కాని, మాట ప్రకారము సూర్యుఁడుతనపిల్లలఁ దినివేసెను. అప్పుడు చంద్రుఁడు తనపిల్లలఁ దీసికొని వచ్చెను. అప్పుడు సూర్యుఁడుకోపగించి, చంద్రునివెంటఁ దఱుమనారంభిం చెను. సూర్యోదయమున నక్షత్రములకాంతి తగ్గును; సాయంసమయమున చం ద్రుఁడు నక్షత్రములతోఁ బ్రకాశించును. నక్షత్రములన్నియు చంద్రునిభార్య లని మనము నమ్ముచున్నాము. ధ్రువమండలము గురించి కథయొకటి కలదు. "ఉత్తానపాద" రాజుయొక్క కుమారుఁడు తపస్సుఁజేసి భగవంతునికటా క్షమువలన మహోచ్చపదవిఁ బొందెను.

మనుజులసుఖదుఃఖములకు గ్రహములు కారణములని యొకపిచ్చి యూహ కలదు. అందుచేత గ్రహసంచారమునకు గ్రహచారమని పేరువచ్చెను. "సర్వగ్రహాః కృపయేకాదశస్థానఫలావాప్తి రస్తు" అని బ్రాహ్మణులు చెప్పుచున్నారు. గ్రహములు ఉచ్చనీచస్థితులం బట్టి మనుజులస్థితిగతులు నడు చునని చెప్పుచున్నారు. ఎంత పిచ్చిభ్రమ! చీఁకటిలోఁ బడి మార్గముఁ దెలియక మనుజుఁ డీ పిచ్చియాలోచనలఁ జేసెను.

వర్షాకాలములో నంతరిక్షమున రంగుధనుస్సుఁ జూచిన, నది ఇంద్రుని ధనస్సుఅని చెప్పుచున్నాము. ఉఱుము దేవేంద్రుని రథచక్రములధ్వని, అనియు, మెఱుపు అతని వజ్రాయుధము కాంతి అనియు నమ్ముచున్నాము. భూమిని ధరించుచున్నశేషువు కదలినపుడు భూమి కంపించును. అత్యద్భుతములగు ప్రకృతిధర్మములఁ జూచి, మనుజుఁడు భ్రమించి వానిసంగతి తెలియనందున భయపడి, భూతపిశాచరాక్షసగణములఁ గల్పించెను. వానికిఁ గోపము వచ్చిన నవి మనుజులఁ బీడించునని తలఁచి బలులను ఉపహారములను కానుకల నిచ్చి వానికి నుపశాంతిఁ జేయుదురు. మనుజునకు మతిభ్రమణము కలిగిన యెడల వానికిఁ బిశాచము సోకినదని తలఁచి, వానికి రక్షరేకులఁ గట్టెదరు. ఈపిచ్చియాలోచనల కాద్యంతములు లేవు; పండితపామరులు వీనిఁ జూచి ఆమోదింతురు. శాస్త్రజ్ఞానము కలిగినకొలఁది, వీనిపట్టు విడిపోవును.

ప్రాకృతపదార్థము లన్నియు చంచలముగ నుండుటచేత, వానిలో నొకభూతము నివసించియుండు ననియు, ఆభూతము చెట్లను, మేఘములను, మృగములను చలింపఁజేయు ననియు మనుజుఁడు తలఁచెను. బ్రతికియుండినవానికిని మృతినొందిన వానికిని భేదమేమి? జీవించియుండినవానికి ఉచ్ఛ్వాస నిశ్వాసములు కలవు, అవిలేకపోయిన, మనుజుఁడు చనిపోయెనని చెప్పుదుము. ప్రాణములు అయిదు.

శ్లో. "హృది ప్రాణో గుదేఽపాన స్సమానో నాభిసంస్థితః,
ఉదానః కంఠదేశస్థో వ్యానస్సర్వశరీరగః." ఇత్యమరః.

అయినను మఱియొకవిశేషము కలదు. మాతృగర్భములో నుండినశిశువునకు ఉచ్ఛ్వాసనిశ్వాసములు లేవు; లేకపోయినను, ఆశిశువు జీవించియుండును. అటులనె ప్రాణాయామముఁ బట్టినమనుజుఁడు జీవించియుండును. అందుచేతఁ బ్రాణవాయువులకంటెఁ బలమగు "జీవము" కలదని మనుజుఁడు గుర్తెరిగెను. "జీవము"నకు "జీవాత్మ" అని పేరుకలదు. ఈ జీవునియొక్క రూపరేఖవిలాసములఁ జెప్పుటకు సాధ్యముకాదు. ఈజీవుఁడు స్వప్నములలో

సంచరించును; స్వప్నావస్థలోఁ జరిగినసంగతులన్నియు సత్యమని మనుజుఁడు తలంచును. అనాగరికులయిన సవరవాండ్రు కూడ నీవిధముననే తలంచుచున్నారు. స్వప్నములో మృతినొందినస్నేహితులను బంధువులఁ జూచిన మనుజుఁడు భయపడును. ఈమూలమున దయ్యములయందును పిశాచములయందును వానికి నమ్మకము కలిగెను. నిదురలో జీవుఁడు శరీరమును విడిచియుండునని తలంచి, నిద్రించువానిని, లేపించుట పాతకమని చెప్పుచున్నాము. జీవుఁడు నిదురలో శరీరమును విడిచి పోవుననియు జాగ్రత్తిలో లోనికివచ్చుననియు, మనుజుఁడు నమ్మి, ఉచ్ఛ్వాసనిశ్వాసములలో దయ్యములు దేహమును సోకుననియు వాని ప్రభావమువలన ఆవులింతలును తుమ్ములును కలుగునని తలంచెను. అందుచేత నొకఁడు తుమ్మినపుడు "చిరాయు రస్తు" అని దీవించుట కలదు. ఈ యాచారము దేశీయులందరిలోఁ గలదు; ఇది "జేకబు" కాలమునుండి వచ్చుచున్నది.

జీవుఁడు శరీరమునకుఁ బైగా సంచరించుటవలన మనుజునకు రోగము కలుగుననియు, పురోహితుఁడును లేక మంత్రశాస్త్రవేత్తయు చేయుప్రక్రియలచేత దేహములో జీవుఁడుకుదురుపడు నని మనుజుఁడు ఊహించెను, ఈపిచ్చిభ్రమలు వాఁడు అనాగరికదశలోనుండిన కాలము మొదలు నేఁడు నాగరికదశలోనికి వచ్చినప్పటికిని తగిలియున్నవి. వానియొక్క పూర్వోత్తరములను మఱచినను, "వానికిమతిపోయెను, వానికి స్మారకము తప్పెను, వానికి స్మారకమువచ్చెను" అనుమొదలగు వాక్యముల నుపయోగించుచున్నాము. అంగవైకల్యము కలిగిన యొడలజీవునకుఁ గూడఁగలుగునని భ్రమకలదు. శాశ్వతముగ శరీరమును జీవుఁడు విడిచిపెట్టి ఇహలోకములో ననుభవించిన పదార్థములఁ బరలోకములో ననుభవించుట కభిలషించునని తలఁచి, మృతినొందిన వాని భార్యలను సేవకులను బలవంతముగఁ జంపుచుండిరి. మృతినొందినవాని యుపయోగార్థము వస్త్రాలంకారములను వానికళేబరముతో సమాధిఁ జేయుట కలదు.

ఈనాడు హిందువులు శ్రాద్ధములఁ బెట్టునపుడు వస్త్రాలంకారములనిచ్చి బ్రాహ్మణులకు భోజనముఁ బెట్టుచున్నారు.

"పితృపితామహ ప్రపితామహాః అమీ వో గంధాః—ఇమాని పుష్పాణి అయంవో ధూపః—అయం వో జ్యోతిః—అంతః ప్రావరణార్థం బహిః ప్రావరణార్థం వః ఆచ్ఛాదనార్థం పవిత్రార్థమలంకరణార్థ మిదం వోవాసః—సువాసః—అని చెప్పుచున్నారు, పితృలోక మొకటి కలదని కల్పించినారు.

"నమో వః పితరో రసాయ నమో వః పితరశ్శుష్మాయ నమో వః పితరో జీవాయ నమో వః పితర స్స్వధాయై నమో వః పితరో మన్యవే నమో వః పితరో ఘోరాయ పితరో నమో వో య ఏతస్మిన్ లోకేస్థ యుష్మాగ్ స్తేను యేస్మిన్ లోకే మాంతేను య ఏతస్మిన్ లోకేస్థ యూయం తేషాం వసిష్ఠా భూయాస్త యే ఽస్మిన్ లోకే ఽహం తేషాం వసిష్ఠో భూయాసం"—అని చెప్పి పితృదేవతలకు నమస్కరింతురు.

ఈవిధమున నలువైపుల భూతములచేతను దయ్యములచేతను నావరింపఁబడి వానివలనఁ దనకు మేలుగాని కీడుగాని వాటిల్లునని తలంచి, వానిని శాంతింపఁజేయుటకు వాఁడు ప్రయత్నించెను, సంకటములు వానివలనఁ గలుగును. సంపదలకు వారు కారణములు, చీఁకటిగదులలో నవి నివసించును, గోరీలలోనుండి మృతినొందినవారు లేచి రాఁగలరు; బ్రతికి యుండినవారిని వారుపీడింతురు; ఈమొదలగు పిచ్చిభ్రమలు కలిగినందున మంత్రశాస్త్రమును వాఁడు కల్పించెను "త్వగస్థిగతై స్సర్వపాపైః ప్రముచ్యతే సర్వభూతే ష్వపరాజితో భవతి, తతో భూతప్రేతపిశాచబద్ధ బ్రహ్మరాక్షసయక్షయమదూతశాకినీఢాకినీసర్పశ్వాపదతస్కరజ్వరాద్యుపద్రవజో పఘాతా స్సర్వే జ్వలంతం పశ్యంతు మాగ్ రక్షంతు" అని మంత్రమును చదువుచున్నాఁడు. ఆహా! అజ్ఞానమువలన భయము కలిగెను; భయమువలన కర్మకాండ పుట్టెను.

ఈభూతప్రేతపిశాచములవలన భయము లేకుండుటకు రక్షరేకులను దండతాయెత్తులను వనమూలికలను వాఁడు ధరించును. భూతవైద్యులు వెడలిరి; మాంత్రికు లుద్భవిల్లిరి. మనోధైర్యము లేనిపిఱికిపందలభయముఁ బోఁగొట్టుటకు వీరు నడుముకట్టిరి. వీరు మంత్రముల నుచ్చరించి, పిశాచములను దయ్యములను భూతములను వెడలఁగొట్టెద మనిచెప్పి, వారివలన ధనమును స్వీకరింతురు; వీరు విభూతిఁ బెట్టెదరు, లేక రక్షరేకులఁ గట్టెదరు: లేక కుంకుమబొట్టుఁ దగిలించెదరు, లేక తీర్థము నిచ్చెదరు; అనేకమాయోపాయములఁ బన్ని, తమయందు నమ్మకమును కలిగించి యీతాంత్రికులు ప్రజలను భంగపఱచుచున్నారు. ఈతాంత్రికులును, మాంత్రికులును, భూతవైద్యులు నన్నిదేశములలోను అన్నికాలములలో నుండిరి. సాక్షియొకటింతకలదు. భగవంతునికటాక్షముచేత నొకస్త్రీ సంతానము లేకయుండిన యెడల, పిశాచము పట్టినందున నామె గర్భముధరించలే దని చెప్పి ఆమెకుఁ గొందరు రక్షరేకులఁ గట్టెదరు. కొందరు తీర్థము నిచ్చెదరు. కొందరు దండతాయెత్తులను బిగించెదరు.—ఆహా! ప్రకృతిధర్మములకు విరుద్ధమగు పనులఁ జేయుటవలన, నామె చూలింతరాలగునా! అగోచరమగు వానిని గుఱించి చెప్పుటకు నడుముకట్టుటయు, తెలియనిసంగతులగుఱించి తెలిసినట్లు నటించుటయు, ఈమనుజాలకు సహజము. ఈజన్మములో మనుజుఁడు కొన్నివిషయములను గ్రహించుటకు సమర్థత లేదు; గర్భోత్పత్తి, పరలోకము—వీనిని గుఱించి మనుజుఁ డేమిచెప్పఁగలడు? 'ఇద మిత్థ' మ్మని వచించుటకు వీలుపడదు.

ఈభూతప్రేతపిశాచములయందలి నమ్మకము నేటివఱకుఁ బ్రజలకుఁ గలదు, ఒకఁడు కడుపునొప్పిచేత బాధపడుచుండిన, వాని ప్రథమకళత్రము వానిఁబీడించుచుండె ననియు; ఒకస్త్రీయెల్లప్పుడు చీఁకటిగదిలోఁ గూర్చుండి రోదనముఁ జేసిన, అత్తగారివేదనఅనియు చెప్పి, వారికి ధూపము వేయుదురు లేక ఇత్తడిగరిటెఁ గాల్చి, చురకలను వేయుదురు. ముఖము వాడినయెడల పీడ

కొట్టైననియు, ఆవులింతలును తేన్పులును విశేషముగ వచ్చిన యెడల పిశాచ లక్షణమనియు, రాత్రినిద్రలో "ఓ" అని కేకలు వేసిన, దయ్యముపట్టె ననియు చెప్పుచున్నారు.

అజ్ఞానాంధకారములో సవరవాండ్రేకాదు మనముసహితము దేవులాడు చున్నాము. ఆకారణమున, దేవగణము మేలుఁజేయుననియు, రాక్షసగణము కీడుఁ జేయునని యూహించెదము. జీవాత్మయిట్టిది అని యారోజులకు మనకుఁ దెలియదు, ముందుకుఁ దెలియుగల దనునమ్మకము లేదు; ఆజీవుఁ డేవిధమున శరీరమును విడిచిపెట్టునో తెలియదు. పలువురు పలువిధముల వారిబుద్ధి కుశలతకొలఁది పలికిన సంగతులను విశ్వసింపరాదు. అణుస్వరూపములగు జీవము లనేకము లొకనీటిబిందువులోఁ గలవు; శరీరములోని నాళములయందుఁ బ్రవహించురక్తములోఁ గలవు; వానిని "సూక్ష్మదర్శిని" గుండ చూడ నగును; కాని, ఎంతసూక్ష్మమగు సూక్ష్మదర్శిని" గుండనైన, మనము జీవాత్మను చూడ లేము! దానిని మనవ్రేలుతో స్పర్శించలేము. భగవంతుఁడు మనకు మనో బుద్ధుల నిచ్చెను. వానివలన మన మనేకసంగతులఁ దెలిసికొనఁగలము; కాని, ఈజీవనదియొక్క ఆద్యంతములఁ గనిపెట్టఁజాలము. ఈశ్వరుఁడు మనకుఁ గొంచెము జ్ఞానము నిచ్చెను, విశేషముగ నిచ్చియుండినయెడల, దానియందు విలువ తగ్గును, అజ్ఞానము కొంచెము కనుక, దానిని అభివృద్ధిఁ జేయుచున్నా ము; ఎంతజేయుచుండినను, దానికి హద్దు కనఁబడదు. అందుచేత, "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అని వాక్యము కలదు. తరచినకొలది తేట బయలు వెడలును.

నలుప్రక్కలను తాను చూచిన ప్రకృతి ధర్మములను పదార్థముల నేవిధమున మనుజుఁడు గ్రహించెనో, దాని నింతవఱకు విశదపఱచినాము. ఏవిధ మున వానిని భావించెనో వ్రాయుచున్నాము. తనకంటె బలముగల దని తెలిసి కొని వానిని వాఁడు పూజించెను; వానికి నమస్కరించెను. సమస్తదేవతారాధ

నలలోను "నిర్జీవపదార్థారాధనము" కష్టము, ప్రథమమున దానిని వాఁడా రంభించెను. వానిలో నొకమహత్తుకలవని వానిభ్రమ. ఏపదార్థమైనను.—ఒక శిల యైనను, వృక్షమైనను,—ఏదియైన నేమి? దానివలన మేలు కలుఁగు ననియు లేక కీడునశించు ననియు, భ్రమించి దానిని వాఁడు పూజించెను, ఇంత యేల? మన మేమిచేయుచున్నాము? నర్మదానదిలో నుండి తీసికొని వచ్చినసాల గ్రామశిలలఁ బూజింతుము, బ్రహ్మాండ మగు దేవాలయములను వానినిమిత్తము కట్టించితిమి; వేపచెట్టుక్రింద నొకరాతిపలకఁ బెట్టి దానిని "శక్తి" అనిభావించి సేవింతుము. సవరవాండ్రు కూడ రాళ్లు మొదలగువానిని పూజించుచున్నారు. హృదయకోశము గట్టిపడునని తలంచి, "న్యూజీలాండు" ద్వీపవాసులు గులక రాళ్లను మ్రింగుదురు. శత్రువుయొక్క హృదయముగాని లేక తాను ప్రేమించు స్త్రీ యొక్క హృదయముగాని మెత్తపడునని భావించి, "దాలు" అను ప్రజలు కర్రపేడుముక్కలను మ్రింగుదురు. ధైర్యస్థైర్యములు గలబలవంతుఁడగు మనుజుని మాంసముఁ దినినయెడల భోక్తకూడ నటుల బలవంతుఁ డగునని యెంచి, నరమాంసముఁ దినుచున్నారు. లేడిమాంసము బుచ్చుకొనిన పిరికిపందలగుదురని యెంచి "బోర్నియో" ద్వీపవాసులు దానిని త్యజించిరి; పులిమాంసముఁ దినిన యెడల ధైర్యముకలుగు నని తలంచి, "మలే" ద్వీపవాసులు దానిని ఆరగింతురు. "టార్తరు" దేశములో వైద్యులు మందులులేనియెడల, మందులపేర్లను, కాగితముమీద వ్రాసి, వానిని నులిపి, రోగులచేత వానిని మ్రింగింపించుదురు. ఈపనులను వినినయెడల నవ్వుపుట్టును. లాభముకలుగు ననియెంచి ధ్యానశ్లోకములఁ బఠించుచున్నారము. శ్రద్ధాభక్తులు లేని ధ్యానము ఒక ధ్యానమా?

"నిర్జీవపదార్థారాధన"యు విగ్రహారాధనయు వేర్వేరని గ్రహింపవలెను. విగ్రహములఁ జేసి నిలువఁబెట్టి, వానిని భగవంతునిరూప మని తలంచి పూజించుచున్నారు, కాని, వానినే భగవంతుఁ డని ఆరాధించుటలేదు. ఆవిగ్రహములే పరమేశ్వరుఁ డని భావించి, మనుజులధ్యానములను, వినుననియు, వారు సమర్పించినకానుకల నందుకొనుననియు, వారిని దీవించునని లేకశపిం

చుననియూహించుట మౌర్ఖ్యము. ఈవిగ్రహము లనేక విధములు:—గడ్డిపూచలనుకట్టి దానికి బొట్టుఁబెట్టి కొలువవచ్చును, లేక రాతిపలకలకుఁ బసుపుఁబూసి వానిని కొలుచుట కలదు, లేక అవయవస్ఫూర్తి గల మహోన్నతవిగ్రహముల నారాధింపవచ్చును. దేవుఁడు త్రిశక్తియుతుఁడని భావించి, లేడినంటికాళ్లను అనేకచేతులను సింహపుశిరస్సును, పక్షిరెక్కలతోఁ గూడిన విగ్రహమును నిర్మించి, దానిని పూజించిరి. అన్నిదేశములలోను అన్నికాలములలోను నానాదేశీయులు నిర్మించి ఆరాధించినవిగ్రహములగుఱించి వ్రాసినచో, నది యొకసంపుటమగును. నేటివఱకుఁ గొన్నిదేశములలో విగ్రహారాధనఁ జేయుచుందురు, అనేకశతాబ్దములు గతించినగాని అదినిశ్శేషము కాదు

శ్లో. స వైనదేవాసురమర్త్యతిర్య
ఙ్నస్త్రీ న షండో న పుమా న్న జంతుః,
నాయం గుణః కర్మనసన్నచాస
న్నిషేధశేషో జయ తాదశేషః,

సోఽహం విశ్వసృజం విశ్వ మవిశ్వం విశ్వవేదసం,
విశ్వాత్మాన మజం బ్రహ్మప్రణతోఽస్మి పరంపదం.

అనేకశతాబ్దములు గతించినగాని నిర్గుణబ్రహ్మము యొక్క జ్ఞానము కలుగదు. అంతవఱకు విగ్రహారాధన నిలిచియుండును.

నిర్జీవపదార్థముల నారాధించుట విడిచిపెట్టి, సజీవపదార్థములఁ గొలుచుట కారంభించెను. మొదట మనుజుఁడు సర్పములను వృక్షములను సేవించెననికొందఱు చెప్పుచున్నారు; సూర్యచంద్రులను, నక్షత్రములను, అగ్నిహోత్రమును వాఁడు పూజించెనని మఱికొందరి మతము. ఏదియైనను నొకటిమాత్రము సత్యము; దేశకాలానుగుణ్యముగ మనుజుఁడనేకదేవతల నారాధించెను. ప్రథమమున సమీపమున నుండిన పదార్థములకు భయపడి వానిని సేవించి,

వానికంటె బలవంతములగు ప్రకృతిధర్మములయొక్క పూర్వోత్తరములు తెలియనందున, వానికి వెఱచివానిని వాఁడుపూజించెను. ఈవిధమున పంచభూతముల నారాధింపుటవెడలెను.

వానిలో జలదేవతారాధనము ప్రథమము. దానివలన జీవము నిలుచును అన్ని ప్రదేశములలో నది సమృద్ధిగ నుండును.

శ్లో. గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి,
నర్మదే సింధుకావేరి జలేఽస్మిన్ సన్నిధింకురు"

పుణ్యనదులు కలవు, పుష్కరిణులు, తీర్థములు మొదలగునవి మూర్తీభవించి, బ్రహ్మసభలో సుఖాసీనులై యుండునని భారతములోఁ జెప్పబడియున్నది. స్నానార్చనవిధిని వినవలెను:—

"గంగాం ప్రవిశ్యనాభిమాత్రజలే స్థిత్వాశిఖాం ద్విధా విధాయ నిరుద్ధకర్ణనాసస్త్రీన్వరా ప్లుత్యా ఆచమ్య" అని ప్రారంభముచేసి నీటిలో మునిగి లేచును. అటుతరువాత "హిరణ్యశృంగం వరుణం ప్రపద్యేతీర్థం మే, దేహియాచితః, యన్మయా భుక్తమసాధూనాం పాపేభ్యశ్చ ప్రతిగ్రహః, యన్మే మనసా వాచా కర్మణా వా దుష్కృతం కృతం, తన్న ఇంద్రో వరుణో బృహస్పతి స్సవితా చ పునంతుపునఃపునః" అని గంగను ప్రార్థించును. "ఇండో జెర్మానిక" కుటుంబమువారు పంచభూతముల నారాధించుచుండిరి.

సంవత్సరములోఁ గొంతవఱకు వాడియుండిన వృక్షములు వసంతకాలము వచ్చినతోడనే జీవకళలతో నిండును.

శ్లో. శ్రీమద్వసంతభవ దభ్యుదయే న వృక్షాః
కే నామ పత్రఫలపల్లవశాలిన స్స్యుః,

అని చెప్పినవిధమున సమస్తవృక్షములు చిగిరించి, పుష్పములతోను ఫలములతో వ్రేలాడుచుండును. వాయువు వీచినపుడు చెట్లుచలించును; అందుచేత వానిలో నొక భూతముకల దని వానిని వాఁడు పూజించెను. "అశ్వత్థ స్సర్వవృక్షాణాం" అని గీతావాక్యము కలదు. అది పవిత్రమగు వృక్షము; అది భగవంతునిస్వరూపము, అందుచేత దానిని హిందువులు పూజింతురు, దానికి ప్రదక్షిణములఁ జేయుదురు. తరుశైలపాషాణములను, నదులను, సరస్సులను గ్రీకులు మొదలగు ఆర్యకుటుంబమువారు పూజించిరి. "ఓకు" వృక్షము "కెల్టికు" ప్రజలకుఁ బవిత్రము, దానిఛాయలో వారిమతగురువులు "డ్రూయిడులు" దేవతార్చనలఁ జేసిరి.

"ఐరావతం గజేంద్రాణాం"
"ఉచ్చైశ్శ్రవ సమశ్వానాం"
"వైనతేయ శ్చ పక్షిణాం"
"మృగాణాం చ మృగేంద్రోఽహం"
"ధేనూనా మస్మి కామధుక్"
"సర్పాణా మస్మి వాసుకిః"
"అనంత శ్చాస్మి నాగానాం"
"ఝషాణాం మకర శ్చాస్మి"

అని గీతావాక్యములు కలవు; వీనిని హిందువులు పూజించుచున్నారు. తరుశైలపాషాణములకంటె మృగములును పక్షులును బలముఁగలవి; కనుక వాని యందు గొప్పమహాత్మ్యకలదను నమ్మకముచేత, వానిని వాఁడారాధించెను. నిద్రాహారసంగమములలో మనుజునితో నవి సమాన మగును, కాని, వానికంటె నవి బలవంతములు; క్రమముగ వానిని వాఁడు స్వాధీనముఁ జేసికొనిన తరువాత, వానిని పూజించుట విడిచిపెట్టెను. దేశకాలములఁబట్టి ఆయాజంతువులను వాఁడు పవిత్రము లని భావించెను. ఉత్తరదేశములవారు భల్లూకమును,

తోడేలును, దక్షిణదేశవాసులువ్యాఘ్రమును సింహమును మకరమును, మఱి కొందఱు వానరములను, పవిత్రములని యెంచి, వానిని సేవించు చుండిరి. కొంతకాలమునకుఁ బశ్వాదిమృగముల నారాధించుట విడిచిపెట్టి, అనేక కోటిదేవతలు కలరని భావించెను.

ఒక్కొక్కపదార్థ మొక్కొక్కదేవతగ భావించుట విడిచిపెట్టి, పదార్థములను సముదాయముఁజేసి, ఒక్కొక్కసముదాయమున కొక్కొక్క దేవత నధిపతిఁ జేసి, వానిని వాఁడారాధించెను. ఇంతవఱకు సావధానముగ నీచరిత్రము నవలోకించుచుండి రని మానమ్మకము. మనుజునకు జ్ఞాన మభివృద్ధి నొందినకొలఁది, త్రింశత్కోటిదేవతల నా రాధించుట విడిచిపెట్టి "ఏకోదేవః'. అను నమ్మకము వానికిఁ గలిగెను. ఆసంగతి నిచటఁ బొందుపఱచుచున్నారము'

సూర్యాస్తమయములకంటెను దివారాత్రములకంటెను వినోదమగు విషయములు కానరావు. ప్రథమమున అరుణోదయమును సూర్యోదయమును చూచి ఏవిధమున మనుజుఁ డానందించియుండునో కదా! సూర్యాస్తమయములశృంగారమును గుర్తెఱుఁగక కాలము గడుపుచున్నాము! సూర్యుఁ డస్తమింపలోక మంధకారబంధురంబై యుండ, దీపములును, గృహములును లేని సమయమున మనుజుఁ డేవిధమున రాత్రికాలము గడిపియుండును! ముప్పది గడియలకాలమును చీఁకటిలో గడిపినతరువాత, సూర్యోదయముఁ జూచి వాఁడేవిధమున సంతసించి యుండెనో కదా! రాత్రివేళల చంద్రుఁడు ప్రకాశించినను, ఆకాంతి సూర్యకాంతితో సమానము కాదు, నక్షత్రములకాంతి చెప్పనేల ?

శ్లో. ఏక శ్చంద్ర స్తమో హంతి న చ తారాగణోఽ పి చ" అని చెప్పిన విధమున నక్షత్రములు చీఁకటిని పోఁగొట్టఁ జాలవు;చంద్రుఁడు వృద్ధిక్షయములఁ గలిగియుండినందున నిశ్శేషముగ చీఁకటిని పోఁగొట్టఁజాలఁడు. అందుచేత సూర్యుని వాఁ డుపాసించెను.

సూర్యోపాసనము.

“ఆదిత్యో వా ఏష ఏత న్మండలం తపతి తత్ర తా ఋచ స్త దృచా ఋుండలగ్ం స ఋచాం లోకో ఽథయ ఏష ఏతస్మి న్మండలే ఽర్చిర్దీ ప్యతే తాని సామాని స సామ్నాం లోకో ఽథ యు ఏష ఏతస్మి న్మండలేఽర్చిషి పురుష స్తానియజూగ్ంషి. స యజుషా మండలగ్ం స యజుషాం లోక స్సైష త్రయ్యేవ విద్యా తపతి య ఏషోఽ న్తరా దిత్యే హిరణ్మయః పురుషః.”

“ఆదిత్యో వై తేజ ఓజో బలం యశ శ్చక్షు శ్శ్రోత్ర మాత్మా మనో మన్యు ర్మను ర్మృత్యు స్సత్యో మిత్రో వాయు రాకాశః ప్రాణో లోకపాలః కః కిం కం త త్సత్య మన్న మమృతో జీవో విశ్వః కతమ స్స్వయంభు బ్రహ్మై త దమృత ఏషపురుష ఏషభూతానా మధిపతిః”

కాశ్మీరదేశములో మార్తాండదేవాలయ మొకటి యుండెను, మాగ్రామమునకు సమీపమున సూర్యదేవుని క్షేత్రము కలదు, ప్రతిసంవత్సరము వైశాఖమాఘమాసములలో భానువారమున దేవునిదర్శించుటకు వేనవేలు ప్రజలు వచ్చుచున్నారు. ఒక్కసూర్యగ్రహమునే కాదు, తదితరగ్రహములను వాఁడు పూజించెను. వానినిబట్టి దినములకు నామములఁ బెట్టిరి ఆగ్రహములయొక్క స్థితిగతులఁబట్టి మనుజులభోగభాగ్యములును సుఖదుఃఖములును కలుగు నని తలంచి, జ్యోతిశాస్త్రమును వాఁడుకనిపెట్టెను, ఈలోకములోని ప్రతిపదార్థమున కొక్కొక్కగ్రహము అధిపతి యని భావించెను. ఆపదార్థముయొక్క వృద్ధిక్షయములు, దానియధిపతిస్థితి బట్టి యుండును. ఈగ్రహాధిపత్యములు ప్రతిసంవత్సరము మారుచుండును.

“రసాధిపతి స్సూర్యః మృగాధిప శ్చంద్రః రత్నాధిపతిః కుజః” ఇత్యాదులు.

ఈవిధమున వాయువును, అగ్నిని వాఁడారాధించెను. త్రింశత్కోటి దేవతారాధనను, పంచభూతదేవతారాధనను విడిచిపెట్టి, వాఁడు ద్వైతము లోనికి వచ్చెను. జ్ఞానభాస్కరునికాంతులు ప్రసరించిన కొలది పూర్వదేవత లను విడిచిపెట్టి, రెండుశక్తులు కలవని వాఁడు తలంచెను. శుభములను సిరిసంప దలను కలుగఁజేయుశక్తి యొకటి, అశుభములను రోగాదులను కలుగఁజేయు శక్తి మఱియొకటి—అని యూహించెను, ఆశక్తిని భగవంతుఁడని భావిం చెను, అందుచేత నిరువురు భగవంతులు పుట్టిరి. శుభముఁ జేయుదేవుఁ డొకఁ డును, అశుభముఁజేయువాఁ డొకఁడును కలరని తలంచుట పిచ్చిభ్రమ.

శ్లో. "సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా
పరో దదాతీతి కుబుద్ధిరేషా,
అహం కరోమీతి వృథాభిమానః
స్వకర్మసూత్రగ్రథితో హి లోకః."

ప్రతిమనుజునిసుఖదుఃఖములకు వానికర్మములు కారణములు, భగవం తుఁడు సాక్షిభూతుఁడై యుండును. దీనికి విరుద్ధముఁ జెప్పినయెడల, దోషము లనేకములు కలుగును.

ప్రపంచములోఁ బ్రతిపదార్థము పుట్టిపెరిగి నశించుచున్నది; వానికి సృష్టిస్థితిలయము లని చెప్పుచున్నాఁడు. శుభాశుభములఁ గలుగఁజేయు దేవత లిరువురు కలరని చెప్పుట విడిచిపెట్టి సృష్టిస్థితిలయములకు వరుసగ ముగ్గురు దేవతలు కలరని యూహించెను. బ్రహ్మ సృష్టికర్త యనియు విష్ణువు లోకపాల కుఁడనియు లేక స్థితికర్తయనియు, శివుఁడు సంహారకర్త యనియు, ముగ్గురు దేవతలను కల్పించెను. శుభాశుభములకు వారు కర్తలని తలంచెను. శుభములను నిలుపఁబెట్టుటకును, అశుభములను నివారించుటకును వారికి శక్తికలదు; కాని, తనకు లేదని వానికి నమ్మకము కలిగెను. అందుచేత వాఁడు ప్రార్థించుట కారం భించెను.

లావొక్కింతయు లేదు ధైర్యము విలో
లం బయ్యెఁ బ్రాణంబు లా
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె తనువున్
డస్సెన్ శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మ
న్నింపందగుం దీనునిన్
రావే యీశ్వర కావవే వరద సం
రక్షించు భద్రాత్మకా.

ఈప్రకారము ఆపదలు వచ్చినపుడు వానినుండి రక్షింపు మని భగ తునిఁ బ్రార్థించును. "లేక ధర్మార్థకామమోక్షచతుర్విధఫలపురుషార్థం పుత్ర త్రాభివృద్ధ్యర్థం సకలకామ్యార్థఫలసిద్ధ్యర్థం" అని సంకల్పముఁ జెప్పి పర శ్వరునిఁ బూజించును. కాలాంతము వఱకును భగవంతుని మనుజుఁడు ్యానించుచుండును ఎట్టి అంపవికారమగు విగ్రహమైనను, దానిసన్నిధిని ువఁబడి, తన సుఖదుఃఖములను వాఁడు విన్నపముఁ జేసికొనును ఎట్టి నుజుఁ డైనను, మనోవాచామగోచరుఁ డైనపరమేశ్వరుని ధ్యానించుచుండిన నియాత్మఁ జూచిన, ఆశ్చర్యముకలుగును. అజ్ఞానముచేత ననేకకోరికలను ఁడు కోరినప్పటికిని, అపిచ్చికోరికలను పరమేశ్వరుఁడు సిద్ధింపఁజేయఁడు నివలన వానికిఁ గీడుకలుగును. అపథ్యమగుపదార్థములను తలిదండ్రులు లురకిచ్చుటకు వెరచినవిధమున, మనుజులవాంఛితములను భగవంతుఁడు సఫ ముఁ జేయడు. వాఁడు జ్ఞానవంతుఁడైనకొలది, "శ్రీపరమేశ్వరప్రీత్యర్థం" నిసంకల్పముఁ జెప్పి ధ్యానించును

శ్లో. నాస్థా ధర్మేన వసునిచయే నైవకామోపభోగే,
యద్భావ్యం తద్భవతు భగవన్ పూర్వకర్మానురూపం,

ఏత త్ప్రార్థ్యం మమ బహుమతం జన్మజన్మాంతరేఽపి
త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తి రస్తు.

తుచ్ఛపుభోగముల నపేక్షింపక, సద్భక్తితో వాఁడు పరమేశ్వరుని ధ్యానించును.

బలుల నిచ్చుటగురించి చెప్పుచున్నాము స్నేహితులమనుష్యులను నొప్పించినపుడును, లేక వారికిఁ దనయందు కోపమువచ్చినను, వారిని శాంతింపఁ జేయుటకు వాఁడుకట్నముల నిచ్చును. వారియందుగల ప్రేమచేతను విశ్వాసముచేతను వారికి వాఁడు బహుమతిఁ జేయును. భగవంతునకుఁ గోపము వచ్చినందున కష్టములు వచ్చునని తలంచి, భగవంతుని పేరుఁ జెప్పి, వ్రతములఁ జేయుదు మనియు, తీర్థయాత్రలకుఁ బోవుదు మనియు, లేక తలవెండ్రుకల నిచ్చెదమనియు, లేక నిలువుదోపు నిచ్చెద మనియు, లేక పుట్టెడుపాలు పాయసము వండించి పెట్టెదమనియు మొదలగుమొక్కులను మ్రొక్కుకొనియెదరు. మఱికొందఱు భగవంతునకుఁ గోపమువచ్చునని తలఁచి, నరబలులను, పశుబలులను సమర్పింతురు, ఇంతకంటె గొప్పపిచ్చితనము మఱియొకటి లేదు; ఈబలులు, హోమములువలన లాభము లేదు. సర్వము భగవన్మయ మని తలఁచి, భక్తిశ్రద్ధలతో నతనిని యారాధించుట యొకటి, అతఁడు శిక్షించు ననుభయముచేత బలుల నిచ్చుట యొకటి, మొదటిది పుణ్యము; దానివలన జ్ఞానము కలుగును. రెండవది పాపము, జననమరణాదులకుఁ గారణ మగును. ఈబలులు, యజ్ఞాది క్రతువులు కంటె శ్రేష్ఠమయినది ఆత్మయజ్ఞము, దాని నందఱు చేయవలెను.

ఆత్మయజ్ఞము.

తస్యైవం విదుషో యజ్ఞ స్యాత్మా యజమాన శ్శ్రద్ధా పత్నీ శరీర
మిధ్మ మురో వేది ర్లోమాని బర్హి ర్వేద శ్శిఖా హృదయం యూపః కామ ఆజ్యం.

మన్యుఃపశు స్తపో౽గ్ని ర్దమ శ్శమయితా దక్షిణా వాగ్ఘోతా ప్రాణ ఉద్గాతా చక్షు రధ్వర్యు ర్మనో బ్రహ్మా శ్రోత్ర మగ్నీ ద్యావద్ధ్రియతే సాదీక్షా యదశ్నాతి తద్ధవి ర్య త్పిబతి త దస్య సోమపానం య ద్రమతే తదుపసదో యత్సంచర త్యుపవిశ త్యుత్తిష్ఠతే చ స ప్రవర్గ్యో యన్ముఖం తదాహవనీయో యావ్యాహృతి రాహుతి ర్య దస్య విజ్ఞానం త జ్జుహోతి యత్సాయం ప్రాత రత్తి తత్సమిధం యత్ప్రాతి ర్మధ్యన్దినగ్ం సాయం చ తాని సవనాని యే అహోరాత్రే తే దర్శపూర్ణమాసౌ యే౽ర్ధమాసా శ్చ మాసా శ్చ తే చాతుర్మాస్యాని య ఋతవ స్తే పశుబంధా యే సంవత్సరా శ్చ పరివత్సరా శ్చ తే౽హర్గణా స్సర్వవేదసం వా ఏతత్సత్త్రం యన్మరణం త దవభృథ ఏతద్వై జరామర్య మగ్నిహోత్రం య ఏవం విద్వానుదగయనే ప్రమీయతే దేవానా మేవ మహిమానం గత్వా ౽౽దిత్యస్య సాయుజ్యం గచ్ఛ త్యథ యోదక్షిణే ప్రమీయతే పితౄణా మేవ మహిమానం గత్వా చంద్రమస స్సాయుజ్యగ్ం సలోకతా మాప్నో త్యేతౌ వై సూర్యాచంద్రమసో ర్మహిమానా బ్రాహ్మణో విద్వానభిజయతి తస్మా ద్బ్రహ్మణో మహిమానమాప్నోతి తస్మాద్బ్రహ్మణో మహిమానం. ఒంశాంతి శ్శాంతి శ్శాంతిః.”

అనంతకోటికాలము గతించెను, ఆయాదేశములలో ఆయాకాలములలో ఆయాదేశీయులు ప్రబలులై నశించిరి. ఆయాదేశీయులు పరలోకమును గురించియు, ఉత్తరజన్మమునుగురించియు, కర్మనుగురించియు జననమరణాదులను గురించియు, వీనికంటె భగవంతుని గురించియు చెప్పినసంగతులు గ్రంథములలో వ్రాయఁబడియున్నవి. అవియే మతగ్రంథములు హిందువుల మతగ్రంథము వేదము; క్రీస్తువులది బైబిలు, మహమ్మదీయులది కొరాను; పారశీకులది జెండ్-అవెస్తా, బౌద్ధులది త్రిపీటిక-భగవదంశసంభూతులయిన మహాపురుషులు, భగవత్ప్రేరణచే నీగ్రంథములనువ్రాసిరి , ఒక్కవిషయమునే పలువిధములఁ జెప్పిరి; చెప్పినవిధము భిన్నమయినను, లక్ష్యమొకటి. ఎవరుచెప్పినను, భగవంతుఁడు లేఁడని మాత్రము చెప్పలేదు ! అందఱును భగవంతుఁ డొక్కఁడనియే చెప్పియుండిరి.

బండిచక్రముమధ్యను తూముకలదు, ఆతూమును చక్రముతో కమ్ములు కలుపును, ఆకమ్ములన్నియు సమానము; ఏకమ్మి ననుసరించిపోయినను, నీవు తూమును చేరఁగలవు, ఆతూమునుచేరుటయే మనకోరిక, ఏకమ్మి ననుసరించి పోయినను ఒకటికదా! ఆతూము భగవంతుఁడు, కమ్ములు మతములు, వలయము ప్రపంచము, ఏమతముననుసరించి గమనించినను, భగవంతునిఁ జేరఁగలరు, అన్ని మతములు సమానము అన్నిమతములవారిలక్ష్య మొకటియేగాని, రెండుకాదు. అందుచేత నొకరితో నొకరు మతవిషయమై పోరాడుట మంచిపనికాదు. ఏమతమయినను, భక్తివిశ్వాసము లుండవలెను. భగవంతుని ధ్యానించి, దేశచరిత్రలను చదువఁ బోవుదము.

ప్రార్థన.

శ్లో. నతోఽస్మి తే పదం దేవ ప్రాణబుద్ధీంద్రియాత్మభిః,
యచ్చింత్యతే కర్మపాశాత్ హృది నిత్యం ముముక్షుభిః. ౧

మాయయా గుణమయ్యా త్వం సృజస్యవసి లుంపసి,
జగత్తేన న తే లేప ఆనందానుభవాత్మనః. ౨

తథా శుద్ధిర్న దుష్టానాం దానాధ్యయనకర్మభిః,
శుద్ధాత్మనాం తే యశసి సదా భక్తిమతాం యథా. 3

తవాంఘ్రిపూజా నిర్మాల్య తులసీమాలయా విభో,
స్పర్ధతే వక్షసి పదం లబ్ధ్వాపి శ్రీః సపత్నివత్. ౪

అత స్త్వత్పాదభక్తేషు తవ భక్తిః శ్రియోఽధికా,
భక్తిమేవాభివాంఛంతి త్వద్భక్తా స్సర్వవేదినః. ౫

అత స్త్వత్పాదకమలే భక్తిరేవ సదాఽస్తు మే,
సంసారామయతప్తానాం భేషజం భక్తిరేవ తే. ౬

ప్రాచీనదేశచరిత్రలు

2-వ ప్రకరణము.


2
మధ్యధరా సముద్రము
సిరియా
హెళి
కైరో
పిరమిడులు
మెంఫిసు
అరేబియా
రుధిర సముద్రము
తేబీసు
ఈజిప్టు
నూబియా

శ్రీరస్తు.

ఈజిప్టు-దేశచరిత్రము.

ద్వితీయప్రకరణము.

మొదటిఅధ్యాయము.

ప్రపంచములోని మహాదేశీయులందఱిలోఁ బ్రప్రథమమున "నైలు" నదీతీరవాసులగు "ఐజిప్టీయులు" నాగరికులై మహోన్నతపదవి నొందినట్లు కానఁబడుచున్నది. ఎన్నిసంవత్సరములక్రిందట వారు జీవించియుండిరో నిర్ధారణముగఁ జెప్పుటకు వీలులేదు గాని కొన్నికొన్ని నిదర్శనములఁబట్టి వారు క్రీస్తుపూర్వము నలుఁబదియాఱవశతాబ్దమున రాజ్యమును స్థాపించి ప్రబలులై యుండిరని తెలియుచున్నది. ఏనాఁడితరదేశీయులు పశువులవలె సంచరించుచు అగ్నిఁ జేయుటయే తెలియక లోహములజ్ఞానము లేకయుండిరో, ఆనాఁడు వారు సాంఘికులై, దేశభాషాలిపిజ్ఞానము, లిపికర్మము, రథాశ్వగజకౌశలము, వల్లశాస్త్రము, ధాతువాదము, గంధవాదము, ఖనివాదము, రసవాదము, చిత్రక్రియ, లోహక్రియ, దారుక్రియ, మృత్క్రియ, చర్మక్రియ, మూతీకరణము, వాణిజ్యము, పాశుపాల్యము, కృషి మొదలగు కళలలోఁ బ్రాజ్ఞులై యుండిరి.

వారు నైలునదీతీరవాసులగుటయే దీనికిఁ గారణమని తోచును. ఆదేశము దక్షిణోత్తరములుగ విభజింపఁబడెను. అమ్మహాజనని "నైలు" రెండు

భాగములవారికిని జీవన మిచ్చి సంరక్షించుటచేత వారు లౌకికకష్టముల నెఱుగక సచ్చిదానందభరితులై సకలకళలలోఁ బ్రవేశముగని నాగరికు లయిరి. భూమి సారవంతమై సర్వసస్యఫలభరితం బైనందున దేశము ప్రజాభివృద్ధిగలిగి యుండెనని చెప్పుటకు నిదర్శనములుగ మహోన్నతమైన దేవాలయములును గోరీలును నేఁటివఱకు నిలువబడి యున్నవి ఆదేశస్థితికూడ దానిభోగభాగ్యముల కనుకూలముగ నున్నది. "మధ్యధరాసముద్ర" తీరమున నున్నందున "ఐరోపా" ఖండముతో వ్యాపారమును సాగించుటయేగాక "రుధిరసముద్రము" నకును "అరబి" జలసంధికిని యాదేశము తట్టియున్నందున, పూర్వపశ్చిమదిశలతో వాణిజ్యమును నడిపించెను.

ఐజిప్టీయులు శాంతస్వభావులు, అపరిమితాశాపరులు కారు; కనుక నే వారు శీఘ్రముగ నాగరికు లయిరి. పదునెనిమిదితరములవఱకు వారిరాజులు కూడ సంతుష్టులై యుండి రణభేరియనుమాట నెఱుగక పరరాజులతో గక్షవహింపక కాలమును గడిపిరి దేశము ఫలవంతమైనదని చెప్పుటచేతను, వారు శాంతచిత్తులని చెప్పుటచేతను, వారు సోమరులై అజ్ఞానాంధకారములోఁ గాలముఁ గడిపిరని భావము కాదు, దేహముఁ గష్టపెట్టి శాశ్వతమైన కీర్తిస్తంభములను స్థాపించుటయందును లేక "నైలు" నదీముఖద్వారమున నుండిన చిత్తడి నేలను సాగుఁజేసి సస్యములఁ బండించుటయందును వారు కాలయాపనఁ జేసిరి. మంచిబుద్ధులును, మంచినడవడికలును ఒకరినిజూచి నేర్చుకొనఁదలఁచిన, నవి పట్టునదునా! ఆగుణములు వారికి స్వాభావికముగఁ బుట్టినవియేగాని, పరులు నేర్పినవని కావు.

"ఆంగ్లేయ సర్వవస్తుప్రదర్శనశాలకుఁ" బోయి "ఐజిప్టీయవస్తుభాండాగారము" లో నిలువఁజేసిన "ప్రాచీనఐజిప్టీయుల" భండారములఁ జూచిన, పాషాణయుగమునాటికి వారు నాగరికులైయుండినట్లు తెలియుచున్నది. తరణిపెట్టబడిన ఆయుధములను, మృత్పాత్రలను, నానావిధములైన

యాభరణములను చూచి, అపారమైన కాలావళిగుండ మనస్సు ప్రసరించి, ఆనాటిమనుజు లట్టివారిని గ్రహించి భ్రమించును "బాబిలను" దేశీయు లీదేశమునకు వచ్చి ఈవస్తువులఁ జేయుట నేర్చుకొనిరి. అన్యదేశీయులతోఁ గలసి మెలసి తిరుగుటచేత వారభివృద్ధిలోనికి వచ్చిరి.

గోరీలమీదఁ జెక్కఁబడిన శిలాప్రతిమలఁ జూచిన వారు రెండుతెగలవారని తెలియనగును. ఒకరు ప్రాచీననివాసులు; స్వచ్ఛమైన తలవెండ్రుకలను చామనిచాయశరీరమును, నిడుదముఖములను ముందుకుఁ దోసికొనివచ్చిన పెదవులును, వారికిఁ గలవు, ఏటవాలుగనుండిన నేత్రములును, ధనురాకృతినొందిన కనుబొమలును వారిస్త్రీలకుఁ గలవు. స్త్రీపురుషాదులకుఁ జిన్నశిరోజములుండెను, పురుషులు పెద్దగడ్డముఁ బెంచిదానికొసలను నులిపి నిక్కఁబెట్టి యుంచెడివారు. రెండవతెగవారికి నారికేళమునంటి శిరస్సులును దట్టమైన దవుడలును పెదవులును కలవు. రాజులును సామంతులును గంభీరులై ఔదార్యనిధులై, పరలోకచింతాక్రాంతులై యుండిరి.

రాజులుగాని సామంతులుగాని సంసారులుగాని విందుచేసినసమయమున భోక్తలకెదురుగ నొకశల్యపంజరమును నిలువఁబెట్టి యుంచుదురు. "షడ్రసములతోఁ బోషింపఁబడుచుండినశరీరమునకుఁదుదకీయవస్థ సంప్రాప్తమగు"నని దానిమూలమున వారికిఁ దెలియ నగును. రాజు రాజ్యమునకు వచ్చినపుడును మంత్రులును,సామంతులును,ప్రథమమునఁ దమతమగోరీలఁ గట్టించుకొనుదురు. వారివలెఁ గాక సంసారులు సంతోషాతిశయముతో జీవించుచుండిరి.శిలాశాసనములను, శిలాప్రతిమలను చిత్రపటములఁ జూచిన నాట్యగానములలోను, కేళీవిహారములలోను వారు పరిక్రమించుచుండి రని తెలియ నగును. జీవేచ్ఛగలవారు "ఆయు రాశాస్తే, సుప్రజా స్త్వ మాశాస్తే, భూయో హవిష్కరణ మాశాస్తె,దివ్యంధా మాశాస్తె"అని వారు భగవంతునిఁ బ్రార్థించుచుండిరి. అటులనే బాలికాబాలకులుకూడ నాటపాటలలోఁ గలసిమెలసి తిరుగుచుండిరి.వారి పాఠశాలలు పెద్దవి; చంచలులైన బాలికాబాలకులను మార్గములోనికి దెచ్చుట

గురువులకుఁ గష్టముగ నుండెను. గురువులు బెత్తము నుపయోగింపకఁబోయిన "బాలురకు వీపులమీఁదఁ జెవులు మొలుచున"ని వారిలో సామెత కలదు.

గృహకుడ్య మెత్తున సరాసరి దానిపై నధికారమును సూచించుదండ మును ధరించియుండిన దేశాధికారియొక్క బొమ్మ చెక్కఁబడియున్నది. గోడ యొక్క మిగిలినభాగముపైని ఖనుల "ద్రవ్వుట, వేఁటాడుట, చేపలఁబట్టుట, ఇటికలఁ జేయుట దేవాలయములఁ గట్టుట—మొదలగు పనులఁ జేయుచుండి నటుల వానిభృత్యుల బొమ్మలు చెక్కఁబడియున్నది వేత్రముఁజేతఁ బూని సేవ కులు జాగరూకతతోఁ బనిచేయునటుల పరీక్షించు మఱియొక యధికారిబొమ్మ కూడ చెక్కఁబడియున్నది. ఇంతియకాదు. మఱియొకచోట దిమ్ముచేయఁబడిన నేలమీఁద విత్తనములం జల్లి వానిని అణగ ద్రొక్కుచుండిన గొఱ్ఱెలమంద యొక్క బొమ్మ కనఁబడుచున్నది ఇవియన్నియుఁ వారికీర్తిసంపదలఁ దెలియఁ జేయుచున్నవి. క్రీస్తుశతాబ్దములసమీపమునకు రానురాను ఇప్పటి బొమ్మల కును పూర్వమువానికిని కొంచెము వ్యత్యాసము కానఁబడును. ఈకాలమునాటి యజమానుని బొమ్మ చెక్కఁబడియున్నది, కాని పూర్వమువలె పొట్టినౌక్క యిని ధరించినటులగాక పెద్దచేతులు గలదానిని ధరించినటులకనఁబడును. పూర్వ ము గొఱ్ఱెలుచేయుచుండిన పనిని నేడుకృషీవలులు నాగలిఁ బట్టుకొనిచేయు చుండినటుల బొమ్మలవలనఁ దెలియనగును. సారాయివండుటయు బట్టలను మగ్గ మున నేయుటయు మొదలగుపనులఁ జేయుటయు నస్తుసామగ్రితో నిండియుం డిన పడవలు సముద్రముమీఁదఁ బోవుటయు ఐజిప్టీయసైనికులు శత్రుసైన్య ములను యుద్ధములోఁ బాఱదోలుటయు - మొదలగు బొమ్మలు గోడలమీఁదఁ జెక్కఁబడియున్నది.

వ్యవహారార్థము "ఐజిప్టీయులలో" అయిదుతెగలు కలవు. మొదటి తెగవారు సామంతులు అనగా రాజును రాజకుటుంబమువారును సూర్యభగ వానుని యంశచేత రాజు భూలోకములో నవతరించిన మహాపురుషుఁ డని వారియభిప్రాయము. ఆలోచనఁ జేయుటకును సలహానిచ్చుటకును నామకార్థము

ముప్పదిమంత్రులు కలరు; కాని, రాజుయొక్క ప్రభుత్వము నిరంకుశము. వ్యవహారార్థము రాజు దేశసంచారమునకుఁ బోయినపుడు, మంత్రులు వెంట నంటి పోవుదురు. రెండవతెగవారు వైదికులు వీరు ప్రబలులు; వీరుచెప్పినమాట ద్రోసివేయుట దుర్లభము. వీరు సమస్తవిద్యలకును అధ్యేతలు అధ్యాపకులు. దేశములోని దేవస్థానములలో వీరుండుటచేతఁ బ్రజలు దక్షిణక్రిందనిచ్చిన యావత్తుసొమ్ము వీరియధీనములో నుండెను. ఈవైదికులలో నగ్రగణ్యుఁడు "ఆచార్యస్వామి"—ఇతఁడు రాజుతరువాత రాజంతవాఁడు—మూఁడవతెగ వారు సైనికులు రథాశ్వగజకౌశలములోను, మల్లశాస్త్రములో వారితేరినవారు. ధనుర్బాణములును, కవచములును, డాల్కత్తులును, గదలును వారికిఁగలవు. సైనికులను సముద్రముమీఁదఁ దీసికొనిపోవుటకుఁ జిన్ననావలు సహితముండెను. నాల్గవతరగతివారు హాలికులు; అయిదవతరగతివారు తదితరకర్మలఁ జేయు వారు. భూములఁ గలిగియుండినను, భూఖామందులకుఁగల కర్మాధికారములు వీరికిలేవు. హాలికులు పంటలఁబండించి సగముపంటను భూస్వాముల కిచ్చుచుం డిరి. చిత్రక్రియ, లోహక్రియ,మృత్క్రియ, దారుక్రియ, అంబరక్రియ, అశ్మక్రియ, చర్మక్రియ—ఈ క్రియలకర్తలంపఱును పంచమ తెగవారు. కర్మాధికారము వీరికిలేదు., అయినను, వీరిపిల్లలు సామంతులపిల్లలతోఁగలసి మెలసి యొకపాఠశాలలో విద్య నభ్యసించుచుండిరి

ఆకాలపుజనులలో వీరుమాత్రము స్త్రీలను మన్నించిరి,అంతఃపురములో వారిని దాచిమూచుటలేదు; బానిసలనువలె వారిని నిరాదరించలేదు. గృహములో గృహస్థునితరువాత గృహిణి యజమానురాలు. స్త్రీపురుషాదులదాంపత్యమనుకూలమగ నుండెను "నగరిలో నామూలసౌధంబుదాపలమందార వనాంతిరామృతసరఃప్రాంతేందుకాంతోపలోత్పలపర్యంకము" లమీఁద సామంతులు కేళీవినోదములఁ జరిగించిరి.

సూరః=సరతి చరతీతి సూరః—అనగా సంచరించువాఁడు-'సూరః' అనుశబ్దములో "సూ" లోపింప"రః"మిగిలెను. ఇప్పుడు విసర్గము లోపింప,

"ర" అక్షరమునకు దీర్ఘమువచ్చెను. "రా" అనుపేరుతో సూర్యభగవానుని "ఐజిప్టీయులు" "హెలి" పురములో నొకదేవాలయములో నారాధించిరి. ఆమహాదేవుని కటాక్షముచేత వారిజననియైన "నైలు"నది సారసమగు చుండెను; లేక ఆయన కోపముచేత నీరసమగు చుండెను. మధ్యందినమార్తాండుని వారు "రా" అనుపేరుతోఁ బూజించిరి ఉదయభాస్కరుని "హర" అను పేరుతోను, అస్తమయసూర్యుని "తమ" అనుపేరుతోను దివాకరుని వారా రాధించిరి. సూర్యునకు "సురోత్తమ" అనియు, "అహస్కర" అనియు రెండుపేర్లు కలవు

(అ) హ (ః) (క) ర=హర

(సు) (ర) (ఉ) త్తమ=తమ-

"తమ" "హర" శబ్దములకు వ్యుత్పత్తి ఈ విధమని తోచును.

మనుజులలోని జీవాత్మ ప్రభాకరుని కళయని వారిమతము. శరీరమును విడిచిన జీవుఁడు పరలోకమునకుఁ బోయి, అచట "అసిరిసు" అను పరేత రాజుచేతఁ బాపపుణ్యములు విమర్శింపబడినతరువాత, వానిని యనుభవించుట కాయాలోకములకుఁ బోవు నని వారి సిద్ధాంతము. పుణ్యజీవులు సూర్యలోకమున స్వాగతులై విగతదోషులై, అచటనుండి పుణ్యలోకములకుఁ బోవుదురు. పాపాత్ములు రౌరవాదినరకములలోఁ బాపఫలము ననుభవించి, తదనంతరము భూలోకములోఁ గ్రిమికీటకాదిజంతుగర్భములలోఁగాని లేకక్షుద్రజాతులలోఁగాని జనన మొందుదురు. వా రనేకదేవతల నారాధించిరి; ఈదేవతల లో నుపదేవతలు కలరు, ఈయుపదేవతలకు సగము నరగణమును సగము దేవగణమును కలదు. ఆదేశములో నన్నినగరములలో దేవాలయములు కలవు,వానిలో భగవంతునివారు సగుణముగ నారాధించిరి. ఇంతియకాదు, మత్స్యము, మార్జాలము, వృషభము మొదలగుజంతువులు పవిత్రమైన వని యెంచి వారు వానిని గౌరవించిరి. "మంఫిసు" పట్టణములో నొకదేవాలయములో "అఫిసు" అను పేరుతో నందీశ్వరుని వారు పూజించిరి. ఇచ్చట పూజారులు

పెక్కండ్రు కలరు. షడ్రసములతో గూడిన పక్వాన్నము నానందీశ్వరుఁడు వెండిపళ్లెరములలో భుజించును. స్నానార్చనాదికృత్యములఁ జేయించుటకుఁ గొందఱుభృత్యులును పానోదకముఁ దెచ్చుటకు గొందఱును, శయనాదిపరిచారములకుఁ గొందఱును కలరు. ఇట్టుల మహావైభవముతో నుండిన నందీశ్వరుఁడు కాలధర్మమునొందిన, అర్చకులాశరీరమును భూషణములతోను దుస్తులతో నలంకరించి పాలశిలతోఁ గట్టఁబడిన గోరీలో సమాధిఁ జేయుచుండిరి. ఏగృహములోనైన మార్జాలముగాని శునకముగాని మృతినొందిన ఆగృహస్థు దానిమరణమునకు "అశుచి" పట్టవలెను. ఈమూలమున పిపీలికాదిబ్రహ్మపర్యంతముగల జీవులలోని జీవాత్మ, అవాఙ్మానస గోచరుఁడైన పరమేశ్వరుని కళయని నిరూపించుట వారి ముఖ్యోద్దేశము. "నరాణాం చ నరాధిపం" అని చెప్పినవిధమున, రాజు భగవదంశసంభూతుఁ డని తలఁచి ఆతనిని వారు పూజించిరి; ఆతఁడు భూలోకమున నవతరించిన సూర్యనారాయణమూర్తి యని వారి యభిప్రాయము. "ఓరాజా ఏలినవారికీర్తి సూర్యునివలె ప్రకాశించును, ప్రభువు వారికోరికలు సఫలమగును; తమ రాజ్ఞ చేసినయెడల నుదకములు పాషాణమునుండి బయలు వెడలును, రాత్రి సూర్యుఁ డుదయించును" అని రాజును మంత్రులు స్తోత్రము జేయుదురు. ఇందుకు దృష్టాంతముగ నొకపురాణగాథకలదు. "ఈజిప్టు" దక్షిణోత్తర భాగములకు "ఆసిరసు" అను పేరుగల నొకరాజొకలఁడు, అతఁడు భగవదంశసంభూతుఁడు; అతని సోదరుఁడు "సేతు" అనువాఁడు ఈర్ష్యచేత నతని జంపి, మృతకళేబరము నొకపెట్టెలోఁ బెట్టి దానిని "నైలు" నదిలో విడిచిపెట్టెను అది నదీప్రవాహవేగమున గొట్టికొని పోయి పోయి నదీముఖద్వారము వెడలి సముద్రముఁ జేరెను. భర్తృచింతాపరాయణియైన అతనిభార్య "ఈసిసు" భర్తృమరణమునకు దుఃఖించి, కళేబరము గానన౦దునఁ జింతించి, దానిని వెదకి వెదకి, తుదకు దానిని సముద్రతీరమునఁ గనెను. ఆపెట్టెమూతఁ దీయించి మృతకళేబరముఁ జూచి విలపించి కన్నీరు వరదలై కారమూర్ఛఁబడి లేచి, శరీరమును తైలద్రోణిచేయించి సమాధిఁ జేయించుటకై దానిని "మంఫిసు" పట్టణమునకుఁ దెచ్చెను. అన్నదమ్ముల వైరమున

కంతము లేదు. ఆశరీరము సమాధి చేయఁబడుసమయమున నష్టపడి, దానిని ముక్కలుముక్కలుగ ఖండించి, రహస్యముగ నాముక్కలను "సేతు" దాచివేసెను. ధర్మపత్నియైన "ఈసిసు" కష్టపడి, వానిని సంపాదించి సమాధి జేయించెను. తదనంతర మామె తనకుమారుఁడైన "హోరసు" ను పురికొల్పి "సేతు"తో యుద్ధముఁ జేయుటకు బంపెను. వీరిరువురు హోరాహోరీ మని పోరాడిరి; తుదకు "సేతు" ను కుమారుఁడు పట్టుకొని సంకెళ్లువేసి తీసికొనివచ్చి తనతల్లి యెదుట వానిని నిలువఁబెట్టెను. ఆమె దయార్ద్రహృదయురాలు! కనుక వానిని సంకెళ్లనుండి విడిపించి స్వేచ్ఛావిహారమున కనుజ్ఞ నిచ్చి పంపివేసెను. అందుకుఁ గుమారుఁడు రౌద్రాకారుఁడై తత్తరపడి ఖడ్గముతో నామెశిరస్సును ఖండించెను. మాతృహత్యాపాప మతనికి దగులకుండ "తాతు" అనుదైవము గోశిరస్సును పెట్టి తల్లిని బ్రతికించెను తుదకు గుమారుఁడు "సేతుంజంపి" తనతండ్రి ఋణము దీర్చుకొనెను.

"ఆసిరమ" "ఈసిసు" "హోరసు" "సేతు" వీరిని "తేబీసు" పట్టణములో దేవాలయములో "ఆమను" అను నిర్గుణభగవంతునియు నారాధించిరి. ఎన్ని కష్టముల నైనపడి మృతకళేబరములను వీరు సమాధి జేయుచుండిరని ఈ "ఆసిరసు" గాథవలన దెలియుచున్నది. ఎప్పటికైన పునర్జీవము వచ్చి ఈకళేబరములు లేచి తిరుగు నని మనోధైర్యము కలవారై చెడిపోకుండ వానిని తైలద్రోణి జేయించి, అశ్మక్రియ, దారుక్రియ, చిత్రక్రియల సొబగు సొంపారు మందిరముల గట్టించి, వినిలో వానిని సమాధిఁ జేయుచుండిరి. ఏబది శతాబ్దములకు బైగా గతించినవి ఆనాటి "ఐజిప్టీయుల" శమదమాదిగుణములను, కార్యనిర్వాహక నైపుణ్యముల నాచంద్రార్కము వారికీర్తి ప్రతిష్ఠలను వేనోళ్లజాటుచు ఎండల కెండి వానలకుఁ దడిసి, చలిగాలిదెబ్బల దినుచు నిశ్చలముగ నిలువఁబడియుండిన "పిరమిదులను" మందిరములు నేటికిఁజూడఁ గానఁబడును. అన్నిశతాబ్దములలో నాబాలవృద్ధ స్త్రీపురుషాదులకును పండితపామరులకును యంత్రసాధనము లేమియు లేకయే మనుష్యమాత్రులే తన్మందిరముల గట్టఁగలిగిరా యని యాశ్చర్యము గలుగఁజేయు చుండును.

"పెద్దపిరమిడు" అరబ్బిదేశములోని ఖనులలోఁ ద్రవ్వఁబడి తేఁబడిన ఏకాండపు రాతిపలకలతోఁ గట్టఁబడెను. 3,60,000పనివాండ్రు ఇరువది సంవత్సరములు దానిని కట్టిరి, అంతయెత్తున కీబండరాళ్ల నెటుల వారు తీసికొని వెళ్లగలిగిరో ఆశ్చర్య మగుచున్నది. పలువురు పలువిధములఁ జెప్పెడిసంగతులను నమ్మలేము. దానియొక్క ప్రతిముఖము 833-అడుగులు పొడవు,725 అడుగుల ఎత్తు అని "ప్లిని" అను రోమకచరిత్రకారుఁడు వ్రాసెను. దానిపునాదిలో నొక గది యుండును. ఏకాండపురాతిలో దొలచబడిన రంధ్రముగుండ దిగుడుమార్గమున దానిలోనికిఁ బోవలెను. అచ్చటనుండి మఱియొక యెగుడుమార్గము వెడలి "మహారాణిమందిరము" నకుఁ బోవును, అచ్చటనుండి మఱియొకమార్గము కక్ష్యాంతరములగుండఁ బోయి "మహారాజమందిరములోఁ" గలియును. "భూఫు" అను మహారాజు కాలములో నది కట్టఁబడెను; రాతితోఁ గట్టఁబడిన నతనిసమాధి యీమందిరములోఁ జూడనగును. ఇచ్చట రెండువాతాయనములు కలవు, వానిగుండ స్వేచ్ఛగ వాయువువచ్చి పోవుచుండును.

"ఇంతగొప్పమందిరములను వారేలకట్టిరి?" అను ప్రశ్నకు పలుగురు పలువిధముల సమాధానముఁ జెప్పిరి. ఈమందిరములు వారినక్షత్రశాల లనియు వానిలోని వాతాయనములలో "మారిదర్శని" యంత్రములను నిలువఁబెట్టి వానిగుండ సూర్యాది గోళములను వారు చూచుచుండి రనికొందఱు చెప్పుదురు. ఏదియైనను ఒకటిమాత్రము నిజము, రాజులును, వారిభార్యలును, వారికుటుంబమువారును మృతినొందినపైని వారిశరీరములను వానిలోసమాధిఁ జేయుచుండిరి. వానిని నేటివఱకుఁ జూడ నగును. ఈమందిరములు వారికీర్తి ప్రతిష్ఠలను వెల్లడిజేయు ననెడిమాట గాక మఱియొక సంగతికలదు. దయాదాక్షిణ్యములులేక రాజులు కఠినచిత్తులై ప్రజలను బాధపెట్టి వారిచేత వీనినిఁ గట్టించిరి. ఎంద ఱెన్నివిధముల, బాధలుపడలేక కొందఱును, బాధలఁబడికొందఱును, దేహత్యాగముఁ జేసిరో చెప్పలేము. ప్రజలు చీమురక్తము ధారవోసి దీనినిఁ గట్టిరి.

రెండవ "పిరమిదు" సమీపమున "స్ఫింక్సు" అను పేరుగల నొకశిలా ప్రతిమ కలదు. నాలుగు కాళ్లను ముడిచికొనియుండిన సింహశరీరమును, మనుజుని శిరస్సును కలిగియుండినట్లు ఈప్రతిమ చెక్కఁబడెను. ఇది ప్రాఙ్ముఖముగ నుండును. పరేతలోకమునకు దివాకరుఁడైన "హారమాచీసు" అను దేవుని ప్రతిమ యని చెప్పుదురు. నూరడుగులు పొడవుకలిగి నరముఖముచేత బుద్ధిబలమును, సింహశరీరముచేత దేహబలమును ఆప్రతిమ వెల్లడి చేయును. "పిరమిదుల" (గట్టించిన "ఖూఫు" అను మహారాజుని కాలములో నిది కట్టబడి, కాలాంతరమున దీనిమీఁదను ఇసుకమేట వేసెను. పదునెనిమిదవ తరములోని రాజు "చతుర్థతాత్మేశు" నకు స్వప్నములో "హారమాచీసు" దైవము ప్రత్యక్షమై ఇసుకలోఁ గప్పఁబడియుండిన తనశిలాప్రతిమను బయటకతీఁడు తీయించినయెడల నతనిని "ఈజిప్టు" దేశమున కధీశునిగఁ జేసెదనని చెప్పినట్లు ఆప్రతిమ యద్దనుండిన శిలాశాసనమువలనఁ దెలియనగును "పిరిమిదులకుఁ" గొంచెము దూరములో నీప్రతిమ శిరస్సుభూమిలోనుండి బయటను వచ్చుచున్నట్లు కనఁబడును. దీనికి "భయజనకుఁడ"ని నామమిడిరి." అని రోమక చరిత్రకారుఁడు "ప్లిని" వ్రాయుచు, "ఈశిరస్సుయొక్క శరీరము భూమట్టములోఁ గలదు. దానిచక్కని ముఖమునుండి తెలివితేట లొలుకుచుండును. ఆముఖములో మందహాసము కనబడును" అని అతఁడు వ్రాసెను.

ఇకను "కార్నాకు" దేవాలయముఁ జూచిన, వారు సకలకళావతంసులనిచెప్ప నగును. "ఆమను" దేవతకొఱకు "తేబీసు" పట్టణములోఁ గట్టఁబడి మఱికొంతకాలమునకు "వీరతాత్మేశుఁడ" ను రాజు దానిని వృద్ధిఁజేసి, ఆశ్మక్రియ, శిల్పక్రియ, దారుక్రియలయొక్క సంపద్వైభవములతోఁ గూర్చి, దానిని మనోహరముగఁ జేసెను. దానికుడ్యములమీఁద వ్రాయఁబడిన శాసనములవలనను (బొమ్మలవలనను, ఆయాతరములచరిత్రమును వ్రాయునగును. ఇచట నొకపేరోలగము కలదు; దానికిఁదగిలి ఉన్నతస్తంభములతోఁ గూడిన పంచహజారములు కలవు; అయిదుగనులు వీనికిఁ దగిలియుండును. సకలవిద్యా

నాథుఁడగు "తాతు" దేవుని ప్రతిమయు, జ్ఞానరూపిణి యైన "సాపు" అను సరస్వతి ప్రతిమయు, గోడలమీఁద వ్రాయఁబడెను.) ఈగదులు వారిపుస్తక భాండాగారములు, కాలాంతరమున వారిశత్రువుల దుర్నీతిచేత నశించెను. "పాపిరసు" పత్రముల మీద వ్రాయఁబడిన వారిగ్రంథములు నేటివఱకుఁ జూడ నగును. ఆవ్రాతను మనము చదువలేము, అది గిలిబిలివ్రాత. వానిలో నొకటి వారిప్రాచీనగ్రంథము. "జ్ఞానప్రదీపిక" యను వారివేదములో జ్ఞానకాండ, ధర్మకాండ, కర్మకాండయని మూఁడువిధములుకలవు. ఈగ్రంథము "తాతు" దేవుని ముఖమునుండి వచ్చినదని వారుచెప్పినను, ఆయాకాలములలో మనుజుల బుద్ధికుశలతకొలది నదివ్రాయబడినట్లు తోఁచును. కావ్యాలంకారనాటకముల లోను, అంకగణితములోను, బీజగణితములోను, జ్యోతిశ్శాస్త్రములోను — మొదలగువానిలో వైదికులు ప్రవేశమును గనిరి ; వారే శాస్త్రజ్ఞులు ; వారే అధ్యాపకులు — ఈప్రకారము వారు సూర్యభగవానుని ధ్యానించిరి: —

"సర్వదేవాత్మకో హ్యేషతేజస్వీ రశ్మి భావనః,
సువర్ణసదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః.
నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరయే నమః,
నమః పద్మః ప్రబోధాయ మార్తాండాయ నమో నమః.
పాయ త్యేష తప త్యేష వర్ష త్యేష గభస్తిభిః,
ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః.
నమో దేవాదిదేవాయ సూర్యాయాదిత్య వర్చసే,
గుణరూపవిహీనాయ పశూనాం సృష్టికర్తయే."

జీర్ణవస్త్రములను విడిచి నూతనవస్త్రములను మనుజులు ధరించువిధమున జీర్ణించిన కళేబరములను జీవుఁడువిడిచి కర్మఫలము ననుసరించి నూతనశరీరముల బొందునని వారిమతము. వారికి దేవునియందు భక్తివిశేషము. ధర్మముయం దాసక్తి మెండు; భూతములయం దభిమానము నిరంతరము.

"బహుధా ప్యాగమై ర్భిన్నాః పంథాన స్సిద్ధిహేతవః, త్వ య్యేవ నిపతం త్యోఘాః జాహ్నవీ యా ఇవార్ణవే" అని చెప్పినవిధమున వారనేకకోటిదేవతలనారాధించినప్పటికిని భగవంతుఁ డొకఁడే యని వారియభిప్రాయము.

పదునెనిమిదవఅధ్యాయము.

ఈజిప్టు - ఉచ్ఛదశ:—క్రీ. పూ సం. 4400-1400 రములు.

స్వయంకృషిచేసి కాలాంతరమున స్వానుభవముచేత శాస్త్రములను "ఐజిప్టీయులు" నేర్చుకొనిరి గాని మఱియొకరి వద్ద నభ్యసించలే దని చెప్పుటకు నిదర్శనములు కనఁబడును. ప్రాచీన పాషాణయుగము మొదలు లోహయుగము వఱకు కెంతికాలము వారుగడిపిరో తెలియదు. ఈయుగములను గడిపినతరువాత మహావైభవముతోఁ గూడినరాజ్యపదవికి వారువచ్చిరి తమసత్కర్మను, తమసచ్ఛాస్త్రపఠనమును వారు చేతఁగొని కాలాక్షేపము జేసిరి. క్రీ. పూ 46-వ శతాబ్దమునాటికి వారు నాగరికులై యుండిరి, అంతకు పూర్వము వారాయుగములలో నెన్నిదివ్యసంవత్సరములు గడిపిరో చెప్పలేము.

క్రీ. పూ 46-వ శతాబ్దమున "మనేసుఁడు" అనువాఁడు సంస్థానమున స్థాపించిన మూలపురుషుఁడు కొన్నిసంగతులలో మనముకాలనిర్ధారణఁ జేయలేము.ఎంతకాలము గతించినను, "మనేసుఁడు"అనురాజు వారిమూలపురుషుఁ డనుమాట నిశ్చయము. అతఁ డాదేశముయొక్క దక్షిణోత్తరభాగములఁ బరిపాలించెను, "మంఫిసు" పట్టణముఁ గట్టించెను. అన్నిదేవతలలో నేదేవుఁడు సర్వశాస్త్రములను మనుజులకుఁ దెలియఁజేసెనో, ఆ"ధా"అను దేవున కొకదేవాలయము నతఁ డాపట్టణములో నిర్మించెను,ఆదేవాలయముయొక్క రూపముమాసిపోయెను, ఆపట్టణముయొక్క దిబ్బలమీద "కైరో" పటణమును నేడుకటిరి.

మఱియాఱువందలసంవత్సరములకు, అనగా క్రీ.పూ. సం॥3800ర ప్రాంతమున నాల్గవతరములోని "శేనుఫరుఁడు" అనురాజును వానిసంతతివారును "పిరమిదుల" గట్టుట కారంభించిరి.సాష్టాంగముఁ జేయు శత్రురాజు నొకనిని గదతోఁగొట్టుచుండిన విధమున నీరాజు బొమ్మశిలమీఁదఁ జెక్కఁబడియున్నది. "శత్రుమర్దనుఁడ" ని బిరుదు వహించి, పరదేశీయులను జయించి వారివలన గప్పముల నతఁడు పుచ్చుకొనెను. ఆకాలములో "ఇంద్రజాలము" నందు వారికి నమ్మకముకలదు. ఒకనాఁడీరాజు చింతాక్రాంతుఁడై నీరసపడియుండ, ఐంద్రజాలికుఁ డొకఁడువచ్చి "ఓరాజా, ఒకపడవలో నీవు సరోవరముమీద విహరించిన యెడల, నీవుస్వస్థచిత్తుఁడవుకాగలవ" ని సలహాచేసెను, బంగారు కట్లుగల దంతపుతెడ్లను చేతులలోఁ బట్టుకొని పడవను గడుపుట కిరువదియువతులు సిద్ధముగ నుండిరి. అప్పుడు రాజు దానిలోఁ బ్రవేశింప, వారు దానిని గడపిరి బుద్ధిపూర్వకముగ వారిలో నొకబాల తనచేతికంకణమును నీటిలోనికిం జాఱవిడిచి ఏడ్వసాగెను. రాజు ఆమె నుపలాలించి, ఐంద్రజాలికునికి వర్తమానముఁ బంపెను. అతఁడు శీఘ్రములో వచ్చి తనమహిమచేత సరస్సులో నొకప్రక్కనీరంతయు మఱియొకప్రక్కకు వచ్చునటులఁ జేసి, ఆమెకంకణము నామెకిచ్చివేసిన తరువాత, సరస్సుపూర్వమువలె జలపూరిత మయ్యెను.

అనంతరము "ఖేయోపసు" అనురాజు సింహాసనమునకు వచ్చెను. అతఁడు "పెద్దపిరమిదు"ఁ గట్టించెను. "హిరోదతేశుఁడు" అను గ్రీకుచరిత్రకారుఁడు చెప్పినసంగతులు కొన్నినమ్ముటకు వీలులేకపోయినను, అతఁడీరాజునుగుఱించి చరిత్రలోవ్రాసినయంశములు వినఁదగియుండును. "ఈరాజు దుర్మార్గుఁడు; కఠినచిత్తుఁడు , మనోవాక్కర్మలలోఁ గ్రూరుఁడు. దేవాలయములలో భోగరాగాదులను నిషేధించి, ప్రజలను దేవతార్చనవిధానములం జేయకుండునటుల నరికట్టి, తనస్వంతపనులను వారిచేతఁ జేయించెను. ఈప్రకారము పదిసంవత్సరములవఱకు వారిని నిరోధించి గనులలో వారిచేతఁ బనిఁజేయించి, రాతిపలకలను మోయింపించెను. తనగోరీనిమిత్తము పెద్ద

గోపురములఁ గట్టించి, వానిపునాదుల క్రిందభూగర్భములో మఱికొన్నిగదులను కట్టుటకు సమకట్టి, వారిచేతఁ బనిఁజేయించెను. 11 మొదలు 14 తరముల వఱకు "థీబిసు" పట్టణము రాజధానియై ప్రకాశించెను.

4-వ తరము మొదలు 11-వ తరమువఱకుఁ గలరాజులు 'పిరమిడు'లఁ' గట్టుటలోఁ గాలముఁ గడపిరి. 11-12వ తరములనాటికి "మంఫిసు" పట్టణము క్షీణింప అంతకుఁ బూర్వమునుండి పెఱుగుచువచ్చిన "థీబిసు" పట్టణము రాజధానియయ్యెను. దానిస్థితి మంచిది. పూర్వపశ్చిమదిశల నుండిన పర్వతశ్రేణులచేత శత్రుదాడినుండి రక్షింపఁబడి "నైలు" నది కిరుతటముల నుండు మైదానముమీఁద నాపట్టణము పెరిగెను. ఆనాటికి దేవతలందఱిలోను ఘనతవహించిన "అమను" దేవునికి విశేషభోగరాగాదులు జఱుగుచుండెను; అతని దేవాలయ మాపట్టణములో నుండెను. మతాభిమానులైనవారికి అది దేవస్థాన మయ్యెను.

11-వ తరమురాజులకు "ఆంతేవు"రాజు లని పేరు కలదు. వారిలో నొకఁడు వేఁటకాఁడు. అతఁడు కుక్కలతోఁ బోయి వేఁటాడుచుండినట్లు గోడమీఁదఁ జెక్కఁబడిన బొమ్మ జూడ నగును. ఈశిలాశాసనముల వలన మఱియొకసంగతి తెలియుచున్నది. ఓడవర్తక మారాజులకాలములో "అరబ్బి" మొదలగు దేశములతో మెండుగ సాగెను. లొట్టియలమీఁద నెడారుల గుండఁ బోవువర్తకుల కుపయోగింపనట్టుల నూతులం గొందఱు రాజులు త్రవ్వించిరి, దేశము పొలిమేఱలనుండిన ఖనులం గాపాడుటను "దండుదుర్గము"లఁ గొందఱు రాజులు కట్టించిరి.

క్రీ. పూ. సం॥ 2500 రములోఁ బండ్రెండవతరము రాజులు రాజ్యము జేసిరి. వారికాలములో నాదేశము మహోచ్ఛ్రపదవికి వచ్చెను. ఈతరములోను పూర్వతరములోను రాజులు గొప్పబిరుదులను వహించిరి. ఈతరములో "అమనేమ-హాతుఁడు" మొదటి రాజు అతనితరువాతి సింహాసనమునకు వచ్చిన వాని

కాలములో నొకవింతసంగతి జరిగెను; దీనింబట్టి వానిస్వభావముఁ దెలియ నగును. "శనేహతుఁడు" అను సైనికుఁడు రాజా అమనేమ-హాతుని మరణ మును విని, రాజపుత్త్రుఁడు 'ఉశర్త్సేనుఁడు' చండశాసనుఁడని భయపడి దేశము నుండి పరారియై తనప్రాణములఁ గాపాడుకొనెను. తుప్పలలోఁ బగటివేళలఁ దాగి, రాత్రికాలములోఁ బ్రయాణముగుచు, క్షుత్పిపాసలకు బాధపడి, కొంచెము నీరైనను దొరుకునని భ్రాంతిపడి, వాఁడొకస్థలమునకు వచ్చెను. అచ్చట నీరు కనఁబడినందున, నేలఁబడి వాఁడు మూర్ఛిల్లెను. కొంతసేపటికి గోవుల "అంభా" శబ్దమును విని లేచి, వాఁడొకగోపాలకునిఁ జూచెను. అతనిని వాఁడాదరించి, అతనికి క్షీరముల నిచ్చి, జవసత్త్వములు వచ్చినపైని, వెంటఁబెట్టుకొని, గోపపల్లెకు దీసికొని వెళ్లెను; కాని సైనికుఁడు మాత్రమచ్చట నిలువక రాత్రికిరాత్రి బయ లువెడలి "ఏడామ్" దేశమునకుఁ బారిపోయెను. వాఁడాదేశపురాజు కొలువు లోఁ బ్రవేశించి, క్రమముగ వృద్ధిఁబొంది సామంతుఁడై షడ్రసోపేతంబైన శాల్యోదనమును భుజించెను. కొంతకాలమునకు వానిపరాక్రమము విజృంభిం చెను. దేశములోని దుర్మార్గులదండును విదళించి, వాఁడు సేనాధిపతియై సైన్య ములతో విచ్చలవిడి సంచరించి రక్షణశిక్షణాధికారములను వహించెను. ఇటుల కాలముగడిపి, వాఁడు వృద్ధుఁడయినప్పటికిని వానికి స్వదేశాభిమానము పో లేదు. అప్పుడు వాఁడు మహాప్రభూ! రాజాధిరాజ, రాజమార్తాండ, నేను మనుజమాత్రుఁడను, ఏలినవారికి జాబువ్రాయు నేపాటివాఁడను ప్రభువువారి రాజ్యములో నివసించియుంటిని. ఎచ్చట నేయవస్థలోనుండినను, ప్రభు వుల పాదపద్మములను స్మరణఁజేయుచుంటిని, వయోవృద్ధునైతిని, స్వదేశ మునకు వచ్చి, తమపాదములవద్ద నాప్రాణములను నిశ్చింతగ విడువవలెనను కోరిక తప్ప మఱియొకటిలేదు. ప్రభువులు నాకోరికె నీడేర్పఁగలరు" అని "ఐజిప్టు" దేశపురాజునకు లేఖను వ్రాసిపంపెను. ఆదేశపురాజు దానింజూచి సంతసించి "నీస్వదేశాభిమానమునకు మేము సంతసించితిమి, నీకుఁ దగినసత్కా రముఁ జేయుదుము, నీవు మాదేశమునకు వచ్చి, నివసింపుము" అని ప్రత్యు

త్తరమును వ్రాసిపంపెను. వాఁడు దానిం జూచి స్వదేశమునకుఁ బోయి రాజుం జూచి కొంతకాలము జీవించి స్వర్గస్థుఁ డయ్యెను.

ఈతరములోనిరాజులు స్వలాభము నభిలషింపక ప్రజలసౌఖ్యమునకుఁ బాటుపడిరి. ప్రజలరాకపోకలకుఁదగురాజమార్గములను వారు వేయించిరి; సస్యోపయుక్త మగునటుల పెద్దజలనిధులఁ గట్టించిరి—వర్తకము సాగెను; శత్రువుల భయము లేకుండ దేశముయొక్క పొలిమేరలను రక్షించిరి—"పిరమిదులఁ" గట్టుటలోఁగంటె దేవాలయములఁ గట్టుటలోఁ బ్రజలు శ్రమపడిరి. "అమనేమ - హాతుఁడు" గొప్పవేఁటకాఁడు, "సింహముఁ జంపి, మొసలిని కట్టి తెచ్చిన వాఁడ" నని యతఁడు బిరుదువుండెను—వీనికంటె గొప్పసంగతి యేమన, పొలిమేరలఁగాపాడి దేశమునకు స్వాస్థ్యముఁ దెచ్చినందున, నతనిని ప్రజలు ప్రేమించి గారవించిరి. అతనికుమారుఁడు "ప్రథమ—ఉశర్తెసనుడు" సింహాసనము నెక్కి, అశ్మక్రియ, చిత్రక్రియల వైభవములతోఁ గూడినదివ్యభవనములను నిర్మించి, "హేలీపురము" లో మార్తాండదేవాలయముఁ గట్టించెను—ఆదేవాలయము నేలఁగలిసెను: కాని దానిగోపురశిఖరము నేడు చూడనగును.

అతనితరువాత "ద్వితీయఉశర్తెసనుఁడు" రాజ్యమునకు వచ్చెను. ఈకాలములో"ఆశియా"ఖండమునుండి"సమేతి" కుటుంబములోనివారు కొందఱీదేశమునకు వచ్చి రాజాజ్ఞపైని కొన్నిసారవంతములగు భూములను సాగుఁ జేయుటకుఁ బుచ్చుకొని, నివసించుటకు నివేశనములను నిర్మించి భార్యాపుత్రాదులతోఁ గాపురముండిరి. బాణములు గుదియలు ధనస్సులు వాద్యవిశేషములు—మొదలగువానితో వారు దేశములలోనికి వచ్చిరి. ఉపాయనముక్రింద వారుగొఱ్ఱెలను సుగంధద్రవ్యములఁ దెచ్చి రాజున కిచ్చిరి. ఈకథయంతయు శిలమీఁదబొమ్మలుగా చెక్కఁబడియున్నది.

"తృతీయ-అమనేమహాతుఁడు" - క్రీ. పూ. సం. 2622—2578 రములు;—ఈకాలములో నతఁడు సుప్రసిద్ధుఁడు "అపాంపతి" యని బిరుదు వహించెను. ఒకసమయమునఁ బ్రతిసంవత్సరము "నైలు" నది పొంగి తాళప్రమాణమున వరదవచ్చి దేశముమీఁదబడి పాడుచేయుటకలదు; లేక, అనావృష్టిచేతఁ గొన్నిసంవత్సరములలో నదిలో నీరులేక సస్యములు ఫలింపక పోవుటయు కలదు. ఈఅతివృష్టి అనావృష్టివలనఁ గలుగుబాధలఁ దొలగించు సాధనమెవరికిఁ దెలియలేదు. "నైలు"నదినుండి "లిబియా" పర్వతములలో వఱకు నొకకాలువఁ ద్రవ్వించి, ఆకాలువలో నతఁడొకపెద్దజలనిధిం గట్టించెను. అతివృష్టివలన నది యుప్పొంగి పొర్లిపారినపుడు ఆపొర్లునీరు యావత్తు కాలువగుండ "జలనిధి" లోనికిఁ బోవుచుండెను, అందుచేతఁ బ్రజలకును పశువులకును సస్యములకును బాధలేకయుండెను. అనావృష్టిచేత నీటియెద్దడి కలిగినపుడు, మఱియొక కాలువగుండ నీరుఁ బారించి, వారు పంటల బండించిరి. "పద్వ్యాలా"యను పేరుగల "పిరమిదు" నతఁడు కట్టించెను. ఇందులో మూడువందలగదులు భూమట్టములోను మఱిమూడువందలగదులు భూగర్భములోను కలవు. ఇవియన్నియు చిక్కుదారులచేతఁ గలుపఁబడి, ఆగదులవంటి పండ్రెండు మహోన్నతమైన కొలువుకూటములు కలవు. ఆదేశీయులకు బవిత్రమైన మొసళ్లు చనిపోయిన తరువాత వానిని సమాధిఁజేయుటకొఱకీ "పిరమిదు" కట్టబడెను. "బైబిలు" గ్రంథములో 'ప్రపంచోత్పత్తి' యనుకాండలోఁ జెప్పిన ప్రకారము "అబ్రహాము" అనువాఁడీరాజుకాలములో విదేశమునకు వచ్చియుండును. అతనివంటివారేకాక, తదితరదేశీయులు కూడ సర్వసస్యఫలవంతమని తెలిసి ఈదేశమునకు వచ్చి కాపుర ముండిరి. ఈరాజు స్వర్గస్థుఁడయిన తరువాత, నాదేశముయొక్క సిరిసంపదలు తొలంగెను; ఆమెను నీచదశలు సంప్రాప్తమయ్యెను.

15-16 సంవత్సరములు—"హికేశ" రాజులు:—ఇదివఱకు మనము క్లుప్తముగ చూచికొనివచ్చిన శతాబ్దములలో మఱికొన్ని స్వతంత్రరాజ్యములు

పగదేశములలో స్థాపింపఁబడెను. కాలక్రమమున "అశీరియా" దేశము బుద్ధి బలమును, దేహబలమును, ధనబలమును కలదియై, తనసరిహద్దులను విరివిఁ జేసి కొనుచు "ఐజిప్టు"దేశముతో శత్రుత్వమువహించెను. ఈదేశమున కిరుగుపొరుగున నుండినవారు సహితము బలవంతులై జనాభివృద్ధియగుటచేత స్వదేశము సరిపడనందునఁ బరదేశముల నాక్రమించుటకు సిద్ధపడుచుండిరి. "హితేయులను" వారును 'కేసులను', వారును ఒకకుటుంబములోని వారని శిలాశాసనముల వలనఁ దెలియుచున్నది, వీరుకూడ బలవంతులై స్వదేశముచాలనందున నీకాలములో 'ఐజిప్టు' దేశముపైకి దండెత్తివచ్చిరి. నూతనముగ దండువెడలి వచ్చిన వారును దేశములో నిదివఱకు గాపురముండినవారు నేకకుటుంబములోనివారై దేశము క్షీణదశలో నుండుటచేత వారు దానిని సునాయాసముగ నాక్రమించిరని సిద్ధాంతము కలదు. "మనేతుఁడ"ను ప్రాచీనచరిత్రకారుఁ డీవిధమున వ్రాసెను:—"కేవలము నీచులును హీనకుటుంబములోని వారొకరు మాదేశముపైకి దండువెడలుటకుఁ దగినధైర్యస్థైర్యములం గలవారై వచ్చి మాదేశరాజులు తరాజులుగనుక వారిని స్వాధీనముఁ జేసికొని, ఒకయుద్ధమైనఁ జేయక దానినాక్రమించిరి. మారాజులు వారిచేతిలోఁ జిక్కుపడిరి, వారు పట్టణములను ధ్వంసముఁజేసి, దేవాలయములను నేలఁగలిపి ప్రజలను చెప్పరాని బాధలఁ బెట్టి ఆబాలవృద్ధుల 'స్త్రీపురుషాదులఁ గట్టి కొట్టిచంపి, మిగిలినవారిని బానిసలుగఁ జేసిరి! ఇటుల పూర్వదిశనుండి బయలువెడలివచ్చిన అనాగరికులదండు పార్లిదేశముమీఁదఁ బారినందున పూర్వోపార్జితమయిన యావత్తు నాగరికచిహ్నములు రూపము మాసిపోయెను—రాబోవు కొన్నిశతాబ్దములవఱకు దేశము క్షీణించి నీరసపడి యుండెను—"ఏవిధమైనశిలాశాసనములు లేక, దేశము మౌనమును ధరించియుండుటచేత, సమస్తకళల స్తంగతమైన వని తోఁచును"— మనుజులలో నొకరికొకరు కీడుఁజేసికొనిన యెడలఁ గీడుఁబొందిన వాఁడెటుల కొంతకాలముగడిచినఁగాని దనపూర్వపుస్థితికి రాఁజాలడో, అటులనే దేశీయులుకూడ సంఘముపైని కీఁడుఁబొందిన యెడలఁ గొన్ని శతాబ్దములవఱకుఁ దమపూర్వపుమహోచ్ఛ్రపదవిం బొంద నేరరు.

ఈతరములోని రాజులకు "హికేశుల" ని లేక "గోపాలకులని దేశము నాక్రమించిన వారు పేరుఁ బెట్టిరి. ఈదేశమునకు వచ్చుటకుఁ బూర్వము శత్రువులు "గోపాలకావస్థ" లేక "సంచారావస్థలో నుండెడివారు కనుక, వారీరాజుల కీపేరిడిరి. అయిదుశతాబ్దములవఱకు వారీదేశముఁ బరిపాలించిరి; దేశముయొక్క నాగరికతను పాడుఁజేయఁ దలచి, వారు చిట్టచివఱకు దానిచేత బాగుపడిరి. "ఇస్రాత్తేయుల" లోనివాఁడైన "జేకబు" కుమారుఁడు "జోసపు" ఈదేశమునకు వచ్చినపుడు, ఈగోపాలరాజులలో నొకఁడు వాని నాదరించి పోషించెను—గోపాలుఁ డనుమాటను వినిన, ప్రతి "ఐజిప్టీయునకు" ను అసహ్యము. "జేకబు" ను వానికుమారులవంటివారిని "హికేశ" రాజొకఁడు సన్మానించి తనదేశములోఁ గాపురముండునటులఁ జేసెను.

18-వ తరము నవీనరాజ్యము—క్రీ. పూ సం॥ 1700-రము ఎట్టకేలకు "హికేశ" రాజుల ప్రభుత్వ మంతరించెను. వారు నాగరికులైనను, వారి పిక్కబలమును దండబలమును తగ్గెను; వారివీరము నీరసించెను. తుదకు "హికేశ" రాజులును "థీబను" రాజులును కలిసి దేశమును రెండుభాగములుగఁ బరిపాలించిరి. "థీబను" రాజు "ప్రథమఅమేశుఁడు" స్నేహకోటిలోని సామంతరాజుల సహాయముచేత నొకసైన్యముఁ గూర్చి, దానితో దండెత్తి పోయి "హికేశ" రాజు నోడించెను. ఇంతటితో వారంతరించిరి; హతశేషులు "థీబను" రాజునకు స్వాధీను లయిరి.

"ప్రథమ తాత్మేశుఁడు"—ఈరాజు "ప్రథమఅమేశు"ని మనుమఁడు. 'తాత్మేశుఁడు' దేశమునకు స్వాస్థ్యముఁ దెచ్చి పరదేశములను లోఁబర్చుకొనుటకు దండుఁ దీసికొని బయలువెడలెను. "నూబియ" "కుషు" దేశముల నతఁడు జయించెను. ఈజయముఁ గీర్తించుచు శిలాశాసన మొకటి వ్రాయబడెను. "అతఁడు పూర్వదక్షిణోత్తర పశ్చిమదిశలయందలి రాజులను జయించి వారివలన కప్పములఁ బుచ్చుకొనెను; అనాగరికులగువారిని లొంగదీసెను;

సము స్తదేశాధీశు లతనిపాదాక్రాంతులయిరి” అని శాసనములో వ్రాయబడెను. అనంతరము “ఐజిప్టున” కు త్తరమునను “ఆశియా” ఖండమునకు నైరృతి మూల నుండిన “బాబిలను” “ఆశిరియా” దేశములపైకిని, “హితేతులు, కానేతులు, ఫిలస్తేనులు” మొదలగువారి దేశములపైకిని దండునెడలి “పాలస్తేను” దేశముగుండఁ బోయి “యూఫ్రిటీసు” నదిని దాటి ఘోరాహవములో వారిని అతఁడు జయించెను. వారివలనఁ గప్పముల బుచ్చుకొని, జయజయధ్వనులు మోఁయ మహావైభవముతో నతఁడు స్వరాజధానికి వచ్చిచేరెను. శేషించిన పరిపాలనకాలము నతఁడు దేవాలయములఁ గట్టించుటలోను, సర్వజనోపకారమగు పనులలోఁ గడిపెను. అతఁడు దేశమునకు 'స్వాస్థ్యముఁ దెచ్చి దానికి రూపురేఖవిలాసముల నమర్చెను; పరదేశీయులతో స్వదేశీయులకు సంబంధముఁ గలుగఁజేసెను. ఈసంబంధము కేవలము దండోపాయము మీఁద నిలువఁబడి యుండినను, మున్ముందు దృఢము కాగలదు.

“ ప్రథమతాత్మేశునకు” “ద్వితీయతాత్మేశుఁ”డను కుమారుఁడును “హతేశి” అను కుమార్తెయు కలరు. అతని మరణానంతరమును కుమారుఁడు సింహాసనమునకువచ్చెను, కాని, అతని కుమార్తె రాజ్యపాలనఁజేసెను. గాంభీర్యములోను, ధైర్యస్థైర్యములలోను, ప్రభుమంత్రోత్సాహశక్తులలోను “హతేశి” భ్రాతను మించినది కనుక నామెదేశముఁ బరిపాలించెను. తనతమ్ముని జీవితకాలములో నామె రాజ్యసూత్రములను వహించి, శాశ్వతమైన కీర్తిపనుల జేయ నారంభించెను. “థేబీసు” పట్టణము వద్ద నపూర్వముగ దేవాలయమొకటి యామె కట్టించెను; కార్నాకు పట్టణములోని “ఆమను” దేవాలయమును పూర్వముకంటె విరివి చేయించెను. ఇంతటితో నామె తృప్తి జెందలేదు తమ్ముని మరణానంతర మతనికుమారుఁడు “తృతీయతాత్మేశుఁడు” బాలుఁడైనందున నతనిని నామకార్థము రాజుఁజేసి, ఆమె రాజ్యముఁజేసెను. “సూర్యదుహిత” అనియు, ఆమెకు దేవపత్ని అనియు ఆమెకు బిరుదులు కలవు ఆమె క్రమముగ పురుషునిదుస్తులను ధరించి, మహారాజాధిరాజ అని పిలువఁబడెను. ఇంతేయ

కాదు. ఆమె పడవలఁ గట్టించి పరదేశములతో నోడవర్తకమును సాగించెను. రుధిర సముద్రమున కిరుతటముల నుండు ప్రదేశములు సుగంధద్రవ్యములకుఁ బ్రసిద్ధికెక్కినందున, వానితో వర్తకము సాగెను. ఆదేశముల నేలుచుండిన రాణి సుగంధవృక్షములఁ దీసికొని "హాతేశి" నిఁ జూచుటకు బిరుదునిశానీలతో వచ్చెను. ఇందుకు ఆమె సంతసించి "అమను" దేవునకు మఱియొక దేవాలయముఁ గట్టించెను. ఆదేవాలయముయొక్క రాతిగోడలమీఁద నీచరిత్రమంతయు చిత్తరువు చెక్కఁబడియున్నది. సముద్రముమీఁద నోడలు పోవుటయు, సుగంధద్రవ్యములఁ బట్టుకొని వ్యవహరించు వర్తకులును, సుగంధవృక్షములతో వచ్చిన రాణియు, బిరుదునిశానీలతో నొకరినొకరు కలియుటయు ఈ— మొదలగు కథయంతయు బొమ్మలుగా కనఁబడును.

ఈలోపున నామె మేనల్లుఁడు 'తృతీయతాత్మేశుఁడు' దినదినప్రవర్ధమానుండై త్రిశక్తులలో నేమి, పంచతంత్రములలో నేమి, చతురంగబలముల నడిపించుటలో నేమి, పితామహుని మించెను. ఆమె కిష్టము లేకపోయినను, రాజకీయవ్యవహారములలో నామెతో నతఁడుకలసి సంచరించెను. కొంతకాలమున కామెపంచత్వమునొంద, నతఁడు సింహాసనము నెక్కి, శాసనములలో నామెపేరుఁ దీసివేయించెను. త్రయోవింశతిజననదినమున, నతఁడు రణభేరి వేయించి, చతురంగబలములతో "సిరియా" దేశమునకు సింహద్వారమగు "గాజా" పట్టణమునకుఁ బోయి, అచ్చట "ఫిలస్తేనుల" నోడించెను; అచ్చటనుండి "ఫాలస్తేను" దేశమునకు నడిచెను. "మాగేద్ధియ" పట్టణదుర్గమువద్ద "సిరియనులు—హితేయులు" యొక్క సైన్యములఁ బోరాటములో నోడించి, జయశబ్దములు మ్రోగ రాజధానికి వచ్చిచేరెను. విడువక ప్రతిసంవత్సర మతఁడు "సిరియా" దేశముపైకి దాడి వెడలుచుండెను. ప్రతి దండయాత్రలోను సైనికులు వెండిబంగారములను రత్నములను సుగంధద్రవ్యములను తీసికొని వచ్చుచుండిరి. 'యూఫ్రిటీసు' నదీతీరమున నుండు 'నియో' పట్టణమువఱకు నతఁడు దాడి వెడలినను, ఆదేశపురాజతనితోఁ గలహించుటకు

భయపడి సంధిఁ జేసికొనెను. "బాబిలను" దేశవాసులు కూడ నుపాయనములనతనిఁ బంపిరి. ఇటుల జగదేకవీరుఁడై సముద్రముమీఁదఁ బోయి "గ్రీసు" "ఇటాలియా" దేశముల సముద్రప్రాంతభూములను కూడ బహుళః స్వాధీనముఁ జేసికొనెను, "కైప్రసు" ద్వీపవాసుల నోడించి వారివలనఁ గప్పములఁ బుచ్చుకొనెను. అతనికాలములో "ఐజిప్టు" దేశము వీరదేశమని ప్రఖ్యాతి కెక్కెను. అతని కీర్తిస్తంభములు రెండు "లండను" పట్టణములోఁ గలవు. ఒకటి, దేవాలయగోపురశిఖరము "తేమ్సు" నదీతీరమునఁ గనఁబడును, మఱియొకటి "ఆంగ్లేయ సర్వవస్తుభాండాగారము"లో నతని శిలాప్రతిమయొక్క శిరోభాగమునఁ జూడనగును.

అతనివంశస్థుఁడు "తృతీయ అమనేతపుఁడు" రెండుమహోన్నతమగు శిలాప్రతిమలను నిర్మించి స్థాపించెను. వానిమూలమున నతనిని నేటివఱకు స్మరించుచుంటిమి. వేఱువేఱుగ నవి రెండును ఏకాండపుశిలలతోఁ జేయఁబడెను. ఈశిలాప్రతిమకారుఁడు రాజాపేరు కలవాఁడు. "ఆచంద్రార్కము రాజాపేరు భూమిమీఁదనుండునటులఁ జేసితిని; నేను చేసిన విధమున మఱియొకరు చేయలేరు. ఒడ్డుపొడుగులలో నీశిలాప్రతిమలఁబోలినవి లేవు—వానినిచేసి, ఎనిమిదిపడవలమీఁద 'థేబీసు' పట్టణమునకుఁ దెచ్చితిని—'ఆలయములో వానిం బ్రతిష్ఠంజేసినరోజున నాగ్రామములో మహోత్సవము జరిగెను' అనివాఁడు శిలాశాసనములో వ్రాసికొనెను.

రోమనురాజ్యము స్థాపింపఁబడిన ప్రథమసంవత్సరములలో, యాత్రికులు కొందఱీదేశమునకుఁ బోయి, ఈశిలాప్రతిమలఁ జూచినపుడు వీనిలో నొకదానిలోనుండి సంగీతధ్వనిపుట్టి నిరంతరము వినబడుచుండెను. ఇదియథార్థము. ఈధ్వనికిఁ గారణ మేమన, క్రీ. పూ. సం. 25 రములో నొక భూకంపము వచ్చెను, దానివలన నాప్రతిమ కొంచెము వికలమై, ఋతుధర్మములు మాఱినపుడు ధ్వని వినఁబడుచుండెను. మఱి రెండువందల సంవత్సరములు గడి

చినతరువాత నా ప్రతినుయొక్క వైకల్యము బాగుచేయఁబడెను; ఆశబ్దము విన బడుటలేదు.

18-వ తరము :—శాసనములఁ బట్టిచూడ, నీతరములోని రాజులు పర దేశములను జయించి, రాజ్యమును విరళముఁ జేసిరి. ఆశియాఖండపు పశ్చిమ భాగమును వారు స్వరాజ్యములోఁ జేర్చిరి. ఈమహారాజ్యము మూఁడువందల సంవత్సరములవఱకు నడిచెను. 'హిక్షేశ' రాజుల కాలములో నంతరించిన శాస్త్రము లంకురించి విజృంభించెను. 'పాటు--పోటు; పోటు...పాటు' ఈ ప్రకారము కాలచక్రము తిరుగును; దేశీయుల స్థితిగతులఁకూడ నటులనె దొర్లును.

పందొమ్మిదవఅధ్యాయము.

"ఈజిప్టు"—క్షీణదశ.

మధ్యరాజ్యము:—చక్రారాధన:—"చతుర్థ-అమునేతపుఁడు" పట్టాభిషిక్తుఁ డయ్యెను. దేశములో నంతటఁ బురాతనమునుండి దేవాలయములలో నారాధింపఁబడుచుండిన 'అమను' దేవతను నిషేధించి 'అతెను' అను సూర్యచక్రాధిష్ఠానదేవతనుఁ బూజింపవలసిన దని రాజుయే నాడు ప్రకటింపించెనో, ఆనాడు మొదలు వారికి దర్శనములు ప్రారంభ మయ్యెను. 'ఖుతాతేను' అను పట్టణము నతఁడు రాజధానిం జేసెను; అచ్చట 'అతెను' దేవున కొక ఆలయముఁ గట్టించెను. దేశములోఁ బ్రతిదేవాలయములో 'అమను' దేవునివిగ్రహములఁ గొట్టి ముక్కలు చేసిరి. సమస్తప్రాణుల కాధారభూతుఁ డనియు,సమస్తజీవులకుఁ బ్రాణదాత యనియు వారు 'అతెను' దేవునిం గొలిచిరి. నిర్గుణుఁడైన భగవంతుఁడు సూర్యుని తేజోరూపమున వెలుగుచుండె నని వారిమతము పూర్వము వలె ననేక దేవతల నారాధించుట విడిచిపెట్టి, ఇందుమూలమున వారొక దేవుని

నమ్మియుండిరి, కాని, పరలోకమును గురించి వారిపూర్వులకుఁ గలగొప్ప చింతలు వారి కీనూతనమతము వలనఁ గలుగలేదు. నవీనముగఁ గట్టఁబడిన దేవాలయములో భగవంతునిఁ బూజించుచు రాజు కాలముఁ గడిపెను; అతఁడు 'ఖునేతనుఁడు' అని మారుపేరుఁ బెట్టుకొనెను. ఈనామమునకు "చక్రవిభూతి" అని యర్థము. మనుజు లందఱీభగవదారాధనముఁ జేయునటుల రాజురాత్రింబవళ్లు శ్రమంపడెను. నూతన "ఆతెను" దేవతారాధకులనియు, పురాతన 'ఆమను' దేవతారాధకు లనియు, దేశీయులు ద్వైతమతస్థులయిరి. వారిలో వారికి మతకలహములు బలిసెను. ఎప్పుడు జూచిన మతవిషయకవ్యాదములలోఁ గాలము వ్యయముఁ జేయుచు, వారు దేశముయొక్క క్షేమముఁ గోరలేదు. నిరర్థక ప్రసంగములలోఁ దిగి, దేహపరిశ్రమఁ జేయనందున, వారు క్రమేణ నీరసించిరి వారు దుర్బలులని గ్రహించి, చుట్టుప్రక్కలనుండిన దేశీయులలోఁ బూర్వము వారిచేత నోడింపఁబడిన 'ఖేతులు' అనువారు నేఁడు బలవంతులై, వారిరాజుల నెదిరించిరి; అందుచేత, వారుశత్రువులతో సఖ్యముఁ జేసికొనిరి.

19-20. తరముల రాజులు.—ఉచ్ఛదశ:

'ప్రథమసేతుఁడు' అనురాజు సింహాసనము నెక్కి కృశించిన రాజ్యము నుద్ధరించెను. 'మహాభవనకర్త' అని అతనికిఁ బేరువచ్చెను. 'కార్నాకు' పట్టణములో మహోన్నతమైన స్తంభావళితోఁ గూడిన హజారము నతఁడు కట్టించెను 'అబిడాసు' లో 'మమనోనియ' అను దేవళమును నిర్మించి, దానిగోడలమీఁద నతఁడు 'మనేశు' రాజు మొదలు తనవఱకుఁ గలరాజుల వంశావళిఁ జెక్కించెను. అతఁడును, అతనికుమారుఁడును భగవంతునికి సుగంధద్రవ్యములను సమర్పణఁ జేసి, సహస్రగోవులను, సహస్రసోమపాత్రలను తమలో నొక్కొక్కనికిం దయచేయుమని ప్రార్థించుచున్నట్లు వారిబొమ్మలు చెక్కఁబడి యున్నవి.

"పాలస్తేను" దేశములోను తూర్పుదేశములలోనుండి వారు తిరుగబడినందున, సింహాసనమునకు వచ్చినవెంటనే "ప్రథమసేతుఁడు" దండువెడలి వారిని జయించి "సిరియా" దేశవాసుల గర్వము నణఁచెను. స్వదేశభాస్కరుఁడనియు, విదేశహిమకరుఁడనియు బిరుదులను వహించి శత్రువుల నతఁడోడించెను. "ఖేతులు, హితేతులు, అమరేతులు" మొదలగు వారిపొంకముఁ దగ్గించెను; కాని వారతని పరోక్షమున స్వరాజ్యమును స్థాపించుకొనిరి. "శత్రుదేశములలో జంబుకమువలె ధారాళమైన ధావనము కలవాఁడనియు, దుర్గమప్రదేశములలో సింహము వలె దుర్నివార్యమైన ప్రవేశము కలవాఁడనియు, తీక్ష్ణమైన శృంగములుఁ గలవృషభమువంటివాఁడనియు, ఆశియాఖండనివాసులను భంగపఱచి, వారిరాజు లదిరిపడుటకుఁ దురాయివంటివాఁడనియు" దేశీయు లతని మీఁదఁ గూర్చిన పాటలు కలవు. అనంతరము "దక్షిణసిరియా" దేశము నతఁడు జయించి, దానిని స్వరాజ్యములోఁ గలిపెను, "ఉత్తరసిరియా" లో నుండిన "ఖేతుల" తో సంధిఁ జేసికొనెను, "ఐజిప్టు" మొదలు "క్రైరీని" పట్టణము వఱకుఁ గల మధ్యదేశములో నుండిన వారిని జయించెను. వీరు పర్వతగుహావాసులు; వీరి నేత్రములు వృషభముల నేత్రములఁ బోలియుండెను; స్వచ్ఛమగు శరీరకాంతిఁ గలవారు, వీరు శిరస్సులను ముండనముఁ జేసికొని, వానికొక ప్రక్కనుజడను ధరించియుండిరి అతఁడు దక్షిణమున 'నైలు' నదిఉత్పత్తిస్థానమువఱకుఁ బోయి, అచ్చటి 'నీగ్రుల' ను జయించెను, ఇటుల నలుదిశల సాధించి 'రాజుల నీరాజనములఁ బడసి' రాజధానికి వచ్చెను. శత్రువులదాడినుండి దేశమును రక్షించుటకు బురుజులతోను భటదుర్గములతోఁ గూడిన మహోన్నతమైన ప్రాకారపుగోడఁ గట్టించుట కారంభించి, అతఁడు స్వర్గస్థుఁడయ్యెను.

అతనికుమారుఁడు 'ద్వితీయరామేశుఁడు' సింహాసనము నెక్కి, తండ్రికాలములో నారంభింపఁబడిన ప్రాకారములఁ బూర్తిఁజేసి యుద్ధములో నప్రతిరథుఁడని పేరుఁ దెచ్చుకొనెను. అతని వీరప్రతాపములఁ గొనియాడుచు నొకచాటుధారగీతము కలదు. ఆశియాఖండమునుండి "ఐజిప్టీయుల" దోలఁగిం

చుటకు "ఖేతులు" తిరుగఁబడినపుడు అతఁడు వారిమీఁదికిదండు వెడలెను. ఆసమయమున రణరంగములో నొకభాగమున నతఁడొక్కఁడురథము నెక్కి శత్రువులతోఁ బోరాడెను. మంతు దేవుని వలెఁ బోరాడితిని, కుడిచేతితో గదను ప్రయోగించితిని; ఎడమచేతితో ఖడ్గముఁ బట్టుకొని పోరాడితిని 'బాలు' దేవునికిఁ బోలి వీరావేశము వచ్చెను పంచసహస్రహయముల మధ్యనుండినను నాతురగములు వానిని దునుమాడెను, శత్రువులలో నొకరైనవామీఁదికిఁ గత్తి నెత్తలేక, లోలోపలవారు క్రుంగిరి, నన్నుచూచిన తోడనే వారు భీభత్సులై, అవయవముల పటుత్వము చిటిలిపోవ గదను ప్రయోగించుటకు గాని బల్లెముతోఁ బొడుచుటకు గాని వారికి శక్తిలేకపోయెను. వారుచైతన్యము లేక పడి నాచేఁ జచ్చిరి. అని రాజులుచెప్పినట్లు గీతములో వ్రాయఁబడినది. ఈ యుద్ధమువలన నతనికి లాభము లేకపోయెను. కొంచెముకాలములో వారితో సంధిఁ జేసికొని, ఖేతుల రాజకుమారికను రామేశుఁడు వివాహమాడెను. క్రమముగ నతని పరిపాలనాంతమునకు ఐజిప్టీయులు కృశించి నీరసించిరి.

'ప్రథమసేతుఁడును, అతనికుమారుఁడు ద్వితీయరామేశుఁడు ను మహాభవనకర్త' లని పేరుబడిరి ఉన్నతములగు వారిశిలాప్రతిమ నేటివఱకు జూడవగును. ఆపాదమస్తకపర్యంతము వారి రూపరేఖావిలాసము లీప్రతిమలయందు నిర్దుష్టముగఁ గనఁబడును.బహుశః ఈరామేశుఁడే ఇప్రాత్తేయులను కష్టపెట్టెను. ఖనులఁ ద్రవ్వించి శిలలను వారిచేత మోయించెను, వారిచేత నాయుధముల బట్టించి శత్రువులమీఁదికి యుద్ధమునకుఁ బంపెను. ఇన్నివిధముల వారిని గష్టపెట్టుటకుఁ గారణమేమి? వారు మొదట గోపాలకులు, వారిదేశము పొలిమేర భూములకు వచ్చి విడిది చేసియుండిరి. క్రమక్రమముగ వారు పెరిగి వృద్ధిఁ జెందిరి. అందుచేత వారు తనదేశము పైకి నుట్టుకొని వచ్చెద రనుభయముచేత రామేశుఁడు వారినిఁ గష్టపెట్టెను; కనుక వారిచీమురక్తము లెండి, వారు నీరసించి కృశించిరి. పశువులవలె వారు బరువులను మోయుచుండిరి. "వరవేత్రహతోత్తమాంగులై" యుద్ధమునకుఁ బోయినపుడు రోధుల రథము

లను వారు లాగిరి; బనులలోని రాళ్లను తీసికొనిపోయి 'పిరమిదుల' ను వారే గట్టిరి; ఈపనులు వారికి నికృష్టమై హేయమైన పని తోఁచెను, ఈపనులలో వారిగుండెలు జారిపోయెను. 'ఆశియా'కును 'ఐజిప్టు' నకును మధ్యనుండిన ప్రాకారపుగోడ నంటి 'రామేశము' 'పిథాము' అనుపట్టణములు రెండు 'ప్రథమసేతుని' కాలములోఁ గట్టనారంభింపఁబడి అతనికుమారుని కాలము నాటికిఁ బూర్తి అయ్యెను. ఈనగరములలో రాజుయొక్క ధనాగారములుండెను, వీని నిర్మాణములో 'ఇస్రాత్తేయులు' నియోగింపఁబడిరి. 'ద్వితీయ రామేశుని' లేక అతనికుమారుని ఆస్థానములో 'బైబిలు'లోఁ జెప్పఁబడిన "మోసెస్సు"అనువాఁడు పెరిగి పెద్దవాఁ డయ్యెను. ఈరామేశుని శిలాప్రతిమలు ఆంగ్లేయసర్వవస్తుభాండాగారములోఁ జూడ నగును.

మనప్థుఁడు:—ఈరాజు సింహాసనమునకు వచ్చినతరువాత నారాజ్యము నీచాభిముఖమై దిగనాఱుచు వచ్చెను. అతని శిలాప్రతిమలఁ జూడ, మృదువగు రూపురేఖవిలాసముల కలిగి ధైర్యస్థైర్యములులేని దుర్బలుఁడగు రాజు అని తోఁచును, చతురోపాయముల నెఱుఁగక చతురంగబలముల నెట్లు నడిపించును? ఐంద్రజాలికులసహవాసముతో నతఁడు కాలము వెళ్లఁబుచ్చెను. అతని రాజ్యారంభమున స్వకీయపరకీయ రాజ్యవ్యాపారములు శాంతముగ గమనించుటచేత, దేశమునకుఁ దొట్రుపాటురానేర దనిమంత్రులు భ్రాంతిఁ బడిరి. రాజు కళాహీనుఁడైనపుడు లోకమునకుఁ గాంతియెటుల వచ్చును.

అతఁడు రాజ్యమునకు వచ్చిన అయిదవసంవత్సరములో నాదేశమునకు వాయవ్యమూల నుండిన "లిబయా" దేశపురాజు తదితరరాజులతోను దేశీయులతో నేకీభవించి నలుబదివేలసైనికులను వెంటఁబెట్టుకొని అతనిమీఁదికి దాడి వచ్చెను. చతురంగబలముల నడిపించుకొని పుత్రమిత్రకళత్రాదులతో నీదేశము నాక్రమించి కాపురముండుటకు వారు వచ్చిరి. వారి ధాటికి 'ఐజిప్టీయులు' నిలువలేక పోయిరి. 'మంఫిసు' 'హేళీపురముల' వఱకును వారు వచ్చి, వానిచుట్టు ప్రక్కలనుండిన ప్రదేశమును ధ్వంసముఁ జేసి, వానిమీఁదికి వచ్చిరి.

హికేశరాజులకాలములో నైన, ఇట్టియుపద్రవముఁ జూడలే'దని ఆదేశచరిత్రకారుఁడు వ్రాసెను. క్రమముగ శత్రువులుచుట్టుకొని వచ్చి గ్రామములను పట్టణముల నాక్రమించుకొనిరి.

ఆ 'మంఫీసు' పురంబులో 'నగరిలో నామూలసౌధంబు చాపల మందారవనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలోత్పలపర్యంకము'ల మీదఁ బవళించి వినోదించు రాజు 'మనేపథుఁడు' శత్రువులరాక విని ఉలికిపడి లేచి సింహమువలె గర్జించి దండనాయకుల రప్పించి చతురంగబలముల నాయత్తముఁ జేసెను. దండును వెంటఁదీసికొని వెడలుటకు రాజు సిద్ధపడెను. అప్పుడు యోధులను రప్పించి, "ఓయోధులారా! ఓసైనికులారా! మీరు మాబిడ్డలు, స్వదేశాభిమానులు ధైర్యస్థైర్యజేగీయమానసులు—ఓవీరులారా! మీతాతతండ్రులవలె స్వదేశముయొక్క కీర్తిప్రతిష్ఠల నిలువఁబెట్టుటకుఁ గాలము వచ్చెను. మా ప్రభుత్వములో నెట్టి యిక్కట్టులు రాకుండ మిమ్ములఁ గాపాడు భారము మేము వహించితిమి మీసహాయముచేత శత్రువులను శాసించుటకు సిద్ధపడితి. శీఘ్రముగ లేచి నడుములను బిగించి, ధనుష్టంకారములం జేయుడు! భగవంతుఁడు మనకు జయము నిచ్చును. అనివారిని హెచ్చరించి, రాజు భుజాస్ఫాలనముఁ జేసి కత్తిఁ ద్రిప్పెను. ఇట్లు రాజుచేత నుత్సహింపబడిన సైనికులలో గోలాహలముపుట్టి వారు రణభేరిని వాయించిరి. ఇటుల "ఉత్తరకుమారుని, వలెఁ బ్రజ్ఞలఁబలికిన రాజు రణ శబ్దమును వినినతోడనే దిగులుపడి గుండెలఁ జాఱ విడిచెను—"మీతో రణభూమికి గమనించుటకు మాకు భగవంతుఁడనుజ్ఞ నయచేయలేదు, కనుక మీరుపోయి వారిని దండించిరందు, మేము స్వయముగ వచ్చి శాసించుటకుఁ దగినశత్రువులుకారు." అని రాజు వారికిఁ జెప్పెను. రాజు పిఱికిపందయని తలంచి, అట్టివాఁడు రాకపోవుటయే శ్రేష్ఠమనిభావించి,వారు శత్రువులమీఁదికిఁ బోయిరి. ఇటు లుభయసైన్యంబులు ప్రళయకాలధారాధరంబులుం బోలె దార్కొని వాఁడొండొరులపై శరపరంపరలు వర్షించుకొనిరి. ఈఘోరాహవములో శత్రువులు దిగనాడినందున 'లిబియాని' దేశాధీశుఁడు

దిగంబరియై పరారియయ్యెను. వేలకొలఁదిశత్రువులను యుద్ధములో వారు పట్టి తీసికొనివచ్చిరి; విశేషధనమును కొల్లాడిరి. ఇటుల శత్రుసైన్యములఁ దునుమాడి స్వసైనికులు స్వదేశాభిముఖులై రాజధానికి వచ్చిచేర, లజ్జావిహీనుఁడగు రాజు వారిజయమునకుఁ దాను కారణమని ప్రగల్భములఁ బలికినందున, రాజునందు గౌరవము దేశీయులకుఁ బోయెను. "మిడుతలదండువలె నాదేశముపైకి శత్రువులు వచ్చి ప్రతిమార్గము నరికట్టిరి; వారిని యుద్ధములో నోడించెదనని ప్రతిజ్ఞఁ జేసితిని—చూడుఁడు, ఎటుల వారిం దునుమాడి జయించి వారిదేశమును ధ్వంసముఁ జేసితిని" అని రాజు బీరములం బలికెను.

బైబిలుగ్రంథములోఁ జెప్పఁబడిన 'ఇస్రాయేలీయుల' విదేశగమన మీకాలములో జరిగియుండును, అటులైన, 'మనేపథుని' ఆస్థానములో 'మోసెస్సు' పెటిపెద్దవాఁ డయ్యె ననిచెప్పవచ్చును. భగవత్ప్రేరణచేత మేమీదేశమునకు వచ్చితిమి అని వారినాయకుఁడు మొరఁ బెట్టుకొనుచుండినను, ఆలు నేలవలను రాజు వారిమొర లాలకింపక పెడచెవిఁ బెట్టెను. వారు సద్గుణప్రధానులని రాజునకుఁ దెలియును. దేవాలయముల నిర్మాణములో వారు పాటుఁబడి రని కూడ నతనికిఁ దెలియును. కొన్నిపనులఁ జేయుటకు దేశీయులు తిరుగఁబడి నప్పటికిని, వారుమాత్రము పూనికతో వానిని నిర్వహించిరి. వారుదేశమును విడిచిపెట్టిపోవుట కిష్టములేక పోయినను, వారివలన దేశమున నుపద్రవములు వచ్చిన వని తలంచి, వారిని రాజు నిరాదరించెను. వారిని దేశములో నుంచుట మంచిదియని మంత్రు లెన్నివిధములఁ జెప్పినను వినక, చపలచిత్తుఁడును మాట నిలుకడలేనివాఁడును కనుక రాజు వారిని శీఘ్రములో దేశమునుండి పంపివేసెను. నిరాధారులై నిరాయుధులై పాదచారులై భగవంతుని రక్షణలో నుండిన 'ఇస్రాయేలీయులు' గమనించుచుండ, రథగజతురగపదాతులను వెంటఁదీసికొని, వారిం దునుమాడుటకు రాజు బయలువెడలెను. 'అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం' అనునటుల వారియోగక్షేమమును భగవంతుఁడు వహించియుండ,

'రుధిర'సముద్రము వారికి మార్గము నిచ్చెను, వారు దానినిదాఁటి సురక్షితముగ నవతలగట్టుఁజేరిరి. ఇంతలో రాజు సైన్యములతో వచ్చి సముద్రమును దాఁటుచుండఁ బ్రచండవాయుప్రేరితంబై సముద్రముపొంగి వారిని నుట్టివేసెను. ఇటుల స్వసైన్యనాశనమునకు ఖిన్నుఁడై, హతశేషులతో రాజు స్వదేశమునకు వచ్చెను. అనంతర మారాజు పరలోకగతుఁడయ్యెను. అంతకంతకు దేశము క్షీణించి శల్యావశిష్ట మయ్యెను. రాజాజ్ఞను మన్నింపకపోయిన, రాజుకు మర్యాదఁజేయువా రెవరు? మఱికొంతకాలమునకుఁ బ్రజలు రాజుమీఁదఁ దిరుగఁబడి, వారినాయకులు దేశమందంతట నచ్చటచ్చటఁ జిన్న సంస్థానముల స్థాపించి స్వతంత్రముతో నెవరికి వారు రాజ్యముఁ జేయుచుండిరి. 'సంసర్గము బలము, విసర్గముదుర్బలము' అనునటుల. వారు విభక్తులై దుర్బలులైనందునఁ, బరరాజులు వారిని శాసించి సాధించిరి. 'శిరియా' దేశాధీశుఁడు 'ఆరేశుఁడు' 'ఐజిప్టు' లోని కొంతభాగము నాక్రమించెను.

'సేతనఖుఁడు'— స్వదేశాభిమాని:— అతఁడు 'మనేపథు'ని మనుమఁడు; స్వదేశాభిమాని. 'శిరియను'లతోఁ బోరాడి వారిని దేశమునుండి తరిమి అతఁడు సింహాసనము నెక్కెను. అతనికుమారుఁడు 'తృతీయరామేశుఁడు' దేశమునకుఁ గీర్తిప్రతిష్ఠలఁ దెచ్చెను. చతురంగబలములఁ జతురుపాయములతో నడిపించి శత్రుసేనల నతఁడు పారఁదోలెను. 'కొండగొఱ్ఱెలు వృషభధ్వనిని విని కంపము నొందువిధమున వారతని ధనుష్టంకారమునువిని భయపడిరి' అని చరిత్రకారుఁడు వ్రాసెను. 'థెబీసు' పట్టణము వద్దనుండిన 'మదేనతబు' దేవాలయములో నీయుద్ధములు చిత్రరూపములుగ గోడలమీఁదఁ జెక్కఁబడెను; అవి 'తృతీయరామేశు'ని కీర్తిప్రతిష్ఠలకు మూలము లయ్యెను. ఇంతియ కాదు. ఆనాఁడు సముద్రముమీఁద జరిగిన యోడయుద్ధముకూడ చిత్రరూపమునఁగాననగును. ఈయుద్ధములో నతఁడు పడవదొంగల నోడించెను. ఇట్లు దేశమునకు స్వాస్థ్యముఁదెచ్చి వయోవృద్ధగు 'తృతీయరామేశుఁడు' ప్రజలక్షేమముఁ గోరి పాటుఁబడి శేషించిన జీవితకాలముఁ గడిపెను. అతని వంశస్థులు దుర్బలులు; క్షత్రియధర్మమును విడిచిపెట్టిరి. అందుచేత దేశమున కపకీర్తి వచ్చెను.

వైదికరాజులు:—ఈవంశస్థులకాలములో 'హరహరుఁడు' అను వైదికుడొకఁడు బయలువెడలి రాజ్యసూత్రములను వహించెను. ఈకాల మంతయు నిబిడాంధకార బంధురంబై యుండెను. 21-వ తరములో నీరాజు వైదికులలో నగ్రగణ్యుఁడు. ఇట్లు విభక్తమైన రాజ్యమును 'థేబీసు' పట్టణములో వైదిక రాజులును 'తానీసు' పట్టణములో క్షత్రియులును వేర్వేఱుగఁ బాలించిరి. 'హరహరుని' కాలములో నొకవింతసంగతి జరిగెను. దేవదేవుఁడైన 'అమన్రా' యొక్క తెప్ప ఉత్సవమునకుఁ గావలసిన కలపసామగ్రిని 'శిరియా' దేశము నుండి తెచ్చుటకీరాజు 'ఉనేమనుఁడు' అను వైదికునికి సొమ్మునిచ్చి యా దేశమునకుఁ బంపెను. ఈవైదికుఁ డాదేశమునకుఁ బోయి, అచ్చట నొక పట్టణములోఁ గలపబేరముఁ జేయుచుండ, నతనిభృత్యు లతని సొమ్మును దొంగిలించి పాఱిపోయిరి. అతఁ డాపట్టణపురాజువద్దకుఁ బోయి మొఱఁ బెట్టె, రాజతనిని గారవించి భోజనపదార్థముల నతనికిఁ బంపెను. వైదికుఁడు స్వగుణముఁ జూపించెను. రాజు యొక్క ప్రోత్సాహముచేతఁ దనభృత్యులు సొమ్మపహరించిరని రాజు నతఁడు నిందించెను. ఆపట్టణపురాజీమాటను వినినతోడనే వైదికుని శిక్షించుటకు సిద్ధపడెను. కాని ఇంతలో స్వదేశమునుండి సొమ్మువచ్చినందున నతఁడు 'శిరియా' దేశములోని 'బిబ్లసు' అను మఱియొకపట్టణమునకుఁ బోయెను. అచ్చటఁ దనకుఁ గావలయు కలపఁగొని రేవునకుఁ దెచ్చి దానిని పడవలలో నతఁ డెక్కించుచుండెను. తమబంధువుల నతఁడు నిర్హేతుకముగ దొంగలని నిందించె నని, కొందఱు పడవదొంగలడ్డుపడి, ఆకలపనంతయు దొంగిలించి, కారాగృహములో నతనిని ప్రవేశపెట్టెద మనిభయపెట్టి వారు పాఱిపోయిరి. అంత నతఁడు భూమిమీఁదఁ బడి రోదనముఁజేయుచుండెను. 'బిబ్లాసు' పట్టణపురాజు అతనిసంగతి విని, అతనిని బిలిపించెను. 'ఈపడవ దొంగల భయము లేక పక్షులు స్వేచ్ఛగ విహరించును గానిమనుజులు మీ పట్టణములో స్వతంత్రముగ విహరింపలేర'ని రాజుతో నతఁడు ఘోషించెను. అప్పుడారాజు, పడవదొంగలను పిలిపించి 'ఇతనితో మీకేమిప్రయోజన' మనియడుగ 'ఐజిప్టుదేశపుపడవలను నాశనముఁ జేసి, ఇతనిని •కారా

గృహములో నుంచుటయే మాకోరిక' యనివారు చెప్పిరి 'ఇతఁడు ఆమనుదేవుని అర్చకుఁడు. అందుచేత నతఁడు శిక్షార్హుఁడు కాఁడు. పడవలో నెక్కించి సముద్రముమీఁదనితనిఁ బంపివేయఁగలము. అటుపైని మీరొకరినొకరెటుల సాధించుకొనినను, మాకు బాధ్యతలే' దని రాజుచెప్పి వారిని పంపివేసి, ఆతనిని పడవలలో నెక్కించి ప్రయాణముఁ జేసెను, అతఁడు పడవలో నెక్కి మిగిలిన పడవలతోఁ గూడ సముద్రముమీఁదఁ బోవుచుండ, వెనుకనుండి దొంగలు పడవలను గదుపుకొని వచ్చుచుండిరి. ఇంతలోఁ దుఫానులేచినందున, నతనిపడవలు చెల్లాచెదరై, ఆతనిపడవమాత్రము 'కైప్రసు' ద్వీపతీరమునకుఁ గొట్టఁబడినందున నతఁ డాద్వీపములోఁ బ్రవేశించెను. అప్పు డాద్వీపవాసులతనిఁ జంపయత్నించిరి. 'మీరు నన్నుంజంపిన యెడల లాభమేమి? మీరాణియొద్దకు నన్నుం దీసికొనిపొండు' అని వారితో నతఁడు చెప్ప వారాప్రకారమతనిఁ దీసికొనిపోయి రాణిసముఖమున నిలువఁబెట్టిరి. ఆమెఁజూచి 'ఓమహారాజ్ఞీ, ఆమనుదేవుని నివాసమగు 'థేబీసు' పట్టణము మొదలు 'కైప్రసు' ద్వీపము వఱకుఁ గలదేశములో నధర్మపరిపాలనయని లోకపువాదుక కలదు. ఈద్వీపములో మాత్రము ధర్మపరిపాలనయని ప్రసిద్ధము. ఈలోకపువాదుకను నేఁడు మాత్రము విపరీతము వచ్చె'నని అతఁడు చెప్పెను. ఆమాటలను విని, అతనిని ప్రాణములతో నామె విడిచిపెట్టెను. "కథకంచికివెళ్లెను" అనంతర మేమి సంభవించెనో మనకుఁ దెలియదు.

స్వదేశములోని మనుజులకు మానము లేదు; విదేశములలో వారికి సమ్మానములేదు. ఈనీచదశను "ఐజిప్టు" దేశ మనుభవించుచుండెను; ఆమె పొరుగున నుండిన దేశీయులు మహోచ్చపదవిలోనికి వచ్చిరి. "అసీరియా" దేశమాన్నత్యము లోనికివచ్చి, ఆనాటికిఁ గొంచెము క్షీణించెను. "ఇస్రాలు-జూడా" అను దేశమును 'డేవిడు' పరిపాలించు చుండెను. ఇతఁడు రాజ్యసూత్రములను చాతుర్యముతో వహించి 'యూఫ్రెటీసు' నదికిని 'ఈజిప్టు' దేశమునకును మధ్యప్రదేశము నతఁడు స్వదేశములోఁ గలిపి, దానికి గౌరవముఁ దెచ్చెను. అతని

తరువాత సింహాసనమునకు వచ్చిన 'సోలొమను' 'ఈజిప్టు'తో వర్తకము సాగించి, వైదికరాజులలో నొకనికుమార్తెను వివాహ మాడెను. 'జెరూసాలెము' అను పట్టణములో నీరాజు కట్టించిన దేవాలయముం జూడ, 'ఐజిప్టీయుల' దేవాలయనిర్మాణకౌశల్యమును 'ఇస్రాయేలీయులు' నేర్చినట్లు తోఁచును.

ఈయుభయదేశముల కీమైత్రి కొంచెము కాలమే యుండెను. 22-వ తరములో 'శిశాంకుఁడు' అను రాజు సింహాసనము నెక్కెను. అతఁడు బుద్ధిమంతుఁడును నేర్పరి యని తెలిసికొని, 'సోలొమను'మీఁదఁ దిరుగఁబడిన ప్రజలకు నాయకుఁడైన 'జిరోభముఁడు' అతని వద్దకు వచ్చి ప్రసంగించుచుండెను. 'సోలొమను' కుమారుఁడు 'రేహోభముఁడు' రాజ్యమునకు వచ్చెను, 'జిరోభముఁడు' ప్రతిరాజ్యము నొకటి స్థాపించెను. విరోధులైన వీరిరువురు కలహింప 'జిరోభముని' సహాయార్థము 'శిశాంకుఁడు' సైన్యమును వెంటఁబెట్టుకొని పోయి 'రేహోభముని' యుద్ధములో నోడించెను; అనంతర మతఁడు 'జిరోభముని' కూడ స్వాధీనముఁ జేసికొనెను. ఇటుల వారిరువురిచేతఁ గప్పముఁ గట్టించుకొని 'జెరూసాలెము' లో దేవాలయములోని వెండిబంగారములఁ దీసికొని, 'శిశాంకుఁడు' స్వదేశమునకు వచ్చెను. ఈచరిత్రము నంతయు 'కార్నాకు' పట్టణములో దేవాలయము లోనిగోడలమీఁదఁ జిత్రరూపమున నతఁడు వ్రాయించెను. ఇస్రాయేలీయుల' రాజ్యమును, 'గలిలీ' సముద్రము మొదలు 'ఐజిప్టు' దేశమువఱకుఁ గలప్రదేశమును, 'మధ్యధరాసముద్రము' మొదలు 'శిరియా' ఎడారివఱకుఁగలప్రదేశము నతఁడు స్వరాజ్యములోఁ గలిపిపరిపాలించెను. అతనికుమారుఁడు కూడ నింతరాజ్యము నేలెను. అనంతరము 'రేహోభము'ని పౌత్రుఁడు 'అసుఁడు' ధైర్యసాహసములు కలవాఁడై, 'ఐజిప్టీయుల' నోడించి ఇస్రాయేలు—జూడా' దేశమునకు స్వాస్థ్యముఁ దెచ్చెను.

23, 24, 25, తరములలో—అనఁగా రాఁబోవు మూఁడుశతాబ్దముల వఱకును 'జూడియా' దేశమును స్వాధీనముఁ జేసికొనుటకు బదులు, పూర్వదిశ

నుండి వచ్చి తనను వట్టివేయుచున్న శత్రువుల దరికట్టుటకు, 'ఈజిప్టు' దేశము 'ఇస్రాయిలు-జూడా' దేశములతో సఖ్యముఁ జేసికొనెను. 'ఈజిప్టు' ప్రతిభ తగ్గిపోయెను. ఆమె రాజులు తరాజులైరి, దేశమంతయు చిన్నసంస్థానముల క్రింద విభక్త మయ్యెను. క్రీస్తుపూర్వ మెనిమిదవశతాబ్దములో— అనఁగా 'రోము' పట్టణము స్థాపింపబడిన శతాబ్దము— 'ఆశీరియా' దేశాధీశుఁడైన 'తిగ్లత-పిలేశరు'ని ధాటికి వెఱచి, ఈపిల్లజమీందారు లందఱు, నానాటికి పుష్టిచేసి బలిసి పెరుఁగుచున్న 'ఈత్యోపియా' దేశాధీశుని శరణుఁ జొచ్చిరి. వీరు తిరుగుబాటుఁ జేసిరని మిషఁబెట్టి, వీరి నితఁడు స్వాధీనముఁ జేసికొని, కొంతకాలమునకు వీరి రాజ్యమంతయు నాక్రమించుకొనెను. ఇట్లు 'ఈజిప్టు' దేశమన్యదేశాధీశాధీనమై స్వాతంత్ర్యమును పోగొట్టుకొనెను. ఉత్తరదశ నున్న 'ఈజిప్టు' వఱకుఁ గల దేశమంతయు 'ఆశీరియా' రాజ్యములోఁ గలిసెను, 'శాల్మనేశరుఁ' డను రాజు 'ఇస్రాయేలీయుల' రాజైన 'హోశయు'ని జయించెను. 'ఇస్రాయేలీయుల' రాజు లితనితో నంతరించిరి.

'ఈజిప్టు' దేశము నేలుచున్న 'శబకు' నకును 'ఈత్యోపియా' రాజునకును, 'ఆశీరియా' ప్రభువైన 'సర్గను' నకును రాజ్యవ్యవహారములు నెమ్మదిగ జరుగుచుండెను. 'శబకు' నివిషయమై నొక ముచ్చట కలదు—ఒకనాఁడు రాజు మంత్రులను వైదికులను పిలిపించి 'మాకు స్వప్న మొకటి వచ్చెను—థేబీసు పట్టణములోని దేవుఁడు మాకు స్వప్నములో నగపడి 'ఓరాజా! నీవు వైదికుల నందఱినిఁ జంపివేయవలెను. లేనియెడల నిన్ను నాశనముఁ జేసెద' నని మాతోఁ జెప్పెను. కనుక మీదేశములో నుండవలె ననిన మేము మిమ్ములఁ జంపివేయవలెను; లేనియెడల మీదేవుఁడు మమ్ములను బాధించును. నిర్దోషులైన మిమ్ములఁ జంపుటకంటె మీదేశమును విడిచిపోయెద' మని వారితోఁ జెప్పి స్వదేశమున కతఁడు వెళ్లెను.

ఈనాటికి 'సేనాఖరీబు'అను రాజు పాలించుచుండ, 'అసీరియా' దేశము. మహోన్నతపదవికి వచ్చెను. 'శబకు' నికుమారుఁడు 'శబతకుఁడు'ను 'జూడా' దేశపురాజు 'హజికేయుఁడు'ను కలిసి, 'ఫొనీషియా, ఫిలిస్తియా' 'ఈజిప్టు, ఈతోప్యియా' దేశీయుల వెంటఁ బెట్టుకొని 'సేనాఖరీబు' రాజు మీఁదికి దండెత్తి వెళ్లిరి. ఈరాజు వీరినందఱిని 'ఏక్రను' పట్టణమువద్దనోడించెను. 'ఈజిప్టు' రాజ్యమస్తమించెను. ఈరాజు తరువాత రాజ్యమునకు వచ్చిన 'ఈసరు-హదనుఁడు' అను రాజు సైన్యములను నడిపించుకొని పోయి'ఈజిప్టు' దేశములో యుద్ధముఁ జేసియాదేశమును సాధించెను. 'మాఫిసు' పట్టణమును కొల్లఁబెట్టి, ధనరాసులను తీసికొని 'నినవ' పట్టణమునకుఁ బోయెను. తుదకు 'అశిరియా' ప్రభువైన 'అసుర—బనిపాలు'నికి దేశమంతయు లోఁబడియుండెను. దాని రాజులంతరించిరి.

26-వతరము — దేశోద్ధారణ: —

అశిరియాకు లోఁబడి యాదేశములో నొకచిన్నసంస్థానము నేలుచున్న "సామేతికుఁడ"ను పిల్లరాజొకఁడు దేశమునకుఁ గొంతకీర్తిఁ దెచ్చెను. చతురంగబలములను చతురతతో నడిపించి యుద్ధములో శత్రువుల నోడించి దేశమునకు స్వాతంత్ర్యముఁ దెచ్చెను. దేశమునకు స్వాస్థ్యము వచ్చినతరువాత నతఁడు జీర్ణించి ప్రాణావశిష్టుఁడై యున్నవానికి జీవముఁ దెచ్చెను.

కళలు నిర్జీవకళలు, దేశము నిర్జనము,—ఇటువంటి దేశము నతఁడు పునరుద్ధారణఁ జేయుటకుఁ బూనుకొని, యహోరాత్రములు పాటు పడెను. దేశమంతయు పునస్సృష్టి చేయవలసి వచ్చెను పత్తనములకుఁ బొత్తు వచ్చెను. మార్గములకు మార్దవము వచ్చెను. దేవళములకు దీనత్వము పొసెను; కళలు మూర్తీభవించెను; త్రిశక్తులనుగల రాజు రాజ్యసూత్రములను వహింప, చతు

ంగబలములు చతురతతో మెలఁగుచుండెను."గ్రీసు" దేశముతో వర్తకము
ాగెను. ఆదేశవాసులీ దేశమునకు వచ్చి కాపురముండిరి. వారి సాంగత్యము
ున వీరితెలివి తేఁటపడెను. కాలము సమీపించినపు డెవ రెన్నివిధముల నుప
ారములఁ జేసినను ఏమికార్యము కలదు? కాలము దేశమునకు సమీపించినది;
ది యస్తమించెను.

ద్వితీయనఖుఁడు:—ఇతఁడు పరాక్రమశాలి. బలమైనరెండు పడవల
ండు నతఁడు నిర్మించెను. ప్రసిద్ధికెక్కిన 'పొనీషియా' దేశపుకళాశులను
ంటఁ దీసికొని ఒకపడవలదండుతో నతఁడు'మధ్య ధరాసముద్రమును' దాఁటి
ఫ్రికాఖండము' చుట్టును సముద్రయానముఁ జేసి మూఁడుసంవత్సరముల
ాటికి 'రుధిర' సముద్రము వచ్చిచేరెను.

ఈలోపున 'అసీరియా' రాజ్య మంతరించెను. 'సిరియా' 'పాలస్తైను'
శములు స్వాస్థ్యముగ నుండుటచేత 'నఖుఁడు' సైన్యముతో 'పాలస్తైను'
శముపైకి దండెత్తిపోయి, ఈదేశపురాజగు 'జోసియా'ను 'మగేధ' వద్ద
రిగిన యుద్ధములో నోడించెను; అనంతరము. 'యూఫ్రిటీసు' నదివఱకుఁ
ు 'సిరియా'దేశము నతఁడు జయించెను. 'పాలస్తైను' దేశమునకు రాజ
ానియైన 'జేరుసాలము' పట్టణము నేలుచున్న 'జోసియా' కుమారుఁడు
హోకిముఁడు' ఇతనికిఁ గప్పము గట్టుచుండెను.

'కార్కెమిషు' యుద్ధము క్రీ. పూ. స॥ 605-రము:—'బాబిలో
యా' దేశాధీశుఁడు 'సిరియా' దేశమును స్వాధీనముఁ జేసికొని, 'ఐజిప్టీయు
ు' కార్కెమిషు యుద్ధములో నోడించెను. ఈలోపున సింహాసనమునకుఁ దన
రసత్వమును నిలువఁబెట్టుకొనుటకై బాబిలను పట్టణమున కతఁడు త్వరపడి
వలసివచ్చి నందున నతఁడు ఐజిప్టీయులను మట్టి వేయలేను.

జూడా దేశపురాజు ఝుడికేయుఁడు బాబిలనుతోఁ బోరాడుటకుఁ
యినపుడు, శఖునికుమారుఁడు అప్రేశుఁడు వానికి సహాయ మిచ్చెను. కాని

అప్రేశుని సైన్యములు యుద్ధములో నోడెను. అనంతరము జూదులు బాబిలనుకు స్వాధీనులయిరి.

క్రీ. పూ. స॥ 565-రము:—శత్రుమర్దనుఁడైన బాబిలను దేశపురాజు 'నఖుచదునజరు' అప్రేశుని యుద్ధములో నోడించి వానిని జంపి వాని సేనాధిపతియైన అమేశీశునివలనఁ గప్పముఁ బుచ్చుకొనెను.

ఎంతనీచదశవచ్చినను ఘనతతో బ్రతికిన దేశముకదా! పైకిమాత్రము సిరిసంపదలతోఁ గూడుకొని యున్నట్లు కనఁబడుచుండెను. ఆమెపట్టణములను నాశనముఁ జేసి, ఆమె సంపదను శత్రువులు పట్టికొని పోలేదు.

అమేశీశుఁడు అస్వతంత్రరాజైనను దేశమును మెలకువతో నేలెను. కొంతకాలమువఱకు దేశమునకు జీవమును నిలువఁబెట్టెను. అతనికి లోఁబడియున్న దేశములోని ప్రతిపరగణాధికారియు ప్రతిసంవత్సర మతనియొద్దకు వచ్చి సంవత్సర మంతయు తనపరగణాలోఁ దాను వ్యవహరించిన విధముఁ జెప్పవలసియుండెను. అశ్మక్రియ మొదలగు క్రియలు పరిఢవిల్లెను. అమేశీశునికాలములో ఆశియా ఖండములో రాజ్యవిషయకపు మార్పులు కొన్నిజరిగెను.

పారశీక దేశవిజృంభణ:—పారశీక దేశమునకు లోఁబడియున్న చిన్నసంస్థానాధిపతియైన కైరను అనువాఁడు ఆసియాఖండములో నందఱికంటె బలవంతులగు 'మీదియా' దేశవాసుల రాజు నోడించి 'లిడియా' దేశముపైకి దండెత్తిపోయెను. అప్పుడు 'లిడియా' 'ఈజిప్టు' 'బాబిలోనియా' ఈమూఁడు దేశము లేకీభవించి 'కైరసు' నెదిరించెను గాని ఈజిప్టు తప్ప మిగిలిన రెండు దేశము లతనికి స్వాధీన మయ్యెను. ఇతరసంస్థానములను సాధించుటలో నతఁడు జీవితకాలమంతయు నుపయోగించుటచేత నతఁడు ఈజిప్టును భంగపఱచుటకు వీలు లేకపోయెను. ఇతనికుమారుఁడు కాంబేశీశుఁడు రాజ్యమునకు వచ్చెను; ఇతఁను దుర్మార్గుఁడు. లోకకంటకుఁడు. ఇతఁడు 'ఈజిప్టు' గర్వము నణచెను.

'హీరోదేతీశుఁ'డను గ్రీకుచరిత్రకారుఁడు దానికిఁ గారణ మీదిగువను వ్రాసినవిధమునఁ జెప్పెను.

ఈజిప్టుదేశములో నున్న ఘనమైన నేత్రవైద్యుని పంపవలసిన దని పారశీకరాజు కైరసు 'అమేశీసున'కు త్తరువుఁ జేసెను. ఇతఁడు గొప్పవైద్యుని యారాజునొద్దకుఁ బంపెను గాని, పుత్రమిత్రకళత్రాగులను విడిచి పరదేశమునకుఁ బోవుట కావైద్యుఁ డెంతయు దుఃఖించెను. పగ సాధించుకొనుట కావైద్యుఁడు సమయము వేచి, యొకనాఁడు రాజుసముఖమునకుఁ బోయి 'మహాప్రభూ, ఏలినవారు దాసునివిన్నపము వినవలెను. అమేశీసుని కొక కూఁతురు కలదు ఆమెచక్కనిచుక్క. ఏలినవారామెను పొందిన భాగ్యమె. భాగ్య'మని కైరసుతోఁ జెప్పెను. అప్పుడతఁ డదృష్టముగ వినికిడివలన నామెను మోహించి, యామెపొందు గోరినవాఁడై, శీఘ్రములో నామెను తనయొద్దకుఁ బంపుమని 'అమేశీసున'కుత్తరువు జేసెను. అతఁడు మాత్రము కుమార్తెను విడిచిపెట్టుట కిష్టపడక, 'అప్రేశుని'కుమార్తె నలంకరించి ఆమె నతఁడు రాజునొద్దకుఁ బంపెను. ఈమెతండ్రి, 'అప్రేశుఁడు' 'అమేశీశుఁడు'చేసిన కుట్రచేత నతఁడు చనిపోయెను. అందుచేత నామెపగసాధించుకొనుటకు, 'అమేశీశుఁడు' చేసిన కృత్రిమవ్యాపారమంతయు రాజుతోఁ జెప్పెను అప్పుడు కాంబేశీశుఁడు' 'ఈజిప్టు'పైకి దండెత్తి పోయెను.

అతఁడు దండెత్తివచ్చినపుడు 'తృతీయసమేతీకుఁడు' సైన్యములను వెంటఁ బెట్టుకొని యుద్ధమునకు నడిచెను. ఐకమత్యము వారిలో వారికి లేనందున వారు శీఘ్రములో నోడిపోయిరి. అప్పుడు రాజు 'సమేతీకు'ని నగరబహిర్ద్వారమువద్దఁ గూర్చుండ నియోగించి, అతఁడు చూచుచుండ, నతనికుమార్తెను సామంతులకన్యలను నదికిఁ బంపి వారిచేత నీరుఁ దెప్పించెను. శిరస్సువంచి కొని, 'సమేతీకుఁడు' కూర్చుండియుండెను. అనంతరము రాజు అతనికుమారుని సామంతుల కుమారులను శిరచ్ఛేదమునకుఁ బంపెను. అందుకైన నతఁడు దుఃఖిం

పడెను. ఆమార్గమున నొకవయోవృద్ధిన భిక్షుకుఁడు వెళ్లుచుండ వానిఁజూచి సమేతీసుఁ డేడ్వసాగెను. అందుకు రాజు కారణ మేమనియడుగ 'నాకన్యా రత్నముల కవమానము వచ్చినను, నాకుమారులందఱు నాకన్నులయెదుట మృతి నొందినను నాకుదుఃఖము రాలేదుగాని నాబాల్యస్నేహితుఁడీవృద్ధుని దురవస్థఁ జూచి నాకు దుఃఖమువచ్చిన' దని యతఁడు రాజుతోఁ జెప్పెను. అందులకు రాజు పశ్చాత్తాపముఁ బడి, యతనిని గారవించెను' కాని అతఁడు తనమీఁదఁ దిరుగుబాటుఁ జేయఁదలచె నని విని రాజతనిచేత విషముకలపఁబడిన వృషభ రక్తముఁ ద్రాగింప నతఁడు చనిపోయెను.

ఎక్కడఁజూచిన దేశములో రోదనము తప్ప మఱియొకటి లేదు. రాజు దేశమును ధ్వంసముఁ జేసెను; దేవాలయములను పడఁద్రోయించెను, "ఆపీశుఁడు"అను నందీశ్వరుని రాజు తనకత్తితోఁ బొడిచి చంపెను. "దేశమున కరిష్టమువచ్చును. ఆమెప్రజలు వేనవేలు కత్తివాతఁ బడుదురు. ఆమె గర్వ మణగి పోవును"అని"ఎజికీలుఁడను"సత్యఋషిచెప్పిన విధమున జరిగెను. ఇట్టియవమానములఁ బొందిన దేశము స్వాతంత్ర్యముఁ దెచ్చుకొనుటకు మంచిసమయముకొఱకై నిరీక్షించు చుండెను.

"మరాథానుయుద్ధానంతరము - క్రీ. పూ. సం. 490 రము:—

మరాథాను యుద్ధములోఁ బారసీకసైన్యములు గ్రీకులచేత నోడింపఁబడెను. ఈసంగతివిని, "మాఫిసులో" నున్న పారసీకసైనికులఁ జంపి, ఐజిప్టీయులు తిరుగఁబడిరి.పారసీకులరాజు జరజేశుఁడు వీరిగర్వము నణఁచెను.రెండవ పర్యాయము కూడ వీరు తిరుగఁబడిరి గాని ఇప్పుడును వారికి శృంగభంగ మయ్యెను. దేశములోని చిన్నసంస్థానము నేలుచున్న "నభరెతీశుఁడు" క్రీ. పూ. సం. 405రప్రాంతమున "పారసీకులను" దేశమునుండి తఱిమి, ఆఱుసంవత్సరములవఱకు స్వతంత్రించి పరిపాలించెను. అతనివంశజులలో నొకఁడు "నక్తనేబుఁడు" దేశముచుట్టును రక్షణ దుర్గముల గట్టించెను; కాని పారసీక

రాజు 'అర్తజరజేఘుఁడు' వీనినన్నిటిని భూమిమట్టము చేసెను. ఈరాజు "మాఫిను" పట్టణము మీఁదికి రాఁదలఁచెను గాని, అతనిసైనికులొకరితో నొకరు కలహించినందున నతఁడు వారిమీఁదికి రాఁజాలక పోయెను. ఇంతలో "నైలు" నదిపొంగి పొర్లిపడెను పారశీకసైన్యములు కొన్నికొట్టుకొని పోయెను; వారుచెల్లాచెదరై పారిపోయిరి.

తెలివితేటలతో "నక్తనేబుఁడు" రాజ్యము నేలెను. సమస్తకళలకు కొంచెము జీవము వచ్చెను. "ఆంగ్లేయసర్వవస్తుభాండాగారములో" నల్లశిలతోఁ జేయఁబడిన గోపురశిఖరములు రెండు కలవు; ఈరెండు నతని కాలము నాటివి, ఆతనికీర్తి ప్రతిష్ఠలను నిలుపుచున్నది. ఆతని వంశజుల కాలములో దేశమంతః కలహములచే బాధపడుచుండ, మిడుతల దండువలె పారశీక సైన్యము దేశముమీఁదఁ బడెను. "నక్తనేబుఁడు" వారితోఁ బోరాడలేక "మాఫిను" పట్టణమును విడిచి యడవులలోనికిఁ బోయెను. 'పారసీక' రాజైన "అఖశునకు" లోఁబడి, దేశము తనప్రేమను పోగొట్టుకొనెను. ప్రపంచములో నందఱికంటె ముందు సర్వకళలలోఁ బ్రవేశముగనిన దేశము, ప్రథమముననే కళావిహీనమై నశించెను కాని, దానిజయస్తంభములును దేవాలయములును పిరమిదులును దాని కీర్తిని ఆచంద్రార్కము నిలుపుచున్నది.

ప్రాచీనదేశచరిత్రలు

3-వ ప్రకరణము.


౩
అసీరియా బాబిలోనియా
చాల్దియా
సిథియా
నల్లసముద్రము
కాకసస్ పర్వతములు
కాస్పియను సముద్రము
చిన్న ఆశియా
అశీరియా
మధ్యధరా సముద్రము
యూఫ్రటీసు నది
నినవే.
అసరు
మీడియా
బాబిలోనియా
బాబిలను
యెరూసలము
సూసా
పెర్షియా
చాల్దియా
హిమాలయ పర్వతములు
సింధునది
ఇండియా
ఐగుప్తు
ఎర్రసముద్రము
అరేబియా
పారశీకసముద్రము
అరేబియా సముద్రము
నైలునది

శ్రీ రస్తు.

'బాబిలోనియా' దేశచరిత్రము

క్రీ. పూ. సం॥ 3800—1120 రములు.

తృతీయప్రకరణము.

ఇరువదియవ అధ్యాయము.

ఈదేశచరిత్రఁ జదువుటకు ముందు, జ్ఞానదృష్టిచేత నాదేశ మెటుల నుండెనో చూచెదము. 'యూఫ్రటీసు' 'టైగ్రిసు' నదులమధ్యభూభాగమునకు 'బాబిలోనియా' దేశ మనిపేరు కలదు. ఆనదుల దిగువభాగ మీదేశము, ఊర్ధ్వభాగము 'ప్రాచీన అశిరియా' దేశము. రెండుమహారాజ్యము లాకాలములో నీభాగమున స్థాపింపఁబడెను. అవి పుష్టిచేసి బలిసి పెరిగినవి యై, కాలక్రమమున, కృశించి క్షీణించి నశించెను. ఏభాగమున సుక్షేత్రములును, పల్లెలును, పట్టణములును, నగరము లుండెనో, అట్టిభాగము నేఁడు కటికప్రదేశమై, అచ్చటచ్చట పైకిమొనలెత్తుచున్న చిన్నమెట్టలతోఁ గూడి చూచుట కనిష్టము గలుగఁజేయుచున్నది. ప్రాచీనదేశీయులును మహారాజ్యములును నదిశ్మశాన మయ్యెను. ఆకాలములోఁ బ్రసిద్ధికెక్కిన 'అరు, బాబిలను, నినవె' అనుగొప్ప పట్టణము లాభూమిలోఁ గప్పఁబడి నశించెను. ఈభాగమును త్రవ్విచూచిన పైని శిలాశాసనములును, శిలాప్రతిమలును, పుస్తకములును కనఁబడెను; వీని నాధారము చేసికొని, ఈదేశచరిత్ర వ్రాయఁబడెను.

'నినవే' పట్టణములోని ప్రాచీనపుస్తకభాండాగారము:—ఈభాగములోని దిబ్బలను త్రవ్వుచుండ, నొకదానిక్రింద 'అశిరియా' దేశపు రాజగు 'సేనాఖరీబు' యొక్క నగరుకనఁబడెను. దానిలో నొకరెండుచిన్నగదులలో నొకఅడుగు దళపుమృత్ఫలకలు దొరకెను ఈపలకలమీఁద 'కీలలిపి'లో వ్రాయఁబడిన అక్షరసమామ్నాయము కలదు. ప్రాచీనలిపి శాస్త్రజ్ఞు లీపలకలను పరిచేసి, వానిమీఁదివ్రాఁతను కనిపెట్టఁగలిగిరి, కావున, నీదేశచరిత్రను వ్రాయుటకు వీలుపడెను.

'సుమేర' జనుల కాలము,—చరిత్రకాలమునకుఁ బూర్వము వీరీదేశములో నుండిరి; 'సుమరు' దేశమునుండి వచ్చినట్లుతోఁచును. ఆదేశ మెచ్చట నుండెనో తెలియదు. లోహక్రియలోను కాలువలను త్రవ్వుటలోను వీరికిఁ బ్రవేశముకలదు. వీరు నాగరికతావరోహణమార్గములో నుండిరి.

'సుమేర' జనుల మతాభిప్రాయములు;—వీరిమతాభిప్రాయములు విన, చోద్యములై యున్నవి. వీరిప్రభువులు వీనిని 'కీలలిపి' లో వ్రాసి పదిలముగ నుంచిరి. భూమి పానీయపాత్రవలెనున్న దని యు దానిపైభాగమువలె భూమియు కొంతజలమును కలదియై, అగాధమగు భాగమున జీవులు నివసించుననియు వారిమతము. భూమిమీఁద నొకపర్వతము లేచి భూమ్యాకాశములనుకలుపుచున్నదనివారినమ్మకము. భూమిమీఁద నొకఅధోలోకమున, మనుజులకు మేలు చేయు ఏడుగ్రహములు భూమిచుట్టును తిరుగుచున్న వనియు, కీడుఁ జేయు ఏడుగ్రహములు కూడ తిరుగుచున్న వనియు ఈరెండుగ్రహకూటములవా రెప్పుడు నొకరితో నొకరు పోరాడుచుందు రనియు, వారిమతము. అన్నిటికంటె నూర్ధ్వలోకమున 'అన' అనునామముతో భగవంతుఁడుండును సముద్రములో 'ఈయ' అను మహామీనము నివసించి, నలువైపుల సంచరించుచు భూమిని సంరక్షించుచుండెను. స్వర్గమర్త్యలోకములలో మంచిపేరు లేనట్టి ఏడుగురు రాక్షసగణములలోనివారు—'మసకము' లను పేరుతో

నధోలోకమున నివసించుచుండిరి. వీరు భూకంపములకును తుపానులకును కారకులు. ఈదిగువను వ్రాసిన ప్రకారము వారిమతగ్రంథములో నున్నది:—వారేడుగురు! వారేడ్వురు; ఏడ్వురు వారు సముద్రములో నివసింతురు, స్వర్గమును కూడ వారు కలఁతఁబెట్టిరి. వారు సముద్రములో నుండి లేచి వచ్చెదరు. వారు స్త్రీలు కారు, పురుషులు కారు. వారికి భార్యలు, పిల్లలులేరు.వలవలె నలుదైపులను వారు వ్యాపింతురు. వారికొకనియామకము లేదు. మంచిగుణము లేదు. వారు మహామీనముయొక్క శత్రువులు.

ఓ 'అన' భగవంతుఁడా, వారిని జయించుము. ఓమీనమా! వారినినాశనముఁ జేయుము.

ఇచ్చటనే నరకలోకముకలదు.దానిలో జీవులందఱు చీఁకటిలోఁ దిరుగుచుందురు. పరలోకచింతన విషయమై మాత్రము వీరు ఐజిప్టీయుల కంటె తక్కువవారు.

వీరికి ఐంద్రజాలములోను తంత్రములోను నమ్మకము కలదు. ఒకనికి రోగము గ్రహబాధచేత వచ్చునని నమ్మకము. ఉల్లిపాయ పొరల నొకదాని తరువాతి నొకదానిని తీసివేయుచు, వారు వానిరోగమును బాగుచేయుటకుఁ దలంతురు."ఈయుల్లిపొరలనుండి అగ్నిలో దగ్ధమగు విధమున శరీరముయొక్క అన్నిపొరలలో నుండి దుష్టగ్రహము బయటకు వచ్చి నశించుగాక"అని వారు మంత్రమును చదువుటకలదు.ఇంతటితో వానిరోగము కుదురనపుడు వారువాని వీథిలోఁ బరుండబెట్టిన మార్గమున పోవువారెవరైన రోగమునకుఁ దగిన ప్రతిక్రియ చెప్పఁగలుగుదురని వారినమ్మకము.వారు రక్షరేకులను కట్టుకొనుచుండిరి. ఇప్పుడు మనము 'ఆంజనేయ' విగ్రహమును చెక్కించి బంగారు రక్షరేకును కట్టుకొను విధమునసె, వారు కూడ చిత్రమైన బొమ్మలతోఁ జెక్కఁబడిన దండతాయెత్తులఁ గట్టుకొను చుండిరి.

8

చరిత్ర:—ఈసుమేరజనుల రాజులవిషయమై అంతగాఁ తెలియదు ; ఈ భాగమంతయు పుక్కిటిపురాణము. ఒకకాలమున 'అలోరసుఁ' డను గోపాలక రాజు పాలించుచుండెను. అతనిగుఱించి నిదర్శనము లేవియు కానరావు. ఆనాటికి వారు పశుపాలకులై యుండిరి. వారికిఁ గాలువలను త్రవ్వుట, తెలియును, లోహక్రియను గుర్తెఱిఁగి యుండిరి. ఇటికలతో వారుగృహములఁ గట్టుచుండిరి. వీనినన్నియు నేర్చినవారైనను, వారి మతాభిప్రాయములఁ బట్టిచూడ వారు శైశవావస్థలో నుండిరని చెప్పఁగలము.

"సమేతజనుల" దండయాత్ర:—పూర్వకాలమున చాల్డియా దేశములో నొకజాతివారు కలరు వారుపశువులవలె సంచరించుచుండిరి. అప్పుడు 'రుధిర' సముద్రములోనుండి 'ఓనేశుఁడు' అను మహాపురుషుఁ డొకఁడువచ్చెను. అతనిరూపము మత్స్యరూపమును నరరూపమును కలిసెను. ఈమత్స్యావతారుఁడు వారి యొద్దకువచ్చి వారిని సమస్తకళలలోఁ బ్రవేశపెట్టెను. అతనిమూలమున వారు నాగరికు లయిరి. సాయంసమయమున నతఁడు సముద్రములోనికిఁ బోవుచుండెను. ఈప్రకారము వారిచరిత్రలు లిపిలో వ్రాయఁబడియున్నది.

ఇటుల "చాల్డియా" దేశమునకు వచ్చి, ఆదేశీయులను నాగరికులఁ జేసినవారు సమేతజనులు. వీరీ దేశమును జయించి ఆక్రమించుకొనిరో, లేక దేశసంచారులై రానురాను వారీసారవంత మగుదేశమునకు వచ్చి కాపురముండి క్రమముగ తమవేషభాషలను ప్రచురించిరో, లేక దేశము లోని ప్రాచీననివాసుల వేషభాషలను తాము నేర్చుకొనిరో, మనకుఁ దెలియదు. వర్తకవ్యాపారములో సమేతజనులకుఁ గౌశలము మెండు. నేఁడు సముద్రతీరమునకు నూఱుమైళ్లదూరములో నున్న 'అరు' పట్టణము నాఁడు సముద్రతీరమున వారిచేత గట్టఁబడెను. పూర్వదిశతో జరిగిన వ్యాపారమునకీపట్టణము రేవుపట్టణమయ్యెను.

ఇట్లు సమేతులు కాపురముండిన కొన్నినాళ్లకు, దేశమంతయు చిన్న సంస్థానముల క్రింద విభక్త మయ్యెను; ప్రతిసంస్థానమున నొకరాజధానియుం డెను; అచ్చటనుండి రాజు సంస్థానమును పాలించుచుండెను. ఒకదేవాలయము కట్టఁబడి దానిచుట్టును అర్చకులును పరిచారకులును గృహములఁ గట్టుకొని నివసించుచుండిరి. ఈదేవస్థానము క్రమముగ పెరిగి పట్టణ మయ్యెను.

"ప్రథమసరగోనుఁడు" క్రీ. పూ. సం॥ 3800.

ఈరాజుయొక్క రాజధాని 'అగాధి' పట్టణము. ఇతనిజీవితచరిత్రము పురాణమువంటిది. ఇతనిపూర్వోత్తరములు విశేషము తెలియవు. "నావంశస్థులు గొప్పవారు. యూప్రటీసు నదీతీరమున నొక సాంకేతికస్థలములో నాతల్లి ఒకశిశువును ప్రసవమయ్యెను. ఆశిశువు నామె యొకబుట్టలోనుంచి ఆబుట్టకు మూఁతవేసి, దానిని నదీప్రవాహములో విడిచెను. అది నీటిలో మునిగిపోక తేలి కొట్టుకొని పోయి 'అకుఁడు' అను గంగాధరునికి దొరకెను. పిల్లలు లేనివాఁడై నందున, వాఁడు శిశువు నెత్తికొని వాత్సల్యముతోఁ బెంచెను. ఆశిశువు నే నేను—వాఁడు నన్నుతోటను కాపుంచెను. ఆసమయమున ఇస్తరుఅను భగవతి నన్నువరించెను." అని రాజుచెప్పినవిధమునఁ బురాణములోఁ గలదు ఇతనికాలములోసమేతులు ప్రథమాదండయాత్రకు వెడలిరి. వీరుసిరియనులను జయించి వారినికట్టిపట్టి తెచ్చినందున బాబిలోనియాదేశములోజనసంఖ్య బహుళమయ్యెను. "నలుబది అయిదుసంవత్సరములు రాజ్య మేలితిని: శత్రువులను జయించితిని. కంచురథముల నెక్కి దేశమంతయు సంచరించితిని. మూఁడుపర్యాయములు పారసీకతీరము వఱకును గల భూమిని నాక్రమించితిని". అని రాజుచెప్పినవిధమున నొక శిలాశాసనము కలదు. ఇతఁడు క్రీ పూ 3800 రములోని వాఁడై యుండును.

మఱికొన్ని శతాబ్దములకు "గదేయుఁడు" అను రాజు రాజ్యము నేలుచుండెను. శిరియాదేశమునుండి తేఁబడిన దూలములతోను ఏకాండపు రాతిపలకలతో నితఁడు దేవాలయములఁ గట్టించెను. అరబియా శిరియా ఈ

జిప్టుదేశములతో వ్యాపారముఁ జేయుటచేత, "అరు"పత్తనము నానాటికిఁ బెరిగి పెద్దపట్టణ మయ్యెను. అనంతరము "అరుగరుఁడు" అనురాజు సుమేరులను సమేతుల నేకీభవించి రాజ్య మేలెను. ఈకారణమున ముందుకు మహారాజ్యము స్థాపింపఁబడుటకు వీలుపడెను.

"ఈలామేతు"ల దండయాత్ర: —క్రీ.పూ.సం॥2300 రములో ఈలామేతులను వారు "బాబిలోనియా" దేశముపైకి దండెత్తివచ్చి దేశమును ధ్వంసముఁ జేసి గదేయుఁడు కట్టినదేవాలయములను నాశనముఁ జేసిరి. బైబిలులోఁ జెప్పఁబడిన "చేదరు-లయోమరుఁడు" అనువాఁడు "ఈలామేతుల" రాజై యుండవచ్చును. ఈరాజు ధాటికి భయపడి "తేరుఁడు" అబ్రహాము అనువారిద్దరు"అరు"పట్టణమును "విడిచి" కాన నేతుల దేశమునకుఁ బోయి అచ్చట "హెబ్రూ" రాజ్యమును స్థాపించిరి. "బాబిలోనియా" దేశముయొక్క దక్షిణభూములను "ఈలామేతులు"కొన్నిశతాబ్దములవఱకు నేలిరి అనంతరము సమేతులరాజైన "హామురబుఁడు" వారినోడించి, బాబిలను పట్టణమును రాజధానిగఁ జేసికొని దేశమంతయు నేలెను.

ఈరాజు సత్యవంతుఁడు ధర్మాత్ముఁడు. ఇతఁడు దేవాలయములను కట్టించెను. "టైగ్రిసు"నది పొంగిపొరలి పారి నపుడు దేశమున కుపద్రవము లేకుండ ఆనకట్లను జలనిధులను కట్టించెను. నీటియెద్దడి కలిగినపుడు నదినుండి నీరు పారించుటకు కాలువలఁ ద్రవ్వించెను. నదీజలములు నేను త్రవ్వించిన కాలువలు గుండ పోయి దేశమంతయు పారుచుండెను. భూములు నిరంతరము పండుచుండెను. భూములు సర్వసస్యఫలవంతములై నందున ప్రజలు సుఖముతో జీవించిరి"—అని రాజు చెప్పినవిధమున శిలాశాసనము యొకటికలదు. క్రీ.వె. సం 1901రములో సూసా పట్టణములోని దుర్గములో దొరకిన శిలాశాసనముఁ బట్టిచూడ హామురబుని కాలములో నాదేశము నాగరికతఁ జెందినట్లు కనఁబడుచున్నది.

అతనికాలములో "తపాలాఫీసు" లుండెను. వర్తకము సాగెను. ప్రజలు మతాభిమానులై యుండిరి. విపులముగ వ్రాయఁబడిన ధర్మశాస్త్రము కలదు. ఇదియే, రోమకుల ధర్మశాస్త్రమున కాధారమై యుండవచ్చును. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ" అనునటుల "హామురబుఁడు" భూలోకములోనికి వచ్చెను. ప్రజలను ధర్మమార్గమున నడిపించుటకు నీతఁడు దేవతలచేత నీలోకమునకుఁ బంపఁబడెను. ఇతనిని "పశుపతి" యని పిలుచుచుండిరి.

ఈధర్మశాస్త్రము మూలమున నతఁడు ధర్మమార్గములను సత్ప్రవర్తనలను మనుజులకుఁ జూపెను. ఇందులోని సూత్రములు కొన్ని వినఁదగి యున్నవి.

"కాలుచున్నగృహములో వస్తువులను దొంగిలించినవానిని ఆమంటలోఁ బడఁద్రోయుటయె వానికిశిక్ష"—"పంటలుపండని సంవత్సరములో ఋణగ్రస్తుఁడు ఋణమును తీర్చుకొన నవసరములేదు"—ఈసూత్రములఁ జూడ, క్రీస్తు పూర్వము సం 2300 రముల నాటికి వారింతసత్ప్రవర్తనులై నాగరికులై యుండుట అత్యాశ్చర్యముగ నున్నది.

ఇంతియకాదు. దేశములోని మతాభిప్రాయముల నతఁడు సంపుటీకరణముఁ జేసి, వానిని పట్టణములో నగరుగోడలమీదఁ జెక్కించెను. "అసీరియా బాబిలోనియా' దేశములకు 'బాబిలను' పట్టణము సర్వకళాస్థాన మయ్యెను. అతనికాలము కృతయుగముఁ బోలియుండెను. అప్రచలితభాషయొక్క వ్యాకరణములను నిఘంటువులను సుమేర సమేతి భాషలలో మృత్ఫలకలమీఁద సరిపంక్తులలో వ్రాయుటకుఁగాను ఈరాజుగాని ఇతనితరువాతవచ్చిన రాజుగాని యుత్తరువు చేసియుండెను. ఇప్పుడు మనము సంస్కృతముఁ జదివిన విధమున విద్యార్థులానాడు సుమేరభాషను చదువుచుండిరి.

"కాసేతుల" 'దండయాత్ర:—క్రీ. పూ. సం 1783-1207 రము వరకు అసీరియాదేశము పుష్టిచేసి బలమగుచుండెను. బాబిలను దేశము సంపదచేత విరసించెను. ఇంతలో "కాసేతులు" అను. రాతజనులు వారిరాజులతో దండెత్తి

వచ్చిరి. వారి పుట్టు పూర్వోత్తరములు తెలియవు ; వారు దేశములను స్వాధీనముఁ జేసికొని బాబిలనుల వేషభాషల నవలంబించిరి. ఈ రాజులలో నొకఁడు ఈజిప్టురాజునకు రెండు త్తరములు వ్రాసెను. ఆయుత్తరములు నేటివఱకును కలవు. ఇంతలో అసీరియారాజు "తుకులిత-నినీబుఁడు" దండెత్తి వచ్చిరి. "బాబిలను" దేశము నాక్రమించుకొనెను.

అసీరియనుల దండయాత్ర:—క్రీ. పూ. సం 1275రము:—పొరుగున నున్న అసీరియనుల పోటువలనను దేశాభిమానులగు బాబిలనుల క్షత్రుల చేతను, కాసేతుల వంశ మంతరించెను.

కొంతకాలమువఱకు బాబిలనుల ప్రభ వెలిగెను, కాని, అసీరియనుల రాజు 'తిగ్లేత-పిలేశరుఁడు' ఈదేశమును జయించి స్వాధీనపఱచుకొనెను. ఇటుల రెండుదేశము లేకచ్ఛత్రాధిపత్యముక్రింద నుండినను బాబిలనులు తెలివితేటలు గలవారు గనుక తమదురవస్థకు ఘూర్ణిల్లుచుండిరి. మఱికొంతకాలమునకు వీరు 'చాల్దియా'యనుపేరుతో రెండవరాజ్యమును స్థాపించి, కొన్నిసంవత్సరముల వఱకుఁ దమప్రభను వెలిగించిరి.

ఇరువదియొకటవ అధ్యాయము.

అసీరియా ;—వీరుల దేశచరిత్రము.

క్రీ. పూ. సం॥ 1830-606 రములు.

'టైగ్రిసు'నది కిరుతటముల నుపరిభాగమున నుండు దేశము 'అసీరియా' ఈదేశములో నెండలు మెండు; నైరృతిదిశనుండి ప్రచండవాయువులు వీచుచుండును. అందుచేత నీదేశ మెప్పుడు నెండి వాడినట్లు కనఁబడును. వసంతకాలములో మాత్రము చెట్లు చిగిరించి పూచి కాచును. అప్పు డాదేశము చూ

చుట కింపుగ నుండును. గ్రీష్మఋతువు రా పూర్వ మాదేశీయులు పండించి పంటలఁ దెచ్చి గృహములలో నుంచుకొనియెదరు. గ్రీష్మము రాను దేశము మాడిపోవును. ఇట్టిదేశములో నుండుటచేత వారు వర్తకవ్యాపారములలోనికి దిగిరి. దానిని సాగించుటకు గాను వారు విదేశములను జయించుచుండిరి. ఇందు కుగాను వారు దేహపరిశ్రమఁజేసి, మహాయోధు లయిరి.

'బాబిలోనియా' దేశము వీరికి మాతృదేశమైనప్పటికిని, ఆదేశము యొక్క సర్వసంపత్కళలఁజూచి వీరసూయపడుచుండిరి. 'బాబిలోనియనుల' వలె వీరికి కళలలోఁ బ్రవేశములేదు వేఁటాడుటయంగును యుద్ధమును చేయు టయుండును వీరికభిలాష మెండు. దేశములను జయించి వారు వర్తకమును సాగించిరి ఈవిషయమును గుఱించిన శిలాశాసనములును శిలాప్రతిమలును చూడ నగును వారి అవయవములు బలిసి కండలుగలవి. వారిగాత్రములు దృఢమయి నవి. వారి రూపరేఖావిలాసములం బట్టి వారు సమేతకుటుంబములోని వారని చెప్ప నగును. ఆకుటుంబమువారి వ్యాపారగుణములు వీరికిఁ గూడ నచ్చెను. వీరు మహాగర్విష్ఠులు. కుట్రలం బన్నుటలో వీరిని మించినవారు లేరు. వారిముఖ ముఁ జూచిన వారిగుణములఁ దెలియనగును.

బాబిలోనియాలోని సమేతజనులు కొంద ఱీభాగమునకు వచ్చి కాపుర ముండిరి. వారివంశజులే 'అసీరియనులు—'అసరు, నినవే, కాల, సర్గను దుర్గము' అను ఈనాలుగుపట్టణములు ముఖ్యమైనవి. మొదటిపట్టణమునుండి దేశమునకుఁ బేరువచ్చెను. వీరిదేశమునకు రాజధాని 'నినవే' పట్టణము. ఈపట్టణ ముండినస్థల మనేకశతాబ్దములవఱకుఁ దెలియక యుండెను. అనంతర మాస్థలము తెలిసికొనఁ బడినతరువాత, నపూర్వములగు సంగతులు మనకుఁ దెలిసెను. 'అసరుబనిపాలుఁడు' కష్టపడి సంగ్రహించిన పుస్తకభాండాగార మీపట్టణములోఁ గలదు. జిగట మన్నును గొట్టములుగఁ జేసి, వానిఁ గాల్చినపైని అవిగట్టిపడును. అట్టిగొట్ట ములపైని కీలలిపిలో వారు గ్రంథములను వ్రాసిరి. ఈగొట్టముల సముదా యము దొరకెను

'అసురుబనిపాలుఁడు' తెలివితేటలు గలవాఁడు. కనుకనే గ్రంథశోధనలోఁ గాలముఁ గడిపెను. అతనిపూర్వపురాజు లెవరును గ్రంథములను గుర్తెఱిఁగినవారు కార'ని రాజు వ్రాసెను.

బాబిలోనియనులును వీరును మతాభిప్రాయములలో సమానులు. వారివలె వీరికి మాత్రము పిచ్చియాచారములుఁ గాని పిచ్చియభిప్రాయములుగాని లేవు. బాగు చేసికొనుటకుఁ గాని ఓగు చేసికొనుటకుఁ గాని ఎవనికర్మమునకు వాఁడే కర్తగాని, దేవగణమువారుగాని రాక్షసగణమువారు గాని దానిని ముట్టలేరని వీరి సిద్ధాంతము. వీరు పూజించుచుండెడి విగ్రహములు కూడ వీరివలె దృఢమయినవి. బాబిలోనియనుల 'ఇస్తరు' దేవతకు 'అస్తార్త' అను చంద్రదేవత యని మాఱుపేరు పెట్టి, వీరు దాని నారాధించుచుండిరి. ఈదేవతార్చన విధానమును వినిన భయము పుట్టును. ఈదేవతకు వీరు బలుల నిచ్చుచుండిరి; సూర్యభగవానునికి 'బాలు'అను పేరిడి పూజించిరి. ఇతఁడు వీరికి ముఖ్యప్రాణదేవుఁడు. బాబిలోనియనుల పురాణకథను వీరు సంగ్రహించిరి. 'తముజు' అను దేవుఁడు 'అస్తార్త అనుచంద్రదేవతను వివాహమాడెను. హేమంతఋతువను వరాహముచేత నీదేవుఁడు పర్వతములమీఁదఁ జంపబడి అధోలోకమునకుఁ బోవును. అప్పు డతనిభార్య విలపించి, అధోలోకమును గూర్చి పోవుచు, దాని సప్తద్వారములలో నొక్కొక్కదాని వద్ద నొక్కొక్క ముత్యాలహారమును విడిచి వెళ్లెను. ఈగాఢాంధకారబంధురంబైన లోకము నేలుచున్న దేవత నామెచూచి, సాష్టాంగనమస్కారములఁ జేసెను. ఆమె నీదేవత కారాగృహములోఁ బ్రవేశపెట్టెను. అప్పుడు దేవత లామెను విడిపించుటకొఱకు 'అరుణము'అను శునకమును పంపినందున ఆశునకము వచ్చి ఆమెను విడిపించి, భూలోకమునకుఁ దెచ్చెను. వసంతకాలములో సూర్యునికి 'అదోనేశుఁడ'ను పేరు పెట్టి, ఉత్సవములను వారు చేయుటకలదు. అప్పుడు ఆబాలవృద్ధులు స్త్రీపురుషాదులు వీధులలోఁ గుమిగూడి 'జీవతిఅదోనేశః. జయతి అదోనేశః' అని కేకలు వేయుదురు. చిన్నమొక్కలతోను మూలికలతోను తట్టల వల్లి, వానిలోఁ బుష్పము

లను ఫలముల నుంచి వారు సూర్యునికి సమర్పింతురు. ఈప్రకారము వసంత హేమంతఋతువులలో వారు భగవంతుని బూజించుచుండిరి. 'నేబుఁడు' అను వాఁడు వాచాలమున కధిదేవత. 'వశుమితి' అను నామె సమస్తవిద్యల కధిదేవత. 'రిమనుఁడు' అనువాఁడు వర్షాధిపతి. ఇతఁడు 'వజ్రాయుధుఁడు.' ఈదేవతల నందఱిని వారు బాబిలోనియనుల వద్దనుండి సంగ్రహించిరి. బాబిలోనియనులు దేవళములఁ గట్టించి, దేవతార్చనలను వివేకధ్యానముతోఁ జేయుచుండిరి, అసీరియనులు మాత్ర మీదేవతలను సంగ్రహించినప్పటికిని, భక్తిలేనిపూజలఁ జేయుచు, దేవాలయములకు బదులు వాని నిమిత్తము పెద్ద నగరములఁ గట్టించిరి. బాబిలోనియనులకు పరలోకము 'అనువసనిసి' వలెఁ గనఁబడును, వారికి పరలోకమున భయము పుట్టును. ధూళిఁ దినుచుండిన జీవులే వారికంటికిఁ గనఁబడుదురు—అసీరియనులకుఁ బరలోక మనిన సంతోషము వచ్చును, ఆలోకము వీరికంటికిఁ దేజోవంతమై, సర్వసంపదలతోఁ గూడియుండెను. ఆలోకములో శాశ్వతమైన సంపదల ననుభవింపవచ్చు నని వారి నమ్మకము.

అసీరియనులు మహాయోధులు. కాలమంతయు వారు రణరంగములోఁ గడిపిరి. వారి జయస్తంభము లన్నియు వారి వీరకృత్యములఁ దెలియచేయును. ఆధారము లేవియు లేనందున వారిదినచర్య యెట్టిదో, వారి యాచారము లేవియో మనకు స్పష్టముగ తెలియవు. బీదలజీవనము భోగములులేనిది, వారి నివాసములు కుటీరములు, వానివెన్నుమీఁద గవాక్షము లుండెను. వారు చాపలను, బల్లలను, కూజాలను వాడిరి. సామంతులగృహములు భవనములు; వారి భోగములు నిరుపమానములు; వారిపానీయపాత్రలు కంచువి; ఉన్నతాసనముల మీదఁ గూర్చుండి వారు భుజింతురు, 'సిరికొలదిచిన్నెలు' అనునట్లు, సామంతులకు భోగరాగాదులకుఁ గొఱఁతయేమి? సాధారణజను లందఱు తలగుడ్డలను గాని టోపీలను గాని ధరించుట లేదు. వారిశిరోజములు బిరుసు వానిని దువ్వి జడనల్లి కట్టిపెట్టుదురు. ఉద్యోగస్థులు, వైదికులు, గాయకులును టోపీలను గాని పాగాలనుగాని ధరింతురు.

రాజు రథము నెక్కి యుద్ధమునకుఁ బోవును, రథమును సారథి తోలును; దానిమీఁదను ఛత్రచామరములఁ బట్టుకొని పరిచారకులు నిలిచియుందురు; ధనస్సును పట్టుకొని యొకఁడు ముందునడుచును; ఒకవేళ యుద్ధములో నోడినపుడు పారిపోవుటకుఁగాను గుఱ్ఱములను నడిపించుకొని వెనుకనుండి కొందఱు వచ్చుచుందురు ఎచ్చటనైన సైన్యములతో విడిది చేసినపుడు, రాజు కూర్చుండుటకు సింహాసనముఁ దీసికొని ముందు కొందఱు నడుచుదురు. ముట్టడి వేయఁబడిన పట్టణము ముందు 'సేనాఖరీబు' రాజు సింహాసనాసీనుఁడై యుండినట్లు శిలాప్రతిమ యొకటి "ఆంగ్లేయసర్వవస్తుభాండాగారము"లోఁ గలదు. 'సర్వసేనాధిపతియైన అసీరియాదేశపురాజు, సేనాఖరీబు ఉన్నతాసనాసీనుఁడై యుండ, పట్టణము ముట్టడిచేయఁబడి, అతఁడు చూచుచుండ, అందులోనిధనమంతయు తీసికొనిపోఁబడెను' అని శాసనము కలదు. పట్టణమును ముట్టడించి గెలిచినతరువాత ఘోరకృత్యములను వారు చేయుచుండిరి. పిల్లలను మంటలోఁ దోసివేయుదురు; తెగిపడియున్నశిరస్సులను రాజునడుచుమార్గములో నుంచుదురు, పట్టుపడిన శత్రువులను పట్టణముబహిర్ద్వారములవద్ద మేకుబందీచేసి చంపివేయుదురు.

అసీరియనులు రాదారిమార్గములను నిర్మించుటలో నిపుణులు, అట్టి మార్గములుండుటచేత, సునాయాసముగ పై దేశములతో రాకపోకలు జరుగుచుండెను. వారికిఁ బడవలఁ గట్టుట తెలియ నందున, వారిపత్రకమంతయు నాటుపత్రకమే గాని నీటి పత్రకము కాదు.

గతించిన శతాబ్దములలో నీదేశచరిత్రమంతగా తెలియనేరము. సంక్షిప్తముగ నున్నశాసనములఁ బట్టి చూడ, వారి రాజ్యమునకు వృద్ధిక్షయములుండినట్లు కనఁబడును.

క్రీ పూ. సం॥ 1120 రము 'ప్రథమతిగ్లెత-పిలేసరుఁడు.' ఇతఃపూర్వము పుష్టిచేసి బలిసిపెరిగియున్న రాజ్యము నీరాజు వృద్ధిఁ జేసెను. పూర్వపురా

జోకఁడు 'బాబిలోనియా' దేశమును జయించి, ఏడుసంవత్సరములు దానిని పాలించెను. అన్నిదేశములవలె నాదేశముకూడ అసీరియారాజునకుఁ గప్పముఁ గట్టుచుండెను. 'నా ప్రభుత్వమువలన వారంద ఱొకమనస్సు కలవా రైరి. పన్నులను విధించితిమి. వారు కప్పములను కట్టుచుండిరి' అని రాజుచెప్పినట్లు శాసనము కలదు. స్వాధీనములై యుండిన దేశములలోనుండి, నానావిధవృక్షజాతులఁ దెప్పించి 'నినవే' పట్టణములో నొకయుద్యానవనమును రాజు వేయించెను. ఈరాజు మృతినొందినతరువాత స్వాధీనమైయున్న దేశములన్నియు స్వతంత్రించెను. మఱికొంతకాలమునకు 'అసరు-నజరుపాలుఁడు' రాజ్యమునకు వచ్చి వారి గర్వము నణచి వారిని స్వాధీనముఁ జేసికొనెను. 'అర్మీనియా, ఫోనీషియా, బాబిలోనియా, మెసపోటేమియా' దేశముల నతఁడు జయించెను.

క్రీ. పూ. సం|| 859-825 రములు. 'ద్వితీయషల్మనేశరుఁడు':— ఈరాజు 'అసరునజరుపాలు'ని కుమారుఁడు, ఇతఁడు సింహాసన మెక్కినతరువాత, నారాజ్యమునకుఁబోయి వచ్చెను. 'ఆంగ్లేయసర్వవస్తుభాండాగారము'లో నతనికాలమునాటి మూఁడుకీర్తిస్తంభములు కలవు. ఒకటి నల్లశిలతోఁ జేయఁబడిన గోపురశిఖరము. అయిదుదేశములవారిని రాజుజయించినట్లును, వారిలో నొకరైన 'ఇస్రాయేలీయుల'రాజు 'యేహు' అనువాఁడు విజయుఁడైన రాజునకు సాష్టాంగనమస్కారముఁ చేసి కానుకలను సమర్పించినట్లును, శాసనము దానిమీఁద వ్రాయఁబడెను. రెండవది:—సుఖాసీనుఁడై యున్న 'షల్మనేశరుని' శిలాప్రతిమ మూఁడవది:—రెండుఇత్తడితలుపులు; రాజుచేసిన యుద్ధములను జయించినపట్టణములను వానిమీఁదఁ జిత్రరూపములోఁ జెక్కఁబడియున్నవి. 'శిరియా, ఇస్రాయేలు, దమాస్కసు' దేశాధీశులు తిరుగఁబడినపుడు వారి నతఁడు లొంగతీసెను. ఎన్నిసారులు బాబిలోనియాదేశము స్వతంత్రించుటకు యత్నించిన నన్నిసారులు దానిపొంకము నతఁడణఁచెను. పోటుమగఁడైన రాజు పోటులాడుటలో గాలముఁ బుచ్చెను. ఈరాజు తండ్రికాలములో దేశమునకు స్వాస్థ్యముండుటచేత నతఁడు వేఁటకుఁబోయి సింహముతోఁబోరాడినట్లు శిలా

ప్రతిమలు కలవు. వేఁటకుఁ గాను మఱికొన్ని జంతువులను బోనులలో నుంచినట్లు ప్రతిమలుకలవు. ఈ కుమారునికాలములో మాత్ర మటులకాదు. ఇతఁడు ప్రతిసంవత్సరము పోట్లాగ్గి పోటుకాండ్రను తీసికొని పోటుకుఁబోవుచుండెను. ఇతనిపేరు వినిన దేశములుదుడుకు చుండెను. దీనిఁబట్టి చూడ, వర్తకముఁ జేసి బలిసి పెరుగుచున్న సిరియాదేశము నితఁడుభంగపఱచి లొంగతీసినట్లు కనఁబడును. ఇతనిమరణానంతరము రాజ్యమునకుఁ బాటుకాలము వచ్చెను. దేశ మల్లకల్లోలమై, ఎవరికి వారు స్వతంత్రించిరి. దేశమునకు నాథుఁడు లేఁడు; రాజుల వంశ మంతరించెను.

క్రీ. పూ. సం॥ 746 రము. 'తృతీయతిగ్లతపిలేశరుఁడు:— ఇతఁడు నూతనరాజవంశమునకు మూలపురుషుఁడు: మొదట బీదకుటుంబములోని వాఁడు. అయినను మహారాజలక్షణములను కలవాఁడు. శూరుఁడు. సంధానకర్త. యుద్ధముఁ జేసిదేశములను జయించుటచేత రాజులకు విజయకీర్తి తప్ప మఱి యొకటిలే దనియు, ఈకీర్తికూడ కొద్దికాలములో నశించుననియు, అతనినమ్మకము. అందుచేత నతఁడు దేశములను జయించిన తోడనే, వానికిస్వాస్థ్యముఁ దెచ్చి, ఏవిధమున నవి స్వాధీనములై విజయునియం దనురాగమును కలవియై యుండునో, ఆవిధమున వానిని నతఁడు పాలించెను. అందుచేత నతనికాలములో నా దేశము మహోచ్ఛ్రపదవికివచ్చెను; అతనిరాజధాని వర్తకమునకుం బుట్టిల్లయ్యెను. స్వాధీనముకాని పొగరుఁబోతులను పట్టితెచ్చి అతఁడు వారిని విదేశములకుఁ బంపుచుండె. స్వాధీనులై భృత్యులై యున్నవారు సంవత్సరమునకుఁ గొంతకప్పము కట్టుచుండిరి; రాజాజ్ఞ ననుసరించి వారు అసీరియాదేశముతో వర్తకముఁ జేయుచుండిరి. ఇటుల దేశములను జయించి స్వరాజ్యముతో నన్నివిధముల నైక్యమగునట్లు వాని నతఁడు పరిపాలించెను. "బాబిలోనియనులు, హితేతులు, కానసీతులు శిరియనులు"— ఈమొదలగువారికిని అసీరియనులకును సంబంధబాంధవములను కలుపుట కతఁడుయత్నించెను. అందువలన దేశము లైక్యముఁ జెంది, రాజ్యమునకు స్థిరత్వము వచ్చెను. స్త్రీలును, పిల్ల

లును, గృహోపకరణములతోఁ దగుపాటి అసీరియనులు వెంటనంటిరాను వివాహార్థము దేశములోనికిఁ బోవుచున్నట్లు, ప్రతిమలు చెక్కఁబడియున్నవి. ఇట్టిసంబంధబాంధవ్యములచేత దేశీయుల సమ్మేళనమువలన మహారాజ్యమున కేకీభావము జనించును. ఏకీభావము శ్రేయోదాయకము.

ఇదివఱకే బాబిలోనియాదేశము స్వాధీనమై యుండెను; ఇప్పుడు సిరియాదేశము కూడ భృత్యవర్గములోఁ జేరెను. ఇంతియ కాదు. "ఇస్రాయేలు, డమాస్కసు రాజులు శిరియనులను తోడుబెట్టుకొని, నామీఁదికి దండెత్తివచ్చిరి. వారిపోటునుండి నన్ను రక్షించి, భృత్యుని నన్నుఁ గాపాడవలె"నని జూడాదేశపురాజు "అహాజు" అనువాఁడు వచ్చి "తృతీయతిగ్లేతపిలేశరుని" వేఁడెను. అప్పు డతఁడు వారందఱిరూపును మాపి వేసెను. "డామస్కసు" అను రాజధానిని వారు తీసికొనిరి. దానిరాజు నతఁడు పంజరములో నుంచి మేకుబందీ చేయించెను. వృక్షజాతులతోఁ గూడినయుద్యానవనము లారాజధానిలోఁ గలవు, వాని నతఁడు ధ్వంసముఁ జేసెను. అతనిమరణకాలము సరికి అసీరియారాజ్యము బలిసెను. దక్షిణమున నున్న పారశీకజలసంధి మొదలుకొని తూర్పుననున్న "బిక్ని" పట్టణమువఱకును, మధ్యధరాసముద్రతీరమునుండి ఈజిప్టువఱకును గలదేశ మారాజ్యములోనిది. ఈరాజామహారాజ్యమునకు సృష్టిస్థితికర్త. ఇతనికి విజయునిగుణములకంటె సంధానకర్తగుణములు విశేషముగఁ బట్టెను.

క్రీ.పూ. సం॥ 72-704రములు: — ద్వితీయసర్గనుఁడు: — ఇటులదేశములను సంధించి రాజ్యమును బహుళముఁ జేసి, "తృతీయతిగ్లేతపిలేశరుఁడు" దానిని సృష్టించెను, దానికి స్థితిగతులను పన్ని, దానికి స్థిరత్వము నిచ్చుకాలమున కతఁడు మృతినొందెను. అనంతరము రాజ్యము లయమునొందకుండ దానిని నిలువఁబెట్టి "ద్వితీయసర్గనుఁ" డుద్ధరించెను. అతఁడు సింహాసము నెక్కినతోడనే, బాబిలోనియాదేశము తిరుగఁబడెను. సిరియాదేశపు రాజులు స్వతంత్రిం

చుటకు యత్నించిరి: రాజ్యమునకుఁ బొలిమేరలనున్న జాతివారలపోటు పుట్టెను. ఈజిప్టుదేశపురాజు ధాటికి అసీరియనులు భయపడుచుండిరి.

"ద్వితీయసర్గనుఁడు" గతించినరాజుయొక్క సేనానాయకులలో నొకడు జాతిపోవుచున్న రాజ్యసూత్రముల నతఁడు బిగించి సేవలనచ్చటచ్చట నిలిపి, శత్రువులనుండి రాజ్యమును సంరక్షించెను, "త్రిశక్తియుతుఁడై" చతురంగబలములనతఁడు నడిపించుకొని పోయి "రాఫియా" వద్ద జరిగినయుద్ధములో సిరియనులను వారిమిత్రులతోఁ గూడ నోడించెను. ఇదిగాక "సమేరియనుల" నతఁడు సాధించెను. మఱికొన్నిసంవత్సరములకు "వింతేతుల" రాజధానియైన "కార్కమేషు" అతనికిఁ బట్టుపడెను, ఈపట్టణము పూర్వపశ్చిమ దిశలవర్తకమునకుఁ బుట్టినిల్లు.

ఈకాలమున ఈజిప్టురాజు 'షబకుఁడు.' ఈయిరువురు రాజులయొక్క ముద్రలతోఁ గూడిన సంధిపత్రిక యొకటి కలదు. అందువలన వారు సంధిఁజేసికొని రని తెలియనగును. ఇంతలో 'బాబిలను' దేశపురాజు 'మారోదక-బలదనుఁడు' సమయముఁ జూచి కుట్రలఁ బన్ని దిరుగఁబడుటకు సిద్ధపడుటయే గాక, జూడా దేశపు రాజగు 'హజికేయు' ని తనపక్షమునకుఁ దెచ్చుకొనెను. ఇది వఱకితఁడు తనమంత్రియైన 'ఇసాయు' ని మంత్రాలోచనలను విని వాని ప్రకారము నడుచుకొనుచుండెను; కాని, బాబిలనురాజుయొక్క దురాలోచనలను విని అతఁడు పంపిన రాయబారుల నత్యాదరముతో నితఁడు గారవించెను. 'చేతోహరాయువతయస్సుహృదోఽనుకూలా స్సద్బాంధవాః ప్రణయగర్భగిరాశ్చ భృత్యాః, వల్గంతి దంతినివహా స్తరళాస్తురంగాః' అనువిధమున, 'హజికేయుఁడు' తనసర్వసంపత్తును వారికిఁ జూపించెను. "చూడుము, నీయావత్సంపదయు బాబిలనుకు తీసికొని పోఁబడును. నీకుమారులు సహిత మారాజునకు భృత్యులగుదురు" అను ఋషివాక్యము సఫల మయ్యెను; ఈకుట్రదారులిరువు రేకీభవించుసరికి 'సర్గనుఁడు' సైన్యముతో వారిమీద దుమికెను జూడా దేశమును నాశనముఁ జేసి 'జెరూసలము' పట్టణముఁ బట్టుకొని, సర్గనుఁడు

‘అష్ఫాదు’ పట్టణముఁ దగులబెట్టెను, ‘ఈజిప్టు’ దేశము ‘హాజికేయునితో’ స్నేహముగనుండినప్పటికిని, వానికి సహాయముఁ జేయలేదు. ‘మారోదకబలదనుఁడు’ తనబాబిలనుదేశమును సంరక్షించుకొను చుండెను గాని, వానికిఁ దోడ్పడలేదు విజయుఁడగు సర్గనుఁడు దండుతో ‘బాబిలను’కు వచ్చుసరికి, మారోదకబలదనుఁడు’ రాత్రికి రాత్రి భయపడి పిల్లివలె పాఱిపోయి, ఈలామేతల రాజువద్దకుఁ బోయి ‘నన్ను రక్షింపుము. నాబంగారు సింహాసనము, రాజదండములు, వెండిఛత్రమును నీకిచ్చెద’నని ఆరాజును బ్రతిమాలెను.

ఈబామేతులరాజు సర్గనుని బలపరాక్రమముల నెఱిఁగినవాఁడు గనుక, సహాయముఁ జేయక వానిని పంపివేసెను. ‘మారోదకబలదనుఁడు’ నిరుపేదవలె విలపించుచు తనపట్టణమునకు వచ్చెను. బాబిలోనియనులు రాజుచేత విడువఁబడినందున వారిమంత్రులు ప్రధానులు మొదలగువారు తమవిగ్రహములఁ బట్టుకొని సర్గనునిశరణుఁ జొచ్చిరి. అనంతర మతఁ డాపట్టణములో పట్టాభిషిక్తుఁ డయ్యెను.

ఇటుల నలువైపుల శత్రువుల బరిమార్చి సర్గనుఁడు తనపేరువ ‘సర్గనదుర్గము’ను పట్టణముఁ గట్టుట కారంభించెను. “రాత్రింబగళ్లు నగరనిర్మాణములోఁ గాలము వెళ్లుచుండెను. దేవాలయములను రాజభవనములను గట్టించితిని’ అని అతఁడు వ్రాసెను. మొదట దేవళములు నిర్మింపఁబడెను, దంతములోను ‘టేకు, దేవదారు, తాళ’ వృక్షముల దూలములతోను మహోన్నతమైన రాజభవనము నతఁడు కట్టించెను. పట్టణమున కెనిమిదిసింహద్వారము లుండెను; ఒక్కొక్కద్వారమున కిరువైపుల రెక్కలు గలరెండువృషభముల శిలాప్రతిమలు కలవు. ‘ఈనగరమును రాజనగరును ‘అసరు’ దేవుఁడు రక్షించుగాక! ఆ చంద్రార్కము దీనికాంతి ప్రకాశించునట్లు చేయుగాక! శాశ్వతముగ నీనగరము నివాసయోగ్య మగుగాక! అహోరాత్రములు భగవంతుండు దీనిని కాపాడుగాక!’ అని రాజు దేవునిఁ బ్రార్థించెను. ఆపట్టణపు ప్రహరీగోడల-

మీఁద నారాజుయొక్క వీరకృత్యములన్నియు చిత్రరూపమునఁ జెక్కఁబడెను. ఈచిత్తరువులతనికాలమునాటి దేశచరిత్ర కాధారములు.

ఏయేదేశముల నతఁడు జయించెనో ఆయాదేశవాసులను రప్పించి, వారికి స్వాస్థ్యముల నిచ్చి, వారు పట్టణములోఁ గాపురముండునట్టులఁ జేసెను. 'నాయాజ్ఞోల్లంఘనఁ జేయలేక వివిధభాషల నుచ్చరించు దేశీయు లనేకులు నలువైపులనుండి వచ్చి, యాపట్టణములో నివసించిరి. వారందఱు నొకభాషను మాట్లాడుచుండిరి' అని రాజు వచించెను. ఏవిధమునవిదేశమునకు వచ్చితి మను కించలేక వారు స్వాస్థ్యపడిసుఖముగ జీవింపఁగలరో, ఆవిధమున వారి నతఁడు సంతోషపెట్టి ఆదరించెను. ఎంత ఆదరణను పొందినను, వారిలోఁ గొందఱు స్వదేశగమనాభిలాషులై యుండిరి వీరిలో నొకఁడురాజును బలవంతముగఁ జంపివేసెను.

క్రీ॥ పూ. సం. 704రము “సేనాఖరీబు”—అనంతర మీరాజు సింహాసనమునకు వచ్చెను. రాజు సుఖముగ సింహాసనాసీనుఁడై యున్నట్లు బొమ్మలు కలవు.

బాబిలోనియనులరాజు “మారోదకబలదనుఁడు” కారాగృహమునుండి తప్పించుకొని పాఱిపోయెను. అందుచేత నాదేశమును తిరిగి “సేనాఖరీబు” జయింపవలసివచ్చెను. అయిన నిచట నొకచిక్కు వచ్చెను. ఇతని పూర్వపురాజులు బాబిలను పట్టణమునకుఁ బోయి అచ్చట దేవాలయములోని దేవుని హస్తములఁ బట్టుకొన, ప్రజలందఱు “రాజుజీవించుగాక” అని బయటనుండి కేకలువేయు ఆచారము కలదు. నేఁడు సేనాఖరీబు ఆపట్టణమునకు వెళ్లిన తరువాత నితఁడుకూడ పూర్వాచారము ననుసరించి నడుచునని వారుతలంచిరి; కాని పూర్వాచారము ననుసరించి ఆపట్టణములోఁ నభిషిక్తుఁడైనయెడల, ఆదేశమును స్వదేశముతో సరిసమానముఁ జూడవలెగాని స్వాధీనమై భృత్యవర్గములోఁ జేరినదానివలె భావింప వీలుపడదని యెంచి, అతఁడాప్రకారము నడుచుకొన

లేదు. నినవె పట్టణములో నతఁడు పట్టభద్రుఁడైనపుడు అతనికి స్వాధీనమై యున్న దేశముల కన్నింటికిని బాబిలోనియా దేశమునకును ప్రభువని చాటించిరి; అందుచేత నతఁడు తిరుగా బాబిలనుపట్టణములో నభిషిక్తుఁడగుట కిష్టపడలేదు, ఆకోపముచేత వారు "మారోదకబలదను"ని వేఁడి కారాగృహమునుండి యెవరికిని తెలియకుండ విడిపించి తమదేశమునకుఁదీసికొని వెళ్లిరి, కాని, ఇతఁడు పిఱికిపంద. 'సేనాఖరీబు' పట్టణముమీదికి సైన్యములతో రా వేగమె "మారోదకుఁడు"పట్టణమును విడిచి పాఱిపోయెను. 'సేనాఖరీబు' ఆదేశములోని పల్లెలను, పట్టణములను కాల్చిబొగ్గుచేసెను. దేశములో నెక్కడచూచినను కాలి కూలిపడియున్న నివేశనములును పీనుగులపెంటలును తప్ప మఱియొకటి కానరాదు.

ఇంతలో "ఫోనీషియనులును, ఫిలస్తీనులును, ఈతియోపియనులును, ఐజిప్టియులు"ను జూడాదేశపురాజగు 'హాజికేయు'నితోఁ గలిసి, ఏకముఖముగ నందఱును తిరుగఁబడిరి. సేనాఖరీబు దండనాయకులఁ దోడ్కొని శత్రుదళమును "ఎక్రను" వద్ద జరిగిన యుద్ధములో నోడించెను. "నా ప్రతాపముఁ జెప్పనేల? కోదండంబుసాచి ఒక్కొక్కడిని శత్రువులఁ దునుమాడితిని. వారు పికాపికలై, నాయెదుట నిలువలేక, చెదరి పోయిరి." అని రాజు వీరాలాపములాడెను.

ఇందులో నొకసంగతిని చెప్పక రాజు మౌనమును వహించెను. దిగ్విజయముఁ జేసినరాజు "జెరూసలము" పట్టణమును ముట్టడించి పట్టుకొనక ఏల యూరకుండెను. దీనికిఁ గారణమీ దేశములోని లిఖితపూర్వకమైన నిదర్శనముఁ బట్టి చెప్పలేము, కాని, "దండును తీసికొని సేనాఖరీబు పులివలె జెరూసలము మీఁదవచ్చి పడెను; కాని భగవంతుని కటాక్షముచేతనుదయమునకు వానిసైనికులందఱు శవములై పడియుండి"రని "జూయు"లచరిత్రకారుఁడు వ్రాసెను. అనంతరమతఁడు స్వదేశము వచ్చి చేరెను. అతనికి జఱిగిన పరాభవమునకు విదేశీయు లందఱును సంతసించిరి.

అనంతరము బాబిలోనియనులును, చాల్డీనులును, ఈలామీతులును కలిసి యుద్ధమునకు సన్నద్ధులయిరి. క్రీ. పూ. సం. 692 రములో 'ఖలూలి' వద్ద జరిగినయుద్ధములో నతఁడు వారి పొగరు నణఁచెను. "మిడుతలగండువలె శత్రువులు వచ్చి దేశము మీదఁ బడిరి 'అసరు' దేవుని కటాక్షమువలన వారిని భంగపఱచితిని అని రాజు ప్రస్తావించెను. ఈదండయాత్రలో నతఁడు చేసినపని యొకటియు శ్లాఘనీయమై యుండలేదు కేవలము కార్పణ్యమును వహించి బాబిలను పట్టణమును రాజు భూమిలోఁ గలిపి వేసెను. రాజనగరులును సామంతుల భవనములును దేవాలయములును పుస్తకభాండాగారములును—అన్నియు నేలఁ గలిసెను. పట్టణముయొక్క రూపము పోయెను. అంతటితోఁ జాలింపక, కాలువలుగుండ నదీజలములను పారించి వానిని దానిమీఁద నతఁడు ప్రవహింప జేసెను. అనేకశతాబ్దముల క్రిందటఁ బుట్టి, సర్వసంపత్కళలతోఁ గూడి పెరుగుచున్న బాబిలను పట్టణమును నీటిలోఁ గలిపి, శాశ్వతమైన అపఖ్యాతిని "సేనా ఖరీబు" పొందెను.

తనతండ్రివలన వచ్చినరాజ్యము నతఁడు స్థిరపఱచి బలపఱచెను ; కాని, దానిని వృద్ధిఁ జేయలేదు. వృద్ధాప్యములో నతఁడు 'నినవె' పట్టణములో నుండెను

"నారాజధానిఁ జూచుటకు రెండుకన్నులు చాలవు. విశేషముగ నివేశనములఁ గట్టించితి పురాతనమైన మార్గములను శుభ్రపఱచి, చీలికవలెనున్నవానిని విరివిగఁ జేసితిని" అని రాజనుడివెను. క్రీ. పూ. సం. 681 రములో నొకరోజు నతఁడు తనకుమారు లిరువురితోఁ గలిసి దేవాలయమునకుఁ బోయెను! దేవుని యెదుట నతఁడు సాగిలఁబడి ప్రార్థించుచుండ,నతనికుమారులు ఖడ్గముతో నతని శిరస్సును తెగనేసిరి.

క్రీ. పూ, సం. 680-668 రములు. "అసరుహాదనుఁడు."

ఇతఁడు తండ్రికిఁ బ్రియుఁడు; కుమారులలో రెండవవాఁడు. స్వాధీనులై యున్న విదేశీయులను స్వదేశీయులతో సమానులుగ నెంచి, ఆదరణతో వారిఁ జూచిన రాజు ఇతఁడొక్కఁడే కాని, ఇతని పూర్వులు కారు.

అతఁడు తండ్రిం జంపి రాజ్యమునకు వచ్చెను. ఆపాప మతనిమనసును బాధించుచుండెను. దేవతలకు శాంతిఁ జేసి, ప్రాయశ్చిత్తము నతఁడు పొందెను. అతనికి స్వప్నములో "ఇస్తరుదేవి" ప్రసన్నయై, 'ఓ రాజా, నేను 'అర్బెల' పట్టణములో నుండు ఇస్తరుదేవిని. నీపక్షమున నుండినాను, కనుక నీవుభయపడకుము నేనుమహాదేవిని. నీశత్రువులఁ దునుమాడెద, నీవువిజయుండవు కమ్ము. నీపితృహత్యాపాపమునకు వెఱవకుము. నాపరిచారకులతోఁ గూడి నిన్ను రక్షించెదను. నీప్రాణములకు భయము లేదు. మనుజులను నమ్మకుము; నన్ను విశ్వసింపుము," అని ఆమె రాజుతోఁ జెప్పినట్లు, శిలాశాసన మొకటికలదు.

అనంతర మొకయుద్ధము జరిగెను. మాటప్రకార మామె రాజునకుఁ సహాయ మిచ్చెను. 'యుద్ధస్వరూపిణి యైన దేవి యుద్ధములో నాప్రక్కనుండెను. శత్రుదళములను విదళించి నాకు జయము నిచ్చెను' అని రాజు నుడివెను.

తండ్రికాలములో నతఁడు బాబిలను పట్టణములో రాజప్రతినిధిగ నుండువాఁడు; ఆనాటనుండి బాబిలోనియను లనినను, వారిమత మనినను, వారి శాస్త్రము లనినను, ఆతని కభిమానము మెండు. వాఁడు రాజప్రతినిధి, నేడుతాను రాజు, కనుక వారిదురవస్థను విలపించి, బాబిలనుపట్టణము నతఁడు పునస్సృష్టిఁ జేసెను. పూర్వమువలె నాపట్టణము దేవాలయములు సామంతులభవనములు, రాజనగరులు, ప్రాకారపుగోడలు, ఉద్యానవనములు, విపణిమార్గములు, పుస్తకభాండాగారములు — మొదలగువానితో శోభిల్లెను. ఇది రాజధానిగఁ జేసికొని, ఇచటనే రాజు నివసించుచుండెను. ఈసమయములో, జూడాదేశపు రాజు "మనేసహుఁడు" తిరుగఁబడినందున నతనినికట్టితెచ్చి, సైనికులతనిని రాజుపాదములమీఁద వేసిరి. వానిని కట్లనుండి విడిపించి, స్వదేశమునకు వానిని రాజు పంపివేసెను.

ఈరాజు చేసినమహాకార్యము మఱియొకటి కలదు; అది యేమనిన, ఈజిప్టుదేశము నతఁడు జయించెను. ఇదివరలో నీసంగతిని వినియుంటిమి.

క్రీ. పూ. సం॥ 668-రము అసురుబనిపాలుఁడు:—

“అసురుహాదను” ని కాలములో నాదేశము రెండవపర్యాయము మహోన్నతపదవికి వచ్చెను. అతఁడు చనిపోయిన తరువాత, నతనికుమారుఁడు ‘అసురుబనిపాలుఁడు’ రాజ్యమునకు వచ్చెను; అతఁడు సింహాసనారూఢుఁ డైనపుడు శుభలక్షణము లగపడెను. “అయిదింతలు పంటలుపండెను; మందలకొలఁది పశువులు పెరిగెను; నెలకుమూఁడు వర్షములు పడెను; వాయువులనుకూలముగ వీచెను; ఋతుధర్మములు తప్పక ప్రవర్తిల్లెను; దేవతారాధనలు నిర్విఘ్నముగ జరిగెను; సదాదేవత లానందించు చుండిరి”అని శిలాశాసనములో వ్రాయఁబడియున్నది. ఇట్టి సిరిసంపదలతోఁ గూడిన దేశము నాఱియేఁబదిసంవత్సరముల కంతరించును గదా! “ఆంగ్లేయసర్వవస్తుభాండాగారము” లో నుండిన రాతిపలక మీఁద విగ్రహముఁజూడ రాజు ఠీవిగ సింహాసనమునధిష్ఠించి మందహాసముతో నుండినట్లు కనఁబడును. గ్రంథావలోకనము, గ్రంథముల సంగ్రహమును — ఈరెండు నతనికాలములో వారపేక్షచేయుట నెఱిఁగి, బాబిలను పట్టణములోని గ్రంథములను తెప్పించి నినవేపట్టణములో నొకపుస్తకభాండాగారములో వాని నుంపించెను. ఈతేఁబడిన గ్రంథముల నెత్తివ్రాయుటకును, ‘అకదు, షుమరు’ అను ప్రాచీనభాషల వ్యాకరణములను నిఘంటువులను వ్రాయుట కతఁడు లేఖకుల నియోగించెను.

ఈరాజునకు గ్రంథావలోకనయం దభిలాష మెండు; అతని నియోగమున యుద్ధమునకు దండనాయకులు పోయి విజయులగుచుండిరి. ‘టైరు’ పట్టణనివాసులు తిరుగఁబడినందున, వీరిని పోటులో వారుహాడిచి సాధించి సముద్రోదకమును వీరిచేతఁ ద్రాగించిరి. “ఆర్వాదు” దేశపురాజకుమారులు పదుగురు కానుకలనుతెచ్చి రాజుపాదములవద్దనుంచి పాదాక్రాంతు లయిరి. “చప్పన్న” దేశములరాజులువచ్చి అతనిశాసనములను శిరసావహించిరి. “ఉదయాద్రిమొదలు అస్తాద్రివఱకుఁ గలదేశీయులు రాజులతో వచ్చి అతనికి నమ్రులయిరి. అనేకవిధములఁ బ్రయత్నించినను, వారిభాషలను, తెలిసికొనలేకపోతిమి.”అని శిలాశా

సనముమీద వ్రాయఁబడి యున్నది. లిడియాదేశపురాజు "గైజేసుఁడు" కూడ కట్నములనిచ్చి రాయబారుల నతనివద్దకుఁబంపెను అతనితండ్రి కాలములో నేరికిని వీరి సంగతియే తెలియదు. వారతని స్నేహము కోరివచ్చిరి. "నా రాజ్యము యొక్క మహాత్మ్యమును గుఱించి అసురుదేవుఁడు వారికి స్వప్నములో నగపడి, "మీరు పోయి అసురుబనిపాలుని శరణుఁబొందిన మీకు శ్రేయోదాయక" మనిచెప్పినందున వారు నావద్దకు వచ్చి నాతో స్నేహముఁజేసిరి". అని రాజు వచించెను.

రాజ్యమంతయు స్వస్థముగ నుండెను. రాజప్రతినిధిగ బాబిలనులోనుండి అతని సహోదరుఁడు దేశమును పాలించుచు "ఈజిప్టు, పాలస్తైను, అరబియా" దేశములతోఁ గూడి, అతని మీఁదికి దండెత్తెను. ఈయుపద్రవము నతఁడు శ్రమపడి తప్పించెను; గాని ఈజిప్టు స్వతంత్రరాజ్య మయ్యెను, బాబిలను దెబ్బ తినినప్పటికిని శిరస్సు నెత్తుకొని యుండెను. సహోదరునితో వైరము కూడదని అతఁడుపేక్షఁజేసెను. అనంతర మతఁడు దిగ్విజయమహోత్సవమును జరిపెను. అతఁడు రథము నెక్కియుండ నలువురు దేశాధీశులారథమును దేవాలయమునకు నీడ్చుకొనిపోయిరి. ఈదిగ్విజయమున కతఁడు కృతజ్ఞతను చూపుటకై దేవతోత్సవములను జరిగించెను శేషించిన జీవితకాలములో నతఁడు గ్రంథశోధనములో మునిఁగియుండెను. అతఁడు రాజ్యమునకు వచ్చుసరికి బలసియున్న రాజ్యము అతఁడు చనిపోవుసరికి క్షీణించి కృశించెను.

అనంతరము రాజ్యమునకు వచ్చిన రాజులు దుర్బలులు బాబిలనులో నున్న రాజప్రతినిధి "నబోపలాశరుఁడు" స్వతంత్రించెను. అతనిని లొంగఁదీయుటకు అసీరియా రాజులకు బలము లేదు. దేశసంచారావస్థలో నుండిన మందు జాతివారు ఈశాన్యభాగమునుండియు 'కుర్దిస్తానము' అను దేశమునుండియు వచ్చి రాజ్యముమీదఁ బడినందున రాజులు వారితోఁబోరాడుచుండిరి; గాని బాబిలను దేశమును వశపర్చుకొనుటకు సమయము వారికిఁ జిక్కదయ్యె. పూర్వకాలములో రాజులు వీని దేశములను ధ్వంసముఁ జేసినందున వీరు కాఁ

ణ్యముతో నీదేశమునకు వచ్చి నాశనముఁ జేసి విడిచిపెట్టిరి. తుదకు నినవే పట్టణద్వారములవద్దకు వచ్చి, మందులనాయకుఁడు నిలిచెను; పట్టణములోనివారతనిని బలువిధముల వేఁడిరి గాని కార్యములేక పోయెను. దానికాలము సమీపించెను; ఆసంగతినిగుర్తెఱిఁగి ఆసీరియాదేశపురాజు 'సీనేషరిష్కనుఁడు' తననగరునకు నిప్పుఁబెట్టించి, పుత్రమిత్రకళత్రాదులతో నామంటలో నశించెను. ప్రాకారపుగోడలు పడెను; టైగ్రిసునదియుప్పొంగి పట్టణముమీదఁ బాఱెను; నినవె పట్టణము రూపుమాసిపోయెను, అంతటితో నారాజ్యమస్తంగతమయ్యెను.

“ఓ అసరుదేశరాజా! నీపశుపాలకులు నిద్రించిరి, నీప్రధానులు పరలోకగతు లయిరి నీప్రజలు కాంతారవాసు లయిరి. నీవు లేవుగనుక, వారిని సమకూర్చు వారెవరు?”

ఇరువదిరెండవ అధ్యాయము.

బాబిలోను ద్వితీయరాజ్యము (చాల్డియా).

క్రీ. పూ. సం॥ 626-539 రములు.

బాబిలను పట్టణమును సేనాఖరీబు నాశనముఁ జేసి విడిచిపెట్టెను; అసరుహాదనుఁడు రాజ్యమునకు వచ్చినతోడనె, ఆపట్టణ మతనిరాజధాని యయ్యెను. క్రమక్రమముగ పెరిగి పెద్దదియై, అసరుబనిపాలుఁడు సింహాసనమునకు వచ్చుసరికి, ఆపట్టణ మతనితోఁ గలహించుటకుఁ దగినంతసాహసము కలదయ్యెను. ఆరాజు దానిని యుద్ధములో నోడించినను, దానిని పూర్ణముగ

మట్టి చేయలేదు. రాజప్రతినిధియైన "నబోపలాశరుఁడు" స్వతంత్రించి రాజ్యము స్థాపించెను. కొంచెము చీమును రక్తమును చేకూడినతోడనే, నతఁడు ఆసీరియారాజుపై తిరుగఁబడి స్వతంత్రుఁ డయ్యెను.

చాల్డీయుల ప్రభ:—'నబోపలాశరుఁడు' స్థాపించిన నూతనరాజ్యమును బాబిలోనియను లామోదింపలేదు, కాని, వారిలోనాస్థైన "చాల్డీయు" లతనిని, అతనిరాజ్యమును నిలువఁబెట్టిరి. వీరు సముద్రతీరవాసులు, చాలకాలమునుండి బాబిలను పట్టణములోనుండి బాగుపడినందున, వారిమాట ప్రతి విషయములోను సాగుచుండెను. ఆప్రాచీనపట్టణము జీర్ణించి బలపరాక్రమములఁ జూపింపలేని సమయమున వీరిప్రాజాపత్యముచేత నాపట్టణము శిరస్సునెత్తి తిరుగఁబడుటకు సాహసించెను. అసురుబనిపాలుఁడు పరలోకగతుఁడైనందున, వారికి స్వతంత్రించుటకు సమయము వచ్చెను. క్రీ.పూ. సం|| 626 గములో, "నబోపలాశరు"ని రాజునుచేసి, వారు "చాల్డీయ" రాజ్యమును స్థాపించిరి. అయిన నీరాజాపదవి నిలుకడ లేదని అసీరియా రాజులు బలవంతులైన నతనిని సాధించి వారిపూర్వపు ప్రభుత్వమును స్థాపింతురు, లేదా, చాల్డీయ రాజకుమారులు నమ్మఁదగినవారు కారు, వారు కుట్రలం బన్నిన పన్నవచ్చును. ఇదివఱకు దెబ్బలను తిని ప్రస్తుతము స్వతంత్రించిన "ఈజిప్టు" దేశము తనపూర్వపు విజయమును దురవస్థఁ జూచి కార్పణ్యముతో నానినిప్పుడు సాధించి బాబిలను పట్టణమును మట్టిచేయుటకు వచ్చినను రావచ్చును. ఇది మాత్రము కొంతకాలమువఱకును సంభవింపలేదు, "ఈజిప్టు" సైన్యములఁ దీసికొని ఆసీరియారాజ్యములోని పశ్చిమరాష్ట్రములను సాధించుటకుఁ బోయెను. అనంతరము "నినవె" పట్టణము నేలపాలయ్యె, అందుచేత నారిభయము కూడ చాల్డీయరాజ్యమునకు లేకపోయెను. క్రీ. పూ. సం|| 605 రములో ఈజిప్టురాజు "నఖుఁడు" సైన్యములతో బాబిలనుమీదికి దండెత్తి వచ్చెను— ఇదివఱకు సిరియా, పాలస్తైను రాజ్యములను యుద్ధములో సాధించి ప్రతాపవీరుఁ డనిపేరొందిన బాబిలనురాజకుమారుఁడు ఈజిప్టు రాజసైన్యములను

"కార్కెమేసు" వద్ద జరిగిన యుద్ధములో నోడించెను—ఈ రాజకుమారుఁడు "నబుచద్నెజరు"—అనంతర మతఁడు వారి దేశమును సాధించి యుండును గాని, ఇంతలోఁ దనతండ్రి మరణమును విని, అతఁడు రాజధానికి వచ్చెను.

"నబుచద్నెజరు" పట్టాభిషిక్తుఁ డయ్యెను. నేటినుండి చాల్దియ రాజ్యము కప్పగంతులు వేయుచు మహోచ్ఛపదవిఁ జేరను.

ఐజిప్టీయులు సహాయముఁ జేయుదు రనునమ్మకముతో "జూదేయఫోనీషియా" దేశములవారు తిరుగఁబడిరి కాని అతఁడు "జూడా" దేశపురాజగు "జెహోకిము" అనువానిని రాజ్యమునుండి తప్పించి, వానిస్థానమున "జడికేయు"ని నియోగించెను. ఇతఁడు "నబుచద్నెజరు"నకు భృత్యుఁడై యుండెను.

ఫొనీషియాదేశములో "టైరు" ముఖ్యపట్టణము, రాజు దానిని సాధించుటకు ముట్టడి వేసియుండెను. ఇంతలో జడికేయుఁడు ఐజిప్టీయులను సహాయము చేసికొని తిరుగఁబడెను. వెంటనే రాజు సైన్యమును పంపి అతనిని కట్టిపట్టి తెప్పించెను. అతని నేత్రములఁ బోగొట్టి రాజతనిని బాబిలనుకుఁ బంపివేసెను. "నీవు అంధుఁడవై బాబిలనకు వచ్చెదవు" అని హీబ్రుఋషి చెప్పినవాక్యము నిజ మయ్యెను. అతనితోపాటు వారికొందఱు "హీబ్రులు" కూడ బాబిలను పట్టణమునకుఁ దీసికొని పోఁబడిరి.

పదమూఁడు సంవత్సరములు రాజు "టైరు" పట్టణమును ముట్టడించి యుండెను గాని, దానిని సాధింపలేక పోయెను. దేశములో నీయుపద్రవములకు "ఈజిప్టు" దేశము కారణమని తలఁచి, ఆదేశమును రాజు నాశనముఁ జేసి విడిచిపెట్టెను. ఇంతటితో నతనిదండయాత్రలు ముగిసెను అనంతర మతఁడు రాజధానికి వచ్చి శేషించిన తనజీవితకాలము నా పట్టణమును శృంగారించుటలో వ్యయము చేసెను. పూర్వదేశరాజులలో ఘనుఁడైన "నబుచద్నెజరు" క్రీ పూ. సం. 562 రములో దివి కేగెను. అతనితో నారాజ్యము తేజోవిహీన మయ్యెను

క్రీ. పూ. సం 561-539 రములు చాల్డీయరాజ్యము యొక్క అవసాన దినములు :—

రాజు చనిపోయిన మఱి యాఱుసంవత్సరములకు "నాబోనిదాసుఁడు" రాజ్యము నేలుచుండెను; ఆతనికుమారుఁడు "బవేషజారుఁడు" యువరాజుగ నుండి రాజకీయవ్యవహారములఁ జూచుచుండెను. ఒకసంవత్సరమున కొకసంవత్సరము "మందులు, పారసీకుల" పోటు భరించ నశక్య మయ్యెను. వారు వారి రాజు "కైరసుతో" నీశాన్యమూలనుండి వచ్చి రాజ్యమును పట్టుచుండిరి. "లిడియా" రాజ్యమును "చిన్నఆసియా" దేశము నతఁడు వశపఱ్చుకొనెను. "ఐరోపా" ఖండములోని గ్రీకులకు సహిత మతనిపేరు తెలియుదు. వారుకూడ నతనికి భృత్యులయిరి. ఆసియాఖండములోని పర్వతికాంతార భూములలోనుండి "మందులు, పారసీకుల"తో నతఁడు దాడికి వచ్చెను.

క్రీ. పూ. సం 539-రము బాబిలను నాశనము:—

ఈ సంవత్సరములో నతఁడు బాబిలను కుత్తరమున నున్న భూములను ముందు స్వాధీనముఁజేసికొని ఆపట్టణముమీఁదికి వచ్చెను. ఆపట్టణము బలమైనది; దానిప్రాకారపుగోడలు దిట్టముగ కట్టఁబడెను; అది ముట్టడింపఁబడినప్పటికిని, దానికి నిలిచియుండును. అయినప్పటికిని దానిరాజు "నాబోనిదాసుఁడు" దానిని చతురంగబలములతో రక్షింపక విడిచిపెట్టెను. అతఁడా పట్టణములో నుండిలేచిపోయెను. దానిలో నతఁడు సైనికులనుంచక, దేశములోనున్న దేవతావిగ్రహములఁ దెప్పించి, వానితో దానిని నింపెను. కైరసు సైన్యములతోవచ్చుచుండ, చాల్డీయసైన్యములను నడిపించుకొని "బలేషజారుఁడు" ఎదురు నడచెను. కాలము సమీపించెను. చాల్డీయుల పోటులోఁ జాటు లేదు. వారిరాజు పట్టుబడెను, పట్టణద్వారములను తెఱచి వారు కైరసునకు స్వాగత మిచ్చిరి. ఏవిధమైన పోటు లేకుండ వారు స్వాధీనులయి విజయపాదాక్రాంతులయిరి.

"బాబిలను పట్టణము నేలగ్రాలెను దాని జెండాపడి పోయెను" అనుశబ్దము దశదిశలు నిండెను. ఒకదేశీయులనుండి మఱియొకదేశీయుల కీశుభవర్తమానము తంతివార్తవలె నడిచెను. ప్రాచీనమహారాజ్యములలో నొకటి నేఁడస్తంగతమయ్యెను.

ప్రాచీనదేశచరిత్రలు

4-వ ప్రకరణము.


4
పారశీక రాజ్యము
సిథియా
తురేను
మాసిడోనియా
ఈజియను సముద్రము
గ్రీసు
చిన్నఆశియా
మధ్యధరా సముద్రము
కైప్రసు దీవి
సిరియా
మీడియా
హిమాలయపర్వతములు
సింధునది
ఇండియా
ఈరాను
ఈజిప్టు
అరేబియా
పెర్షియా
బాబిలను
అరేబియాసముద్రము
నైలునది

శ్రీ ర స్తు.

మీదులు, పారశీకులు—వీరి దేశచరిత్రము.

చతుర్థ ప్రకరణము.

ఇరువదిమూఁడవఅధ్యాయము.

“మీదుల” రాజ్యమును పారసీకరాజ్యమును కలిపి చెప్పుచుందురు; కాని, వానిలో ‘మీదుల’ రాజ్యము ప్రాచీనమైనది. మీదులు కేవలము రాజసులు గాని సత్వగుణసంపన్నులు కారు. వారు క్షాత్రధర్మము నవలంబించుటచేత వారిచరిత్ర మన కంతగా తెలియదు. ‘మందులును’ ‘మీదులు’ నొకరేయని తలఁచి, మఱికొంతకాలమునకు గ్రీకులు వారిచరిత్రను వ్రాసిరి. ఈమందులు విచ్చలవిడిగ సంచరించు ‘శిథియను’ జాతివారు. ‘పారశీకసముద్రము’ నకును ‘కాస్పియను’ సముద్రమునకును మధ్యనున్న నాగరికులైన దేశీయులను వారు సాధించిరి. మీదుల రాజొకఁడు వారిని జయించినందున, వారతని సైన్యముతో నైక్యమయిరి; వారికి మందులనుపేరు పోయి మీదులనునామము వచ్చెను. మఱి కొంతకాలమునకు వారిలో నొకఁడు మీదులరా జయ్యెను. ఆరాజు ‘అస్తేయజీశుఁడు’ అతఁడు ప్రథమమున ‘బాబిలను’ మీదికి దండెత్తి వచ్చెను. అనంతరము ‘మీదుల’ దేశమును ‘పారశీకులు’ జయించిరి. వారిరాజ్యము వీరిదానిలో నైక్య మయ్యెను. ఇప్పుడు ‘మీదులకును’ పారశీకులకును, రాజు ‘కైరసు’ పుట్టుపూర్వోత్తరములలోఁగాని లేక గుణములలో గాని తారతమ్య మీరెండు తెగలవారికిని లేదు. మన మిప్పుడు ‘ఆఫ్గనిస్తానము,పరుదిస్తానము’అని పేరిడిన దేశములనే నాఁడు ‘ఈరాను’ దేశమని వారు పిలుచుచుండిరి. ఈరెండుతెగలవారు ‘ఈరాను’ దేశవాసులు.

ఈ "ఈరాను దేశములో" ననేక యుగముల క్రిందట మానవజాతిలో వారగు "ఆర్యకుటుంబము" వారు కాపుర ముండి, అనంతరము వారిలోఁ గొందఱు ఐరోపాఖండమునకుఁ బోయి ఆధునిక పాశ్చాత్యులను మూలపురుషులయిరనియు, మఱికొందఱుపూర్వదిశకివచ్చి హిందువులకు మూలపురుషులయిరనియు, తదితరులు పారసీకుల వంశస్థాపకులనియు, మోక్షమూలరుఁడు మొదలగుపాశ్చాత్యుల మతమై యుండెను, కాని ఇటీవల పాశ్చాత్యశబ్దశాస్త్రజ్ఞులామతమును ఖండించి, ఆర్యుల ప్రథమనివాసస్థానము "ఐరోపా" ఖండములోనని చెప్పినసంగతులను ప్రథమకాండలో వివరించియుంటిమి.

ప్రథమమున పారశీకులు ప్రకృతిదేవతారాధకులు చాల్దీయులవలె భూతప్రేతపిశాచరాక్షసగణములఁ బూజింపక, వారు వానికంటె నెక్కుడగు దేవతలను శుద్ధాంతఃకరణతో నారాధించు చుండిరి. పారసీకులు మొదటను దేశసంచారులు, పశుపాలకులు; త్రాగుటకు నీటను, పశువులు మేయుటకు మంచిగడ్డియు — ఈ రెండు నెచటనుండిన నాస్థలమునకు మందలను తోలుకొని పోవుచుందురు. వారికిస్థిరమైన నివేశనము లైనను లేవు — ఈ కారణముల చేత (ద్యౌ= ఆకాశము), (తేజస్సు = సూర్యకాంతి), (అగ్ని = విద్యుచ్ఛక్తి), (పృథివి=భూమి), వాయువు, ఉదకము — వీనిని వారారాధించుచుండిరి. మతవిషయములో వారిబుద్ధి విజృంభించెను. గ్రీష్మకాలములో నంతరిక్షమున ఖండలు ఖండలుగఁ బోవు మేఘబృందములు గొఱ్ఱెలమందవలెనున్న వనియు, వీనిపాలు దాహము నేవిధమునఁ దీర్చునో, ఆటులనె వానిజలములు కూడ దాహముఁ బోగొట్టు ననియు వారుపమానమును తెచ్చుచుండిరి. మఱియొకప్పుడా మేఘములె జలములఁ దెచ్చుకన్యలతో వారు సరిపోల్చుట గలదు. నీటియెద్దడికలిగినపుడు, "గొఱ్ఱెలను రాక్షసులు దాఁచి వేసిరి; వారు కన్యలను పర్వతగుహలలోనుంచిరి," అని వారు చెప్పుదురు. అప్పుడు వజ్రధరుఁడు వచ్చి విడిపించినపైని, అవి వర్షించును.

"జొరాష్టరు"* అను మహాపురుషుఁడు వారిమతాభిప్రాయములను సంగ్రహించి సంపుటీకరణముఁ జేసెను. అతని పుట్టుపూర్వోత్తరములు గాని,

అతని కాలముగాని మనకు స్పష్టముగ తెలియదు, కాని అతఁడు క్రీ. పూ. సం॥ 1000 రమునాటివాఁ డనిచెప్పుదురు. అతఁడు మహాజ్ఞాని; అతఁడు ప్రకృతిదేవత నారాధించినందున, నా మెకటాక్షముచేత నతనికిఁ బ్రకృతిరహస్యములు కొన్ని తెలిసెను. అతనికిఁ బ్రకృతిసూత్రములజ్ఞానము కలిగెను. అందఱు మహాపురుషులు వలె నతఁడు కూడ నతనికాలములో నెవరిచేతను మన్ననలం బడలేదు.

"నేనేదేశము వైపు తిరుగుగును? నేనెచ్చటికిఁ బోదును? భృత్యులెవరు నన్ను మన్నించరు క్రూరులగు భూపతులయినను నన్ను చేరరానీయరు. ఓభగవంతుఁడా! ఓస్వామి! నిన్ను నేనేవిధమున నారాధింప గలను? నేను నిరాశ్రయుండను" అని జోరాష్ట్రరు తన గ్రంథమగు "అవేస్తలో" వ్రాసెను. "నేనొక రాజుయొక్కయు రాణియొక్కయు ఆశ్రయమును సంపాదించితిని. వారి ప్రాపకమువలన నన్ను మతగురువుగఁ బ్రజలు భావించిరి" అని అతఁడా గ్రంథములో మఱియొకసందర్భమునఁ జెప్పెను. నలుగురితోఁ గలియక, జీవితకాలము నతఁ డేకాంతముగఁ గడిపెను. అతఁ డొకపర్వతమునకుఁ బోయి అచట తదేకధ్యానమున నుండి, తనమతాభిప్రాయములను పరలోకచింతనలను వ్రాసెను. ప్రపంచములో నతని యవతరణమును గుఱించి యొకముచ్చటగలదు. పూర్వకాలములో నొకసమయమున పశువుల కధిదేవత దేవతలయొద్దకుఁబోయి "ఓదేవతలారా! నాపశుగణములను మనుజులు బాధించుచున్నారు. వారి బారి నుండి వీనిని దప్పించు సాధనముఁజూపుఁ"డని వేఁడెను. వారతనినిఁజూచి "నీగణములను రక్షించుటకు నాథుఁడు లేఁడు. మనుజులకొఱకుఁ బాటుపడి, వారికి మాంసమునిచ్చుటకై నీగణములను సృజించితిమి" అని చెప్పిరి అధిదేవత మాటలను విని, "మనుజులలో నెవరైన నాగణములను రక్షించువారు లేరా?" అని యడిగి యేడ్వసాగెను. "మామాటలను విని వాని ప్రకారము నడచువాఁడు భూలోకములో నొకఁడుకలఁడు. వాఁడే జోరాష్ట్రరు. వానిపలుకులు తేనెపలుకులు. వానియొద్దకు నీవుపొమ్ము" అని దేవతలుచెప్పిరి. అందు కధిదేవత సంతసింపక, "అయ్యో, నా కర్మము కాలిపోను! నాగణములఁ గాపాడుటకు నేనొకమహావీరు నొకని దయ

చేయు మని ప్రార్థింప, వీరరసములేనివీరుని విరసపు మాటలను విని సంతసింపు మని చెప్పెదరా? నాగణములను రక్షించువాఁడెవ్వఁడైన భూలోకములో నవతరించునా?" అనిదుఃఖించెను. ఇంతలో జోరాష్ట్ర ఉద్భవించి, మనుజులను పశువులను తనమృదుమధురవాక్యములచేతరంజించెను.

అతఁడు వ్రాసినమతగ్రంథములు నశించినవి, కనుక వానిమతాభిప్రాయములను సంపూర్ణముగ జెప్పలేము, కాని "జెంద-అవేస్థ" అను మతగ్రంథమునుబట్టి మీడులు - పారసీకులమతమును గురించి కొంతవఱకుఁ జెప్పగలము ఈగ్రంథమును జోరాష్ట్రరు వ్రాసెను.

మనుజులమతము వారిదినచర్యల ననుసరించి యుండును. 'మీడులును పారశీకులును,' దేశసంచారులు వారికి నిలుకడలేదు. బహిఃప్రదేశములే వారి నివేశనములు. అట్టివారు పంచభూతముల నారాధింతురు సూర్యుని వారు పూజించిరి, దినకరుఁడు వారికి భగవంతుఁడు, అంధకారమును వారు రాక్షసునిగభావించిరి. 'అంతరిక్షమునకు దినకరుఁడు దేవత మూఁడులోకములు నతనికాంతిచేఁ బ్రకాశించును. అతనికిఁ జీఁకటి లేదు. రత్నచింతామణిగృహమధ్యస్థుఁ డయిన ప్రభాకరుని సేవింపుమని జోరాష్ట్రరు వ్రాసెను సూర్యుఁడు భగవంతుని నేత్రమనియు, అగ్ని అతని కుమారుఁడనియు వారు భావించిరి. జలములను వారు ప్రీతితోఁ జూచి పూజించిరి. సూర్యునితో సంబంధించిన 'అరుణ' దేవుని వారు మహాభక్తితోఁ గొలుచుచుండిరి."అరుణుఁడు పచ్చికభూముల కధిదేవత. సూర్యోదయమున కతఁడు ముందువచ్చును, సూర్యుఁ డస్తమించిన తరువాత నతఁడు వెళ్లును. తెనహిరణ్మయకాంతులతో నతఁడు పర్వతశిఖరముల నలంకరించును. సమస్తజంతుజాలములో నిండి భూలోకముపై నతడు చల్లనిదృష్టులు వింధ్యవీథినుండి ప్రసరించును. పర్వతకాంతారములపై నేమి గంగాతరంగిణులపై నేమి—అంతట నతఁడు చల్లనికాంతులు వ్యాపించును" అని యాగ్రంథములో నున్నది.

గాఢాంధకారములో వచ్చి మనుజులను బాధించు రాత్రించరులను భగవంతుఁడు వధించి మనుజులను రక్షించును. 'ఈహిరణ్మయుఁడైన పురుషుఁడు

తిమిరోన్మథనుఁడు, తెల్లనికవచముఁదొడిగి, తెల్లని అశ్వము నెక్కి, 'హిరణ్మయ కాంతు లొలుక, తిమిరమును తనఖడ్గముతో నతఁడు చంపును' అని సూర్యోపాసనమంత్రము కలదు. "నానృతం వదేత్" అని శాసనము కలదు. "మనుజుఁడసత్యముఁ జెప్పరాదు, ఇతరులను మోసముఁ జేయఁగూడదు; కృతఘ్నుతఁ జూపరాదు. ఏపాపమును చేసినను భగవంతునికి రహస్యము లేదు. అన్నిసంగతు లతనికిఁ దెలియును. మనుజుఁడు పాపముఁ జేసి, ఎచ్చటకుఁ బోఁగలఁడు?" అని వారి సిద్ధాంతము.

శాశ్వతానంతకీర్తిప్రభలతో వెలుగుచు దేవలోక మనయుపర్వతము మీఁదనుండును. "ఆలోకములో రాత్రిగాని, చీకటిగాని, లేదు, శీతోష్ణ వాయువులు లేవు, రాక్షసుల భయము లేదు వ్యాధ్యాదు లేమో తెలియదు, మేఘము లచటికిఁ రాఁజాలవు" ఆకొండకు చేరువను "వేగసముద్రము" కలదు. మేఘములు దానినీరుఁ ద్రాగి, మనుజులకు వర్షించును ఆయుపత్యక నేలలో "జీవవృక్షము" మొలచియున్నది, దానిసమీపమున నింకొకవృక్షము కలదు, ఇదియె భూలోకములోని సమస్తవృక్షములకు నాధారము

అగ్ని భగవంతుని కుమారుఁడు గనుక నతనిని వారు శ్రద్ధాభక్తులతో నారాధించిరి. ప్రతిగృహస్థు అవిచ్ఛిన్నాగ్నిహోత్రముల నుంచవలెను, వానికింధనముల నిచ్చుచుండవలెను. రాత్రి మూఁడుపర్యాయములు లేచి, పాదములను హస్తములను జలముతోఁ గడిగి శుచియై, గృహస్థు పునస్పతిహోమముఁ జేయుచుండెను శుచిభూతముగ వారగ్నిహోత్రము నుంచి దేవాలయములో నగ్నిహోత్రమువద్దకుఁ బోయినపుఁ డర్చకుఁడు వస్త్రముతో నోరుమూసికొని పోయి సమిధలను హోమముఁ జేయును. వారి పురోహితులు "మాగీలు"— వీరికే మంత్రములు వచ్చును, దేశములో నెచ్చటఁ జూచినను వీరిప్రభ ప్రసరించెను రాజులు సహితము వీరిమాటలను శిరసావహించిరి.

మీడులును పారసీకులును చిదానందపురుషులు. వీరిబుద్ధికి మాంద్యము లేదు, ఆబుద్ధి భూమ్యాకాశములనడుమఁ బ్రసరించెను సంభాషణలో వారు సరసులు; సత్యముఁ దప్పనివారు, ధైర్యస్థైర్యములుఁ గలిగియుండిరి. కవచ

ములు లేకయె చిన్నచురకత్తులతో వారు పోరాడుచుందురు. గ్రీకులకు వీరి యందు మంచియభిప్రాయ ముండెను.

ఉపాధ్యాయుఁడు మూఁడుసంగతులఁ బ్రతిపారశీకబాలునకు నేర్పును, అశ్వారోహణము ధనుర్విద్య సత్యసంభాషణ. ఋణమునిచ్చుటగాని, పుచ్చు కొనుటగాని వారికిష్టములేదు. వస్తువులనిచ్చి పుచ్చుకొనటలోఁ బీడించి బేర్ర మును వారు చేయరు. అతిధులను అభ్యాగతులను వారాదరించుచుండిరి, వారి సంభాషణ కపటము లేనిది, సందర్భము ననుసరించి శృంగారాదిరసములు వారి ముఖములమీఁద నొలుకుచుండును.

రాజునందు వారికిఁ బ్రేమాతిశయములు మెండు. అతని భ్రూభంగ మునకు వారుభయపడి, అతనిమందహాసమునకు వారు సంతసింతురు. రాజు చీనిచీనాంబరములను ధరించెను. వాహనారూఢుఁడై రాజు సంచారమునకుఁ బోయినపుడు, అవరోహణారోహణలకు గాను రత్నస్థగితమైన పాదపీఠము నొకసేవకుఁడును, ఛత్రచామరములను మఱియొకరును, ధనుర్బాణముల నొక రును, అంబులపొది నొకరును పట్టుకొని ముందు నడుచుట గలదు. రాజభవన ములు సకలభువనమోహనాకారములై రాజిల్లెను, నలువైపుల మహోన్నతప్రాకార ములును, వానిమధ్య పాలశిలనిర్మితసౌధజాలంబులును, చిత్రవిచిత్రవితానము లతోఁగూడిన కుడ్యములను, వానిసమీపమున నుపవనంబులును కలిగి, రాజనగరు శోభిల్లెను. అతనిపర్యంకమును వర్ణించుటకు వీలులేదు.

వారినిగుఱించిన సంగతులన్నియుఁ దెలియనుగాని, వారిస్త్రీలను గుఱించి మాత్రము మనకుఁ దెలియదు. వారిస్త్రీ లంతఃపురనివాసులుగాని, స్వేచ్ఛగ సంచరించువారు కారు. స్త్రీలవిషయమై వారితోఁ బ్రశంసించుట తప్పు; సవా రిలోఁ గూర్చుండి మార్గముగుండ స్త్రీలు పోవుచున్నపుడు, పురుషుఁడు కన బడిన, వానికి శిరచ్ఛేద మగును. మనవి చేయకుండ రాజుసముఖమునకుఁ బోయిన వానికిఁ గూడ శిరచ్ఛేద మగును. రాజశాసనములకుఁ దిరుగలేదు; వారి ధర్మ శాసనములు శిలాక్షరములు; రాజానుగ్రహమునకుఁ గాని నిగ్రహమునకుఁ గాని ఫలములో లోపము లేదు. రాజు చనిపోయినపిదప, వాని శరీరముఁదగులఁ

బెట్టిన, పంచభూతములును కలుషముఁబొందు ననితలఁచి, దానిని సమాధిఁ జేయకుండిరి.

సంసారు లందఱు తమకుమారులకు విద్యను నేర్పుచుండిరి ఐదుసంవత్సరములవయస్సుబాలునకు వచ్చినతోడనే, వానికి విద్యాభ్యాసముఁ జేయించి ఆదుపాజ్ఞలలో వానిని తండ్రి యుంచును, శీతోష్ణములను భరించి, నిద్రాహారములు లేకుండ, బాలుఁడు శ్రమపడవలెను, చేతిలోనిఖడ్గము దీయకుండ, నదిలో నీఁదుకొని పోయి వాఁడు గట్టునకుఁ జేరవలెను. పదునేను సంవత్సరములవయస్సున వాఁడు సైనికుఁడై, ఏఁబదిసంవత్సరముల వయస్సువచ్చువఱకు సైన్యములో నుండవలెను. వానిజీవనము సుఖజీవనము, చింతలేనిది. ఇట్టు విద్యనభ్యసించుటచేత, వారు వీరు లయిరి. వారిపేరు వినిన గుండెల కదటు వచ్చును.

ఇరువదినాల్గవ అధ్యాయము.

పారసీకులపురాణకథ.

పారశీక దేశములోఁ దప్ప మఱియొక దేశములో నింతచిత్రమగు పురాణ కథలు లేవు. ఈకథలలోఁ జరిత్రాంశములు విశేషముగ లేకపోయినను, వీని మూలమున వారి యాచారవ్యవహారములును, వారి గుణసంపదలును, వారి సాంఘిక ఫుకట్టుదిట్టములను మనకుఁ దెలియును.

వారిపురాణకథలోఁ జెప్పినప్రకారము "కాయుమర్సుఁ" డను వాఁడు పారసీకమహారాజ్యముఁ బూర్వకాలములో స్థాపించెను. అతఁడు సద్గుణసంపన్నుఁడు, సర్వజనమనోరంజకుఁడు, అందుచేత నతనిని దేశీయులు "లోకాధిపతి" యని బిరుదు నిచ్చిరి. వనమృగములు సహిత మతనికి పాదాక్రాంతులై

అతని యాజ్ఞను శిరసావహించెను. ఆశియాఖండములో నివసించు వనవాసులను స్వాధీనముఁ జేసికొనుట కతఁడు తర్లి వెళ్లినప్పుడు, రాజరక్షకులుగ నతని వెంబడి "మీసములవారును నామములవారును" వెళ్లిరి.

జమేషదుఁడు:—జమేషదుఁడు మఱికొంతకాలమునకుఁ బురాణకధాయకుఁ డయ్యెను. అతఁడు చిరకాలము రాజ్యము నేలెను; రాజ్యారంభమున నతఁడు ప్రజలక్షేమముఁ గోరి శ్రమపడెను, లోహమును వాడుక చేయు విధమును వారికి నేర్పెను, పట్టు, దూది, రోమము—వీనితో బట్టలను నేయు విధమును చూపించెను. నాలుగుజాతులక్రింద మనుజుల నతఁడు విభజించెను: వైదికులు, క్షత్రియులు, వర్తకులు, కాపులు—నాల్గవజాతివారికి విశేషమర్యాద కలదు "వారొకరికి భృత్యులు కారు, వారు శ్రమపడి, భూములను దున్ని, విత్తనములను జల్లి, పంటలను పండింతురు, వారొకరికిఁ గీడుఁ జేయరు, వారి కష్టార్జితమునే వారనుభవింతురు. వారు ధరించు దుస్తులు సామాన్యమైనను, వారొకరి యాజ్ఞలకు బద్ధులు కారు, సత్సంభాషణను వారు చేయుదురు. దుస్సంభాషణ వారి చెవిని సోకదు, వారు స్వచ్ఛంద విహారులు. భూములను సాగుచేయుటయే వారి కులధర్మము. వారజాతిశత్రులు, కలహశీలురు కారు" గృహముల నిర్మాణములో నిటికలును పాలశిలల నతఁడుపయోగించెను. అతఁడే నావలఁ గట్టించెను. అంతలో నతనికి గర్వము బలిసెను. తనకర్మమునకుఁ దానే కర్తయనియు, తనగొప్పతనమునకుఁ దానే కారణభూతుఁడ ననిచెప్పి, అతఁడు వీరాలాపము లాడెను. అతని నాశనమున కదియే కారణమయ్యెను. ఈగర్వముచేత నతని మనస్సు కలవరించెను. దుష్టచిత్తుఁడై మనుజులను క్షోభపెట్టినందున, వారు తిరుగఁబడిరి. ప్రజలు కుట్రలఁ బన్ని, అతనిని రాజ్యమునుండి తొలఁగించుటకై, పాశ్చాత్యదేశీయుల సహాయమును వారు కోరిరి. ఈపాశ్చాత్యులశ్వారూఢులై బల్లెములఁ బట్టుకొని తమ నాయకుఁడు "జోహాకు" అనువానితో దండెత్తివచ్చి, యుద్ధములో రాజు నోడించిరి. రాజు దేశపరారియయ్యెను. జోహాకు సింహాసనము నెక్కెను.

ఈరాజు దుర్మార్గుఁడు సైతానునకు భృత్యుఁడు. ఒకానొకప్పుడు భృత్యుని వేషము వేసికొని, జోహాకు వద్దకు సైతానువచ్చి "నేను నీభుజములను ముద్దు పెట్టుకొని నీ నేత్రములను స్పృశించుట కనుమతి దయచేయుము"మని వేఁడ 'జోహాకు' అందుల కంగీకరించెను. వాఁడుజోహాకుభుజములను స్పృశించినది మొదలు వానిలోనుండి రెండుత్రాచుపాములు తమనాలుకలను గీటుచు పైకి వచ్చుచుండును. వాని బారినుండి తప్పించుకొనుటకు మార్గ మతనికిఁగనఁబడలేదు ఐంద్రజాలకుని వేషము వేసికొని సైతాను అతని వద్దకు వచ్చి ప్రతిదినము నీవు వానికిరువురు మనుజులను బలియిచ్చినకొన్నిదినముల కవి చనిపోవు"నని చెప్పి పోయెను. ఆప్రకార మతఁడు ప్రతిరోజు నిరువురినిఁ జంపుచుండెను జమే షదునికంటె నితఁడు రెండింతలు క్రూరచిత్తుఁడైనందున జనులు ఘోషపెట్టు చుండిరి జోహాకునితోఁ గూడవచ్చినపాశ్చాత్యులు అసీరియనులలుయియుం దురు వీరు మొదటఁ గ్రూరచిత్తులై దేశములను జయించి, నరహత్యకు వెఱవకుం డిరి. వారిదౌర్జన్యమును విశదపఱచుటకై, పారసీకులు పురాణకథను కల్పించిరి

చాలాకాలముక్రిందట మృతినొందిన జమేషునకు వనవాసములో నొకపౌత్రుఁడు జనించెను. వానిపేరు "ఫరిదనుఁడు" అతఁడు జననమొందు సమయమునకు, "ఎవరో పరాక్రమశాలియైన రాకుమారుఁ డొకఁడు వచ్చి తన్నురాజ్యభ్రష్టునిఁ జేసి, తనకు సంకెళ్లను వేయించి పర్వతముమీఁద విడిచి పెట్టు"నని జోహాకు స్వప్నముఁ గనెను. ఇతఁడు భయపడి, దేశములోనుండి రాకుమారులను వెదకించెను. ఈసంగతిని విని, ఫరిదనుని తల్లి తనపసిబాలుని చంకఁబెట్టుకొని, యొకవనములో దాగియుండెను. అచ్చటనుండిన సమయమున, "పరమ-పా" అనునొక కామధేను నాబాలునికిఁ దనపాలునిచ్చి పెంచెను. ఈవనములో నాబాలుఁడు పెఱుగుచున్నసంగతి రాజునకుఁ దెలియ, బాలుని దీసికొని అతనితల్లి "ఎల్బురజు" పర్వతములకుఁ బోయెను ఈపర్వతములలో నాబాలుఁడు దినదినప్రవర్ధమానుండై, నానాటికి వయోవంతుఁ డయ్యెను.

తనపుట్టుపూర్వోత్తరముల నతఁడు కొందఱునాయకులతోఁ జెప్పెను. ఇంతలోఁ బ్రజలు తిరుగఁబడుదురని భయపడి, సామంతులను మంత్రులను మొదలగువారిని, రప్పించి "నేను రాజ్యమును మీకనుకూలముగ పరిపాలించితి ననియు, నేను సద్గుణవంతుఁడ ననియు,మీరొకపత్రమును వ్రాసి, సంతకములఁ జేసి, నాకియ్యవలె"నని వారికి జోహాకు ఆజ్ఞచేసెను. వారతనికి భయపడినవారై, ఆప్రకార మతనికిఁ బత్రమును వ్రాసియిచ్చిరి. "కావాయి" అను వడ్లంగి యొకఁడుండెను,వానికిఁ బదియార్గురు కుమారు లుండిరి,వారినందఱిని రాజు తన పాములకు హారముఁ బెట్టెను, నేఁడు వాని పసిబాలునిఁ జంపుటకు రాజు సిద్ధపడెను అప్పుడు వడ్లంగి రాజుసముఖమునకుఁ బోయి, అనేక విధముల నతనిని వేఁడి కుమారుని రక్షింపు మనిప్రార్థించెను. అందుకు రాజు "నీవు పత్రమును సంతకముఁ జేసి యిచ్చిన,నేను సంతసించి రక్షించెద" ననిచెప్ప, వాఁడాపత్రమును చూచి, "ఓరాజా, నీవు దుర్మార్గుఁడవు. నీమంత్రులు పిఱికిపందలు. నేను పత్రముపైని సంతకముఁజేయను" అని నిర్భయముగ మాటలాడి రాజుచూచు చుండ, వాఁడాపత్రమును చించివేసెను. వెంటనె జనులందఱు తిరుగఁబడిరి. వారికి నాథుఁడు లేఁడు. వారు "కావాయి"ని వెంటఁబెట్టుకొని, "ఫరదను"ని నివాసమునకుఁ బోయి,అతనిని రాజుగ నియోగించుకొనిరి అతఁడందులకు సంతసించి, గోముఖాకారముగల గదను ధరించి, సైన్యములతో వచ్చి"బాను" పట్టణమును ముట్టడించి, రాజనగరులోఁ బ్రవేశించెను. జోహాకు మాత్రము నగరును విడిచి,ఐంద్రజాలకులతోఁ గూడి మంత్రాలోచనలఁ జేసి, వచ్చునంతలో నతనిసైన్యములు పరాభవముఁ బొందెను. పట్టణమంతయు శత్రువులకు వశమయ్యెను తనతాతతండ్రుల ఋణముఁదీర్చుకొనుటకు, ఫరదనుఁడు వానికి సంకెళ్లనువేసి, "దమవెండు" పర్వతశిఖరమునకుఁ దీసికొనిపోయి, వాని నొకబండరాతికి మేకులతో దిగఁగొట్టించి విడిచిపెట్టెను. ఈప్రకారము జోహాకును వధించి ఫరదనుఁడు రాజ్యమునకువచ్చెను.

ఫరదనుని ముగ్గురుకుమారు లేవిధమున "ఈమను" దేశరాజు కుమార్తెలను వివాహమాడిరో, ఆకథ వినఁదగినది, ఆకథ నిచట నుదహరించుటకు సమయము కాదు. మఱికొంతకాలమునకుఁ ఫరదనుఁడు ముదుసలివాఁడై, కాలముసమీపించినదని గ్రహించి, తనరాజ్యమును తనమువ్వురు కుమారులకు విభజించి, వారి కిచ్చెను, "సాలీము" అను జ్యేష్ఠపుత్త్రునకుఁ బశ్చిమదేశమును, "తౌరు" అను ద్వితీయునకుఁ బూర్వదేశమును, "ఈరెడ్జు" అను కనిష్ఠునకుఁ బారసీకదేశమును పంచియిచ్చెను. జ్యేష్ఠు లిరువురును కనిష్ఠునిజూచి కొఱకొఱలాడుచుండి, వాని నేవిధముననైన రాజ్యమునుండి తొలఁగింపవలసిన దని మనవి చేయుమని వారొక రాయబారిని రాజునొద్దకుఁ బంపిరి. అటుల రాజు చేయనియెడల, వారు తండ్రిపైకి దండెత్తుటకు సిద్ధపడి యుండిరి. ఆరాయబారి మాటలను విని కోపించి తనకుమారుఁడు "ఈరెడ్జు"ను సైన్యముతో వారి మీఁదికిఁ బంపెను ఇతఁడు పరమశాంతుఁడు, అన్నలతో వైరించుట కిష్టము లేదు, సామోపాయముల చేతి వ్యవహరించుట కితఁడు కోరెను, ఆప్రకారము వ్యవహారమును పొత్తుపఱచుటకు, ఈరెడ్జు నిరాయుధుఁడై పాదచారియై, వారి యొద్దకుఁ బోయి 'ఓయన్నలారా, మీకు నేకవందనముల చేసెద. మనలో మనకు వైరము కూడదు. నారాజ్యమును కూడ మీరేయేలుకొనుఁడు నేను వనములకుఁ బోయెద. ఈచతురంగబలముల నాశనమునకు నేనియ్యకొన''నని చెప్పి ప్రార్థించెను. ఆసత్త్వగుణసంపన్నుని మృదుమధురవాక్యములకు రెండుసైన్యములవారామోదించి అతనిని నుతించిరి. ఇట్టి సర్వజనరంజనుఁడైనతమ్ముఁడు జీవించి యుండిన తమకుఁ గీడు వాటిల్లు నని జ్యేష్ఠు లిరువురును భయపడి, తమ్ముని రెప్పపాటులో వధించిరి. అంతటితో వారికిఁ దృప్తి లేకపోయెను. వానిశిరస్సును తైలద్రోణిలో నుండి, దాని నొకబంగారుపెట్టెలోఁ బెట్టి, తమ తండ్రికి దానినిఁ బంపిరి. "గర్భశోకము భరింపుట కశక్యము"—తండ్రికి వృద్ధాప్యములో నికష్టము వచ్చెను. "హాకుమారా, హాకుమారా" అని నేలఁబడి తండ్రి విలపించి విలపించి మూర్ఛిల్లెను. ఈదుఃఖమునకుఁ దరి కానరాదు. ఇటుల రాత్రింబవళ్లు నిద్రాహారములు లేక శోకించుచున్న ఫరదనునివద్దకు భృత్యులు వచ్చి "మహాప్రభూ, ఏలినవారు దాసులమని విని మన్నింపవలెను. ఈరెడ్జు

యొక్క ధర్మపత్ని నేఁడు సుఖప్రసవమై మగశిశువును కనెను. తమరు శాంతింపుఁడు''అని నేఁడి శుభవర్తమానముఁ జెప్పిరి. పౌత్రుని జననమునకు వృద్ధరాజు సంతసించి, వానిని తనకుమారునివలె భావించి వానికి "మినోచరుఁడ''ని నామకరణముఁ జేసెను. అనంతరము పితామహుఁడు దేహముఁ జాలించి స్వర్గస్థుఁ డయ్యెను.

శుక్లపక్షములో బాలచంద్రునివలె నాబాలుఁడు "మినోచరుఁడు" వర్ధిల్లెను. అంతకంతకు నాబాలునకు యౌవనప్రాదుర్భావ మయ్యెను. తన పెత్తండ్రులు తనతండ్రిని చంపినవిధమును నతఁడు విని పగను సాధించుటకై సైన్యములతో వారిమీఁదికిఁ బోయి, యుద్ధములో నతఁడు వారిని చంపెను. సత్త్వగుణసంపన్నులయిన తనతాతతండ్రులు చనిపోయినను, వినయపూర్వకముగ వారినామములను భక్తితో మనుజులు స్మరించుచుండుటచేత, నతఁడు కూడ సత్ప్రవర్తనుఁడై వారిగౌరవమును నిలువఁబెట్టెను "ఫరదనుఁడు దేవుఁడు కాఁడు. అతని శరీరము కూడ మాంసాస్థికలతోఁ గూడినది గాని, కస్తూరికాగరుచందనములతోఁ గూడినది కాదు. సత్యమును న్యాయమును విడువక, రాజ్యము నతఁ డేలినందున, నతనికిఁ గీర్తివచ్చెను. ఆమార్గము ననుసరించి నీవు సంచరింపుము''ని కవులు చెప్పిరి.

"మినోచరుని" కాలములో, "సాము" అను వీరుఁడు కలఁడు. అనేక సంవత్సరములు భగవంతునిఁ బ్రార్థింప, వానికటాక్షమున నా "సాము" నకు రూపవంతుఁ డగు కుమారుఁ డొకఁడు పుట్టెను. ఆకుమారుఁడు నవమన్మథాకారుఁడైనను, తెల్లనిశిరోజములు గలిగి యుండెను. తెల్లనికంటిపాపలతోను తెల్లనిశిరోజములతో నెవఁడైన పుట్టిన, వానిమూలమునఁ గీడుమూడు నని పారశీకులలో నొక పిచ్చినమ్మకము కలదు. అందుచేత, వానితండ్రి భయపడి, "ఎల్బర్జు" పర్వతశిఖరముమీఁద నాబాలుని విడిచిపెట్టెను. ఒకపక్షి యాబాలునిఁ జూచి, వానిని దనగూఁడునకుఁ దీసికొని పోయి పెంచెను. ఆబాలుఁ డచ్చటఁ బెరిగి పెద్దవాఁ డయ్యెను. కుమారునినిమిత్తము తండ్రి దుఃఖించుచుండ, వాఁడు

సజీవుఁడై, యొకపక్షి గూడులో నుండెనని అతని కొకస్వప్నము వచ్చెను. ఆమఱుచటిదిన మతఁడు పర్వతమునకుఁ బోయి నలువైపుల శోధించి, గూడులోఁ దనకుమారుని జూచెను. పూర్ణచంద్రునివలె రూపలావణ్యములతోఁ బ్రకాశించుచున్నకుమారుని వెంటఁ దీసికొని గృహమునకు వచ్చి, వాని కతఁడు 'తాలుఁడు' అని నామకరణముఁ జేసెను. ఈ 'తాలుఁడు' 'కాబూలు' పట్టణరాజకన్యను వివాహమాడెను, వారికుమారుఁడు ప్రసిద్ధికెక్కిన 'రుస్తుము' అనుజగదేకవీరుఁడు. 'తాలుని' వివాహమూలమున 'పారసీక-కాబూలు' రాజ్యములకుఁ దత్కాలమైత్రి వచ్చెను. అర్జునుఁడు, కార్తవీర్యుఁడు, మొదలగువారి వలె 'రుస్తుము' మహోద్దండపరాక్రమశాలి

రుస్తుము — నాటి 'ఖొరాను' దేశమునకు నేఁడు 'టార్తరి' అని పేరు కలదు. మినోచరుని కాలములోఁ బారసీకమునకును 'ఖొరాను' కును వైరము పొసగి నందున, నీదేశపురాజు 'అఫ్రాసియాబు' మాతృదేశ మగు పారసీకముతోఁ బోరాడుచుండెను. ఈపోరాటములలో 'రుస్తుము' యొక్క పరాక్రమము లోకవెల్లడి యయ్యెను. 'ఖొరాను' దేశములోని సీపెందమను పట్టణమును 'రుస్తుము' ముట్టడించెను. ఒక్కొక్కసైనికుని ఒక్కొక్కసంచిలో వేసికట్టి ఆసంచులను లొట్టియలమీఁదను వేయించి 'రుస్తుము' వర్తకునివలె, వానితో నాపట్టణములోఁ బ్రవేశించెను. పురజను లతనిఁ జూచి, ఉప్పువర్తకుఁ డని తలఁచి యూరకుండిరి. రాత్రి నిశ్శబ్దముగ నుండినసమయమున, నతఁడు సంచులను విప్పి, సైనికులతోఁ బోయి, శత్రువులఁ బరిమార్చి పట్టణముఁ బట్టుకొనెను. మినోచరుఁడు చనిపోయినతరువాత నొకబాలుఁడు సింహాసనముమీఁద నుండు సమయముఁ జూచుకొని, అఫ్రాసియాబు మఱల దండెత్తి వచ్చెను. ఇప్పుడు తాలుఁడు వాని నోడించెను. వాఁడు దేశమునకుఁ బాఱిపోయి, మరల దండెత్తి వచ్చెను. రుస్తమునద్ద "రక్షు" అను శ్వేతాశ్వ మొకటి యుండెను, దానితల్లితోఁ బోరాడి. దాని నతఁడు సంపాదించెను. ఆశ్వేతాశ్వము నెక్కి, రుస్తుము యుద్ధమునకు నడిచెను. ఉభయసైన్యములు తారొక్కని పోరాడెను. శత్రుసైన్యముల

నోడించి, రస్తుము "అఫ్రాసియాబు"ని పట్టుకొనెను. అనంతరము రెండురాజ్యములవారు సంధిఁజేసికొని తత్కాలమిత్రు లయిరి.

మఱికొంతకాలమునకు "కైకసుఁడ"నువాఁడు పారశీకమునకు రాజయ్యెను. సిరియాదేశపురాజు భృత్యుఁడైనను, కైకసునిమీఁదఁ దిరుగఁబడెను. రస్తుము వానిని లోఁగదీసెను. అనంతరము రాజు సంతసించి "సౌదాభాయి" అను సిరియారాజకన్యను వివాహమాడఁ దలచి, ఆమె తండ్రికి వర్తమానముఁ బంపెను. సిరియారాజు తనకుమార్తె నతనికిచ్చి వివాహముఁ జేయుట కిష్టము లేకపోయినను, ఆమాట నతనితో బాహాటముగ చెప్పలేక, ఏవిధముననైన వివాహముఁ దప్పించుటకు యత్నించి, కైకసుని విందునకుఁ బిలిచెను. అతఁడు పరిజనములతోఁ గూడి విందారగించుచుండ, సిరియను సైనికులు నిరాయుధులైన వారిమీఁదఁ బడి, వారిని గట్టితీసికొని పోయి అభేద్యమగు దుర్గములోఁ బడదోసిరి. తండ్రి చేసిన కుట్రకు "సౌదాభాయి" కోపగించినందున, నామెను కూడ దుర్గములో నతఁడు పెట్టించెను. అతఁడు "రస్తుము"యొక్క పరాక్రమమును మఱచెను. కైకసుని పరివారముతోఁ గూడ విడిచిపెట్టుమని రస్తుము సిరియారాజునకు వర్తమానముఁబంపెను: కాని ఆరాజు వారిని విడిచిపెట్టలేదు. అప్పుడు రస్తుము సైనికులను నావలలో నెక్కించి వారితో సముద్రము మీఁదఁ బోయి. సిరియాదేశములో దిగి రాజధానిమీఁదికి దండెత్తిపోయెను. "ఈజిప్టు, బార్బరి" దేశముల రాజుల సహాయముఁ దీసికొని, వారితోఁ గూడ సిరియారాజు యుద్ధమునకు నడిచెను విద్యుచ్ఛక్తితోఁ గూడిన రెండుకాఱుమేఘము లంతరిక్షమున నిరువైపులనుండి పవనప్రేరితములై వచ్చి గుభిల్లున తాఁకిన విధమున, రెండు సైన్యములవారు దండనాయకులచేత నుత్సాహింపఁబడి పిట్టువీరమునఁ దలపడిరి. రస్తుము జయము నొందెను. కైకసుఁడు చెఱసాల నుండి విడువఁబడి, సౌదాభాయిని వివాహ మాడెను. పారశీకులకును "కాబూలు" రాజు అఫ్రాసియాబునకును యుద్ధము సంభవించెను, అప్పుడు సిరియను సైనికులు పారసీకులతోఁ గలిసి యుద్ధమునకు నడచిరి. అఫ్రాసియాబునకు సింహాసనమును విడుచుట కిష్టములేకపోయినను, రస్తుము అతనిని నిరోధించి

రాజ్యభ్రష్టుని జేసెను. అనంతరము రాజ్యములోఁ గొంతకాలమువఱకు స్వాస్థ్యముండెను.

రుస్తుము—అతని కుమారుఁడు షొరాబు:—ఒకానొకప్పుడు రాజ్యములో నొకభాగమునుండి మఱియొకభాగమునకుఁ బోవుటకు మార్గములు లేవు. మార్గములుండినను, వానిగుండఁ బోవుటకు భయము పుట్టును ఆకాలములో రెండుసైన్యములవారు పోరాడక ఏపక్షమువా రాపక్షమున కొక వీరుని నియమించుకొని, ఈవీరు లిరువురు పోరాడు చుండిరి; వీరిలో నెవరు జయించిన, వానిపక్షమువారు విజయులు భృత్యవర్గములోఁ జేరిన 'టార్తరి' దేశపు రాజకన్యను రుస్తుము వివాహ మాడెను. వధూవరులు కేళీవినోదములలో నుండ, పారసీక దేశమునుండి వర్తమానము వచ్చినందున, నతఁడామెను విడిచి పోవలసి వచ్చెను. అప్పుడతఁడు కేళీగృహములోనికిఁ బోయి, అర్ధాంగినిఁ జూచి 'ఓబాలా, మనకు వియోగకాలము వచ్చెను నిన్ను విడిచి దేశమునకుఁ బోవలెను. నీవు దుఃఖింపకుము, శీఘ్రములో వచ్చెద. ఈదండకడియమును భద్రము చేయుము నీకు కుమారుఁడు కలిగి, నేను వచ్చులోపల వాఁడు పెద్దవాఁడైనయెడల, వానిచేతి కీకడియమును తగిలించి, వాని నావద్దకుఁ బంపుము, లేక, కుమార్తె కలిగిన యెడల, దీనిని నీవు దానికి భూషణముగ నుపయోగింపు' మని ఆమెతోఁ జెప్పి, ఆమెచెక్కిళ్లను నొక్కి శిరస్సునాఘ్రాణించి రుస్తుము బయలువెడలి స్వదేశమునకు వచ్చెను మఱికొన్ని దినముల కతనిభార్య మగశిశువుని సుఖప్రసవ మయ్యెను. ఆశిశువు చిఱునగవు మోముకలవాఁడు, కాన, వానికి 'షోరాబు' అని నామమిడిరి. మందహాసుఁడైన 'షోరాబు' అని వానికి పేరు వచ్చెను.

కుమారుఁడు పుట్టెనని వర్తమానముఁ బంపిన, తండ్రి వానిని రప్పించి అతనివలె వానిని కూడ శస్త్ర విద్య నభ్యసింప చేయునని భయపడి కుమార్తె కలిగెనని భర్తకు జాబును వ్రాసి భార్య పంపెను. ఆనాటి కానాడు కుమారుఁడు పెరిగి పుష్టిచేసి బలిసెను, అతనికి యౌవ్వనము వచ్చెను; అతనిపుట్టుపూర్వోక్తములను దాచిపెట్టక, తండ్రి సంగతియంతయు కుమారునితో నామె చెప్పెను.

అందుపై నతఁడు తండ్రి సమీపమునకుఁ బోవుటకు నిశ్చయించి, "ఓతల్లీ, అతఁడు నాతండ్రి, కనుక, నేనతనికి సహాయముఁ జేయవలెను. అతఁడు పారసీకదేశమునకు రాజగును, మేమిరువురము కలిసి రాజ్య మేలెదము. నాకు శలవు నిమ్ము" అని తల్లిని ప్రార్థించి అతఁడు ప్రయాణోన్ముఖుఁ డయ్యెను—అతని ముఖోద్దేశమును కనిపెట్టి, కాబూలురాజు, అఫ్రాసియాబు, అతనిని రప్పించి, "ఓయి, వీరకుమారా, ఒంటరిగ నీవు వెళ్లుటకంటె, సైన్యములతోఁ బోయి, పారసీకపట్టణములను నీవు ముట్టడించిన, నీమీఁదికి నీతండ్రి దండెత్తి వచ్చును. అప్పుడు మీరు సమావేశమై, మీసంగతిని తెలుపుకొనుఁడు' అని చెప్పి, అతని వెంట సైన్యములఁ బంపెను. ఈమూలమున వారిరువురకు వైరము పుట్టి, ఒకరి నొకరు చంపుకొనుదురు, వారు చనిపోయిన పారసీకదేశమును సాధించుటకుఁ దనకుఁ వీలుపడు నని అఫ్రాసియాబు తలంచెను.

తండ్రి గుఱుతుగ నిచ్చిన కడియమును ధరించి సైన్యముతో శత్రువుల దేశమునకుఁ బోయి, "ధవళదుర్గము"ను సోరాబు ముట్టడించెను.

ఆపాదమస్తకపర్యంతము కవచమును ధరించి శత్రుపక్షములోని వీరుఁ డొకఁడు వచ్చి, సోరాబుతో దిట్టముగఁ బోరాడెను. తుదకు సోరాబు వానిని జయించి పట్టుకొని, వానిశిరఃకవచమును తీసివేసి చూచెను ఆదుర్గాధ్యక్షుని కుమార్తె "గుర్దాఫరిద" ఆవిరుని వేషమును వేసికొని అతనితోఁ బోరాడెను. అతనిదిచూచి "ఓయి రాకుమారా, నీవు నన్ను విడిచిపెట్టిన గుర్గమును నీకు స్వాధీనముఁ జేసెద" అని ఆమె చెప్పి, అతనికి నమ్మకముఁ బుట్టించెను ఆమోహనాంగి రూపరేఖావిలాసములకుఁ బరవశుఁడై, ఆమెమాటలను మెత్తపడిన చిత్తము కలవాఁడై, తత్తరపడి ఆమె నతఁడు విడిచెను. ఆమెత్వరితగతిని దుర్గము లోనికిఁ బోయి, దుర్గమును దిట్టపఱచి, దానిబురుజులమీఁద నెక్కి "ఓయి రాకుమారా, రుస్తుము వచ్చుచున్నాఁడు. నీబీరములను మానుము. పోరాటములో నీపాటవమున నతఁడు పొడిచి నిన్ను చంపును" అనిసోరాబు వినుచుండ ఘోషించి, ఆమె లోపలికిఁ బోయెను.

ఇంతలో రుస్తుము సైన్యములతోఁ బోయి, సోరాబున కెదురుగ శిబిరములను వేయించి నిలిచెను. అంతకుపూర్వము సోరాబు ధవళదుర్గమును సాధించి దానిలోఁ బ్రవేశించి యుండెను. అప్పుడు రుస్తుము తురుష్కుని వేషమును ధరించి, శత్రువులలోగుట్టులఁ దెలిసికొనుటకై, దుర్గమునకుఁ బోయెను. హజారద్వారము వద్ద చీఁకటిలో నతఁడు నిలువఁబడి, లోపల జరుగుచుండిన కేళీవినోదములఁ జూచుచుండెను. హజారములో నొకయున్నతాసనముపైని సోరాబు కూర్చుండియుండెను. అతనిని పరివేష్టించి దండనాయకు లుచితాసనముల నలంకరించిరి గాయకులు గానముఁ జేయుచుండ, వారు ద్రాక్షరసము సానందముతో నాస్వాదించుచుండిరి. రసములోనికి వెళ్ళ, సరసము బయటకు వచ్చెను. ద్వారమువద్ద చీఁకటిలో నిలుచుండిన మహోన్నతవిగ్రహమును దూరమునుండి చూచి, సోరాబుయొక్క మేనమామ విందులోనుండి లేచి వచ్చి "ఇచటనిలిచియున్న మీరెవరు?" అని రుస్తుము నుద్దేశించి పలికెను అందు కతఁడు ప్రత్యుత్తర మియ్యక, వాని నొక ప్రేటున నేలఁ గూల్చి, తనశిబిరముఁ జేరెను. వాని మరణమునకు సోరాబును సైనికులును దుఃఖించి, మఱుచటిదినమున యుద్ధమునకు సన్నద్ధులై వ్యూహముఁ బన్ని నడచిరి. శత్రుసైన్యములు రెండును హోరాహోరీగను పోరాడెను, పారసీక సైన్యములు వీరిధాటికి నిలువలేక పికాపికలై చెదరిపోయెను అప్పుడు పారసీకరాజు "కైకసుఁడు" రుస్తుమును పిలిచి, "నీవుపోయి వారిలో నొకవీరునితోఁ బోరాడినఁగాని మనకు జయముకలుగదు. నీవువెళ్లు" మని చెప్పి, రుస్తుమునుపంపెను. పారసీకుల జెండాను పట్టుకొని సైనికులు నడుచుచుండ, రుస్తుము తనశ్వేతాశ్వము నెక్కి యుద్ధమునకుఁగదిలెను. అప్పు డతఁడు వచ్చి, సోరాబును ఎగదిగఁజూచెను, వాఁడుకూడ నతనిని దేఱఁబాఱి చూచి, అతనిమహోన్నతవిగ్రహమునకు ను అతని ధవళమగుశిరోజములకు నబ్బురపడి, "ఓయి, నీమనస్సాక్షిగ సత్యమును చెప్పుము—నీపేరు రుస్తుముకాదా' అని వాఁ డతనినిఁ బ్రశ్నచేసెను. తాను రుస్తుము అని వానితోఁ జెప్పిన, వాఁడు తనతో యుద్ధము మాని, వాఁడుస్వదేశమునకుఁ బోయి ప్రగల్భములఁ బలుకు

నని యెంచి, "ఓయి, వీరుఁడా, నాపేరు రస్తము అయిన నేమి కాకపోయిన నేమి? నీవు నాతోఁ బోరాడుము"ని తర్జించి, వానితో నతఁడు కలహించెను. అశ్వారూఢులై, ఖడ్గములనుధరించి, తండ్రికుమారు లిరువురును వెనుక దీయక రెండుమదగజములవలెఁ దార్కొనిరి. సొరాబుకాలములోనివాఁడు; రస్తము కాలము మించినవాఁడు గనుక, వానిపోటులకు సొమ్మసిల్లి, అశ్వముమీఁద నుండి నేలఁగూలెను. "కన్నెఱుఁగింపక పోయినను, కడుపెఱుఁగింతును." అతనితోఁ బోట్లాడుచుండినను, వానిమనస్సు కారిన్యమును సహింపక మెత్తపడుచుండెను. అతఁడు నేలఁగూలిన తక్షణము వాఁడు వచ్చి, "ఓయివీరాగ్రగణ్యా, ఇఁకనైన నీపేరు చెప్పుము" అని అతనిని వేఁడెను. నేలఁగూలిన రస్తము లేచి, కోపముచేత శరీరము కంపింప, అశ్వము నధిష్ఠించి, సొరాబును యుద్ధమునకుఁ బిలిచెను. తండ్రికుమారు లిరువురు కలహమునకు మఱల సిద్ధపడిరి. వారశ్వముల నెక్కి యెదురు నడచిరి. ప్రతికూలవాయువులు వీచెను; భూమి కంపించెను; నక్షత్రములు తెగిపడెను; సూర్యమండలము వెలవెలఁ బోయెను, అతని శ్వేతాశ్వము "రక్ష' కన్నీరు విడిచెను—బల్లెమును సూటిగ నుంచి, "రస్తము, రస్తము" అని కేక వేయుచు తనతురగమును పరుగెత్తించి అతఁడు వచ్చెను. "రస్తము, రస్తము" అను కేకను విని కుమారుఁడు దాల్కత్తులను జాఱవిడిచి నిరాయుధుఁడై అశ్వముమీఁద నుండెను. అప్పుడు గుఱ్ఱము పరుగెత్తి వచ్చినందున, నతని బల్లెము కుమారుని దేహములోఁ గ్రుచ్చుకొనిపోయెను. తక్షణము సొరాబు నేలఁగూలి ఆమోహనాంగివచనము ప్రకారము నున్న నా తండ్రి చంపెనని పలికి మూర్ఛిల్లెను. మూర్ఛదేరి కంఠగతప్రాణుఁడై యుండిన కుమారునిఁ జూచి రస్తమునకు కుమారులు లేరు; నీవెవని కుమారుఁడవు? అని రస్తము వాని నడిగెను. అప్పుడు సొరాబు "నేను రస్తము కుమారుఁడను. నా తండ్రి నాతల్లి కిచ్చిన యీకడియమే ఆనవాలు" అని చెప్పి, కడియము నిచ్చి తనప్రాణములను విడిచెను. సూర్యుఁ డస్తమించెను. ఇటు లుభయసైన్యముల మధ్యఁ బడియుండిన వీరకుమారరత్నముఁ జూచి రస్తము ఏడ్వసాగెను. అప్పుడు

వారు వచ్చి అతనికి దుఃఖోపశమనముఁ జేసిరి. అతని సెలవు ప్రకారము టార్తరి దేశసైన్యములు పారసీకుల పోటులేక స్వదేశమునకుఁ బోయిరి.

కైకసునికుమారుఁడు "కాంబేశీశుఁడు"—రస్తము చేత నితఁడు శిక్షితుఁడై అస్త్రవిద్యలో నారితేరెను. టార్తరి దేశపురాజు, అఫ్రాసియాబు, పారసీకము పైకి దండెత్తి వచ్చినపుడు, అతని మీదికి రస్తముతో నితనిని తండ్రి పంపెను.

అపుడు గురుశిష్యు లిరువురు టార్తరిసైన్యములఁ బాఱదోలి, 'బాబు' అను వారి ముఖ్యపట్టణమును ముట్టడించిరి. అంతట అఫ్రాసియాబు వారితోఁ సంధిఁ జేసికొనుటకు వచ్చి, ముందుకు వారితో యుద్ధముఁ జేయ ననిచెప్పి, నూర్వురు సామంతులను జామీనుగ నిచ్చెను. అందుకు కైకసుఁడు కోపగించి, వారిరువురిని రప్పించి, 'టార్తరి' దేశమును సాధించి, దానిరాజు, అఫ్రాసియాబును చంపు మని మిమ్ములను పంపితిని గాని, వారితోసంధిఁ జేసికొనుటకు మిమ్ములను పంపలేదని చెప్పి వారిని తర్జించెను. అనంతరము మఱియొకసేనానాయకునితో సైన్యముల నాదేశముపైకిఁ బంపి, కైకసుఁడు తనకుమారునిఁ బిలిచి 'జామీను క్రింద వచ్చిన నూర్గురు సామంతులను నాకప్పగింపుము. వారి శిరస్సులను ఛేదించెద'' నని అతనితోఁ జెప్పెను. కాంబేశీశుఁ డామాటను విని 'ఓతండ్రీ, వారు నిరాయుధులు, నిరపరాధులు. వారిని మనము చంపకూడ'దని చెప్పి తండ్రిని వారించినను, అతఁడు వినక వారినిఁ జంపించెను. ఈదౌర్జన్యమునకు కాంబేశీశుఁడు, రోసి, స్వదేశమును విడిచి, టార్తరి దేశమునకుఁ బోయెను. వచ్చిన రాజకుమారుని అఫ్రాసియాబు గారవించి, 'నేటినుండి మనము పరమమిత్రులమై యుందుము గాక'' అని అతనితోఁ బలికి జగన్మోహినియైన తనకుమార్తె 'మందన'ను అతనికిచ్చి వివాహముఁ జేసెను. ఇంతియ కాదు. ఒకపరగణాకు కాంబేశీశుని అధికారిగ నతఁడు నియోగించెను. కాంబేశీశుఁడు మందనతోఁ గూడి కేళివినోదములలోఁ దేలుచు దేశమును పరిపాలింలించుచుండెను. అతని భోగభాగ్యములఁ జూచి, కొంద ఱసూయపడి, అఫ్రాసియాబువద్దకుఁ జని 'ఓరాజా, నీఅల్లుఁడు కపటి; నిన్ను మోగపుచ్చ దలఁచి

యుండెను. సమయము జూచి, పారసీకసైన్యములఁ దెచ్చి నిన్ను వధింపఁగలఁ డని ఆతనితోఁ బలికి, అతనికిఁ బురుల నెక్కించిరి. యుక్తాయుక్తవిచక్షణ లేని రాజు గనుక, త్వరితముగ సైన్యముతోఁ బోయి, నగరములోఁ బ్రవేశించి, మాఱు మాటలాడక సద్గోష్ఠియైన కాంబేశుని చంపెను. అనంతరము వానికి 'ఫరంగీసు' గర్భమున నొకదౌహిత్రుఁడు పుట్టెను. ఆశిశువునకు 'కైఖుస్రు' అనియు 'కైరసు' అనియు రెండునామములు కలవు. మాతామహుఁడు శిశువును వధింప నిశ్చయము చేసె, నొకపశుపాలకుఁడా శిశువును రహస్యముగ దాఁచి, వానిపుట్టుపూర్వోత్తరముల నెవరికిఁ జెప్పక, వానిని బెంచుచుండెను.

కుమారుని మరణమును విని కైకసుఁడు దుఃఖించి గొప్పసైన్యమును రప్పించి వారియొద్దకు దండుతో వెడలి, టూరానుదేశములోఁ బ్రవేశించిరి. వారి రాకను విని ఆఫ్రాసియాబు దేశమును విడిచిపోయెను. కైకసుఁడు తనపౌత్రుని సంగతిఁ దెలిసికొనుటకు దేశమంతటను చాటింపించెను. అప్పు డాపశుపాలకుఁ డాబాలుని దోడ్కొనివచ్చి, పితామహునియొద్ద నిలువఁబెట్టెను. మృతినొందిన తనకుమారుని రూపరేఖావిలాసములను పౌత్రునిలోఁ గాంచి కనిపెట్టి, ఆబాలుని చేరఁదీసి, చెక్కిలినొక్కి, వానిశిరము నాఘ్రాణించి, వాని నెత్తికొని తనతొడపై వానిని కూర్చుండబెట్టుకొనెను. ఆఫ్రాసియాబు టూరానుదేశమును సాధించుటకుఁ బెక్కుప్రయత్నములఁ జేసెను, కాని, కైరసు సైన్యముతోఁ బోయి, మాతామహుఁ డగు ఆఫ్రాసియాబును పట్టుకొని, తనచేతులతో వానిని వధించెను. కైకసుఁడు స్వర్గస్థుఁ డయ్యెను. పితామహునియొక్కయు మాతామహునియొక్కయు రాజ్యములకు కైరసు నిరంకుశప్రభు వయ్యెను. కైకసుని మరణముతోఁ బురాణకథలు ముగిసెను, కైరసురాజ్యమును దప్పినది మొదలు చరిత్రాంశము లారంభమగును.

ఇరువదియైదవ అధ్యాయము.

పారసీకరాజ్యముయొక్క పోటుపాటులు.

క్రీ. పూ. సం. 553-333 రములు.

పారసీకరాజ్యముయొక్క పోటుపాటులు రెండువందలసంవత్సరములలో జరిగినట్లు తెలియుచున్నది, అందులో మొదటియేఁబదిసంవత్సరములలో నారాజ్యము మహోచ్ఛపదవికి వచ్చెను. 'పార్శులు లేక పారసీకుల' నాయకుఁడైన 'కైరసు, ఈలాము' దేశములో 'అన్షాను' పరగణాకు రాజుగనుండెను. అతని ప్రారంభదశలో 'పార్శులు, మీడియా' రాజ్యమునకు స్వాధీనులై యుండిరి. రాజు 'క్షైయార్క్సరీశుఁడు' పరిపాలించుచున్నపుడు, మీడియారాజ్యము పరమోచ్ఛస్థితిలో నుండెను, ఈరాజు 'ఎక్బటానా' పట్టణమును, దుర్గములతోను, ప్రాకారపుగోడలతోను కందకములతోను దిట్టపఱచి, దానిని రాజధానిగఁ జేసెను. ఇతనికాలములో మందులును మీడులు నేకీభవించి 'నినవేపట్టణము'ను నాశనముఁ జేసి అసీరియారాజ్యమును తిఱుగఁ ద్రోసిరి. అసీరియారాజ్యముయొక్క ఉత్తరభాగమును 'క్షైయార్క్సరీశుఁడు' తనరాజ్యములోఁ గలిపెను; అంతకంత కతఁడు బలిసి, క్రీసను అనురాజు పాలించుచున్న 'లిడియా' రాజ్యముపైకి దండుతో వెడలెను. అప్పుడుభయసైన్యములు పోరాడుచుండ, సూర్యగ్రహణము పట్టెను, ఆగ్రహణ మపశకునమని తలఁచి, క్షైయార్క్సరీశుఁడు క్రీసనుతో సంధిఁ జేసికొని, స్వదేశమునకుఁ బోయెను.

క్షైయార్క్సరీశుఁడు చనిపోయిన తరువాత 'అస్త్యేయజీశుఁడు' మీడుల రాజ్యము నేలెను; మందులను మీడుల నతఁడు సంఘీకరణముఁ జేసెను. అతఁడును కైరసును, ఒకరి నొక రెదురుకొనిరి. కైరసు 'ఈలాము' దేశములో నొకరాజుగ నుండెనని తెలియును. ఎనుబదిసంవత్సరముల క్రిందట 'పార్శ్వ' జాతివారు 'ఈలాం' దేశమును సాధించియుండిరి.

పురాణకథలలోఁ జెప్పఁబడియున్న యుద్ధమిదియై యుండును. కైరను 'ఆస్త్యేయజీకు'ని సభాస్థానములో మెలఁగుచుండెను; అచ్చట, 'హార్పేగసుఁడు' అను వాఁడొకఁడు కైరసుతో స్నేహముఁ జేసెను; వీరిరువురు కలిసి సామంతులలో ముఖ్యులగు కొందఱిని దమపక్షములోనికిఁ దీసికొనిరి ఈ ప్రకారము కైరసు దిట్టపడి, ఆస్త్యేయజీకుని రాజ్యపదమునుండి తప్పించి, దేశమునకు రాజయ్యెను హార్పేగసుఁ డతనికిఁ గుడిభుజమువలె నుండి సహాయముఁ జేయుచుండెను. నేటినుండి, మీడులును, పారసీకులును, కైరసును తమరాజుగ భావించుచుండిరి.

దక్షిణమున:—అరేబియా అసీరియా దేశములలోని కొంతభాగము.

ఉత్తరమున:—కాస్పియనుసముద్రము.

పశ్చిమమున:—లిడియా దేశము.

తూర్పున:—'హిందూకుషు' పర్వతములు. అతఁడు రాజ్యమునకువచ్చునప్పటికి, ఈసరిహద్దుల మధ్యమున నున్న దేశ మంతయు స్వాధీనమై యుండెను. మఱి యేఁబదిసంవత్సరములనాటికి ఆరాజ్యము బలిసెను.

దక్షిణమున:— ఈజిప్టుదేశమునకుపరిభాగము

ఉత్తరమున:—రష్యాదేశము పొలిమేరలవఱకు.

పశ్చిమమున:—ఈజియను సముద్రము.

తూర్పున:— సింధునదివఱకును.

కైరసుయొక్క ప్రభుత్వ మంతయు దిగ్విజయముక్రింద నుపయోగమయ్యెను. గ్రీకులు కొందఱు స్వదేశమును విడిచి, సారవంతమైన 'ఈజియను' సముద్రప్రాంతమున నచ్చటచ్చటఁ గొన్నినివేశముల నిర్మించుకొని కాపురముండిరి, ఇవి నానాటికిఁ బట్టణములై, మాతృదేశముతో రాకపోకలు/ కలిగి వర్తకముచేత నభివృద్ధి యయ్యెను.

ఈనూతనవసతులవారు భాగ్యవంతు లని తెలిసి, 'లిడియా' దేశపురాజు వారిని స్వాధీనముఁ జేసికొనెను. పారసీకరాజ్యమునకుఁ బశ్చిమమున 'లిడియా'

రాజ్య ముండెను. లిడియారాజ్యము యొక్క సంపదఁ జూచి, పారసీక రాజు కైరసు దానిని సాధించుట కుబ్విళ్లూరుచుండి, సమయముఁ జూచి, దానిపైకిఁ దాడి వెడలెను. ధనముకలవాని గర్వపడి, క్రీససు వెనుకఁ దీయక, నతని కెదురు నడిచెను. 'తింబ్రా' వద్ద జరిగిన యుద్ధములో క్రీససు ఓడిపోయెను; అతని పట్టణమును పారసీకులు నేలఁ గలిపిరి. అతఁడు శత్రువులకుఁ బట్టుపడి, వారి దేశములో నిరాయుధుఁడై జీవించెను.

అనంతరము, క్రీ పూ. సం॥ 538 రములో, 'అసీరియా బాబిలను' రాజ్యములకు రాజధానియైన 'బాబిలను' పట్టణమును ముట్టడించి, దానినతఁడు ధ్వంసముఁ జేసిన సంగతి నిదివఱకు వినియున్నారము.

అటుపిమ్మట, రాజ్యమున కీశాన్యమూలనున్న వనవాసుల నెదిరించి, వారితో నతఁడు పోరాడుచుండెను, ఈ పోరాటములో నతఁ డోడిపోయి, గాయము తగిలినందున చనిపోయెను "పసార్గాడు" పట్టణములోని రాజనగరులోఁ బాలశిలతోఁ గట్టబడిన నతనిగోరీ నేటివఱకుఁ జూడ నగును.

కాంబేశీసుఁడు:—అనంతర మతనికుమారుఁడు కాంబేశీసుఁడు సింహాసనము నెక్కెను. అతఁడు దురాచారుఁడు; దుష్టచిత్తుఁడు; అయినను తండ్రివలె, మహాబలపరాక్రమశాలి మొదట నతఁడు 'ఫోనిషియా' దేశమును 'కైప్రసు' దీవిని స్వాధీనముఁ జేసికొని, ఈజిప్టుదేశమును సాధించుటకు దాడి వెడలెను ఆదేశము నతఁ డేవిధమున సాధించి, ఆదేశీయుల నీతుల నిరోధించి, వారిమతమును పరిహసించెనో, మన మిదివఱకు వినియుంటిమి తనదేశములోని దేవతలే గొప్పవారని తెలుపుటకుఁ జేయుటకై, 'అమను' దేవతాలయమును నాశనముఁ జేయుట కతఁ డేబదివేలసైనికులను పంపించెను: వారా దేవతాలయమును సమీపించుటకు, ఒకయెడారిగుండ వారు పోవలసియుండెను. ఇన్నివేల సైనికులా యెడారిలో నశించిరి.

అతఁడు 'కార్తేజి' పట్టణము నైన సాధింప లేక పోయెను. చేయలేనిపనులఁ జేయుట కతఁడు సమకట్టి పరాభవము నొందుటఁ జూచి, అతని

పేరుఁ జెప్పిన, పారసీకు లసహ్యపడుచుండిరి. "శిరియా" దేశమున కతఁడు వచ్చుచుండ, తనసింహాసనము నొకసామంతుఁ డధిష్ఠించి తనపేరుఁ బెట్టుకొని రాజ్యము నేలుచుండె నని వినెను. తన దుష్ప్రవర్తనచేతఁ దనసైనికులకుఁ దన యందనురాగము లేనందున, నాసామంతునిఁ బరిభవించుటకు శక్యము కాదని తెలిసి, సూరకత్తితో నతఁడు పొడుచుకొని చచ్చెను.

డారియసు — డారియసు రాజకుటుంబములోనివాఁడు సామంతులందఱేకగ్రీవముగ నతనిని ప్రార్థించినందున, నతఁడు సింహాసనము నెక్కెను. నలువైపుల దేశములో నల్లకల్లోలములు లేచెను. కాంబిసేశుఁడు జయించిన దేశములన్నియు తిరుగఁబడెను. క్రమముగ వానిని సాధించి, అతఁడు వశముఁ జేసికొనెను. వినిమూలమున నతనికిఁ గొంచెము రాజ్యానుభవము కలిగినందున, నతఁడు రాజ్యములో వ్యత్యస్తములు ముందుకు కలుగకుండ, కట్టుదిట్టముల నేర్పఱచెను, అందుచేత నతనికిఁ బారసీకరాజ్యసంస్థాపకుఁ డనిబిరుదు వచ్చెను. రాజ్యము నంతయు చిన్న క్షేత్రముల క్రిందఁ విభజించి, వానిని బరిపాలించుటకు క్షేత్రపతుల నతఁడు నియోగించెను. వారి నెలవులలో వారు మెలకువతో వ్యవహరించి, సంవత్సరమున కొకపర్యాయము రాజునకుఁ గప్పముఁ గట్టుచుండిరి. పూర్వమువలెఁ బ్రజలను పీడించి, ధనము నతఁడు స్వీకరించుట లేదు. రాజు కోరినపు డెల్ల, ధనమును పట్టుకొని సైన్యములతో క్షేత్రపతులు వచ్చి రాజునకు సహాయముఁ జేయుచుండిరి. ఆనాఁడు రాజ్యములో నొకభాగము నుండి మఱియొకభాగమునకుఁ బోవుటకు రాదారిమార్గములు కట్టఁబడెను. మార్గముల కిరువైపుల వృక్షము లుండెను, వానిలో నచ్చటచ్చట సత్రములు కలవు. "డారికు" అను పేరున బంగారునాణెముల నతఁడు ముద్రింపించి వాడుకలోనికిఁ దెచ్చెను. అంతఃకలహములచేఁ గలవరపడుచుండిన రాజ్యమున కతఁడు స్వాస్థ్యముఁ దెచ్చి, విదేశములను జయించుటకు సమకట్టెను. తూర్పున సింధు నదీ తీరమువఱకు నతనిరాజ్యము వ్యాపించెను. పడవలవంతెనను కట్టించి, సైన్యములతో నతఁడు దానిమీఁద నుండి పోయి, తనరాజ్యమున కుత్తరమున నున్న "సిథియా" దేశము సాధింపవలె నని తలఁచెను; కాని, అది మెట్టదేశ

మాగుటచేత నతఁడు మరలివచ్చెను. అనంతరము, "ఈజియను" సముద్రయున కుత్తరతీరమున నుండు గ్రీకుల నూతనసీమలను సాధించెను, "మాసిడను" దేశపు రాజును సహిత మతఁడు వశపఱచుకొనెను. పూర్వపశ్చిమములకు మాసిడను దేశము మొదలు భరతఖండమువఱకును, దక్షిణోత్తరములకు "నైలు" నది తీరము మొదలురష్యాదేశమువఱకు నతనిరాజ్యము వ్యాపించెను.

అయోనియనుల అల్లరి:——అతఁడు "సిధియా" దేశముపైకి దండెత్తి వెళ్లినపుడు, పడవలనంతెనను కాపాడుచుండు మని గ్రీకుల నూతనసీమలవారితోఁ జెప్పెను. వారితుటూరికాఁడొకఁడు వారిని పడవలవంతెనను పగులఁగొట్టుఁడని ప్రోత్సహించెను, కాని వారు పారసీకరాజునకు నమ్రులై యుండిరి. పారసీకరాజుయొక్క ప్రాపక ముండుటచేత, నాతుటూరికాండ్ర ప్రభ నూతనసీమలలో వెలుగుచుండెను. "మిలేతసు" అను నూతనసీమలోని తుటూరికాఁడు గర్విష్ఠి యని తెలిసి, వానిని మంచిమాటలతో డారియసు తనపట్టణమునకుఁ దీసికొని పోయి, కారాగృహములో వాని నుంచెను. "మిలేతసు" లోని నూతనప్రభువు "అరిస్తగోరీశుఁడు" పశ్చిమరాజ్యములో నేలుచున్న పారసీకక్షేత్రపతితోఁ గలహించెను, అథెన్సు పట్టణమునుండి గ్రీకుసైనికులు వారిసహాయమునకు వచ్చిరి, వారుకలిసి, "సార్డిసు" అను పారసీకులపట్టణమును ముట్టడించి, దానిక్షేత్రపతిని దుర్గములోనికిఁ దఱిమి, వారాపట్టణమును కాల్చివేసిరి.

ఈనూతనసీమలవారి సాహసకృత్యమును విని, డారియసు మండి పడెను. "అథీనియనులా! ఎవరు వీరు?" అని అతఁడు ప్రశ్న వేసెను. అంతరిక్షము మీఁది కొక బాణమును ప్రయోగించి, "ఓ దేవతలారా, నామనవి వినుఁడు అథీనియనులను సాధించునట్లు, నాకు శక్తిని దయచేయుఁడు" డని అతఁడు వారినిఁ బ్రార్థించెను. ప్రతిదినము ముమ్మారు భోజనకాలమున నొక సేవకుఁడు వచ్చి, "ఏలినవారు అథీనియనులను జ్ఞప్తిలో నుంచుకొనుఁడు" డని అతనితోఁ జెప్పుచుండును.

మఱి యేఁబది సంవత్సరముల నాటికి, నూతనసీమల వారి నతఁడు సాధించి, పురుషుల శిరస్సులను ఛేదించి, బాలులను బానిసలుగ నమ్మివేసెను. భోగభాగ్యములతోఁ గూడి అభివృద్ధి నొందుచున్న నూతనసీమలవారతని ధాటికి నిలువ లేక జాతి మాయమై పోయిరి.

గ్రీసుదేశముపై దండయాత్ర:—క్రీ. పూ. సం 490 రము అథీనియనులును స్పార్టనులును తనకు భృత్యులై కప్పములను కట్టుట కిష్టపడెదరో లేదో తెలిసికొనివచ్చుటకు రాయబారుల నతఁడు వారిసద్దకుఁ బంపెను. వారా రాయబారులను నూతులలోఁ బడఁద్రోసిరి. అంగుల కతఁ డాగ్రహించి, "దాతీశుఁడు" అను దండనాయకునితోఁ బారసీక సైన్యముల నాదేశముపైకిఁ బంపెను, వారచ్చటకుఁ బోయి, "మరాథాను" భూములమీఁద శిబిరములను వేసికొని నిలిచిరి పారసీకుల నడవడికలను అథీనియనులు కనిపెట్టుచుండిరి. వీరికి వెనుకను సముద్రము, ఎడమప్రక్కను చిత్తడినేల, కుడిప్రక్కను నది; ఇట్టి దుస్థితిలో నుండినను, అథీనియనులు వ్యూహముఁ బన్ని శత్రువులకెదురు నడచిరి. అథీనియనుల పోటుకు వారు నిలువలేక పికపికలై ప్రాణములను రక్షించుకొని పారిపోయిరి. పరాభవము నొంది స్వదేశమునకు వచ్చిన హతశేషులను చూచి డారయసు మండిపడెను. అనంతర మతఁడు మఱియొక సైన్యమును గూర్చి స్వయముగ దండెత్తుటకు సిద్ధపడినంతలో నతనికిఁ గాలము వచ్చి స్వర్గస్థుఁ డయ్యెను.

జరజేశుఁడు క్రీ. పూ. సం. 486 రము:—

దారయసునకు జరజేశుఁడు ఔరసపుత్రుఁడు కాకపోయినను, సింహాసనము నెక్కెను—అతఁడు చలచిత్తుఁడు, డాంబికుఁడు నవమోహనాంగుఁడ నని అతనికిఁ గర్వము గ్రీసుదేశముపైకి దండువెడలుట కతనికిష్టము లేకపోయినను, సైన్యములు సిద్ధముగ నుండినందున, దండనాయకు లతనినిఁ బ్రోత్సహించినందున, నతఁడు సమ్మతించెను. దండనాయకు లుద్దండంబుగ కోదండంబులను చాచి, సైనికులతో నడచిరి; 'దశసహస్రఅమర్త్య'లను

పేరుగల ఆత్మరక్షకులు వెంటనంటి యుండ, ఆరాజు వెడలెను 'హాలేసు పంథానము' మీదఁ గట్టబడిన పడవల వంతెనమీఁది గుండ నాసైన్యములు నడిచి, గ్రీసు దేశమున కుత్తరమున నుండు పర్వతశ్రేణులను దాఁటి, 'తెర్మాపల్లి' అను పర్వతకనుమునొద్దకు వచ్చిరి. ఆకనుమ ముఖద్వారమును కాపాడుచు 'లియోనిడాసుఁ' డను వీరనాయకుఁడు మూఁడువందలు స్పార్టసైనికులతో నిలిచి యుండెను. వేనవేలు పారసీకులను వీరు బిఱ్ఱు వెనుదీయక, వారితోఁ బోరుచుండిరి ఇంతలో వీరిలో నొకతుంటరి పారసీకుల వద్దకుఁ బోయి, మఱియొక మార్గమున వారిని పర్వతముమీఁదు నుండి నడిపించుకొని వచ్చెను ఆవచ్చిన వారు స్పార్టనులను వెనుకనుండి పొడిచిరి. ఇట్టుల ముందువెనుకల శత్రువుల నెదిరించి స్పార్టనులు పోరాడిరి; కాని. శత్రువుల పోటుకు వారు నిలువలేక, అందఱును నేలఁ గూలిరి, గాని, ఒకఁడైనను శత్రువునకుఁ జిక్కలేదు. ఈస్పార్టను మహాయోధులను గ్రీసు దేశములో నేటికిని స్మరింపనివాఁడు లేఁడు. అనంతరము పారసీకసైన్యము లోకనుమగుండ నడచి గ్రీసుదేశములోఁ ప్రవేశించి, ఆథెన్సుపట్టణమును ముట్టడించెను. అథీనియనులు స్త్రీపురుష బాల వృద్ధులు పట్టణమును విడిచి పడవలలోనికిఁ బోయిరి. ఇట్టుల నిర్జనమైన పట్టణమును పారసీకులు కాల్చి తగులబెట్టిరి అనంతరము పారసీకులకును అథీనియనులకును 'సాలమీసు' రేవులో నావ యుద్ధము జరిగెను అథీనియనులకును సాలమీసు రేవులో నావయుద్ధము జరిగెను. అథీనియనుల నావలు చిన్నవి; చులకనివి; అందుచేత వారు వానిని త్వరితముగఁ గడిపిరి — పారసీకుల నావలు పెద్దవి; బరువుగలవి, వానినిగడుపుట కష్టము. ఈనావ యుద్ధములోఁ బారసీకు లోడిరి. ఈపరాభవముఁ జూచి జరజేశుఁడు స్వదేశాభిముఖుఁడై నడిచెను. అతనిమూలమున దేశమున కపఖ్యాతి వచ్చెనని ప్రజ లతనిని నిందించిరి క్రీ. పూ. సం॥ 465 రములో, నొకనాటిరాత్రి అతఁడు నిద్రించియుండ, దుర్మార్గులు కొందఱు అంతఃపురములోఁ బ్రవేశించి అతనిని వధించిరి.

అతనికుమారుఁడు 'ఆర్తజరజేశుఁడు' పట్టభద్రుఁ డయ్యెను. అతఁడు దుర్బలుఁడు; అవివేకి రాజలక్షణములు లేనివాఁడు. అతఁడు కళావిహీనుఁడు. అతనికాలములోఁ బారసీకులు అథీనియనులతో సంధిఁ జేసికొని, తత్కాల

మిత్రు లయిరి. ఈజిప్టుదేశములో నల్లరులు పుట్టినందున, వాని నణచుటకు, అథీనియనులు పారసీకులకు సహాయపడిరి.

దారియసు-నోతేశుఁడు:—తదుపరి నోతేశుఁడుమూర్ధాభిషిక్తు డయ్యెను. అతని పట్టపుదేవి 'పారేశతీసి' ఆమె రూపలావణ్యముతో రతీదేవిని దిరస్కరించెను. ఆమెకు ధైర్యస్థైర్యములు గలవు. రాజ్యసూత్రములను వహించి, రాజకార్యముల నామె పట్టుదలతో వ్యవహరించెను. అథీనియనులకును స్పార్టనులకును జగడము వచ్చెను, వరిలో స్పార్టనులు పారసీకముతో నేస్తముఁ గట్టిరి. పారసీకములో గ్రీకుల ప్రభవెలిగెను

ఆసియాఖండములోఁ బశ్చిమతీరమున నుండిన గ్రీకుల నూతనసీమల లోని వారిలో భేదమును పుట్టించి, ఆమె వారిని స్వాధీనముఁ జేసికొనెను. ఇంతలో "ఈజిప్టు"దేశము తిరుగఁబడి స్వతంత్రరాజ్య మయ్యెను. ఆదేశము స్వతంత్రించుటవలన పారసీకరాజ్యమునకు గొప్పదెబ్బతగిలెను.

ద్వితీయ అర్తజరజేశుఁడు—కైరసు:—వీరిరువురు "నోతేశు"ని కుమారులు, అర్తజరజేశుఁడు జ్యేష్ఠుఁడు; కైరసు "పారేశతీశి"యొక్క కుమారుఁడు. అర్తజరజేశుఁడు పట్టాభిషిక్తుఁడగుటకు సిద్ధముగ నుండిన సమయమున కైరసు అతనిని జంపుటకుఁ గుట్రను పన్నెను. ఆసంగతి జ్యేష్ఠునకుఁ దెలియదు. సామంతులతో నతఁడు దేవాలయములోనికిఁ బోయి, అభిషిక్తుఁడై వచ్చుచుండ నతనిని కైరసు ఎదిరించెను. అతని ఆత్మరక్షకులు వానినిఁ బట్టుకొని చంపఁదలఁచిరి గాని, వానితల్లి అడ్డుపడినందున, నతఁడు వానిని క్షమించెను. అనంతరము కైరసు స్వరాజ్యమునకుఁ బోయి, తల్లి ప్రోత్సహించినందున, గ్రీకులసైన్యములఁ దోడ్కొని, బాహాటముగ జ్యేష్ఠునిమీఁదికి దండెత్తి వచ్చెను.

ఆసంగతిని విని, అర్తజరజేశుఁడు యుద్ధసన్నద్ధుఁడై వెడలి వచ్చెను. ఉభయసైన్యములు "కునాక్సా"వద్ద తారొకనెను. వ్యూహముఁ బన్ని కైరసు సైన్యములను సిద్ధముఁజేయక, జ్యేష్ఠునిఁ జంపుటకు ఒంటరిగ శత్రుసైన్యము

లోఁ బ్రవేశించెను. శత్రువులను దాఁటి, అన్నగారిసమీపమున కతఁడు వచ్చెను; కాని, అతనిని వారు పట్టుకొని చంపిరి.

క్సైరసుయొక్క సేనానాయకులు అర్తజరక్షేసుని శరణుఁ జొచ్చిరి. ఇఁక క్సైరసు సేనతో వచ్చిన గ్రీకులు పడిన పాటులు చెప్పలేము. పారసీకుల సేనాధిపతి గ్రీకుల దండనాయకులను స్వశిబిరములోనికి రప్పించి వారినిఁ గడ తేర్చెను. పదివేలగ్రీకులనాథులయిరి; వారు విదేశములో నుండిరి; విదేశీయులు వారికి శత్రువులు, స్వదేశమునకుఁ బోవుమార్గము కానరాదు, విదేశములో రాదారిమార్గములు లేవు. ఎన్నిశ్రమలు పడినను, వారిపౌరుషము మాత్రము బిగువుగ నుండెను. "మరాథాను" యుద్ధములోను "తెర్మాపల్లీ" యుద్ధములోను జయించిన గ్రీకులసంతతివారు కనుక, వారు దానిని సాధించి, ఆఱుమాసములనాటికి సముద్రతీరమునకు వచ్చి చేరిరి అప్పుడు వారినాయకుఁడు "క్సనఫను" ఏనాఁడు కనిష్ఠభ్రాత, క్సైరసు, చనిపోయెనో, ఆనాఁటినుండి రాజ్యమునకుఁ బాటుకాలము వచ్చెను .

తృతీయ-అర్తజరక్షేసుఁడు :—అనంతరమితఁడు రాజ్యమునకు వచ్చెను. ఇతఁడు దుర్మార్గుఁడు, కఠినచిత్తుఁడు, అయినను, సాహసము కలవాఁడు; కార్యములను పట్టుదలతో వ్యవహరించును. ఇతని సేనాధిపతి "మంతరు". వానికి సేనాధిపతి లక్షణములుపట్టెను వారిరువురు కలిసి ఈజిప్టుదేశమును సాధించిరి, చాలాకాలము ముట్టడించి, శ్రమపడి "సైడాను" పట్టణమును పట్టుకొనిరి. మాసిడను దేశపురాజు గ్రీకులపైకి దండెత్తినపుడు, వారికి ధనమును పంపి, సైన్యములను సహాయ మిచ్చెను అయినప్పటికి మాసిడను రాజు గ్రీకులను క్రీ. పూ. సం. 338 రములో నోడించి, వారిదేశమును వశముఁ జేసికొనెను. తృతీయ అర్తజరక్షేసుఁడు వీరుఁడైనను, ప్రజలకతనియం దనురాగము లేకపోయెను. ఏసంవత్సరము మాసిడను రాజు "ఫిలిప్పు" దిగ్విజయము నొందెనో, ఆసంవత్సర మతనికి విషముఁ బెట్టి, దుర్మార్గు లతనిని జంపిరి.

దారేయసు—కోడోమనసు:—అనంతర మితఁడు కొంచెము ములో సింహాసనము నెక్కెను. ఇతఁడు చక్కనివాఁడు; ఉత్తరకుమారునివలెఁ

బ్రజ్ఞలను జూపుచుండెను. "ఫిలిప్పు" చనిపోయినందున, నతనికుమారుఁడు "మహాఅల్గ్జాండరు" మాసిడను రాజ్యము నధిష్ఠించి, ఆశియాఖండములోని రాజ్యములను జయించి, పారసీకరాజ్యములోనికి వచ్చెను.

"గ్రానికసు" నదీతీరమున మాసిడను సైనికులును పారసీకసైనికులు నొకరి నొకరు మార్కొనిరి. అల్గ్జాండరు నేర్పరిగనుక, శత్రుసైన్యముల నోడించెను, "సార్డిసు" పట్టణము స్వాధీన మయ్యెను. ఇంతలోఁ బారసీక సేనాధిపతి "మెమ్నను" అనువీరుఁడు దండుతో వెడలి మాసిడను దేశముపైకిఁ బోవుటకు సిద్ధపడెను; ఈవిధమున, పారసీకమును రక్షింపవలెనని తలఁచెను; కాని, ఇంతలో నతనికి మృత్యువాసన్నమై పరలోకమునకుఁ గొనిపోయెను. అతనిమరణమువలన పారసీకరాజ్య మస్తమించెను.

అనంతరము "ఇస్సస్సు" వద్ద మఱియొకయుద్ధము జరిగెను, అందులో బారసీకు లోడిరి. డారేయసు కొండలఁ బట్టెను, అతని సైనికులు నూఱువేలు కాందిశీకు లయిరి

డారేయసుయొక్క రథమును, ధనుర్బాణములును, దారికత్తులును చీనిచీనాంబరములును శత్రువునకుఁ జిక్కెను, అతని భార్యయు, తల్లియు, కుమార్తెయు, పసిబిడ్డఁడగు కుమారుఁడును శత్రువుచేతిలోఁ బడిరి. డారేయసు బాబిలను పట్టణమునకువచ్చి తనకుమార్తెను అల్గ్జాండరునకు వివాహములో నిచ్చెదనని, అతనికి వర్తమానముఁబంపెను. ఆమాటను విని, 'సర్వసంపదలతోఁ గూడిన నీరాజ్యము నాచేతిలోఁ జిక్కెను. నీకుమార్తె నాయధీనములోనున్నది; నాకు మనస్కరించిన, నేనామెను వివాహ మాడెదను. నీవు నాపాదాక్రాంతుఁడ వైన, నిన్ను రక్షించెద'నని అల్గ్జాండరు అతనికిఁ దెలియఁజేసెను.

ఆమాటలతో డారేయసు నిరాశుఁడై, దేశములో శేషించిన సైనికులఁ దోడ్కొని, 'ఆర్బెలా'వద్ద శత్రువులతోఁ బోరాడెను, కాని, అతనికి దుర్దశవచ్చెను. అతఁడుయుద్ధములో నోడిపాఱిపోయెను. పారసీక క్షేత్రపతియొకఁడతనిఁ బట్టి కత్తితోఁ బొడిచిచంపెను. పారసీకులరాజ్యలక్ష్మి అల్గ్జాండరునివరించెను. డారేయసునితోఁ బ్రాచీన పారసీకుల మహారాజ్య మస్తమించెను.

ప్రాచీనదేశచరిత్రలు

5-వ ప్రకరణము.



5
ఫొనీష్యియా
సిరియా
త్రిపోలీసు
సైడను
తైరు
కార్మెలుపర్వతము
అరేబియా

శ్రీరస్తు.

ఫొనీషియా దేశచరిత్ర.

పంచమప్రకరణము.

ఇరువదియాఱవ అధ్యాయము.

మధ్యధరాసముద్రమునకుఁ దూర్పునను ఉదయసముద్రమున కభిముఖముగ నున్న దేశమునకు రోమకులును గ్రీకులును 'ఫొనీషియా' యని నామమిడిరి. గ్రీకుభాషలో 'ఫొనీషియా' యనఁగా 'ఖర్జూరపుదేశ'మని యర్థము. మధ్యధరాసముద్రతీరమున దక్షిణమున నున్న 'గాజా' పట్టణము మొదలు ఉత్తరమున నున్న 'కాసియసు' పట్టణమువఱకుఁ గలఇసుక నేలలో ఖర్జూరవృక్షములు మెండుగ పుట్టి పెరుగుచు చూపఱుల నేత్రముల కానందమును గలుగఁజేయుచుండును. దేశయాత్రాభిలాషగలిగిన గ్రీకులు నౌకాయాత్రఁ జేయుచు, దైవికముగ వారీతీరమున లంగరు వేసి ఒడ్డుఁజేరి దేశమునలువైపులఁ జూచి, సంతసించి, ఈభాగమునకు 'ఖర్జూరదేశ'మనియు, 'ఖర్జూరము పండుదేశ'మనియు పేరిడిరి. 'ఆశియామైనరు'కును, 'ఈజిప్టున'కును మధ్యనున్న యావత్తు 'సిరియా' తీరప్రాంతమునకు ఫొనీషియా' యని వాడుక కలదు. ఈభాగములో నానాదేశీయులు నివసించుచుండిరి. వారేకకుటుంబములోనివారు కారు. వారుమూఁడు కుటుంబములవారు. వీరి రాజకీయవ్యాపారములు భిన్నములు. గ్రీకులీసంగతిని తెలిసికొని, ఉత్తరమున నున్న 'సిరియా' దేశమును, దక్షిణమున నున్న 'పాలస్టీను' (అనఁగా ఫిలిస్టినుల దేశము), ఈరెండుదేశములకు మధ్యస్థముగ సముద్రప్రాంతమున నున్న దేశమునకు, ఫొనీషియా యని నామ మిడిరి. దక్షిణోత్తరదేశములను మినహాయించినపైని, ఈదేశముయొక్క పొడవు 200 మైళ్లు మాత్రమె; ఇది మధ్యధరాసముద్రమునకుఁ దూర్పుతీరమున నున్నది.

ఈదేశమునకుఁ బొడుగునకుఁ దగినవెడల్పు లేదు. దీనికిని 'సిరియా' దేశమునకును మధ్యనున్న కొండలోయను కవాటమువలెనున్న పర్వతశ్రేణిని కలుపుకొనినను, ఈ 200 మైళ్లలోను వెడల్పు 35 మైళ్లకంటె మొత్తముమీఁద హెచ్చులేదు. దక్షిణ అమెరికాఖండములోని 'చిలీ' దేశమువలె, ఇదియు సన్నమై చీలికవలె నున్నది. ఒకవైపున అప్పతి, మఱియొకవైపున నగపతి; ఉభయుల మధ్య చిక్కువడిన దీదేశము. ఉత్తరమున విరివికలిగి, దక్షిణమునకు రానురాను 2-మైళ్లకు సన్నమైనది. దీనివైశాల్యము 4000చదరపుమైళ్లనుటయె యధికము.

ఏదేశమున కైనను కీర్తిప్రతిష్ఠలు వచ్చుట దాని వైశాల్యమువలన కాదు. ఇంతదేశమైన నేమి? అంతదేశమైన నేమి? ఎంతయైనను సరే! పూర్వకాలములో 'స్పార్టా' 'అథెన్సు' 'కార్తేజి' ఇవి చిన్నదేశములె, ఇటీవల 'జినోవా' 'వెనీసు' 'పైసా' 'ఫ్లారెన్సు'—ఇవియు చిన్నదేశములె అయిన నేమి? యావత్ప్రపంచము నేలుటకుఁ దగినత్రిశక్తుల నవికలిగియుండెను. ఇటీవల మనకాలమునకు రానురాను, ఇంగ్లాండు, హాలెండు పోర్చుగలు—ఇవి యేపాటిదేశములు? ఈదేశములు పిడికిలిలోనికి రావు. అయిన నీదేశీయులు మహాకార్యములఁ జేయలేదా? మహోచ్చపదవిఁ జెందలేదా? మహానీయమూర్తులని ఘనత వహింపలేదా! ఎంతదేశమైన నేమి! దేశీయుల బలిమివలననే దేశమునకు బలమును, ధనమును, ఘనతయు వచ్చును.

ఫోనీషియా చిన్నదేశమైన నేమి? దానిస్థితి ఉత్కృష్టమైనది. ఇరుగుపొరుగుదేశములతో వ్యవహారములలో నైననేమి రాజకీయవ్యాపారములలో నైననేమి సమదృష్టి మిత్రదృష్టియే కాని ఎస్త్రాష్టకము లేదు. దీనికిఁ దోడు భూమి సారమైనది; ఫలవంతమైనది. భూసారమె మనుజులకు సారము. ఆదేశము నాలుగుభాగములు; మొదటిభాగము సముద్రతీరప్రాంతము; ఇసుకనేల ఖర్జూరవృక్షములకుఁ దగినభూమి. ఇప్పటికిని బేరూటు' 'జాఫా' పట్టణముల వద్ద నీతోఁటలు గలవు. రెండవభాగము సారవంతమైన వరిక్షేత్రములతోను, నేత్రానందకరమైన ఫలవృక్షములతోను నిండినది. ఈభాగము 1 మైలు మొదలు 12 మైళ్లవెడల్పు గలిగి, ఎటుచూచినను కనుచూపు మేరవఱకు నుద్యానవనము

లతో నిండియుండెను. సేద్యగాఁడజాగ్రత్తగా భూమిని దున్నినను సరే; నిర్లక్ష్యముగా విత్తులఁ జల్లినను సరే, సారముగలవిగనుకనే క్షేత్రము లొసఁగిన పచ్చనివరివెన్నులతో నిండియుండెను, ఇట్టిక్షేత్రముల పొలిమేర నచ్చటచ్చట పట్టణములును పల్లెలును కలవు తోటలలో పసుపు ఎఱుపు కలిసిన రంగుగల దాడిమీఫలములు గలచెట్లును, నారింజవృక్షములును వాని పచ్చని ఆకులమధ్య కొమ్మలమీఁదనుండి శుకపికపరభృతారావములును —వీనికి మీఁదుగ క్రమక్రమముగ పైకిలేచుచున్న పర్వతశ్రేణులును-వానిమీఁదనుండిధారలవలె జాఱిజాఱి, క్రమముగ సెలయేఱులైన ప్రవాహములతో నిండి ప్రకృతిసంపదను ఘోషించుచున్న దీదేశము.

తూర్పున నున్న పర్వతశ్రేణులు కేవలము పొడవును కేవలము కురుచయును కానందున, ద్రాక్షతీగెలు, పూతికవృక్షములు ఇప్ప(oline)చెట్లు పెఱుగుట కవకాశమై యుండెను కొండలు దట్టమైన కొలఁది భూమి సాగులేక పడియుండెను. అచ్చటచ్చట ద్రాక్షతీగెలు మాత్రముండెను. కడమభాగము యావత్తు కాకులు దూరని కాఱడవి, చీమలుదూరని చిట్టడవి. ఈయడవులు 'ఓకు' 'చెస్టునట్టు' మొదలుగాఁగల మహావృక్షములతో నిండి, దేశమునకు వన్నె తెచ్చిన 'సిడారు' అను వృక్షరాజముతో శోభిల్లుచు సూర్యరశ్మి కభేద్యమై యున్నవి. పర్వతశ్రేణుల యౌన్నత్యము త్తరమున 1000 అడుగులు మొదలుకొని దక్షిణమువనున్న 'లెబనన్' పర్వతశిఖరము 'మాకుమేలు' వఱకు వచ్చుసరికి 9000 అడుగులకు లేచినది.

సముద్రతీరము కత్తిరింపఁబడిన ఒడ్డు కాకపోయినను, మెలికలుపడిన తీరము గనుకనే, పడవలు లంగరు వేసి తుపాను సమయములలో నిరుపద్రవముగ నిలుచుటకుఁ దగిన రేవులు సహజముగ నేర్పడినవి. అట్టిరేవులు లేని తీరమున దేశీయులు నేర్పరులు గనుక బుద్ధికుశలతచేఁ దీరము కౌగిలించుకొనుటకుఁ దనచేతులను చాచినదేమో యనునటుల బందరుకట్టి లంగరు రేవుల నేర్పఱచిరి. నీటిరాపిడిచేత గట్టు కోయఁబడి, ఆభాగమును నీరు మట్టివేసినందునను; మఱికొన్నిస్థలములలో గట్టు దోసకాయవలె సముద్రములోనికిఁ బోయినందు-

నను — ఈస్థలములలో విశేషము పాటుపోటు లేనందున ఫొనిషియనుల పడవలు తుపానుసమయములలో నిరుపద్రవముగ నిలుచుటకు వీలుపడియుండెను. ప్రకృతిచేత నిర్మింపఁబడిన రేవులులేనిస్థలములలో దేశీయులు చెమట కోర్చి, చెలియలికట్టను త్రవ్వి, 21-30 పడవలు నిలుచుటకుఁ దగినరేవుల నేర్పఱచుకొనిరి. సైడను, టైరు, ఆరేడసు — మొదలగునవి వారి రేవుపట్టణములు. మధ్యధరాసముద్రము పాటుపోటును లేక గ్రీష్మకాలములో సరస్సువలె నుండుటచేత నౌకాయాత్రాభిలాషగల ఫొనీషియనులకు నౌకాయాత్రఁ జేయుటకు వీలుపడెను. కాసియసు, బార్కైలసు — పర్వతోపరిభాగముల నుండి పశ్చిమముగ చూచినవారికి "కైప్రసు" టవి అగపడుచుండెను. ఈదీవినుండి "సైలీషియా," "కారియా" దేశములకును "రోడ్సు" మొదలగుదీవులకును సులభమైన పడవప్రయాణముఁ జేయవచ్చును. కాసియసు, బార్కైలసు, లెబనను — పర్వతశ్రేణులు దేశమునకు దక్షిణోత్తరముగ గోడవలె నుండును. పడవలు, వానిని గడుపుటకు తెడ్లును వీనికిఁ దగినకలపయు ఈపర్వతములలో మెండుగఁ గలవు కొండల చిక్కుత్రోవలు వారికి మొదటినుండి తెలిసియుండెను, గనుక, వారామార్గముల వెంబడి పోయి, వారికిఁ గావలసిన కలపను తెచ్చుకొనుచుండిరి. వారి పురాకృతము బాగుగ నున్నందున, సేతువువలె పూర్వపశ్చిమదిశలను వారు సంధించిరి.

రత్నాకరునికి రత్నములును ముత్యములే కాదు నత్తిగుల్లలు కూడ కలవు. వానిగర్భములో నేమియున్నవో, ఎవ రెఱుఁగుదురు? వీరి తీరమునయందు సముద్రములో నొకవిధమైన నత్తిగుల్ల కలదు. 'టైరు' పట్టణము మొదలు 'కార్మెలు' పర్వతశిఖరమువఱకు నుండు తీరమున నీగుల్లలు మెండు. వీనిలో నొకపుఱుగుండును. దానిశిరస్సువెనుక నొకసంచి కలదు. అందులో బంకవలె నంటుకొను ద్రావకము దిగియుండును. ఇది ఉల్లివాసన కొట్టును. పుఱుగుతోఁ గూడిన గుల్లలను వారు పట్టుకొని, ఆసంచిలోని ద్రావకమును గరిటెతో గోకి తీయుచుండిరి. ఊలు, నూలు, లినెను బట్టలను తడిపి, వాని కీద్రావకము నంటించి, తీక్ష్ణమైన ఎండలో ఆరవేసినయెడల, క్రమముగ, ఆకుపచ్చ, నీలి, ఎఱుపు

రంగులుగ మారినపైని, ఆబట్టలను సబ్బునీరుతో కడిగినపైని తుదకు వానికి ఎఱ్ఱగన్నేరు రంగు వచ్చును. ఈరంగు శాశ్వతముగ నిలుచును. ఇట్టిరంగుబట్టలను ఫోనేషియాలో తయారు చేసి, ఇతరదేశముల కెగుమతిఁ జేయుచుండిరి.

ఈవర్తగుల్ల లెచ్చుటలేవు! అంతటనున్నను, వీరితీరమున నున్నవి శ్రేష్ఠమైనవి కావచ్చును. ఇతరదేశీయుల కీవిధమున బట్టలకు రంగు వేయుట తెలియుదా? వారికి తెలిసినను, వీరికి రసాయనశాస్త్రములోఁ బ్రవేశము విశేషము. ఇతర దేశములలో సూర్యరశ్మి హెచ్చుకావచ్చును. ఆయాదేశములలో బట్టల నెండలో నారవేసినను, చూచుట కింపగు ఎఱుపురంగు వానికి వచ్చుట లేదు. ఈదేశములో సూర్యరశ్మి తగినటులుండుటచేత, బట్టలకు మంచిరంగు వచ్చుటకు వీలుపడెను. కనుకనే, కేవలము ప్రాచీనకాలములో వీరికి కీర్తిప్రతిష్ఠలు వచ్చుటయే గాక వారి వర్తకవ్యాపారము సాగినందున వారు ధనసంపన్నులయిరి.

ఇట్టిప్రకృతిసంపదల ననుభవించుటయే కాదు. వీరిస్థితిగతులు, నౌకిక వ్యాపారములు, రాచకీయుద్ధములు మంచివి ఇవియె వీరిఔన్నత్యమునకు కారణములు. 'మెసపొటేమియా' నుండి 'ఈజిప్టు'నకు 'ఈజిప్టు'నుండి 'మెసపొటేమియా'కు రాఁబోవుమార్గమున 'సిరియా' కొండలోయను దాటినశత్రుసైన్యములకుఁ బశ్చిమమునుండి యీపర్వతశ్రేణి లభేద్యమగుటచేత వారిదేశమును జయింపలేక పోయిరి. కొంతవఱకు వారికొండల నెక్కి అమూల్యమైన కలపమాత్రము దొంగిలించికొని పోవుచుండిరి గాని, వానిని దిగి దేశముపైకి వెళ్లుటకు వీలులేక పోయెను. దక్షిణోత్తరములను రాఁబోవునపుడు వారి దేశమార్గమున వెళ్లుటలేదు. ఇటుల భూసైన్యములు వచ్చుట కవకాశము లేదు. ఇక, నౌకాసైన్యములు తీరము వెంబడి వచ్చుట మిగుల కష్టము. దేశమునకుఁ బూర్వదక్షిణోత్తరముల నుండుపర్వతముల ఔన్నత్యము రానురాను తీరమునకు వచ్చుసరికి సమమై, చాలదూరము సముద్రములోనికిఁ జొచ్చుకొని పోయినందున, తెలిసినవారుతప్ప తదితరు లాతీరప్రాంతమున పడవలు బ్రద్దలగు

నసుభీతిచేత వానిని గడపుటకు భయపడుచుండిరి. మఱికొన్నిస్థలములలో నీకొండ కేటవాలుగ సముద్రమువైపు దిగినందున, తెలిసినవారు తిప్ప తదితరు లాచిక్కు మార్గములవెంబడిని వెళ్లుటకు వెఱచుచుండిరి. ఇట్టి అభేద్యమైన మార్గములు 4-5 కలవు. ఒకానొకకాలములో 'అసీరియా', 'ఈజిప్టు' దేశాధీశు లీ మార్గములను సాధించినను, వారి కెంతధనవ్యయమును ప్రాణహానియు కలిగెనో మనము చెప్పలేము. దక్షిణకవాటమును భేదించి దేశమును సాధించినవీరులు వారికీర్తిప్రతిష్ఠలను నిలుపుటకు కట్టించిన జయస్తంభములు "లైకసు" నదీతీరమునకు దక్షిణమున నేటివఱకుఁ గానఁబడుచున్నవి.

ఈదేశము పూర్వపశ్చిమదిశలను వర్తకమను సేతువుచేత సంధించుచున్నది. మధ్యధరాసముద్రతీరమున నుండు, గ్రీసు, ఇటాలియా, స్పానియా దేశములు, "యూఫ్రిటీసు" "టైగ్రిసు" నదులమధ్యనున్న దేశములు— వీనికి వర్తకవ్యాపారము జరుగుటకు దగ్గరమార్గ మీదేశమువెంబడిని గాని మఱియొకటి లేదు. "యూఫ్రిటీసు" నదీప్రాంతములనుండి, డమాస్కసు పట్టణముగుండా, ఫోనిషియాలోని టైరుపట్టణమున కొకబిడారుమార్గము కలదు, మఱియొక మార్గము చిన్నఆసియానుండి 'హామత్తు' పట్టణము గుండా, ఈదేశములోని "ట్రిపొలీసు," "ఆరేడసు" పట్టణములకు కలదు. ఇంచుమించు క్రీస్తుపూర్వము 12-వశతాబ్దము మొదలు నాటుమార్గమున 'పెరిషియా' కపడోషియా, ఆర్మీనియా, అనటోలియా, తూర్పుననుండి యీదేశములతోను పశ్చిమముననుండు గ్రీసు ఇటాలియా, స్పానియా, ఆఫ్రికా, ఫ్రాన్సుదేశములతో సముద్రముమీఁదను ఫొనీషియా దేశమువర్తకవ్యాపారమును సాగించెను.

ఫొనీషియాకును, పాలస్టీనకును, అనఁగా ఫిలిస్టైనులదేశము దక్షిణపు సరిహద్దు 'కార్మెలు' పర్వతశిఖరము. దీనిఎత్తు 1700 అడుగులు. ఈతీరమున నన్నిపర్వతములకంటె చాలదూరము సముద్రములోని కీపర్వతము చొచ్చుకొనిపోయి యున్నది. ఈపర్వతప్రాంతదేశము ఫలవంతమై, నందనోద్యానము వలె క్షేత్రముల కానందసంధాయియై యున్నది. అచ్చటచ్చట రమణీయమైన

కొండలోయలు కలవు. ముద్దలు ముద్దలుగ గుమిగూడియున్న తుప్పలు, పెలపెలఁ బోవు 'ఇప్ప' తరునీడలు గుజ్జుగుజ్జుగనున్న 'ఓక' వృక్షములు — ఇవిదట్టముగ బలిసి, ఎల్లప్పుడు పచ్చగ కనఁబడుచుండును. ఆగ్నేయమూలగా, ఈపర్వతశ్రేణి 18-మైళ్లవఱకు వ్యాపించియున్నది. ఈపర్వతమునకును సముద్రమునకును మధ్యనున్న 'ఏకరుబయలు ప్రదేశము' మిక్కిలి సారవంతమై, తీరము ననుసరించియే నిడువుగ ఇరువది మైళ్లవఱకు వ్యాపించియున్నది; ఇఁక వెడల్పు 3-4 మైళ్లకు తక్కువలేక 'గలీలి' పర్వతముల వఱకు తట్టియున్నది. ఈప్రదేశమున 'బేలసు' 'కిషోను' అనురెండునదులు ప్రవహించుచున్నవి గనుక నే క్షేత్రములు శాతకుంభమయములు వలెఁ గాన్పించుచున్నవి.

చాల్డీనులును ఫొనీషియాలోని ప్రాచీననివాసులును మొదట నేకకుటుంబములోని వారనితోచును. సామేతులు దక్షిణాభిముఖులై వెడలినపుడు, చాల్డీనులలోఁ గొందఱు దేశసంచారులు ఫలవంతమగు ఫొనీషియా దేశమునకు వచ్చిరి, ఇస్రాత్తేయులు ఈజిప్టుదేశమును విడిచి స్వదేశమునకు వెడలినపుడు, చాల్డీనులు ఫొనీషియాలో స్థిరపడి కాపురముండిరి. క్రమముగ వారు దేశము నాక్రమించిరి. రూపరేఖావిలాసములలో నేమి, గుణములలో నేమి వారును, కాననేతులును సరిసమానులు. అయినను వారికి స్వగుణములు కొన్నికలవు. వారికి వర్తకవ్యాపారములలోఁ గలనైపుణ్యమునుబట్టి, వారు సామేతకుటుంబములోని వారని తెలియనగును. గాలివాన అనిన భయములేక అపారపారావారము మీఁద నౌకాయాత్రలఁ జేయుట వారిస్వగుణము. ఏయేదేశవాసులతో వారికి వర్తకసంబంధము లుండెనో, ఆయా జనుల కనుగుణముగ వారు ప్రవర్తించుచుండిరి. ఏకాంతస్వభావులును అసూయాపరులు నైన "ఐజిప్టీయులు" సహితము వారినిఁ బ్రేమించుటయే కాక, తమదేశములో నొకదేవాలయమును కట్టుటకును, ఒక నూతనసీమ నేర్పఱచుకొని, అందులోఁ గాపురముండుటకును వారి కనుజ్ఞ నిచ్చిరి. వారును హీబ్రులును పరమమిత్రులు; అటులనే, అసీరియనులును బాబిలనులును, వారి కత్యంతమిత్రులు. కనక మధ్యధరాసముద్రమునుండి పారశీకతీరమువఱకుఁ గలదేశములలో వారు వర్తకముఁ జేయుటకు సమ్మతించిరి.

అసీరియనులును బాబిలనులును వారిని జయించి వారిదేశమును స్వాధీనముఁ జేసికొనినను, వారిని మన్నించి ఎన్నికతోఁ జూచుచుండిరి. అట్లనే గ్రీకులును వారికిని వర్తకములో మిత్రపోటి యయ్యుండినను, గ్రీకులు వారికి వర్తకములో నాధిక్యము నిచ్చిరి, పారశీకులు సహితము వర్తకము సాగించుటకు వారినిఁ బ్రోత్సహించిరి.

ఐహికవ్యాపారములలో వారు తిరుగుచున్నను, మతాభిమానులై నిస్పృహులై వారు లోకములో సంచరించిరి. దేవాలయముల నాశ్రయించి, వారి పట్టణములు కట్టఁబడెను, వర్తకముమీఁద నౌకాయాత్రకుఁ బోవునపుడు పడవలమీఁద నొకదేవతావిగ్రహము నుంచుకొని వారు తిరుగుచుండిరి. బాబిలనులవలె, వారనేక దేవతల నారాధించుచుండిరి. 'బాలు' వారి ముఖ్యదైవము, అసీరియనుల 'అస్టార్తె' అను చంద్రదేవతను 'మహాశక్తి' యని వారు పూజించుచుండిరి; వారామెకు బలుల నిచ్చుచుండిరి. వారిపట్టణముల కధిదేవత 'మల్కార్తు', 'డాగను' మత్స్యదేవత, బాబిలనులు మొదటఁ జేయుచుండెడి 'అడొనిసు'ని ప్రతిమను వారు కూడ నాచరించిరి. ఐజిప్షియనుల దేవతలను కూడ వారారాధించిరి ఈదేవతార్చనలలో వారు బలుల నిచ్చుటచేత, వారు జీవహింసను వెనుక తీయుట లేదు, వారిలో నీదుర్గుణము తప్ప మఱియొకటి కానరాదు. అనేకలౌకికవిషయములలో వారిబుద్ధి చొరఁబడినను, పరలోకవిషయములోఁ బ్రవేశముఁ గనలేదు. వారిమతగ్రంథములలో సహితము పరలోకచర్చ కానఁబడదు. స్థూలశరీరమును విడిచిన జీవులకీలోకవ్యాపారములు జ్ఞప్తిలో నుండునని వారు యోచించినను, జీవుఁడు శూన్యములో నైక్య మగునని వారినమ్మకము.

లౌకికవ్యాపారములలో వారెంతయును మించియుండిరి. నౌకాయాత్రలఁ జేయుటలో నేమి, నూతనసీమలను స్థాపించుటలో నేమి, వారిపేరు ముందు చెప్పవలెను. లోహక్రియలోను, గాజుక్రియలోను, వారును ఐజిప్షియనులును సరిసమానులు. వారే మొదట నావలఁ గట్టిరి, బట్టలకు రంగు వేసిరి, సముద్రముమీఁదఁ బోయి, నూతనదేశములఁ గనిపెట్టిరి. వారు కనిపెట్టి వాడుకచేయుచుండిన అక్షరసమామ్నాయము ఆధునిక పాశ్చాత్యుల అక్షరసమామ్నాయమునకు

మాతృక. లోహక్రియలో వారు ప్రసిద్ధికెక్కిరి. హోమరు కథలోఁ జెప్పిన ప్రకారము, "పాత్రోక్లెసుని" దినవారములలో శీఘ్రగమనునికి బహుమతి నిచ్చినపుడు, ఫోనీషియాలోని 'సైడాను' పట్టణములోఁ జేయబడిన లోహపాత్రను 'అఖిల్లీసు' బహుమతిఁ జేసెను. ఫోనీషియాదేశములోఁ జేయబడి, బంగారుకట్లతోఁ గూడిన రజతపాత్రను 'టాలిమేకసునకు' 'మానిలేయసుఁడు' కట్నముగ నిచ్చెను. 'హెకూబాయి' అను లలనామణి 'అధీని' దేవతకు సమర్పించిన పీతాంబరమును, ఫోనీషియా స్త్రీలుచేసియుండిరి. సమస్తకళలలోఁ బ్రవిష్టులై, కళాభిమానులగు ఫోనీషియను లాకాలములో వారికంటె నాగరికులైనందున, నన్నిదేశములలోను వారిప్రభ వెలిఁగెను.

దిట్టముగ కట్టఁబడిన 'టైరు' పట్టణమువారిదేశమునకు రాజధాని. ఆపట్టణము రెండుభాగములు; ఒకభాగము, రేవున కట్టఁబడెను; రెండవభాగము, మొదటిభాగమున కఱమైలుదూరమున నెదురుగ నుండుద్వీపముమీదఁ గట్టఁబడెను. ఈపట్టణమువద్ద మంచిరేవులు గలవు; తుపానుసమయములో నీరేవులకుఁ బడవలువచ్చి నిలుచును. తీరముమీఁద నుండుపట్టణము దిట్టముగ కట్టబడెను; 150 అడుగులు ఎత్తుగల ప్రాకారపుగోడ దానిచుట్టును కలదు ఈ ప్రాకారముమధ్య ద్రాక్షలతలచే నావరింపఁబడిన వారి నివేశనము లుండెను.

సైడానుపట్టణము మిక్కిలి ప్రాచీనమైనది; అదియొక్క రేవుపట్టణము. టైరు పట్టణమున కిరువదిమైళ్లదూరమున నుత్తరమున నుండెను. మొదట నది చేపలవర్తకమునకుఁ బ్రసిద్ధికెక్కెను, ఇటీవల, లోహక్రియకును అంబరక్రియకును ప్రఖ్యాతిఁ బడెను. 'బేరూటు' పట్టణమును గురించి 'ఫోనీషియాదేశ ప్రాచీనచరిత్ర' లో వ్రాయఁబడలేదు, అన్నిటి కంటె నుత్తరమున 'లయోడిసియా' అను పట్టణ ముండెను. దక్షిణమున, 'జార్డను' నదీప్రదేశమునకు సమీపమున 'అకరు' పట్టణము కలదు: ఈపట్టణము 'పాలస్తీను' రాజ్యమునకుఁ గవాటము వలెనుండెను. ఈపట్టణములన్నియు స్వతంత్రరాజ్యములను స్థాపించుకొని, తమతమరాజులచేఁ బోషింపఁబడుచుండెను. 'కార్తేజి' మొదలగు రేవు

పట్టణములు 'ఫొనీషియను'లచే స్థాపింపఁబడిన 'నూతనసీమలు' వారి వర్తకము సాగుటకుఁ గట్టఁబడెను; ఆపట్టణములు కూడ నొకరికి లోఁబడి యుండలేదు.

వారిసాహసమును గుఱించి 'హీరొడొటేసుఁడు' అను గ్రీకుచరిత్రకారుఁ డీవిధమునవ్రాసెను. ఒకనాఁకాయాత్రలో వారు 'ఆర్గొలీసు' రాజ్యము యొక్క తీరమునకు వచ్చిరి. గ్రీకుల నగరరాజ్యములలో నారాజ్యము వన్నెకెక్కెను. అయిదు ఆఱు రోజులు దేశీయులతో వారు వర్తకముఁ జేసి, వారికిఁ దమసామగ్రుల నమ్మిరి, ఒకరోజున 'ఇనాకసుఁ' డనురాజుకూఁతురు 'ఈయో' అను నామె చెలికత్తెలతోఁ గూడి వారి పడవలలోనికిఁబోయెను. పడవలలో సామగ్రు లేమియు లేకపోయినను వీరు వారితో బేరమాడుచుండిరి. అకస్మాత్తుగ వారు వీరినిఁ బట్టుకొని, పడవలను లంగరు నెత్తి, వానిని సాగించిరి. కొందఱు చెలికత్తెలు తప్పించుకొని పాఱిపోయిరి గాని, రాజకన్య 'ఈయో' మాత్రము వారిచేతిలోఁ జిక్కెను. వా రామెను తీసికొని ఈజిప్టుదేశమునకుఁ బోయిరి.'

ప్రథమమున సాహసమునకును, సముద్రముమీద దొంగిలించుటకును, వారు ప్రసిద్ధికెక్కిరి వారు దుర్మార్గులయినను, వారు నాణెమగు వస్తువులను తయారు చేసి అమ్మకము చేయుచున్నందున, దేశీయులు వారి దుర్గుణముల నెంచక, వారిని మన్నించుచుండిరి సిరియాదేశములో 'డేవిడు' సింహాసనము నెక్కియుండ, ఇస్రాయేలీయులు తలల నెత్తి 'జేరుసాలము' పట్టణములో నొకగొప్పదేవాలయముఁ గట్టిరి, అందుకుఁ దగిన సామగ్రిని వారు ఫొనీషియా దేశమునుండి తీసికొని వచ్చిరి 'టైరు' పట్టణములోని రాజు 'హీరాము' అనువాఁడు లోహక్రియలోను, దారుక్రియలోను, అశ్మక్రియలోను ప్రవీణుఁడు. డేవిడు అనురాజు తననగరును కట్టించినపుడు, దానికిఁ దగిన దారువులను 'హీరాము' తనదేశమునుండి యంపించెను. ఫొనీషియనులును ఇస్రాయేలీయులును, అత్యంత మిత్రులయి యుండిరి.

డేవిడుకుమారుఁడు 'సోలామనుఁడు' 'హీరాము' నకు, "మీరు మా యందు దయఁగలవారు; లోహక్రియ, అశ్మక్రియ, దారుక్రియ, అంబర

క్రియ—వీనిలోఁ బ్రసిద్ధికెక్కిన పనివాండ్రను మావద్దకుఁ బంపుఁడు. వానిని మేము యథావిధిగ సత్కరించెదము" అని లేఖను వ్రాసెను. అన్నివిధముల దేవాలయము నలంకరించుటలో ఫొనీషియనులు పాటుపడిరి. ఇస్రాత్రేయులును వారును కలిసి సొలామనుని కాలములో వర్తకముఁ జేయుచుండిరి ఉమ్మడిని వారిపడవలు పూర్వదిశకిఁ బోయి, అరబ్బీదేశమును, హిందూదేశము నుండి బంగారమును, పరిమళదినుసులును, చందనతరువులను, రత్నములను ఆఫ్రికాఖండమునకును, ఆంగ్లేయదీవులకుఁ బోయి, వెండియు వంతిము మొదలగు వస్తువులను తీసికొని వచ్చుచుండిరి ఆరెండు దేశములవారును 'పరమమిత్రులై యుండిరి; వారి రాజులు కూడ మిత్రులు.

ఏతు-బాలుఁడు:—హీరాము చనిపోయినతరువాత, తైరుపట్టణమును 'ఏతుబాలుఁడు' పరిపాలించెను. అతఁడు 'అస్తార్తె' దేవతార్చకులలో నగ్రగణ్యుఁడు—అతనిపరిపాలనకాలము దేశమునకు గ్రహణకాలమువలె నుండెను. హీరామును వధించి, అతఁడు ప్రభువయ్యెను. 'అస్తార్తె' దేవతకు నరభటులను విశేషము నతఁడిచ్చుటయె కాక, ఆయాచారములను విదేశీయులుకూడ నాచరింపవలె ననికోరుచుండెను ఈయుద్దేశముతో నతఁడు తనకుమార్తెను ఇస్రాత్రేయుల రాజు, అహాబునకు వివాహముఁజేసి. జెరుసాలము పట్టణములో 'బాలు'దేవున కొకదేవాలయమును కట్టించెను, 'జెజిరేలు' పట్టణములోని రాజనగరు 'అస్తార్తె' దేవతార్చకులతో నిండెను. అనంతర మామెకుమార్తె తనతల్లియొక్క యాచారములను నిలువఁబెట్టెను. శరీరమును కంపింపఁజేయు ఈదేవతార్చనలమూలమున హెబ్రూలబుద్ధి చెడిపోయెను, వీనిమూలమున రెండురాజ్యములు నశించెను—వీనిలో నొకయాచారమునువినిన శరీరము వణకును. వారాదేవతలకుఁ బసిపిల్లలను బలివేయుచుండిరి వారివిగ్రహములు లోహముతోఁ జేయఁబడెను,బలివేయుటకు ముందు, వారావిగ్రహముల నెఱ్ఱగకాల్చి వేఁడిచేసి యుందురు; ఎఱ్ఱగాఁగుచున్న విగ్రహము చేతిలో వారాపసిపిల్లలను పెట్టి, అవిగ్రహముయొక్క పాదములవద్దను దానిమీఁద నాపిల్లలను దొర్లింతురు. ఈలోపున పిల్లలు ప్రాణములను విడచిపెట్టుదురు. మఱియొకసమయమున

వారు పిల్లలను సంచులలోఁ గుట్టి, ఆస్తార్తె దేవతాలయశిఖరమునుండి, వారా సంచులను క్రిందకు జాఱవిడుతురు.

క్రీ. పూ. తొమ్మిదవ శతాబ్దమువఱకును వారొకరికి లోఁబడియుండ లేదు. ఆకాలమునకు 'ఆసురు—నజరుపాలుఁడు' అసీరియారాజ్యమును మహోచ్ఛ్రయస్థితికిఁ దెచ్చెను. అతఁడు దేశములను నిమిషమాత్రమున సాధించుచుండెను. వారతనికి భయపడి, అతనితో యుద్ధముఁ జేయకయే, వారతనికి లోఁబడిరి. నజరుపాలుని ప్రజారంజకమైన పరిపాలనలో వారు సిరిసంపదలతోఁ గూడి యుండిరి.

తుదకు ఫొనీషియనులకును అసీరియనులకును కలహము పుట్టెను. టైరు పట్టణపురాజు తిరుగఁబడి కైప్రసు దీవిని స్వాధీనముఁ జేసికొనెను. అసీరియా రాజు 'చతుర్థషాల్మనేసరుఁడు' సైన్యములతోఁ బోయి వారిదేశమునంతయు సాధించెను గాని, టైరుపట్టణమును మాత్రము వశముఁ జేసికొనలేక పోయెను. ఆపట్టణము దిట్టముగ కట్టఁబడెను. అయిదుసంవత్సరములతఁడాపట్టణమును ముట్టడించి యుండెను. స్వాధీనులైన ఫొనీషియనులు నావలతో వచ్చి, అతనికి సహాయముఁ జేసిరి అతనికిని టైరుపట్టణములోనివారికిని నౌకాయుద్ధము జఱిగెను. కాని, నజరుపాలుఁడాయుద్ధములో నోడిపోయి స్వదేశమునకుఁ బోయెను. అనంతరమాదేశము టైరుపట్టణముతోఁ గూడ స్వతంత్రమయ్యెను. మఱికొంత కాలమున కాదేశము "సేనాఖరీబు" రాజునకు లోఁబడియుండెను. అతనితరువాత "ఈసరు హాదనుఁడు" రాజ్యము నేలుచుండిన సమయమున, "సైదాను, లెబనను" వీనిని రాజులు తిరుగబడిరి. ఈసరుహాదనుఁ డాదేశమును ధ్వంసముఁ జేసి విడిచిపెట్టెను, సైదానురాజును పట్టితెప్పించి, వాని శిరస్సును ఛేదించెను. "లెబననురాజు కొండలలోనికిఁ బారిపోయెను గాని, శత్రువులు వానినిఁ గట్టి తెచ్చిరాజుయెదుట వధించిరి.

ఈవ్యత్యస్తములు శాంతమైన తరువాత, ఫొనీషియనులు పడినపాటులు చెప్పుటకు వీలులేదు. అసీరియా రాజులు వారినిఁ బీడించి ధనముఁ బుచ్చుకొను చుండిరి; ఆరాజుల సైన్యములు వారిదేశములగుండఁ బోయి దానిని పాడు.

చేయుచుండిరి. ఆరాజుల పనివాండ్రు ఆదేశములోని చేవగలదారువులను తమ దేశమునకుఁ దీసికొనిపోవుచుండిరి. దేశములోని పొగరుఁబోతులను శత్రువులు మట్టివేసిరి, పట్టణములు నిర్జనములయ్యెను, క్రీ. పూ. ఏడవశతాబ్దములో అసీరియారాజ్య మస్తమించెను. కుప్పిగంతులు వైచుచు, ఫొనీషియా దేశము ప్రబలమయ్యెను, పూర్వముకంటె రెండింతలు దానివర్తక మధిక మయ్యెను. సిరిసంపదలతో దేశము తులదూఁగుచుండెను, ఏదేశములోఁ జూచినను, దాని ప్రభ వెలిగెను; ఏదేశవాసులు కూడ, దానివస్తువులనే వాడెదరు, ఏనాణెమైన వస్తువైన ఆదేశమునుండి రావలెను; ఏనాణెమైన పనిని చేయించవలె ననిన, పనివాండ్రా దేశమునుండి వచ్చి, ఆపనిని జేయవలెను; చేవగలదారువులు ఆదేశమునుండి తేఁబడెను—"డామస్కసు" పట్టణమునుండి పరదేశములకు బిడారిమార్గము లనేకములు కలవు అరబియా, ఆర్మీనియా, అసీరియా, ఇండియా—మొదలగుదేశములకు రాకపోకలు జరుగుబిడారుమార్గము లాపట్టణమువద్ద కలియుచుండెను. నానాదేశములనుండి వచ్చినవర్తకు లాపట్టణములో సమావేశమగుచుండిరి. ఆపట్టణము వర్తకమునకుఁ బుట్టినయిల్లువలె నుండెను. ఈవైభవమంతయు నంతలో మాయ మయ్యెను.

టైరు, సైడాను—ఈరెండుపత్తనముల రాజులు ఈజిప్టుదేశముతోఁ గలిసి తిరుగఁబడినందున, "నబుకెడ్నెజరు" అనురాజు వారిపైకి దండువెడలి, వారివైభవము నపహరించెను. ఎటుచూచినను పాడుకొంపలును, పాడువడిన భూములును, తప్ప మఱియొకటి కానరాదు. చిమ్మచీఁకటి దేశమంతయు వ్యాపించెను; నలువైపులఁ బేదమ్మ నాట్య మాడెను. భోగములు శాశ్వతములుకావు. ఇయిదుసంవత్సరములవఱకు "టైరు" పట్టణము శత్రువులకు లోఁబడక నిలువఁబడియుండెను గాని, వేనవేలమనుజులు నశించిరి; మఱి పదమూఁడు సంవత్సరములు గతించినతరువాత నాపట్టణము శత్రువులకుఁ జిక్కెను. దాని ప్రాకారములును, గృహములును, చిటిలిపోయెను; దానిసంపద సన్నగిల్లెను: నూఱియేఁబదిసంవత్సరములవఱకు నాపట్టణము తలయెత్తి సంచరించలేదు.

బాబిలనుపట్టణము పారశీకరాజునకు స్వాధీన మయినతరువాత, ఫోనీషియనులు స్వతంత్రించుటకుఁ బ్రయత్నించిరి; కాని, వారిఆటలు సాగలేదు. ఆఫ్రికాఖండమున కుత్తరమున సముద్రతీరమున నుండు "కార్తేజి" పట్టణమును వారు పూర్వకాలములోఁ బ్రతిష్ఠఁజేసి కట్టిరి. ఆపట్టణమును సాధించుటకు పారశీకరాజు "కాంబేశీశుఁడు" వారిని నావలతో వచ్చి సహాయముఁ జేయుమనికోరినపుడు వారతనిమాట నిర్లక్ష్యముఁ జేసిరి. మఱికొంతకాలమువఱకుఁ బారశీకరాజులు వారిని ఉపేక్షఁజేసిరి. అనంతరము, డారేయసు కాలములోను, జరజేశుని పరిపాలనలోను, పారశీకులకును గ్రీకులకును జఱిగినయుద్ధములో, వారు నావలతోఁ బోయి పారశీకులకుఁ దోడ్పడిరి నాఁడు "సాలమీసు" వద్ద జఱిగిననౌకాహవములో ఫోనిషియనులు విశేషముగ దెబ్బలఁ దినిరి అపజయమునకు వారు కారణభూతులని యెంచి, జరజేశుఁడు వారిలోని ముఖ్యులను రప్పించి, వారిని వధించెను. అది చూచి హతశేషులైనవారు పడవలలో నెక్కి స్వదేశమున కతిత్వరితముగ వచ్చిరి. మఱి పదియేనుసంవత్సరములవఱకు వారిని పారశీకరాజులు స్మరించలేదు ఆనాటికి అధీనియనులకును స్పార్టనులకును జగడము రగిలినందున, తత్కాలానుసారముగ వారిలో నేరికైన సహాయముఁ జేయుటకు, పారశీకరాజు వారిని నావలతోఁ బంపుచుండెను.

క్రమముగ పారశీకరాజ్యము క్షీణించినకొలఁది, వారు స్వతంత్రించుటకు సిద్ధపడిరి. గాని పారశీకులు వారిని మట్టి చేయుచుండిరి: "ఇస్సను" వద్ద జఱిగిన యుద్ధములోఁ బారశీకు లోడిపోవుటకుఁ బూర్వము, వారు సైదాను పట్టణమును ముట్టడించి సాధించి నేలఁ గలిపిరి. ఆపట్టణము మఱల పుష్టి చేసి బలిసిన సమయమునకు, పారశీకము మొదలగు దేశములను, సాధించి, "మహా అలగ్జాండరు సైన్యములతో ఫొనీషియాదేశములోఁ బ్రత్యక్ష మయ్యెను. ఆదేశమున కుత్తరమున నుండిన పట్టణము లన్నియు, అవిగ్విజయుని పాదాక్రాంతము లయ్యెను.

ఇంతకుపూర్వము కొంచెము కాలము క్రిందట దెబ్బలుతిని యుండుట చేత, సైతానుపట్టణము కానుకలను విజయుని ముందటనుంచి, అతనికి జోహా రొనర్చెను. తైరు పట్టణము కూడ జోహారు లనుచు నుపాయనములతో నతని యెదుట నిలువబడి యుండెను. అపు డతఁ డాపురవాసులఁ జూచి "మీ మల్కారు,' దేవుఁడును మా 'ఏర్కూల్యేశుఁడు'ను ఒకరు; కనుక మేము మీపట్టణముతోఁ బ్రవేశించి, మీదేవునకు హోమముఁ జేసెద మ''ని చెప్పెను. ఇంతవఱకు వారిపట్టణములో ఏదేశియుఁ డొకఁడు పాదముఁ బెట్టి యుండలేదు. నే డతఁడు పట్టణములోఁ బ్రవేశించుటకు వారియ్యకొందురా? అతఁడు నగరములోనికి వచ్చిన, వారి పరువు పోవును, అతనిని రాకూడ దనిన, నతఁడు వారితోఁ గలహించును. అందుకు వారొకపన్నాగముఁ బన్ని, "మాపట్టణమున, కెదురుగనుండు దీవిలో మల్కారు దేవాలయము కలదు. అందులో మీరు హోమముఁ జేయవచ్చును" అని వారతనితో విన్నవించిరి. ఆమాట కతఁడు మండిపడి, "మీపట్టణములోని దేవాలయములో మేము హోమముఁ జేయుదుము: కాని, మఱియొకచోటను చేయము" అని చెప్పెను. అందుకు వారియ్యకొనలేదు. వారు నగరములోనికిఁ బోయి, దానిని దిట్టపఱచి యుద్ధమునకు సన్నద్ధు లయిరి. వారిపట్టణమునకు నలువైపుల ప్రాకార ముండెను; అగడ్తవలె దానిముందు సముద్రము కలదు. అలక్జాండరు దానిని సాధించుట కనేక విధములఁ బ్రయత్నించెను. కాని, అతని ప్రయత్నములు నిష్ఫల మయ్యెను. అతఁడు పట్టుదలకలవాఁడు గనుక నావలను తెప్పించి, చాలప్రయు ప్రయాసముల పైని, ఆపట్టణమును సాధించి దానిని నేలఁగలిపెను. ఆపట్టణవాసులలో బురుషుఁ డొకఁ డైనను శత్రువునకుఁ జిక్కక, అనితలలో మడిసెను. విజయుఁ డాపట్టణములోఁ బ్రవేశించి, స్త్రీలను బాలురను పట్టితెప్పించి, వారిని బానిసలుగ నమ్మివేసెను. అనంతర మతఁడు చేసిన ప్రతిజ్ఞ ప్రకార మాపట్టణములోని మల్కారు దేవాలయములోనికిఁ బోయి హోమముఁ జేసెను.

దేశములను జయించుట చేతఁగాని, దేశీయులను క్షోభపెట్టుటచేతఁగాని, ఫోనీషియనులు కీర్తిని సంపాదించలేదు. ప్రాచీనరాజ్యములలో వారిది చిన్నరాజ్యమైనను, ఫోనీషియా దేశము పన్నికెక్కెను. వారిసాహసము, వారిధైర్యస్థైర్యములు, వారి వ్యాపారములలోని నైపుణ్యము, నలువురితో వారిపొత్తు, వారి స్వతంత్రేచ్ఛ— ఈగుణములచేతనే వారుకీర్తివంతు లయిరి. నేఁటితో వారస్తమించిరి

ప్రాచీనదేశచరిత్రలు

6-వ ప్రకరణము.


పాలస్తీను
6
సైదను
తైరు
దమాస్కసు
కార్మెలుపర్వతము
ఆమను
జెరూసలేము
జూదారాజ్యము
ఈదాము పరగణా

శ్రీరస్తు.

హీబ్రులదేశచరిత్ర.

షష్ఠప్రకరణము.

ఇరువదియేడవ అధ్యాయము.

క్రీ. పూ. సం. 2000—63 లు

ఫొనీషియాదేశమునకు దక్షిణమున హీబ్రులదేశ ముండెను, వారిదేశము-గుండ "జార్డను" నది ప్రవహించుచున్నది. కాననేతులదేశము మెఱకభూములలో వారు నివసించి యుండిరి. ప్రాచీనదేశీయులలో నొకరైనను సుగుణసంపత్తిలో వారితో సమానులు కారు పరలోకమునుగుఱించి అపూర్వమగు విషయములను లోకమునకు వెల్లడిఁజేయుటకొఱకు, భగవంతునిచే 'నిర్దిష్టజనులని' వారు పేరొందిరి. పరమేశ్వరుని 'నిర్దిష్టజనుల' మనుసంగతి వారిలోఁ బ్రతిమనుజుని హృదయములో నాటియుండినందున, వారి కెన్నికష్టములు వచ్చినను వారు వానిని నిర్లక్ష్యముతో భరించుటచేత, సామాన్యులకంటె వారధికులయిరి. అట్టి వారిచరిత్ర నిందు పొందుపఱచుచున్నారము.

వారు మొదట నొకచిన్నకుటుంబమువారై, క్రమముగ నొకసంఘము క్రింద నేర్పడిరి; వారి జాతివారు బాల్యదశలో నుండినపుడు; బానిసలుగ నుండిరి. వారు క్రమేణ వృద్ధినొందిరి. వారు స్వదేశమునకు వచ్చి, పోరాడి దానిని సాధించి సిరిసంపదలతోఁ గూడి బలవంతు లయిరి. అంతలో అసీరియాదేశపు పోటు తగిలినందున, కొంచెము వారు కుంగిరి; కాని, వారికి మరల జవ వచ్చునంతలో అసీరియనులు వారిని గాలి కెగరవైచిరి. ప్రాచీనకాలములో నేపాటిపేరు

ప్రతిష్ఠలుఁ గల ప్రతిరాజుతో వారు సంబంధము గలుగఁ జేసికొనిరి. ఐజిప్టీయులు వారినిఁ గష్టపెట్టిన యజమానులును అసీరియనులును; బాబిలోనియనులును వారిని పాలించిన విజయులు; ఫోనీషియనులు వారి పొరుగున నుండిరి; పారశీకులు వారిశత్రువులు రోమకులు వారినిఁ బీడించిరి. ముందును రాను రాను లోకములోఁ బ్రతిపట్టణములో వారు కాపుర ముండిరి. ఎచ్చటనున్నను, వారిని శీఘ్రముగ తెలిసికొనఁగలము; వారి రూపరేఖా విలాసములచేతఁ గాక, వారి గుణములచేతను కూడ వా రందఱిలోను నిర్ధారణీయులు—నాఁడు జూడాదేశములో నుండినప్పుడువలె నేఁడు కూడ వారు నిగూఢముగు ప్రవర్తన కలవారును ధనాకర్షణలో సూక్ష్మబుద్ధి గలవారై యుందురు. ఇతరదేశీయుల చరిత్రను వారిచరిత్రతో సరిపోల్చి చూచిన, వారిబలమునకును ఏకాంత స్వభావమునకును కారణము తెలియును.

ప్రాచీనులలో వారు మాత్రము నిశ్చయముగ ధర్మబుద్ధి గలిగియుండిరి. తదితరదేశీయు లనేక దేవతల ననేకవిధముల సగుణముగ నారాధించుచుండినదినములలో, సమస్తలోకముల నేలుచుండెడి భగవంతుఁ డొకఁడేయని వారునిర్ధారణఁజేసి లోకములకుఁ జాటిరి. కాలమంతయును వారి కీబుద్ధి నిశ్చలముగ నుండక పోయినను, వారిలోఁ గొందఱికి మాత్ర మీజ్ఞాన ముండెను. ఈజ్ఞానముకంటె వారికిఁ గావలసినది యేమియున్నది? ఇందుచేత వారందఱికంటె నధికు లయిరి.

క్రీ. పూ. సం॥ 2350—2200 రములు. పితృవ్యాయుగము:—మానవజాతిలో హీబ్రూలు సామేతికుటుంబములోని వారు. చాల్డియదేశము వారి జన్మభూమి. వారి స్వదేశము హితేతుల దండయాత్రచేతనస్వాస్థ్యముగ నుండుటచేతనో, లేక స్వదేశములో వారికి దినచర్య జఱుగుట కష్టమగుటచేతనో, వారు స్త్రీపురుషులు పశువులమందలతోఁ గూడి 'అరు' పట్టణమును విడిచి, దక్షిణాభిముఖులై వచ్చి వచ్చి, ఫోనిషియాదేశపు పొలిమేరలను గడచి, కాననేతుల మిఱుకభూములలోఁ బ్రవేశించిరి. 'జార్డను' నది ప్రవహించుటచేత నాదేశము ఫలవంతమైనది, కనుక, సేకకుటుంబములోని వారైన, మోబేతులు, కాననేతులు, అమనేతులు, ఈదోమేతులు—మొదలగువారితోఁ గూడి, ఆదేశములోని పశ్చిమభాగములను వా రాక్రమించిరి. వారి కాదేశ

మనుకూలముగ నుండు నని దివ్యజ్ఞానముచేతఁ దెలిసికొని, ఆదేశములో 'అబ్రహాము' వారితో నివసించెను. క్షామము వచ్చినపుడు సహిత మతఁ డచ్చటనే యుండెను, అతనిపరివారములోఁ గొందఱు మాత్రము "ఈజిప్టు" దేశమునకుఁ బోయిరి, కాని మరల వారు స్వదేశమునకు వచ్చిరి అచ్చటనే 'అబ్రహాము'న కిరువురు కుమారులు కలిగిరి. వారిలో నొకఁడు "ఈజాకు," అతని మూలమున వారు ప్రబలులై ముందు "పాలస్తేను" దేశమునకు ప్రభువు లయిరి. జ్యేష్ఠుఁ డగు "ఇష్మేలు" బహిష్కృతుఁడు: నేటివఱకు సంచారావస్థలో నుండిన, అరబ్బు లతనినిఁ దమమూలపురుషునిగ భావింతురు పాలస్తేను దేశమునకుఁ దూర్పుగ నుండు జాతివారలకు అబ్రహాముయొక్క తదితరకుమారులు మూలపురుషు లయిరి. ఈయుగములో వారు శైశవదశలో నుండిరి; వారు పట్టణములలో నివసించుటలేదు. వారు లోయలమీఁదను గాని లేక ఖరములమీఁదను గాని దేశములగుండఁ బోవుచుండిరి. ఎచ్చటనైన పచ్చికభూములును నదులును వారికి గోచరమైన వారచ్చటఁ దమపశువులతో నిలుచుచుండిరి. వారినాయకులకుమాత్రము గుడారము లుండెను. వారు క్షీరములఁ ద్రాగుటయే కాక, మేఁకమాంసముఁ దినుటకలదు. కొంచెముకొంచెము ద్రాక్షరసము వా రుపయోగించిరి.

క్రీ. పూ. సం. 1700 రము వారిలో మృగయులని, పశుపాలకులని, హాలికులని, మూఁడు జాతులవారు కలరు. ఈహాలికులఁ బొలములను నిలుపఁ జేయుట తెలియదు, అందుచేత వారు క్షామములచేత బాధపడుచుండి, ఈజిప్టుదేశమునకుఁ బోయి, అచట నైలునదీతీరమున నివసించిరి, ఆసమయమున వారు ఈజిప్టుపైని "గోపాలరాజులు" చేత సాదరింపఁబడిరి. ఆదేశములో వారు పడినపాటులను, అచ్చటనుండి వారిని "మోసెసు" ఏవిధమున స్వదేశమునకుఁ దీసికొనివచ్చి రక్షించినసంగతియు, ఇదివఱకుఁ జెప్పియున్నాము. ఆనాటికి హీబ్రులు సాంఘికులై యుండలేదు, వారేవిధమైన నియామకములు లేక యుండిరి. —భగవంతుని "నిర్దిష్టజనుల" మనెడి బంధనము తప్ప, వారిలోఁ వారికి మఱి యేవిధమైన సాంఘికానుబంధములు లేవు. అరబీదేశపు ఎడారు

లలో వారు మోసెసుతోఁ గూడి పడిన శ్రమలను చెప్పలేము, వారిటులఁ గష్టపడినందున, ముందుకు వారికి శ్రేయస్సు కలిగెను. దేశకాలము లనుగుణ్యము లగుటచేత వారు క్రమముగ బానిసప్రవృత్తిని మాని స్వతంత్రావస్థలోనికి వచ్చిరి, మోసెసుయొక్క ధర్మమున వారు సాంఘికసూత్రములకుఁ గట్టుపడిరి, క్రమముగ న్యాయవిధుల కలవడిరి.

క్రీ. పూ. సం॥ 1160 రము—'పౌరుషేయ యుగము'. 'కానసేతుల' దేశమునకు వచ్చినది మొదలు రాజ్యాధిపత్యము స్థాపింపబడువఱకు 'హీబ్రూల' సాంఘికరాజ్యము వర్తిల్లెను—"ఇస్రాయిలు" అనువాని సంతతివారు కనుక, వారికి "ఇస్రాయేలీయులు" లని మఱియొక నామము కలదు. ఈ యుగమునకు వీరయుగ మనిసంజ్ఞ కలదు—ఈకాలములో దక్షిణోత్తరముల నుండిన కానసేతులతో వారు పోరాడి జయప్రదులయిరి. ఈకాలములో కానసేతులు, వేర్వేఱుసంస్థానముల నేర్పఱచుకొని యుండిరి, ఒక్కొక్కసంస్థానమున కొక్కొక్కరాజు కలఁడు, వారిరాజ్యము భిన్నమై యుండెను, వేర్వేఱ వారు, హీబ్రూలతోఁ బోరాడిరి, కాని వారు యుద్ధములో నోడిరి. ఈయుద్ధములలో హీబ్రూలలోఁ గొందఱు పురుషులు ప్రసిద్ధి కెక్కిరి "జోషువా" అనువానిజయదుందుభులు మ్రోగ, "జరికో" పట్టణప్రాకారములు చిటిలిపోయెను, 'గిడియను' అనువాఁడు 'బాలు' దేవునియూపస్తంభమును తీసివేసెను ఉత్తరకానసేతుల రాజుయొక్క సేనాధిపతియైన 'శిశరుఁడు' అనువానిని 'జాయిలుఁడు' యుద్ధములోఁ జంపెను హీబ్రూలు దిగులు నొందియుండినపుడు, 'డెబోరా' అనునామె వారినిఁ బ్రోత్సహించెను. ఆమె చెప్పినజయకీర్తన హీబ్రుభాషలో మృదుమధురశైలిని వ్రాయఁబడియున్నది. ఆకీర్తనఁ జదివినయెడల, ఆకాలములో వారిజాతుల వృత్తాంతమంతయుఁ దెలియనగును. ఆయుద్ధములలో వారు పడినశ్రమల నామె వర్ణించెను.

పాలస్తేను దేశతీరమునుండి 'ఫిలస్తేనులు' సైన్యములతోఁ గదిలి వచ్చి ఇస్రాయేలీయుల నదిరించిరి. వారిరాజధానియైన 'గాజా' పట్టణమున కెదుట 'సామ్సను' అను వాఁడు చేసిన పౌరుషకృత్యములను శత్రువులు సహితము

మెచ్చిరి. కాని 'ఫిలస్తీనులు' జయించి, 'నోవా' అనువాని కాలమునాటి నావను దొంగిలించికొని పోయిరి. అటుల దీనులై యుండిన వారి నుత్సహించి, 'ఫిలస్తీను'లను 'సామ్యూలు' అనువాఁ డోడించెను. అతనికుమారుల కాలములో సాంఘికరాజ్యము చెడినందున, నేకరాజ్యాధిపత్యము స్థాపింపఁబడెను.

ఏకరాజ్యాధిపత్యము — క్రీ. పూ. సం॥ 1020 రము. — మాటిమాటికి 'ఫిలస్తీనులు' దాడివచ్చినను, ప్రభుమంత్రోత్సాహశక్తులతోఁ గూడిన 'సాలు' అనువాఁడు రాజ్యమును నిలువఁబెట్టెను, కాని, కొంచెము కాలములో నతనికి మతిభ్రమణము కలిగెను. అప్పుడప్పు డతఁడు వెఱ్ఱివానివలెఁ జేష్టలఁ జేయుచుండెను. 'డేవిదు' అనువాఁ డతనిసేనాధిపతి, వానిఁ జూచి, యతఁ డసహ్యపడెను. అంతలో నతఁడు 'గిల్బోవా' వద్ద జరిగిన యుద్ధములోఁ జనిపోయినందున, సర్వజనరంజకుఁడైన 'డేవిదు'ను వారు రాజుగ నేర్పఱచుకొనిరి

డేవిదు సింహాసనము నెక్కినతోడనె, వారి రాజ్యమునకు స్వాస్థ్యము వచ్చెను, భిన్నములై సదా పోరాడుచుండెడివారు నేఁడేకీభవించి మిత్రులయిరి. దేశముపైకి శత్రువులు దాడి వచ్చుటలేదు. ఒకపట్టణము నతఁడు రాజధానిగఁ జేసెను. "యూఫ్రటీసు" నదితీరము మొదలు సముద్రమువఱకును, దక్షిణమున "ఈజిప్టు" మొదలుకొని ఉత్తరమున "లెబనను" పర్వతముల వఱకు నతని రాజ్యము వ్యాపించెను. దేశసంరక్షణార్థ మతఁ డొకసైన్యమును నిలిపి, దానినిఁ బోషించుచుండెను, ఇరుగుపొరుగు దేశీయులతో నతఁడు సఖ్యముఁ జేసెను, అతనిప్రతాపముచేత వారు వీరుల మని విఱ్ఱవీఁగి దేశములలోఁ ప్రఖ్యాతి నొందిరి

అతనికుమారుఁడు "సాలామనుఁడు" రాజ్యమునకు వచ్చినతరువాత నాదేశము మహోచ్ఛ్రపదవికి వచ్చెను. ఫోనిషియనుల సహాయముచేత, నతఁ డొకదేవాలయమును 'జేరుసలాము' పట్టణములోఁ గట్టించెను. హీబ్రూలచేత నారాధింపఁబడు 'జిహోవా' యొక్క దేవాలయ మని దేశములలో నది ప్రసిద్ధి కెక్కెను. 'లెబననుపర్వతారణ్యభవనము'లో వారు రాచకార్యములను నిర్వర్తించుచుండిరి; దానిచిత్రములఁ జూచుటకును, లేక సిరియాదేశపువస్తులను

ధరించిన "సొలామనుని" ధానుష్కులఁ జూచుటకుఁ గాని, లేక ఈజిప్టుదేశపు కన్యయైన స్వభార్య విలాసార్థమతఁడు ప్రతిష్ఠఁజేసిన మహోద్యానములఁ జూచుటకుఁ గాని దేశదేశములనుండి ప్రజలు వచ్చుచుండిరి. ఇంతమహావైభవములో నుండినను, నిర్మల మగువారిమనోవ్యాపారమునకు భంగము వచ్చెను. అనేక దేశ కన్యలను "సొలామను" వివాహ మాడినందున, వారు వేర్వేఱ దేవాలయములఁ గట్టించి వానిలో స్వదేవతారాధనలఁ జేయుచుండిరి. ఉత్తరమున నుండి "డామస్కసు" అను ముఖ్యపట్టణమును, దక్షిణమున నుండిన "ఈదాము" అను పరగణాయు ఈరెండును తిరుగఁబడి స్వతంత్రులయిరి. ఈదేశముఁ జూచిన 'ఈజిప్టు' దేశమునకుఁ గూడ నసహ్యము పుట్టెను ప్రజలుకూడ పన్నులనిచ్చుకొనలేక ఘూర్ణిల్లు చుండిరి, అట్టివారిని లేవఁదీసి, జిరోభముఁడు తిరుగఁబడెను, అతనికి 'ఈజిప్టు' సహాయముఁ జేసెను సొలామనునితో హీబ్రుల ప్రభుతగ్గెను

సొలామనునికుమారుఁడు 'రేహోభముఁడు' రాజ్యమునకు వచ్చెను పనుల విషయమై రాజునకును ప్రజలకును వ్యవహారముపొసఁగక పోయెను. అందఱు నొక్కుమ్మడిని రాజుపైని లేచిరి. పదునొకండు జాతులలోఁ బదిజాతులవారు జిరోభముని పక్షమునకుఁ బోయిరి. స్వపక్షము నవలంబించి యుండిన 'జూదుల వద్దకు 'రెహోభముఁడు' పాఱిపోయెను. నేటినుండి 'హెబ్రుల' రాజ్యము ద్వివిధ మయ్యెను, ఉత్తరమున ఇస్రాత్రేయులరాజ్యము, దానికి రాజధాని 'సమేరియా' నగరము—ఈరాజ్యము నూతనముగ స్థాపింపఁబడెను దక్షిణమున ప్రాచీన జూగులరాజ్యము, దీనికి రాజదాని 'జేరుసాలము' అను పట్టణము. రాజ్య మద్వైతముగ నుండినంతకాలము దిట్టముగ నుండెను, ఏనాఁడు ద్వైత మయ్యెనో, ఆనాఁ డారాజ్యమునకుఁ గీడు మూడెను. 'ఈజిప్టు' దేశపుసైన్యములు జేరుసాలమును ముట్టడించి నాశనముఁ జేసినవి; డామస్కసు పట్టణపుసేనలు దాని ప్రాకారములను ప్రక్కలు చేసినవి. 'అహాబు' అనువాఁడు రాజ్యము నేలుచుండ, ఇస్రాత్రేయుల పదిజాతులవారును ధర్మమార్గమును విడిచిరి. సైదానుపట్టణపురాజు కూఁతురు 'జేజీబేలు' అను నామెను 'అహాబు' వివాహమాడి, ఆమెమూలమున 'ఇస్రాత్రేయుల' దేశములో, 'బాలు' దేవతారాధన స్థాపించెను. ఈనూతన

మతాభిమానుల పోరుపడలేక, ప్రాచీనమతగురువులు దిక్కులఁ బట్టి పోయి కొండలరాయులఁ జేరిరి ఎన్నికష్టములనైనఁ బొందిరి గాని, ఈప్రాచీనమత గురువులు స్వమతమును విడువలేదు. ధర్మము కొఱకును స్వాతంత్ర్యమునకును వారు కత్తిఁ గట్టుకొని సిద్ధపడు చుండిరి, రాజులు ధర్మమార్గమును విడిచి సంచరించిన యెడల, నిర్భయముగ గురువులు వారియెదుటకుఁ బోయి, తప్పులఁ జూపి, వారిని సన్మార్గములోనికిఁ దెచ్చుట కలదు. 'ఎలీజా' అనువాఁడీమతగురువు లలోఁ బ్రసిద్ధి కెక్కెను. ఒకసమయమున దేశములో క్షామము వచ్చెను, అప్పు డతఁడు 'బాలు' దేవతాభక్తులను పిలిచి 'ఓయి అర్చకులారా! మీదేవుఁడు సత్యవంతుఁడైనయెడల నీక్షామమును పోఁగొట్టుటకు సమర్థుఁడగును' అని వారి తోఁ దర్కించెను. ఆక్షామమును మాపుటకు వారిదేవునకు శక్తిలేనందున, నతఁడు 'జిహోవా' దేవునిఁ బ్రార్థించి, దేశము నాబాధనుండి తప్పించెను. అంతటితో విగ్రహారాధనను విడిచిపెట్టి 'జిహోవా' దేవునిఁ బూజించుచుండిరి అనంత రము 'డామస్కసు' పట్టణమును ముట్టడించి యుండిన సిరియనులను వారు జయించిరి, ఈలోపున దక్షిణమునసుండిన 'హెబ్రుల' 'జూడా' రాజ్యముకూడ పుష్టిచేసి బలిసి పెరిగెను. ఇస్రాత్తేయులరాజు 'ఆహాబు' నతను అతనిభార్య 'జెజీబేలు' ననుసు కలిగిన కుమార్తె 'అతేలియా' అనునామెను 'జూడా' దేశపు రాజు వివాహమాడినందున, రెండు రాజ్యము లేకమయ్యెను, కాని, ఆవివాహ మూలమున రెండురాజ్యములును నశించెను. 'ఈడాము' దేశము మరల తిరుగఁ బడెను, జూడులవాడలు సముద్రములో నక్క లయ్యెను. ఫిలస్తీనులును అరబ్బులును దేశములోఁ జొచ్చిరి. అంత కంతకు అసీరియారాజు వారినిఁ బలు ము కొనివచ్చెను. రెండుదేశము లరాజకములై యుండెను. రెండురాజ్యములలో నంతఃకలహములు ప్రబలమైనందున, జూడులరాజు, 'ఆహాబు' అనువాఁడు అసీ రియారాజు 'తిగ్లేతపిలేశరు'ని శరణుఁ జొచ్చెను ఇస్రాత్తేయులను 'తిగ్లేతపిలేశ రుఁడు' సాధించి రెండురాజ్యములవారినిఁ బీడించి ధనము నతఁడు రాబట్టెను. ఈజిప్టుదేశము సహాయముఁ జేసికొని ఇస్రాత్తేయులు తిరుగఁబడినందున, వారి రాజధాని 'సామేరి' నగరమును 'షాల్మనేశరుఁడు' ముట్టడించి సాధించి నేలఁ

గలిపెను, నాటినుండి, ఇస్రాత్తేయుల ప్రభ తగ్గెను. వారిరాజ్యముకూడ నస్తమించెను, వారిపనిజాతులవారును దిక్కులఁ బట్టిపోయిరి.

మఱికొంచెము కాలమునఱకును జూడారాజ్యమును 'హజికేయుఁడు' పరిపాలించి, దానిని నిలువఁబెట్టెను. అతనికాలములో జేరుసాలెము పట్టణమును అసీరియారాజు 'సేనాకెరీబు' ముట్టడించెను, కాని, అతనిసైనికు లుదయమునకు సరికి ప్రాణములను విడిచి పడియుండిరి, అందుచేత నతఁ డాపట్టణమును సాధింపలేకపోయెను — అనంతరము దుర్మార్గుఁడైన 'మనేసహుఁడను' వానికాలములో నాజూడారాజ్యము నీరసపడి, విదేశీయులకు స్వాధీన మయ్యెను.

అసీరియారాజు 'ఈసరుహదనుఁడు' సైన్యములతో దేశముగుండఁబోయి దేశమును నాశనముఁ జేసెను. మఱికొంతకాలమునకు 'ఐజిప్టీయులు' దేశములోనికి వచ్చి 'జేరుసాలెము' పట్టణమును పట్టుకొనిరి ఈదెబ్బలనుండి తేఱి వారు వృద్ధిఁజేయుచుండిన సమయమున, బాబిలను రాజు 'నబుచద్నెజరు' వారి సర్వము నపహరించెను, వారిరాజును, రాజకుటుంబమును, సామంతులను — బాబిలనుపట్టణమున కతఁడు తీసికొనిపోయి చెఱసాలలోఁ బెట్టెను. క్రీ. పూ. సం॥ 587-రములో నాపట్టణము నేలఁ గలిసెను, ప్రాకారములును, రాజభవనములును, సామాంతుల నివేశనములును, దేవాలయములును — పట్టణమునకు శోభను తెచ్చునవస్తువును మాయ మయ్యెను.

పునరుద్ధారణ క్రీ. పూ. సం॥ 536 రము: —

ఇట్లు హెబ్రూలు విదేశములోఁ గాలముఁ గడుపుచుండిరి. బాబిలోనియనులు వారిని బానిసలుగఁ జూడకపోయినను, వారు తాము అస్వతంత్రజీవనమునకుఁ గలఁగుచుండిరి. వారిలోఁ గొందఱికి రాజయోగము పట్టినను, వారికి స్వదేశాభిమానము నశింపలేదు, వారిని స్వమతాభిమానము విడుచుటలేదు, వారిలోఁ గొందఱు మృతినొందినను, వారిసంతతివారు, వారిపౌరుషమును నిలుపఁబెట్టిరి. ఇంతలో ననేకమార్పులు సంభవించెను. పారసీకరాజు 'కైరెసుఁడు' బాబిలనురాజ్యమును మాపివేసెను. అప్పుడు హీబ్రూల ప్రధానమంత్రి 'డానియులు' అనువాఁడు రాజువద్దకుఁ బోయి, వారాదేశములోఁ బడుచుండిన పాట్లను నతఁ-

నికి విన్నవించి, అతనియనుజ్ఞఁ బడిన వారిని స్వదేశములోఁ బునస్థాపితులఁ జేసెను.

స్త్రీపురుషాదులు ఆబాలవృద్ధులు తమతమ పశువులతోను పరిచారకులతోను బాబిలను పట్టణమునుండి బయలుదెడలి ఎడారిమార్గము గుండ పాలస్తీను దేశము నకు నడిచిరి. మార్గములో ననేకవిధముల వారిదేవుఁడు 'జిహోవా'ను వారు సంకీర్తనఁ జేసిరి. వారు "జేరుసాలెము" పట్టణములోఁ బ్రవేశించి నిర్మానుష్య మై యుండినదానినిఁ జూచి కన్నీరు విడిచిరి. అందులోని దేవాలయమును వారు కట్టి 'ఓ జిహోవా! నీకటాక్షముచేత, నీ ఆలయమును కట్టుటకీనాటికి మాకు శక్తి కలిగె'నని వారు మ్రొక్కి, ఆలయమును ప్రతిష్ఠఁ జేసిరి. దేశీయులవలె నా దేవా లయము కూడ తేజోవిహీనమై యుండెను. విదేశీయులు పట్టణములోనికి వచ్చి కాపుర ముండుటకు హీబ్రూలు సమ్మతింప లేదు, అందుచేత "సామేరి" నగరము వారా దేవాలయమును కట్టునపు డనేకవిఘ్నములను తెచ్చిరి. పారశీక రాజునద్ద వా నగరవాసులు రాజమాన్య రాజపూజితులై యుండినందున, వారిమాటలు సాగెను, ఆ పట్టణమును కట్టుటనుఁగూడ వారు నిరోధించిరి. ఇటుల తొంబది సంవత్సరములు గడిచెను. 'అర్తజార్జేశుఁడు' పారశీక రాజ్యము నేలుచుండెను. "నహీమయుఁడ"ను రాజు పారిపార్శ్వకుఁ డొకఁడు రాజాజ్ఞఁ బుచ్చుకొని, ఎందరెన్నివిధముల విఘ్నముఁ జేసినను వాని నతిక్రమించి, శీఘ్రములో నా పట్టణముఁ గట్టించెను. పూర్వమువలె దేవాలయములో భోగరాగాదులు జరిగెను, భగవంతునికథలు గానముఁ జేసిరి.

ఇంతలోఁ బారశీక రాజ్యప్రభ తగ్గెను. గ్రీకులు మహోచ్ఛ్రాయమునుండి జారిపడిరి. బాలసూర్యునివలె "మాసిడను" రాజ్యప్రభ దినదిన ప్రవర్ధమాన మయ్యెను. మహా అలగ్జాండరు గ్రీకులను సాధించి, పారశీకులను పట్టుపెట్టి ఫొనీషి యాదేశము గుండఁ బోవుచు, హీబ్రూల కతఁడు వర్తమానముఁ బంపెను. ఆ వర్త మానమును విని, వారి మతాధికారి "మేము పారశీకసింహాసనమునకు భృత్యుల" మని గడగడ వణఁకుచు ప్రత్యుత్తరమిచ్చెను. త్వరితముగ పట్టణము మీఁదికి విజయుఁడు వచ్చుచుండెను. ఆనగరవాసులు భయము నొందిరి. "మీకు భయ

షులేదు. మీశరీరమున నొకదెబ్బతిగుల"దనియొకమహాపురుషుఁడు మరాధికారితో స్వప్నములోఁ జెప్పెను. విజయుఁడు చతురంగబలములతోఁ పట్టణబహిర్ద్వారమువద్దకు వచ్చెను. అతనిసైనికులు పట్టణములోఁ బ్రవేశించుటకుఁ ద్వరితపడుచుండిరి. ఇంతలో వారు పట్టణమును తెల్లనిజెండాలతో నలంకరించిరి; పురజనులు శ్వేతాంబరములను ధరించి, దేవతార్చకులను వెంబడించిరి, వారు పీతాంబరధారులై మరాధికారి ననుసరించిరి, అతఁడు చీనాంబరములను వల్లెవేసికొని శాతదండమును చేఁబూని ముందు గోవిందునివలె నడచెను. ఇటుల నిరాయుధులై వచ్చుచుండిన వారినిఁ జూచి, శత్రువులు నిశ్చేష్టితులయిరి. అల్లంతదూరమున మరాధికారినిఁ జూచి, అలగ్జాండరు రథమును డిగ్గి, పాదచారియై వచ్చి అతనికి సాష్టాంగ నమస్కారముఁ జేసెను. దండనాయకులును, కోదండనాయకులును మొదలగువా రతనిచర్యఁ జూచి వెలవెలఁబోయిరి. 'ఓరాజాధిరాజా! రాజులు నీరాజనములఁ గొను మీరేల నీమరాధికారికి వందనముఁ జేసిరి'? అని మంత్రి యొకఁ డతనిని బ్రశ్న వేసెను. "నీవు పలికినది సత్యము, కాని మాసిడను దేశములో నేనుండిన సమయమున, నొకనాటి రాత్రి నాస్వప్నములో నీమరాధికారివలె దుస్తులనుధరించిన పురుషుఁడొకఁడు నాకగుపడి నన్ను ఆసియాఖండమునకుఁ బోయి పారశీకరాజ్యమును జయింపుమనిచెప్పి తిరోహితుఁ డయ్యెను. ఆరూపమును వహించిన భగవంతునకు నమస్కరించితిని గాని అతనికి గాదు" అని విజయుఁడు ప్రత్యుత్తరము నిచ్చెను.

సాష్టాంగము పడియుండిన విజయుని లేవనెత్తి, అతనిని మరాధికారి కౌఁగిలించుకొనెను. అనంతరము వారుభయులు పాదచారులై పోయి దేవాలయములోఁ బ్రవేశించి 'జిహోవా' దేవునిఁ బ్రార్థించిరి. వారతనియొద్ద సన్మానితులై యుండిరి. అతఁడు కట్టించిన 'అలగ్జాండ్రియా' నగరములో వారు కాపురముండిరి. ఇటుల 'హీబ్రుల' రాజ్యము క్షణకాలము వెలిగి క్షీణించెను.

ప్రాచీనదేశచరిత్రలు

7-వ ప్రకరణము.


7
రోమము
కార్తేజి
ఆల్ప్సుపర్వతములు
కార్సికాదీవి
సార్డినియాదీవి
రోము
కాపువా
గ్రీసు
సిసిలీ
సిరాక్యూసు
స్పానియా
సాగంతము
మధ్యధరా సముద్రము
జిబ్రాల్టరు జలసంధి
కార్తేజి
ఆఫ్రికా
రోము
కార్తేజి

శ్రీ రస్తు.

కార్తేజి చరిత్ర.

సప్తమప్రకరణము.

ఇరువదిఎనిమిదవఅధ్యాయము.

క్రీ. పూ. సం. 850—146 రములు.

క్రీ. పూ. సం॥ 850-రములో 'ఆఫ్రికా'ఖండమున కుత్తరమున మధ్యధరాసముద్రతీరమున వర్తకవ్యాపారమును జరిపించుట కొకరేవు పట్టణమును స్థాపించుటకుగాను 'ఫొనీషియా' దేశవాసులు కొందఱు బయలువెడలిరి. వారా తీరమునకు వచ్చి రేవుపట్టణముఁ గట్టిరి. ఆపట్టణమునకు 'కార్తేజి' యని పేరుఁ బెట్టిరి, కాలక్రమమున నాపట్టణమునకు వచ్చిన వృద్ధిస్థితిలయములఁ జెప్పఁబోవుచున్నాము.

'ఫోనిషియా'లో 'టైరు'పట్టణములో నొకరాజు కలఁడు. అతనికి 'పిగ్మాలీయనుఁడు' అను కుమారుఁడును, 'డైడో' యను కూఁతురును కలరు. కొంతకాలమున కతఁడు స్వర్గస్థుఁ డయ్యెను. అనంతర మాతనికుమారుఁడు బాలుఁడైనను పట్టాభిషిక్తుఁ డయ్యెను, రాజు తరువాతి రాజంతవాఁడును 'హెర్క్యులెసు' దేవతాలయాధిపతియు నగు 'అసరుబేసుఁడు' అను వానిని 'డైడో' వివాహమాడెను. 'అసరుబేసు'ని గృహములో ధనము మూలుగుచుండెను, రాజు దాని నపహరించు నను భయముచేత నతఁడు దానిని భూస్థాపనముఁ జేసి దాచెను. ఆసంగతిని రాజు తెలిసికొని కుట్రఁజేసి బావమఱఁదిని జంపించెను, కాని, ధనము మాత్ర మాతనికి దొరకలేదు. భర్తృమరణమునకు 'డైడో' చాలదుఃఖించి, దుర్మార్గుఁడును క్రూరచిత్తుఁడైనయన్నగారిదేశమును విడిచిపోవలె నని యామె ప్రయత్నించెను. ఆమెతోఁగూడ నగరవాసులనేకులు కలిసిరి, రాజు

భయముచేత వారు బాహాటముగాఁ బోవుటకు శంకపడిరి, ఆమె దుఃఖమును మ్రింగి 'నాదుఃఖమునకు దరి కనఁబడదు. నీవు సమ్మతించిన, నీవద్దకు వచ్చి నివసించెద' నని తనయన్నగారికి జాబు వ్రాసిపంపెను. అందు కతఁడు సంతసించి సేవకులఁ బిలిపించి, నావలమీఁద నామె సామగ్రుల నెక్కించి ఆమెను తీసికొని రావలసిన దని యాజ్ఞఁజేసెను. రాజాజ్ఞప్రకారము సేవకులు సామగ్రులను పడవలలో నెక్కించి, 'టైరు' పట్టణమునకు వచ్చుటకు బదులు, ఆమెను తోడ్కొని మధ్యధరాసముద్రముమీఁదఁ బోయిరి. ఆమెయొక్క సౌందర్యాతిశయములచేత, భృత్యు లామె చెప్పినమాట ననుసరించి సంచరించిరి. వారట్టుల పోయి పోయి, కొంతకాలము 'సైప్రసు' ద్వీపములో విడిదిచేసిరి. అచట వారు నివసించి యుండినపుడు, 'జూపిటరు' దేవుని పూజారియు, మఱికొందఱు కన్యకామణులును వచ్చి వారిని కలిసిరి. అనంతరము వారందఱు సన్నాహమై 'ఆఫ్రికా' ఖండమునకుఁ బోయిరి. ఈకుట్రను రాజువిని, యాగ్రహించి, వారిం దరుమఁ బ్రయత్నించెను, కాని 'నీవువారిని నిరోధించిన నీకు విపత్తుసంభవించు' నని సోదివాక్యమును విని, రాజు భయపడి యూరకుండెను.

అనంతరము వారు తీరమున దిగిరి. ఆదేశవాసులకు సొమ్ము నిచ్చి, డైడో కొంతభూమినిఁ గొనెను. ఆభూమిని వారు సాగుఁజేయ నారంభింప, ఒకయెద్దుపుఱ్ఱ వారికి భూమిలో దొరకెను. 'ఇది సారవంతమైనభూమి, కాని, యిచట పట్టణముఁ గట్టిన, దానికిఁ జేటు ప్రతిష్ఠలు రానేరవు' అని పెద్దలు చెప్పినందున, వారాస్థలమును విడిచిపెట్టి, మఱియొకస్థలమునకుఁ బోయిరి. ఆస్థలమును కూడ వారు దున్నుచుండ, గుఱ్ఱపుపుఱ్ఱ వారికి దొరకెను 'ఇచటఁ బట్టణముఁ గట్టిన దానికిఁ గీర్తిప్రతిష్ఠలు వచ్చు'నని పెద్దలు చెప్పిరి, అంతటవారు పట్టణము గట్టి దానికి 'కార్తేజి' యని పేరుపెట్టిరి.

అనంతరము 'మూర్లు' అను దేశీయులరాజు 'డైడో'ను వివాహమాడఁ గోరను. 'కార్తేజి' పురవాసు లామెఁ జూచి, 'ఓమహారాణీ, 'మూర్లు' అనాగరికులు. కాన, వారిరాజును వివాహమాడి, యాదేశీయుల నుద్ధరింపవలెనని యామెను ప్రార్థించిరి. ఆమె పూర్వపువానిని కనుక పునర్వివాహమాడుట కామెను

మనస్సు కలుగలేదు. మనోభిప్రాయమును మనుజులకుఁ దెలియనీయక, పితృదేవతలకు బలుల నిచ్చి, పెద్దకాష్ఠమునకు నిప్పుఁ దగిలించి, దానిసమీపమున నామె నిలువఁబడి, 'ఓ కార్తేజిపురనివాసులారా! మీరు, నన్ను వివాహమాడి నా భర్తృగృహమునకుఁ బొమ్మని సెలవిచ్చితిరి. మీరు సర్వసుఖముల ననుభవింతురు గాక. చూడుము. నేను నాభర్తృగృహమునకుఁ బోవుచున్నా' నని చెప్పి, కాష్ఠము నెక్కి, కత్తితోఁ బొడిచికొని, యామె మంటలోఁబడి ప్రాణములను విడిచెను.

క్రీ. పూ. ఆఱవశతాబ్దమునుండియు 'కార్తేజి' పట్టణచరిత్రము రూఢిగఁ దెలియ నగును. ఆపట్టణము నొకన్యాయాధిపతి పరిపాలించు చుండెను. అపజయము నొందిన సేనాధిపతుల నామె దేశోచ్చాటనఁ జేసెను; మఱికొందఱికి మరణదండన విధించెను. 'కార్సికా' ద్వీపములోని 'గ్రీకు' నూతనసీమలవాసులతో నామె దండపట్లు పట్టెను, దినదినప్రవర్ధమానముగు 'రోము' రాజ్యముతో నామె శత్రు వహించెను. 'ఆఫ్రికా' ఖండమున కుత్తరమునందు యావత్ప్రదేశమును నామె యాక్రమించెను, 'సార్డీనియా' ద్వీపమును జయించెను, 'సిసిలి' ద్వీపములోఁ గొంతభాగములోను, 'మాల్టా' ద్వీపములో నామె మరము వేసెను. క్రీ. పూ. సం 525 రములో 'పారశీక' దేశము 'ఈజిప్టు' దేశమును జయించి, యామెపైకి దండెత్తి రాఁదలఁచెను గాని, యామెమిత్రదేశము 'ఫొనిషియా' 'పారశీకము' నకు సహాయముఁ జేయ నిష్టపడనేరగ. 'సిసిలి' ద్వీపములో నామె నూతనసీమలు విశేషముగ నుండెను, అచ్చటనె, గ్రీకుల నూతనసీమలు కూడఁ గలవు. ఈరెండుసీమలవారికిని, పరస్పరద్వేషములుపుట్టి హోరాహోరిని వారు జగడమాడిరి. ఆమె సీమలవారు 'హిమెర' యను గ్రీకులపట్టణమునుముట్టడించిరి. ఏనాఁడు 'పారశీకులు' సలామినుయొద్దములోఁ గాందిశీకు లయిరో, ఆనాఁడు 'హిమెర' పట్టణమువద్ద నామె సీమలవారు పరాభవము నొందిరి. ఆయాన నామె సేనాధిపతి స్వసైన్యములతో ఘోరముగ వెనుదీయకఁ బోరాడి వీరస్వర్గము నొందినందున, వారిపేరున గ్రీకులు రణరంగముమీఁదఁ గీర్తిస్తంభములఁ గట్టించిరి. మఱియొకసమయమున నామె సీమలవారు 'సెలినసు, హిమెర' ప

ట్టణములను ముట్టడించి, వానినిఁ బట్టుకొని. ఆపురనివాసులను, మూఁడు వేలమందిని నిర్హేతుకముగఁ జంపిరి. 'సిసిలి'ద్వీపములో సామ్రాజ్యముఁ బొందవలెనని యామె పెక్కుసంవత్సరములు పోరాడెను గాని, 'సిరాక్యూసు'పట్టణపురాజు బల్లెమువలె నుండి, ఆమెప్రయత్నములను సాగనీయలేదు. ఆమె సీములవా రొకసమయమున 'సిరాక్యూసు' పట్టణమును ముట్టడించి, పట్టుకొనుటకు సిద్ధపడిరి అప్పు డాపట్టణపురాజు 'ఆగతోక్లేశు'నకు డబ్బులేకపోయెను, పట్టణమును శత్రువులచేతిలోఁ బడవేయుటకు మనస్కరించలేదు 'కార్తేజి' పట్టణముపైకి దండెత్తిపోవలె నని ప్రయత్నించెను గాని ధనము లేదు. అప్పు డతఁ డొకకుట్రఁ బన్ని స్వనగరవాసులఁ బిలిచి, కష్టములు పడలేనివారందఱు పట్టణమును విడిచిపోవచ్చు నని వారితోఁ జెప్పెను. 'జీవన్భద్రాణిపశ్యతి' యని తలంచి భాగ్యవంతు లందఱు పట్టణమును విడిచి పోయిరి, అతఁడు వారిని పట్టికట్టి తెప్పించి వారిధనమును తీసికొనివారిని జంపెను. అనంతర మతఁడు పడవలమీఁద సైన్యములతోఁ బోయి 'కార్తేజి' పట్టణమును ముట్టడించెను, కాని ఆమెను సాధింపలేక పోయెను. ఇంతలో నామెసీములవారు 'సిరాక్యూసు' పట్టణమువద్ద నోడిపోయిరి.

ఈకాలములో 'కార్తేజి' నగరవాసుఁడు 'హానుఁడు' నౌకాయాత్రపై బయలుదేఱి, 'జిబ్రాల్టరు' జలసంధిని దాఁటిపోయెను కంచరజాతివారికి స్వనగరములోనివాసములు దొరకనందున వారికి నూతనసీములఁ జూపుట కతఁడు వెళ్లెను. ఆయాదేశములఁ జూచి, వారివారి రూపరేఖావిలాసములను, వేషభాషల నతఁడు వర్ణించి వ్రాసెను. 'ఒకదేశ మగ్నిహోత్రమయము. దానిమధ్య నగ్నిపర్వతమొకటి లేచి తారాపథమును ముట్టుచున్నది. అచ్చటి మనుజులు కోతుల వలె నుండిరి'. అని యతఁడు వ్రాసెను. 'శని' గ్రహదేవాలయములో నొకరాతి పలకపై, అతఁడు చూచినచిత్రము లన్నియు వ్రాయఁబడియున్నవి. ఆదేవాలయము 'కార్తేజి' పట్టణములో నున్నది. అనంతరము మఱియొకనౌకాయాత్రికుఁడు బయలువెడలి, 'ఐరోపా' 'ఖండమునకుఁ బశ్చిమమునఁ బోయి, ఉత్తర మహాసముద్రమువఱకును వెళ్లెను అతఁడు 'బ్రితను' ద్వీపములఁ జూచి యుండవచ్చును. అతఁడు చూచిచెప్పిన సంగతులను వినిన, మనస్సు దిగులు

పఱును. 'ఎటువైపుఁ జూచినను మంచుగడ్డలు తప్ప మఱియొకటి కానరాదు. వాయువు ప్రసరించుట లేదు. తెరవలె మంచు కప్పియున్నది' అని వ్రాసెను.

'కార్థేజి' పట్టణమునకు విశేషభాగ్యము వచ్చెను; ఆమెకు స్వాధీనులై యుండిన పట్టణములవారు కప్పములఁ గట్టుచుండిరి; 'స్పానియా' దేశములోను 'సార్డీనియా' ద్వీపములలోని ఖనులమూలమున ధనము వచ్చెను, 'వాణిజ్యవసతేలక్ష్మీః' యని, ఆమె వర్తకమువలన లక్ష్మీతులదూగుచుండెను. 'ఆఫ్రికా' ఖండమున నుత్తరతీరమున నుండువారందఱితో నామెకు వ్యాపారము తగిలి యుండెను. ఆనగరవాసులు వస్తుసామగ్రులఁ దీసికొని, 'జిబ్రాల్టరు' జలసంధికి సమీపప్రదేశమున రేవులో దిగి యొడ్డున తమవస్తువుల నుంచి, వారు తిరిగి పడవలలోనికి వచ్చుట కలదు. అప్పుడా దేశీయులు వచ్చి, ఆవస్తువులకుఁ దగిన వెండి బంగారముల నుంచి, కొంచెము దూరమునకుఁ బోవుచుండిరి. పడవలలోని వారు దిగివచ్చి, సమానమగు వెండిబంగారములను వారచ్చట పెట్టిన యెడల దానిఁ దీసికొని, వారు పడవల నెక్కి పోవుచుండిరి. ఆ వెండిబంగారములు సమానము కాకపోయినయెడల, వస్తువులగాని వెండి బంగారముగాని ముట్టుకొనక, పడవలలోనికి వచ్చిన పైని, ఆదేశీయులు గ్రహించి పూర్వముకంటె నధికముగ వానినుంచి దూరముగఁ బోవుదురు. అంతట వారు దిగివచ్చి దానిఁ దీసికొనియెదరు.' అని గ్రీకుల చరిత్రకారుఁడు 'హిరోడటసు' వ్రాసెను. ఆనగరవాసులు రంగుబట్టలు, గాజుపూసలు, వాడిలేని యాయుధముల నమ్మి, వెండిబంగారములను, దంతములను, మణులఁ దెచ్చుచుండిరి. క్రమముగ నాపట్టణము లక్ష్మీనివాస మయ్యెను. సామంతులు చీనిచీనాంబరములను ధరించిరి, వెలలేని మాణిక్యములహారములను వేసికొనిరి, సంపదకొలది చిన్నెలును వన్నెలును మెండయ్యెను, బలము క్షీణించెను, సంపదలు బహుళమగుట శరీరదార్ఢ్య నాశనముకొఱకు గాని మఱియొకటి కాదు. స్వనగరములో నుండిన వారు బలహీనులయిరి, విదేశములోనివారు బలముకలవారై పోరాడి కీర్తిప్రతిష్ఠలను సంపాదించుచుండిరి.

పునః 'సిసిలీ'ద్వీపము రణరంగ మయ్యెను, ఈసమయమున 'కార్తేజి' రోమక మహారాజ్యముతోఁ బోరాడవలసి వచ్చెను 'మామర్తేనుల'ని కొందఱు దొంగలు కలరు, వారాద్వీపములో నొకపట్టణముఁ బట్టుకొని, ఆపురవాసుల నందఱిని జంపిరి అప్పుడు 'సిరాక్యూసు' పట్టణపురాజు వారిని శిక్షించుటకు దండువెడలెను, ఆదొంగలు భయపడి, వారిలోఁ గొందఱు రోమకులను సహాయముకోరిరి, వఱికొందఱు 'కార్తేజి'నగరవాసుల సహాయముఁగోరిరి 'కార్తేజి'లోనివారు శీఘ్రముగ సైన్యములఁ బంపిరి, వారిసేనాధిపతి యాదొంగల దుర్గములోఁ బ్రవేశించెను. అంతలో రోమకసేనాధిపతి వచ్చి ప్రవేశించి దుర్బలుఁడగు 'కార్తేజి'సేనాధిపతి నోడించి, వానిఁ దరిమివేసెను ఇటు లపజయము నొందిన సేనాధిపతిని 'కార్తేజి' వారు చంపివేసిరి. రోమకులకును వారికి నీవిధమున యుద్ధమారంభ మయ్యెను ఉభయులకును మొదటజయాపజయములు సమముగ నుండెను. తుదకు రోమకులు జయించిరి. 'కార్తేజి'వారి నావలను వారు ధ్వంసముఁ జేసిరి, అంతటితో వారి నౌకోన్నత్యమునకుఁ బాటువచ్చెను. రోమకసేనాధిపతి 'రగ్యులసు' సైన్యములతో 'ఆఫ్రికా'ఖండమునకుఁ బోయి 'కార్తేజి'నగరమును ముట్టడించెను ఆనగరవాసులు చెప్పలేని శ్రమలఁ బడిరి, భుజించుటకుఁ బదార్థములు లేకపోయెను పట్టణములో నెటువైపుఁ జూచినను పీనుగుపెంటలు కనఁబడెను, ప్రతిగృహములోను రోదనము తప్ప మఱియొకటి వినఁబడదు, వారికి నిద్రాహారములు లేవు వారిసైన్యములలోఁ గొందఱు 'స్పార్టయదేశ' సైనికులు వేతనములఁ బుచ్చుకొని యుద్ధముఁ జేయుచుండిరి. వారిలో 'జాంతిపసు' అనువాఁడు సర్వసేనాధిపత్యమును వహించి, సైనికుల నుత్సాహించి, వ్యూహముఁ బన్ని, రోమకులపైకిఁ బోయి యుద్ధముఁ జేసి వారి నోడించి వారిసేనాధిపతి యైన 'రగ్యులసు'ను పట్టుకొనెను. అనేకసంవత్సరములవఱకు వారాసేనాధిపతిఁ జెఱసాలలో నుంచిరి. 'నేను రోమునగరమునకుఁ బోయి మీయుభయులకును సంధిఁ జేసెదను లేనియెడల, తిరిగివచ్చెద'నని 'రగ్యులసు' చెప్పినందున, స్వదేశమునకుఁ బోవుటకు వారతనికి సెలవిచ్చిరి. అతఁడు 'రోము' నగరమునకు వెళ్లి, 'సెనెటు' సభవారియెదుట నిలిచి 'ఓసభ్యులారా!

నేను 'కార్తేజి' వారి చెఱసాలలో నుండి వచ్చితిని. మీతో సంధిఁ జేయఁగోరి వారు నన్నుబంపిరి. కాని మీరు సంధిఁ జేయకూడదు మీరు వీరులును శూరులును కనుక వెనుదీయరాదు — అర్ధప్రాణములను వారవోసి మీరు వారికూపమును మాపివేయవలెను. ఆడినమాటఁ దప్పను కనుక, నేను వారదేశమునకుఁ బోయి వారచేతిలోఁ బడిచచ్చి స్వర్గస్థుఁడనయ్యెద. మీకు శుభం బగుగాక' అని యుపన్యసించి, అతఁడు 'కార్తేజి' పట్టణమునకు వచ్చెను. సంధిఁ జేసికొని రానందున వారతనినిఁ జంపివేసెరి ఆ యుద్ధమంతటితోఁ జల్లారెను, రోమకులకుఁ దమనావశక్తిని వినియోగింపవలసివచ్చెను 'కార్తేజి' వారు ప్రాణముల దక్కించుకొనిరి. 'సెసలీ' ద్వీపముతో వారికేఁ బ్రసక్తి యేమియు లేకపోయెను.

'కార్తేజి' వారి వలన వేతనములఁ బుచ్చుకొని, యుద్ధముఁ జేయుటకు నానాదేశీయులు వారిసైన్యములోఁ బ్రవేశించియుండిరి. వారందఱు గుమిగూడి 'కార్తేజి' పైఁ దిరుగబడిరి 'హామిల్కారుబార్కా' యను వాఁడు వారిగర్వము నణచెను అనంతర మతఁడు స్వనగరమునకు వచ్చిన నీచస్థితికి దుఃఖపడి, ఆమె నుద్ధరించుటకు సైన్యములతో 'స్పానియా' దేశమునకుఁ బోయెను. మఱి తొమ్మిదిసంవత్సరములవఱకు నతఁ డెచటనుండెనో వారికిఁ దెలియలేదు ఈలోపున నతఁడు 'స్పానియా' దేశమును క్రమక్రమముగ స్వాధీనముఁ జేసికొని స్వనగరమునకుఁ గీర్తిప్రతిష్ఠలఁ దెచ్చెను ఆదేశములోని బంగారువెండిఖనులఁ ద్రవ్వించి, యాలోహముల నతఁడు స్వనగరమునకుఁ బంపను 'కార్తేజి' నగరమునకూడ నొకరాజ్యమును స్థాపించు 'నూతనకార్తేజి' యను పట్టణమును 'స్పానియా' దేశములో నతఁడు కట్టించెను మఱికొంతకాలమున కతఁడు స్వర్గస్థుఁ డయ్యెను అనంతర మతని యల్లుఁడు 'హాసుడ్రూబలు' మానావలె దేశములఁ గొట్టి వానిని సాధించుచుండెను — ఈలోపున 'హామిల్కారు'ని కుమారుఁడు పెద్దవాఁ డయ్యెను తండ్రి స్వనగరమును విడిచిపెట్టి కాలమునకు వాఁ డెనిమిదిసంవత్సరముల ప్రాయము వాఁడు. వాఁడు తండ్రితోఁ బోనిశ్చయించెను కాని, తండ్రి వానిని నివారించి, దేవాలయమునకుఁ దీసికొనిపోయి 'ఓయిచిన్నితండ్రీ! నావలెనీవకూడ యావజ్జీవము రోమనులతో వైరముపాటిం

వు'మని బోధించి, యా బాలుని చేత దేవునియెదుటఁ బ్రమాణముఁ జేయించి, వానిని గృహములో విడిచిపెట్టి యతఁడు 'స్పానియా' దేశమునకుఁ బోయెను. ఆబాలుఁడే 'హానిబలు' అనిపేరు కలవాఁడు. అతనికిఁ దండ్రిమరణమునాటికి పదునెనిమిదిసంవత్సరములు ప్రాయము వచ్చెను. దేహపరిశ్రమజేసి యుండినందున, నతనిశరీరము దృఢముగ నుండెను. తండ్రివలె నతఁడు కష్టపడుటకు సిద్ధమయ్యెను అతని రూపరేఖావిలాసములఁ జూచి సైనికులు భ్రమపడి, యతని మాట ననుసరించి సంచరించిరి. సైనికవృత్తి నవలంబించి జీవించుట కతఁడుద్యుక్తుఁడాయెను.

అంతలో 'హాసుద్రూబలు' పరలోకగతుఁ డయ్యెను అమాటను విని 'హానిబలు' స్వనగరమును విడిచి 'స్పానియా' దేశమునకు వచ్చి సర్వసేనాధిపత్యమును వహించెను. ఆదేశములో రోమకపోషవర్గములో నుండిన 'సాగంతము' అను పట్టణము నతఁడు ముట్టడించెను. కొంతకాలమున కాపట్టణము నతఁడు సాధించెను. ఈవార్తను విని, రోమక 'సెనేటు' సభవా రతనితో యుద్ధముఁ జేయ సిద్ధపడిరి.

అతఁడు సైనికులఁ బిలిచి 'ఓసైనికులారా, మీరు విశేషము శ్రమపడితిరి. కనుక కొంతకాలము విశ్రమించి జనసత్త్వములఁ దెచ్చుకొనుఁడు. వసంతకాలము రాఁగనే, మీరాయుధపాణులై వచ్చిన, మనము గొప్పయుద్ధమునకుఁ బోయెదము. అందువలన మీకుఁ గీర్తిప్రతిష్ఠలు వచ్చు' నని చెప్పి వారిని బంపివేసెను

ఋతుధర్మములు మారెను. వసంతకాలము వచ్చెను. స్వగృహములనుండి సైనికు లాయుధపాణులై యుద్ధమునకు సిద్ధపడిరి 'స్పానియా' దేశసంరక్షణార్థము తగుమాత్రము సైనికులను తమ్ముఁడగు 'హాసుద్రూబలు'నకు వప్పగించి మిగిలిన సైన్యములతో నతఁడు 'రోము' నగరముపై దండువెడలెను. మార్గములో నుండిన దేశములను జయించి, 'ఇటాలియా' దేశమున కుత్తరమున నుండిన 'ఆల్ఫ్సు' పర్వతశ్రేణి సమీపమున కతఁడు వచ్చెను. అపర్వతశ్రేణులనుదాటుట యెటులు? కొండదారులఁ జూపువా రెవరు? చీమలు దూరనిచిట్టడవులను,

కాకులు దూరని కారడవులను దాటివచ్చుటకు మార్గములు కానబడవు, నదుల దాటుటకు వంతెనలులేవు, కొండలోపలగుండఁ బోవు విధమేది? ఏనుఁగులు, గుఱ్ఱములు, లొట్టియలు, కొల్బలములు, రథములు—ఇవి యెన్నియో నడచుట యెట్టులు? ఋజుమార్గముఁ జూపు వారెవరు? తెప్పదారులఁ బోయి చిక్కులలోఁ బడిరి ఎన్నిచిక్కులు వచ్చినను భగవంతుని కృపకలిగినవానిని దాటవచ్చును. అన్నికష్టములఁ బడి వానాపర్వతములను దాటి 'ఇటాలియా' దేశములోఁ బ్రవేశించిరి.

'ఆల్ఫ్సు' పర్వతశ్రేణులనుదాఁటి వచ్చునంతటి సాహసుఁడు లేఁడని రోమనుల నమ్మకము; అందుచేత వారు యుద్ధమునకు సన్నాహముఁ జేయకయూరకుండిరి— సైన్యములతో నతఁడు దేశములోనికి వచ్చెనని విని, అతనిసాహసము గొనియాడి, రోమనులు గుండెలఁ గొట్టికొనిరి అప్పుడు వారు తత్తరమున సైన్యములఁ గూర్చి రణమున కాయత్తులయిరి. గొప్పసేనాధిపతితోఁ గలిసి రోమనులు యుద్ధముఁ జేసిరి, కాని, ప్రథమమున నపజయముఁ బొందిరి. రెండవ యుద్ధమున వచ్చినవారిసేనాధిపతి చాకచక్యము లేనివాఁడు గనుక, రోమనులను మరల శృంగభంగ మాయెను. ఇట్టుల జయప్రదుఁడై 'హానిబలు' దక్షిణాభిముఖుఁడై 'రోము' నగరముపైకి దండువెడలెను రోమకసేనాధిపతులు సమయోచితముగ చతురంగ బలములను నడిపింపుటకు సమర్థులయ్యును 'హానిబలు'యొక్క తెలివితేటలకును చతురతకును వారు నిలువలేక పోయిరి. 'టాసిమీను' సరస్సుసమీపమున మూఁడవ యుద్ధము జరిగెను. అందులోఁ గూడ రోమనుల కపకీర్తి వచ్చెను. అంత నంతట 'హానిబలు' రోము నగరము పైకి వచ్చుచుండెను, 'సెనటు' సభవారు దిగులుపడిరి; వారు ప్రాణముల నరచేతులలో నుంచికొనిరి. వారు సర్వసేనాధిపత్యమును 'ఫేభియసు' అనువానికి నిచ్చి వారతని యుద్ధమునకుఁ బంపిరి. అతఁడు ముఖమున కెదురునిలిచి యుద్ధముఁ జేయఁడు, ఎప్పుడు నతఁడు దొంగయుద్ధముఁ జేయును. అతనికి 'మాయలమారి' యని పేరు వచ్చెను. ఎంతవఱకైనను వెనుకనుండియు ప్రక్కలనుండియు దొంగపోటులు పొడుచుచు, శత్రువులకుఁ జికాకు పుట్టించును—ఈవిధ

మన మెంతకాల మతఁడు శత్రువుల నరికట్టఁగలఁడు? పవనప్రేరితములైన మేఘములవలె వారు పోవుచుండిరి. ఏసమయమున గుబాలున రోమునగరముపైఁ బడెనో యని సభవారు భయపడిరి, 'ఫేబియాసు' చేసిన దొంగపోటులు వారికి సహ్యము కాలేదు. అతనిని పిలిపించి, సేనాధిపత్యమును 'వారో' అను నతనికిచ్చి, వారతనిని శత్రువుపైకిఁ బంపిరి రోమక సైన్యములఁ జూచి 'కార్తేజి' సైన్యములు కంపించెను గాని 'హానిబాలు' వారినిఁ బురికొలిపి శౌర్యము నెక్కించెను. ఉభయసైన్యముల వారు హోరాహోరని సంగ్రామముఁ జేసిరి, ఇదియే 'కానేయి' యుద్ధము. ధైర్యముఁ బోగొట్టుకొని, చీకాకుఁబడి, వెనుకకుఁ దిరుగక రోమకులు పాఱిపోయిరి. 'కార్తేజి' సైన్యములకు జయము కలిగెను. 'ఇఁక నాలుగు రోజులలో మనము 'రోము'నగరములో 'కాపిటలు' ప్రాసాదములో భుజింపఁగలమని 'హానిబాలు' సైనికులతోఁ జెప్పెను.

రోమునగరము సునాయాసముగఁ బట్టుబడునను నమ్మకము 'హానిబాలు'నకు లేదు 'కానేయి'యుద్ధముతో నతనికి దశతిరిగెను, ఇఁకను దుర్దశలు ప్రవేశించెను. 'ఇటాలియా' దేశములోని మధ్యదక్షిణ భాగము లతనికి స్వాధీనమయ్యెను, 'కాపువా' రేవుపట్టణమువా రాహ్వానముఁ జేసి నగరములో నతనినిఁ బ్రవేశపెట్టిరి కనిష్ఠభ్రాతయైన 'మగుడ'ను వానిని 'కార్తేజి'పట్టణమున కతఁడు పంపెను. అతఁ డాపట్టణసభవారి యెదుట నిలిచి, 'ఓసభ్యులారా! మేము 'ఇటాలియా' దేశములో యుద్ధముఁ జేసి మేము సంపాదించిన బంగారు వస్తువులఁ జూడుఁడు. ఇదియంతయు తమనిమిత్తమే మేము పాటుఁబడుచున్నాము' అని యుపన్యసించెను.

అప్పుడు 'కాపువా' పట్టణములో నుండినసమయమున రోమకసైన్యములు వచ్చి యాపట్టణమును ముట్టడించెను. అతఁడు సైన్యముతోఁ గూడ 'రోము'నగరముపైఁ బోఁదలచెను గాని వర్షములచేత మార్గములు చెడినందున నతఁ డాప్రయత్నమును విడిచిపెట్టెను. రోమకులు స్వదేశములో నపజయముఁ బొందుచుండినను, విదేశములలో వారు జయముఁ బొందిరి.

ఇదివఱకే 'సిసిలీ'ద్వీపమును రోమనులు స్వాధీనముఁ జేసికొనిరి. రోమక సేనాధిపతులును భ్రాతృలు నగు 'జ్యేష్ఠ కనిష్ఠసిపియో' లనువారును 'స్పానియా' దేశమును నాక్రమించుకొన నారంభించిరి, వారియెదుట 'హాసుద్రూబలు' నిలువలేక పోయెను వారిలో నొకఁడు 'స్పానియా' దేశమును 'కార్తేజి'నగరమును స్వాధీనముఁ జేసికొనియెద ననిశపథముఁ జేసెను. 'కార్తేజి'నగరమునకు స్నేహితుఁడగు రాజొకఁడు 'ఆఫ్రికా'లోఁ గలఁడు, అతనితో స్నేహము జేయుటకు 'సిపియుల'లో నొకఁ డతనినగరమునకుఁ బోయెను. 'కార్తేజి'నగరమునుండి రాయబారి యొకఁ డాసమయమునను రాజభవనములో నుండెను. మొదటివాఁడు నూతనముగ సఖ్యముఁ జేయఁగోరి వచ్చెను, రెండవవాఁడు పూర్వపు స్నేహితుఁడు వారియుభయుల మాటలను రాజు వినెను వారిలో నెవరితో నతఁడు సఖ్యముచేసిన వారికి జయము కలుగును. 'కార్తేజి' నగరపు రాయబారి తనపుత్రి 'సొఫొనిస్బా' ను వెంటఁదీసికొని వచ్చెను, ఆమె పరమసుందరాంగి. 'స్త్రీ వేష మాత్రే దుర్గ్రహం నిగ్రహం హృదయానామ్' అను సూత్రము నామెచూపులలోఁ జిక్కుపడి, 'కార్తేజి'నగరముతో రాజు స్నేహముఁ జేసె, ఆమెను వివాహ మాడెను రోమనులతో రాజు సఖ్యముఁ జేయనందున, 'సిపియుఁడు' దేశమును విడిచి పోయెను

ఇంతలో 'హానిబలు'ను 'ఇటాలియా' దేశములోఁ గొన్నిదినములు వచ్చెను ఆదేశములో శీతోష్ణస్థితుల నతనిసైనికులు నిలువలేకపోయి కొరవడిరి. హతశేషులు యుద్ధముఁ జేయలేక యుండిరి, అతనితమ్ముఁడు 'ఆల్ఫ్స్'పర్వతములను దాటి సైన్యములతో నమ్ముమండెను అన్నకుఁ దనరాకఁ దెలుపుటకై యతఁడు జాబు వ్రాసిపంపెను, కాని, యాజాబును రోమకసేనాధిపతి పట్టుకొని, సేనలతో నతఁడు 'హాసుద్రూబలు'న కెదురునడిచి. వానితో యుద్ధముఁ జేసి వానిఁ జంపెను. వానిసైనికులు రోమనులకగపడఁ జొచ్చిరి. సోదరుని మరణమును విని 'హానిబలు' కడుదుఃఖించి చింతాక్రాంతుఁ డయ్యెను గాని దీనుఁడు కాలేదు. మఱియొకఁడైనను దిగులుపడును గాని, అతఁడు దిగులు పడలేదు, దైన్యముఁ బొందలేదు, శరణనలేదు, దేశపారి కాలేదు. అతని ధైర్యస్థైర్య

ములఁ గొనియాడఁదగెను. ఆతనిసైన్యము లయినను తిరుగఁబడ లేదు; ఆతని సైనికుల కతనియందలి భయభక్తులు పోలేదు, వా రతనియాజ్ఞలను శిరసావహించు చుండిరి. దేశమును జయించుటకు నిరాశఁ జేసికొనినను, మూడుసంవత్సరములతఁ డాదేశములో నుండెను. అన్నికాలములలో నతని శిబిరము నిశ్శబ్దముగ నుండెను.

ఈలోపున 'సిపియోఁడు' సముద్రమును దాటి 'కార్తేజి' నగరమున కెదురుగ శిబిరమును వేసి దండు విడెను. ఆతఁడు తంత్రముఁ బన్ని శత్రువులశిబిరముఁ దగులఁబెట్టించెను 'నీవు నీసైన్యములతో స్వనగర రక్షణార్థము శీఘ్రము రావలెన'ని 'హానిబలున'కు జాబు వ్రాసి, కార్తేజినగరమువారు పంపిరి. ఆతఁడాజాబుఁ జూచి, పళ్లు పటపటఁగొఱికి చేయునది లేక, దుఃఖపడి, 'ఇటాలియా' దేశమును జయింపలేక, స్వనగరమునకుఁ బోయెను.

అచట "సిపియోఁడు" సమరసన్నాహముఁ జేసి, వ్యూహముఁ బన్ని సిద్ధముగ నుండెను. హానిబలు సైనికులం జూచి 'ఓసైనికులారా! మీరు నాబిడ్డలు. నామాట నతిక్రమింపక సంచరించితిరి, కీర్తిప్రతిష్ఠలు మీవలననే నాకువచ్చినవి. నేఁడుకూడ మీవీరమును బింకమును చూపి సామ్రాజ్యవిజయమును పొందుదురు గాక" అని యుత్సహించెను. ఉభయసైన్యములును బింకముతోఁ బోరాడెను విజయలక్ష్మి రోమకులపక్షమున నుండెను, 'కార్తేజి' సైన్యములు చకాచకలై పాఱిపోయెను. 'హానిబలు' తగుపాటి సైనికులతోఁ బోయి నగరములోఁ బ్రవేశించెను. నగరము సభవారుగాని మనుజులుగాని విశేషముగ నతనిని మన్నించలేదు. రోమకులు శాసించిన విధమున నానగరము వారు సంధిమాటల కొడంబడిరి. "కార్తేజి" వారి యోడలన్నియు తగులఁ బెట్టఁబడెను. రోమకులకు వారు విశేషముగ ధనము నిచ్చుకొనవలసివచ్చెను. అర్థప్రాణములఁ గోలుపోయి, 'కార్తేజి' నగరము దైన్యము నొందెను. స్వనగరము వారుచేసిన పరాభవమునకుఁ జింతించి 'హానిబలు' నగరమును విడిచి పోయెను. ఆసంగతి యెవరికిని తెలియదు. 'మహా అలగ్జాండరు' యొక్క సేనాధిపతి వంశములోనివాఁడగు 'ఆంటియోకసు' అను 'సిరియా'దేశపురాజు

రోమనులతో యుద్ధముఁ జేయుచుండ 'హానిబలు' వానితోఁ గలిసి సమరమునకుఁ బోయెను.

క్రీ. పూ. సం 191 రములో 'అంటియోకసు' వ్యూహముఁ బన్ని 'మాగ్నిషియా' పట్టణము నద్ద వేచియుండెను. అంతలో రోమనులు వచ్చిరి. ఘోరయుద్ధము జరిగెను. రోమనులు జయముఁ బొందిరి. రోమనులు సంధిమాటలను శాసించి, 'నీవు మాకు హానిబలుని యొప్పగించవలె' నని వారరాజుతోఁ జెప్పిరి. ఆమాటను విని, యెవరికిఁ జెప్పక, 'హానిబలు' పాఱిపోయెను. మఱి కొంతకాలమునకు 'ఆశియామైనరు' లో నతఁడు యుద్ధముఁ జేయుచుండెను. రోమను లాపక్షమువారికి వర్తమానముఁ బంపి, వానిని యొప్పగింపు మనిరి. ఆమాటను విని 'హానిబలు' గుండెలు ఝల్లుమనెను. అప్పటికి స॥ 65 రముల ప్రాయము వచ్చెను వృద్ధాప్యము సన్నిహిత మయ్యెను, అందఱు శత్రువులు గాని మిత్రులతనికిలేరు. అతఁడు లోకకంటకుఁ డయ్యెను. స్వచరితమును స్మరించుచు, విషముఁద్రాగి 'హానిబలు' మృతినొందెను.

అతఁడు చనిపోయిన తరువాతనైన, 'కార్తేజి' నగరమువారు భృత్యులై యుందురను నమ్మకము రోమనులకు లేదు. కొంతకాలమునకు నగరమువారు ధనసంపన్నులయిరి. దేశములఁ బుష్టిఁ జేసికొనిరి. వారినిఁ జూచి యందఱు కంటగించిరి. మదించి కొమ్ములు తిరిగిన పొట్టేలువలె 'కార్తేజి' నగరము రోమనులకుఁ గనఁబడెను వారు దానిరూపుమాపివేయుటకుఁ దలఁచి, సమయమునకు వేచుచుండిరి. ఆసమయముకూడ వచ్చెను రోమనులసెలవులేక, "'కార్తేజి' నగరమువారు పరులతో యుద్ధమునకుఁ బోయిరి. అందుచేత నానగరమును ధ్వంసముఁ జేయవలెనని రోమకు 'సెనెటు' సభవారు శాసించిరి ఆమాటనువిని నగరమువారు తెల్లపోయిరి. "ఓరోమనులారా! మీరుచెప్పిన ప్రకారము సంచరించెదము. మాపట్టణమును ధ్వంసముజేయకుఁడు" అని వారు ప్రాధేయపడిరి. "మాపరతులకు మీరు యొడంబడిన, మీపట్టణమును నాశనముఁ జేయము. మీయొద్దనుండిన కత్తికటారములను, ధనుర్బాణములను మాకిచ్చివేయవలెను.

మూఁడువందలు సామంతకుటుంబములోనిపురుషులను మాకు జామీను నియ్య వలెను" అనిరోమకులు వర్తమానముఁ జేసిరి. నగరమువారా షరతుల ప్రకారము నడచిరి కొంచెమురోజులు గడచినతరువాత నగరములో సైన్యముతో నివసించు చుండిన రోమకసేనాధిపతి నగరవాసులను సమావేశముఁ జేసి, "ఓనగరవాసులారా! మీరు షరతుల ప్రకారము నడచితిరి కాని రోమకసభవారు మీపట్టణమును నేలంగలిపివేయు మని యుత్తరువుఁ జేసిరి. కనుక పట్టణమును విడిచి మీరు పోవలెను" అని వారితోఁ జెప్పెను. ఆపట్టణమునకుఁ బదిమైళ్లదూరమున నెచటనైన వారునివసింపవచ్చునని యాతఁడు చెప్పెను.

'కార్తేజి' వారావర్తమానమును విని 'మేముమాగృహములను నగరమును విడువము మీతో యుద్ధముఁ జేయుదు'మని చెప్పి రోమకసేవకునిఁ దఱిమివేసి, నగరబహిర్ద్వారకవాటములను బిగించి, యుద్ధసన్నద్ధు లయిరి కొందఱు కత్తిశుగారములను, వెఱికొందఱు బాణములను, తదితరులు బల్లెములను, సానవెట్టిరి కొందఱు ధనుస్సులను నారి తగిలించిరి స్త్రీపురుషులు రాత్రింబవళ్లు శ్రమపడిరి. ఇంతలో రోమకసైన్యములు తీరమున దిగెను, వారు పట్టణమును ముట్టడించిరి అహోరాత్రములు వారు పోరాడిరి. 'కార్తేజి' నగరము వారికి చీమురక్తములు చల్లారెను. వారిలో బలములేదు, దుఃఖములచేతఁ గృశించిరి. నిద్రాహారములు లేక నిరసించిరి. రోమకులు నగరప్రాకారముల నెక్కి లోఁదిగి బహిర్ద్వారకవాటములఁ దెఱచిరి. బాహాటముగ రోమకసైన్యములు నిరాటంకముగ నగరములోఁ బ్రవేశించెను ఎటువైపుఁ జూచినను పీనుగుపెంటలుతప్ప మఱియొకటి కానరాదు. వారిగృహములను రోమకులు తగులఁ బెట్టిరి. శరణుఁ జొచ్చిన వారిని రక్షించిరి నగరము వారితోఁ గలిసి 900 రోమకులు, రోమకసైన్యములతోఁ బోరాడిరి.

తమరిని మాత్రము రోమకసేనాధిపతి రక్షింపఁడని తెలిసికొని, వారును భార్యాపుత్రాదులతోఁ గూడ నగరనాయకుఁడైన 'హాసుడ్రూబలు' అనువాఁడును—వీరందఱును గూడి, యొకదేవాలయములోఁ బ్రవేశించి, దానికవాట

ములను బిగించి లోన మానము వేసికొని యుండిరి. పిరికిపందయైన 'హాసుద్రూబలు' వారికిఁ దెలియకుండ పాఱిపోయి, రోమకసేనాధిపతియైన 'సిపియో'ని పాదములమీదఁ బడి ప్రాణముల రక్షింపుమని ప్రార్థించెను. 'సిపియోఁడు' పరమానందమునొంది, తనసైనికులకు వానినిఁ జూపించెను. అంతలో దేవాలయములోనుండి మంటలు బయలు వెడలెను. ఇరుప్రక్కల నిరువురు పిల్లలఁ దోడ్కొని, 'హాసుద్రూబలు' భార్య ముందుకు నడచివచ్చి 'ఓరోమకసేనాధిపతియైన సిపియోఁడా, నీవు వీరధర్మము ననుసరించితివి ఈగురవస్థకు నిన్ను శిక్షింపు మని భగవంతుని నేను ప్రార్థింపను. దేశమునకును దేవతలకు ద్వేషియయి మిత్రులకుఁ గపటియయి, భార్యాపుత్రాదులకు ద్రోహియైనట్టి నాభర్తయైన 'హాసుద్రూబలు'ని నీవును భగవంతుఁడును శిక్షించుదురు గాక! అని యామె 'సిపియో' నితోఁ జెప్పి భర్తనుచూచి, 'ఓరిద్రోహీ! ఓరిపాపి! నీవు పిఱికిపందవు, నీవు విరుల సేనాధిపతివి, అటువంటి నీవు నేఁడు రోమకసేనాధిపతియొక్క విజయము నలంకరించి రోమునగరములోఁ బ్రవేశింపఁగలవు చూడుము. మేమీ మంటలలోఁబడి స్వర్గముఁ జూఱకొందుము' అని చెప్పి పిల్లలతో నామె మంటలలోఁ బడెను. నగరజననకాలమున నొక స్త్రీరత్నమగ్నిలోఁబడి బలవన్మరణము నొందెను, దాని వినాశకాలమున నాతియొక స్త్రీరత్నము పౌరుషముఁ జూపి అగ్నిలోఁ బ్రవేశించెను.

ఏడుశతాబ్దములవఱకు నానగరము సిరిసంపదలతోఁ దులదూఁగెను. ఆమెను జూచి కంటగింపనివారు లేరు. 'ఇరుగమ్మ సరిగఁబెట్టుకొనిన పొరుగమ్మ ఉరిబెట్టుకొనెను' అని చెప్పినవిధమున నానగరము ధనధాన్యాభివృద్ధిగలిగి యుండ పరులు చూడలేక తమకంటిలో జీడిఁబెట్టుకొనిరి. ఆనగరమును నేలమట్టముఁ జేసినపుడు, 'సిపియోఁడు' చూచి కన్నీరుఁ గార్చెను. 'అయి ఖలువిషమః పురాకృతానాం భవతి హి జంతుషు కర్మణాం విపాకః.' అని చెప్పినవిధమున జరుగుచుండును.

ఉద్యానములతోను ప్రాసాదములతోను, భవనములతోను, ప్రాకారములతోను, సరోవరములతోను, రాజ్యలక్ష్మితోను, ధనలక్ష్మితోను, జయలక్ష్మితోను గూడిన నగరముయొక్క రూపముమాసిపోయి నేలఁగలిసెను. దానిరూపరేఖావిలాసము లీవిధముననుండె నని చెప్పుటకు వీలులేదు, దానిని పునర్నిర్మాణముఁ జేయకూడ దని శాపముఁ బెట్టిరి.

ప్రాచీనదేశచరిత్రలు

8-వ ప్రకరణము.



8
పెర్షియా
అరేబియా
సింధునది
హిమాలయపర్వతములు
గంగానది
ఇండియా
అరేబియా
సముద్రము
బంగాళాఖాతము
సింహళము
హిందూమహాసముద్రము
ఫసిఫిక్కు
మహాసముద్రము

ఇండియా, చీనా.

శ్రీరస్తు

చీనాదేశచరిత్ర

అష్టమప్రకరణము.

ఇరువదితొమ్మిదవ అధ్యాయము.

క్రీ. పూ 2900 మొదలు సం. 100 రము వఱకు.

చీనాదేశము, ఆదేశీయులు, వారియాచారవిధానములు, విదేశీయులకసందర్భముగఁ గనఁబడును. అనేక శతాబ్దములనుండి వారు నాగరికులై యుండిరి; కాని, వారి దేశాచారములను, వారియాలోచనలను జూచినయెడల, ననాగరికత వారిలోఁ గలదని తెలియును. వారికి శాస్త్రజ్ఞానము విశేషముగనుండినను, దానిని లిఖితపూర్వకముగ నుంచుటకుఁ దగినభాష వారికిలేదు. దేశములో ననేకకోట్ల ప్రజలు నివసించియుండినను, రాజ్యాధికారులయెడల వారు తృణప్రాయులు. ఆదేశము విశాలము, జనసంఖ్య బహుళము. జనులకు భేషజము మెండు, చూపరులకు వారియౌన్నత్యము తేటయగును. కాని, నిజముగ వారు ప్రాచీనులు, అభివృద్ధియను మాటవారికిలేదు, వారు నవనాగరికులు కారు; "ఇంతవఱకే కాని, ముందుకు నడుచుట కూడదు" అనియొకరు శాసించినట్లు, వారు నేటివఱకు బాల్యదశలోనుండిరి కాని, యౌవన కౌమార దశలు వారికిఁ గలుగలేదు. వారి దుర్దశ యేమని చెప్పవచ్చును? ఇప్పుడిప్పుడు వారు తెలివిఁ దెచ్చుకొని, నవనాగరికమార్గములఁ ద్రొక్కుచుండిరి. ఈదేశచరిత్రమును ముందు విశదముగ వ్రాయుచున్నాము

చీనాదేశవాసులకు దురభిమానము మెండు: విదేశీయులతో వారు కలుపుగోలుఁదనముగఁ దిరుగరు, లోకములో వారే బ్రహ్మాండనాయకులమని, వారి

దేశమే, కలియుగమైయుండెనని, వారి యభిప్రాయము. ప్రపంచములో నన్ని దేశములకంటె ముందు వారిదేశమే, జనులతో నిండియుండెనని వారుతలంచెదరు. ప్రథమమున, దేవతలే, వారి రాజులనియు గురువులనియు, వారే సకలశాస్త్రములును కళలను వారికి బోధించిరనియు, వారి నమ్మకము. ఈశాస్త్రములలోను, కళలలోను వారికి విశేషము ప్రవేశములేదు. ప్రథమమున, వారికి శాస్త్రజ్ఞానము విశేషముగ వారివలనవచ్చియుండవలెను, లేదా అవిదేశీయులు వీరికి శాస్త్రమును గొంచెము చెప్పియుండవలెను, ఏదియెట్లుండినను, బాల్యదశను వలె, వారి శాస్త్రజ్ఞానము మట్టుపడెను గాని, వృద్ధినొందలేదు.

చీనాదేశస్థులు, ఆర్యకుటుంబములోని వారు కారు, ఈమాట నిశ్చయము. అనేకవిషయములను బట్టి యాలోచించి, చూడ, ప్రాచీనచాల్డియా (Ancient Chaldia) దేశీయులగు "సుమరిఅలు"ను (Sumarians) చీనావారును బంధువులనితోఁచుచున్నది, వ్యాకరణప్రకారము ఇతరదేశీయులవలె, వారుబాల్యదశలోఁ బశ్చిమమునకుఁ బ్రయాణముచేయుచు జరుగక, తూర్పున వచ్చి, ఆసియాఖండపూర్వభాగము నాక్రమించిరి. ఈతూర్పుదేశము లంతయుఁ బూర్వమే, మంగోలియనులచే నాక్రమింపఁబడియుండెను, ఒకవేళ, క్రొత్తగ దేశమునకు వచ్చినవారు బలపరాక్రమములచె మంగోలియనుల నోడించి, దేశమును స్వాధీనముఁ జేసికొని యుండవలెను, లేక, వారలను సంబంధబాంధవ్యములం జేసికొని, సమిష్టిగనుండియుండవలెను, ఏదియైనను క్రొత్తగవచ్చిన వారు మాత్రము దేశములోఁ గాపురముండిరి. చాల్డియా దేశమును వారువిడిచిపెట్టినపుడు, ఆదేశీయులశాస్త్రములను గాని, కళలను గాని, లెస్సగ నభ్యసించియుండలేదు. వారిజ్ఞానమైనను వారికి విశేషములేదు, ఇట్టిమిడిమిడి జ్ఞానముతో వారా దేశమును విడిచి, చీనాదేశమునకువచ్చిరి, దేశకాలభేదములవలనను, నూతనదేశీయులతోఁ జేసిన సంబంధబాంధవ్యముల వలనను, వారుజ్ఞానాభివృద్ధిమార్గములను విడిచి, తమకుఁగలకించిచ్ఛాస్త్రజ్ఞానముతోఁదృప్తినిబొంది, శతాబ్దములనుగడిపిరి, పరిశ్రమఁ జేసినగాని, శాస్త్రమును, దేహమును, భూమియు, నీరసించి, కృశించి. జీర్ణించును. జ్యోతిషము వారికిఁ దెలిసినను, 'దూరదర్శిని' యంత్రము నుపయో

గించుట వారికిఁ దెలియదు. మందుగుండుచేయుట వారికిఁ దెలిసినను వారు దానిని వినోదార్థ ముపయోగించుచుండిరి కాని, మఱియొక పనిలో వాడుకఁ జేయలేదు రోగము వచ్చినపుడు, రోగులకు తాయెత్తులను గట్టుటతప్ప వారివైద్యులకు రెండవసాధనము తెలియదు. చిత్తరువులను వ్రాయుట వారి చిత్రకారులకు దెలియును, కాని, ఆబొమ్మ కెచ్చట కళయుంచవలెనో, ఎంత వెలుగు దానికాంతి యుండవలెనో, ఏవిధమున దానిని దిద్దవలెనో, యీ మొదలగు సంగతులు వారికి లేశమును తెలియవు.

అనేకయుగాంతరములనుండి వచ్చుచుండిన వారి చరిత్రములో, వారి రాజులను మంత్రులను గుఱించితప్ప మఱియొక విషయమును గుఱించి వ్రాయఁబడి యుండలేదు. ఆ 'పసుపు' సముద్రము (Yellow sea) మొదలు పారసీకదేశమువఱకుఁ గల చీనాదేశములో నివసించియుండిన కోట్లకొలఁది జనుల గుఱించి చరిత్రలోఁ గానరాదు వారిచరిత్రము రాజులచరిత్రముగాని, దేశీయుల చరిత్రముకాదు దేశీయులును రాజులునుగలిసి, చేసినచర్యలతోఁ గూడి యుండినదే, దేశచరిత్ర మనఁబడునుకాని, దానికి భిన్నత్వము వచ్చినపు డది చరిత్రముకాదు.

క్రీ. పూ. సం 2000 రములకుఁ బూర్వమునుండి, దేశచరిత్ర ముండినట్లు ప్రతీతికలదుకాని, దానికిఁదగిననిదర్శనములు కనఁబడవు, అవియన్నియు నశించినట్లు కనఁబడును, అవి, పురాణకథలవలెఁ దోఁచును. ప్రథమమున వారు బాల్యదశలోనుండినపుడు, క్రమముగ నూతనాంశములు వారికిఁ దెలిసినందున, వారియజ్ఞానము వీడెను ఈనూతనాంశములే, యవతరించి, రాజులై పుట్టి, వారిని బరిపాలించెనని వారియభిప్రాయము. వారిమొదటిరాజు భూమ్యాకాశములకీరూపమునిచ్చెను. ఆరాజు తననెత్తిమీఁదనుండిన రాతిగోళమును పరశుతోఁగొట్టుచున్నట్లును చెక్కుచున్నట్లును బొమ్మకలదు; ఆరాతిగోళమే యాకాశము. అతని తరువాత, స్వర్గము, భూమి, మనువు — ఈముగ్గురు రాజులనేకయుగముల కొలఁది రాజ్యముఁ జేసిరి, మొదట వారువనములలోను చెట్లనీడలలోను జీవించుచుండిరి. ఈముగ్గురి తరువాత వచ్చినరాజు వారికి గృహనిర్మాణమును నేర్పెను.

ఈరాజు తరువాతవచ్చినరాజు, వారికినిప్పును రగిలించుటయు, కఱ్ఱసామగ్రులను జేయుటయు నేర్పెను; దేశములోజరిగిన విషయములను జ్ఞాపకముంచుకొనుట కతఁడు వారికొకమార్గముఁజూపెను; గొప్పసంగతి జరిగినపుడు, పెద్దముడిని స్వల్పసంగతి జరిగినపుడు, చిన్నముడిని దారముపైఁ గట్టుమనియతఁడు వారికి బోధించెను. అతనితరువాత, "ఫ్యూ—వా" అనురాజు సింహాసనము నెక్కెను, అతఁడు గృహస్థాశ్రమ ధర్మములను రచించెను వారికి గానవిద్యను, చేపలను బట్టుటయు నేర్పెను. జిగిబిగిగనుండు చీనాభాషనతఁడే కనిపెట్టెను.

అతనితరువాత, 'షేన్—నంగ్' అనురాజు సింహాసనమునకు వచ్చి, కృషి విద్యను వారికి బోధించెను నాగళ్లను జేయుటయు, భూమిని దున్నుటయు, సస్యములను ఖండించుటయు—ఈమొదలగునవి వారికి నేర్పెను అతనిమూలమున, దేశము సకలసస్యఫలవంతమై, ప్రకాశించెను, దేశీయులు నానాటికి సుఖముగ నుండుచు వచ్చిరి. అతఁడే, వైద్యశాస్త్రమునకు మూలపురుషుఁడు అనేకయౌషధుల నతఁడు కనిపెట్టెను. చేదాకులను నములుచున్నట్లు వ్రాయఁబడిన యతని బొమ్మ ప్రతివైద్యునివైద్యశాలగోడమీఁదఁగనఁబడును.

అతనియనంతరము, 'హ్వాంగు—టి' అనురాజు రాజ్యమునకువచ్చెను, అతఁడు గణితశాస్త్రమును గనిపెట్టి, పంచాంగమును వ్రాసి, జ్యోతిషమును జరుపుటకుఁదగినసాధనములను నిర్మించెను. గానవిద్యకుఁదగినసాధనములను సహితము కనిపెట్టెను. అతఁడు చెప్పినప్రకారమే, దేశీయులు నేటివఱకు కాలమును గుణించెదరు అతనిభార్య పట్టుపురుగుయొక్క యుపయోగమును కనిపెట్టి, దానిని బెంచుటయు, దానిపట్టుతో బట్టలను నేయుటయు, జనులకు నేర్పెను. ఆమెయే, చీనాపట్టుకు మూలకారకురాలు. ఈరాజులు పురాణపురుషులు.

ఇఁక నిర్ధారణగ దేశమును బరిపాలించిన రాజులవంశము, 'యూ' అను రాజుతోఁ బ్రారంభమగును. ఐజిప్టుమహారాజ్యము మధ్యస్థితిలో నుండినపుడు, 'యూ' అనురాజు, చీనాదేశమును బరిపాలించి, యుండవచ్చును. ఈయుభయ దేశీయులకు ననేకవ్యత్యాసములు కలవు. ఐజిప్షియులు శ్రమపడి, చిన్నదేశములో నుండినను, శాస్త్రపరిశోధనఁజేసి, నాగరికులయిరి. వారిలో ననేక

వేదాంతులును, కవులును, పండితులును, చిత్రకారులును, శిల్పులును కలరు. చీనాదేశము విశాలము; దేశీయులు కోట్లకొలది కలరు: అయినను, వారు చిన్న పిల్లలవలె, నిరంకుశప్రభువునకులోఁబడి, యుగాంతరముల కొలఁది, దివారాత్రములు నిద్రాహారవిహారములలోఁ గడపి, అజ్ఞానాంధకారములో మునిఁగి యుండిరి; లోకమునిగాని, దేవుఁడని గాని, వారికి జ్ఞానములేక పోయెను. ఎంతవఱకును వారుప్రారబ్ధకర్మముని తలఁచి, నిద్రించిరి.

'యూ' అనురాజు తరువాత, 'షన్' అనురాజు సింహాసనమునకు వచ్చెను, అతఁడు గొప్పజనరంజకుఁడు. ప్రథమమున, నతఁడు కుమ్మరివాండ్రతోఁ దిరిగి, పనిఁజేయుచుండి నంగున, నతని వారు ప్రేమించి నిర్దుష్టమగు మృత్పాత్రల నతనికివారు కట్నముగఁబంపుచుండిరి. అతనిపరిపాలనకాలములో, దేశము సుభిక్షముగనుండి, వృద్ధిఁబొందెను, కాని, అతనికాలములో దండనాధికారము ప్రబలమై, పాఠశాలలో బాలురను బెత్తముతోఁ గొట్టుట వాడుకలోనికివచ్చెను. ఈ'యూ' అనురాజును, 'షన్' అనురాజును, వారిరాజులలో గొప్పవారు; వీరిరువురు కీర్తిప్రతిష్ఠలను నిలుపుకొనిరి.

వారితరువాత "యు" అనురాజు దేశమును బరిపాలించెను, అతని కాలములో నతివృష్టివలన, దేశములోనుండిన నదులన్ని యుప్పొంగెను; దేశము జలార్ణవమయ్యెను అప్పు డారాజుకాలువలను ద్రవ్వించి, జలములుసముద్రములోఁబడునట్లు ప్రయత్నించెను. అతనితరువాత, ననేక రాజరాజులురాజ్యముఁజేసిరి, వారిలోఁగొందఱు ధర్మాత్ములును, కొందఱుపాపాత్ములును కలరు. తుదకు "చౌ—సిన్" అనుపాపాత్ముఁడు రాజ్యమునకువచ్చెను. అతనిపూర్వుఁడొకఁడుతోలుసంచులను రక్తముతో నింపి, వానిని మీఁదికి యెగరవేసి, వానిని బాణములతోఁగొట్టి, "ఓజనులారా! చూడుఁడు—నేను స్వర్గమును గొట్టితిని" అనిచెప్పుచుండెను. "చౌ—సిన్" అనురాజుకూడ, మూర్తీభవించినపాపమని చెప్పవచ్చును. అతనిపాపకర్మలకు సామంతులును జనులును మండిపడి, "వీరకుమారుఁడ"నువానిని మొదటఁబెట్టుకొని, తిరుగఁబడిరి; అప్పుడు "చౌ—సిన్" స్వనగరులోనఁ గూర్చుండి, ధనరాసులను దగ్గరఁబెట్టుకొని, నగరునకునిప్పుఁ

బెట్టించి, తగులఁబడె. ఈవీరకుమారుఁడే, "చౌ" వంశమును స్థాపించెను; ఈవంశము క్రీ. పూ. సం. 249 రమువఱకు వచ్చెను. అతనివంశస్థులు, దేశమునకుఁ బశ్చిమమున నుండిన కిరాతులతోఁ బోరాడి, వారిని జయించిరి. ఆరాజులను, "అసీరియా" దేశపురాజులు మన్నించి, గౌరవించిరి; కాని, దేశములోన స్వాస్థ్యము పుట్టియుండెను; భూఖామందుల (Land-lords) పోరువిశేషమయ్యె, వారి పోరును జనులుసహింపలేక, శ్రమపడుచుండిరి.

క్రీ. పూ. ఏడవశతాబ్దములో నిరువురు మహనీయులు దేశములోఁ బుట్టి బోధనలవలనను, ప్రత్యక్షపు నడవడికలవలనను, దేశీయుల నుద్ధరించిరి. "లౌట్సు" అనువాఁడు గొప్పవేదాంతి, దేశీయుల పిచ్చిమతాచారములను, మతాభిప్రాయముల నతఁడు తొలఁగించి, సద్ధర్మము పట్టువడుటకుఁ దగిన ధర్మమార్గములను వారికి బోధించెను. "కన్-ఫ్యూసియస్" అనువాఁడు గొప్పసంఘ సంస్కర్త. ప్రాణరహితమై పడియుండిన ప్రాచీన మతాచారములను, మతాభిప్రాయముల నతఁడు దేశీయుల దినచర్యల కనుగుణముగ మార్చి, వానికిఁ బ్రాణముఁ బోసెను. వారిరువురకును కక్షవిశేషముగనుండెను, వారిలో వారికిఁ బొత్తులేక పోయెను. ఒకసమయమున, 'లౌట్సు' 'కన్-ఫ్యూసియసు' తోఁ గొంతవఱకు సంభాషించి, "అయ్యా! నామాటలను వినుఁడు. మీదురభిమానమును గర్వమును జాలింపుఁడు, మీదుర్వాంఛలను గట్టిపెట్టుఁడు. మీచేష్టలు, మీకోరికలు చాలు, చాలు. వీనివలన మీకుఁ బ్రయోజనములేదు."

ఏది యెట్లుండినను, "కన్-ఫ్యూసియసు" బోధించిన ధర్మమార్గములే, జనులకు సులభముగ నుండినందున, వానినే వారవలంబించిరి. ప్రథమమున నతఁడు, స్వసంస్థానములో సంఘసంస్కరణముఁ జేయనారంభించెను. అతని సంస్థానము తదితర సంస్థానములకు నిదర్శనమయ్యెను. అతని సంస్థానములో, వృద్ధులు సునాయాసముగ రక్షింపఁబడుచుండిరి, బలవంతులకుఁ దగినపనులు దొరకుచుండెను. దుర్బలులు కాపాడఁబడిరి. అతఁడు ప్రధానమంత్రియైనతరువాత, దేశీయుల యాచారవిధానములను, న్యాయశాస్త్రమును సంస్కరించెను. రాజువద్ద నతనికిఁ గలసన్మానమును తదితరసామంతప్రభువులుచూచి, యోర్వలేక, అతఁడు చేయఁ

దలఁచిన సంస్కారముల నెదిరించి, వానిప్రయోజనములేదని వాదించుచుండిరి; వారివాదముల నతఁడు సహింపలేక, యుద్యోగమునువిడిచి, ప్రతిసంస్థానములోఁదిరిగి, శ్రవణాసక్తులగు వారికినిజబోధనలను జెప్పెను; ప్రాచీనగ్రంథములకు వ్యాఖ్యానముఁ జేసెను; 'చీనా' భాషలో వ్రాయఁబడిన గ్రంథములలో నుత్కృష్టమగు "స్ప్రింగు-ఆటమ్" అను గ్రంథమును రచించెను. దేశీయుల అస్వాస్థ్యమును, భూఖామందుల దౌర్జన్యము నతఁడుచూచి, పరితపించెను. ఒక సమయమున, నతఁడు శిష్యులతోఁగూడి, మార్గముఁబట్టి పోవుచుండ, దుఃఖించుచుండిన యొకస్త్రీనిజూచి 'ఓతల్లీ! కష్టముపైఁగష్టము ననుభవించినట్లు కనఁబడుచుంటివి' అనిపలికెను. "అయ్యా! మీమాటనిజము. నాతండ్రిని, భర్తను పులి చంపెను. నాకొక పుత్త్రుఁడుకలఁడు, వాఁడుకూడ, నేడుపులినోటఁబడెను" అని యామెచెప్పెను. 'ఓతల్లీ! ఇన్నికష్టములువచ్చెనుకదా! ఈస్థలములో, నీవేల నివసించియుంటివి?" అనియతఁడడిగెను. "అయ్యా! ఈసంస్థానములోఁ బ్రజాపీడలేదు! కనుక, నివసించియుంటిని" అనియామెచెప్పెను. అప్పుడతఁడుశిష్యులనుజూచి, "ఓయీ! బాలకులారా! ఈసంగతిని జ్ఞాపకములోనుంచుకొనుఁడు. ప్రజలను బీడించురాజ్యము వ్యాఘ్రముకంటెభయంకరము" అనిబోధించెను.

ఆనుహానీయుని మరణానంతరము నేకసంవత్సరములు గతించిన తరువాత, నతనిసద్బోధనలు సఫలమయ్యెను. ఈలోపునదేశములో నరాజకము మెండయ్యెను. అల్లకల్లోలములుపుట్టెను. ప్రచండవాయువుపీచునపుడు వృక్షమువలె, దేశముకంపించెను. అప్పుడు, 'షి—హ్వాంగ్-టి'అనువాఁడు రాజ్యమునకువచ్చెను. అతఁడువిచ్చుకత్తిని బట్టుకొని, సింహాసనమునధిష్ఠించుట, యభ్యాసము. ఇతర సంస్థానములుకలిసి, అతని నెదిరించెను. మిడుతలదండు వెడలి, పంటలనుబాడుచేసెను. నవధాన్యములను సమృద్ధిగలదేశములోనికి దీసికొనివచ్చినవారిని రాజు సన్మానించి, వారికిగొప్పయుద్యోగములనిచ్చెను. క్రమముగ నతఁడు సంస్థానములను జయించి, మహారాజ్యమును సంస్థాపించెను. ప్రాచీనగ్రంథములవలనను, "కన్—ఫ్యూసియస్" చెప్పినబోధనలవలనను, జనులు తన నిరంకుశప్రభుత్వమును సహింపరని రాజాభయపడి, వైద్యగ్రంథములను జ్యోతిషగ్రంథము

లునుతప్ప, తదితరలిఖితగ్రంథములను నశింపఁజేయుమనియాజ్ఞాపించెను ఆగ్రంథములను దగులబెట్టుటకుబదులు ప్రాణత్యాగముఁజేయుటకు జనులు సిద్ధపడిరి. కొంతవఱకు రాజాజ్ఞప్రకారము గ్రంథములు తగులబెట్టఁబడెను. రాజునిర్మించిన నూతనరాధారిమార్గములవలనను, వంతెనలవలనను, జనులుకొంతవఱకు శాంతిపడి, సుఖముగనుండిరి.

ఆసమయమున, చీనాదేశమునకుఁ బశ్చిమ ప్రాంతముల నుండిన 'తార్తారులు' దాడివెడలివచ్చిరి. 'హ్వాంగ్-టి' చతురంగ బలములములను దీసికొని, వారినియెదిరించి, వారినియోడించి, వారిదేశములోఁ బ్రవేశించి, వారిని స్వాధీనముఁజేసికొనెను అంతతో నతఁడు తృప్తిఁబొందక,మున్ముందు శత్రువులదాడి నుండి దేశమును రక్షించుటకు గొప్పగోడను కట్టించెను. ఆగోడమూలమున, నతనిపేరు లోకములోశాశ్వతముగ నిలిచెను, ఈరాజింత గొప్పవాఁడైనను, మృత్యువలన భయపడుచుండెను,దానిపేరుఁ జెప్పినవారిని సంహరించుచుండెను. వార్ధకదశలో నతఁడొక గొప్పనగరమును నిర్మించి, దానిలో నొక్కొక్క గదిలో నొక్కొక్కరాత్రి నిద్రించెను. ఏగదిలో నతఁడు శయనించునో, రెండవవానికిఁ దెలియదు. ఈప్రకారమే, యమదూతలనుమోసపుచ్చవలెనని, పిచ్చితలంపువలంచెను ఇట్టిపిచ్చియాలోచనల నతఁడు కలిగియుండినను, రాజనీతిపారంగతుఁడు, ధర్మాత్ముఁడు, బుద్ధిమంతుఁడు. చీనామహారాజ్యమున కతఁడే, స్థాపకుఁడు, ఆతఁడురాజ్యమునకు వచ్చునప్పటికి, దేశము చిందరవందర పడియుండెను. దేశమునకు స్వాస్థ్యములేదు. రాజ్యాంగములన్నియు చిక్కువడియుండెను; అట్టిరాజ్యమున కతఁడు స్వాస్థ్యముఁ దీసికొనివచ్చి, రాజ్యాంగములనుదృఢముఁ జేసెను, అతనికాలములోజనులు సుఖముగనుండిరి.

ఈరాజింత గొప్పవాఁడైనను, ఇతని పరిపాలన కాలములోను, ఇతని వంశస్థులకాలములోను, భూమి మానవరక్తముతోఁ దడుపఁబడెను. ప్రాణములనిన, చీనావారికి యొకగడ్డి పోఁచవలెఁ గనబడును; కనుక,వారు మానవరక్తముతో భూమిని దడుపుచుండిరి. మృత్యువనిన భయపడుచుండిన చక్రవర్తి శాసించిన దండనీతి, (Criminal Code) మహాకఠినముగనుండెను.

ఈయరాచకము కొన్నిదినములవఱకు దేశములోనుండెను; అంత "హాన్" (Han Dynasty) వంశస్థులు రాజ్యమునకువచ్చిరి. "కన్—ఫ్యూసియసు" బోధనలు ప్రబలమయ్యెను. వానిమూలమున దేశమునకు స్వాస్థ్యము వచ్చెను. నశించినగ్రంథములను వ్రాయింపించి, రాజులుశాస్త్రజ్ఞానమునభివృద్ధిఁ జేసిరి గృహములలోని మిద్దెలమీఁదను, పర్వతగుహములలోను, కన్నములలో, పూర్వపురాజునకుభయపడి, దాచియుంచఁబడిన గ్రంథములను జనులు బయటకుఁ దీసికొనివచ్చి, మరల వానినెత్తివ్రాసిరి. కొన్నిగ్రంథములను సవరణఁజేసిరి. వారు నూతనగ్రంథములను, సాహిత్యమును నేర్చుకొనిరి. రెండుశతాబ్దములు గతించునప్పటికి, దేశములో నూతనపుస్తకభాండాగారములు వెలసెను.

తప్పుజేసినవారిని దండించుటకు నిర్మింపబడిన "అమానుష - శిక్షలు" కొట్టికొట్టి వేయఁబడెను. "టి—ఇంగ్" అనుబాలిక మూలమున, శిక్షలన్నియు, ఊరిదండనతప్ప—కొట్టివేయఁబడెను. ఆమెతండ్రి, సామంతుఁడు. గొప్పవైద్యుఁడు. రాజస్నేహితులనువచ్చినసంకటము నతనిని బాగుజేయుమని కోరినపుడతఁడు రాజాజ్ఞను మన్నింపక, యూరకుండినందున, నతని యవయవములను మర్దించి, ఛేదింపుమని రాజాజ్ఞాపించెను. ఆవైద్యునికూఁతురు "టి—యింగ్" రాజునొద్దకువెళ్లి, బ్రతిమాలెను. అతనికిఁ గుమారులు లేరు. రాజదండన నతఁడువిని పలువిధములఁ జింతించెను. ధైర్యస్థైర్యములుగల నతని కూఁతురు రాజునుసమీపించి, తండ్రినిర్దోషియని చెప్పుటయేకాక, అమానుష శిక్షలు కూడదని రాజునకు బోధించెను.

"ఓరాజా! నాతండ్రి, మరణదండనకుఁ దగినవాఁడైనయెడల, నతనిని జంపుఁడు, కాని, అతని యవయవములను ఛేదించుటవలన, నతఁడు పశ్చాత్తాపముపడక పోవుటగాక, న్యాయశాస్త్రముయొక్క ముఖ్యోద్దేశమునిష్ఫలమగును. ఎంతవిచారించినను, ఛేదింపబడిన యవయవములు తిరిగి రానేరవుకదా! ఓనాథా! ఈవిషయములో నన్నుబానిసగనమ్ముఁడు, మాతండ్రిని మాత్రము స్వేచ్ఛగవిడిచిపెట్టుఁడు" అనియామె ప్రార్థించెను. ఆమెమాటలను రాజువిని, యామెతండ్రినిపెట్టెను; అమానుష దండనలను కొట్టివేసెను.

ఇట్లు కొంతకాలము జరిగెను; ప్రాచీనదశమరలెను; "కన్. ఫ్యూసియసు" బోధనలు కోట్లకొలఁది మనుజులకు బోధపడలేదు, ఆబోధనల వలన వారిమనస్సులకు శాంతము లేకపోయెను. అప్పుడు వారు నూతనమతమును, మతాభిప్రాయములను తెలిసికొనఁగోరి, హిందూదేశమునకు రాయబారులను బంపిరి. వారు భరతఖండమునకువెళ్లి, బౌద్ధగ్రంథమతములను బుద్ధదేవుని విగ్రహములను దీసికొని స్వదేశమునకుఁ బోయిరి. ఈ బౌద్ధమతము దేశములో వ్యాపించి "హాన్—వంశ" మంతమగుకాలమునకు, వేరుదన్నెను.

ఈ యుగములలో, చీనావారికిని, విదేశీయులకును గల సంబంధములను గుఱించి, లేశమపి తెలియదు. వారిదేశమున కొకవైపున గొప్పగోడ కలదు; తదితర ప్రక్కలను మహాపర్వతశ్రేణులు కలవు. ఇట్లు నలువైపులఁ గప్పబడి, చీనావారు స్వదేశమును, కలియుగ వైకుంఠముని భావించి, నిద్రాహారవిహారములలోఁ గాలముఁగడిపి, లోకములో మహారాజ్యముల సృష్టిస్థితిలయములనుగుఱించి తెలియకయే, సుఖముగ నుండిరి.

ఇతరదేశ చరిత్రములలో, చీనావారినిగుఱించి, కొంచెము కొంచెము చెప్పబడియున్నది, వారికి విదేశీయులతో సాంగత్యము విశేషముగనుండినట్లు కనబడదు. పారసీకదేశచరిత్ర కథలలో వీరినిగుఱించి, కొంచెముచెప్పబడియున్నది— ఏదియెట్లుండినను, వారిపట్టుబట్టలు లోకప్రసిద్ధికెక్కెను వారిపట్టుబట్టలను 'ఫొనీషియనలును' 'హీబ్రులును' కొనుచుండిరి. రోమకులకుగూడ, వారిపట్టుబట్టలసంగతి తెలియును.

మహారాజ్యమునకుఁ గౌమారదశ వచ్చునప్పటికి, వారు కొంచెము కొంచెము విదేశీయులతో సాంగత్యముఁ జేయనారంభించిరి, ఇప్పటికిని, వారు విదేశీయుల సాంగత్యమువలన, బాగుపడలేదు. చీనావారికి తెలివితేటలుకలవు; కాని, వారిబుద్ధి—బాలురబుద్ధి; వారిబుద్ధమట్టుపడి యుండెనుకాని, వికసింపలేదు; వారిబుద్ధినిజడ్డుదనము విడువలేదు.

శ్రీరస్తు.

హిందూదేశచరిత్ర.

ఇరువదితొమ్మిదవ అధ్యాయము.

భరతఖండస్వరూపనిర్ణయము.

ఉత్తరమున హిమవత్పర్వతములును, దక్షిణమున కన్యాకుబ్జమును తూర్పున బ్రహ్మపుత్రానదియు, పశ్చిమమున సింధునదియు—వీని మధ్యమున నుండినదేశమే భరతఖండము. ఈభరతఖండము, భారతీయుల పూర్వపుణ్యము వలన, నాంగ్లేయ దొరతనమువారిచేఁ బరిపాలింపఁబడి, సకలసిరిసంపదలతోఁ దులదూగుచున్నది. ఈఖండముయొక్క విస్తీర్ణము—పదిలక్షల యేఁబదివేల చదరపుమైళ్లు. ఈదేశములో ముప్పదికోట్లజనులు, స్త్రీపురుష లాబాలవృద్ధులు జీవించియున్నారు. ఈదేశమొక చిన్నఖండము కనుక, దానికి భరతఖండమని పేరు వచ్చెను. శీతోష్ణస్థితిగతులలోను, సారములోను, స్వరూపములోను, దేశమొకరీతిగ లేదు, కొన్నిస్థలములలో వేఁడిమియు, కొన్నిస్థలములలో శీతలమును విశేషము ; కొన్నిప్రదేశములు సమశీతోష్ణములు; కొన్నిభాగములు సారవంతములు, కొన్ని ఊసరక్షేత్రములు; కొన్నిభాగములు—బయలులు, కొన్ని కేవలము వనభూములు.

ఈశీతోష్ణస్థితులును, భూసారమును, దేశముయొక్కస్థితియు—ఈదేశకాలస్థితులవలన, భారతీయుల దేహబలమును, బుద్ధిబలమును, ధనబలమును, ఇచ్ఛాశక్తియు, జ్ఞానశక్తియు, క్రియాశక్తియు వ్యక్తమయ్యెను. అందుచేత, దేశీయులచరిత్రమును జదువుటకు వీలుపడును. వీనిమూలముననే, భారతీయులు

ప్రస్తుతపుస్థితిగతులకు వచ్చిరి. అందుచేత, పరదేశీయుల చరిత్రమును మనము చదువుటకారంభించినపుడు, మనముముందు కొన్నిసంగతులను తెలిసికొనవలెను:—ఏదేశమువారినివాసము?. ఆదేశము, ద్వీపమా, సముద్రతీరదేశమా, లేక కేవలము నాటుదేశమా?. సముద్రతీర దేశమైనయెడల, దానితీరము కత్తిరింపబడినతీరమా, లేకకత్తిరింపఁబడలేదా?. దానితీరమున జలసంధులుగాని, అగాధములు గానికలవా? నాటుదేశమైనయెడల, నితర దేశములకును దానికిని గలసంబంధమేమి! దానియిరుగుపొరుగు దేశములెట్టివి? ఆదేశములో, నదులును, పర్వతములునుకలవా?ఆపర్వతములెట్లు నిలిచియున్నవి? ఆనదులెట్లు ప్రవహించును? చిన్నకొండలు,లోయలు, యెగుడుభూములు, దిగుడుభూములు—వీనిని గుఱించి తెలిసికొనవలెను. ఎంతవర్షముపడును? విశేషముగనా. లేకకొంచెమా? ఆదేశ శీతోష్ణస్థితు లెట్టివి? ఆదేశము వేఁడిగనుండునా,లేక శీతలమా, లేకసమశీతలమా, సాగరముగలదేశమా, లేక నిస్సారమా ? సారముగల దేశమైనయెడల, సునాయాసముగ పంటలుపండును , నిస్సారమైనయెడల, మనుజులు కాయక్లేశము పడినగాని, పంటలు పండవు. ఈ విషయములను ముఖ్యముగ తెలిసికొనవలయును.

పూర్వకాలములో రాధారిమార్గములుకాని, రైలుబండ్లుగాని, లేవు, ఆకాలములో నొకదేశమునుండి మఱియొకదేశమునకు వెళ్లవలసివచ్చినపుడు; సంచారావస్థలోనుండిన మనుజులు కొండకనుమలను, లోపలను, నదులననుసరించి, గమనించుచుండిరి. పర్వతములపై నడచివెళ్లుటకష్టముగాని, కొండలోపలననుసరించి, వెళ్లుటసులభము , నదులమార్గమువెంబడివెళ్లినందున, దాహమునకు జలముదొరకును ; దానియొద్దున మొలచినపచ్చికను పశువులుతినును ; వీనికంటె సులభమగుమార్గము మఱియొకటికలదు. సముద్రతీరము ననుసరించి, ప్రయాణముఁజేయుట,మిక్కిలిసులభము; కనుక, నదులనుగుఱించియు, కొండలోపలను, కనుమలనుగుఱించియు తెలిసికొనుట యావశ్యకము ; భారతమాత యొక్క స్వరూపమును నిర్ణయించి, ఆయాకాలములలో నివసించినమనుజులనుగుఱించి, చెప్పుచున్నాము.

ఆసియాఖండమునకు దక్షిణమున మహోన్నతప్రాకారములవలె, హిమవత్పర్వతములుకలవు; దానికి దక్షిణముననొక వేయిమైళ్లదూరమువఱకును సముద్రములోనికి వ్యాపించి, మూఁడువైపులసముద్రముచే నాక్రమింపఁబడిన దేశమొకటికలదు. ఇట్లు సముద్రములోనికి వ్యాపించిన త్రికోణాకారమగు దేశమునకును, మహాఖండమునకును మధ్యనొకలోయకలదు. ఒకవంతెనవలె, నీలోయారెంటిని కలుపుచున్నది; హిమవత్పర్వతములకు దక్షిణముననుండిన దేశమునకును; త్రికోణాకారముగ సముద్రములోనికి వ్యాపించినదేశమునకును ఈవిశాలమగు లోయకును, భరతఖండమని పేరువచ్చెను.

ఈ ఆశియాఖండపటమును జూడుము, మీఁదఁజెప్పఁబడిన మూఁడు భాగములు ప్రత్యేకముగ దానిలోఁగనఁబడును, దానికినుత్తరమున, హిమవత్పర్వతములుకలవు, వానికిఁదిగిలి, ఉత్తరహిందూస్థానముకలదు, ఆప్రదేశము పూర్వపశ్చిమములకు వ్యాపించియున్నది, గంగసింధుబ్రహ్మపుత్ర నదులుప్రవహించుచున్నవి, ఆదేశమునకే, మధ్యదేశమనియు, ఆర్యావర్తమనియు, రెండు నామములుకలవు, దానికిదక్షిణమున త్రికోణాకారముగనుండి, పర్వతశ్రేణులతోను, నదులతోఁగూడి సముద్రములోనికి వ్యాపించియుండిన దేశమునకే, దక్షిణదేశమని, లేక 'దక్కను'నని, పేరుకలదు. అనేకవేలయుగముల క్రింద, భరతఖండమంతయు, జలార్ణవమైయుండెను, మఱికొన్నియుగములు గడచిన తరువాత, సముద్రములోనుండి "దక్కన" దేశము మీఁదికివచ్చెను; ఇదియొక్కటియె కాదు, నైరృతిమూలను, "దక్షిణ-ఆఫ్రికా" దేశముతోఁగలసి, మఱియొక భూఖండము దీనితోఁగూడి హిందూమహాసముద్రములోనుండి, మీదికి వచ్చెను. ఇట్లు మీదికివచ్చిన దక్షిణదేశమునకు నైరృతిమూలను "ఆరావళీ" పర్వతశ్రేణులుకలవు. ఇప్పటికిని, "దక్కను" దేశములోను, "దక్షిణ-ఆఫ్రికా" దేశములో నొకమాదిరిగనుండు జంతువులయెముకలును, స్థావరములశేషములునుదొరకుచున్నవి; ఈరెండుఖండములను గలుపుచుండిన భూభాగమొకటి సముద్రములోఁగలదు. "దక్కను" దేశమునకుత్తరమున, (హిమవ

త్పర్వతముల పశ్చిమమునకును, అఫ్ఘనిస్థానము—బెలూచిస్థానమునకును) కొన్ని యుగములక్రింద సముద్రము ప్రవహించుచుండెను.

అనేకయుగములు గతించెను; మఱియొకభూభాగము క్రమముగ, సముద్రములోనుండి మీదికివచ్చెను: ఆభూభాగమే, 'దక్కను' దేశమున కుత్తరమునయున్నది; ఆభూభాగమే, సముద్రమట్టమునకు 20,000 ల అడుగులు యెత్తుగనున్నది, ఈభూభాగముమీద ననేక జలజంతువులశేషములు నేటి వఱకుఁ గానవచ్చుచున్నవి; ఆభూభాగమునకే, హిమవత్పర్వతములనిపేరు వచ్చెను; వానికి యుత్తరముననుండినదేశమే, 'టిబెతు'. ఈభాగముసముద్రములోనుండి మీఁదికివచ్చినందున, నైరృతిమూలనుండిన దక్షిణభూఖండమంతయు సముద్రములో మునిఁగెను; 'దక్కను' దేశమునకుత్తరముననుండిన సముద్రజలములన్నియు దక్షిణముగఁ బ్రవహించెను, ఆజలములే, నేఁడు 'అరబ్బీ సముద్ర' మయ్యెను. ప్రాచీనవింధ్యపర్వతములకును, నూతనముగమీఁదికివచ్చిన హిమవత్పర్వతములకును మధ్య, నొకగొప్పలోయ నిరూపింపఁబడెను. దక్షిణోత్తరములకుఁ గలపర్వతములలోఁ బుట్టిన మహానదులు లోయలోఁబడుచుండెను. అనేకయుగములకొలఁది నదులీలోయలోఁ బడుచుండుటవలన, నవితీసికొనివచ్చిన మట్టితో నీలోయ క్రమముగ నింపఁబడెను. ఈవిధమున నింపబడినప్రదేశమే, ఉత్తరహిందూస్థానము; దానికిఁబశ్చిమమున సింధునదియు, తూర్పున గంగ-బ్రహ్మపుత్రా నదులముఖద్వారములును కలవు. కొండలమీదనుండి తీసికొని రాబడిన మట్టితో, వింధ్యాచల-హిమాచలముల మధ్యనుండిన లోయయంతయు నింపబడి, అనేకయడుగుల యెత్తుకువచ్చెను. ఈప్రకారమీలోయనింపఁబడకయుండినయెడల, 'దక్కను' దేశము, 'ఆస్ట్రేలియావలె' నొక ద్వీపఖండమై యుండును; దానిచరిత్రము మఱియొక విధముననుండి యుండును.

దక్షిణ హిందూస్థానము త్రికోణాకారముగనుండు మెఱకభూమి. దానికి మూడు వైపులను సముద్రముకలదు; దానికిను త్తరమున 'వింధ్యపర్వతములును' 'సత్పు పర్వతములును,' వాని యుపశాఖలును, ఇంచుమించు-

తూర్పుపడమరలకు వ్యాపించియున్నవి; ఈపర్వతములకును ఉత్తరమున నుండు 'హిమవత్పర్వతములకును' మధ్యనుండు దేశమే, 'ఆర్యావర్తము' లేక 'మధ్యదేశము'. వింధ్యపర్వతములు రానురాను దక్షిణమునకు వంగియుండును: అటువైపున, నర్మదానది ప్రవహించుచున్నది; పశ్చిమ తీరమునుండి యీనదిగుండ 'దక్కను' దేశములోఁ బ్రవేశింపవచ్చును. ఈనదికి దక్షిణమున, 'సత్పు' పర్వతములుకలవు. ఈపర్వతములు రానురాను, తూర్పున 'చోటా-నాగపురము' వద్దవంగును. ఈపర్వతమునకు దక్షిణమున 'తపతి' నదిప్రవహించుచున్నది. పశ్చిమతీరమునుండి, యీనదిగుండ 'దక్కను' దేశములోఁ బ్రవేశింపవచ్చును. ఈరెండు పర్వతముల ననుసరించి, తదితర పర్వతములు శాఖోపశాఖలు నలువైపులఁ బరిణమించుచున్నవి, వీనికిఁ దగిలి, కీకారణ్యములును బ్రహ్మారణ్యములును కలవు. ఇవి యన్నియు, 'ఉత్తర హిందూస్థానము' నకును 'దక్షిణహిందూస్థానము' నకును మధ్యనున్నవి. 500. మైళ్లనిడుపును వ్యాపించియున్నవి. పూర్వకాలములో నితరదేశీయులు దాడి వెడలివచ్చినపుడు, దేశములోఁ గాపురముండినవారు వారియెదుట నిలువలేక పాఱిపోయి, యీ బ్రహ్మారణ్యములలో దాగుచుండిరి. జాంబవంతుని కాలమునుండి వచ్చుచుండిన జాతివారీయరణ్యములలో నేఁటివఱకుఁ గానవచ్చుచున్నారు, హిందువులని పిలువఁబడుటకు వారు సమ్మతింపరు.

'తపతి' నదికి దక్షిణమునుండి 'దక్కను' దేశము పశ్చిమమునుండి తూర్పునకు వాలియుండును, తూర్పున బంగాళాఖాతములోఁ బడుచుండిన నదులవలన, నీసంగతి విశదమగును. ఈదక్షిణ భాగమంతయు మెట్టుగఁగనఁబడును; ఎచ్చటఁ జూచినను పర్వతములును, గిట్టలును, లోయలును కలవు. ఈ భాగములో నివసించుచుండిన కొందఱు జాతివారు ప్రాచీనకాలమునుండి వచ్చుచున్నట్లుతోఁచును. ఉత్తరహిందూస్థానములో నివసించు హిందువులలోవలె, వీరిలోఁగూడ లేశమపిమార్పులు కనఁబడవు; వీరిమతమును, భాషయు, ఆచారవ్యవహారములును లేశమపి మార్పుచెందకయే వచ్చుచుండెను. ఇతరదేశీయులతోఁ గలసి మెలసినను, వారిగుణములేవియు వీరికిఁ బట్టుపడలేదు.

ఈదక్షిణ దేశమునకు తూర్పుపడమరలను రెండు పర్వతశాఖలుకలవు; వానికి 'తూర్పుకనము'లనియు (Eastern Ghats) 'పశ్చిమకనముల' నియు (Western Ghats) నామములుకలవు. 'పశ్చిమకనములు' పశ్చిమతీరమున, 3000 - 8000అడుగుల వఱకు లేచియున్నవి. వీనిని అనుసరించి, చీనులుదూరని చిట్టడవులుకలవు, ఈవనభూములు, వనవాసులకుఁదప్ప, ఇతరుల కభేద్యములు. తూర్పుతీరమున, 'తూర్పుకనములు' కలవు; ఇవి 1500 అడుగులవఱకు మీదికి లేచియున్నవి, 'పశ్చిమకనములు' వలె గాక, యివిమధ్యమధ్యను తెగియున్నవి, వీని నుండి ననేక నదులు ప్రవహించుచున్నవి.

ఈ రెండుకనములకును సముద్రమునకును మధ్యనుండిన భూములు 2000 ల మైళ్లవఱకును వ్యాపించి, దక్షిణమున నుండిన కన్యాకుబ్జమువద్దఁ గలియుచున్నవి. తూర్పుకనములను భేదించి కొన్నినదులు బంగాళా ఖాతములోను, పశ్చిమకనములను భేదించి, కొన్నినదులు 'అరబ్బి' సముద్రములోను గలియుచున్నవి. పశ్చిమకనములకును సముద్రమునకును 20 మైళ్లదూరమే కలదు. ఈపశ్చిమతీరభూములు సారవంతములు, ఆతీరమున వర్షము లేమియుండవు; అందుచేత నాభూములు సదాపచ్చగనుండును. తూర్పుకనములకును సముద్రమునకును 100- మైళ్లదూరముకలదు. ఈభూములు గోదావరి, కృష్ణ, పెన్న, కావేరిమొదలగునదులచే సారవంతములై, నందనవనమువలెఁ బ్రకాశించుచున్నవి

ఈదినములలో ననేకరాదారి మార్గములు, ఇనుపదారులు, వంతెనలు కలవు, ప్రయాణము చేయుట సులభము. పూర్వము, ప్రయాణము చేయుట కష్టముగ నుండెను, 'కాశికి వెళ్లినవాఁడును, కాటికివెళ్లినవాఁడును సమానుఁడ'ని లోకవాడుకకలదు. పూర్వకాలములో ననేకసంస్థానములు తూర్పుతీరమున వర్ధిల్లెను. పశ్చిమతీరమున, దక్షిణభాగమున నుండిన జాతివారు, విదేశీయుల సాంగత్యములేనందున, నేటివఱకును పూర్వాచారపరాయణులై యుండిరి. ఆపశ్చిమకనములు దుర్గమములు కనుకనే, వారు కూపస్థమండూకములవలె, నుండిరి. పశ్చిమతీరమున నుత్తరమున, 'నర్మద' 'తపతి'నదులు ప్రవహించుచున్నవి;

ఆప్రదేశమున, పూర్వకాలములో ననేకసంస్థానములుపుట్టి, వృద్ధిఁబొందెను. ఆభాగములు సుగమములు; అప్పటికి విదేశీయులు వచ్చిపోవుచుండిరి, అరబ్బి, పారసీకము మొదలగు పశ్చిమదేశవాసులు వర్తకము నిమిత్తమాభాగములకువచ్చుచుండిరి, వర్తకమూలమున నాభాగములు సిరిసంపదలతోఁదులదూగుచుండెను. ఆయాసమయములలో నాతీరమునకు వచ్చుచుండిన అరబ్బీనావికుల సంతతివారు నేటివఱకు నాతీరమునఁ గానవచ్చుచున్నారు. ఆకాలములో వింధ్యపర్వతములను సత్పురపర్వతశ్రేణులను దాటుటదుష్కరము ఉత్తరహిందూస్థానమునుండి బయలువెడలి, తపతీనర్మదాతీరములకు రాదలఁచినన, సముద్రతీరమునుండియేవచ్చుచుండిరిగాని, పర్వతములను దాటివచ్చుటలేదు.

ఉత్తరముననుండిన హిమవత్పర్వతములలోను,దక్షిణముననుండిన పర్వతములలోను బుట్టి, ప్రవహించుచుండిన నదులు కాలాంతరమున బురదను దీసికొనివచ్చి, మేటవేయుచుండెను, ఈప్రకారముత్తరహిందూస్థానభూములు కాలక్రమమున నేర్పడి, యొకరాయి యయినను లేక సారవంతములై, కన్నుల పండువుగనుండును. ఉత్తరహిందూస్థానమునకుఁబశ్చిమమున సింధునదియు దాని యుపశాఖలును, మధ్యభాగమున గంగాయమునానదులును వానియుపశాఖలును, తూర్పున బ్రహ్మపుత్రానదియు దానిశాఖలును ప్రవహించుచున్నవి. ఈనదులచేఁదడుపఁబడినభూములు సారవంతములు; అందుకుఁదగినసూర్యరశ్మియు, జలములునుకలవు, ఆర్యావర్తము 'సర్వసస్యఫలాఢ్య' యనిచెప్పుటలోనబ్బురములేదు. జీవనదులు ప్రవహింపని ప్రదేశములలో ననేకకాలువలుకలవు; వీనిమూలమున భూములు ఫలవంతములగుచున్నవి. ఇందులో నొకవిశేషముకలదు; 'ఆరావళీ' పర్వతములకు బశ్చిమమున సింధునది ప్రవహించుచున్నది ; భూములు సారవంతములు; తగినంత యెండకలదు. కాని, జలముమాత్రముసమృద్ధిగలేదు. పంచనదీతీరమునకు దక్షిణమున వర్షమను మాటయే లేదు. 300 మైళ్లు విశాలముగల యీభాగము నిర్జలప్రదేశము; దీనినే 'థారు' యెడారి అని పిలుచుచున్నాము. వర్షములేమిచే, నీభాగము సాగు లేక కొర్న పడియుండెను; వర్షముపడుచుండినయెడల, నందనవనమువలె,నుండియుండునుకదా! సింధునదిలోనుండి యనేక

కాలువలు త్రవ్వబడి, ప్రవహించుచుండుటచే, నీభాగములో నూటయిరువది లక్షలయెకరముల భూములుసాగుచేయబడుచున్నవి. ఈభూములే, ముప్పది సంవత్సరముల క్రిందట, కొఱ్ఱుపడియుండెను; ఈనాటికి దొరతనమువారి కటాక్షమువలన, నీభూములు సాగులోనికి వచ్చెను

పశ్చిమమునసుండిన అరిబ్బీ సముద్రము మొదలు తూర్పుననుండిన బంగాళాఖాతమువఱకు, 1700 మైళ్లు, ఉత్తరహిందూస్థానభూములు వ్యాపించి యున్నవి. ఈభూముల వైశాల్యము 500,000 చదరపుమైళ్లు. 1650 లక్షల స్త్రీపురుషు లాబాలవృద్ధులుకలరు ప్రాచీనకాలమునుండి, యీప్రదేశములో ననేకదేశీయులు పుత్రపౌత్రపారంపర్యముగ జీవించుచుండిరి, ఈదేశీయులు పేరుప్రతిష్ఠలను సంపాదించి, ప్రబలులైయుండిరి. ఈభూములుసారవంతములగుటచే,నీప్రదేశమున నుండినజనులజీవనములు సుఖముగనుండెను.కష్టముకంటె నధికముగ భూములు ఫలమునిచ్చుటచే, జనులుసిరిసంపదలతోఁ దులదూగుచుండిరి; పాడిపంటలు విశేషముగనుండెను , అందుచేత, వారికివ్యసనములు లేకపోయెను,వారు కాలాంతరమున, సకలకళాసంపూర్ణులైనాగరికులయిరి.

కేవలము శీతలప్రదేశములలో జీవించియుండినవారు జీవనాధారమునకై విశేషముగ శ్రమపడవలసియుండును; భూములనుసాగుచేయుట నష్టము. కష్టపడి సాగుచేసినను, పంటలనుపండవు, పండినను, పంటలుసమృద్ధిగనుండవు. అందుచేత, శీతలప్రదేశములలో నుండినవారు నూతనమార్గములను కనిపెట్టి, భూములను సాగుచేయుచుందురు; ఇట్లు శ్రమపడుటవలన, వారిదేహములు దృఢముగనుండును. శీతలప్రదేశములలోఁ బనిఁజేయుట నుత్సాహము కలుగును. పనిచేయుటవలన, శరీరమువేఁడిగనుండును. ఉష్ణప్రదేశములలోఁ బనిజేయుటవలన, నాయాసముపుట్టును. ఏకదీక్షతో నాలుగుగంటలకాలము పనిఁజేయుటకష్టము. అటులచేసినయెడల, శరీరమునకు బాధకలుగును. శరీరములు దుర్బలమగును. ఈప్రకారము పురుషాంతరములకొలది యుష్ణప్రదేశములలో జీవించుచుండిన జనులును, వారిసంతతివారును శరీరపటుత్వములేక, నీరసించి, కృశించియుందురు. వారు పిఱికిపందలు. భరతఖండములో శీతలప్రదేశములో

నివసించు జనులు శరీరదార్ఢ్యముగలవారై, బలమును పౌరుషమును గలిగియుందురు; వారికిధైర్యస్థైర్యములుండును. ఉష్ణప్రదేశములలో నుండినవారు పిఱికిపందలని చెప్పియున్నాము. తూర్పుననుండిన బంగాళీబాబులకంటెఁ, బశ్చిమముననుండిన మహారాష్ట్రులు బలవంతులును, ధైర్యశాలులు, దక్షిణముననుండిన ఆంధ్రులును, అఱవలును, మలయాళులును—వీరికంటె,బంగాళీబాబులు ధైర్యవంతులు; మహారాష్ట్రులకంటె, సులేమాను పర్వతప్రాంతముల నివసించు పఠానులు బలవంతులు. పంచనదీతీరములు శీతలములు ; కష్టపడి సాగుజేసినగాని, పంటలు పండవు, అందుచేత, నచ్చట నివసించు జాటులును (Jats) సీకులును (Sikhs) మొదలగువారు బలియులు. ధైర్యశాలులు సారవంతములగు నదీతీరములనుండిన జనులు దుర్బలులు, పిఱికిపందలు. ఈ తీరములు సమశీతోష్ణముగ నుండవు. భరతఖండములో రాజపుత్రులే మిక్కిలి సరసులు. వారంతసరసులగుటకు వారిదేశమే కారణము. వారిదేశము సమశీతోష్ణముగ నుండుటవలన, వారు సరసులయిరి. హిందూస్థానము సారవంత మగుటచేత, భారతీయులు ధనికులును,విద్యావంతులును, నాగరికులయిరి. సమశీతోష్ణముగ నుండిన ఉత్తర ఈశాన్యభాగములలో నివసించువారికంటె, మూడుకాలములలో మండుచుండిన దక్షిణభాగములో నివసించు వారు దుర్బలులని చెప్పవచ్చును.

భరత ఖండముయొక్క రూపమును దానితీరమును బట్టి, భారతీయుల చరిత్రమును గొంతవఱకుఁ జెప్పవచ్చును. ఏదేశమును జుట్టి సముద్రముండునో, ఏదేశములోమంచి రేవు స్థలములుండునో, ఆదేశములో నివసించువారు తప్పక నావికులగుదురు, నిర్భయముగవారు సముద్రము మీఁద నావికాయాత్రఁ జేయగలరు;నావికా యాత్రఁ జేయువారు నిర్భయులు, ధైర్యశాలులు, బలవంతులు. పిఱికి పందలు సముద్రయాత్రఁ జేయజాలరు. నావికుని బ్రతుకు నిత్యముగండము; ప్రాణముమీఁదికి వచ్చినను వాఁడు ధైర్యమును విడిచిపెట్టక, స్వస్థచిత్తుఁడై యుండవలెను. భరతఖండమును జుట్టి మూడువైపులను సముద్రముండినను, భారతీయులు మాత్రము నావికులగుటకు వీలులేక పోయెను. సముద్రతీరము విశేషముగ నుండినను,తీరమునమంచి రేవుస్థలములు లేవు; ఆతీర

మంతయు ముక్కుకు సూటిగ నున్నది, కత్తిరపడియుండినఁ గాని, యిగము రేవున కనుపయోగము. నదులముఖద్వారములవద్ద నిసుకదిబ్బలు పడియున్నవి. చిన్న పడవలుతప్ప పెద్ద స్టీమర్లునదుల ముఖద్వారములగుండఁ బ్రవేశింపజాలవు అందుచేత, భారతీయులు నావికులగుటకు వీలులేక పోయెను.

పూర్వకాలములో భరతఖండముతో నోడవర్తకము జరుగుచుండెను; కాని, ఆవర్తకమును విదేశీయులు చేయుచుండిరి. భారతీయులుమాత్ర మోడవర్తకమును జేసినట్లు కనబడదు. అరబ్బులు, పారసీకులు, గ్రీకులు, మొదలగువారు భరతఖండముతో నోడవర్తకమును జేసినట్లు తెలియుచున్నది.

ఈ ప్రకారము మూఁడువైపుల సముద్రముచేతను, యుత్తరమున మహోన్నతములగు హిమవత్పర్వతములచేత నావరింపఁబడి, భారతీయులు తదితరదేశీయుల సాంగత్యములేక, స్వస్థచిత్తులై కాలముగడపిరి. వారివేషభాషలు, వారి షోడశకళలు, వారిచతుష్షష్టికళలు, వారిమతము, వారిజాతి భేదములు—వారి సర్వము వారిదేగాని, పరులనుజూచి, వానిని నేర్చియుండలేదు; విదేశమునకు గాని, విదేశీయులవద్దకుగాని, భారతీయులు పోవలసినపని లేకపోయెను. భారతమాత సర్వాభీష్టదాయిని కనుక, వారుపరులను సేవింపవలసిన పనిలేకపోయెను. ఎంతవఱకు నామెనుజూచి భ్రమపడి, విదేశీయులు గుంపులు గుంపులుగవచ్చిరి, కాని, భారతీయులు విదేశములకుఁ బోయియుండలేదు. ఏదేశము భారతమాతతో సమానమగును ?.

హిందూదేశమున కుత్తరమున హిమవత్పర్వతములు కలవు. హిమవంతుఁడు పర్వతరాజు. తూర్పుపడమరలకు, 1500 ల మైళ్లవఱకు హిమవత్పర్వతములు వ్యాపించియున్నవి. వానికి ఉత్తరమున 'టిబెటు' కలదు. (దానినే ఉత్తరకురుభూములని పిలుచుచున్నారు.) వానికిఁ బశ్చిమమున ఆఫ్గనిస్థానము కలదు. ఆపర్వతములలో గంగ, సింధు, బ్రహ్మపుత్రనదులుపుట్టి, ఉత్తరహిందూస్థానములోఁ బ్రవహించుచున్నవి. ఆహిమవత్పర్వతములశాఖలే, సులేమానుపర్వతములు, హిందూకుష్ పర్వతములు. ఈపర్వతములలో ననేక కనుమలు కలవు. బోలనుకనుము,

కైబరుకనుమ మొదలగునవి. అలగ్జాండరును, తేబరును, మహమ్మదు గజినీ మొదలగువారు వీనిగుండవచ్చి, దేశములోఁ బ్రవేశించిరి.

హిందూదేశచరిత్రమును కొన్నియుగముల క్రింద విభజించి వ్రాయుచున్నాము. ఏ యుగ మెప్పుడు ప్రారంభమై యెప్పు డంతమయ్యెనో చెప్పుట కష్టము. చరిత్రకారులు బుద్ధిని యుపయోగించి, కొంతవఱకు వానిని వ్రాసియుండిరి. కాలమనుగుణముగ వచ్చుచుండును. లౌకికవ్యవహార ధర్మము లొకదాని ననుసరించి మఱియొకటి యుండును. కారణములేక కార్యము పుట్టుట దుర్లభము. ఈ యుగములలో జరిగినకార్యముల కొకకారణము కలదని తలంచుట తప్పు. తృణజలూకన్యాయము ప్రకారము కారణము ననుసరించి కార్యములు కాలక్రమమున వచ్చుచుండును. ఈ హిందూదేశచరిత్రము మూడుభాగములు:—

(I) హిందూమహాయుగము.

(II) మహమ్మదీయయుగము.

(III) ఆంగ్లేయయుగము.

(I) హిందూమహాయుగములో నాలు భాగములు కలవు.

క్రీ. పూ. సం॥ 2000-ప్రాచీనచరిత్రము.

,, సం॥ 2000-1500-ఋగ్వేదకాలము.

,, సం॥ 1500-1000-మహాకావ్యముల కాలము.

,, సం॥ 1000-300-ప్రాచీనహిందూరాజులకాలము.

,, సం॥ 300-క్రీ. శ. సం॥ 300-బౌద్ధులకాలము.

క్రీ. శ. సం॥ 300-సం॥ 650-పురాణములకాలము.

,, సం॥ 650-సం॥ 1200-రాజపుత్రులకాలము.

ఈ చరిత్రమున కాధారములేమి కలవు? ఏయాధారములను బురస్కరించుకొని, యీచరిత్రము వ్రాయుటకు వీలుపడెను? ఆకాలములో శిథిలపూ

ర్వకమగు చరిత్రములులేవు. అనేక సద్గ్రంథములుకలవు; అవి చరిత్రములు కావు. ఆగ్రంథములలో మంత్రములును, వ్యవహారధర్మములును కలవు. వీనిని బురస్కరించుకొని, చరిత్రమును వ్రాయవలెను. మఱికొంతకాలమునకు శాసనములు (శిలాశాసనములు, రాగిశాసనములు) వచ్చెను. ఈశాసనములలో రాజులచర్యలును, వ్యవహారధర్మములు మొదలగునవి వ్రాయఁబడెను; కొంతకాలమునకు, నాణెములు వచ్చెను. ఆనాణెములపై రాజుల నామములు వ్రాయఁబడియుండెను. వానినిబట్టి ఆరాజుల కాలము నిర్ణయింపఁబడెను ఈశాసనములపై వ్రాయఁబడిన వ్రాఁతను జదువుట కష్టముగనుండెను. శాసనముల లిపియు ఆధునికలిపియు వేర్వేరుగ నుండును. పండితులు శ్రమపడి, శాసనములలిపిని గ్రహించిరి; ఆభాషను ఆధునికభాషలోవారు వ్రాసిపెట్టిరి. వీనిమూలముగ దేశచరిత్రమును వ్రాయుటకు వీలుపడెను. ఇంతియకాదు. సం॥2000 రముల క్రిందట గ్రీకులు హిందూదేశమునకు వచ్చియుండిరి, వారు దేశమునకువచ్చి, దేశముయొక్క స్థితిగతులను వ్యవహారములను గుఱించి వ్రాసియుండిరి. సం॥ 1300 రముల క్రిందట బౌద్ధమతస్థులు చీనాదేశమునుండి భరతఖండమునకువచ్చి, దానినిగుఱించి వ్రాసిరి. వీరు వ్రాసినగ్రంథములను 'ఆంగ్లేయ' భాషలోనికిమార్చి, పండితులు వానిని వ్రాసిరి. వానిమూలమున దేశచరిత్రము కొంతవఱకు వెల్లడి ఆయ్యెను. ప్రాచీన శాసనములును ప్రాచీననాణెములును భూమిలో దొరకుచుండెను. గతించిన సం॥ 20-30 రములలోపున హిందూదేశచరిత్రము వీనిమూలమున నధికముగ వెల్లడిఆయ్యెను.

ఆయాకాలములచరిత్రమును వ్రాయుట కాధారములు:

ఋగ్వేదకాలము:—నాలుగు వేదములు.

మహాకావ్యములకాలము:—మహాకావ్యములు.

ప్రాచీనహిందూకాలము:—పురాణములు మొదలగునవి.

బౌద్ధులకాలము:—

(1) బౌద్ధచక్రవర్తియగు అశోకుని శాసనములు క్రీ. పూ. సం॥250.

(2) బౌద్ధుల మతగ్రంథములు.

(3) బౌద్ధయాత్రికులగు ఫాహియాన్, హ్యూనుత్సాంగ్ వ్రాసిన గ్రంథములు.

(4) క్రీ. పూ. సం॥ 300రము మొదలు క్రీ. శ. సం॥ 200 రమువఱకు గ్రీకులు వ్రాసినగ్రంథములు.

(5) నాణెములపైనుండిన వ్రాఁతలు.

నూతన హిందూ కాలము:—

(1) క్రీ. శ. సం॥ 350 రము. పురాణములును, ఉపపురాణములును.

(2) క్రీ. శ. సం. 700 రము మొదలు:—రాజపుత్రులనుగుఱించి జైనులు వ్రాసిన గ్రంథములు.

(3) శాసనములు, నాణెములు.

(4) హర్ష చరిత్రము—బాణకవి ప్రణీతము. క్రీ. శ. సం.650రము.

(5) రాజ తరంగిణి:—కల్హణప్రణీతము. క్రీ. శ. సం. 1150 రము

(6) ఛాంద్—రాస్—రాజపుత్రులు చర్యలును, పృథ్వీరాజుయొక్క చరిత్రమును చెప్పును.

దక్షిణహిందూస్థానములోనుండిన రాజులచర్యలను గుఱించి అఱవభాషలోఁ గొన్నిగ్రంథములు కలవు.

II. మహమ్మదీయ యుగము.

III. ఆంగ్లేయ యుగము.

ఈరెండుయుగముల కాధారము లనేకములు కలవు. వానిని గురించి ముందు వ్రాయఁబడును.

ఇతరదేశచరిత్రములవలె, హిందూదేశచరిత్రము చిన్నదికాదు. ఇది మహాసముద్రము; అగాధము. ఈగ్రంథముయొక్క యుద్దేశమునకు విరుద్ధమని తలంచి, యీచరిత్రమును విపులముగ వ్రాయుటకు సంశయించి, విరమించితిని.

ప్రాచీనదేశచరిత్రలు

9-వ ప్రకరణము.

9
గ్రీసు

శ్రీరస్తు.

గ్రీకులచరిత్ర

నవమప్రకరణము.

ముప్పదియొకటవ అధ్యాయము.

గ్రీకులు రోమకులు— వీరిచరిత్రలను ముందు రాబోవు సంపుటములలో విరళముగ వ్రాయబోవుచున్నారము ; ప్రస్తుతము వీనిని సూక్ష్మముగ వ్రాయుచున్నాము.

గ్రీకులును రోమకులును ఆర్యకుటుంబములోని వారు. అందులో గ్రీకులు ప్రథమమున నాగరికు లయిరి. వారితరువాత రోమకులును, తదనంతర మితరులును నాగరికు లయిరి.

గ్రీసుదేశము నిండ పర్వతములు కలవు, వానిమధ్యఁ జిన్నదేశములుకలవు; ఆయాదేశములవారు స్వతంత్రు లయియుండిరి; వారిలో నైకమత్యము లేదు, వా రేకకుటుంబములోనివా రైనను శత్రువులవలె నుండిరి ఆదేశముయొక్క తీరమంతయును కత్తిరింపఁబడియున్నది, అందుచేత స్వభావసిద్ధమైన లంగరు రేవులు కలవు, ఆదేశీయులు మొదటనుండి నౌకాయాత్రికు లని ప్రసిద్ధి కెక్కిరి; వారు నిర్భయులై తుపానులలోఁ గూడ నావలపై సముద్రముమీదఁ బోవుచుండిరి ఆదేశము 'ఉత్తరగ్రీసు, దక్షిణగ్రీసు అని ద్వివిధము. ఉత్తరగ్రీకుల చరిత్రను గురించి విశేషము తెలియదు. దక్షిణగ్రీకులచరిత్ర క్రీ. పూ. 27-వ శతాబ్దమునుండి తెలియవచ్చుచున్నది, వారికి 'ఏజియనుల'ని పేరు కలదు. 'క్రీటు' ద్వీపములో 'నాసను'పట్టణమువద్దను, 'టూరియి' పట్టణమునకుసమీపమునయుండు కొండపెట్టనద్దను, 'మిసిని' 'టిరిన్సు' పట్టణములనద్దను— త్రవ్వి

భూగర్భములోఁ జూడఁబడిన పదార్థములంబట్టి, దక్షిణగ్రీకులచరిత్ర క్రీ. పూ. 27-వ శతాబ్దమునుండి వచ్చుచున్నదని తెలియ నగును.

‘క్రీటు’ ద్వీపములో ‘నాసను’ పట్టణమువద్ద భూమిలో మూఁడునగరులు కానవచ్చుచున్నవి. వానింబట్టియు వానిలోని మృత్పాత్రలంబట్టి చూచిన నవి ‘పాషాణయుగము’నాటివి యని తోఁచును. శిథిలమై పడియుండిన మొదటి నగరుయొక్క పునాదులపై గట్టఁబడిన రెండవదానింబట్టి చూడ, నది క్రీ. పూ. సం॥ 3500 రమున ‘ప్రాచీనఈజిప్టు’ రాజ్యకాలమునాటిది యని తెలియును. నేఁడు కానఁబడు మూఁడవనగరు ‘మినోశు’రాజుకాలములోఁ గట్టబడెను, ‘ఈజిప్టు’లో ‘హికేశ’ రాజులు క్రీ. పూ. సం॥ 1700-రములో రాజ్యముఁ జేయుసమయమున నదికట్టఁబడెను. ఆనగరములోఁ బద్మవ్యూహమువలెఁ జిక్కుదారులు గల గదులు కలవు; ఆకాలపురాజులు ‘ద్విముఖకుఠారము’ నాయుధము గల దేవుని నారాధించిరి. వీనిమూలమున దక్షిణగ్రీకులకును, ఈద్వీపవాసులకును క్రీ. పూ 20-16 శతాబ్దములలో సంబంధములు కలిగియుండి వారందఱు నాగరికులై మహోన్నతపదవికి వచ్చిరని తెలియ నగును. శిల్పశాస్త్రవేత్తలు సరసముగ నానగరులఁ గట్టిరి; ఎటుచూచిన నగరులో భవనములును, హర్మ్యములును, బజారములును, సోపానములును, పాకశాలలును, భోజనశాలలును, గజాశ్వశాలలును, ధనభాండాగారములును, నూటిమీఁటు స్తంభములును కలవు. చిత్తరువులు నానగరులోఁ గానవచ్చును; పుష్పములును, ఫలములును, రోధులును, కుడ్యములపై రంగులరంగులుగ వ్రాయఁబడియున్నవి—దంతపుబొమ్మలును బంగారువస్తువులును కలవు——అన్నిటికంటె మఱియొక విశేషము కలదు; కాల్పఁబడిన మృత్తికాఫలకలపై వ్రాయఁబడిన ‘అక్షరసమామ్నాయము’ చూపనగును. ‘ఫోనీషియనుల’కే ‘లిపి’ జ్ఞానము కలిగియుండెనని కొందఱియభిప్రాయము, ఇతరు వారినిఁ బట్టి నేర్చుకొనిరి యని చెప్పుదురు. వారికి 6-7 శతాబ్దములకుఁ బూర్వము ‘దక్షిణగ్రీకుల’కు వ్రాఁత తెలిసియుండెనని వాని వలన బోధపడుచున్నవి.

నేఁడు 'కిసార్లికు' అను పట్టణము పూర్వకాలమున 'ట్రాయి' అని పిలువబడెను, దానిసమీపప్రదేశముఁ ద్రవ్వి చూడ ప్రథమమున వేయఁబడిన పునాదులపై నొకటి శిథిలమైన తరువాత మఱియొకదానిని గట్టుచువచ్చిన రాజభవన మొకటి నేఁడు కనఁబడును; "హోమరు" మహాకవి తనకావ్యములలో వర్ణించిననగరమని తోఁచుచున్నది, బహుశః అతనికంటెఁ బూర్వకాలములోఁ నది కట్టఁబడియుండును.

• 'మిసిని' 'టిరిను' పట్టణముల సమీపమునఁ దొరకిన పదార్థములం బట్టి చూడ, గ్రీసుదేశమునకుఁ దూర్పుభాగమున నుండిన మనుజులు క్రీ. పూ. సం|| 1500 రములనాటికి నాగరికులై సర్వసంపదలతోఁ గూడి యుండిరని తెలియవచ్చును. రాళ్లను చెక్కి యొకదానితో నొకటిని సున్నమును వేసి బిగించుటయుఁ కుడ్యములను భాండాగారములును, గవాక్షములతోఁ గూడిన హజారములును వారు నిర్మించిరి. 'మిసిని' పట్టణములోని నగరుచూడఁ జిత్రంబుగ నుండును, గోపురములతోను, ఇరుప్రక్కల సింహముల శిలాప్రతిమలు గల మహోన్నతమైన సింహద్వారములతోను, స్తంభములపైఁ గట్టఁబడిన టాదులతోఁ గూడిన హవేలీలతోను, శిలాప్రతిమలతోను, కుడ్యములపై వ్రాయఁబడిన చిత్తరువులతో నానగరు ప్రకాశించుచున్నది. పంచరంగుల యిటికలతోఁ గట్టఁబడిన అగ్నివేదికలు కలవు, చిత్తరువులు చెక్కఁబడియుండిన గోరీలఁ జూడనగును; ధనుర్బాణములును; గదములును, డాల్కత్తులును, చర్మముతోఁ జేయఁబడిన కవచములును, రథములును—వీనిఁజూచి వారు నాగరికులని చెప్పవచ్చును. 'ఈజిప్టు' దేశపురాజు 'తృతీయ అమనేతపు'ని నామాంకితముతో ముద్రవేయఁబడియుండిన పింగాణిచిప్పలును కత్తులును, 'మిసిని'పట్టణము వారి మృత్పాత్రలతోఁ గలిసి యుండుటచేత నా రెండుదేశములవారికిని క్రీ. పూ. 15-13 శతాబ్దములమధ్యను సంబంధము కలిగియుండెనని తోఁచును.

ఇటుల నాగరికులై బలవంతులై యుండినవారిని జయించి కాని, లేక వారి ప్రాపకమున జీవనోపాధిని సంపాదించుటకుఁ గాని "కార్పథియను"

పర్వతప్రాంతములనుండి కొందఱు నవీనులు దేశములోనికి చ్చిరి; క్రీ. పూ. 12 శతాబ్దములో వీరు పైదేశములకుఁ బోయి తాము నేర్చిన నాగరికమును విదేశీయులకు నేర్పిరి.

మఱికొన్నిశతాబ్దములు గతించెను. ఆలోపున నొకదేశీయులు మఱియొక దేశమునకుఁ బోయిరి, ఒకరితో నొకరు గుద్దులాడిరి—"హోమరు" మహాకవి వర్ణించిన కాలము సంప్రాప్తమయ్యెను. ఆకావ్యములలోఁ జెప్పబడిన సంగతులు నిజముకానీ కాకపోనీ మనకు వాని ప్రసక్తి లేదు;వానిలో వ్రాయఁబడిన సాంఘికవ్యాపారములును ధర్మములును వినఁదగియున్నవి.

ఒకరాజు ప్రతిసంస్థానముఁ బాలించెను, అతఁడే న్యాయాధిపతి; మతగురువు, అతనికి "పశుపాలకుఁడు" అని పేరుకలదు అతనితరువాతవారు సామంతప్రభువులు; వారు రాజునకు మంత్రాలోచనలఁ జెప్పుదురు; వాని ప్రకారము బోధపడిన నతఁడు సంచరించును; లేకపోయిన నతనిని వారు నిరోధించుటకు వీలులేదు. గాయకులు వైద్యులు కవులు—అందఱికి గౌరవము కలదు. యుద్ధములో దొరకినశత్రువులు బానిసవృత్తి చేయుచుండిరి. వారిసాంఘికసూత్రములు సూక్ష్మమయినవి మార్గస్థుఁడుగాని యాత్రికుఁడుగాని రాదారిమార్గమునఁ బోవుచు, ప్రక్కలను గల వృక్షములనుండి ఫలములఁ ద్రెంచి భుజింపవచ్చును, అభ్యాగతులను వారు గౌరవించిరి. వారికి శరణాగతరక్షకులని బిరుదు కలదు. వారిస్త్రీలు ప్రౌఢలు, "ఉలిసెసు" అనువాని భార్య "పెనిలోపి" సకల సుగుణసంపన్నురాలు; ఆమెఁ బోలిన గృహిణిలేదు. "నాసిక" యను నామె కన్యకామణియని వన్నెకెక్కెను. పరువు తక్కువ యని యెంచక రాజకన్యలు గృహకృత్యములఁ జేయుదురు; వీరుల దుస్తులకు జరీబుటాల నల్లుచుండిరి. గొప్పవిందులు జఱిగినపుడు, గాయకులు"హోమరు" వ్రాసిన కావ్యములలోని గీతములను గానముఁ జేయుట కలదు.

ప్రథమమున గ్రీకులు "ప్రకృతి" దేవతారాధకులు; ప్రకృతిలోఁ గనబడు ప్రతిభూతమును దేవునిగ భావించి పూజించిరి. సూర్యుఁ డొకదేవుఁడు;

చంద్రుఁ డొక దేవత; భూమి "డిమిటరు" అను దేవత. ఈదిగువ యంత్రములను విడిచి, మీఁదివానిలోనికి వారు వెళ్లిరి. శరీరముఁబట్టిగాని లేక మనోతత్త్వము బట్టిచూచిన సంపూర్ణప్రభావముగల జీవులను పూజింప నారంభించిరి. "అథీని" అను దేవత నిర్మలమై శాంతమైన జ్ఞానము యొక్క యవతారము. ఆమె వీరమాత; సమస్తకళల కధిదేవత ; ఆమె సత్యజ్ఞానస్వరూపిణి. "అపాలో" దేవుఁడు; త్రికాలజ్ఞానసంపన్నుఁడు, కావ్యనాటకాలంకారముల కధిపతి. మానసికవిషయములలో 'అథీని' దేవతయెటుల సంపూర్ణప్రభావుగాలో, అటులనె 'అపాలో' దేవుఁడు శారీరకవిషయములో సకల పరిపూర్ణుఁడని వారు భావించిరి. మనుజులు చేయు ప్రతికార్యమున కధిదేవతలు కలరు. ఏకార్యములను మనుజులు చేయఁదలచిన, వానికిఁ బూర్వ మాయాదేవతలనారాధించి వారిసెలవుఁ గొనవలెను. ప్రతిసంవత్సరము "డీలాసు" ద్వీపములో "అపాలో" దేవుని మహోత్సవము జరుగుచుండెను; గ్రీకులు స్త్రీపురుష బాలబాల వృద్ధులాయుత్సవమునకుఁ బోవుచుండిరి. "ఓ అపాలో దైవమా, నీవు మాతండ్రివి, రక్షకుఁడవు, మాసర్వసంపదలకుఁ గారణభూతుఁడవు, మాకు జ్ఞానముఁ గలుగఁజేసిన దాతవు; నీయుత్సవము మహావైభవముతో జరుపుచున్నారము; నృత్యగీతవాద్యములు జరుగుచున్నవి, మల్లులు ముష్టియుద్ధముఁ జేయుచున్నారు నీకటాక్షముచేత మాకీవైభవము సమకూరెను" అని వారాదేవుని స్తోత్రముఁ జేసిరి.

వారి మతాభిప్రాయముల ననుసరించి "నాటకశాస్త్రము" పుట్టెను. వారు పూజించు దేవతలలో "డయొనిసను" యొకఁడు, అతఁడు ద్రాక్షఫలములకును ద్రాక్షతీఁగెకు నధిదేవత. ద్రాక్షఫలముల కాలములోఁ గాని, ద్రాక్షరసముఁ దీయునపుడుగాని, ద్రాక్షతీగెలఁ బెంచు సమయమునఁగాని వారాదేవుని పేరుఁ జెప్పి యుత్సవములఁ జేయుచుండిరి. ద్రాక్షతీఁగెలతో నిండినపర్వతభూభాగములపైఁ గూడి, కాపు లుత్సవమును నృత్యగీతవాద్యములతో జరిగించుట కలదు. వారిలో నొకఁడు తనకు సంభవించిన కష్టసుఖములఁ బాటఁగూర్చి యే రసమున పాడినయెడల నారసమున తదితరులు వాని దుట్టుగూడి పాటనుపాడు.

చుండిరి. ఆదేవుని దుఃఖచర్యలను గానముఁ జేయఁదలఁచినపుడు, దానికి ముందు వారొకగొఱ్ఱెను బలివేయుట కలదు. ఆటుల శోకరసభూయిష్ఠమగు నాటకమునకు "దుఃఖనాటక"మని పేరు వచ్చెను. సంతోషముఁ గలుగఁజేయు దానికి "ఆనందనాటకము"ని పేరుఁ బెట్టిరి మొదట నొకఁడు పాడినతిరువాతఁ దదితరు లేకగ్రీవమున గానముఁ జేయుచుండిరి. మఱికొంతకాలమునకు మొదటవానితరువాత మఱియొకఁడు గానముఁ జేసినపైని మిగిలినవారు ప్రారంభించిరి, తుదకు మిగిలినవారొకటేపాటను పాడుటకు బదులు, వేరు వేరుగ నాటకపాత్రలై, సంభాషణఁ జేయ మొదలుపెట్టిరి. ఇదియే నాటకమయ్యెను. ఈనాటకములను వారు మొదటను తిన్నెలపై బహిఃప్రదేశములలో నాడుచుండిరి క్రీ. పూ. 5వ శతాబ్దమునాటికి "ఈస్కైలసు" నాటకకవి నాటకములను సంపూర్తిగ వ్రాయ నారంభించెను: క్రీ. పూ. 4వ శతాబ్దము నాటికి "అధెన్సు" పట్టణములో, గుఱ్ఱపుడెక్క యాకారమున సోపానములతోఁ గూడిన యాసనములుఁ గలిగిననాటకశాల యొకటి కట్టఁబడెను.

ఇకను వారియాటలను గుఱించి విచారింపుదము, ఆటలనుకూడ వారు దేవుల ప్రీత్యర్థము ఆడుచుండిరి, ఆయాటలమూలమున దేహపుష్టి కలిగి వారు సలాకువలె నుండిరి; సొగసుగను తీరుగను మాంసపుకండలతోఁ బెరిగిన వారిశరీరములు నేత్రోత్సవములై యుండెను, "డెల్ఫి" పట్టణములో "అపాలో" దేవుని ప్రీతికిని, "కారింతులో" "పోసిడను" దేవత ప్రీతికిని ఆటపాటలను వారు జరిగించిరి, "ఒలింపసు" పర్వతముపై నివసించు మహోత్కృష్టుఁడైన "జియుసు" దేవుని ప్రీత్యర్థము మహావిభవముతో నాటపాటలతో నుత్సవమును వారు చేయుట కలదు. ఆయుత్సవముఁ జేసినసంవత్సరమునుండి వారు కాలప్రమాణమును నిర్ణయించుకొనుచు వచ్చిరి. మల్లయుద్ధము, ముష్టియుద్ధము, పాదసంచారము, రథగమనము—వీనిలో వారుపందెములు వేసికొని తమయావచ్ఛక్తిని వినియోగించిరి, వానిలో జయముఁ బొందినవానికి "ఇప్పపత్రకిరీటమును" బహుమతిగ నిచ్చిరి; ఆమూల్యాభరణములఁ గైకొనుటకంటె వారు దానితోఁ దృప్తినొందిరి; ఆబహుమతి నొందినవాఁడు స్వనగరములో విశేషముగ

మన్నింపఁబడును. వానిమాటకుఁ దిరుగు లేదు, వాఁడు కోరినపదార్థమును లేదనువారు లేరు.

వారిమతము ననుసరించి, వారిలో 'సోదెలు' కలవు. సోదెలఁ జెప్పించి వానిమూలమున దేవతల యభిప్రాయములను వారు కనుగొనుచుండిరి. వాయువు వీచుటవలనఁగాని లేక భూమిలోనుండి వెలువడుశబ్దము వలనఁగాని దేవతల యభిప్రాయములను వారు ప్రథమమునఁ దెలిసికొనుచుండిరి. అనంతరము 'డెల్ఫి' పట్టణములోని 'సోది' ప్రసిద్ధ మాయెను. ఆపట్టణసమీపమున నొకచిన్న గుహకలదు, అందులో నగాధమైన బావి యుండెను, ఆబావిలోనుండి కొన్ని వాయువులు పైకి వచ్చును: దానిపై త్రిపాదపీఠమును వేసికొని అందుమీఁద నొక'దాంచారి' కూర్చుండి యుండును, ఆవాయువుల నామెపీల్చి స్మారకముఁ దప్పి, ప్రశ్నలకు త్తరములఁ జెప్పును. క్రమముగ సుప్రసిద్ధమైనందున, నచట నొక దేవాలయమును భక్తులు కట్టించిరి, వారుసమర్పించినకానుకలు కట్నముల వలన దేవాలయమునకు విశేషము రాబడివచ్చెను. ఆదేవాలయము వలన దేశమునకును ప్రజలకును లాభమే కాని నష్టములేదు కాల మతీతమయినది. ఆటపాటలను, సరససంగీతసాహిత్యకావ్యనాటకాలంకారములను పురాణన్యాయమీమాంసతర్కవ్యాకరణధర్మశాస్త్రములను, సమస్త, విద్యలను కనిపెట్టి వాని నభ్యసించి వృద్ధిఁజేసి వారు ప్రయోజకులయిరి. ఒకదేశము నుండి మఱియొకదేశమునకు జనులు గమనించిరి. మఱికొందరు ద్వీపములలోను, 'ఆశియామైనరు' తీరములను, 'ఇటాలియా' దేశములోను నూతన సీమలను స్థాపించిరి. ఏనాఁడీసంగతులు జఱిగిననో, ఆనాఁడునుండి చరిత్రాంశములను నిర్ధారణతోఁ జెప్ప నగును. కాలాంతరమున వారు 'పశుపాలకావస్థను' విడిచిపెట్టి, సాంఘికులై నగరములఁ గట్టి సాంఘికసూత్రముల నల్లి రాజధర్మముల నేర్పఱచికొని జీవింప నారంభించిరి. ఆనగరములలో రెండుమాత్రము ప్రఖ్యాతి నొందెను. వేర్వేరుగ గాని కలిసిగాని గ్రీకులచరిత్ర మంతయు నా రెండుపట్టణముల నావరించియున్నది.

వానిలో 'స్పార్టా' యనుపట్టణము ప్రథమమున వన్నెకెక్కెను. దక్షిణ గ్రీసులో దక్షిణభాగమునకు 'లాకోనియా' యని పేరు కలదు. ఆపట్టణమా భాగమునకు రాజధాని. ఆభాగములోని మనుజులను 'లాకోనియను' లనియు 'స్పార్టను' లనియు రెండునామములతోఁ బిలుచుట కలదు. వారు దుర్బలులు; అంతఃకలహములతోఁ గూడి యుండిరి 'లైకర్గసు' అనువాఁడు వారికి సాంఘికసూత్రములను పద్ధతులను నేర్పి రాజధర్మముల నుపదేశించి వారి నుద్ధరించెను. వేషభాషలలో వారు అనాగరికులు; చుట్టుప్రక్కలనుండు వారితోఁ బోరాడుచుండిరి. అందుచేత, 'లైకర్గసు' వారిని యుద్ధములో నజేయులుగఁ జేయఁదలఁచెను; దాని కనుగుణముగ సూత్రములఁ బన్నెను. శిశువు భూపతితమయిన వెంటనె గ్రామపెద్దలు వచ్చి వానిని పరీక్షించి, బలవంతుఁ డగునని వారికిఁ దోచిన, తల్లిప్రక్కను శిశువు నుంచుటయు, బలహీనుఁ డగునని తోచినవానినిఁ దీసికొనిపోయి 'టాజిటసు' పర్వతశిఖరముపై బలవన్మరణము నొందుటకు విడిచి పెట్టుటయు జరుగుచుండెను. ఏడుసంవత్సరముల ప్రాయమున బాలకులు పాఠశాలలకుఁ బోయి కఠినశిక్షఁ బొందిరి, వారు పాదరక్షలులేకయే సంచరింపవలెను; తగినదుస్తులు లేకయే వారు విహరించవలెను, చాపలు గాని పరుపులు గాని లేకయే కఠినమైన నేలమీఁద వారు నిద్రింపవలెను, వారికిఁ గడుపునిండ నాహారములేదు; తెలియకుండ దొంగిలింపవచ్చును; బయలుపడి పట్టుపడిన దొంగ కఠినశిక్షఁ బొందెను. ఏయేవిధముల వారు మొండితేరి కష్టములను పాటింపరో, ఆయావిధముల వారు కాయక్లేశముఁ బడిరి. ప్రతి సంవత్సరము 'ఆర్టిమిజా' దేవాలయములో వారు రక్తము చిమ్మువఱకు దెబ్బలఁ దిని కన్నీరుఁ గార్చక బాధ నోర్చుచుండిరి ఎంతవఱకునైన సాముఁజేసి దృఢమైనదేహములు కలవారైరి; వారికి గానవిద్యలోఁ గొంచెము ప్రవేశముండెను. ఇరువదిసంవత్సరముల ప్రాయమునఁ బాఠశాలలను విడిచి "దండుశిబిరముల"లో వారు ప్రవేశింతురు; ఆనాడునుండి వారు రాజ్యదండనలోని వారయిరి. వివాహముఁజేసికొని సంసారవ్యాపారములుఁ జేయుచున్నను, వారు రాజ్యముకొఱకు

విశేషము శ్రమపడవలసి యుండెను. ఇట్టుల సర్వావస్థలయందును దేహపరిశ్రమఁ జేసి దేశమును వా రుద్ధరించిరి.

"ఆథెన్సు" నగరము యొక్క ఖ్యాతి దిగంతములకు వ్యాపించెను. అంతటికంటెను "అథీనియనులు" విశేషముగ నాగరికు లయిరి. ఆనగరమును మొదట నొకరాజు పరిపాలించెను. అనంతరము, సామంతప్రభువుల మంత్రాలోచనలఁ బుచ్చుకొనుచు, "ఆర్కను" అనుపేరు పెట్టుకొని సామంతప్రభువు ఒకఁడు రాజ్యముఁ జేయుచుండెను. నాటుదేశీయులనియు, ఫలవంతములైన భూముల నాక్రమించిన భూస్వాములనియు, వర్తకులనియు, మాలవాండ్రనియు, మెఱకభూములపై నివసించు పశుపాలకు లనియు వారిలో భేదములు కలవు. ప్రథమమున వా రనేకకష్టములఁ బడిరి; దేశ మరాజకమై యుండెను; ధర్మమార్గములు లేవు. అట్టిసమయమున, "డ్రేకో" యనువాఁడు న్యాయశాస్త్రముల నల్లి మిక్కిలి చిన్నతప్పులకు సహితము మరణదండనము విధించెను. 'ఈశాస్త్రములవలన వారికి క్షేమము కలుగలేదు. అనంతరము 'సోలను' అను న్యాయవేత్త ప్రజలక్షేమముఁగోరి సాంఘికశాస్త్రములనల్లి, రాజధర్మములను శాసించి వారిని సంస్థాపించెను. అటుపైని వారు క్రమముగ నౌన్నత్యమునకు వచ్చిరి. వయస్సు ముదిరినపైని 'ఈజిప్టు' 'ఆశియామైనరు' మొదలగు దేశములలో యాత్రఁజేసెననియు, తుదకు 'సోలను' 'లిడియా'దేశపురాజు 'క్రీససు'ను జూచెననియు వినుచున్నాము. ఆరాజు విశేషముగ ధనధాన్యములఁ గలిగియుండినందున, నతనికి భూలోకకుబేరుఁడని పేరువచ్చెను. అతఁడు 'సోలను' జూచి 'భూలోకములో నెవఁడు సౌఖ్యవంతుఁడ?'ని యడుగ, నతఁడు రాజుంజూచి, 'ఓరాజా! నీవు ధనముఁగలవాఁడవు, కాని, నీవు మాత్రము కావు.' అని చెప్పెను.

మఱికొంతకాలమువఱకును 'ఆథెన్సు'నగర మంతఃకలహములచేఁ బీడింపబడి బలహీనమై యుండెను. ఆసమయమున 'క్లిస్తనీసు' అనువాఁడు 'ప్రజారాజ్యము'ను స్థాపించెను, అంతటినుండి దేశమునకు స్వాస్థ్యము వచ్చెను; దినదినప్రవర్ధమానమై బాలచంద్రునివలె నభివృద్ధినొందెను. 'పెరిక్లీసు' పరిపాలన

కాలము సగము భుక్తియగునప్పటికి, వారు పరమోచ్ఛస్థితికివచ్చిరి. 'వీరనాయక' యని ప్రసిద్ధిఁజెందిన 'అథీని'దేవత శిరస్త్రాణమునువహించి, ఒకచేతిలో బల్లెమూఁబట్టుకొని మఱియొకబాహుదండముఁజాచి నిలువఁబడియుండినకంచువిగ్రహము చిన్నకొండశిఖరము నలంకరించియున్నది; బాలాతపకిరణము లామెపైఁ బ్రసరింప దూరముగసముద్రముపై యాత్రఁజేయుచుండిన "అథీనియను"నావికులకును నగరవాసులకు నామె పరిపూర్ణానందసంధాయి యయ్యెను. ఆకొండ పాదాగ్రమున "అక్రోపొలిసు" అను, దేవసభవంటి సభామంటపము కలదు, దాని కనతిదూరమున "ప్రార్థినాను" అను "అథీని" దేవతాలయము కనఁబడును, ఆదేవాలయములో నాదేవతయొక్క దారువిగ్రహముచూడఁగును; దంతపు నగిషీచేయబడి నవరత్నఖచితమైన బంగారుకవచము దొడిగియుండిన నాదేవి ప్రసాదాభిముఖముతో నాహ్లాదజననియై యుండెను. ఆదేవాలయముముఖద్వారమున "నికేయి—ఆప్టీరసు" అను పక్షములు లేని జయదేవతయొక్క సుందరవిగ్రహము కలదు. వారు నిర్మించిన భవనములు చక్కనివి, వారుకట్టిన దేవాలయములు రమ్యమైనవి; వారుచేసిన బొమ్మలు సుందరమైనవి తదేకధ్యానమున సర్వకాలసర్వావస్థలయందును నిర్గుణమైన శృంగారమును చింతించి సకలవ్యాపారములందును దానిని సగుణముగఁ బ్రవర్తింపజేసి వారు సకలకళాపరిపూర్ణులై వర్ధిల్లిరి.

గ్రీకుల మహోత్కర్షను రాబోవు సంపుటములలో బహుళముగ విస్తరించెదము. ఇచటను, వారిచరిత్రలో ముఖ్యాంశములను మాత్రముగ వ్రాయుచున్నాము.

క్రీ. పూ. సం॥ 490-479 రములు:—దేశమునకు స్వాస్థ్యము కలిగెను. దేశీయులకు జవసత్వములు వచ్చెను. వారు కొంచెము శిరస్సుల నెత్తి తిరుగుచుండిరి. అంతలో వారికి 'పారసీకుల'తో యుద్ధము సంభవించెను; దానికిఁ గారణములను 'పారసీకదేశ' చరిత్రలోఁ జదివియున్నారము.

పారసీకచక్రవర్తి పంపిన రాయబారులు గ్రీసుదేశమునకు వచ్చి 'ఓ గ్రీకులారా, మాచక్రవర్తి ప్రతాపుఁడు, జగదేకవీరుఁడు; అతనికి మీరుభృత్యులై

యుండవలెను, అందును నిదర్శనముగ తగుమాత్రము మన్నును నీరును మీ కివ్వవలెను' అని వారితోఁ జెప్ప, 'మీకుఁగావలయునంత మన్నును నీరును తీసి కొనుడ'ని బదులుచెప్పి గ్రీకులు వారిని బావిలోనికిఁ ద్రోసివేసిరి. పారసీకచక్రవర్తిదండు వెడలి వచ్చెను. 'మరాథాను' భూములపై గ్రీకులు వారితో ఘోరమైన యుద్ధముఁ జేసిరి, పారసీకులు కాందిశీకు లయిరి. గ్రీసుదేశమునకును ఐరోపాఖండమునకును పునర్జీవము వచ్చెను. మఱికొన్నిసంవత్సరములు గడచిన తరువాత, పారశీకులు దేశముపైకి వచ్చి 'ఆథెన్సు' నగరమును ధ్వంసముఁ జేసిరి. 'స్పార్టనుల' సేనాధిపతి 'లియోనిదాసుఁడు' తనసైన్యములతోఁ గూడ 'థెర్మాపిలా' కొండ కనుమల ముఖద్వారమున నుండి పారసీకులతోఁ బోరాడెను కాని వారతనిని జుట్టివేసిరి. వారంతయు వీరస్వర్గము నొందిరి. చక్రవర్తి "జరక్జేషుఁడు" కాల్బల్యమును వహించి, "ఆథెన్సు" నగరమును శాశనముఁ జేసెను. అతనిజయము క్షణభంగురము. "సలామిసు" వద్దఁ జఱిగిన నౌకాహవములోఁ బారసీకులు పరాభవముఁ బొంది స్వదేశమునకుఁ బోయిరి. ఇంతటనుండి పారసీకులభయము గ్రీకులకు లేకపోయెను.

క్రీ. పూ. సం. 479 రము — ఏబదిసంవత్సరములు గతించెను. రాజ్యధర్మముల బాగుగ గుర్తెఱిగిన వ్యవహారికులచేత నడిపింపబడి, "ఆథెన్సు" నగరము గంతులువేయుచు మహోచ్ఛ్రపదవికి వచ్చెను. "పెరికిలీసు" అను రాజ్యవ్యవహారస్థుని కులములో నానగరము గ్రీసుదేశమునకు నాయిక యయ్యెను. ఆమెఁ జూచి "స్పార్టనులు" లోకపోయిరి, కాని యేమియు చేయలేక యూరకుండిరి. దేశములో నొకసంస్థానము తరువాత నొకదానిని "అథీనియనులు" సాధించిరి, చుట్టుప్రక్కలనుండిన ద్వీపము లన్నియు వారిసామ్రాజ్యములోనికి వచ్చెను, వారనేక నూతనసీమలను స్థాపించిరి, ఆసీమలవారు సిరిసంపదలతోఁ దులఁదూగుచుండిరి, వారు వర్తకమును సాగించి ధనము నార్జించిరి. మహోన్నతమైన దేవాలయములను వారు కట్టిరి, "అథేని' దేవివిగ్రహమునకు బంగారు కవచమును దొడిగిరి, "ఫైదాసుఁడు" అను శిలాప్రతిమకారుఁడు చక్కని శిలాప్రతిమలఁ జెక్కెను. ఈకాలము "కృతయుగము"ని (క్రీ. పూ. సం

450—430 రములు) వారికిఁ దోఁచెను. న్యాయమీమాంసతర్క-వ్యాకరణధర్మ శాస్త్రవేత్తలును కావ్యనాటకాలంకార సరససంగీతసాహిత్యనిపుణులును మొదలగువా రాకాలములోనుండి ఆదిచరిత్రకారుఁడైన "హిరోడటసు" చరిత్రములను వ్రాసిరి, "థ్యూకిడైడీసు" బాలుఁడై క్రమముగ జ్ఞానాభివృద్ధిఁ జేసికొని ముందుకుఁ జరిత్రకారుఁ డయ్యెను. "ఈస్కిలసు," "సోఫోకిలసు" అను నిరువురు "నాటక" శాస్త్రము నభివృద్ధిలోనికిఁ దెచ్చిరి, "యూరిపడసు" వ్రాసిన "దుఃఖనాటకముల"ను విని ప్రజలు కన్నీరుఁ గార్చిరి 'అరిస్తపనసు' వ్రాసిన 'ఆనందనాటకముల'ను విని ప్రక్కలు ప్రక్కలగునట్లు ప్రజలు నవ్విరి. 'సోక్రేటసు' వేదాంతశాస్త్రమునకుఁ దిగినవిధమున జ్ఞానము నభివృద్ధిఁ జేసికొనెను. 'పెలుగుట విలుగుటకొఱకే' నని చెప్పినవిధమున, నేటినుండి 'ఆథెన్సు' నగరమునకుఁ బాటుకాలము సమీపించెను.

క్రీ. పూ. సం॥ 431 రము:— 'అథీనియనుల' సంపదఁ జూచి 'స్పార్టనులు' మండిపడుచుండిరి. 'అథీనియనుల'కు స్వాధీనములై యుండినచిన్న సంస్థానములు 'స్పార్టనుల' మాటవిని వారిపైఁ దిరుగఁబడిరి. 'అథీనియనులు' స్వదేశీయులతోఁ బోరాడిరి. 'పెరికిలీసు' దుఃఖాక్రాంతుఁడై స్వర్గస్థుఁ డయ్యెను; 'ఆథెన్సు' నగరములో మహామారి సంకటము ప్రవేశించి వేలకొలఁది ప్రజలను నమిలివేసెను 'అథీనియనుల' రాజ్యమునకు శృంగభంగ మయ్యెను.

'స్పాక్టీరియా' వద్ద జరిగిన నౌకాహవములో 'అథీనియనులు' 'స్పార్టనుల' నోడించిరి. కాని వారికి నీచదశలు సంప్రాప్త మయ్యెను. 'ఆల్సిబియాదీసుఁ'డను నొక అథీనియనుఁడు బయలువెడలి, స్వనగరము నుద్ధరింపఁ గలచెను. వాఁడు ధనికుఁడు గర్విష్ఠి పిచ్చియాలోచనలఁ జేసి, స్వదేశీయులతో యుద్ధము జరుగుచుండ 'అథీనియనుల'ను వెంటఁదీసికొని 'సిసిలీ' ద్వీపముపై నతఁడు దండువెడలెను. అతఁడు దేవతలను దూషించెనని స్వనగరవాసు లతనిపై నేరస్థాపనఁ జేసిరి. 'అథీనియనుల' యెదుటఁ బడి నిర్దోషినని చెప్పుకొనుట కతఁడు భయపడి స్వసైన్యములను విడిచిపెట్టి 'స్పార్టనుల' శరణుఁ

బోచ్చెను. వారతని విశ్వసింపనందున, నతఁడుపకారియై 'పారసీక దేశము'నకుఁ బోయెను. గ్రీసు లంతఃకలహముచే బలహీనులై యుండినందున వారిని జయించుట సులభమని చెప్పి పారసీకుల నతఁడు యుద్ధసన్నద్ధులం జేసెను. పారసీకులు చేసినగౌరవమున కతఁడు సంతసింపక, వారికిని 'అథీనియనుల'కును పొత్తుఁ గలిపి, అందుమూలమున 'ఆథెన్సు'నగరమునకుఁ బోయి దానిని పరిపాలింప వలె నని యుద్దేశించెను. 'స్పార్టనుల' దాడికి నిలువలేక 'అథీనియనులు' మూలుగుచుండిరి. ఏవిధముననైన తమకష్టములు నివారణ యగునని యెంచి, వారతని మాటల కొప్పుకొనిరి. 'అథీనియనుల'కతఁడు సేనాధిపతి యయ్యెను, వారతనిని రాజ్యపరిపాలకునిగ నియోగించిరి. నీచపశ లతనికిని సంప్రాప్తమయ్యెను. 'అథీనియనుల'పేరు చెప్పినవిని మండిపడుచుండిన పారసీకచక్రవర్తి 'కైరసు' సైన్యములతో వచ్చి వారికిఁ బ్రతికక్షు వహించెను. 'స్పార్టనుల' నౌకాసేనాధిపతి 'లిసాండరు' నావలను నడిపించుకొని దక్షిణమునుండి వచ్చెను. ఇటుల రెండుసైన్యముల మధ్యనుండి, నిర్లక్ష్యముతో నతఁడు చేయునది లేక తటస్థుఁడై యుండెను 'ఏజెసుపోటామి'యద్ద జరిగిన నౌకాహవములో 'అథీనియనులు' పరాభవము నొందిరి. అంతటితో వారినగరప్రాకారపుగోడలు నేలఁగూలెను. వారు 'స్పార్టనుల'కు భృత్యు లయిరి, వారి రాజ్యమంతరించెను.

క్రీ. వే సం|| 401 రము. మఱి యేబది సంవత్సరములవఱకు నంతఃకలహములలో గ్రీసులు చిక్కుపడి యుండిరి. 'స్పార్టనుల'కు దేహబలముగాని బుద్ధిబలము లేదు, వారి ప్రభ కొంచెము కాలము మాత్రమె వెలిగెను బ్రతికి చెడినవారు గనుక 'అథీనియనులు' పూర్వపుస్థితికి రాదలచి ప్రయత్నించిరి. గాని వారియత్నములు సాగలేదు. బుద్ధిమాంద్యమునకుఁ బ్రసిద్ధి కెక్కిన 'బియోషియా' దేశీయులు 'ఎపామినాండాసు'ని నాయకునిగఁ జేసికొని కొంచెము కాలము ప్రబలులై పెట్రేగిరి. యాదవులు వలె గ్రీకులు వారిలో వారు గ్రుద్దులాడి నీరసించిరి, వారి స్వాతంత్ర్యమునకు వినాశకాలము వచ్చెను.

"బియోషియా" దేశములో గొంతకాలము "ఫిలిప్పు" అనువాఁడు కారాగృహములో నుండవలసి వచ్చెను, ఆ సమయమున నతఁడు గ్రీకులయుద్ధ రహస్యములను గ్రహించెను. అతఁడు నేఁడు గ్రీసుదేశమున కీశాన్యమూల నుండు "మాసిడను" దేశమున కధీశుఁడయ్యెను; అతఁడు స్వదేశముఁ జక్కపఱచి దండువెడలి గ్రీసుదేశముపైవచ్చి పడెను అతనియెదుట వారు నిలువలేక పోయిరి. 'డెమాస్తనీసు' అనువాఁడు తనవాచాలత్వముఁ జూపి 'అథీనియనుల' నుత్సహించినపైని వారు 'ఫిలిప్పు'తో యుద్ధముఁజేయుటకుఁ బోయిరి, కాని క్రీ. పూ. స, 338 రములో 'కైరోనియా' వద్దజఱిగిన యుద్ధములో వారు పరాభవముఁ బొందిరి. నాటితో వారిస్వాతంత్ర్య మంతరించెను. వారు 'మాసిడను' దేశమునకు స్వాధీను లయిరి 'ఫిలిప్పు' మరణానంతరమున వారు శిరస్సుల నెత్తఁజూచిరి కాని అతనికుమారుఁడు 'మహాఅలగ్జాండరు' వారిని మట్టివేసెను.

నేటితో గ్రీకుల మహారాజ్య మస్తంగత మయ్యెను. 150 సంవత్సరములు గతించినతరువాత, రోమకసేనాధిపతి 'ఫ్లేమినసు' వారికి స్వాతంత్ర్యము నిచ్చెను కాని దానిని వారనుభవింపలేక దుర్వ్యాపారములలో దిగినందున, రోమకులు వారిని శాసించి భృత్యవర్గములోఁ జేర్చిరి 'గ్రీసు' అపజయము నొందినను, తనకళలచేత విజయుని పరిభవించెను. సూర్యుని కాంతిచేత గ్రహములు ప్రకాశించు విధమున, గ్రీకులకళలచేత రోమకులును, అలగ్జాండరును, ప్రకాశించిరి.

ప్రాచీనదేశచరిత్రలు

10-వ ప్రకరణము.



అలగ్జాండరు రాజ్యము
10
సిథియా
ఈజియను సముద్రము
కాస్పియను సముద్రము
చిన్న ఆశియా
మధ్యధరాసముద్రము
అలగ్జాండ్రియా
పాల్థియా
మీడియా
అశీరియా
టైగ్రిసునది
బాబిలను
పెర్షియా
పారశీకసముద్రము
అరేబియా
ఎఱ్ఱసముద్రము
నైలునది
సింధునది
ఇండియా

శ్రీరస్తు.

అలగ్జాండరుచరిత్ర

దశమప్రకరణము.

ముప్పదిరెండవ అధ్యాయము.

క్రీ. పూ. సం. 350—200 రముఁలు.

ప్రాచీనమహారాజ్యము లొకటి తరువాత నొకటి "మహాఅలగ్జాండరు" నకుఁ బాదాక్రాంతము లయ్యెను — "మహాపురుషులజీవితము" లను గ్రంథములో నతనిజీవితచరిత్రముఁ బొందుపఱచియున్నారము అందులో విశదీకరింపని యంశముల నిందుఁ వ్రాయుచున్నాము.

'మాసిడను' దేశము మొదట నంతఃకలహములోఁ జిక్కుపడి స్వాస్థ్యము లేక యుండెను. అటువంటి దేశమును 'సిలిప్పు' అను రాజు యుద్ధరించెను. ఆదేశీయులు సాంఘికులై రాజధర్మముల కొడంబడిరి. అతని ప్రాపకమున వారు గ్రీసుదేశమును సాధించిరి అతనికుమారుఁడు 'అలగ్జాండరు'—అతఁడు దేహసౌష్ఠవము కలవాఁడు; తండ్రిమరణానంతరమున నతఁడు నిరాటంకముగ సింహాసన మెక్కెను. అతనిరూపరేఖావిలాసములం జూచి, మనుజు లతనికి భృత్యు లయిరి. వా రతనిమాటను మీఱలేదు. సైనికు లతనినిఁ బ్రేమించిరి. అతఁడు విదేశీయులను సాధించినను, ఆయాదేశీయు లభిలషించెడి స్వసాంఘికసూత్రములను స్వరాజ్యధర్మములను నిలుపఁబెట్టి వాని ననుసరించి వారిం బరిపాలించుటచేత, వా రతనిని మనఃపూర్వకముగఁ బ్రేమించిరి. ఏదేశీయు లత

నికి భృత్యులయి యుండిరో, ఆయాదేశీయులచేత నారాధింపబడు దేవతల నతఁడుకూడఁ బూజించెను. అందుచేత నతఁడు వారికిఁ బ్రేమాస్పదుఁ డయ్యెను. తమలోనివాఁడని వారు భావించిరి. అన్యుఁ డనివారు తలచలేదు.

ప్రాచీనదేశముల చరిత్రములను వ్రాసియుంటిమి; ఏవిధమున నతఁడు వానిని జయించెనో చెప్పియున్నాము. ఆయంశముల నిచట సంక్షిప్తముగ వ్రాయుచున్నాము.

ఇరువదిసంవత్సరముల ప్రాయమున నతఁడు రాజ్యమునకు వచ్చెను, అంతలో గ్రీకులు తిరుగబడిరి ; అతఁడు వారిని సునాయాసముగ సాధించెను. అనంతర మతనికిఁ దూర్పుదేశములను జయింపవలెనని కోరిక కలిగెను. 'నాయనా, నీకీ 'మాసిడను' దేశము సరిపడదు. నీవు పరాక్రమశాలివి గనుక విదేశములను జయింపు'మని తండ్రి పలికిన పలుకులయందతనికి గురి తప్పలేదు. అతఁడుచిన్నతనమునుండి గ్రీకులలో మెలగుచుండినందున, వారివేషభాషలను ఆచారవ్యవహారముల నతఁడభ్యసించెను; అతఁడు గ్రీసుదేశమును పిత్రార్జిత మనిభావించెను. అతఁడు 'డెల్ఫి' పట్టణమునకుఁ బోయి సోదె వేయించి చూడ 'ఓకుమారకా, నీవు అజేయుఁడ' వని ప్రత్యుత్తరము వచ్చెను. అతఁడు శీఘ్రము బయలువెడలి సైన్యములతోఁ బారశీకదేశముపై బడెను. ఈకాలములో నతనిగుణములతిశయించెను, వానిమూలమున నతనిని విదేశీయులు ప్రేమించిరి. 'అర్బెలా, యుద్ధము జరుగుటకుఁ బూర్వము, సైనికు లతనింజూచి 'ఓరాజా మన మీరాత్రి దొంగతనముగఁ బోయి పారసీకచక్రవర్తినిఁ బట్టుకొనియెద' మనిచెప్ప, అతఁడు 'నేనుదొంగను కాను; మీరు కారు—మనకు దొంగజయము కూడ' దని వారి నివారించెను. మఱియొకనాడు 'ఓరాజా నీవైద్యుఁడు నీవు సేవించు ఔషధములో విషము గలుప నుద్యుక్తుఁడై యున్నవాడు. కనుక నీవు జాగరూకుఁడవై యుండు' మని యుత్తర మతనికి వచ్చెను. మరునాఁ డుదయమున వైద్యుఁడు వచ్చి ఔషధము నతనికిచ్చెను. అతఁడు దాని నందుకొని 'నీవుమాకు విషముఁ బెట్టవలెనని తలంచినట్లు తెలియుచున్నది' అని వైద్యునితోఁ జెప్పి, వానిచేతిలో నాయుత్తరముఁ బెట్టి దానిని త్రాగివేసెను. పారసీకము, అశీరా

మైనరు, పాలస్తైను, సిరియా, ఫొనీషియా, ఈజిప్టు—మొదలుగాగల దేశముల నతఁడు సాధించెను. తూర్పుదేశీయులు కొంద రతనిని నిరోధించిరి; అతఁడు 'రోజని' యను వారి రాజకుమార్తెను వివాహమాడిన తరువాత వారతనికిఁ బాదాక్రాంతు లయిరి. అనంతర మతఁడు 'సింధు' నదిని దాటి 'ఆర్యావర్త' ప్రదేశమును స్వాధీనముఁ జేసికొనెను. తూర్పుమహాసముద్రము వఱకుఁ గలదేశముల నతఁడు జయింప నుద్దేశించెను కాని సైనికు లతనిని నిర్బంధముఁ జేసినందున, నతఁడు స్వదేశాభిముఖుఁడై 'బాబిలను' పట్టణమునకు వచ్చిచేరెను.

ఇటుల దిగ్విజయమునొంది సర్వసామ్రాజ్యాభిషిక్తుఁడై రాజభవనములో నతఁడు ప్రవేశించెను. దివానులును, ప్రధానులును, సేనాధిపతులును, సామంతప్రభువులును, విదేశాధీశులును——మొదలగువారు కొలువుకూటంబున పరివేష్ఠించి యుండ, నతఁడు సింహాసనము నధిష్ఠించి తారాగణములోని చంద్రునివలెఁ బ్రకాశించి, కొందఱిని తర్జించుచు కొందఱిని శ్లాఘించుచు, కొందఱిని భూషించుచు, కొందరినిఁ జూచి శిరఃకంపముఁ జేయుచు, కొందరిని భూషణములతో నలంకరించుచు, కొందరితో దర్శించుచు—ఇటుల నానా విధముల నందరిని మెప్పించి రాజ్యముఁ జేసెను. కాల మతనికి సమీపించెను, దిగ్విజయుని మృత్యుదేవత జయించెను.

అతనితమ్ముఁడు రాజ్యమునకు వచ్చెను కాని అతఁడు దుర్బలుఁడు; రాజ్యతంత్రములను గుర్తెఱుఁగఁడు. విదేశములలోనుండిన సేనాధిపతు లాయా దేశముల నాక్రమించిరి, 'అలగ్జాండరు' దేశములను సాధించెను గాని వానికి స్వాస్థ్యముఁ గలుగఁజేయలేదు. దేశములు కలతఁ జెందియుండెను. ఒకదానిపై నొకటి దండువెడలుచుండెను. సాంఘికసూత్రములు మాసిపోయెను; రాజ్యధర్మములు మాటుపడెను, మాత్స్యన్యాయము ప్రబలమయ్యెను. ఒకదేశము తరువాత నొకదేశము మెరుపువలె క్షణకాలము ప్రకాశించి చల్లారెను. రెండు వందలసంవత్సరముల వఱకును తూర్పుదేశములన్నియు చీకాకు పడియుండెను.

అలగ్జాండరు.

అలగ్జాండరు యొక్క దిగ్విజయము వలన సమస్తతూర్పుదేశములకును గ్రీకులవేషభాషలును వారియాచారవ్యవహారములును వారిరాజ్యధర్మములును వ్యాపించెను. వానిని నిదానముగఁ జేసికొని తూర్పుదేశీయులు వ్యవహరింపనారంభించిరి. అవి వారికి గర్భీకృతములు కానంగునఁ, గొంచెము కాలములో నశించెను.

మహారాజ్యములో నంతట పట్టణములు స్థాపింపబడెను. ఆనగరవాసులు నానాదేశీయు లయినను, వారిలోని సామంతప్రభువులు గ్రీకు లయియుండిరి. గ్రీకులయాటపాటలను, వారిభాషను నేర్చినవారు నాగరికు లయిరి. పాఠశాలలో 'గ్రీకు'భాష నభ్యసించిరి, గ్రీకుల విధమున చిత్తరువులను వ్రాసిరి, సర్వము గ్రీకుమయ మయ్యెను. ఆకాలమున గ్రీకులవేదాంతుల ప్రభావము నలుదిక్కులను వ్యాపించెను. గ్రీసుదేశము వేదాంతమునకుఁ బుట్టినయిల్లు వారిలో నిరువురు ప్రతికూలమైన సిద్ధాంతములఁ బోధపఱచి లోకవిఖ్యాతిం బొందిరి. 'ఎపికూర్యను' అనువాఁడు 'ఆనందము ననుభవించుటకు మనుజుఁడు జీవించుచున్నాఁడు' అని సిద్ధాంతముఁ జేసి దానిని శిష్యుల కుపదేశించెను. ఆనందమనిన స్వేచ్ఛానుసారము భోగముల ననుభవించుటకాదు. కామ్యములు లేనిజీవనమువలన మనస్సునకుఁ దృప్తియు నైర్మల్యముఁ గలుగును, అందువలన బుద్ధిమాంద్యము విడును, తన్మూలమున వస్తుతత్త్వమును బాగుగ గుర్తెఱుఁగ నగును, అదియె ఆనందమని వాని తాత్పర్యము వానిశిష్యులు కొంతికాలమునకు గురూపదేశమార్గంబుల విడనాడి, విషయాసక్తులై భ్రష్టులయిరి

'జెనో' యనువాఁడు మఱియొకవిధమున నుపదేశించెను; అతఁడు దుర్బలుఁడు కనుక నిష్కామముగ జీవించెను. ఆతని సిద్ధాంతములు పూర్వమువానికంటె గొప్పవి. సుఖముగాని దుఃఖముగాని కలిగినను, వాని ప్రసక్తి లేక, ధర్మార్థమె ధర్మము నాచరింపవలె నని యతనిసిద్ధాంతము. మనస్సు నతికట్టిన, బుద్ధి వికసించుననియు, అందువలన ద్వంద్వముల కతీతుఁ డగుననియు శిష్యుల కతఁ డుపదేశించెను. ప్రాచీనకాలమునుండి నమ్ముచుండిన దేవులను దేవతల నారాధించుట విడిచిపెట్టి ఈరెండు ప్రతిపక్షసిద్ధాంతములను దేశీయు లవలంబించి, రాజ్యసంబంధములు లేనివారు సహితము వీనిమూలమున సంబంధమును గలుగఁజేసికొనిరి.

ఈకాలములో నీ గ్రీకుల శిలాప్రతిమల వైభవము వెల్లడి యయ్యెను. క్రీ. పూ. 3-వ శతాబ్దమున 'కట్ట'ల దాడిచేత 'గ్రీసు' 'ఆశియామైనరు' దేశ

ములు బాధపడుచుండ, 'అపాలో' 'బెల్వెడీరు' మొదలగువాని శిలాప్రతిమలు బయలువెడలెను.

'మహాఅలగ్జాండరు' స్థాపించినపట్టణములలో 'ఈజిప్టు' దేశములోని 'అలగ్జాండ్రియా' పట్టణము 'టోలమీ'ల రాజులకాలమున సుప్రసిద్ధమయ్యెను. ఆపట్టణము నలుచదరముగ నాలుగు ప్రాకారములమధ్య నిమిడియుండెను; వానిలో రాదారిమార్గములు కలవు. ఆపట్టణములోని సర్వకళాశాల నాల్గుశతాబ్దములవఱకు సరస్వతీపీఠమై యుండెను. ఆపట్టణమునకు సమస్తదేశీయులు వచ్చి, అచ్చటిపుస్తక భాండాగారములలోను సర్వవస్తుదర్శనశాలలలోను, వస్తుతత్త్వ విచారణశాలలలోను విద్యల నభ్యసించుచుండిరి.

ఈసర్వకళాశాలలలోవిద్యార్థులకు 'రేఖాగణితము'ను బోధపఱచుచు 'యూక్లిడు' మహామహోపాధ్యాయుఁడుగ నుండెను. ఆరేఖాగణితమును ప్రథమమునఁగని పెట్టి శిష్యులకుఁ జెప్పినవాఁడతఁడు కాఁడు. అతనికంటెఁ బూర్వము వందలసంవత్సరములనుండి "ఈజిప్టు" దేశీయులకుఁ దెలిసి, వారాశాస్త్రము ప్రకారము 'నైలు' నదీతీరప్రాంతములఁ గొలిచి యుండిరి. ఆగణితము ననుసరించి భూమివైశాల్యమును గుర్తెఱుగ నగును. క్రీ. పూ. సం॥ 301ర మున స్థాపింపబడిన సర్వకళాశాలలో నతఁ డుపాధ్యాయుఁడుగ నుండెను. 'ప్రథమటోలమి'యను రాజు రేఖాగణితము నతనివద్దఁ జదివెను. అతఁడు గురువుఁ జూచి, 'ఓస్వామి! ఈశాస్త్రమును సూక్ష్మమార్గమునఁ దెలియఁజేయుడు' అని ప్రార్థించిన, 'యూక్లిడు' శిష్యునిఁ జూచి, 'ఓరాజా, రేఖాగణితమునకు రాజమార్గములేదు.' అనిచెప్పెను. ఒకనాడు మఱియొకశిష్యుఁడు ప్రథమపాఠమును నేర్చుకొని, 'దీనిని నేర్చుకొని పూర్వముకంటె నేమి బాగుపడితిని' అని తలంచెను. ఆసంగతి గురువుతెలిసికొని ఆశిష్యునిఁ బిలిచి, వానిచేతిలో నర్ధకాసుఁ బెట్టి, వానిని పంపివేసెను.

—

ప్రాచీనదేశచరిత్రలు

11-వ ప్రకరణము.



II
ఈజియను సముద్రము
కాస్పియను సముద్రము
జాక్సార్టీసునది
బాక్ట్రియా
ఆర్మీనియా
టైగ్రీసునది
యూఫ్రటీసునది
మిడియా
సిరియా
బాబిలోనియా
బాబిలను
దమాస్కసు
అరేబియా
పెర్షియా
పారశీకసముద్రము
సింధునది
ఇండియా
పార్థులరాజ్యము

శ్రీరస్తు.

పార్థలచరిత్ర

ఏకాదశప్రకరణము.

ముప్పదిమూఁడవఅధ్యాయము.

క్రీ. పూ. సం. 250 రము. క్రీ. వె. సం. 227 రము.

'మహాఅలగ్జాండరు'స్వర్గస్థుఁడైనశతాబ్దములోఁగొందఱు 'పార్థుల'ను పేరుతో బయలువెడలిరి. మనోబుద్ధిబలముల వలనఁ గాక, కేవలము దేహబలముచేతి వారు ప్రసిద్ధులయిరి 'కాస్పియను'సముద్రమునకాగ్నేయభాగమున చెన్నపురి రాజధానియంత వైశాల్యము గల ప్రదేశములో వారు నివసించిరి, వారు 'తురేని' యను కుటుంబములోనివారు వారిబుద్ధి మందము. సీమగంగా యాత్రవలె వారు నాగరికులయిరి 'వారు సిథి' యను తెగలోనివారని కూడఁ గొందరి మతము. వారిదేశము సారమైంది. భూములను సాగుచేయక, వారెల్లప్పుడు నశ్వారూఢులై సంచరించుచుండిరి

ఇటుల నిలుకడలేని 'సంచారావస్థ' లో నుండుటచేత స్వదేశమును విస్తరింపఁజేయుటకు వారుతలచి, ఇంచుమించుపారసీకరాజ్యమును యావత్తును సాధించిరి. అందువలన 'పార్థుల'రాజ్యము 'రుధిర' సముద్రతీరములనుండి 'జాక్సారిటీసు' నదీతీరములవఱకును, 'సింధు' నదిమొదలు 'ఆసియామైనరు' వఱకును వ్యాపించియుండెను.

'మహాఅలగ్జాండరు' మరణకాలమువఱకును వారు దేశచరిత్రములోఁ గానరారు. అంతవఱకు వారు పారసీక సామ్యవర్గములో నుండిరి, పారసీకచక్ర,

వర్తి వారితోఁ గూడ 'దిగ్విజయుని' పాదాక్రాంతుఁ డయ్యెను అతఁడు చని పోయినతరువాత, 'మధ్యధరాసముద్ర' తీరమునుండి 'సింధు' నదివఱకుఁ గల ప్రదేశము 'సిరియా' దేశములోఁ జేరను అతనిసేనాధిపతియైన 'సేల్యూకసు' అనువాఁ డీయావద్దేశమునకు రాజయ్యెను పార్థులుకూడ నతనికి భృత్యులయిరి ఈరాజ్యములోని దేశములన్నియు విడివిడిగ నుండెనుగాని సామాన్యమగు రాజ్యధర్మములచేత నొకదానితో నొకటి బిగింపఁబడలేదు. అటులవానిని బిగించుటకుఁ దగినసామర్థ్యము 'సేల్యూకసు'నకు లేకపోయెను. అతనికి దేహబలముగాని బుద్ధిబలము లేదు. స్వలాభమును కోరి విదేశములను జయించుటలో నతఁడు కాలముఁబుచ్చెను. విదేశక్షేత్రపతుల నతఁడు కఠినముగ శిక్షించుచుండెను అంతియకాని, ప్రజలకు సాంఘికపద్ధతులను బోధపఱచి, వారికి రాజ్యధర్మముల నతఁ డుపదేశింపలేదు. అందుచేత నతనిని ప్రజలు మన్నింపలేదు

క్రీ॥ పూ॥ సం॥ 250రము 'సిరియా' దేశమునకు 'అంటియాకసు' ప్రభు వయ్యెను. అతఁడు నియోగించిన క్షేత్రపతి 'పార్థులను' పీడించుటచేత, వారతనిని జంపి, 'ఆర్సేసు' ని రాజుగాఁ జేసికొని స్వతంత్రరాజ్యమును స్థాపించిరి. వారిని దండింపలేక, "అంటియాకసు" యూరకుండెను. ఆర్సేసుని తరువాత నతనిసోదరుఁడు "త్రిదేతిశుఁడు" రాజ్యమునకు వచ్చి 'మహారాజు' అని బిరుదునహించి దేశమును పరిపాలించెను. అతనికాలమునుండి 'పార్థులు' స్వతంత్రులయిరి.

ఇటుల నూతనముగ స్థాపింపఁబడిన రాజ్యమునకు నాగరిక విధానములు లేవు, పార్థులదేశములో నగరములులేవు, అన్నికాలములలోను వారశ్వములపైఁగాని శకటములలోఁగాని జీవించుచుండిరి ఒకనూరుగురు సామంతప్రభువులు రాజునకు సేవఁ జేయుట కలదు, తదితరజనులు వారికి భృత్యులై యుండిరి; వీరు కత్తికుఠారములఁబట్టుకొని యుద్ధముఁ జేయుదురు. రాజు సామంతులను, వారు భృత్యులను శాసించుచుందురు ; యుద్ధసమయమున రాజు సామంతుల నాజ్ఞచేయ, వారు సైన్యములఁ గూర్చుటకలదు. సైనికులు గొలుసుకవచమును

ధరించి. అశ్వారూఢులై, యుద్ధమునకు గమనింతురు. అశ్వములపై మెత్తలు లేక వారు స్వారీ చేయుదురు. వారు శత్రువులను భీభత్సుఁ జేసి జయముఁ బొందుదురు; అందుచేత వారికి "భీభత్సు" లని పేరు వచ్చెను. వారికి దేవుఁడు కాని గురుఁడు కాని లేఁడు; పాపపుణ్యములని మాత్రము వారికిఁ దెలియును; సూర్యచంద్రులను దైవము లని భావించి వానిని వారు పూజించుచుండిరి.

రాజు కొలువుకూటము మహావిభవముతో నుండెను; అతఁడే ప్రదేశములకుఁ బోయిన నచట రాజసభ జరుగుచుండెను. సాధారణముగ రాజు సామాన్యమైనదుస్తులను ధరించి, శిరమున కొకపట్టుపట్టును కట్టుకొనెను. పార్థులు తమశిరోజములను శిఖలుగఁ జుట్టిపెట్టుకొందురు. పట్టణపురాణియు, రాజాంగనలును, తదితరస్త్రీలును, రాణివాసములో నుందురు. రాజభవనములు మనోహరముగ నుండెను రాజదర్శనములకుఁ బోవువారు కట్నములఁ దీసికొని వెళ్ళవలెను. రాజుభోజనముఁ జేయుకాలమున నతనిప్రియమిత్రుఁడు తప్ప పరులు సమీపమున నుండకూడదు. కటాక్షించి భుజించుచు పాఱవైచిన పదార్థముల నతనిప్రియమిత్రుఁడు భుజించును. రాజు హంసతూలికాతల్పములపై నిదురించును. పార్థులు సకలకళావిహీనులు; వారికి గ్రంథములు లేవు; వారికి వ్రాఁత తెలియును; వారు వర్తకవ్యాపారములఁ జేయుచుండిరి.

ప్రథమమున పార్థులు తాము నూతనముగ సంపాదించుకొనిన స్వాతంత్ర్యమును నిలువఁబెట్టుకొనుటకు శ్రమపడిరి. "సిరియా" దేశపు సైన్యములు బహుళమై రణశిక్షను బొందినను, పార్థుల సైన్యములయెదుట నిలువలేక పోయెను.

"ప్రథమ-మైత్రదేటీశుఁడు" రాజ్యమునకు వచ్చినదిమొదలు వారు విదేశములను జయించుట కారంభించిరి. ఆరాజు ముద్రింపించిన బంగారు నాణెములఁ జూచి అతఁడు రాజలక్షణములఁ గలిగియుండె ననిచెప్పనగును. అతని కాలములో "పార్థియా"దేశము ప్రబలమై వన్నెకెక్కెను; ఆదేశీయులు రోమనులతో జగడమాడుటకుఁ దగినంతశక్తి గలవారైరి. ఆరంభ

ములో నతఁడు "బాక్ట్రియా" దేశమును జయించెను. "సిరియను"ల రాజు బాలుఁడై సామంతుల పోష్యవర్గములో నుండుటచేత నతని దేశమునకు స్వాస్థ్యము లేకపోయెను. అందుచేత "పార్థుల" రాజు సైన్యములఁ దీసికొని, "సిరియను"ల పోష్యవర్గములో నుండిన "మీడియా" దేశముపైఁ బడి, దాని రాజధానియైన "ఎక్బటాను" పట్టణమును పట్టుకొనెను; ఆపట్టణమును రాజధానిగఁ జేసికొని "మైత్రదేతీశుఁడు" పశ్చిమమున నుండిన "బాబిలను" "పారసీక" దేశములను సాధించి తూర్పున "సింధు" నదీపర్యంతము గలప్రదేశము నాక్రమించెను. ఇటులు పాదాక్రాంతులైన దేశీయు లతనికిఁ గప్పముఁ గట్టుచుండినను, వారు స్వరాజ్యధర్మముల నాచరించుచుండిరి; వారి రాజ్యధర్మముల నతఁడు స్వీకరించి వానిని స్వదేశములో నాచరణలోనికిఁ దీసికొని వచ్చెను. ప్రాచీన "అసీరియా" "పారసిక" మహారాజ్యములవలె నతఁడు మహారాజ్యమును స్థాపించి "రాజాధిరాజు" అని బిరుదు వహించెను.

ఆతనితరువాత 'ఫారతీశుఁడు' 'పార్థుల' సింహాసనమునకు వచ్చెను. అతఁడు దేశములను కఠినముగ పరిపాలించుటచేత, దేశీయులు తిరుగఁబడుటకు సిద్ధముగ నుండిరి. అంతలో 'సిరియా' దేశపురాజు 'అంటియాకసు' సైన్యములతోఁ బోయి మూఁడుయుద్ధములలో "పార్థుల"నోడించెను. "బాబిలను" దేశములోని చిన్నసంస్థానాధిపతులుకూడ "సిరియను"ల రాజుతో నేకమై "పార్థుల"పైఁ దిరుగఁబడి, 'సిరియను'ల పోష్యవర్గములోనికిఁ బోయిరి.

కొంచెము కాలము 'సిరియను'ల జయము నిలువఁ బడియుండెను. 'దమేత్రియసు' అనువాఁడు 'సిరియను' రాజుయొక్క సోదరుఁడు, పూర్వకాలమున 'పార్థుల' రాజు 'మైత్రదేతీశుఁడు' ఆతనిని పట్టుకొని తీసికొనివచ్చి స్వదేశములోఁ జెఱసాలలో నుంచెను. 'సిరియను'ల రాజు 'అంటియాకసు' 'బాబిలసు' దేశమును సాధించి వారిగృహములనుఁ బోవుటకు సెలవు నిచ్చి సైనికులను విడిచిపెట్టెను. వారు స్వనగరములకుఁ బోయి శిక్షను మీరి యుండినందున, నగరవాసులను వారు పీడించుచుండిరి. 'బాబిలను' దేశము పూర్వము

కంటె నరాజకముగ నుండెను. ఆసమయముఁ జూచి 'పార్థుల' రాజు 'ఫార తీశుఁడు' 'దమేత్రియసు'ను చెఱసాలనుండి విడిచిపెట్టి వానికిఁ గొంతసైన్యము నిచ్చి 'సిరియా' దేశముపైకిఁ బంపెను. అతనిరాక నగరమునుండి నగరమునకు వ్యాపించి దేశమంతట వెల్లడి యయ్యెను. దేశీయు లతనిపక్షముఁ జేరిరి. అందును 'ఫ్రాతీశుఁడు' సంతసించి వానికిఁ దానుగ నిలువఁబడి యుండెను. ఈసంగతులను విని 'అంటియూకసు' ఆత్మరక్షకభటులతోఁ గూడి 'బాబిలను' దేశమును విడిచి పాఱిపోవుచుండ, 'పార్థులు' వారినిఁ బట్టుకొని చిత్రవధఁ జేసిరి. అప్పటి నుండి 'సిరియనులు' తూర్పుదేశములను సాధించుటకుఁ బ్రయత్నములఁ జేయుటలేదు.

అనంతరము, 'పంచారావస్థ'లో నుండిన ప్రజలు దేశముపైఁ బడి ధ్వంసముఁజేయుచుండ, 'పార్థులు' వారితోఁ బోరాడి వారిని దేశమునుండి తఱిమివేసిరి; కాని వారప్పుడప్పుడు దేశముపైకి వచ్చుట కలదు. వారు మూర్ఖులనియు, కళావిహీనులనియు, అనాగరికులనియు చెప్పనేల? వారిదాడిచేత నాగరికులైన దేశీయులయొక్క శాస్త్రములకును, సంఘములకును, రాజ్యధర్మములకును, సంపదలకును, ముప్పు వచ్చెను. 'ద్వితీయ - మైత్రదేతీశుఁడు' రాజ్యమునకు వచ్చి వారిని నిశ్శేషముగఁ దునుమాడెను. అతఁడు 'ఆర్మీనియా' దేశపు రాజు 'తైగ్రనేశు'ని యుద్ధములోఁ బట్టుకొనెను; కొంతకాలము వానిని స్వనగరములో నుంచి పోషించి వానిదేశమునకుఁ బంపివేసెను. 'తైగ్రనేశుఁడు' స్వదేశమునకుఁ బోయి సైన్యములఁ గూర్చుకొని 'పార్థులపై' దండు వెడలెను. "పార్థులు" రోమకులసహాయముఁ గోరిరి. "పాంటసు" దేశమునకు రాజు 'మైత్రదేతీశుని'తో వారు జగడమాడుచుండినందున, రోమకులు సహాయముఁ జేయలేక పోయిరి. 'పార్థులు' వారిలో వారంతఃకలహములలోఁ జిక్కుపడి యుండిరి. ఆసమయముఁ జూచి 'తైగ్రనేశుఁడు' వారిరాజ్యములోఁ జాలభాగము నాక్రమించి స్వాధీనముఁ జేసికొనెను. క్రమముగ 'అశీరియా,' 'ఉత్తరమెసపొటేమియా', 'మీడియా', 'సిరియా', 'సిలీషియా', 'ఫోనీషియా'— మొదలగు 'పార్థుల' దేశముల నతఁడు స్వాధీనముఁ జేసికొనెను.

క్రీ. పూ. సం. 85—74 రములనాటికి 'ఆర్మీనియనులు' పరమోచ్ఛస్థితికి వచ్చిరి, 'పార్థుల ప్రభ కస్తంగతదోషము పట్టెను. 'పాంటసు' దేశము రాజు పశ్చిమరాష్ట్రముల నాక్రమించి, నేఁడు రోమకులతోఁ బోరాడుచుండెను. వారి పోరాటమును 'పార్థులు' తటస్థముగ నుండి చూచుచుండిరి. క్రీ. పూ. సం. 65 రమున వారికి మంచిదినములు కలసివచ్చెను. 'తైగ్రనేశు'ని కుమారుఁడు తండ్రితో వివాదపడి, 'పార్థుల' రాజు 'ఫారతీశు'ని శరణుఁ జొచ్చెను. 'పాంటసు' వేశము రాజు 'మైత్రదేతీశుని' సాధించుటకు రోమకసైన్యములతో 'పాంపేయుఁడు' దండువెడలి వచ్చి, 'ఫారతీశుని'తో సఖ్యముఁ జేసి, అతనిని 'తైగ్రనేశుని'పైకి యుద్ధమునకుఁ బంపి, తాను 'పాంటసు' రాజుతోఁ బోరాడెను, 'ఫారతీశుఁడు' కొంచెముకాలము 'తైగ్రనేశుని'తోఁ బోరాడి విసుగుఁ జెంది స్వదేశమునకు వచ్చెను, 'పాంపేయుఁడు' 'పాంటసు' రాజు నోడించి వానిదేశమును స్వాధీనముఁ జేసికొనెను, అనంతరము 'తైగ్రనేశుఁడు' కూడ నతనికిఁ బాదాక్రాంతుఁ డయ్యెను. సఖ్యముఁ జేసినపుడు చెప్పిన మాటల ప్రకారము రాష్ట్రములను పుచ్చుకొనుటకు 'ఫారతీశుఁడు' వెళ్లి 'పాంపేయుని'తో వానిని గుఱించి ప్రసంగించెను, 'పాంపేయుఁడు' కోపగించి, దేశముల నతనికి స్వాధీనముఁ జేయక, అతనిని దేశమునుండి తఱిమివేసెను.

క్రీ. పూ. సం. 55 రము. రోమకక్షేత్రపతి 'క్రాససు' 'సిరియా' దేశమును పరిపాలింపవచ్చెను, అతఁడు వయస్సులోఁ బెద్దవాఁడు. 'పాంపేయుని'వంటి వీరుఁడుకూడ 'పార్థుల'ను సాధింపలేకపోయెను, అట్టిసమయమున, పెద్దలు చెప్పినమాటలను వినక 'పార్థులను' సాధింపవలె నని 'క్రాసను' దాడివెడలెను. 'సిరియా' దేశములోని 'ఆంటియాకు' పట్టణమువఱకు నతఁడు దండుతో గమనించెను. 'గలేషియా' సంస్థానాధిపతి స్వనగరముయొక్క ప్రాకారపుగోడలఁ గట్టించుటఁ జూచి, "ఓరాజా, ఇంతవిలంబముఁ జేసి గోడలను కట్టించుచుంటి వేమి?" అని 'క్రాసను' హాస్యముఁ జేసెను. "ఎందుచేత నీవు 'పార్థుల'పైకి దండువెడలి విలంబము చేయుచున్నావు?" అని రాజు

క్షేత్రపతి నడిగెను. ఎప్పుడును 'క్రాసను' ధనాపేక్షకలవాఁడు, అందుచేత, దేశములోని దేవాలయములలో వెండిబంగారముల నతఁడు ప్రోగుచేయుచు కాలవిలంబముఁ జేసెను. కులాతీతమునకుం జీకాకుపడి 'పార్థుల'రాజు 'ఓరదిశుఁడు' కోపగించి, 'రోమకులు నిన్ను మాతో యుద్ధముఁ జేయుటకుఁ బంపిన యెడల మాకంఠములోఁ బ్రాణము లుండినంతవఱకు నీతోఁ బోరాడుటకు సిద్ధముగ నుంటిమి. రోమకుల సమ్మతిలేక నీస్వలాభమునకు నీవు మాతో యుద్ధమునకు వచ్చినయెడల నీవు పెద్దవాఁడవు. 'మెసపొటేమియా' దేశములోని రోమకులు దేశమును కాపాడుటకు బదులు వా రాపనిని చేయనందున మేము వారిని కాపాడవలసి వచ్చెను గనుక వారిని మేము నీవద్దకుఁ బంపుచున్నాము. వారినిఁ దీసికొని నీవు స్వదేశమునకుఁ బోవలె'నని 'క్రాసను'కు వర్తమానముఁ బంపెను. అతఁ డారాయబారమునువిని 'నేను మీరాజధానికి వచ్చి, మీకుఁ బ్రత్యుత్తరము నిచ్చెద' నని రాయబారులతోఁ జెప్పెను. వారామాటను విని 'నీవు మారాజధానికి వచ్చుసరికి, ఈభూమిమీఁద శిరోజములు మొలచు'నని ధిక్కరించి వారు లేచి వెళ్లిరి.

ఆవెంటనే 'పార్థుల' సైన్యములు రోమకుల నెదిరించెను. రోమకులు భీభత్సులై చెల్లాచెదరై పారిపోయిరి. ఎటువైపుఁ జూచినను వారికంటికి 'పార్థులు' కనఁబడుచుండిరి. వారిశరముల ప్రయోగమునకు రోమకులు నిలువలేక పోయిరి. వారికంటె వారిబాణములు ముందు పరుగిడుచుండెను. వారి కవచములను శత్రువులబాణములు భేదింప లేకపోయెను. కాలవిలంబముఁ జేసినందున 'క్రాసను'శత్రువులయెదుట నిలువలేక పోయెను. ఎదురుగ నడుచుట కతనికి దుర్ఘట మయ్యెను. పాఱిపోవుట వీరధర్మము కాదని తోఁచెను. అటులఁ జింతించుచు 'యూఫ్రెటీసు' నదీతీరమున నతఁడు శిబిరము వేసియుండెను. సామంతప్రభు వొకఁడు వచ్చి, 'పార్థులు' పరారి యగుచున్నారు. నీయెదుట వారు నిలువలేక పోయినారు. నీవు వారిని వెంటఁ బెట్టుము. వారిసైన్యమును నీవు కలిసికొనుటకు వీలుపడగు. కాని వస్తుసామగ్రులతో వెనుకఁ బోవు

వారిని నీవు పట్టుకొనువచ్చు' నని 'క్రాససు'తోఁ జెప్పెను. ఆమాటల నతఁడు విని సంతసించి, స్వసైన్యముల మరలించి, వాఁడు చూపినమార్గమున వారు నడచిరి. వాఁడు చూపినతప్పుమార్గమునఁ బోయి, వారు 'పార్థు'ల సైన్యముల కెగట నిలిచిరి. అప్పుడు రోమకులకును 'పార్థుల'కును ఘోరమైన యుద్ధము జరిగెను. 'పార్థుల' సైన్యములు కొన్నినటించి పాఱిపోవుచుండ, వారు నిజముగ పాఱిపోవుచుండిరని తలంచి, 'క్రాససు'కుమారుఁడు వారిని వెంటఁ దఱిమెను. కొంతదూరము రోమకులు వచ్చినతరువాత, 'పార్థులు' నలువైపుల చెదరి రోమకులను ముట్టడించిరి శత్రువులచేతిలోఁ బడి నీచముగ బ్రతుకుట మంచిపని కాదని తలచి, 'క్రాససు' కుమారుఁడు కత్తితోఁ బొడుచుకొని చచ్చెను. అనంతర మతనిశిరస్సును పట్టుకొని 'పార్థులు' స్వసైన్యములో వచ్చి చేరిరి అప్పటికి సాయంకాలసమయ మగుటచేత వారు యుద్ధముఁ జాలించి శిబిరములకుఁ బోవుట కుద్యుక్తులయి యుండిరి. వా రాశిరస్సును రోమకుల శిబిరమునకుఁ బంపి, 'నీకుమారుని మరణమునకు నీవీరాత్రి దుఃఖింపుము. రేపటిదినము నిన్ను నీకుమారుని యొద్దకుఁ బంపఁగల'మని 'క్రాససు'నకు వర్తమానముఁ జేసిరి రోమకులు గుండెలు జారవిడిచి 'కారాహి' పట్టణమునకుఁ బాఱిపోయిరి. అచ్చట నుండి 'క్రాససు' ఆత్మరక్షకులతోఁ గూడి పోఁదలఁచెను కాని రోమకసైనికులు శత్రువులతో మఱియొక యుద్ధముఁ జేసి తదుపరి స్వదేశమునకు గమనించుట మంచిది యని చెప్పి అతని ప్రయాణమును నిలుపు చేసిరి. కపటదారియగు 'పార్థుల'రాజు 'ఒరదీశుఁడు' ప్రాణములతో 'క్రాససు'ను పట్టుకొనఁ దలఁచెను. రాజు తగుమాత్రము ఆత్మరక్షకులను వెంటఁదీసికొని పోయి రోమకుల శిబిరమువద్దకు వచ్చి 'నీతో సంధిఁజేసికొనఁ దలఁచి వచ్చితిని. నీవు కూడ తగుమాత్రము రక్షకులతో వచ్చి సంధిమాటలను నాతోఁ బ్రసంగింపు' మని 'క్రాససు'నకు రాయబారముఁ బంపెను. ఆమాటల నతఁడు విశ్వసింపకపోయెను, రోమకు లతనిని నిరోధించి సంధిఁ జేసికొనవలయు నని నొక్కి చెప్పినందున, నతఁడు బయలుదేఱి రాజుసమీపమునకు వచ్చెను. అతనిని రాజు మర్యాదఁ జేసి, కొంతదూరమువఱకు సంధిమాటలఁ బ్రసంగించి, 'మీరోమకుల,కు

మాటనిలుకడలేదు. మీ 'పాంపేయుఁడు'మమ్ములను నమ్మించి మోసపుచ్చెను. కనుక లిఖితపూర్వకముగ నీవు చెప్పినమాటలను మాకు దయచేయుఁ' మని చెప్పెను. ఉభయపక్షములను విడిచిపెట్టి మఱియొకస్థలమునకుఁ బోవలసి వచ్చెను. 'పార్థుల' తురంగములపైనెక్కి స్వారీచేయుటకు రోమకు లిష్ట పడలేదు. కాని వారు నిరోధించినందున 'క్రాసను' మొదలగువారు తురగారూఢు లయిరి. ఆవెంటనె అశ్వరక్షకులు వానికళ్లెములం బట్టుకొని వానిని తఱిమి వారిని 'పార్థుల' శిబిరమునకుఁ దీసికొని వచ్చిరి.' క్రాసను' మొదలగు వారు కొంచెము శత్రువుల నెదిరించిరి. కాని, వారిని 'పార్థులు' మట్టివేసిరి. 'క్రాసను' వీరస్వర్గముఁ బొందెను. హతశేషులైన రోమకులు వారికిఁ బాదాక్రాంతులై, వారిదేశములోఁ గాపురముండి, వారితో సంబంధములఁ జేసికొని, సుఖముగ జీవించిరి ఈవిధమున రోమకుల గర్వమును వారణఁచి వేసిరి. కొంత కాలమునకు 'పార్థులు' పూర్వపుదేశములను సాధించిరి. వారిరాజునకును 'క్రాసను'ను జంపినవారి సేనాధిపతికిని మనస్పర్థలు కలిగినందున, రోమకులను 'ఆశియా'నుండి పాఱఁదోలుటకుఁ వారికి వీలు లేకపోయెను.

క్రీ. పూ. సం॥ 40 రము:—రోమనగరములోని రాజ్యవ్యవహారములు చిక్కుపడి యుండెను. "జూలియసు—సీజరు' చనిపోయెను, "బ్రూటసు" "కాసియసు" అనునిరువురును "పార్థుల" రాజుపద్దకు రాయబారముఁ బంపిరి. ఆరాయబారి వచ్చి రాజుపక్షము నవలంబించి రోమకులరహస్యము లతనితోఁ జెప్పెను. వారుభయులు నేకీభవించి, "ఆశియా" ఖండమునకుఁ బశ్చిమమున నుండిన రోమకరాష్ట్రములపై దండువెడలి వానిని స్వాధీనముఁ జేసికొనిను. మఱికొంతకాలమునకు "మార్కు—అంతోని"అనువాఁడు నియోగించిన క్షేత్రపతి పశ్చిమఆశియాదేశములకు వచ్చి, "పార్థుల" సైన్యములఁ దునుమాడి, ఆదేశములను రోమకులకు స్వాధీనముఁ జేసెను.

"మార్కు—అంతోని" సైన్యములతో వచ్చి,"పార్థులను" సాధింపఁ బూనెను గాని, వారిని సాధింపలేక స్వదేశాభిముఖుఁ డయ్యెను.

ఇటుల "పార్థులు" రోమకుల కజేయులై, స్వరాష్ట్రములను స్వాతంత్ర్యముతోఁ బరిపాలించిరి; మఱిరెండువందలసంవత్సరములవఱకు దుర్బలులుగాక బలవంతులు గాక సామాన్యస్థితిలో నుండి తుదకు వారు "పారసీక" రాజ్యములో నస్తంగతు లయిరి.

ప్రాచీనదేశచరిత్రలు

12-వ ప్రకరణము.

12
సిధియా
జర్మని
గాలియా
స్పానియా
రోము
ఇటాలియా
కార్సిక
సార్డినియా
మధ్యధరా సముద్రము
కార్తెజ
సిసిలీ
గ్రీసు
కొరింతు
ఈజియనుసముద్రము
కాకసుపర్వతములు
కాస్పియను సముద్రము
చిన్నఆశియా
అర్మీనియా
సిరియా
అరేబియా
ఈజిప్టు
ఆఫ్రికా
రోమనురాజ్యము

శ్రీ రస్తు.

రోము దేశ చరిత్ర

ద్వాదశ ప్రకరణము.

ముప్పదినాల్గవ అధ్యాయము.

"రోము" నగరము స్థాపింపఁబడినవిధమును గుఱించి చెప్పఁబడిన యంశములన్నియు కల్పితకథలుగాని చరిత్రాంశములు కావని నమ్మవలెను. మానుషకృత్యములను అమానుషకృత్యములను సంమ్మేళనచేసి, ఆనగరము దేవనిర్మాణమని మనపెద్దలు చెప్పినందుకు వారిని మనము దూషింపరాదు. ప్రపంచములో నేదేశీయులు దేవవంశసంభూతులమని గర్వించి "మార్సు" అను "కార్తవీర్య" దేవుఁడు తమవంశమునకు మూలపురుషుఁడని చెప్పుకొనియుండిరో, వారు రోమకులు కాని మఱియొకరు కారు. వారు పశుపాలకవృత్తిని విడిచిపెట్టి వీరధర్మము నవలంబించి, దిగ్విజయముఁ జేసి సామ్రాజ్యమును స్థాపించిరి " ఈ ప్రకారము "లివి" అనువారి చరిత్రకారుఁడు వ్రాసినమాటలు సత్యమని వారి చరిత్రను చదివినపైని తెలియ నగును రోమకులు దిగ్విజయులు, "అశీరియనులు" "మాసిడనులు"—వీరు స్థాపించిన రాజ్యములు వలె రోమకులరాజ్యము క్షణకాలము వెలిగి అస్తమింపలేదు, ఒకటికాదు, రెండుకాదు, అనేక శతాబ్దములవఱకు వారు వివిధదేశములఁ బరిపాలించిరి. వీరధర్మము ననుసరించియే కాక, సాధించినదేశములలో "రాజశాసన"మనిన భీతావహము కలుగు విధమున రాజ్యధర్మములను ప్రకటనఁ జేసి, వాని ననుసరించి యాదేశములను రోమకులు పరిపాలించుటచేతి, వారిరాజ్య మనేకశతాబ్దములవఱకు నిలువఁబడి

యుండెను. భగవంతునికి నమస్కరించు విధమున దేశీయులు రోమకుల "రాజశాసనము" నకు నమస్కరించుచుండిరి.

రోమకులకును గ్రీకులకును పెక్కువ్యత్యాసములు కలవు గ్రీకులు నూతనసీమలను స్థాపించిరి ; ఆసీమలవారు మాతృదేశమనిన వాత్సల్యముఁ గనఁబఱచి, దానితో మతసంబంధము గలిగియుండిరి ;అంతకంటె మఱియొకసంబంధము వారలోవారికి లేదు. రోమకులు విదేశములను జయించి, "రోమకరాజ్యపద్ధతు" లనెడిపాశములచేత వానిని స్వనగరముతో బిగించి, కీర్తిప్రతిష్ఠలను సంపాదించిరి. "పడుచుబుద్ధి బుద్ధికాదు, పందుముపాడి పాడి కాదు' అని లోకోక్తి కలదు గ్రీకులబుద్ధి పడుచుబుద్ధి. రోమకులబుద్ధి కాలముగడపిన పెద్దలబుద్ధి వంటిది. మనుజుని జీవన ముకనాటకమని తలంచి, గ్రీకులు మానవకల్పితముల నల్లుకొని, ప్రకృతిధర్మములకు మనఃకల్పితకారణములను నిరూపించి,చిదానందభరితులై యుండిరి.మనఃకల్పితము లనిన రోమకుల కసహ్యము; "నాగరికకర్మ"ను నిదానముగఁ జేసికొని, వారందు కనుగుణమగు ధర్మముల ననుష్ఠించిరి. ప్రథమమున వారిగుఱించి చెప్పిన పురాణకథ లన్నియు వారి వీరధర్మములను జయములఁ జెప్పుచున్నవి గాని వారిమతములను గుఱించి చెప్పుట లేదు. గ్రీకులదేవతలైన "జయుసు", "అథీని" "అఫ్రొదైతి" "ఆరెసు" అనువానికి "జూపిటరు" "మినెర్వా" "వీనసు" "మార్సు" అని పేర్లుపెట్టి రోమకులు వాని నారాధించిరి.

రోమకులు తమ స్వాభావికగుణముల ననుసరించి తమదేవతలగుణములను మార్చి వానిని పూజించిరి గ్రీకులచేత విశేషముగ నారాధింపఁబడని "ఆరెసు" దేవునిరోమకులు "మార్సు" అను వీరులదేవునిగ మార్చి ఆదేవుఁడు తమ వంశమునకు మూలపురుషుఁడని భావించి పూజించిరి. గ్రీకులుపూజించిన "అప్రొదైతి" నిర్గుణదేవత, రోమకు లారాధించిన "వీనసు" సగుణదేవత ; వారి "జయుసు" వజ్రాయుధమును ధరించువాఁడు: అతఁడే "పితాసి లోకస్య చరాచరస్య త్వ మస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్." వారిమతమును వారి మతాభిప్రాయములును అజ్ఞానతిమిరాంధకారములోఁ బడి చిక్కుపడి యున్నవి. మృగములను పక్షులఁ జంపి వానిప్రేగులఁ జూచి వారు భవిష్యత్తుఁ

జెప్పుదురు. పక్షులగమనముఁ బట్టిగాని మెఱపుఁ జూచికాని మేఘధ్వని విని గాని వారు తమదేవతల యభిప్రాయములఁ గనుగొనిరి. వారు దేవతలలో దయా దాక్షిణ్యములకును శాంతమునకుఁ బ్రసిద్ధి కెక్కినవాఁ డొకఁడు లేఁడు వారి దేవతలందఱు నరబలిఁ గోరువారు. ఉత్తరోత్తరముచక్రవర్తులు వారిని బరి పాలించినపుడు, ఆచక్రవర్తినిఁ గూడ దేవునిగఁ భావించి మల్లులరక్తముచేత నతనిని వారు తృప్తిఁబొందించిరి.

ఇట్టి మతాభిప్రాయములతోఁ గూడిన రోమకులు తదనుగుణముగ సుగుణసంపత్తులు కలవారై ప్రసిద్ధి కెక్కిరి. "నాగరికో భవ" అని తల్లి కుమారుని దీవించెను ఆమాటప్రకారము శరీరములఁ బుష్టిఁ జేసి పట్టుదలకలవారై ద్వంద్వా తీతులై స్వవాంఛాపరులు కాక వారు ప్రసిద్ధు లయిరి. వారు స్వనగరము నం దభిమానము గలవారు కనుక నగరమున కపకీర్తి వచ్చునను భయముచేత నీచపు పనులఁ జేయలేఁదు "స్వాధీనులను రక్షింపుము" అని కంకణముఁ గట్టుకొని సాధింపఁబడిన దేశీయులను వారు సన్మానించిరి గాని అగౌరవము చేయలేదు. "రోమకనాగరికుఁ" డని పేరు పెట్టికొనిన వాఁడెవఁడును తుచ్ఛపు పనులఁ జేయుటలేదు. సాధించినదేశములలో వారు కట్టినరాదారిమార్గములఁ జూడ, వారి యౌదార్యము వెల్లడి యగును. ఎన్నికష్టములకైన నోర్చి చేయఁ బూనిన కార్యమునువారు నెఱవేర్తురు. ఏకార్యముఁ జేసినను వర్తనమును పాగించుటకును అనాథులను రక్షించుటకును, రాజశాసనముఁ బ్రస్తరించుటకును, సమస్తజంతు వులశుభమునకును స్వనగరముయొక్క ఔన్నత్యమునకును వారు చేయుచుండిరి.

రోమునగరమును స్థాపించిన విధమును గుఱించి వారు చెప్పినయంశము లన్నియును కట్టుకథలని తోఁచును గాని వానిలోఁ గొంతవఱకు సత్యము కలదని "ఆధునికశాస్త్రోక్తఘర్షణ" వలనఁ దెలియుచున్నది. "హోమరు" మహాకవి వర్ణించిన "ట్రాయి" పట్టణములో "అనీయసుఁడు" అనునొకవీరుఁడు కలఁడు. ఆతఁడు "వీనసు" దేవతకుమారుఁడని మనుజుల నమ్మకము, అఁతడొకసమయ మున నోడలపై బయలు వెడలివచ్చుచుండ ఝంఝామారుతము లేచిసముద్ర మల్లకల్లోల మైనందున నతనిపడవలు "ఇటాలియా" దేశతీరమునకుఁ గొట్టఁ

బడెను "ఆల్బను" కొండలదినువను "ఆల్బాలాంగా" అను పట్టణము నతఁడు తన కుమారుఁడు "ఆశకానీశు" నకుఁ గట్టించెను. అతఁ డాదేశమునకు వచ్చునప్పటికి కొందఱు రాజు లాదేశముఁ బరిపాలించుచుండినట్లు పురాణకథలవలనఁ దెలియుచున్నది. "ఆనీయశుఁడు"ను గ్రీకులును దేశములోనికి రాకపూర్వము "ఎత్రూసకనుల"నువారు దేశము నాక్రమించి పరిపాలించి రని ప్రాచీన చరిత్రముల వలనఁ దెలియుచున్నది. "ఇటాలియా" దేశమునకు దక్షిణమున చాలభాగమును "గ్రీకులు" "రోము" నగరమును స్థాపింపక పూర్వము నుండి ఆక్రమించి దానికి "మాగ్నాగ్రీసు" అని పేరుపెట్టి పరిపాలించు చుండిరి.

"ఎత్రూసకనులు" "టైబరు" నదికి నుత్తరభూముల నాక్రమించి ప్రబలులై యుండిరనియు అంతకుఁ బూర్వము "పో" నదిప్రాంతముల నుండి "గాలుల" చేతఁ దఱిమి వేయఁబడుటచేత నీప్రాంతములకు వచ్చిరనియు తెలియ వచ్చుచున్నది. ఏకాలమున నగ్నిపర్వతములు విజృంభించుటచేత భూకంపములు కలుగుచుండెనో నాకాలమున వారు జీవించియుండుటచేత, వారుస్వాభావికముగ పశుప్రాయులై భీకరులై రక్తమాంసములఁ దినుచుండిరి. ఉఱుమును మెఱుపును దేవతలని భావించి పూజించిరి. తమకిరుప్రక్కల నుండిన దేశీయులతో వారు కలసి మెలసి యుండలేదు. వారు భూమిసొరంగములఁ ద్రవ్వి, వానిలో లాదులతోఁ గొన్ని నివేశనములఁ గట్టిరి, మఱికొన్ని నలుచదరముగ రాతితోఁ గట్టిరి. "అశీరియా" మొదలగు దేశములలోని శిలాప్రతిమలఁ బోలు ప్రతిమలతోఁ గొన్నినివేశనముల నలంకరించిరి.

ఇటుల నలుప్రక్కలఁ బశుప్రాయుల వలెసంచరించు మనుజులు జీవించి యుండ 'ఆనీయశుఁడు' మొదలగువారు వచ్చి 'ఆల్బను'- పర్వతప్రాంతముల నాక్రమించి సం॥ 300 రములు రాజ్యముఁ జేసిరి. అప్పుడు 'మార్సు' దేవుని ప్రసాదమువలన 'రోమ్యులసు' 'రీమసు' అను నిరువురు కవల పిల్లలు పుట్టిరి. అంతట నంతఃకలహములు వారిలో వారికిఁ బుట్టినందున, వా రాబాలురను తీసికొనిపోయి 'టైబరు' నదీజలములలో విడిచిపెట్టిరి; ప్రవాహవేగము వారినిఁ గొంతదూరము తీసికొనిపోయి యొకయొడ్డున కొట్టివేసెను. ఒకతోడేలు వచ్చి

వారికిఁ బాలుపెట్టెను; ఒకపక్షి వచ్చి అన్నముఁ బెట్టెను. అంతట నొకవృద్ధ గోపాలుఁడు వచ్చి చూచి వారిని స్వగృహమునకుఁ దీసికొని పోయి పెంచెను. దినదినప్రవర్ధమానముగ వారు పెరిగి పెద్దవారైరి, వారి దివ్యవిగ్రహములఁ జూచి మనుజులు చోద్యపడిరి

అనంతరము వారు తమపుట్టుపూర్వోత్తరములను గ్రహించి, స్వదేశమునకుఁ బోనొల్లక, సప్తపర్వతోపత్యకాభూములపై నొకపట్టణముఁ గట్టుటకు నారంభించిరి. ఏపర్వతోపత్యకాభూములపైఁ బట్టణముఁ గట్టుట మంచిపనియో వారికిఁ దెలియక వారిలో వారు కలహించిరి, 'రోమ్యులసు' 'పలాటీను' పర్వతపాదభూములపై నగరముఁ గట్టెను. అన్నదమ్ములకు వైరము బిగిసెను 'రోమ్యులసు' కట్టుచుండిన నగరప్రాకారములమీఁదనుండి తమ్ముఁడు తిరస్కారభావముతో దుమికెను; అందుచేత నతనికిఁ గోపమువచ్చి తమ్మునిఁ జంపించెను. 'రోమ్యులసు' నిష్కంటకముగ 'రోము' నగరమును స్థాపించెను. ఇందులో సత్యము కలదు. 'ఆల్బను' పర్వతప్రాంతముల నగ్నికొండలభయముచేత స్వదేశమును విడిచిపెట్టి సారవంతమైన 'టైబరు' నదీ ప్రాంతభూముల నాక్రమించి, గోపాలకులు 'రోము' నగరము స్థాపించిరని తెలియుచున్నది. ఆనగరము కాలక్రమమున నభివృద్ధిలోనికి వచ్చెను. ఒకవైపున 'టైబరు' నదిచేతను, మూఁడుప్రక్కల మహోన్నతపర్వతపంక్తులచేత నానగరము రక్షింపఁబడుచున్నది. 'అత్రూసకనులు' చేయువిధమున, గోపాలకులు పట్టణమును స్థాపించినపు డుత్సవములఁ జేసిరి. కంకణమువలె నొక గుండమును వారు త్రవ్వి దానిలో ఋతుఫలములను వేయుదురు; తాము వచ్చినదేశమును తెలియఁజేయుటకు నచ్చటనుండి మట్టిపెళ్లలఁ దీసికొనివచ్చి తదుపరి వానిని వేయుట కలదు. వానిపై నొకవేదికను రాతితోఁ గట్టి దానిపై నగ్నిని ప్రజ్వలింపఁ జేసిరి. ఒకకంచునాగలికి గోవృషభముల రెండింటిని పూఁజువేసి, నగరస్థాపకుఁడు ప్రదేశమును దున్నెను. నాగలిచాలు వెంబడిని నగరప్రాకారములఁ గట్టిరి, వానిమధ్య నగరబహిర్ద్వారముల నెత్తిరి. 'ఓ దేవతలారా, ఆచంద్రార్కమీనగరము మీకృపవలన భూమిమీఁద నిలువఁబడుగాక; మీకటాక్షముచేత

నీనగరము సూర్యాస్తమయములేని ప్రదేశమున కంతయు రాజధానియగు గాక' అని నగరస్థాపకుఁడు దేవతలఁ బ్రార్థించి పూజించెను.

జూలైసీసర్.

క్రీ. పూ. సం. 755 రము:—ఈవిధమున 'రోము' నగరము స్థాపింపబడెను క్రీ. పూ. 8 శతాబ్ద మధ్యకాలమునాటికిఁ దదితరదేశీయు లేవిధమున నుండిరో చూచెదము. అప్పుడు 'కంచుయుగము' వర్తించెను; 'అల్బాలాంగా' వద్దనుండిన భూమిసొరంగములలోఁ గంచుపనిముట్లు కనఁబడుచున్నవి కాని లోహపుపనిముట్లుకానరావు. నగరప్రాకారములమీఁదఁ గంచునాగలి బొమ

వ్రాయఁబడియున్నది. సం.150 రములు గతించినతరువాత 'రైను' నదిమీఁద దూలములతో వారు వంతెనఁ గట్టిరి; దానిలోఁగూడ లోహము కానరాదు ఆ నాటికి 'లోహయుగము' ప్రవేశింపలేదు. అప్పటికి 'ఈజిప్టు' మహారాజ్యమునకు అపరాహ్ణము తిరిగెను, 'ఈథియోపియనులు' వచ్చి యారాజ్యమును క్షోభపెట్టిరి. ప్రస్తుతము దినములు కొంచెము సామాన్యమైనను, 'అసిరియ' మహారాజ్యము చీమురక్తములఁ గూడఁ బెట్టి ముందుకుఁ దిగ్విజయములఁ జేయఁబోవును; 'జూడా' దేశపురాజు 'ఉజియ'నికాలములో నారాజ్యము ప్రబలముగుచుండెను. 'ఆథెన్సు' నగరము విషయమై యాలోచింప, 'గ్రీసు' దేశము పుష్టిఁ జేయుచుండెను, ఆనగరమునకు 'క్లీస్తనీసు' రాజ్యాంగముల నేర్పఱచెను. ఆ నగరప్రాకారములకుఁ బునాదులు వేయునప్పటికి, దేశకాలభేదము లీవిధముగ నుండెను.

ఆనగర మతిశీఘ్రములో నభివృద్ధికి వచ్చెను గోపాలకులకును, బీదలకును, దీనులకును, నేరకులకును—సమస్తజనుల కానగరము శరణాలయమయ్యెను. 'సకలప్రాణుల కీనగరము శరణాలయము. సేవకులు, ఋణగ్రస్తులు, నరాంతకులు—మొదలగు వారికి దేవశాసనమువలన నేను శరణు నిచ్చువాఁడ' నని నగరస్థాపకుఁడు చెప్పెను.

ఆనగరవాసులు బ్రహ్మచారులై యుండిరి; వారికి వివాహముఁ జేయవలెను. 'మానగరవాసులు వివాహముఁ జేసికొనఁ దలఁచిరి, కనుక వారికి మీ కుమార్తెల నిచ్చి వివాహముఁ జేసిన మాకు సంతోష మగును'ని 'రోమ్యులసు' సమీపముననుండిన 'సాబీనుల'ను వారికి యుత్తరము వ్రాసి పంపెను, కాని వారందుకు సమ్మతింప లేదు మఱికొంతకాలమునకు 'రోమ్యులసు'నగరములో నొకగొప్పయుత్సవముఁ జేసి, అందుకు 'సాబీనుల'ను పుత్రమిత్రకళత్రాదులతో దయచేయుఁడు మని ప్రార్థించెను. ఆప్రకారము వారు వచ్చి యుత్సవముఁ జూచి విం దారగింపుచుండఁ, బ్రతిరోమకుఁడును తనకు సమీపమున నుండిన నొక 'సాబీను' కన్యం దీసికొని పాఱిపోయెను. 'సాబీనులు' నిరాయుధులై వచ్చినందున, రోమకులతోఁ బోరాడలేక నగరమును,విడిచి స్వదేశమునకుఁ

బోయి, సమరసన్నాహముతో వారు తిరిగివచ్చిరి. 'కాపిటలీను' పర్వతములు మీఁద 'రోమ్యులను' కట్టిన దుర్గమును సాధింపవలెనని 'సాబీను' లభిలషించిరి; ఆదుర్గరక్షకుని కూఁతురు 'సాబీనుల' బంగారమున కాశపడి, వారినిఁ జూచి 'మీరుదుర్గములోఁ బ్రవేశించినపుడు, మీరొక్కొక్క బంగారు వస్తువును నాకు బహుమతిఁ జేసినయెడల మీకు దుర్గద్వారములఁ దెఱచెద'నని 'సాబీనుల'తో నామెచెప్పెను. ఆమె పేరు 'టార్పియ'. ఆమె ద్వారము తలుపులఁ దెఱచెను. ప్రతి 'సాబీనుఁడు' దుర్గములోఁ బ్రవేశించి, ఒక్కొక్క బంగారు హారము పైకి విసరను. అనేకహారము లామెపైఁబడుటచేత నామెక్రుంగి చనిపోయెను. ఆమె మృతినొందిన ప్రదేశమునకు 'టార్పియను శిల' యనిపేరు వచ్చెను. ఆనగరము యొక్క సప్తపర్వతములలో నొకదానిని 'సాబీను' లీవిధమునఁ బట్టుకొని స్వాధీనముఁ జేసికొనిరి. అప్పుడు రోమకులను వివాహమాడిన 'సాబీనుల' స్త్రీలు వచ్చి తమవారినిఁ బ్రార్థించినందున వారియుద్ధము సాంతమయ్యెను. ఇటుల వారు సంధిఁ జేసికొనినకాలముఁ దెలియఁజేయుటకై, వారు నాటినుండి ప్రతిసంవత్సరము 'మాతృకేళి' యను నొకయుత్సవముఁ జేయుచుండిరి. ఇటుల 'సాబీను' లును రోమకులును కలిసి యానగరములోఁ గాపురముండిరి. ఆనగర మభివృద్ధిలోనికి వచ్చెను. 'పలాటీను' పర్వతోపత్యకాభూమిపై నలుచదరముగ నాపట్టణము కట్టఁబడెను. రాజులు పరిపాలించుకాలములో నదిపెద్దదియై సప్తపర్వతముల నాక్రమించెను.

రోమునగరమును సప్తనృపాలుర పరిపాలించి రని వారి పురాణకథలవలనఁ దెలియుచున్నది. వారు నగరము నభివృద్ధిలోనికిఁ దెచ్చి ప్రజలను నాగరికులఁ జేసిరి. 'రోమ్యులను' జనులకు నగరములో నివాసముల నిచ్చెను. వారికి వివాహముఁ జేసి వారిని గృహస్థులఁ జేసెను. కలహస్వభావులగు 'సాబీనుల'తో నతఁడు సఖ్యముఁ బాటించెను. ఇంతియ కాదు. అతఁడు 'కాపిటలు' దుర్గముఁ గట్టించెను. నదీతీరభూముల నాక్రమించి సాగుచేయించెను. నాలుగుపర్వతములను నగరముసరిహద్దులలోఁ జేర్చెను. అతని తరువాత 'న్యూమా పాంపీలియను' సింహాసనమునకు వచ్చెను. అతఁడు 'సాబీనుల'వంశములోఁ

బుట్టి, 'క్యూరెసు' అను వారి గ్రామములోఁ బెరిఁగి పెద్దవాఁ డయ్యెను. అతఁడు మతకర్మలను నిరూపించి, మతోత్సవములఁ జేయఁ జూపి, ఋతువులను గుర్తెఱుఁగు విధమును వారికి నేర్పెను. అతని కాలములో దేశమునకు స్వాస్థ్యము వచ్చెను. ప్రజలు మతకర్మలఁ జేయుచుండిరి.

'ట్యూలసు' 'హస్తీలియసు' తరువాత రాజ్యమునకు వచ్చెను. ఇంతవఱకు మనుజులు స్వస్థచిత్తులై యుండిరి. నేఁడు రణభేరి మ్రోగెను. రోమకులు ధనుర్ధరులై 'ఆల్బాలాంగ'లో మనుజులను సాధించి రోమునగరములో నివసింపవలసినదని వారిని నిరోధించిరి. నగరబహిఃప్రదేశములను స్వాధీనానుభవములోనికిఁ దీసికొని వచ్చుటకుఁ బ్రయత్నింప రోమకులకుఁ గలహములు సంభవించెను 'ఆంకేశ-మారుతీశుఁడు' రాజ్యముఁ జేయుకాలములో నీకలహములు ప్రబలమై, రోమకులకును 'లాటినుల' కును ఘోరమైన యుద్ధము జరిగెను. రోమకులు బలవంతులు గనుక వారి నోడించిరి. మఱియొక విశేషము కలదు. రోమునగరమును దృఢముగఁ గట్టిరి. జనబాహుళ్యముచేత నగరము వ్యాపించిన కొలఁది నూతనదుర్గములను వారు కట్టుచువచ్చిరి. 'టైబరు' నదీముఖద్వారమున రేవుపట్టణముఁ గట్టిరి. వారు శత్రువులను సాధించి వారిభూముల నాక్రమించుటయే గాక, వర్తకమును విశేషముగసాగించి రని వీనిమూలమునఁ దెలియుచున్నది ఈకాలములోఁ "కాపిటలోను" పర్వతోపత్యకాభూములపైఁ గట్టఁబడిన కారాగృహముఁ జూడ, రోమకులు నాగరికులైనకొలఁది, పాపకర్మలఁ జేసిరనియు తెలియనగును.

తరువాత "జ్యేష్ఠ—తార్క్వినీయశుఁడు" పట్టభద్రుఁ డయ్యెను. అతఁడు "ఎత్రూసకనుల" వంశములోనివాఁడగుటచేత, వారివంశము రోము నగరములో స్థాపింపఁబడినదని వారిపురాణకథలు చెప్పుచున్నవి అతఁడు "తార్క్వని" యను నగరములోఁ బుట్టిపెరిఁగి పెద్దవాఁ డయ్యెను. స్వనగరములో నభివృద్ధినొందుటకు వీలులేకపోయినందున, నతఁడు దానిని విడిచిపెట్టి రోము నగరమునకు దారపుత్రాదులతో బయలువెడలెను. అతఁడు "జానికులము" నకు వచ్చి నగరబహిర్ద్వారము సమీపింప, గృధ్రరాజ మంబరాళమునుండి వచ్చి,

అతనిటోపీని యెత్తికొని పోయెను. ఈచోద్యముఁ జూచి, యతనిభార్య "మీ కీనగరములో రాజయోగము కలుగును" అని తనభర్తతోఁ జెప్పెను; అవింతఁజూచిన రోమకులు సహిత మద్భుతపడిరి; ఆతనిభాగ్యమునకును, అతని వెంటవచ్చిన పరివారమునకును వారు చోద్యపడిరి. అతఁడు నగరములోఁ బ్రవేశించి, సర్వజనరంజకుఁ డయ్యెను; "అంకేశుఁడు" స్వర్గస్థుఁ డయ్యెను; తరువాత నతనిని జనులందఱు రాజుగనియమించిరి. ఈనాటికి "ఎత్రూసకనుల" వంశము స్థాపింపఁబడెను; రోమునగరప్రాకారములు కట్టుటకుఁ బూర్వము వారు నాగరికులై యుండిరి; వారి వంశీకుఁడు రాజ్యమునకు వచ్చినతోడనే, రోమునగర మభివృద్ధిలోనికి వచ్చెను. కొండవాఁగులు ప్రవహించుటకు భూమిసొరంగములఁ ద్రవ్వించెను, వానిని నేఁడు చూడవచ్చును. "ఫోరము"లో నివేశముల నతఁడు కట్టించెను; 'కాపిట'లోను పర్వతముపై నొకదేవాలయముఁ గట్టించి దానిని 'జూపిటరు' దేవునకుఁ బ్రతిష్ఠఁ జేసెను. గరడీలయాలయములో మల్లయుద్ధము ముష్టియుద్ధము మొదలగునవి జఱుగుచుండెను, శకునముల వలన దేవతాభిప్రాయముఁ గనుగొనుచుండిరి. ఈకాలములో రోమునగరమువ్యాపించి పెద్దదియయ్యెను, అందుకు నూతనముగ మఱియొకప్రాకారము గట్టుటకుఁ బునాదులను వేయించిరి. ఈప్రాకారము 7-8 వందలసంవత్సరములవఱకు నిలిచియుండెను. నగరమున కిరుప్రక్కలనుండు 'లాతీయము' అను పరగణాలోని పట్టణములన్నియు రోమకుల పోష్యవర్గములో నుండెను.

'తార్క్వినీయుఁడు' ఒకబాలునిఁ బెంపకముఁ జేసికొనెను. వాఁడు తక్కువకుటుంబములోఁ బుట్టెను. వానిపేరు 'సెర్వీయుఁడు'. ఈబాలుఁడు నిద్రించుసమయమున నతనిలో నుండి యొకదివ్యతేజస్సు వెలుగుచుండెను. దానిని 'తార్క్వినీయుని'భార్య చూచి భర్తతోఁ జెప్పెను. అతనిఁ జంపి, 'సెర్వీయును'ని రాజభవనములోనుండి తఱిమివేసి రాజ్యముఁబొందవలెనని'అంకేశుని' కుమారులు నల్వురు ప్రయత్నించిరి; కాని, వారిప్రయత్నములు సాగలేదు. రాజు బ్రతికియుండెనని చెప్పి "ఆయనస్థానమున ఆయన యాజ్ఞలను నేను నిర్వర్తించుచున్నవాఁడ"నని 'సెర్వీయుఁడు'వారితోఁబలికి క్రమముగఁ బ్రజల

స్వపక్షముఁ జేసికొనెను వారతనిపరిపాలనకు సంతసించిరి. అనంతర మతఁడు రాజు మృతినొందెననియు, తానే రాజుననియు వారికి వెల్లడిఁజేసెను. వారందఱు నోరుమూసికొని అతని యాజ్ఞలను శిరసావహించిరి. అతనికాలములో నూతన ప్రాకారము సాంత మయ్యెను. రోమకులతోఁ గూడి 'లాతీయము' ప్రజలు పూజించుటకుఁగాను 'దయాని' దేవతకు నగరములో నాలయముఁ గట్టించెను. అతఁడు 'రాజు' అయినను, సామంతిము లేదు ప్రజలపక్షము నవలంబించెను. 'ప్రజారాజ్యము'నకు బీజము వేసెను. ఆదివఱకు వారిలో 'సామంతు'లనియు 'ప్రజల'నియు రెండుభేదములు కలవు. సామంతులకు 'నగరప్రేక్షణికు'లని పేరు కలదు వర్తకులకును శరణుఁజొచ్చినవారికిని 'ప్రజ' లని నామ మిడిరి. ఈభేదములు వారివారిజననమువలనఁ గలిగినవి. వారిజననమును గణింపక, వారి ధనముఁబట్టి వారిని యాఱుతరగతులక్రింద 'సెర్వియసుఁడు' విభజించెను. నిర్ధనులగు సామంతులు ధనికులగు ప్రజలతో సరిసమానులయిరి. ఈవిభజనకు నగరములోని సామంతు లియ్యకొనలేదు. తదనుగుణముగఁ బ్రతి అయిదుసంవత్సరముల కొకపర్యాయము జనసంఖ్యఁదీసికొనుచుండిరి. ఈయాఱుతరగతులకును 'ఆఱుశతమానము'లని పేరుఁబెట్టిరి. జనసంఖ్యఁదీసికొను సమయమున ఈశతమానములవారు ధనుర్ధరులై కవచముఁ దొడిగి, 'మారుతీశ-మైదానము'లో సమావేశ మగుదరు. ఒకపందిని, ఒకయెద్దును, ఒకగొఱ్ఱెను, వారుతీసికొని వచ్చి, సమావేశమైనవా రందఱికిని మూఁడుప్రదక్షిణములు వానిచేతఁ జేయించి, ధూపము వేయుదురు. ధ్వజముల నెత్తి, పతాకముల నెగరవేసి, భేరీభాంకారములు మోగ, మధుతర్పణముఁ జేసి, వా రామూఁడుపశువులను ప్రజలక్షేమమునకు బలివేయుదురు.

'సామంతులకు'ను 'ప్రజలకు'ను వైరము బలిసెను, భార్యమాటలను విని 'ప్రజల' కనుగుణుఁడైన 'సెర్వియసు'నిఁ జంపి, జ్యేష్ఠ-'తార్క్వినీయసు'ని కుమారుఁడు 'గర్వ-తార్క్వినీయుఁడు' రాజ్యమునకు వచ్చెను. అతనికాలములో దేశమునకు క్షోభ కలిగెను, నరహత్యలు విశేష మయ్యెను; నలువైపుల రక్తము ప్రవహించెను. కునృపతిపరిపాలనచేత, దేశము నంధకారము గప్పెను;

రాజు చేసిన దౌర్జన్యములకుఁ బరిమితి లేదు. అతని తండ్రి కాలములో నారంభింపఁబడిన 'జ్యూపిటరు' దేవాలయము సాంత మయ్యెను. 'లాతియము' పరగణాలోని మనుజు లందఱును రోమునగరమును రాజధానిగ భావించిరి. గ్రీకులు స్థాపించిన నూతనసీమలలో 'కుమాయి' అను పట్టణ మొకటి కలదు; అందులో 'సిబిలు' అను నొకదాసురాలు జీవించియుండెను. ఆమె కొన్ని గూఢగ్రంథములను వ్రాసియుండెనని ప్రసిద్ధి కలదు. ఆగ్రంథముల నీకాలమున రోము నగరమునకుఁ దీసికొని వచ్చిరి. ఆగ్రంథములఁ జూచి 'శాకునికులు' (అనగా శకునములఁ బట్టి భవిష్యత్తుఁ జెప్పువారు) రోమకుల యోగఫలములఁ జెప్పెడివారు; వానిఁ బట్టి విపత్తులు సంభవింపకుండు శాంతులఁ జేయుచుండిరి. వాని బట్టి రోగము కనఁబడినయెడలఁ దదనుగుణముగ శుభకార్యములఁ జేయుట కలదు.

రాజులవంశమున కస్తమయకాలము సంప్రాప్త మయ్యెను. ఒకనాఁడు రాజు హోమము వ్రేల్చుచుండ నొకసర్పము ప్రాకివచ్చి ఆహుతిని మ్రింగి వేసెను. వెంటనె రాజు భయపడి తనకుమారుల నిరువురను తన మేనల్లుఁడు 'బ్రూటసు'ను ఈమువ్వురను 'డెల్ఫి' పట్టణములోని దాసురాలువద్దకు 'సోదెను' వేయించి చూచుటకుఁ బంపెను. వారు ప్రశ్నవేసి యడుగ 'రాజు పదభ్రష్టుఁడగు'నని ఆమె జవాబుఁ జెప్పెను, తమపరివారు 'ఎవరు రాజు కాఁగలరు?' అని ప్రశ్నవేయ 'ఎవరు తనతల్లిని ప్రథమమున ముద్దుఁబెట్టుకొనియెదరో వాఁడు రాజుకాఁగలఁడు' అని ఆమె ప్రత్యుత్తర మిచ్చెను. రాకుమారులిరువురు నొకరితో నొకరు గ్రుద్దులాడుచుండిరి; ఇంతలో 'బ్రూటసు' దాసురాలికిఁ గట్నముఁ జదివించి, ఆమె చెప్పినసోదెకు నిజమైన యర్థముఁ దెలిసికొని, స్వదేశమునకు వచ్చి, కాలుజాఱినందున, నతఁడు నేలఁబడి, సమస్త జంతువులకుఁ దల్లియైన భూదేవిని ముద్దుఁబెట్టుకొనెను. దాసురాలు చెప్పిన ప్రకార మతఁడు చేసెను. రాజుపైఁ దిరుగఁబడుటకు సమయము వచ్చెను. రాజు కామోద్రేకుఁడై క్రిందుమీఁదుఁ గానక, పతివ్రతాశిరోమణియైన 'లూక్రీషియ'ను చెఱఁబట్టఁ జూచి, ఆమె యొల్లనందున నతఁడాపెను

కత్తితోఁ బొడిచి చంపెను; రక్తము వఱదలై శరీరమునుండి కాఱుచుండ, నామె మృతకళేబర మంగడి వీథిలోఁ బడియుండెను. ఏకత్తిచేత నామె చంపఁ బడెనో, ఆకత్తిఁ దీసికొని 'ఓదేవతలారా, ఆపతివ్రతయొక్క రక్తముఁ బట్టుకొని ప్రమాణముఁ జేయుచున్నాను. రాజును రాణిని అతని వంశస్థుల నందఱిం దునుమాడి, నగరమునకు స్వాస్థ్యముఁ దెచ్చెద. నేఁడు మొదలు నగరములో రాజులపరిపాలన సాంత మగుఁగాక' అని 'బ్రూటసు' జనులు వినుచుండఘోషించెను. 'మారుతీశ-మైదానము'లో నొక గొప్ప సభ జరిగెను. అప్పుడు సమావేశమైన వారంద ఱొక్కమ్మడిని 'ప్రజారాజ్యమును' చాటించిరి. రాజులవంశము నీటిలోఁ గలిసెను. 'తార్క్వినీశుని' పేరు మాసిపోయెను. 'కారేయి' పట్టణములో నతని తాతపండ్రులు జీవించియుండెడి వారు గనుక రాజు స్వగ్రామమునకుఁ బరారియై పోయెను. 'బ్రూటసు'ను 'లూక్రీషియ' భర్తయును వీరిరువురును 'ప్రజారాజ్యప్రథమప్రదర్శకులు'గ నియోగింపఁ బడి, రాజ్యముఁ బరిపాలించిరి

'ప్రజారాజ్యమును' స్థాపించినది మొదలు రోమకులు వీరిధర్మము నవలంబించిరి 'ఎత్రూసకనులు' నగరములో స్వరాజ్యమును స్థాపింపఁ బ్రయత్నించినందున, వారికిని రోమకులకును వైరము సాగెను. శత్రుసైన్యములతో 'లార్సు-పార్సేనుఁడు' నగరముపైకి వచ్చుచుండ, 'హొరేషియసు-కాకిలేశుఁడు' ఏటివంతెనపై సైన్యముతో నిలువఁబడి, శత్రువులఁ దునుమాడెను. ఈకాలములోనే, 'క్లీలియ' అను కన్యకామణి అభయము నిమిత్తము శత్రువుల కియ్యబడినను, వారిని తప్పించుకొని నదిని దాటి స్వపక్షము వచ్చి చేరెను కణకణలాడు మండిన నిప్పులోఁ దనహస్తముఁ బెట్టి 'రోమకులు శ్రమ నోర్వఁగలరు వారు రహస్యములఁ జెప్పరు.' అని 'మూసీయసుఁడు' చెప్పెను. తన గర్భవాసమందుఁ బుట్టిన కుమారులు రోమునగరమునకు ద్రోహముఁ జేయఁదలచినందున వారిని పట్టితెచ్చి సమవర్తియైన 'బ్రూటసు' వారికి మరణదండనను విధించెను. దేవతలు సహితముమానుషరూపములను ధరించి నగరములో సంచరించిరి. 'రెజిలసు-సరస్సు' వద్ద 'తార్క్వినీశున'కును రోమకులకును జరిగినయుద్ధ

ములో రోమకులు పరారియగుటకు సిద్ధపడినపుడు ఇరువురు దివ్యపురుషులం శ్వేతాశ్వములపై నెక్కివచ్చి వారిఁ బ్రోత్సహించి వారికి జయము నిప్పించిరి. కొందఱు సైనికులు వారిని చూచిరి; యుద్ధమయిన తరువాత వారు కనఁబడ లేద. ఆవిధముగ నగపడిన వారుభయులను 'కాస్టరు - పోలక్సు' దేవతలని యెంచి వారిపేరున రణరంగము మీఁద నొకదేవాలయము గట్టించిరి.

ఈనాటికి రోమకు లెంతవఱకు నాగరికులయిరో కొంచె మాలోచించెదము. ప్రథమమున సప్తపర్వతములమీఁద నివసించియుండినవారు గోపాలకు లని తెలిసికొంటిమి. వారు నదీతీరమున నగరముఁగట్టి క్రమముగ వర్తకవ్యాపారములో దిగిరి. అందు కనుగుణముగ "కార్తేజి" నగరమువారితో సఖ్యముఁ జేసికొనిరి. ఆనగరముయొక్క స్థితిగతులఁ బట్టి గోపాలకుల స్వేచ్ఛావిహారమును విడిచిపెట్టి రోమకులు ధనుర్బాణములను ధరించి వీరధర్మము నవలంబించిరి. ప్రతి నాగరికుఁడును యుద్ధకాలములో నాయుధములఁ బట్టుకొని యుద్ధమునకు వెళ్లవలెను. యుద్ధానంతరము వారివారి పనులఁ జేసికొనుచుండిరి. రాజవంశములోఁ బుట్టిన ప్రతిమనుజుఁడును సింహాసనము నెక్కుటకు వీలుపడదు; ప్రజలందఱు సమావేశమై యెవరినివారేకగ్రీవముగ నెంచికొనియెదరో వాఁడు సింహాసనార్హుఁడుకాని తదితరులు కారు. రాజు వారికి మతగురువు, వారికి న్యాయాధికారి; వారికి సేనాధిపతి. రాజు ప్రభుత్వము నిరంకుశమైనను, ప్రజల సమ్మతి ననుసరించి వ్యవహరింపవలెను? "క్యూరేషీయుల"నియు "హోరేషీయుల" నియు రెండు తెగలవారు కలరు; వారు సహజశత్రువులు; ఒక్కొక్కపక్షములో ముగ్గు రన్నదమ్ములు కలరు. ఒకసమయమున రోమకులకును "అల్బనుల" కును యుద్ధము సంభవించెను. రోమకులపక్షమున "హోరేషీయుల" ముగ్గు రన్నదమ్ములను "అల్బనుల" పక్షమున "క్యూరేషీయుల" ముగ్గు రన్నదమ్ములును పోరాడిరి. మొదటివారిలో నిరువురు రెండవవారిలో నిరువురఁ జంపి, జయముఁ బొందుసమయమునకు వారు కూడ నేలఁగూలిరి. "హోరేషీయుల"లో మిగిలినవాఁడు "క్యూరేషీయుల"లో మిగిలినవానిఁ జంపెను. చనిపోయిన వాని చెల్లెలను "హోరేషీయుఁడు" వివాహముఁ జేసికొనఁ దలచెను; కాని

ఆమె సోదరుని మరణమునకు విచారించుట చూచి, వాఁడు కోపగించి, ఆమెఁ బొడిచి చంపెను. రాజు వానికి మరణదండనను విధించెను; వాఁడు "ప్రజల"కు మొఱఁబెట్టుకొనినందున, వారి మాటప్రకారము రాజు మరణదండనను రద్దుపఱచెను వాఁడు కొన్ని ప్రాయశ్చిత్తకర్మలఁ జేసి స్వస్థచిత్తుఁ డయ్యెను.

రాజులవంశ మంతరించినతరువాత సంవత్సరమున కిరువురు 'రాజ్యప్రదర్శకుల'ను వారు నియోగించిరి. వారిరువురు రాజకార్యములను వ్యవహరించిరి, సంవత్సరానంతరమున స్వాధీనమై యుండినదేశములకు 'ప్రజారాజ్యప్రతినిధులు'గ వారు నియోగింపబడుచుండిరి, వారిస్థానమున నగరములో నూతనముగ నిరువురు 'ప్రదర్శకులు' రాజకార్యములను నిర్వర్తించిరి. యుద్ధకాలములో నొక 'ప్రదర్శకుఁడు' నగరమును విడిచి పెట్టవలయు కనుక, నాఱుమాసముల కొక 'సేనాధిపతిని' వారు నియమించిరి, అతఁడు యుద్ధకాండను నడిపించును. 'ఎత్రూసకనుల' ద్వారా గ్రీకులమతాచారములను రోమకులు నేర్చి వాని నవలంబించిరి ప్రథమమున వారు పశుపాలకులును సేద్యకులును కనుక వారిమతాచారములు కూడనందు కనుగుణముగ నేర్పడెను. 'ఫ్లోర'అను పుష్పదేవతను, 'జేనసు' అను ద్విముఖసూర్యదేవునియు, 'సాతగను' అను సస్యదేవునియు వారారాధించి పూజించిరి ప్రజలు పిచ్చిమతాభిప్రాయములను విస్తరింపఁ జేయకుండునటులను పిచ్చిమతాచారముల నవలంబింప కుండునటులను, కొన్ని 'మఠముల'ను వారు స్థాపించిరి, అమరాధికారులు శాస్త్రోక్తమైన మతమును ప్రజ లనుసరించునట్లు చూచుచుండిరి, శకునములఁ జూచి భవిష్యత్తుఁ జెప్పుటకు 'శాకునికులు' నియోగింపఁబడిరి. ప్రతిరోమకుఁడును స్వగృహదేవతలును స్వగృహపితృదేవతల నారాధించును; స్వదేశములోఁగాని విదేశములోఁగాని వాఁడు వానినిఁ బూజించును. స్వగృహదేవతల ప్రీత్యర్థము ప్రతిదినము ప్రతిగృహములో నగ్నిహోత్రముఁ జేయఁబడును. నగరములో 'వేస్త'అను దేవతాలయము కలదు, అందులో నవిచ్ఛిన్నాగ్నిహోత్రము స్థాపింపఁబడెను. ప్రతిగృహస్థుఁడును దానిని బూజించును. దానిని రక్షించుట కాఱుగురు కన్యకామణు లాదేవాలయములో నివసించుచుండిరి.

ఈనాటికి నగరము స్థాపింపఁబడి మూఁడుశతాబ్దము లయ్యెను, ఏకళల లోను వారికిఁ బ్రవేశము లేదు, వారు నేర్చిన కళలన్నియు 'ఎత్రూస్కనుల' వలనఁగాని, గ్రీకులవలనఁ గాని నేర్చిరి. శాస్త్రములుగాని గ్రంథములు గాని వారిలోఁ గానరావు. ఇంతవఱకు వారికి దేహబలము గాని బుద్ధిబలము లేదు 'రాజ్య సృష్టి' విధానములను వారు కొంచెము గుర్తెఱిఁగియుండిరి. క్రమముగ వానిని విస్తరింపఁజేసి మహారాజ్యమును వారు సృష్టించిరి.

క్రీ. పూ. సం. 508-266రములు,—'ప్రజారాజ్యము' స్థాపింపబడిన తరువాత రెండువందలయేఁబదిసంవత్సరములవఱకు రోమకులంతఃకలహములచేతను బహిఃకలహముల చేతఁ బీడింపఁబడిరి, నగరములో 'సామంతులకు'ను 'ప్రజలకు'ను పోరాటము తగిలెను, దేశములోఁ బ్రతియంగుళము భూమిని గుఱించి పోరాడి వారు స్వాధీనముఁ జేసికొనిరి. ప్రజలకు రెండువిధముల దుఃఖములు తగిలియుండెను, ఇరుప్రక్కల నుండిన శత్రువులు దాడివచ్చి వారి వ్యవసాయములఁ బాడుచేయుట చేత వారు నిరుపేదలై యుండిరి, రోమకనాగరికునికి నుండవలసిన ప్రవృత్తిధర్మములు వారికి లేకపోయెను వీరధర్మము ననుసరించి వారు యుద్ధమునకుఁ బోయినపుడు వారియాస్థులఁ గాపాడువారు లేక పోయిరి, నిర్ధనులు గనుక, ధనికులవద్ద ఋణముఁ జేయవలసి వచ్చెను; ఋణగ్రస్తుల విషయమై ధర్మశాస్త్రము కఠినముగ నుండెను. శత్రువులు నగరముపైకి దాడివచ్చియుండ, ప్రజలందఱు గుమిగూడి 'మా ప్రవృత్తిధర్మములను స్పష్టపఱచి వానినిఁ గాపాడిన గాని మేము యుద్ధమునకు బయలువెడల' మని మొఱఁబెట్టిరి. స్వధర్మములఁ గాపాడుటకును, స్వదుఃఖముల నివారించుటకును 'ప్రజాదర్శకుల'ను వారు నియమించిరి. వీరు ప్రజలలోని వారు కనుక, వారి క్షేమమునకు వ్యవహరించుచుండిరి, అన్యాయమైన సూత్రముఁ గల్పించి దానిని శాస్త్రీయమని సభవా రంగీకరింపకుండు నటులఁ జేయుటకు 'ప్రజాదర్శకుల'కు శక్తికలదు. ఎవరైనను ప్రజలపక్షము నవలంబించి వారి ధర్మములఁ గాపాడఁ దలఁచినయెడల, వానిని 'సామంతులు' చంపివేయుచుండిరి. 'స్పూరీశ-కాశీయసుఁడు' ప్రజలకష్టములనువిని వారిని

అతఁ డాదరించినందున నతనిని సామంతులు చంపివేసిరి. మఱియొకవిశేషము గలదు. 'ద్వాదశపథకము'లని పేరుగల ధర్మశాస్త్రసూత్రములను గ్రీకులవద్ద నుండి రోమకులు తీసికొని వచ్చి వాని ననుసరించి వ్యవహరింప నారంభించిరి. రాజాంగములు బలిసినకొలఁది వానిని నడిపించుటకు వ్యవహారస్థులు నూతనముగ నియోగింపఁ బడిరి. ఇరుప్రక్కల రాజదండములఁ బట్టుకొని సేవకులు నిలిచియుండ, 'అధ్యక్షదర్శకులు' (Consels) ఉన్నతమును (Toga) ధరించి దంతముతోఁ జేయబడిన యున్నతాసనముల నధిష్ఠించి యుందురు, న్యాయదండనాధికారములను త్రిశక్తులు వారికిఁ గలవు. ప్రతిఆయిదుసంవత్సరముల కొకపర్యాయము జనసంఖ్యఁ దీసికొనుటకు 'గుణదోష వివేచకు' (Censors) లిరువురు కలరు. రాదారిమార్గములను వంతెనలను, వ్యవహారమందిరములను, మొదలగువానిని వారు చూచెదరు. న్యాయసభలలో న్యాయాన్యాయవిచారణఁ జేయు 'ప్రేటర్లు' అను న్యాయాధికారు లుండిరి. వారియంగడివీథులను వినోదములఁ బరీక్షించుటకు 'ఈడైలులు' అనువారు కలరు. వీరు రాజకీయవ్యవహారస్థులు. వీరు రాజ్యాంగములను నడిపించిరి వీరి వ్యవహారములను విరోధించుటకుఁ గాని లేక వారిని సరిచేసి ప్రవర్తింపఁజేయుటకుఁ గాని 'ప్రజాదర్శకులు' భారమును వహించిరి 'వికర్షికులు' అనువారు రాదాయవ్యయములఁ జూచుచుండిరి. తుదకు రాజ్యసూత్రములు న్యాయమార్గము ననుసరించి యుండెను. రాజ్యాంగము లాయామార్గములలోఁ బ్రవర్తించెను 'సామంతులు'ను 'ప్రజలు'ను అత్యంతమైత్రితో నగరములో నివసించిరి

క్రీ. పూ సం॥ 390 రము:—రోమకులు వీరధర్మము ననుసరించి నగర బహిఃప్రదేశములను క్రమముగ సాధించిరి మఱికొంతకాలమునకు 'గాలులు' నగరముపైఁ బడి దానిని ధ్వంసముఁ జేసిరి రోమకులు వారియెదుట నిలువలేక పోయిరి శత్రువులు సమస్తపదార్థములను దొంగిలించికొని పోయిరి. నగరములో వెండిబంగారములు కఱవయ్యెను. కాలక్రమమున వారు పునర్జీవితులై, నగరమును బలపఱచిరి. దక్షిణోత్తరభాగములను వారు స్వాధీనముఁ

జేసికొనిరి. ఆయాభాగములలో నూతనసీమలను స్థాపించి వానినుండి నగరము వఱకును రాదారిమార్గములఁ గట్టించిరి. దక్షిణమున 'మాగ్నా-గ్రీసు' అను గ్రీకుల నూతనసీమలు మాత్రము వారికి స్వాధీనము కాలేదు. ఈభాగమును రోమకులు సాధించినపుడు వారికిని "పిర్హాను" అను వానికిని యుద్ధము సంభవించెను. గ్రీసు దేశమున కుత్తరమున నొకసంస్థానము కలదు, దాని కతఁ డధిపతి. "మహా అలగ్జాండరు" చనిపోయినతరువాత, నతఁడు "మాసిడను" దేశమును స్వాధీనముఁ జేసికొనెను. అతఁడు స్వరాజ్యమును విస్తరింపఁ జేయఁగోరెను. రోమకులతో జగడమునకు "టారెంటము" పట్టణమువా రతనిని సహాయముఁ గోరిరి, ఆతఁ డందుకు సమ్మతించెను. ఈమూలమున నతఁడు "ఇటాలియా" "గ్రీసు" దేశములను సాధింపఁబూనెను కాని, ఆతని మనోరథములు నిష్ఫలము లయ్యెను. యుద్ధములో నతఁ డపజయముఁ బొంది స్వదేశమునకుఁ బోయెను "రోమకులం బోలు సైనికులతో దిగ్విజయముఁ జేయవచ్చు న"ని అతఁడు ప్రసంగించెను. తదుపరి దక్షిణభాగమంతయు రోమకులకు స్వాధీనమయ్యెను.

క్రీ. పూ. సం॥ 264-133 రములు కాలము గడిచెను. రోమకులకును 'కార్తేజి' నగరమువారికిని యుద్ధము పొసఁగెను ఆకథను మనము విని యుంటిమి. క్రమముగ రోమకులకీర్తి ప్రాచీనదిశను వ్యాపించెను. 'కారింతు' వద్ద జరిగిన క్రీడల'ఁజూచుటకు రోమకరాయబారులకు గ్రీకు లనుజ్ఞనిచ్చిరి; అంతకు మించిన గౌరవము లేదు. 'మాగ్నాగ్రీసు' లో నివసించు గ్రీకుల వలన వారి సమస్త శాస్త్రములను సకలధర్మములను రోమకు లభ్యసించిరి. రోమకచరిత్రకారులు 'గ్రీకు' భాషలో స్వదేశచరిత్రలను వ్రాయఁజొచ్చిరి, పాఠశాలలో 'గ్రీకు' భాషఁ జదువనేర్చిరి. ఎప్పటికైన గ్రీసుదేశమును వారు సాధింపఁబూనిరి. 'కార్తేజి' నగరము వారితో యుద్ధముముగిసెను; 'మాగ్నాగ్రీసు' లో నివసించు గ్రీకులుశత్రువులకు సహాయముఁ జేసి రని మిషపెట్టి రోమకులు వారిపైకి దండు వెడలి, వారినోడించి, వారి 'మాగ్నగ్రీసు' ప్రదేశమును స్వాధీనముఁ జేసికొనిరి. క్రమముగ 'మాసిడను', దేశమును 'గ్రీసు' దేశమును రోమకపోషవర్గములోనికి

వచ్చెను. గ్రీసుదేశములోని దివ్యమగు శిలా ప్రతిమలు రోమునగరమునకుఁ దేఁబడెను. స్వదేశము యావత్తు నాక్రమించి, దిగ్విజయముఁ జేసి, రోమకులు కీర్తి ప్రతిష్ఠలఁ బొందిరి. క్రీ. పూ సం॥ 264—133 రములనాటికి 'కార్తేజి' నగరము 'సిసిలీ' ద్వీపము 'స్పానియా' 'మాసిడను' 'గ్రీసు'— మొదలగు దేశము లన్నియు వారియాజ్ఞకు లోఁబడియుండెను. మఱి నూఱుసంవత్సరముల నాటికి 'సిరియా' 'ఈజిప్టు' 'ఆశియా మైనరు' 'గాలు'— మొదలగు ప్రదేశములు వారికిఁ బాదాక్రాంతము లయ్యెను. ఈలోపున 'ప్రజారాజ్యము' యొక్క వినాశమునకును 'సామ్రాజ్యము' యొక్క సంస్థాపన కనుగుణమగు వ్యవహారధర్మములు గమనించినంగున, మఱి నూఱుసంవత్సరములు గడచుటకుఁ బూర్వము 'ప్రజారాజ్య' మంతరించెను; 'సామ్రాజ్య' ముదయించెను,

క్రీ. పూ. సం॥ 134—30 రములలో రోమునగరము మహోచ్ఛ్రపదవికి వచ్చి సిరిసంపదలలోఁ దేలుచుండెను, కాని, కొందఱు రోమకులు కడుపేదఱికము ననుభవించుచుండిరి కుడుచుటకుఁ గూడును, నిలుచుటకు నీడయు, కట్టుటకు వస్త్రమును లేక వారు బాధపడిరి, వారిబాధలఁ జూచువారు లేరు; వారిని రక్షించువారు లేరు ; ధనికులగృహములవద్ద వారు పడి కాపులుపడియుండిరి. కాని వారిరోదనములను వినువారులేరు. కొర్నుపడి యుండిన భూములను వారు సాగుఁ జేయఁదలఁచిరి, కాని ధనికు లాభూముల నాక్రమించి స్వాధీనానుభవములో నుంచుకొనిరి; నిరుపేద లనుభవించుటకు భూములు లేకపోయెను. ఇటాలియా దేశములోని మృగములు నిలుచుటకు నీఁడ కలదు, కాని స్వదేశము నిమిత్తము చీమురక్తము ధారపోసిన రోమకుఁ డన్న దేహి నాస్తియై గృహములేక సంచరించుచున్నవాఁడు' అని చెప్పి 'గ్రాకసు భ్రాతలిరువురు వారిపక్షము నవలంబించి, 'సామంతుల'తోఁ బోరాటమునకు దిగిరి. వారా భ్రాతల నిరువురఁ జంపివేసిరి. అంతఃకలహములలో రోమకులు మునిగిరి. అందుమూలమున వారు 'రోమక నాగరికధర్మముల'ను స్థాపింపఁ బ్రయత్నించిరి. ఈజగడములో 'మారీయుఁగు'ను 'సల్ల'అనునిరువురును విగతజీవు లయిరి. వారిమరణానంతరమున కూడ

నగరములో రెండువహీ లుండెను; రాజ్యసూత్రములను వహించుటకుఁ దగిన వారు సామంతులని కొందఱిమతము, సామంతు లయిననేమి కాకపోయిన నేమి ఎవరైనను బుద్ధిబలము గలవారు రాజ్యభారమును వహింపవలెఁ గాని తదితరులు కూడదని కొందఱియభిప్రాయము. ప్రభుమాత్రోత్సాహశక్తులుకలవానికి మంచి సమయము వచ్చెను. సకలగుణసంపన్నుఁడైన 'పాంపేయుఁడు' ప్రాచీన రాజ్యములను సాధించి ప్రబలుఁడై కొంతకాలము వెలిఁగెను, కాని, అతని చర్యలు సర్వజనశ్లాఘనీయములు కానందున నతని ప్రభ తగ్గెను. అతనికంటె 'జూలియసు—సీజరు' గొప్పవాఁడు. సైనికులమనస్సులను రంజించెను; 'గాలు' 'బ్రిటను' దేశములను సాధించి 'పాంపేయు'ని విదేశమునకుఁ బంపివేసి, 'సర్వాధికారి' యయ్యెను. అంతకంటె గొప్పదియైన 'సార్వభౌమ' అనుబిరుదు నతఁడు ధరింపలేకపోయెను. ఆపేరు లేకపోయినను, సీజరు రోమకమహా రాజ్యమునకు నిరంకుశప్రభు వయ్యెను. అతనికాలములో రోమకులు సకల సంపదల ననుభవించిరి. బ్రూటసు పన్నిన దురాలోచనలచేత సీజరు దుర్మర ణము నొందినందున, ప్రజారాజ్య మతనితో నస్తమించెను. అనంతరము 'అక్టేవియసు—సీజరు' రాజ్యసూత్రములను వహించి, 'మార్కు—అంతోని' మొదలగు శత్రువులఁ దునుమాడి, రోమకమహారాజ్యమునకు అగస్టసు అని పేరుఁ బెట్టుకొని ప్రథమసార్వభౌముఁ డయ్యెను. అగస్టసు కాలమునుండి సామ్రాజ్యాధిపత్యము ప్రారంభమయ్యెను.

అన్నిచిక్కులం దాటి సామ్రాజ్యాభిషేకకాలము నాటికి వచ్చితిమి; మధ్యందినమార్తాండుని వలె, మహారాజ్యము వెలుంగుచున్నది, దశదిశల రోమ కులకీర్తి ప్రతిష్ఠలు వ్యాపించెను. ఇంతవఱకు వారు రాజ్యధర్మములను నడిపించిన విధముఁ జూచితిమి, ఇటుపైని వారు గృహస్థాశ్రమధర్మముల నెటుల నడిపించిరో చూచెదము. రోమునగరములో నొకవీథిగుండఁ బోవుచు నొక గృహస్థుని గృహములోఁ బ్రవేశింతుము. ఎడమపాదముఁ బెట్టిన నంశుభయము కనుక, కుడిపాదముఁ బెట్టి గుమ్మము దాఁటి హజారములోఁ బ్రవేశింపవలెను. హజారము గచ్చునగిషీ చేయఁబడి చూచుట కింపుగ నుండును; అందులోఁ

ప్రవేశింప, గృహస్థుగాని అతనిస్థానమున మఱియొకరుగాని వచ్చినవానిని దయ చేయుఁడు అని మర్యాదఁజేసి, వాని, సుఖాసీనుఁజేయును. అచ్చటనుండి చూచినయొకవైపున అగ్నివేదిక (hearth) స్థాపింపఁబడిన గది కనఁబడును, ధూమము పాఱినందున దానికి 'చీఁకటిగది' అని పేరువచ్చెను ఒకసంసారి గృహ మయిన యెడల నాచీఁకటి గదిలో షోడశకర్మలు జఱుగును, అందులోఁ గుటుంబము వారందఱు సమావేశమై తమతమపనులం జేయుదురు. అదియే సామంతుల గృహ మయినయెడల భోజనమందిరములు, పాకశాలలు, శయనమందిరములు, పుస్తకభాండాగారములు, స్నానమందిరములు, గరిడీశాలలు — మొదలగునవి వేర్వేర నొకటితో నొకటి కలిసియుండును. అంగణము నలువైపులఁ బుష్పవృక్షములతో శోభిల్లుచుండును; దానిమధ్య 'యంత్రోదకస్థానము (Fountain) కలదు. భోజనశాలలో వారు పర్యంకముపై సుఖాసీనులై తమముందు బల్లపై పళ్లెరములలోఁ బెట్టినపదార్థములను, వామహస్తముపై వ్రాలి వానిని భుజింతురు. గ్రీకులఁ జూచి విద్యాభిలాషకలవారై, పుస్తకభాండాగారముల నిర్మించిరి. ఎండతీక్ష్ణముగ నుండినపుడు, అంగణములో వారున్నతాసనముల నధిష్ఠించి, సుఖముగఁ బ్రసంగింతురు. పూర్వము 'రోమ్యులను' కాలములో 'సాబీనుల'కు కన్యలను రోమకులు బలాత్కారముగఁ దీసికొని వచ్చి వివాహముఁ జేసికొనిరి, అవృద్ధాచారము ననుసరించి వివాహకాలమున రోమకుఁడు కన్యను హస్తముఁ బట్టుకొని లాగును. ; ఆమెను భర్తయెత్తుకొని గృహములోఁ బ్రవేశపెట్టును అగ్నిహోత్రము నుదకమును ఆమె యెదుటనుంచి భర్త ఆమెను ఆహ్వాయముఁ జేయును. అనంతర మామె బీగములఁ బుచ్చుకొనిన తరువాత గృహిణి యగును ; గృహకృత్యములనెఱవేర్చి భర్తకుఁ బరిచర్యలఁ జేయును. "ప్రజారాజ్యము" స్థాపింపఁబడిన ప్రారంభమున రోమకుల అన్నపానాదులు సంసారిపక్షముగ నుండెను. మధ్యాహ్నమున దధిక్షీరఘృతసూపసమన్వితమైన శాల్యోదనమును వారు భుజింతురు. "ప్రజారాజ్యమునకు" అవసానకాలములు సమీపించునప్పటికి ఉదయమున వారు ఫలములను, రొట్టెలను జున్నును సేవింతురు ; మధ్యాహ్నమున వివిధపదార్థములను సాయంసమయమున మధు

పానముచే క్షుద్బాధ విశేష మగుటవలన, శాకములతో గూడిన మాంసము నారగింతురు. చేపలను, వేడి, గుప్పి, వరాహము, కోడి, బాతు మొద లగువాని మాంసమును, నెమలి భరద్వాజముల నాలుకలును, వారు భుజిం తురు తగపరి ఫలహారముఁ జేసి వారుశయనింతురు ధనికులైన రోమనులు పల్లకిలోఁ గూర్చుండి ప్రయాణ మగుదురు. అశ్వారూఢులై సంసారులు గమనింతురు.నిర్ధనికులు శకటములలోఁ బోదురు. గ్రీసుదేశమును స్వాధీనముఁ జేసికొనిన తరువాత, వారు విద్యాభ్యాసముఁ జేయ నారంభించిరి. దారుపల కలనుండి అక్షరములను చిన్నపిల్లలు నేర్చిరి, పెద్దలు వ్రాసినవిధమున మైన ముతోఁ గప్పఁబడిన దారుపలకలమీఁద వారు ఘంటముతో వ్రాయుచుండిరి. విద్వాంసుఁడైన ప్రతిరోమకుఁడును గ్రీకుభాషను వ్రాయను భాషింపను చదు వను నేర్చుకొనెను, గ్రీకులను లక్ష్యముఁ జేసికొని ప్రతిరోమకగ్రంథకర్తయు గ్రంథములను వ్రాయుచుండెను. "లూక్రీషియనుఁడు" అను నొక కవిశ్రేష్ఠుఁడు "పదార్థతత్త్వము" అను నొకపద్యకావ్యమును వ్రాసెను. ఆకావ్యము సరస వచనములతోఁ గూడినదియే కాక, "ఎపిక్యూరసు" యొక్క మతమును బోధించును. 'అయినిడు' అను పద్యకావ్యమును వ్రాసిన 'వర్జిలు' అను మహా కవి 'అగస్టసు' సార్వభౌముని యాస్థానము నలంకరించెను. ఆకాలములో 'లివి' అనువాఁడు రోమకచరిత్రను వ్రాసి ముగించెను; 'హోరేసు' అను కవి అన్యాపదేశముగ శ్లోకములఁ జెప్పెను. ముచ్చటకు ముప్వురఁ బేర్కొంటిమి; ఇంక ననేకులు కలరు, నలువురు నలువిధముల శాస్త్రపరిశోధనఁ జేసిరి.

రోమనుకుల క్రీడావినోదములఁ జూచెదము. ఆబాలవృద్ధులు చదరంగము నాడుచుండురు; ఈయాటను వారు గ్రీకులవద్దనుండి నేర్చుకొనిరి. అన్నిటికంటె వారికి 'మల్లయుద్ధముల' యందభిలాష మెండు. శుభాశుభకార్యములు వచ్చి నపుడు, మల్లులు వచ్చి పోరాడవలెను; వినోదముకొఱకుఁ గాక, వారు ఆపోరా టములలో విగతజీవు లగుదురు.

ఇకను వారిప్రేతకర్మలను వినఁబోవుదము.ఒకనికి అవసానకాలముసంప్రా ప్తమయ్యెనా; బంధుపుత్రమిత్రకళత్రాదులవద్ద వాఁడు సెలవుఁ గైకొనును;

వైతరణీనదిని దాటించు వానికి వేతనము నిమిత్తము వాని నోటిలో బంగారు నాణెమును వేయుదురు. వాఁడు ప్రాణములను విడుచును; ముసుగులు వేసికొని వాహకులు శరీరమును మోసికొని పోవుదురు; పుత్రమిత్రాదులు పాదచారులై వెనుకనుండి గమనింతురు; ఆశరీరమునకు శ్మశానవాటికలో నగ్నిసంస్కారముఁ జేయుదురు.

క్రీ. పూ. సం॥ 30—క్రీ. వి. సం॥ 14 రములు:—'అక్టేవియసు—అగస్టసు—సీజరు' రోమకమహారాజ్యమునకుఁ బ్రథమసార్వభౌముఁ డయ్యెను; దేదీప్యమానముగ మహారాజ్యము విజృంభించి యుండెను. 'మేడిపండుఁ జూడ మేలిమై యుండును, పొట్టవిచ్చిచూడఁ బురుగులుండు' అని చెప్పిన విధమునఁ జూచుటకుఁ బైకి మహారాజ్యము మేలిమై యుండెను. 'అగస్టసు' లోకాంతరగతుఁ డయ్యెను.

'కారేరాజులు రాజ్యముల్గలుగవే గర్వోన్నతిం, బొందరే. వారేరీ?' అనునటుల ననేకచక్రవర్తు లొకరితరువాత నొకరు వచ్చి వెళ్లిరి. వారేరీ! మహారాజ్యము క్రమముగ దిగుడుమార్గములోఁ బడెను.

క్రీ. వె. సం 14-34రములు: అతనితరువాత 'టైబీరియసు—సీజరు' సింహాసనమునకు వచ్చెను. అతఁడు గర్విష్ఠి; తామసుఁడు; అతనియందుఁ బ్రజల కనురాగము లేదు. క్రీ. వె. సం. 37-41రమువఱకు 'కాలిగుల' అను చక్రవర్తి రాజ్యముఁ జేసెను. అతఁడు మోహాంధకారమగ్నుఁడై కన్నుగానక దుర్మార్గములలో సంచరించెను. క్రీ వె. సం. 41-54 రములవఱకు 'క్లాడియసు' చక్రవర్తి 'బ్రిటను' ద్వీపమును జయించి దేశముఁ బరిపాలించెను క్రీ, వె. సం. 54-68 రముల వఱకు మాతృదేవతను చంపి క్రైస్తువులను బలివేసి 'నీరో' అను చక్రవర్తి పరమ దుర్మార్గుఁ డని పేరుఁ బొందెను. క్రీ. వె సం. 68-79రములు వఱకు 'వేస్పాసియనుఁడు' అచక్రవర్తి రాజ్యముఁ జేసి 'జేరూసలము' పట్టణముఁ బట్టుకొని ధ్వంసముఁ జేసెను. క్రీ. వె. సం. 79-81 రముల వఱకు 'టైటసు' చక్రవర్తికాలములో 'పాంపేయి' 'హేర్క్యులనము' అను పట్టణములను 'అగ్నిపర్వతములు' విజృంభించి నాశనముఁ జేసెను. క్రీ. వె. సం.

96-98 వఱకు పాపాత్ముఁడైన ‘డమిషియను’ చక్రవర్తి పరిపాలించెను. క్రీ. వె. సం॥ 98--117 రములువఱకు ‘ట్రాజను’ చక్రవర్తి దేశము నేలెను అతఁడు కట్టించిన మహోన్నతభవనములు నేటివఱకుఁ జూడ నగును. క్రీ. వె. సం॥ 117-138 రములు వఱకు ‘హాడ్రియను’ చక్రవర్తి దేశముఁ బాలించెను. అతఁడు రాజ్యమును విస్తరింపఁ జేసెను. అతఁడు దేవాలయములఁ గట్టించెను. క్రీ. వె. సం॥ 138-161 రములవఱకు ‘అంతోనినసు’ చక్రవర్తి రాజ్యము నేలెను. క్రీ. వె. సం॥ 1.7 రము నాటికి రోమకసైనికులు ప్రబలులై నందున నాటినుండి వారు నియమించినవాఁడు చక్రవర్తి యగుచుండెను, కాని, చక్రవర్తుల వంశములోఁ బుట్టినవాఁడు కాలేదు. క్రీ. వె. సం॥ 161-180 రములవఱకు లౌకికతంత్రములగు రైతుగాక కేవలము వేదాంతియైన ‘మార్కసు-అరీలియసు’ చక్రవర్తి సింహాసనము నధిష్ఠించెను. తదనంతరము నేకచక్రవర్తులు వచ్చివెళ్లిరి. ఇంతకుపూర్వమే మహారాజ్యము నీచావరోహియై వచ్చెను. నేటికి నీచదశలు సంప్రాప్తమయ్యెను; రాజ్యము నుద్ధరించుట కియవురు చక్రవర్తులు సమకట్టిరి. కాని వారిప్రయత్నములు నెఱవేఱలేదు.

క్రీ వె. సం॥ 285-395 రములు.—

‘డయోక్లిషియను’చక్రవర్తి నిరంకుశముగ రాజ్యము నేలెను. అతఁడు క్రీస్తుమతము యొక్క రూపమును మాపివేయఁ దలఁచెను. అతనితరువాత ‘కాంస్టెంటైను’చక్రవర్తి క్రీస్తుమతము నవలంబించి ప్రభుత్వముఁ జేసెను. మహారాజ్యమునకు ద్వంద్వము వచ్చెను, ‘ప్రాచీనరాజ్య మని’యు ‘పశ్చిమరాజ్యమ’ నియు ద్వివిధ మయ్యెను. చక్రవర్తు లిరువు లయిరి.

‘తూర్పురాజ్యము’ నకు ‘కాంస్టెంటైను’ చక్రవర్తి యయ్యెను; పశ్చిమ రాజ్యమునకు ‘థియోడోషియసు’చక్రవర్తియై మహారాజ్యమును అద్వైతముఁ జేయవలెనని శ్రమపడెను; చక్రవర్తులవంశ మతనితో నంతరించెను. క్రమక్రమముగ నుత్తరభూములనుండి “గాతులు” అనువారు దిగఁబడివచ్చి క్రీ. వె. సం॥ 476 రములో రోమునగరములోఁ బ్రవేశించి అప్పటికి పూఁడశ

వయస్కుఁడగు చక్రవర్తిని సింహాసనమునుండి పడఁద్రోసి, నగరమును ధ్వంసముఁ జేసిరి; 'గాతుల' ప్రభుత్వ మారంభ మయ్యెను.

రోమకమహారాజ్య మస్తమించెను; సంధ్యారాగమువలె, మఱియొక విధమున దానిప్రభ మఱికొన్ని శతాబ్దముల వఱకు వెలిఁగెను. ఆవిధమును ముందుకురాఁబోవు గ్రంథములలోఁ జూపఁగలము.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి.—1917.

ఆంధ్ర గ్రంథములు.

పద్య కావ్యము.

		రు.	అ.
ఆంధ్రభారతము—	ప్రతి 1-కి	రు.	అ.
ఆది, సభాపర్వములుఁగల సంపుటము	...	1	12
ఆరణ్యపర్వము ,,	...	1	12
విరాటోద్యోగపర్వములు ,,	...	1	12
శాంతిపర్వము ,,	...	1	12
ఆనుశాసనిక అశ్వమేధ ఆశ్రమవాస మౌసల మహాప్రస్థానిక స్వర్గారోహణ పర్వములుగల సంపుటము	...	1	12
ఆదిపంచకము, ఒకటేసంపుటము	...	5	0
తెలుఁగుసమస్యలు, చక్కనికూర్పు	...	0	2
ఆంధ్రభారత విమర్శనము. శ్రీమల్లాది. సూర్యనారాయణశాస్త్రి గారిది		0	8
లంకావిజయము (రావణదమ్మీయము), సటీక, పిండిప్రోలు. లక్ష్మణకవిది		1	8
కృష్ణరాయవిజయము, కుమార ధూర్జటికృతము, చక్కనికూర్పు		0	8
భాస్కరరామాయణము, చక్కనికూర్పు	...	2	8
నిర్వచనోత్తరరామాయణము, సాధారణప్రతి	...	0	12
ఉత్తరరామాయణము, కంకంటి. పాపరాజప్రణీతము, చక్కనికూర్పు		1	8
రంగనాథరామాయణము, ద్విపద, చక్కనిక్రొత్తకూర్పు	...	2	8
గోపీనాథరామాయణము, 2-సంపుటములు, శ్రీమద్రామాయణమునకు సరియైన పద్యకావ్యము కవనము మిక్కిలి సొంపు	...	4	8
మొల్లరామాయణము, చిన్నసైజున పెద్దక్షరములతో చక్కగముద్రితము		0	8
మార్కండేయపురాణము, మారనకవి	...	1	12
అచ్చతెనుఁగురామాయణము, శుద్ధప్రతి	...	1	8
ఆంధ్రభాగవతము, పోతనామాత్యప్రణీతము, ఇదివఱకు ముద్రితమైనప్రతులకన్న అన్నివిధములబాగుగనున్నది	...	3	0
డిటో అత్యుత్తమప్రతి, 2 వాల్యములు	...	5	8
వసుచరిత్రవిమర్శనము, శ్రీ చివసీతారామస్వామిశాస్త్రి కృతము. అత్యద్భుతములగు క్రొత్తవిషయములనేకము లిందుగలవు	...	1	0

		ప్రతి 1-కి రు.	అ.
మనుచరిత్ర, సటీక	...	1	8
వీరభద్రవిజయము, బమ్మెర. పోతనామాత్యప్రణీతము	...	0	12
వసుచరిత్ర, సవ్యాఖ్యానము, చక్కనికూర్పు	..	2	8
హరిశ్చంద్రనలోపాఖ్యానము, సటీక	(అచ్చగుచున్నది.)		
ఆముక్తమాల్యద, వావిళ్ల. రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో మేలుకాగితములమీఁద చక్కఁగ మరల ముద్రించియున్నారము.		3	0
ప్రభావతిప్రద్యుమ్నము, క్రొత్తకూర్పు	...	0	8
కళాపూర్ణోదయము, దళసరికాగితములు	...	1	8
రాఘవపాండవీయము, సటీక, చక్కనికూర్పు	...	1	8
శృంగారనైషధము, శ్రీనాథకవిది, క్రొత్తకూర్పు	...	0	14
హరవిలాసము ,,	...	0	10
కాశీఖండము, చక్కనిక్రొత్తకూర్పు	...	1	8
కవికర్ణరసాయనము, మాంధాతచరిత్ర	...	1	8
నరసభూపాలీయము, అట్టబైండు	...	0	8
విజయవిలాసము, చేమకూర వేంకటకవిది	...	0	4
సారంగధరచరిత్రము, చేమకూర. వేంకటకవికృతము	...	0	8
బిల్హణీయము, చక్కనికూర్పు	...	0	8
వైజయంతీవిలాసము ,,	...	0	8
రంగారాయచరిత్ర, దిట్టకవి. నారాయణకవిప్రణీతము	...	0	8
రామాభ్యుదయము, అయ్యలరాజు రామభద్రకవికృతము	...	1	4
నీలాసుందరీపరిణయము, కూచిమంచి. తిమ్మకవికృతము	...	0	4
రసికజనమనోభిరామము, శుద్ధప్రతి ,,	...	0	8
రుక్మిణీపరిణయము ,, ,,	...	0	6
రాజశేఖరవిలాసము ,,	...	0	8
పారిజాతాపహరణము	...	0	8
హరిశ్చంద్రోపాఖ్యానము, శంకరకవిప్రణీతము	...	0	8
అనిరుద్ధచరిత్ర, కనుపర్తి. అబ్బయామాత్యప్రణీతము	...	0	8
నిరంకుశోపాఖ్యానము, రుద్రకవికృతము	...	0	6
వేంకటాచలమాహాత్మ్యము, తరిగొండ. వెంకమ్మకృతము, చక్కనికూర్పు		0	14

		ప్రతి 1-కి రూ.	అ.
రాజయోగసారము, ద్విపద	...	0	4
బసవపురాణము, పిడుపర్తి. సోమనాథప్రణీతము	...	1	12
చెన్నబసవపురాణము, పావకవికృతము	...	1	0
శ్రీనాథునివీథినాటకము	...	0	2
సీతారామాంజనేయసంవాదము, సటీక, క్రొత్తకూర్పు	...	2	8
జైమినిభారతము, అశ్వమేధపర్వము, చక్రనికూర్పు	...	0	12
ఉత్తరహరివంశము, నాచన. సోమనాథకృతము	...	1	4
నృసింహపురాణము, ఎఱ్ఱాప్రెగ్గడ, క్రొత్తకూర్పు	...	0	12
రుక్మాంగదచరిత్ర, ఏకాదశీమాహాత్మ్యము	...	0	5
సులక్షణసారము, సటీక	...	0	8
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు టీకానుక్రమణికా సహితము, కాలికోబైండు	...	0	12
అప్పకవీయము, చక్రనికూర్పు	...	1	10
ఆంధ్రభాషాభూషణము	...	0	2
ఆంధ్రభాషార్ణవము	...	0	12
ఆంధ్రచంద్రాలోకము, సటీక	...	0	8
వేమనపద్యములు, చక్రనికూర్పు	...	0	4
భాగవతసప్తమస్కంధము, సాధారణప్రతి	...	0	4
సప్తమస్కంధము, సటీక, చిన్నసైజు	...	1	0
కుచేలోపాఖ్యానము, సటీక, (భాగవతము)	...	0	4
అంబరీషోపాఖ్యానము, సటీక (భాగవతము)	...	0	4
గజేంద్రమోక్షము, సటీక, చక్రనికూర్పు	...	0	6
రుక్మిణీకల్యాణము, సటీక, చక్రనిప్రతి	...	0	6
నలోపాఖ్యానము, సటీక, చిన్నసైజు	...	0	6
నలచరిత్ర, ద్విపద, క్రొత్తకూర్పు	...	0	14
చాటుపద్యమణిమంజరి, క్రొత్తకూర్పు	...	1	8

వచనము.

ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశతఘంటము. వేంకటరంగశాస్త్రికృతము	...	7	0

		ప్రతి 1-కి రూ.	అ.
సంగ్రహరామాయణము, శ్రీ శేషాద్రిశర్మకృతము	...	0	8
సంస్కృతనాటకకథలు, శ్రీ సీతారామశాస్త్రికృతము	..	0	12
దశకుమారచరిత్రము, శ్రీ ఎనమచింతల. సంజీవరాయశాస్త్రికృతము		1	0
శివాజీచరిత్ర	...	0	4
శ్రీ రామానుజాచార్యచరిత్ర	...	0	2
శ్రీ శంకరాచార్యచరిత్ర, ప్రతిమతో	...	0	2
రామకృష్ణపరమహంసచరిత్ర ,,	...	0	2
శ్రీ వేమనయోగిజీవితము ,,	...	0	2
బాలగంగాధరతిలకుగారిచరిత్ర ,,	...	0	2
దాదాభాయినౌరోజీచరిత్ర ,,	...	0	1
శ్రీ కరంచంద్ గంధిజీవితము ,,	...	0	2
శ్రీ గైక్వారుగారిజీవితము ,,	...	0	2
శ్రీ లాలాలాజ్ పతిరాయిజీతము ,,	...	0	2
శ్రీ గోపాలకృష్ణ గోఖ్లేజీవితము ,,	...	9	2
అనిబిసెంటుచరిత్ర ,,	...	0	1
శ్రీ రానడేజీవితము ,,	...	0	2
వివేకానందస్వామిజీవితము ,,	...	0	1
శ్రీ కృష్ణదేవరాయచరిత్ర ,,	...	0	2
స్వామిరామతీర్థజీవితము	...	0	1
శాలివాహనచరిత్ర	...	0	2
శ్రీ బుద్ధచరిత్రము	...	0	4
సోదరినివేదితజీవితము	...	0	1
సూరతుకాంగ్రెస్సు ఉపన్యాసములు	...	0	2
శ్రీ గైక్వారుగారి ఉపన్యాసములు	...	0	2
శ్రీ మహాభక్తవిజయము	...	4	0
దక్షిణాపూర్వకథలు, శ్రీ సీతారామశాస్త్రికృతము	...	1	4
భోజకాళిదాసకథలు, 1-వభాగము	...	0	12
డిటో 2-వభాగము	(అచ్చగుచున్నది).		
మైరావణచరిత్ర, చక్కనికూర్పు	...	0	1

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి. ఈ.

		ప్రతి 1-కి రూ.	అ
రేమక్క-పగటిమక్క కథలు	...	0	2
విక్రమార్కునికథలు	...	0	6
బేతాళునికథలు	...	0	6
భారతరమణీమణులు	...	0	12
మర్యాదరామన్నకథయి	...	0	2
పరమానందశిష్యులకథలు	...	0	3
తెనాలిరామలింగనికథలు, జీవితము	...	0	4
తాతాచార్యులకథలు	..	0	6
నలుగురుమంత్రులకథలు	.	0	4
అయిదుగురుదొంగలకథ	.	0	4
మదనకామరాజుకథలు, చక్కనికూర్పు	(అచ్చగుచున్నది.)		
సత్యసేనవిజయము, శ్రీ కే అనంతాచార్యకృతము	...	0	4
షేక్స్పియర్ నాటకకథలు, సులభశైలి	...	1	8
ఈసపునీతికథలు, క్రొత్తకూర్పు 1-వ భాగము	...	0	6
డిటో రెండవభాగము	...	0	8
అరేబియన్ నైట్సుకథలు, చక్కనికూర్పు	...	1	4
ప్రహ్యకథలు	...	0	12
శ్రీగురుజాడ. శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవిజీవితములు	...	2	8
తారాభాయి, చక్కనినవల, క్రొత్తకూర్పు	...	0	12
ఆనందమఠ, నవల, నూతనముద్రితము	...	0	12
కపాలకుండల, నవల ,,	...	0	14
ఉన్మాదిని, నవల	...	0	4
రాధారాణి ,,	...	0	4
లీల ,,	...	0	4
రోషినార ,,	...	0	10
లాలాభాయి,,	...	0	10
నీతిచంద్రిక, చిన్నయసూరిగారిది	...	0	6
పంచతంత్రము, వచనము, సులభశైలి	...	0	6
క్షేత్రయ్య పదములు, చక్కనికూర్పు	...	0	14

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
192, ఎస్ప్లనేడ్, చెన్నపురి. తూ.